ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

★ గురువారం పారాయణ ప్రారంభం ★

శ్రీ సాయి లీలామృతము



అధ్యాయము - 1

శ్రీ సాయిబాబా జీవితం

I

"మీరెవరు??" అని అడిగితే, "వటవృక్షము, మూలము, మూలానికి మూలం, మాది దత్తనగరము" అని చెప్పారు శ్రీ అక్కల్కోట స్వామి. ఆయనే యింకొక సారి "అఖండ విశ్వమే మేము" అన్నారు. శ్రీ సాయిబాబా యొక్క మరొక రూపమే శ్రీ అక్కల్కోట స్వామి. వీరిద్దరి చరిత్రలూ దత్తావతారమనే బంగారు నాణానికి బొమ్మ-బొరుసు అనవచ్చు. వీరు ప్రపంచ చరిత్రలో అవతరించిన మహాత్ములందరిలో అగ్రగణ్యులు. ఈ విషయం శ్రీ మెహర్‌బాబా కూడా, శ్రీ సాయి యీ విశ్వమంతటికీ గురువు అనదగినవారని స్పష్టంగా చెప్పారు. ఆయన నివాసం వలన శిరిడీ వంటి మారుమూల కుగ్రామం కాశీ, తిరుపతి వంటి మహాక్షేత్రమైంది. అయితే ఈ క్షేత్రాలు ఒక మతంవారికి మాత్రమే పవిత్రమైతే, శిరిడీని మహాక్షేత్రంగా తలచేవారు ఎందరో అన్ని మతాలలోనూ వున్నారు. అక్కడ అనుభవమయ్యే శాంతి అనుభవించవలసిందేగాని మాటలలో చెప్పలేనిది. మనకు యింటివద్ద ఏమి చేసినా శాంతించని మనస్సు శిరిడీలో కాలు పెట్టగానే ప్రాపంచిక వ్యవహారాలనన్నింటినీ మరచి మహా శాంతిని పొందుతుంది. ఎక్కడ అలా శాంతి లభిస్తుందో అదే మన పరమ గమ్యమన్నది ఋషి వాక్యం.

శ్రీసాయిబాబా శిరిడీలో సుమారు 60 సం॥లు నివసించినప్పటికీ, ఆయన కీర్తి మధ్యాహ్న సూర్యుని శోభలాగా అన్నిదిక్కులా ఆ కాలంలోనే వ్యాపించినప్పటికీ, అసలు ఆయన పేరేమో, ఊరేమో, తల్లిదండ్రులెవరో కులగోత్రాలేమిటో ఎవరికీ తెలియలేదు. ఆయన దర్శనానికి నిత్యము ఎందరెందరో అన్ని ప్రాంతాలనుండీ వస్తుండేవారు. కాని వారిలో ఏ ఒక్కరూ ఆయనను గురించి ఏమీ చెప్పలేకపోయారు. ఆయనతో సన్నిహితంగా చాలాకాలం వున్నవారు గూడ ఆయన నుండి యీ వివరాలు తెలుసుకోలేకపోయారు. దైవం వలెనే నిజానికి ఆయన నామ రహితుడు. ఇలానే దైవం యొక్క గుణాలన్నీ బాబాలో సంపూర్ణంగా కనిపిస్తాయి. శిరిడీలో వెలసిన ఆ దేహమే తామన్న భ్రాంతి ఆయనకెన్నడూ లేదు. సర్వగతమైన చైతన్యమే ఆయన నిజతత్త్వమని భక్తులందరూ అనుభవ పూర్వకంగా గుర్తిస్తూ వచ్చారు. ఆ దేహానికి కారణమైనవారే తమ తల్లిదండ్రులు అని, వారు ఆ దేహానికి పెట్టిన పేరే ఆయన పేరనీ ఆయన ఎలా తలుస్తారు?

ఈనాడు పెద్ద పెద్ద భవనాలతో, ఎన్నెన్నో దుకాణాలతో వజ్రాల ద్వీపంలా వెల్గొందుతున్న శిరిడీలో, రాజభవనం వంటి సమాధి మందిరంలో, సింహాసనంపై కూర్చున్న సామ్రాట్టులా శ్రీ సాయినాథుని మూర్తి శోభిస్తూ వుంటుంది. దేశం నలుమూలల నుండీ వారి దర్బారుకు చేరిన భక్తులెందరో తెచ్చిన లెక్కలేనన్ని మాలలతోను, క్రొత్త వస్త్రాలతోనూ ప్రతి క్షణమూ సరిక్రొత్త అలంకరణలతో ఆయన వెలిగిపోతుంటారు. దీనికీ, నేటి శిరిడీ క్షేత్రానికీ ఎంతో చక్కని పోలిక వున్నది. కాని సుమారు నూటముప్పై సం॥ క్రిందట ఆ జిల్లాలోనే ఎక్కువ మందికి తెలియని చిన్న గ్రామాలలో ఒకటి ఆనాటి శిరిడీ. అక్కడ 80 గడపలకు మించి ఉండేవి కావు. దాదాపు యిళ్ళన్నీ మట్టికట్టడాలే. ఒకటి రెండు గుడిసెలలో నిత్యావసర వస్తువులు అమ్మేవారు. గ్రామానికి అన్నివైపులా తుమ్మ పొదలు, చిట్టడవి, పొలాలూ

వుండేవి. అరుదుగా ఎప్పుడైనా ఆ ఊరిలోకి గుఱ్ఱపు బండివస్తే ఆ గ్రామంలోని పిల్లలు, పెద్దలు చోద్యంగా చూచేవారు. నిజానికి ఆ సమీపంలోని రహతా గ్రామానికి మాలపల్లె శిరిడీ. ఆ గ్రామంలో జరిగే గొప్పవేడుక వారానికి ఒకసారి జరిగే సంత మాత్రమే. ఎప్పుడైనా కాలి నడకన దేశ సంచారము చేసే యాత్రికులు, సాధువులు, ఫకీర్లు ఆ గ్రామంలోని మారుతి ఆలయములోనే, లేక "తాకియా"లోనో బస చేసేవారు. ఆనాటి శిరిడీలో - ఈనాటి మన జీవితాలలో లాగానే సరియైన వీధిగాని, వీధి దీపాలుగాని వుండేవిగావు. గ్రామంలో తలుపులు గూడ లేని మారుతి, శని, గణపతి, మహాదేవుల ఆలయాలు వుండేవి. ఒకసారి ఒక పిచ్చివాడు ఆ మందిరాలలో జొరబడి ఆ విగ్రహాలను విరగగొట్టాడు గూడ. వాటికి ఎలాంటి రక్షణ వుండేది గాదు. గ్రామం మధ్యలో ఒక విఠలుడి ఆలయము, గ్రామ ప్రవేశంలో గ్రామదేవత ఖండోబా ఆలయమూ వున్నాయి.

శ్రీ సాయి, 1854 ప్రాంతంలో ఒకరోజు ఆ గ్రామానికి ఉత్తరాన వున్న ఒక వేపచెట్టు క్రింద కూర్చొని కనిపించారు. నాడు ఆయనను చూచిన వృద్ధురాలు (నానా చోప్దార్ తల్లి) యిలా చెప్పింది : "ఈ బాలుడు మొదట వేపచెట్టు క్రింద ఆసనం వేసుకొని కూర్చొని కనిపించాడు. అతడి రూపము మనోహరముగా వుండేది. ఎప్పుడూ ఎవరింటికీ వెళ్ళకుండా ఆ చెట్టు నీడనే వుండేవాడు. పగలెవ్వరితోనూ కలిసేవాడు గాదు. రాత్రి సమయాలలో గూడా అతడు భయమెరుగడు. చూడడానికి చిన్నవాడే అయినా అతడి చర్యలు అతడు మహా జ్ఞానియని సూచించేవి. అంత చిన్న వయస్సులో చలికి, వేడికి చలించక తపస్సు చేసే అతడిని చూచి అందరూ ఆశ్చర్యపోయారు. అతడు వైరాగ్యమూర్తి. అతని స్థితి ఎవరికీ అంతుపట్టనిది. ఈ కుర్రవాడు అకస్మాత్తుగా ఎక్కడినుండి వచ్చాడా? అని అందరూ అనుకునేవారు. ఒకసారి గ్రామదేవత ఖండోబా ఒకరికి పూనితే గ్రామస్థులందరూ అతనిని, "ఇతనిని కన్న పుణ్యాత్ములెవ్వరు? ఇతడు యెక్కడి నుండి వచ్చాడు?" అని అడిగారు. ఆ గణం వారిచేత ఒక గడ్డపార తెప్పించి, ఆ చెట్టుక్రింద ఒకచోట త్రవ్వించాడు. అక్కడ ఒక బండ, దాని క్రింద కొన్ని ఇటుకలూ కన్పించాయి. ఆ బండను తొలగిస్తే, దాని అడుగున భూగర్భములోనికి దారి కన్పించింది. అందులో తిని వదిలేసిన పదార్థాలు, పూజాద్రవ్యాలు, వెలుగుతున్న నాలుగు ప్రమిదలూ వున్నాయి. అప్పుడు ఆ గణం, 'ఈ బాలుడిక్కడ 12 సం॥లు తపస్సు చేశాడు అని చెప్పాడు. అప్పటి నుండి ప్రజలు అనేక ప్రశ్నలతో ఆ బాలుణ్ణి విసిగించసాగారు. అతడు, అది గురుస్థానమని, ఆ బండను తిరిగి మూసివేయాలనీ చెప్పి అలానే చేయించాడు. తర్వాత గూడ ఒకసారి ఆ వేపచెట్టు దగ్గరున్న భవనానికి మరమ్మత్తులు చేస్తుంటే, దాని క్రింద ఆ భూగృహము, సమాధి కన్పించాయి. వాటిని గురించి అడిగిన భక్తులతో గూడ బాబా అలానే చెప్పారు. తర్వాత అక్కడ ఒకరోజున పిల్లలు ఆడుకొంటూ ఆ బండను తొలగించి చూచారు. అక్కడ భూమిలోకి మెట్లు, చాలా పొడవుగాను, చీకటిగానూ వున్న గుహ కన్పించాయట. ఈ వివరాలు శ్రీ సాయి శరణానంద యిలా వ్రాసారు: "ఒకప్పుడు బాబా మసీదులో ధుని దగ్గర వున్న స్తంభాన్ని నాకు చూపి, దాని క్రిందనే ఒక గుహ వున్నదని, తామందులో నివసించామనీ ఎవరైనా మహాత్ములు వచ్చినప్పుడు తప్ప తామెప్పుడూ బయటకు వచ్చేవారు గారనీ తమ గడ్డం పొడుగ్గా పెరిగి నేలను తాకేదనీ నాతో స్వయంగా చెప్పారు". బాబా మరొకప్పుడు సగుణమేరునాయక్‌తో, "ఏమిటి, ఒకటి రెండు రోజుల ఉపవాసానికి గూడ తట్టుకోలేవా? నేను 12 సం॥లు కేవలం వేపాకు తిని జీవించాను" అన్న మాటలు యీ వృత్తాంతాన్నే బలపరుస్తాయి. ఫిబ్రవరి 14, 1912న సాయి తాము చేసిన గురుసేవ గురించే కాబోలు, యిలా చెప్పారు: "తామెన్నో కష్టాల కోర్చామని, నెలల తరబడి ఆహారం లేకుండా వున్నామని, వేప మొ॥న ఆకులు మాత్రమే తిన్నామనీ చెప్పారు. భగవంతుని కృప వలన ఆయన శరీరం శుష్కించి, ఎముకలు గూడ నిలువజాలని స్థితిలో వున్నప్పటికీ తమకు ప్రాణం పోలేదన్నారు" (ఖాపర్డేడైరీ)

II

ఈ బాలునికి 16 సం॥ల లోపలే అంత గడ్డమెలా పెరిగింది? అసలు ఆయన వయస్సెంత? - ఒకప్పుడు ధూలియా కోర్టులో ఒక దొంగ, తనవద్ద పట్టుబడిన వస్తువులను తను దొంగిలించలేదని, తనకు సాయిబాబా యిచ్చారనీ చెప్పాడు. అంతట కోర్టువారు సాయిబాబాను కోర్టుకు హాజరుగమ్మని సమన్లు జారీచేసారు. బాబా ఎందరికో పూజ్యులవడం వలన, భక్తులు పెట్టుకున్న అర్జీననుసరించి ఆయన వద్దకే కోర్టు ప్రతినిధి వచ్చి విచారణ జరిపాడు. దానిలోని ముఖ్యాంశాలివి :

న్యాయవాది : మీ పేరేమి ?

బాబా : వీరంతా నన్ను సాయిబాబా అంటారు.

"మీ తండ్రి పేరు?" -- "అదీ సాయిబాబాయే"

"మీ గురువు పేరు?" -- "వెంకూసా"

"మతం?" -- "కబీరు"

"కులం?" -- "దైవం"

"మీ వయస్సు?" ....."లక్షల సంవత్సరాలు"

"సరిగ్గా చెప్పండి!" -- "నేనెన్నడూ అబద్ధం చెప్పను."

అంటే సాయి నామ, రూప, కుల, మత, వయో భేదాలకు అతీతులు, సర్వవ్యాపియైన ఆత్మయేనని స్పష్టమవుతుంది. ఆయన వయస్సు అపారమని తెల్పే ఆధారాలెన్నో వున్నాయి. అక్కల్కోటలో దత్తావతారంగా ప్రసిద్ధికెక్కిన శ్రీ స్వామి సమర్థ నిర్యాణం చెందబోతూ, కన్నీరు కారుస్తున్న భక్తునితో, "శిరిడీలో నా అవతారమూర్తి నీకు లభిస్తారు. ఆయనను సేవించు. నీకే కొరతా వుండదు" అని చెప్పారు. సాయిబాబా గూడ ఎందరో భక్తులకు అందుకు తగిన అనుభవమిచ్చారని మీరు చదువబోతారు. అంటే అక్కల్కోట స్వామియే సాయి అన్నమాట. ఈ యిద్దరూ సమకాలికులవడం ఒక అంతు బట్టని దైవలీల. అంటే ఆ స్వామి వయస్సు, పుట్టుపూర్వోత్తరాలే సాయి యొక్క వృత్తాంతమన్నమాట. ఆ స్వామి వయస్సు వందలయేండ్లు. ఆయన రెండవ దత్తావతారమైన శ్రీ నరసింహ సరస్వతియే. అంటే వారికి పూర్వావతారమైన శ్రీపాద శ్రీవల్లభులే; అంటే స్వయంగా సనాతనుడైన దత్త స్వామియే అన్నమాట. ఆయనెందరికో అటువంటి దివ్యదర్శనాలు యిచ్చారు.

అంతేగాదు, ప్రొఫెసరు బాలకృష్ణ ఉపాసనీశాస్త్రి ఒకప్పుడు ఋషీకేశ్ తపోవనము వెళ్ళినప్పుడు, అక్కడ అపారమైన వయస్సు గల ఒక సాధువును దర్శించాడు. తర్వాత చాలా కాలానికి అతడు సాయిని దర్శించినప్పుడు, ఆ తపోవన సాధువు తామేనని ఆయన నిరూపించారు. అంటే సాయి వయస్సుగూడ అపారమే గదా!

అలానే రాజ్యం కోల్పోయి తిరుగుతున్న హుమాయూన్‌కు తమ ఆశీస్సుల వల్లనే అక్బర్ చక్రవర్తి పుట్టాడని, ఆ ముందటి జన్మలో తపస్సు చేసిన ముకుంద బ్రహ్మచారే అలా జన్మించాడనీ సాయి ఒక భక్తునితో చెప్పారు.

తాము గతంలో కబీరునన్నారు. రామాయణ, భాగవతకాలంలో గూడ తామున్నామని ఆయన చెప్పారు. ఈయన జన్మించిన మాట నిజమే అయితే నాటికే ఆయన పూర్ణుడైన జ్ఞానియని ఆయనయే ఒకసారి యిలా సూచించారు. "నేను పుట్టినప్పుడు తనకు కొడుకు పుట్టాడని మా అమ్మ ఎంతగానో పొంగి పోవడం చూచి నేను ఆశ్చర్యపోయాను. ఆమె నన్ను కన్నదెప్పుడు? అసలు నాకు జననమున్నదా? నేను అంతకు ముందు లేనా? ఇంత మాత్రానికే ఈమె పొంగిపోతున్నదేమిటి? అనుకొన్నాను."

III

ఈ వింత బాలుడు కొంత కాలానికి అకస్మాత్తుగా ఎక్కడికో వెళ్ళిపోయి, సుమారొక సం॥ తర్వాత శిరిడీ చేరి, అక్కడే వుండిపోయారు. ఈమధ్య కాలంలో ఆయన యెక్కడకు వెళ్ళారో, యేమి చేసారో ఎవరికీ తెలియదు. ఆ కాలంలో తాము విస్తారంగా దేశ సంచారం చేసామని కొంత కాలం 'అలీ' అను ముస్లిం మహాత్ముని దగ్గర, తర్వాత రహటాలోని చావడిలోనూ వున్నామనీ కుశాల్ భావూ అనే భక్తునితో సాయియే చెబితే, అతడు చంద్రభాన్ శేఠ్‌కు చెప్పాడు. ఆ కాలంలో దౌలూశేఠ్ ఆయనను చూచాడటగూడ. ఈ అలీగారి చిత్రపటం 1918 తర్వాత గూడ అహ్మద్ నగర్‌లోని రహటేకర్ వాడాలో వుండేది. తర్వాత తాము అహ్మద్‌నగర్ నుండి రహటా వచ్చి, కొంతకాలానికి శిరిడీ చేరామని శ్రీ సాయి, కుశాల్‌భావుకు చెప్పారు. మరొకప్పుడు శ్రీమతి కాశీబాయి కణీత్కర్ అనే భక్తురాలితో, శ్రీ సఖారాం మహరాజ్ (అంగోన్ కవాడ్) అనే గొప్ప సాధువుతో కలసి కొంత కాలమున్నామని, ఆయన తమ గురుబంధువని, అక్కడ ఆయనతో కలసి ఒక మామిడి మొక్క నాటామనీ బాబా చెప్పారు. జోగ్ అనే భక్తుడు యీ యిద్దరినీ దర్శిస్తుండేవాడు. ఒకసారి జోగ్ అంగోన్‌కవాడ్‌లోని ఆ మామిడి చెట్టుకాయ కోసి, శిరిడీకి తీసుకువెళ్ళాడు. కాని అది పచ్చిదని, దారిలో రెండు మామిడి పండ్లు కొని అతడు బాబాకు సమర్పించాడు. బాబా ఆ పండ్లను స్వీకరించక, ఆ మొదటి కాయనే కోరి తీసుకున్నారు. దానిని చూడగానే ఆనంద భాష్పాలతో ఆయన కళ్ళు నిండాయి. దానిని అటూ యిటూ త్రిప్పి చూచి, "ఇది యింకా పండలేదు" అన్నారు. ఔనన్నాడు జోగ్. సాయి మరి కొద్దిసేపు దానిని తదేకంగా చూచి, దానిని కోయించి భక్తులందరికీ పెట్టించారు -- అదెంతో మధురంగా వుండడం చూచి అందరూ ఆశ్చర్యపోయారు.

IV

రెండవసారి శిరిడీ చేరేనాటికే వారు పరిపూర్ణులని తెలిపే సంఘటన ఒకటి సాయికి ప్రత్యక్ష భక్తుడైన దామోదర్ రాస్నేగారి కుమారుడు నానా సాహెబ్ రాస్నే నాకు చెప్పారు. ఈయన శ్రీ గాడ్గీ మహరాజ్ అనే మహాత్మునికి తన యింట ఆతిథ్యమిచ్చి, వారి గురుసేవ గురించి అడిగితే ఆయనిలా చెప్పారట : "మేము సామాన్యంగా ఆ వృత్తాంతము ఎవ్వరికీ చెప్పము. మా తల్లిదండ్రులు చాకలి వారు. శేవ్‌గావ్ పతర్డీ అనే ఊళ్ళో ఒక బట్టల దుకాణంలో పనిచేసేవాణ్ణి. ఒకరోజు దివ్య వర్చస్సు గల ఫకీరొకరు ఆ గ్రామానికి వచ్చారు. ఆయన 'సేలూ మాన్వత్' నుండి వచ్చారట. ఆయన ముస్లిమన్న భావంతో ఎవరూ భిక్ష వేయలేదు. మా దుకాణంలోగూడ యజమాని లేడు పొమ్మన్నారు. నాకు ఆయనను చూస్తూనే భిక్ష వేయాలనిపించి, పరుగున పోయి రొట్టెలు, కూర తెచ్చేసరికి ఆయన వెళ్ళిపోయారు. నేను ఆయనను వెతుకుతూ పోయేసరికి ఆయన ఒక ఏకాంత స్థలములో కూర్చొని చేనులోని జొన్న కంకులు కోసుకుని తింటున్నారు. నన్ను చూచి కోపంతో, "నీవిక్కడికి ఎందుకొచ్చావ్?" అని గర్జించారు.

'మీకెవరూ భిక్ష వేయలేదని గమనించి యింటి నుంచి భిక్ష తెచ్చాను" అన్నాను.

"ఓహో! నేనేమి కోరితే అదిస్తావా ఏం?" అని ఎత్తిపొడుపుగా అన్నారు.

నా దగ్గర లేని డబ్బు తప్ప మీరేమి కోరినా యిస్తాను" అన్నాను. అయితే నీ ప్రాణమివ్వు అన్నారు పంతంగా.

'అది నేనివ్వగలిగింది కాదు. మీరే తీసుకోండి. నాకీ జీవితమంటే విరక్తి పుట్టింది' అన్నాను.

ఆ ఫకీరు నవ్వి, నా తలపై చేయి పెట్టి ఆశీర్వదించారు. వెంటనే నా హృదయంలో చెప్పలేని మార్పు వచ్చింది. వారి సన్నిధి తప్ప మరేమీ కావాలన్పించ లేదు. వారికి భిక్ష యిచ్చాక యింటికి వెళ్ళి, నాకొక గొప్ప గురువు దొరికారని, నేనిక సంసారంలో జీవించలేననీ చెప్పి, వేగంగా ఫకీరు వద్దకు చేరుకున్నాను. ఆయన నన్ను చూస్తూనే ఉగ్రులై, "దుష్టుడా! నీకిచ్చింది చాలక యింకా పీడించుకు తినాలని వచ్చావే!" అని గద్దించి, ఆ ప్రక్కనున్న శ్మశానంలోకి వెళ్ళారు. నేను "మిమ్మల్ని విడిచి బ్రతుకలేను" అంటూ వారిననుసరించాను. అక్కడొక సమాధి ప్రక్కన గుంట త్రవ్వి, అందులో రెండు కుండలు నీరు పోయమన్నారు. నేను అలానే చేసాను. ఆయన ఆ నీరు మూడు దోసిళ్ళు త్రాగి, నన్నూ త్రాగమన్నారు. అవి త్రాగగానే నాకు చాలాసేపు బాహ్యస్మృతి లేకుండా పోయింది. నాకు స్పృహ వచ్చేసరికి ఆయన ఎటో వెళ్ళిపోయారు. నేను ఆయనకోసం చాలాకాలం వెదకి చివరకు శిరిడీలోని మశీదుకు చేరాను. లోపల తెరలు దించి వున్నాయి. అచ్చట ఫకీరు స్నానం చేస్తున్నారు. నేను తెర పైకెత్తి చూచాను. నన్ననుగ్రహించిన ఫకీరే ఆయన ! నన్ను చూస్తూనే పట్టరాని కోపంతో ఆయన, 'లంజకొడకా! ఇప్పటికే నా రక్తమాంసాలు పీక్కుతిన్నావ్. ఎముకలు గూడా తినాలని వచ్చావట్రా?' అని ఒక యిటుక విసిరారు. అది నా నొసట తగిలి నెత్తురు కారింది. మరుక్షణమే ప్రేమగా ఆయన, 'నిన్ను పూర్ణంగా అనుగ్రహించాను. భగవంతుని అనుగ్రహం నీకెప్పుడూ వుంటుంది, నిన్నందరూ దైవంగా కొలుస్తారు. ఇక నావెంట తిరుగవద్దు' అన్నారు.

కొంతకాలానికి ఆయనే 'శ్రీ గాడ్గే మహరాజ్'గా లోకపూజ్యులై ఎన్నో ధర్మశాలలు, పాఠశాలలు స్థాపించారు, వీరు సంకీర్తన చేస్తుంటే వేలాది భక్తులు చేరేవారు. ఆయన 1927 ప్రాంతంలో తమ భక్తులతో కలిసి సంకీర్తన చేస్తూ శిరిడీ చేరారు. మధ్యలో ఆయన, "నేను మా వూరు వెళ్ళిపోతున్నాను" అని కేకలు వేస్తున్నారు. భక్తులతో కలసి ఆయన గూడ శిరిడీ వీధులు చిమ్మి తర్వాత సమాధి మందిరానికి ఉత్తరాన సంకీర్తన చేసారు. చివరకు భక్తులతో, "ఇదే మన ఆఖరి కలయిక" అని చెప్పి వెంటనే లేచి, కాలి నడకన నర్మదా తీరంలోని బధోచ్ చేరి అక్కడే మహాసమాధి చెందారు. అంటే సాయి మరలా శిరిడీ చేరేనాటికే సమర్థుడైన సద్గురువన్నమాట!

తర్వాత సాయి ఆ ప్రాంతంలోని యవలా, పుంతంబా వంటి గ్రామాలలో పర్యటించారు. ఆయన పుంతంబాలో శ్రీ గంగఘిర్ బాబా అనే సాధువును కలిసారు. "మీరు మహనీయులు. నా వద్దకు రావడమేమిటి! నేను కేవలం మేకలు కాచేవాణ్ణి. మీరో సింహాలను, ఏనుగులను శాసించగలరు!" అన్నారు గంగఘిర్. సాయి నవ్వి, వెళ్ళిపోయారని పుంతంబాకు చెందిన ఒక వృద్ధుడు చెప్పాడు.

V

శ్రీ సాయి చరిత్రలోని మొదటి ఘట్టం వేపచెట్టు క్రింద ప్రారంభమై అక్కడే ముగిసింది. తర్వాత ఆయన పర్యటనల గురించి నేపథ్యంగా మాత్రమే తెలిసింది. ఈ దివ్య నాటకంలో యిది నాందీ ప్రస్తావన. అసలు నాటకం మరల వేరొకచోట ప్రారంభమౌతుంది.

ఔరంగాబాద్ జిల్లాలోని పైఠాన్ (ప్రాచీన 'ప్రతిష్ఠానపురం') ప్రాంతమంతా జ్ఞానేశ్వర మహరాజ్, జనార్ధనస్వామి, ఏకనాథుడు, సమర్థ రామదాస స్వామి వంటి మహనీయుల సంచారం వలన యెంతో పవిత్రమైంది. గోదావరి ఉపనదియైన 'ఏలగంగ' అచ్చటి 'ధూప్‌ఖేడా' అనే గ్రామానికి ప్రదక్షిణం చేసి ముందుకు సాగుతుంది. దానికి అవతల ఒడ్డున ఒక మైదానము, మహా వృక్షాలతో నిండిన ఒక తోపు వుండేవి. ఆ గ్రామానికి చెందిన

శ్రీమంతుడైన ముస్లిం చాంద్‌పాటిల్ ఔరంగాబాద్ వెడుతుండగా ఒకసారి అతడి గుఱ్ఱం తప్పించుకొని పోయి, రెండు నెలలు ఎంత వెదికినా కన్పించలేదు. చివరికతడు దాని జీను మాత్రం భుజాన వేసుకొని యింటికి వస్తూ సింధోని -- భింధోస్ అనే జంట గ్రామాలవద్ద ఏలగంగ ఒడ్డుకు చేరాడు. అక్కడొక మామిడి చెట్టుక్రింద వెఱ్ఱివానివలె వున్న ఒక ఫకీరు కన్పించాడు. అతని చంకలో సట్కా (దండము), వంటికి బారు జుబ్బా(కఫ్నీ), తలపై టోపీ వున్నాయి. అతడు చిలిమ్ సిద్ధం చేస్తూ చాంద్‌పాటిల్‌ను చూచి తన చెంతకు పిలిచి నవ్వుతూ, "ఈ జీను నీవు మోస్తున్నావేం" అన్నాడు. పాటిల్ తన గుఱ్ఱం సంగతి చెప్పగానే ఫకీరు, "అది ఏటి ఒడ్డున వున్నది" చూడమన్నాడు. అతడు పోయి చూస్తే అతని గుఱ్ఱం అక్కడే మేస్తున్నది. అంతటితో ఆ ఫకీరు సామాన్యుడు కాడనుకొని గుఱ్ఱాన్ని తీసుకొని ఆయన వద్దకు వచ్చాడు.

అంతలో ఫకీరు పొగాకు నలిపి, చిలిం గొట్టం సిద్ధం చేశాడు. అప్పుడు తనవద్ద నున్న "చిమ్టా" (పొడుగాటి పట్టకార వంటిది)తో నేలపై గుచ్చాడు. అక్కడనుండి బుడబుడమని నీరూరింది. ఆ ఫకీరు ఒక గుడ్డ తడిపి, పిండి ఆ మట్టిగొట్టం చివర చుట్టాడు. తిరిగి సటకాతో అతడు నేలపై కొట్టగానే ఒక నిప్పు కణిక బయటకొచ్చింది. దానితో చిలిమ్ వెలిగించి పాటిల్‌కు గూడ అందించాడు. పాటిల్ ఆయన శక్తి సామర్థ్యాలకు నివ్వెరబోయి, ఆయనను తన యింటికి ఆహ్వానించాడు. "రేపు వస్తాను. నీవు వెళ్ళు" అని చెప్పి మరురోజు ఆ ఫకీరు అతనింటికి వెళ్ళి, అక్కడ భిక్ష చేశాడు. ఆయన కొంతకాలం ఏలగంగ ప్రక్కనున్న తోపులలో మకాము చేశాడు. ఇందుకు గుర్తుగా యిప్పుడక్కడ ఒక సాయి మందిరమున్నది. ఆయన ఆ ప్రాంతంలో తిరుగుతూ అప్పుడప్పుడు పాటిల్‌ను పలకరిస్తుండేవాడు. తరచుగా అతనికి స్వప్నాలలో దర్శనమిచ్చి ముఖ్యమైన ఆదేశాలు యిస్తుండేవారని ఆ వంశస్థులు చెబుతారు. కొంతకాలానికి ఆయన పాటిల్ ప్రార్థన మన్నించి, అతని మేనల్లుని వివాహానికి పెళ్ళివారితో కలసి ఎద్దుబండిలో శిరిడీ చేరారు.

బండ్లన్నీ శిరిడీ పొలిమేరలలోని ఖండోబా ఆలయంవద్ద మఱ్ఱి చెట్టు క్రింద పొలాలలో ఆగాయి. అందరితో బాటు ఫకీరుగూడ బండి దిగుతుంటే చూచి, ఖండోబా ఆలయ పూజారి మహల్సాపతి ఆదరంగా, 'యా సాయి!' ('రండి స్వామీ!') అని ఆహ్వానించాడు. అలనాడు ఎవరికీ చెప్పకుండా శిరిడీనుండి వెళ్ళిపోయిన ఆ వింత యువకుడే యీ ఫకీరని గుర్తించి అతడానందించాడు. నాటినుండి ఆ ఫకీరుకు ఆ పేరే స్థిరపడింది. సాయిగూడ శిరిడీలో స్థిరపడ్డారు. ఆయన ఆ కళ్యాణానికి శిరిడీ వచ్చినది లోక కళ్యాణానికే !

సాయిబాబాకు మొదట పరిచయమైన మహల్సాపతి ఆయన మహాత్ముడని గుర్తించి తన మిత్రులైన అప్పాజోగ్లే, కాశీనాధులకు చెప్పాడు. నిత్యమూ ఆ ముగ్గురూ ఆయనను దర్శించుకునేవారు. పేదవాడైన మహల్సాపతి బాబాకు పరిచర్యలు చేస్తే, అతని మిత్రులు బాబాకు నిత్యావసర వస్తువులు సమకూర్చేవారు. ఒకనాడు అప్పాకోతే పాటిల్ అనువాడు తన భార్యతోగూడ ఆయనవద్దకు వచ్చాడు. వారిని చూస్తూనే సాయి లేచి నిలబడి వారిని ఆదరించారు. అతని భార్య బయాజీబాయి తమ సోదరియని చెప్పారు. ఆమెకు గూడా మొదటి దర్శనంలోనే బాబాపై భక్తి శ్రద్ధలు కల్గి, ఆయనకు భిక్ష పెట్టకుండా భోంచేయకూడదని నిశ్చయించుకుంది.

ఆ రోజులలో సాయిని చూచిన తాత్యాబాబాకోతే యిలా చెప్పాడు :"శ్రీ సాయి శిరిడీ గడ్డమీద అడుగు పెట్టేనాటికి నాకు 6 లేక 7 సం॥ లుంటాయి. ఆయనకొక నిర్ణీతమైన నివాసమే వుండేదిగాదు. తర్వాత ఆయన వేపచెట్టుక్రింద కొంతకాలం నివసించారు -- అప్పటికాయన వయస్సు సుమారు 18 లేక 19 సం॥లు వుండేవి. ఆయనకు సన్నని మీసముండేది. ఆయన మొదట శిరిడీ వచ్చినప్పుడు ఆకుపచ్చటి కఫ్నీ, ఆకుపచ్చ తలకట్టు ధరించేవారు" ఆ రోజుల్లోనే ఆయనను చూచిన రామ్‌గిర్‌బువా ఆయననిలా వర్ణించాడు : "ఆయనకు జుట్టు

నడుం వరకు పెరిగి వుండేది. ఆయన చేతిలో సటకా, చిలింగొట్టము, అగ్గిపెట్టె వుండేవి. నిత్యం గ్రామంలో భిక్ష చేసేవారు. ఆ రోజులలో ఆయన రోగులకు ఉచితంగా వైద్యము, అవసరమైతే స్వయంగా రోగికి పరిచర్యలుగూడ చేసేవారు. ఉదాహరణకు ఒక రోగికి సాయి మందిచ్చి, అతని కణతలమీద, వీపుమీద, సూదులతో కాల్చారు. అంతటితో అతనికి ఆ వ్యాధి తగ్గిపోయింది. అలానే గణపత్ హరికనాడేకు కుష్టు, జ్వరము వచ్చాయి. అతని చికిత్సకని బాబాను వారింటికి తీసుకొచ్చాడు అమీన్‌భాయి. బాబా అతనిని పరిశీలించి అతనితో ఒక పామును పట్టుకొమ్మని, కుష్టురోగిని పాము కరవదనీ చెప్పి, అతడు పట్టుకున్న పాము విషంతోనే మందుచేసి అతనికిచ్చారు. అతనికి దాంపత్యం నిషేధించారు. అతనికి వ్యాధి తగ్గనారంభించేసరికి అతడా నియమం ఉల్లంఘించడంతో రోగం తిరగ బెట్టింది. బాబా అతనికింక మందివ్వలేదు. కొద్దిరోజులలోనే అతడు మరణించాడు. అప్పటి నుండి ఆయన రోగులకు మందివ్వడం మానివేసి, ఊదీ మాత్రమే యివ్వసాగారు.

సాయి చరిత్రలోని యీ మొదటి దశ గురించి ఆయనతో ఎంతో సన్నిహితంగా వున్న తాత్యాకోతే పాటిల్ (బయాజాబాయి కుమారుడు) యింకా యిలా చెప్పాడు : "శ్రీ సాయి శిరిడీ గడ్డమీద అడుగు పెట్టేప్పటికి ఆయనకొక నిర్ణీతమైన నివాస స్థలమే వుండేది కాదు. కొద్ది నెలల తర్వాత ఆయన మసీదులో సుమారు 10 మాసాలు వున్నారు. తర్వాత వేపచెట్టు క్రింద, ఆ తర్వాత మరల మశీదుకు వచ్చి, సమాధి చెందేవరకు అక్కడే వుండిపోయారు -- నేను మారుతి ఆలయంలోని స్కూలులో చదువుకుంటుండగా బాబా భిక్షకు మా యింటికి వచ్చేవారు. నేను, మరి కొందరు పిల్లలూ మశీదు ముంగిట నిలిచి, బాబాను వెక్కిరించి కవ్వించేవారము. ఆయనకు సన్నని మీసం వుండేది. ఆయనెప్పుడూ మశీదులో ఒక స్తంభం ప్రక్కనే మౌనంగా కూర్చొని వుండేవారు. రఘుపాటిల్ రోజూ మశీదు గేటు వద్ద నిలచి ఆయనపై రాళ్ళు రువ్వేవాడు. ఒక్కొక్కప్పుడు బాబా మమ్మల్ని తిట్టేవారు. మేము పెద్దగా నవ్వి, ఆయన సట్కా తీసుకోగానే పరుగెత్తేవాళ్ళం -- మశీదులో 2, 3 సం॥లు నివసించాక ఆయన లిండీ మరియు సిర అను ఉపనదుల మధ్యనున్న చెట్లతోపులో సుమారు 2 సం॥ల 6 మాసాలు వున్నారు. అక్కడ భక్తులలో ఎవరో ఒకరు నిత్యమూ ఆయనకు భిక్ష యిచ్చేవారు. నేను, రఘుపాటిల్ మరిద్దరి ముగ్గురితో కలసి ఆయనను దర్శించేవాళ్ళము. వామనరావుడెంగలే గూడ వారి దర్శనానికి వస్తుండేవాడు" రెండవసారి సాయి శిరిడీ వచ్చేనాటికి ఒక వింత సాధువుగూడ అచ్చటికి చేరాడు. శంకర్ నారాయణ వైద్య అనువాడు నానావల్లీ అనే మహాత్ముని సమాధిని సేవిస్తుండేవాడు. ఒకనాడు ఆ మహనీయుడు స్వప్న దర్శనమిచ్చి, శిరిడీ వెళ్ళమని ఆదేశించగా అచ్చటికి చేరాడు. సాయి రాగానే, వారిని చూస్తూనే గొప్ప మహాత్ముడని గుర్తించి ఎంతో చనువుగా, "మామా! వచ్చావా?" అన్నాడు. "నోరెత్తవద్దు!" అని బాబా మందలించడం వలన అతడు ఆయనను గురించి పెదవి విప్పి ఎవరితోనూ చెప్పలేదు. సాయి తరచుగా రాత్రి సమయాల్లో ఫకీర్ల చావడి (తాకియా)కి వెళ్ళి మధురంగా పాడుతూ, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని తన్మయత్వంతో నాట్యం చేసేవారు. ఆయన ఒకప్పుడు అరబ్బీ, పార్శీ భాషలలో పాటలు పాడుతూ, మరొకప్పుడు కబీరు, తుకారామ్ వ్రాసిన పాటలు పాడేవారు. ఈ విషయాన్ని తాత్యా పాటిల్ యిలా చెప్పాడు : "ఒక్కొక్క ప్పుడు బాబా పారవశ్యంలో వుండేవారు. అప్పుడు చేతిలో తంబుర ధరించి, ఒళ్ళు మరచి నృత్యం చేసేవారు. ఎంతో క్రమబద్ధమైన కదలికలు, కర - నేత్ర, హస్తముల భంగిమలు ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసేవి. పిల్లనగ్రోవి వాయిస్తున్న భంగిమలో నిల్చినప్పుడు సాక్షాత్తూ బృందావన కృష్ణుని చూస్తున్నట్లే వుండేది. ప్రేక్షకులకు గూడా పారవశ్యం కలిగి ఏదో అలౌకికమైన దృశ్యం చూస్తున్నట్లనిపించేది" ఇలా 1890 వరకు చేశారు. తర్వాత గూడా ఆయనకు యీ కళలపట్ల ఆసక్తి వుండేది గాని, వాటిని భక్తి ప్రపత్తుల కోసం మాత్రమే వినియోగించకుంటే మనిషికి అధోగతి తప్పదనేవారు.

VI

బాబా పత్రి గ్రామంలో జన్మించి, బాల్యంలో ఒక ఫకీరుకు అప్పగించబడ్డారని, కొంతకాలానికి సేలూ గ్రామంలోని వెంకూసా అనే హిందూ గురువుకు అప్పగించబడ్డారని, వారి సేవలో సర్వశక్తులూ పొంది శిరిడీ చేరారన్న కథకు ఆధారమెక్కడా కన్పించదు. బాబా ఒకప్పుడు సేలూ నుండి వచ్చామని, తమ గురువు పేరు వెంకూసా అని కొన్నిసార్లు చెప్పిన దానిని బట్టి తాను యీ కథ అల్లానని, అంతకు మించి వేరు ఆధారాలేవీ లేవనీ మొదట యీ కథను చెప్పిన దాసగణు తన అనుభావాలలో చెప్పాడు. కాని బాబా ఒక్కొక్కప్పుడు తమ గురువు రోషన్‌షా అని, ఆయనను శిరిడీలో సేవించానని, వారి సమాధి అచ్చటి వేపచెట్టు క్రింద వున్నదని, తాము అనాదిగా శిరిడీలోనే వుంటున్నామనీ చెప్పిన దానితోగాని, ఆయన శ్రీ అక్కల్కోటస్వామి యొక్క మరొక రూపమన్న దానికి గానీ సరిపోదు. తాము అహ్మద్‌నగర్, రహటాల నుండి వచ్చామని, 'నేనిక్కడకు ఔరంగాబాదు నుండి వచ్చాను. మా మామ నన్నిక్కడకు తీసుకొచ్చాడు. నా తల్లిదండ్రులను విడచి గంగాతీరానికి వచ్చేనాటికి నాకు 8 సం॥లు. అచటి నుండి శిరిడీ వచ్చాను అని వేరు సందర్భాలలో చెప్పినవాటితో ఈ కథ పొసగదు. ఆయన 12 సం॥లు శిరిడీలో వేపచెట్టు క్రింద భూగృహంలో తపస్సు చేసారన్న నిశ్చయమైన వృత్తాంతంతో ఈ కథ అసలే పొసగదు : 16 సం॥ల యువకుడుగా ప్రకటమైన ఆయన, అందులో ప్రవేశించేనాటికి నాలుగు సం॥లు మించి వయస్సు వుండడానికి అవకాశం లేదు. సేలూలో గోపాల్రావ్ దేశ్‌ముఖ్ ఉరఫ్ 'వెంకూసా' వృత్తాంతమే నిజమైతే శిరిడీలో ప్రకటమయ్యేనాటికి బాబాకు సుమారు 60 లేక 70 సం॥లు వయస్సుండాలి. తాము 'శుద్ధుడైన బ్రాహ్మణుడను' అన్నప్పుడు ఆయన బ్రహ్మజ్ఞానియని మాత్రమే వారి భావం. అంతకంటే తరచుగా ఆయన తాము పేద 'ఫకీరు'మని చెప్పేవారు. దానికి అర్థమదే. "జయదేవ జయదేవ దత్తావధూత" "మోమిని వంశీ జన్మని" అనే అరతి పాటలు కీర్తించినట్లు ఆయన హిందువులకు హిందువు, ముస్లిములకు ముస్లిము. అంటే హిందూ-ముస్లిం అనే భేదాలకు అతీతుడు. సాయి తమ గురుసేవ గురించి ఒకప్పుడిలా చెప్పారు : "నా గురువును యిక్కడే చావడిలో చూచాను. ప్రశాంతము, గంభీరమూ అయిన ఆయన ముఖంలోని నిత్యసంతుష్టి నన్ను ముగ్ధుణ్ణి చేసింది. నా చూపు ఆయన ముఖంమీద నిలిచిపోయేది. క్షణమాత్రం ఎడబాటును గూడ సహించలేక పోయేవాణ్ణి. వారి సన్నిధిలో నాకు ఆకలి దప్పులుగూడా తెలిసేవి గావు. ఆయనను 12 సం॥లకు పైగా నిండు హృదయంతో సేవించాను. ధ్యానస్థులైన ఆయన తమకు దేహమున్న సంగతే మరచి, కూర్చున్న చోటునుండి ఏ అవసరం కోసమూ లేచేవారు గాదు. నేను ఆయనచేత ఆహారం తినిపించి, గుడ్డలు మార్చి, ఆ ప్రదేశం శుభ్రం చేసేవాణ్ణి. ఆయన నుండి ఏదైనా మంత్రం ఉపదేశంగా పొంది జపించాలని తలచాను. కాని ఆయన నా చెవిలో ఏ మంత్రమూ ఉపదేశించలేదు. ఆయన నన్ను రెండు పైసలు దక్షిణ కోరారు. తాము కోరినది ప్రభుత్వం వారు ముద్రించిన లోహపు కాసులు గావని, ఒక పైస 'నిష్ఠ', రెండవ పైస 'సబూరి' (సంతోషంతో గూడిన ఓరిమి) యనీ ఆయన వివరించారు. వెంటనే అవి సమర్పించాను. నా సేవకు సంతోషించి, "నీవెక్కడున్నాసరే -- ఇక్కడగాని, సప్త సముద్రాలకు అవతల గాని -- నీవెంట వుండి కాపాడుతాను" అని ఆశీర్వదించారు. ఈనాటి నా ప్రతిభకంతటికీ కర్తలు వారే. ఇదంతా వారి ఆశీస్సుల ఫలితమే. బాబా స్వయంగా సాయి శరణానందతో తమ గురువు పేరు రోషన్‌షా అని చెప్పారు. ఆయన చెప్పిన దానిని బట్టి రోషన్‌షా పరమపదించాక వారిని బాబాయే వేపచెట్టు క్రింద సమాధి చేసినట్లు తోస్తుందని సాయి శరణానంద వ్రాశారు. సాయి ఆ గురువు పేరు హరి వినాయక్ సాఠేతో గూడ చెప్పారట గాని, అది తనకు గుర్తులేదని, ఆ పేరు "షా" అనో, లేక "సా" అనో అంతమౌతుందనీ అతడు వ్రాశాడు.

మరొకప్పుడు బాబా తమ గురుసేవా వృత్తాంతమే మరోలా చెప్పారు : "ఒకప్పుడు నలుగురం కలసి పవిత్ర గ్రంథాలు చదివి చర్చించుకున్నాము. మొదటివాడు, 'ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి కాని యితరులపై ఆధారపడ

కూడదు' అన్నాడు. రెండవాడు, 'సర్వసాక్షియైన ఆత్మయే సత్యం. దానిని గుర్తిస్తూ మనస్సును నిగ్రహించిన వాడే ధన్యుడు' అన్నాడు. మూడవవాడు, 'ఈ ప్రపంచం అనిత్యం. నిరాకారమైనదే సత్యం. దీనిని వివేకంతో గుర్తిస్తూ వుండటమే ముక్తికి మార్గం' అన్నాడు. నేను, 'కేవలం గ్రంథ పాండిత్యం వ్యర్థమని, స్వధర్మం ఆచరిస్తూ, గురువే సర్వవ్యాపియైన దైవమన్న విశ్వాసంతో తను, మన, ధన, ప్రాణాలను గురువుకు అర్పించాలి' అన్నాను. ఇలా చర్చించుకుంటూ మేమొక అడవిలోకి ప్రవేశించాము. దారిలో ఒక కూలివాడు కన్పించి, మేమెక్కడికి పోతున్నామని అడిగితే మేము చెప్పలేదు. మేము దారితప్పే ప్రమాదమున్నదని, మార్గదర్శిని తీసుకొని పోవడము మంచిదనీ చెప్పి, 'మీ లక్ష్యమేమో నాకు చెప్పనవసరము లేదు. కాని కొంతసేపు విశ్రాంతిగా కూర్చొని, రొట్టె, నీరు తీసుకొని వెళ్ళవచ్చుగదా!' అన్నాడతడు. మేము ఆయన సలహాను నిరాకరించి వెళ్ళి దారి తప్పాము. చివరకు కేవలం పూర్వపుణ్యంవల్ల మాత్రమే మేము బయలుదేరిన చోటికి చేరాము. మాకు మళ్ళీ ఆ కూలివాడు ఎదురై, 'మీ తెలివిపై ఆధారపడటం వలన దారి తప్పారు. అన్నింటిలోనూ మార్గదర్శి ఎప్పుడూ అవసరమే. భగవంతుడి కృపలేక ఎవరూ దారిలో మావంటివారిని కలవలేరు. అన్నం తిని పొమ్మన్న ఆహ్వానాన్ని శుభశకునంగా అంగీకరించాలి గాని నిరాకరించగూడదు. ఆకలి కడుపుతో ఏ అన్వేషణా సాగించలేరు. ఓరిమి, శాంతి కలిగివుండాలి' అన్నాడు. అతడు నిరక్షరుడైనా, హీనజాతివాడుగా కన్పించినా, నిష్కారణమైన అతడి ప్రేమకు నా హృదయం స్పందించింది. నాకు ఆకలి దప్పులు తీవ్రంగా బాధిస్తున్నాయి. అసమాన ప్రేమతో అతడిచ్చిన అన్నపానీయాలు తీసుకోవడమే జ్ఞానానికి సరియైన నాందియని నాకు తోచి, వాటిని సవినయంగా స్వీకరించాను. అపుడు గురువు మా యెదుట నిలచి, "ఏమిటి మీ చర్చ?" అన్నారు. నేను వివరించాను. 'నిన్ను గమ్యం చేరుస్తాను, నన్ను అనుసరిస్తావా? అయితే నన్ను పూర్తిగా విశ్వసించినవాడు మాత్రమే కృతార్థుడౌతాడు' అన్నారు. నేను తలవంచి నమస్కరించి, ఆయనను గురువుగా ఆశ్రయించాను. నా సాటివారు మాత్రము వారి ఆతిథ్యాన్ని, గురుత్వాన్నీ ధిక్కరించి వెళ్ళిపోయారు. తరువాత వాళ్ళందరూ దైవాన్ని అన్వేషించడం మాని, ఆకలి దప్పులతో తిరుగుతూనే వున్నారు.

తరువాత నా గురువు నన్నొక చెట్టుకొమ్మనుండి బావిలోకి తలక్రిందులుగా వ్రేలాడదీశాడు. నా తల నీటికి మూడడుగుల ఎత్తున వున్నది. నేను ఆ నీరు అందుకోలేకపోయాను. నన్నలా వదలి ఆయన ఎటో వెళ్ళిపోయారు. 5గంటల తర్వాత తిరిగి వచ్చి ఎలావున్నావు?' అన్నారు. "నేను పరమానందంలో తేలిపోతున్నాను" అన్నాను. ఆయన సంతోషంతో నన్ను కౌగిలించుకొని, నా దేహం నిమిరి, నన్ను శిష్యునిగా అంగీకరించారు. "నాకెల్లప్పుడూ ఆయననే చూస్తూ వుండాలనిపించేది. నా తల్లిదండ్రులను, కోర్కెలను మరిచి, యిక యింటికి వెళ్ళాలన్న తలంపే రాలేదు. నా జీవశక్తినంతటినీ నా దృష్టిలోను, నా దృష్టిని ఆయన ముఖంమీద లగ్నం చేశాను. ఆయనే నా ధ్యానమూర్తి" అని చెప్పారు.

పై వృత్తాంతాలు మనకు నిస్సందేహంగా తెలిపేదిది. సాయి జన్మతః పూర్ణులైనా, లోకానికి ఆదర్శంగా ఒక సద్గురువును సేవించారు. ఆయన నిద్రించేటప్పుడు ఒక యిటుకను తమ తలక్రింద, కూర్చున్నప్పుడు చేతిక్రింద వుంచుకొనేవారు. 'ఇది నా గురుప్రసాదము, నా జీవిత సహచరి. దీని సహాయంతోనే నేను ఆత్మను ధ్యానించేది' అని ఆయన చెప్పేవారు. అయితే ఆ గురువు ఆయనకు శిరిడీలోనో, లేక అడవిలోనో కనిపించి యుండవచ్చు. తరువాత సాయి శరణానంద వ్రాసినది జరిగియుండవచ్చు. సాయివలె ఆ గురువు కూడా కులమత భేదాలకు అతీతుడని తెలపడానికి, ఆయన పేరు వెంకూసా అని కొందరితోను, రోషన్ షా అని కొందరితోను, వారి వారి భావాలను బట్టి చెప్పియుండవచ్చు.

కాని కొందరు చరిత్రకారులు సాయిని ఆ గురువు తలక్రిందులుగా వ్రేలాడ దీసిన వృత్తాంతం కేవలం సంకేతమేమోనని, వాస్తవమై యుండజాలదనీ వ్రాశారు. కారణం, తలక్రిందులుగా వ్రేలాడదీస్తే ఎవరికైనా ఆనందం

కలగదన్నారు. కాని సాయికి సమకాలికుడైన ముస్లిమ్ మహనీయుడు తాజుద్దీన్‌బాబా అట్టి అనుభవము ఒక భక్తునికి ప్రసాదించారు. వెనుక బాబా ఫరీద్ గంజ్ షక్కర్ (12వ శతాబ్దము), ఇటీవల శ్రీ అవధూత వెంకయ్య స్వామివంటి మహనీయులెందరో యిటువంటి సాధన చేసారని చరిత్రలు తెలుపుతున్నాయి.

VII

శ్రీ సాయిబాబా శిరిడీలో ప్రకటమయ్యాక కొంతకాలం దేశసంచారం చేసినా మరలా శిరిడీనే తమ ముఖ్యస్థానంగా ఎన్నుకున్నారు. ఆ విషయమై ఆయన అప్పుడప్పుడు భక్తులతో చెప్పిన విశేషాలు వేరువేరుగా వున్నా, వాటివలన పత్రి -సేలూ - వెంకూసా కథ మాత్రం నిరాధారమని తెలుస్తుంది.

శిరిడీ, మరి మూడు యితర గ్రామాలు తమ 'యజమాని' ('మాలిక్' అంటే భగవంతుడు, లేక గురువు) ప్రసాదించారని ఆయన చెబుతుండేవారు. అనాదిగా ఆ గ్రామం తమ ఆప్తుల నివాసమని, తమ అత్తగారి యిల్లని ('సాసర్ వాడా'), అక్కడ పూర్వం తమ వారంతా నివసించేవారనీ ఆయన వేర్వేరు సందర్భాలలో చెప్పారు : ఒకప్పుడు తామొక్కరే అక్కడకు వచ్చామనేవారు. తమ భక్తులను తరింపజేయడానికి మరికొందరితో కలసి వచ్చామని కొన్ని సందర్భాలలోను, తమ గురువును సేవించడానికి వచ్చామని మరొకసారీ చెబుతుండేవారు. ఆయన తరచుగా చెప్పిన వృత్తాంతమిలా వున్నది : రెండు శతాబ్దాల తర్వాత తాము మరలా అచ్చటికి వచ్చామని, అంతకు పూర్వం గూడా ఎన్నోసార్లు అక్కడ నివసించామనీ ఆయన అంటుండేవారు. వారి స్వస్థానం వేరెక్కడో వున్నదని, అక్కడ వారి వంశస్థులకు ఆస్తిపాస్తులున్నాయనీ చెబుతుండేవారు. అక్కడ వివిధ కళలు, వృత్తులలోనే గాక సిరి సంపదలతో పాటు భక్తి దయలలోగూడ సాటిలేని వారెందరో వుండేవారని చెప్పేవారు. స్థానిక ప్రజలపై వారికిగల మక్కువ గురించి చెప్పేటప్పుడు నీమ్‌గాఁవ్, రూయీ, రహటా, పింపల్‌గాఁవ్, కోపర్‌గాఁవ్, పుంతంబా, జాల్నావంటి గ్రామాల గురించి ఆయన తరచుగా ప్రస్తావించేవారు. దీనినిబట్టి మనకు తెలియని మహనీయులెందరో అక్కడ నివసించారని, అందువలన ఆ ప్రాంతం ఎంతో పవిత్రమైనదనీ తెలుస్తుంది.

ఒకప్పుడాయన, తమ పూర్వీకులు శిరిడీలో నివసించారని, అందుకే తాముగూడ మరల అక్కడ నివసిస్తున్నామనీ చెప్పేవారు. అక్కడ సిరిసంపదలతో ఉజ్జ్వలంగా విలసిల్లిన ఒక నగరముండేదని, దానిచుట్టూ మనోహరమైన తోపులు, పండ్ల చెట్లు వుండేవని, అచ్చటి విశాలమైన వీధులకిరువైపుల సాటిలేని సంపన్నులు, మహాభక్తులూ అయిన మార్వాడీ వ్యాపారులు నివసిస్తుండేవారని గూడ ఆయన చెప్పేవారు. అలా శిరిడీ వారి పెద్దల నివాసమైనందువల్లనే సాయిగూడ మరలా శిరిడీలోనే నివసించారన్నమాట. ఇన్ని సందర్భాలలోనూ ఆయన పత్రి గ్రామంలో పుట్టి, సేలూలో పెరిగి అక్కడనుండి శిరిడీ చేరారని కించిత్తైనా ఆచూకీలేదు. తాము సేలూనుండి వచ్చామని చెప్పినమాట రెండవసారి శిరిడీ వచ్చేముందు ధూప్‌ఖేడా, పుంతంబా వెళ్ళినట్లే సేలూగూడా వెళ్ళి వచ్చారని మాత్రమే ఆయన భావమై వుండాలి. అలనాడు సాయిని సన్నిహితంగా సేవించిన వారితో ఆయన చెప్పిన వివరాలన్నీ హరివినాయక్‌సాఠే సేకరించి గ్రంథస్థం చేశాడు. ఒకనాడు సాయి నివాసం వలన గొప్ప పుణ్యక్షేత్రంగాను, సిరిసంపదలు గల నగరంగాను వున్న శిరిడీ కాలగతిలో కుగ్రామమయిపోయిందని, అది యీనాడు మరలా వారక్కడ అవతరించడం వలన అంతటి పుణ్యక్షేత్రమయిందని, ముందు ముందు మహా నగరంగా రూపొందగలదనీ మనం తలచవచ్చు. వెనుక 'శిలధి' అను పేరుగల యీ గ్రామం మరో పండరీపురం అవుతోందని, సాయినాథుడే అచ్చటి రమావరుడనీ దాసగణు "శిరిడీ మాఝే పండరిపుర - సాయిబాబా రమావర" అని కీర్తించాడు.

★★★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 2

శ్రీ సాయిబాబా జీవితం

II

రెండవసారి శిరిడీ చేరాకగూడ సాయి కొంత కాలం ఆ వేపచెట్టుక్రిందనే వున్నారు. ఆయన అప్పట్లో జుట్టు పొడుగ్గా పెంచుకొని తలకు తెల్లని రుమాలు, నడుముకు లంగోటి, పహిల్వానులా ఒకచొక్కా వేసుకొనేవారు. ఆయన ధనికులు - పేదలు, తమను గౌరవించేవారు తృణీకరించేవారు అనే భేదమెరుగని గంభీరుడు. ఆయన తరచుగా "అల్లాహ్"ను స్మరిస్తూ మశీదులోనో, గ్రామ పరిసరాలలోని చిట్టడవిలోనో, ఏటి ఒడ్డునున్న తుమ్మచెట్టు క్రిందనో ఒంటరిగా కాలం గడుపుతూండేవారు. తరచుగా తమలో తాము మాట్లాడుకొనేవారు. ఎదుట ఎవరూ లేకున్నా కోపంతో పెద్దగా తిడుతూనో, రాయి విసురుతానని బెదిరిస్తూనో వుండేవారు. దయ్యంపట్టిన వానిలా వున్నట్లుండి దూసుకుపోతుండేవారు. అందువలన ఆయనొక పిచ్చి ఫకీరని జనం తలచేవారు. లెండీదగ్గర ఒక పెద్ద తొట్టిలో గ్రామస్థులంతా పాత్రలు కడుక్కొనేవారు. ఆ నీరు పశువులు త్రాగేవి. చాలాకాలం సాయిగూడ అవే త్రాగేవారు. అందువలన గ్రామస్థులు ఆయనను మంచినీటి బావి దగ్గరకు రానిచ్చేవారుగారు. అయినా తాత్యా తల్లి బయాజాబాయి ఆయనకు చేసిన సేవ అనన్యం! ఆమె నిత్యమూ నియమంగా భోజనము ఒక బుట్టలో పెట్టుకొని ఆయనెక్కడున్నా వెతికి భోజనం పెట్టిగాని తానేమీ తినేది గాదు. ఒక్కొక్కసారి ముళ్ళూ, పొదలూ లెక్కచేయక చిట్టడవులలో గూడ ఆయన కోసం వెతకవలసి వచ్చేది. ఆయన ఏకాంతంగా ధ్యానంలో కూర్చొని వుంటే వారి ముందు ఆకువేసి వడ్డించి, కలిపి బిడ్డకు తినిపించినట్లే తినిపించేది. ఆమె శ్రమ చూడలేక కాబోలు, కొన్నాళ్ళకు ఆయన తిరగడం మాని మశీదులోనే వుండసాగారు. ఆమె చేసిన సేవను ఎన్నడూ మరువక ఆమెను, ఆమె బిడ్డడైన తాత్యాను కంటికి రెప్పలా కాపాడుతుండేవారు. చివరకు అతని ప్రాణం కాపాడడానికి తమ ప్రాణాన్నే అర్పించారని భక్తులంటారు. కృతజ్ఞతకు మరోపేరు సాయి.

ఒకసారి కొద్దిరోజుల పాటు తెంపులేకుండా కుంభవృష్టి కురిసి ఊరంతా నీరుపారాయి. వర్షం తగ్గేవరకు భక్తులు సాయి దర్శనానికి వెళ్ళలేకపోయారు. వాన వెలిసాక వెళ్ళిచూస్తే ఆయన ఆ నీళ్ళలోనే వేపచెట్టు క్రింద ధ్యానస్థులై కూర్చొని వున్నారు. నీరంతా పోయాక భక్తులు మరలా వెళ్ళి, "బాబా! మేమంతా సుఖంగా యిళ్ళల్లో వుంటే, మమ్మెప్పుడూ కాపాడే మీరు చెట్టుక్రింద కంటె మశీదులో వుంటే మాకు బాగుంటుంది" అని బ్రతిమాలారు. కాని ఆయన తమకక్కడే బాగుందన్నారు. చివరగా భక్తులు చొరవ తీసుకొని ఆయనను జబ్బలు పట్టుకొని తీసుకువెళ్ళి మశీదులో కూర్చోబెట్టారు. నాటినుంచి అదే వారి నివాసమైంది. అంతటితో ఆయన నిత్యమూ మశీదులోని కుండలతో దూరాననున్న బావినుండి నీరు తీసుకువచ్చి మశీదులో వుంచేవారు.

ఆ రోజులలో శిరిడీలో యిద్దరు సాధువులుండేవారు. దేవీదాసు 10,11 సం॥ల వయస్సులోనే విరాగిగా మారుతి ఆలయంలో వుండేవాడు. ఉజ్జ్వలమైన కళ్ళు, ప్రశాంతము, గంభీరమూ అయిన ఆయన ముఖం చూచేవారిని యిట్టే పాదాక్రాంతుల్ని చేసుకునేవి. గ్రామంలో తాత్యావంటి కొందరు ఆయనను గురువుగా తలచేవారు.

ఈయన, జానకీదాసు అనే వేరొక సాధువు గూడా సాయిపట్ల ఎంతో గౌరవంతో ఎక్కువసేపు ఆయన సన్నిధిలో గడిపేవారు.

బాబా ఒక్కొక్కసారి మూడుమైళ్ళలో వున్న రహటాకో, నీమ్‌గావ్‌కో వెళ్ళి సాయంత్రమయ్యేసరికి తిరిగి వచ్చేవారు. ఒకసారి రహటానుండి పూలమొక్కల విత్తనాలు తెచ్చి, ఆ వేపచెట్టు ప్రక్కనున్న నేలను త్రవ్వి వాటిని నారు వేసారు. వామన్ తాత్యా అనే కుమ్మరి ఆయనకు రెండు కుండలు యిచ్చాడు. ఆయన తమకు కాల్చనివి కావాలంటే అవే సమర్పించాడు. ఆరోజు నుండి అతని బేరం అద్భుతం కాసాగింది. అందువలన అతడు ఆయనకు రోజూ రెండు కాల్చని కుండలిస్తుండేవాడు. ఆయన వాటితో ఆ ఊరి బావినుండి నీరు తెచ్చి, మొక్కలకుపోసి, సాయంత్ర మయ్యేసరికి ఆ కుండలు వేపచెట్టుక్రింద పెట్టగానే అవి విచ్చిపోయేవి. మూడు సం॥లలో అక్కడ చక్కని తోట మొలిచింది. - ఆయన ఉనికి వలన ఆ గ్రామం మహాశక్తివంతమైన క్షేత్రంగా రూపొందినట్లు, మనస్సనే నేలలో గురుభక్తిని నాటి, దివ్యలీలలనే జలంతో తడిపి, తపోవనం మొలిపించారు. చివరకు ఆ స్థలంలోనే ఆయన సమాధి మందిరం వెలసింది.

పుంతంబాకు చెందిన గంగగిర్ బాబా అనే గృహస్థ సాధువు ఆ ప్రాంతమంతటా ఆధ్యాత్మిక ప్రచారం చేస్తుండేవారు. ఒకసారి ఆయన శిరిడీ వచ్చి మారుతి ఆలయంలో భక్తులతో సద్గోష్టి చేస్తున్నారు. అంతలో భుజాన నీటి కుండలతో సాయి ఆ ప్రక్కగా మశీదుకు వెళుతుంటే చూచి గంగగిర్ ప్రసంగం ఆపి, లేచి నమస్కరించి, వారి వెనుకనే మశీదుకు వెళ్ళారు. అక్కడ సాయి కుండలు దింపి వెనక్కు తిరగ్గానే గంగగిర్ ఆయనకు నమస్కరించారు. బాబా పెద్దగా నవ్వి, "దేవాలయం యీ మశీదుకు వచ్చిందే! మంచిది. మనమిద్దరమూ ఒకే కుటుంబంలోని వారము. ఎంతో కాలంగా కలసి వుంటున్నాము. ప్రజలను సన్మార్గములో పెట్టమని భగవంతుడు మనలను పంపాడు. కాని యీ రోజులలో ప్రజలు కించిత్తుగూడా పరివర్తనం చెందడం లేదు. అందరూ క్షుద్రమైన విలాసాల మైకంలో చిందులేస్తుంటే, హరి మన నెత్తిపై ఆవుపాలు పెట్టి వారి మధ్యకు పంపారు. కొందరు నన్ను చూచి నవ్వి, పాలకుండపై రాళ్ళు విసురుతున్నారు. కొందరు నవ్వుతూ, 'అతడు చెప్పేది వినకండి, సాయి నన్ను పూనాడు' అని చెప్పి ప్రజలచేత ఈతకల్లు త్రాగిస్తున్నారు. నా దగ్గర పాలు తీసుకున్న వాళ్ళంతా పిచ్చివాడినంటున్నారు. కొందరు పాలు తీసుకొనిగూడా వేదాంత చర్చల్లో దిగి, పిచ్చివాళ్ళవుతున్నారు. సత్సంగం పట్ల విశ్వాసము, గౌరవమూ పోయి అసత్యాన్నే ఆదరిస్తున్నారు" అని ఎంతో బాధగా గంగగిర్ చేతులు పట్టుకొని, "పోయేవాడు పోతాడు, నిలిచేవాడే నిలుస్తాడు. చిత్త శుద్ధితో తరించే మార్గం చెప్పడమే మన పని" అని చెప్పి తమ ఆసనంపై కూర్చున్నారు. అప్పుడు గంగగిర్ తన భక్తులతో, "పేడకుప్పవంటి యీ గ్రామానికి ఎంతటి రత్నం లభించింది! నక్షత్రాలవంటి మహాత్ముల మధ్య ఈయన సూర్యుని వంటివాడు. మీరు పిచ్చివాళ్ళు గనుక ఈయనను విడచి ఎక్కడెక్కడో వెదుకుతున్నారు!" అన్నాడు. అలానే ఒకసారి శ్రీ అక్కల్కోటస్వామి శిష్యులైన శ్రీ ఆనందస్వామి యవలా దగ్గరనున్న సవర్‌గాఁవ్‌లోని మఠంలో కొద్దిరోజులున్నారు. ఆయన పరమాత్మ సాక్షాత్కారం పొందిన మహాత్ముడు. అప్పుడు శిరిడీకి చెందిన మాధవ్‌రావ్ దేశ్‌పాండే, నందరామ్ మార్వాడీ, మొ॥న వారు ఆయనను దర్శించి తిరుగు ప్రయాణ మయ్యారు. అకస్మాత్తుగా ఆ స్వామి పరుగునవచ్చి, "నన్ను గూడ సాయి దర్శనానికి తీసుకుపోరా?" అని పిల్లవానిలా మారాంచేస్తూ టాంగా ఎక్కి కూర్చున్నారు. చివరకు శిరిడీ చేరాక ఆయన - సాయిబాబా ఒకరినొకరు చూచుకున్నారు గాని, ఏమీ మాట్లాడుకోలేదు. ఆయన , "ఈయన సామాన్యమైన రాయిలా కనిపించినా, గొప్ప వజ్రం! ఈ సంగతి త్వరలో మీకే తెలుస్తుంది" అన్నారు.

బాబాకు దీపాలు పెట్టడమెంతో యిష్టం. ఆయన రోజూ దుకాణాలలో నూనెతెచ్చి, రాత్రంతా మశీదులో దీపాలు వెలిగించి వుంచేవారు. రోజూ అలా నూనె యివ్వడం దండగని తలచి, ఒకరోజు ఆ వర్తకులు నూనె

లేదన్నారు. బాబా నిశ్చింతగా మశీదుచేరి, నీటితో ఆ డబ్బా కడిగి ఆ నీరు త్రాగేసారు. తర్వాత ప్రమిదలలో నీరుపోసి, వత్తులు వేసి వెలిగించారు. దీపాలు చక్కగా వెలిగాయి. గ్రామస్థుల హృదయాలలోని చీకట్లు తొలగి, ఆయనను క్షమాపణ వేడారు. "ఇష్టం లేకుంటే ఏమీ యివ్వనక్కరలేదు గాని లేదని అబద్ధం చెప్పవద్దు; యివ్వము అని చెప్పాలి" అని హితం చెప్పారు బాబా. ఈ లీల సంగతి ఆ ప్రాంతమంతా ప్రాకింది. మెరుపు, ఉరుమూ రానున్న కుంభవృష్టిని సూచించినట్లు, మానవాళికి ఆయన నుండి దివ్యలీలలు వర్షించనున్నాయని తెలిపే శంఖారావమైంది యీ లీల. నిజానికి ఆయన మశీదులో నివసించసాగాక ఆయన చరిత్రలో మరొక ఘట్టం ఆరంభమైంది. ఆయన తరచుగా నీమ్‌గాఁవ్‌లో త్రయంబక్ డేంగలే (ఉరఫ్ బాబాసాహెబ్ డేంగ్లే) యింటికి వెళ్ళేవారు. అతని సోదరుడు నానాసాహెబ్ డేంగలేకు పాపం రెండు వివాహాలు చేసుకున్నా సంతతి కల్గలేదు. కేవలం సాయి అనుగ్రహం వల్లనే బిడ్డలు కలిగారు. ఒకనాడు త్రయంబక్ డేంగలే పొలం పనులు చేయిస్తున్నాడు. ఒక కూలి మనిషి తన పసిబిడ్డను ఒక చెట్టు క్రింద నిద్రపుచ్చి పని చేస్తున్నది. అకస్మాత్తుగా వర్షం ఆరంభమయ్యే సరికి అందరూ ప్రక్కనున్న పాకలోకి పరుగెత్తారు. వెంటనే ఆ తల్లికి తన బిడ్డ గుర్తుకువచ్చి పరుగున వెళ్ళేసరికి, బిడ్డ ప్రక్కనే బాబా నిలబడి కాపలా కాస్తున్నారు! సాయి ఆమెను చూస్తూనే, బిడ్డ సంగతి మరిచినందుకు మందలించారు. ఆ తల్లి ఆత్రంగా బిడ్డనెత్తుకొనేలోగా అదృశ్యులయ్యారు బాబా. ఆ తర్వాత విచారిస్తే ఆ సమయంలో ఆయన శిరిడీలోనే వున్నారని తెలిసింది.

సాయి వేపచెట్టు క్రిందనున్నప్పుడు ఆయనకొక మత చిహ్నమే లేదు. కాని ఆయనను భక్తులు మశీదులో వుంచాక, ఆయన ముస్లిం అన్న సంకోచం కొందరికి కల్గసాగింది. సాయి దానినుండి తప్పుకోజూడలేదు. అది నేటి సమాజంలోని మతద్వేషాన్ని తొలగించమన్న భగవదాజ్ఞగా తీసుకున్నారు కాబోలు. ఓరిమితోను, పట్టుదలతోనూ దానిని ఎదుర్కొన్నారు. వేరుదారి లేనప్పుడు ఆయన లీలలే పరిష్కరించాయి.

ఈ లీలలకు రంగస్థలమైన ఆ శిథిలమైన మశీదు పట్టుమని రెండు గదులకు మించి వుండదు. మశీదులోని నేలలో మోకాలు లోతు గోతులుండేవి. అందులో ఈశాన్యం మూల కేవలమొక గోనెగుడ్డమీద సాయి కూర్చొనేవారు. ఆయన ఎదుట, ఆగ్నేయ దిక్కున ఆయన నిరతాగ్ని హోత్రము, లేక 'ధుని' నిర్వహించేవారు. తమ ఎడమ ప్రక్కనున్న అడ్డ చెక్కపై చేయి వుంచి బాబా తదేకంగా ధునికేసి చూస్తుండేవారు. దానికి పడమరగా నీటి కుండలుండేవి. వాటిప్రక్కనున్న గూటిలో ఆయన తమ చిలుం గొట్టాలనుంచుకొనేవారు. ఆయనకు కుడివైపు ఒక తిరుగలి వుండేది. దానితో ఆయన తరుచుగా గోధుమలు పిండిగా విసిరేవారు. అందుకోసం ఒక బస్తానిండా గోధుమలు, ఆయన పొగ పీల్చటానికి ఒక సంచిలో నాటు పొగాకు వుండేవి. పడమటి గోడలో గూడు (నింబార్) కు ఎదురుగా కూర్చొని తాము తెచ్చుకొన్న భిక్ష ఒక కుండలో వేసి కలిపి ముద్దలు చేసేవారు. మొదట అచటి భక్తులకు అదే ప్రసాదంగా యిచ్చి, చివరకు తామూ తినేవారు. ముస్లింలు నివేదన తెచ్చినప్పుడు ఆయన, 'ఫాతిహా' చదివించేవారు. ఒక్కొక్కప్పుడు తాముకూడ చదివేవారు.

భక్తులు తెచ్చిన పూలు నింబార్‌కి ఎదురుగా వ్రేలాడ తీసేవారు. మసీదు ముంగిట్లో ఎదురుగా ఒక తులసికోట స్థాపించారు. సాయి పంపే ప్రసాదం మతభేదం లేకుండా భక్తులందరూ తీసుకొనేవారు. మత సామరస్యానికి రంగస్థలమైన మశీదుకు ఆయన 'ద్వారకామాయి' అని పేరు పెట్టారు. ఆ పేరుకు అర్థం, "మతభేదం లేకుండా అందరికీ నాల్గు పురుషార్థాలకూ ద్వారాలు తెరచి వుండేది"అని స్కాందపురాణం చెప్పింది. 'అక్కడ ధుని ఎందుకు?' అని అడిగితే, "అందరి పాపాలు దహించడానికే!" అని సాయి చెప్పారు. కుల మత భేదాలకతీతమైనదే సాయి ధర్మమని, ఆయన నివాసమైన ద్వారకామాయి సూచిస్తుంది. నాటి స్మృతులు శ్యామా యిలా చెప్పాడు : "నేనప్పుడు బడిలో టీచరును. ఆయనపై నాకు విశ్వాసముండేది కాదు. రాత్రిపూట స్కూల్లోనే నిద్రించేవాడిని. మశీదులో

బాబా ఒక్కరే వుండేవారు. ఒడి కిటికీనుంచి మశీదు కనిపించేది. అందరూ పిచ్చి ఫకీరనే సాయిని ఆ కిటికీలోంచి నేను గమనిస్తుండేవాడిని. అప్పుడప్పుడు మశీదు నుండి ఇంగ్లీషు, హిందీ మొ॥గు భాషలలో ఎవరో మాట్లాడడం వినిపించేది. అది బాబాయే అయివుండాలి, కనుక ఆయన మహిమ గలవాడన్న విశ్వాసం నాకు కల్గింది.

సాయి కీర్తి వ్యాపించడం వలన ఒక సమస్య ఎదురయింది. కండపుష్టిగల మొహుద్దీన్ తంబులీ అనేవాడు శిరిడీ ప్రాంతంలో తమలపాకులు, తాయెత్తులు అమ్ముకుంటుండేవాడు. అతనికి దివ్యశక్తులున్నాయని తలచి గ్రామస్థులు గౌరవిస్తుండేవారు. సాయి మహిమ వెల్లడవుతుంటే అతడు ఓర్వలేక ఒకనాడు "శిరిడీలో తానైనా వుండాలి, లేక సాయియైనా వుండాలి" అని తగవు పెట్టుకొని, ఆ విషయం కుస్తీ పోటీలో తేల్చుకోవాలని చెప్పి, బాబాపై కలియబడ్డాడు. అతడిదే పైచేయి అయింది. నాటి నుండి ఆ షరతు ప్రకారమే సాయి గ్రామంలోకి రాకుండా లెండీ ఏటి ఒడ్డున తోపులో వుండసాగారు. తాత్యావంటి భక్తులు ఆయనను అక్కడే సేవించుకొనేవారు. వాళ్ళెంతగా బ్రతిమాలినా సాయి గ్రామంలోకి రాలేదు. ఒకరోజు అకస్మాత్తుగా తంబూలీకి హృదయ పరివర్తన కలిగి, ఒక మహాత్ముని దర్గావద్ద సాత్వికంగా జీవించదలచి శిరిడీ విడిచి వెళ్ళిపోయాడు. అతని కండబలాన్ని బాబా ఆత్మబలము, ద్వేషాన్ని ప్రేమ జయించాయి. తర్వాత సాయి మరల మశీదుకు వచ్చారు.

ఐదు సం॥ల తర్వాత మరొక సంఘటన జరిగింది. అహమ్మద్‌నగర్ నుండి జవ్హార్ ఆలీ అనే ముస్లిం ఒకడు రహటా వచ్చాడు. అతడు పండితుడు. మంచి మాటకారి. త్వరలో అతడు ఆ గ్రామస్థులను ఆకట్టుకొని ముస్లిమ్‌లకు ఒక ప్రార్థనాస్థలము కట్టించసాగాడు. కాని అంతలో ప్రజలు అతని సంకుచితమైన మతదృష్టికి అసహ్యించుకొని ఆ ఊరినుండి వెళ్ళగొట్టారు. ఆలీ పారిపోయి వచ్చి శిరిడీలోని మశీదులో తలదాచుకొన్నాడు, కాని తన కుబుద్ధిని విడువలేదు. మంచి మాటలతో భక్తులను ఆకట్టుకొని త్వరలోనే సాయి తన శిష్యుడని చెప్పసాగాడు. బాబా గూడ ఓరిమి, వినయాలతో అలానే మెలగసాగారు. దీనిని ఆలీ వాడుకోదలచి బాబాను తీసుకొని వెళ్ళి రహటాలో వుండసాగాడు. వాళ్ళిద్దరూ అప్పుడప్పుడు శిరిడీ వచ్చి వెళుతుండేవారు. భక్తులు అది భరించలేక బాబాను శిరిడీ తెచ్చుకోవటానికి రహటా వెళ్ళారు. అక్కడ 'ఈద్‌గా' దగ్గర బాబా ఎదురై, "ఈ ఆలీ నన్నెలాగూ పంపడు. అతడు పంపక నేను రాకూడదు. అతడు ముక్కోపి. మిమ్ములను చూస్తేనే విరుచుకు పడతాడు. అతడు వచ్చేలోగానే మీరు తిరిగిపోవడం మంచిది" అన్నారు. అంతలో అతడు వచ్చి వారి తలంపు విని ఉగ్రుడయ్యాడు. చివరకు రాజీ కుదిరి, గురు - శిష్యులిద్దరినీ శిరిడీ తీసుకొచ్చారు. త్వరలోనే ఆలీ ప్రవర్తన నచ్చని భక్తులు అతనికీ, దేవీదాసుకూ వేదాంతచర్చ పెట్టారు. అందులో యువకుడైన దేవీదాసు ముందు వృద్ధుడు, పండితుడైన ఆలీ పరాభవము చెంది మరురోజే ఎవ్వరికీ చెప్పకుండా బీజాపూర్‌కు వెళ్ళిపోయాడు. తరువాత ఒకప్పుడు అతడు పశ్చాత్తాపము చెంది, భక్తిశ్రద్ధలతో బాబాను దర్శించాడు. బాబా మాత్రం అతనితో ఎంతో ప్రేమగా వ్యవహరించారు. ఆయన మొదటి నుండీ సాధువుకెంత నమ్రత, ఓరిమి వుండాలో తమ ప్రవర్తన ద్వారా తెల్పుతూనే వున్నారు. రమణ మహర్షి చెప్పినట్లు, "జ్ఞానిని జ్ఞానే గుర్తుపట్టగలడు" కాని, ఆలీ గ్రహించటానికి అంతకాలం పట్టింది. ప్రేమ, ఓరిమిలతో గూడిన సత్యమే జయించింది.

దేవిదాసు ఆ పరిసర గ్రామాలలో వైద్యం చేస్తుండేవాడు. ఒకనాడు అతనిని సాయి, "స్త్రీలకు సాధువెంతో దూరంగా వుండాలి" అని మందలించారు. కారణమేమో ఎవరికీ తెలియలేదు. కొద్దిరోజుల తరువాత ఒక శ్రీమంతురాలు అతని గురించి దుష్ప్రచారము చేస్తానని బెదిరించి అతనిని లోబరుచుకున్నది. అప్పుడు సాయి మాటలకు అర్థమేమో తెలిసి అతడు ఆ ప్రాంతమే విడిచి వెళ్ళిపోయాడు. జానకీదాసు మాత్రం సాయి హెచ్చరికలను జాగ్రత్తగా పాటించేవాడు. చివరకు అతడు శిరిడీనుండి వెళ్తుంటే భక్తులతనికి ఘనమైన వీడ్కోలు చెప్పారు. అప్పుడు అతని దివ్య వర్చస్సు వెలుగు రూపంలో మారుతి విగ్రహంలో లయమయింది.

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము



అధ్యాయము - 3

శ్రీ సాయి పిలుపు

శ్రీసాయి, శిరిడీకి ఒకవైపున మూడు మైళ్ళలో వున్న రహతాకు, మరో దిక్కున ఒక మైలులోవున్న నీమ్‌గాంవ్‌కూ తప్ప యెన్నడూ, యెక్కడకూ వెళ్ళలేదు. ఉపన్యాసాలు యివ్వలేదు; ప్రజలను ఆశ్చర్యపరచే చిల్లర మహిమలేవీ ప్రదర్శించలేదు; ప్రశ్నలు చెప్పలేదు. అయినా నానాటికీ బాబా దర్శనం కోసం వచ్చే జనుల సంఖ్య పెరిగిపోతోంది. శిరిడీ గొప్ప తీర్థ క్షేత్రంగా రూపొందుతోంది.; కాని ఆయననెందరు పూజిస్తున్నా, ఆయన మాత్రము పేద ఫకీరుగానే జీవించారు. తాను భగవంతుని బానిసనని, సర్వమూ చేసేది, ఆయన భక్తులను రక్షించేది ఆ భగవంతుడేననేవారు. లేక, అదంతా ఆయన గురువుయొక్క కృపేననేవారు. అయితే ఆయన దర్శనంకోసం అందరు ఎలా వచ్చినట్లు? ఒకప్పుడు ఆయనే చెప్పారు: "నా వద్దకెవరూ వారికై వారే రారు. నేనే అనేక రీతుల వారిని రప్పించుకుంటాను" అని. సాయి, తమ భక్తులను రక్షించడానికే తాము వచ్చామనేవారు. లౌకికమైన కోరికలతో వారిని దర్శించరాదని ఒక భక్తుడు చెబుతుంటే ఆయన, "అలా చెప్పవద్దు : నా వద్దకు మొదట అందరూ అలానే వస్తారు. కోర్కెలు తీరి, స్థాయి చిక్కాక నన్ననుసరించి సన్మార్గానికి వస్తారు" అని చెప్పారు.

వి. హెచ్. ఠాకూర్ ఒక సర్వే బృందంతో కలసి వాడ్గాం వెళ్ళినపుడు అక్కడ దైవవశాత్తు, 'అప్పా' అను కన్నడ మహాత్ముని దర్శించాడు. ఆయన నిశ్చలదాసు వ్రాసిన 'విచారసాగరం' అను గ్రంథాన్ని భక్తులకు బోధిస్తున్నారు. ఠాకూర్‌తో ఆయన, "నీవీ గ్రంథం చదువు, నీ కోరిక ఫలిస్తుంది. నీవు ఉద్యోగంలో ఉత్తరంగా వెళ్ళినపుడు ఒక గొప్ప మహాత్ముడు లభించి, బాట చూపుతారు; సుఖశాంతులు కలుగజేస్తారు" అన్నారు. కొంతకాలానికతడు జున్నర్‌కు బదిలీ చేయబడ్డాడు. అక్కడకు వెళ్ళే మార్గంలో, దున్నపోతునెక్కి నాన్హేఘాట్ అనే పర్వత కనుమ దాటాలి. ఆ ప్రయాణంలో అతని ఒళ్ళంతా హూనమయింది. తర్వాత, అతడు కళ్యాణ్‌లో పనిచేస్తున్నపుడు శ్రీ సాయి గురించి విని శిరిడీ వెళ్ళాడు. బాబాను చూడగానే అతనికి ఆనందబాష్పాలు కారాయి. సాయి అతనికేసి చూచి, "ఆధ్యాత్మ విద్య ఎంతో కష్టము. శక్తినంతా వినియోగించి కృషి చేస్తేగాని ఫలితము వుండదు. అది కన్నడ సాధువు అప్పా చెప్పినంత తేలికకాదు. దున్నపోతునెక్కి నాన్హేఘాట్ దాటటం కంటే గూడ కష్టం!" అన్నారు. ఆ మాటలు ఠాకూర్ ఒక్కడికే అర్థమయ్యాయి. నాడు అప్పా చెప్పినది బాబాను గురించేనని తోచి అతడు మ్రొక్కగానే బాబా ఆశీర్వదించి, "నీకు అప్పా చెప్పినమాట నిజమే. కాని ఆ గ్రంథం చదివితే చాలదు. మననం చేసి ఆచరించాలి. **గురు కటాక్షము, అనుభవజ్ఞానము లేనిదే లాభం లేదు"** అన్నారు.

ప్రొఫెసర్ బాలకృష్ణ ఉపాసని శాస్త్రి యిలా వ్రాశారు; "ఒకప్పుడు పూనాలో ప్లేగు చెలరేగడం వలన చాలా నెలలు మా కళాశాల మూసివేస్తే నా తల్లిని తీసుకొని ఋషికేశ్ దర్శించి, తపోవనం చేరాను. అక్కడ ఒక సాధువు నాకేసి చూచి, 'మీది సటనా గ్రామం గదా?' అన్నారు! వారిని గురించి అడిగితే, రేపు రా చెబుతాను' అన్నారు. ఆ సంగతి విని మా అమ్మగారు ఆయన మా వంశగురువైన ఉద్ధవ మహరాజ్ కావచ్చని చెప్పి, మరురోజు ఆయనను చూడాలని ఆమెగూడ వచ్చింది. (కొన్ని తరాల క్రిందట ఆ వంశస్థులకు గురువైన శ్రీ ఉద్ధవ మహరాజ్ హిమాలయాలకు

వెళ్ళిపోయారు. వారు యోగం ద్వారా చిరంజీవులై, అర్హులైన భక్తులకు దర్శనమిస్తారని చెప్పుకునేవారు.) మరురోజు నేను, మా అమ్మ ఎంత వెదకినా ఆయన కన్పించలేదు. మా అమ్మ బసకు వెళ్ళిపోగానే ఆ సాధువు నా కెదురై, 'ఇలా ఎప్పుడూ చేయకు. ఎవరిని పిలిస్తే వారే రావాలి' అని చెప్పి పూర్వంనుండి మా యింట పూజించబడుతున్న విగ్రహాలు, సాలగ్రామాల గురించి చెప్పారు. వాటిని వారే శ్రీ ఉద్ధవ మహరాజ్‌గారికి యిచ్చామనీ, ఆయన మనవడి నుండి అవి మా తాతాగారికి లభించాయనీ చెప్పారు! (అంటే ఆ సాధువు వయస్సెంత?) 'ఈయనెవరు?' అనుకోగానే ఆయన హిందీలో, 'ఒక చెట్టున్నది. యిద్దరు దానిపైకెక్కారు. ఒకరు క్రిందకూ, ఒకరు పైకీ వెళ్ళారు!' అని, నాల్గు అడుగులు వేసి అదృశ్యమయ్యారు. ఆయన వయస్సు 50 లేక 60 సం॥లు వున్నట్లున్నది. స్థూలకాయుడు. కౌపీనం మాత్రమే ధరించారు.

చాలా సం॥ల తర్వాత నా తమ్ముడు ప్రాణాయామం చేస్తుంటే లోపం జరిగి, అతడు పడుకుంటే శ్వాస ఆగిపోయేది. నిద్ర, జీర్ణశక్తి లోపించి, ఏం చేసినా తగ్గలేదు. చివరకు అతడు యిల్లు విడచి వెళ్ళిపోయాడు. నేను అతనిని వెతకడానికి రైలులో వెళుతుంటే కోపర్‌గాంవ్‌లో ఒక మిత్రుడు కన్పించి, నేను వెళ్ళే పనిని గురించి విని, బాబాను తప్పక దర్శించమని చెప్పి, నన్నొక టాంగాలో తానే శిరిడీకి పంపాడు. నేను మశీదులోకి వెళ్ళగానే, ధుని దగ్గర తమ చుట్టూ తాము తిరుగుతున్న బాబాను చూచాను. నేను నమస్కరించగానే ఆయన, 'ఖండోబా వద్దకు వెళ్ళు!' అని ఆదేశించారు. నేను బయటకు వచ్చి, ఖంబోబా ఆలయంలో ఒకసాధువున్నాడని విని అక్కడకు వెళ్ళాను. అక్కడున్నది నా తమ్ముడే! అతడు, తాను సాయి ఆజ్ఞానుసారం అక్కడున్నానని చెప్పాడు. నేను మరల మశీదుకు చేరాక, సాయి అందరినీ దక్షిణ అడుగుతూ, నావైపు గూడా చేయి చాపారు. నా దగ్గర డబ్బు లేక, నమస్కారమే దక్షిణగా సమర్పించాను. బాబా హిందీలో, 'ఒక చెట్టున్నది. ఇద్దరు దానిపైకెక్కారు. ఒకరు క్రిందకూ, ఒకరు పైకీ వెళ్ళారు!' అని నవ్వారు. నాకు వెంటనే తపోవన సాధువు గుర్తొచ్చాడు. ఈ యిద్దరికీ పోలికలున్నాయి. కాని శాస్త్రి తపోవనం వెళ్ళే నాటికి బాబా శిరిడీలోనే వున్నారు".

ముస్లిం మహాత్ములెందరో బాబాపై భక్తితో తమ భక్తులను ఆయన వద్దకు ఆశీస్సులకోసం పంపుతుండేవారు. ఇమాంభాయి చోటేఖాన్‌కు ఉద్యోగంలో చిక్కులొస్తే నాందేడ్‌లోని దర్వేష్‌షా అను ఫకీరును ఆశ్రయించాడు. ఆ సాధువు అతనితో బాబాను దర్శించమని చెప్పి, ఆయన గొప్ప 'ఔలియా' (సిద్ధుడు) అని తెల్పే మార్గం చెప్పాడు: చాటుగా బాబా వెనుకకు జరిగి, మనసులో ఖురాన్‌లోని ఒక మంత్రం వల్లిస్తే ఆయన వెనుకకు తిరిగి అతనిని పలకరిస్తారని, ఆయన పైకమిస్తే మాత్రం తీసుకోవద్దనీ చెప్పాడు. ఇమాంభాయి శిరిడీ చేరేసరికి బాబా ఒక వీధిలో నిల్చొని ఒక భక్తురాలి మొర వింటున్నారు. అతడు దర్వేష్‌షా చెప్పినట్లు చేయగానే బాబా ఆవేశంతో వెనక్కు తిరిగి, "ఎవరు నీవు? నా తండ్రివైనట్లు ఏదో అడగడానికి వచ్చావే!" అని అరచి, అతనిని తిడుతూనే మసీదు చేరారు. రెండు రోజులవరకు అతనిని మసీదులోనికి రానీయలేదు. 'బాబా, అతడూ మీ బిడ్డడే కదా కోపమెందుకు?' అన్నాడు కాకాసాహెబ్. "వాడు నా బిడ్డంటావా? వాడు ఒక టీచరును కొట్టాడు!" అన్నారు బాబా. నిజమే! అతడు పోలీసు, ఒక నేర పరిశోధనలో అతడు ఒక టీచర్‌ను కొడితే ఒళ్ళంతా రక్తంకారి, స్పృహ తప్పి పడిపోయాడు. ఇమాంభాయికి శిక్ష తప్పాలంటే ఉద్యోగం వదలి పారిపోవాలని సాటివారు చెబితే, అతడు సాయిని ఆశ్రయించాడు. అతడు పశ్చాత్తాపం చెందగానే సాయి, "భయపడకు, భగవంతుడే యజమాని!" అని ఆశీర్వదించారు. అతడికెట్టి శిక్షా పడలేదు. తర్వాత ఒకసారి అతడు యింటికి వెళ్ళడానికి సాయి సెలవు యివ్వలేదని ఆరాటపడుతుంటే ఆయన, "వెళ్ళవద్దు. వెళితే గాలివాన, పిడుగులు, నిప్పుకణాలు ఎదురవుతాయి" అన్నారు. అయినా అతడు బయల్దేరి సాయంత్రానికి సురళానది ఒడ్డుకు చేరి, కొద్ది దూరం వెళ్ళేసరికి బాగా మబ్బుపట్టి, గాలివాన ప్రారంభమైంది. దారిలో ఒకచోట మఱ్ఱిచెట్టుమీద పిడుగు పడి ఆ చెట్టు కూలింది. అతడు ఆ మెరుపునుండి దృష్టి మరల్చుకోగానే

అక్కడ సాయి, కూడా రెండుకుక్కలు స్పష్టంగా కన్పించాయి. అతడు నమస్కరించాక బాబా అదృశ్యమయ్యారు. ఆ ధైర్యంతో అతడు నది దాటాడు. అవతల ఒడ్డు చేరేదాకా నీళ్ళు మోకాళ్ళ లోతే వున్నాయి! నిజానికి ఆ నది సుమారు ఇరవై అడుగుల లోతుగా గట్లనిండుగా ప్రవహిస్తున్నది. బాబా వాక్కు భగవంతుని వాక్కే!

మోరేశ్వర్ ప్రధాన్ తనకు గల ఒక్క కొడుకు, ఏడు సంవత్సరాల వాడు మరణించడం వలన క్రుంగిపోతుంటే, ఒక మిత్రుడు సాయిని గురించి చెప్పాడు. తర్వాత ఒకరోజు అతనికి కలలో ఏడుగురు సాధువులు కన్పించారు. "మీలో సాయి ఎవరు?" అని అడిగితే, వారు ఒక ఫకీరును చూపారు. తర్వాత అతడు శిరిడీ వెళ్ళి చూస్తే సాయి సరిగా కలలో కన్పించినట్లే వున్నారు. ఆయన అతనిని ఎరుగుదునని చెప్పి, బొంబాయిలోని అతడి యిల్లు, దొడ్లో చెట్లు గూడ వర్ణించారు. తర్వాత అతనిని చూపి "ఎందుకీ పిచ్చివాడు తన కొడుకును నేను చంపానని నిందిస్తాడు? చావడమంటే భూమిలోకి పోవడమే గదా! అంత మాత్రానికే ఎల్లకాలం ఏడుస్తూ కూర్చోవాలా?" అన్నారు.

ఎమ్. డబ్ల్యూ. ప్రధాన్ యింట్లో నిత్యమూ పూజ చేసే మాధవభట్ అనే పూజారికి ఆ దంపతులు ఫకీరైన సాయిని పూజించడం గిట్టేదికాదు. ఒకప్పుడు వాళ్ళ బాబుకు తీవ్రంగా జ్వరమొచ్చి, ఏ మందుకూ తగ్గలేదు. హిందూ దేవుళ్ళ కోపమే అందుకు కారణమని, సాయిని పూజించడం మాననిదే తగ్గదనీ భట్ అన్నాడు. ఆ రాత్రే అతనికి కలలో సాయి, ఆ యింటి మెట్లపై కూర్చొని సట్కాను వూగిస్తూ కన్పించి, "ఏమనుకుంటున్నావ్? ఈ యింటికి యజమానిని నేనే!" అన్నారు. మొదట ఆ సంగతి భట్ ఎవరికీ చెప్పలేదు. అతడెంత జపం చేసినా బిడ్డకు వ్యాధి తగ్గకపోయేసరికి ఒకరోజు అతడు సాయి పటం ముందు నిలచి, "మీరే దత్తాత్రేయులైతే బిడ్డడి వ్యాధి త్వరలో తగ్గాలి" అని ప్రార్థించాడు. కొద్దిసేపట్లో అలానే తగ్గింది. నాటినుండి దత్తాత్రేయుడే సాయియని నమ్మి పూజించసాగాడు భట్.

డి. ఎమ్. ముల్కీ అనే నాస్తికుడు మహనీయుల పటాలు గూడ చూచేవాడు గాదు. అతడి అన్న బాబా భక్తుడు. ముల్కీకి 1916లో తీవ్రంగా జబ్బు చేసి చావు తప్పదన్న భయం కల్గింది. నాటి రాత్రి కలలో, ఒక ఫకీరు కన్పించి, "నా దర్శనానికి వస్తానంటే నీకు జబ్బు తగ్గుతుంది" అని చెప్పి అతడు మాట యివ్వగానే మాయమయ్యారు. అతడు అందుకు భయపడి కేకపెట్టాడు. అతని వదినగారు కారణం తెలుసుకొని, అతడికి బాబా పటం చూపింది, అతడికి దర్శనమిచ్చింది వారే! ఆ రోజే జ్వరం తగ్గింది!! త్వరలో అతడు సాయిని దర్శించాడు. అతనికి కలలో కన్పించింది సాయియే! కస్టమ్స్ శాఖలో పని చేస్తున్న తోసర్‌కు 1895లో ఒకనాటి రాత్రి కలలో ఎవరో మహాత్ముడు కనిపిస్తే, వారినే తన గురువుగా స్మరించుకోసాగాడు. అతడు 1910 లో దాసగణు చేసిన సంకీర్తనలలో బాబాను గురించి విని శిరిడీ వెళ్ళాడు. తనకు స్వప్న దర్శనమిచ్చినది వారేనని గుర్తించాడు. తర్వాత యితడే వాసుదేవానంద సరస్వతీ స్వామి వద్ద సన్యాసం తీసుకొని 'నారాయణాశ్రమ్!' గా ప్రసిద్ధికెక్కాడు.

కోపర్గావ్‌లో 1890 వరకు మమల్తదారుగా వున్న బాలాభాటే, సాయి వట్టి పిచ్చిఫకీరని, అమాయకులు ఆయనను వెర్రిగా పూజ చేస్తున్నారనీ అనేవాడు. ఒకసారి అతని మిత్రులు కొందరు శిరిడీ వెళ్తూ, అతడి విమర్శకు బాధపడి, బాబాను స్వయంగా చూచి మాట్లాడమన్నారు. అతడు గూడ వెళ్ళి శిరిడీలో ఐదు రోజులు వున్నాడు. చివరిరోజున దూరంగా వున్న అతనిని దగ్గరకు పిలచి బాబా అతనిపై ఒక కాషాయం కప్పారు. ఆ క్షణం నుంచి అతడు పూర్తిగా మారిపోయి, అన్నీ విడచి శిరిడీలో వుండిపోయాడు. మిత్రులు ఎంతో కష్టంమీద అతనిచేత ఒక సంవత్సరం ఉద్యోగానికి సెలవు పెట్టించారు కాని తర్వాతగూడ అతడలా వుండిపోయాడు. జిల్లా కలెక్టరు అతనిపై దయతలచి నెలకు రూ. 30/- లు మంజూరు చేసాడు. సాయి తనపై గుడ్డ వేసినప్పటినుండి క్రొత్త జన్మ ఎత్తినట్లయిందని, లౌకిక జీవితం తనకు దుర్భరమయిందని అనేవాడు. అతడు నిత్యకర్మలు ఆచరిస్తూ, సద్గ్రంథాలు

చదువుతుంటే బాబాయే వివరించేవారు.

ఒకసారి వణిలోని సప్తశృంగి దేవాలయం పూజారి కాకాజీకి ఎన్నో కష్టాలు వచ్చాయి. అతడు ఆ దేవిని ప్రార్థిస్తే ఆమె కలలో కనిపించి, 'బాబా'ను దర్శించమని చెప్పింది. నాటికి సాయి ఖ్యాతికెక్కలేదు. ఆమె మాటలు అర్థంగాక, త్రయంబకం వెళ్ళి 10 రోజులు శంకరుణ్ణి సేవించాడు. కాని శాంతి కలుగలేదు. అతడు తిరిగి సప్తశృంగి దేవినే ప్రార్థిస్తే మరల స్వప్న దర్శనమిచ్చి, "నేను చెప్పినది శిరిడీలోని సాయి సమర్థుల గురించి" అన్నది. కాని అతనికి శిరిడీ ఎక్కడున్నదో గూడ తెలియలేదు. ఒకరోజు చిత్రంగా శిరిడీ నుండి శ్యామా అతని వద్దకు వచ్చాడు. ఒకప్పుడు శ్యామా తల్లి శ్యామాకు జబ్బు చేస్తే ఆ దేవికి మ్రొక్కుకున్నది గాని, తీర్చలేదు. అందుకే ఆ కష్టాలు వచ్చాయని ఒక దైవజ్ఞుడు చెప్పాడు. శ్యామా ఆ మ్రొక్కులు బాబాకే సమర్పించబోతే ఆయన, వాటిని వణిలోనే చెల్లించాలని చెప్పారు. అందుకే అతడు వణి వచ్చాడు. బాబా అతనిని తనకోసమే పంపారని తలచి, కాకాజీ గూడ శిరిడీ చేరాడు. సాయిని చూడగానే అతడికి శాంతి లభించింది. సరియైన దేవతారాధన సద్గురువును చూపుతుంది.

షేవడే తన న్యాయశాస్త్ర పరీక్షలకు ముందు సాయిని దర్శిస్తే, ఆయన, "పరీక్షలో పాసవుతావు" అని ఆశీర్వదించారు. అతడు పరీక్ష బాగా రాయలేదు గాని, బాబా మాటనే నమ్ముకున్నాడు. అతడు బాగా వ్రాయకపోతే సాయిగూడ ఏమీ చేయలేరని అతని సహపాఠి సపత్నేకర్ అన్నాడు. కాని షేవడే పాసయ్యాడు. తర్వాత సపత్నేకర్ న్యాయవాదిగా అక్కల్కోటలో స్థిరపడ్డాక అతడి కొడుకు చనిపోయాడు. ఎన్ని యాత్రలు చేసినా ఆ దంపతులకు శాంతి కలగలేదు. అలనాడు షేవడే చెప్పినది గుర్తువచ్చి అతడు సాయిని దర్శించాడు. అతడు నమస్కరించగానే సాయి, "ఫో, యిక్కడినుండి!" అని కసిరారు. అతనిపట్ల బాబాను ప్రసన్నులను చేయగోరి, బాలాషింపీ అను భక్తుడు ఒక సాయి పటం తెచ్చి బాబాకు చూపి, "ఇదెవరిది?" అన్నాడు. ఆయన నవ్వి సపత్నేకర్‌ను చూపుతూ, "అతని ప్రియుడిది!" అన్నారు. అందరూ నవ్వారు. అప్పుడాయనకు నమస్కరించుకోమని షింపీ సైగ చేయగానే సపత్నేకర్ నమస్కరించాడు గాని బాబా మరలా కసిరారు! అతడు నిరాశతో యిల్లుచేరి, మనశ్శాంతి కోసం కాశీ వెళ్ళదలచాడు. ఆ ముందటి రాత్రి అతని భార్యకు ఒక కలవచ్చింది. ఆమె మంచినీటి చెరువుకు వెళ్తుంటే, ఒక చెట్టుక్రింద ఒక ఫకీరు కనిపించి, "అమ్మా, నీకెందుకా బాధ? నీరు నేను తెచ్చిపెడతాను!" అని ముందుకొచ్చాడు. ఆమె భయంతో పారిపోతుంటే అతడు వెంట వచ్చాడు. అది తమను శిరిడీ రమ్మన్న సందేశమని తలచి ఆ దంపతులు శిరిడీ చేరారు. అప్పుడే లెండీనుండి వస్తున్న బాబాను చూస్తూనే, తనకు స్వప్నంలో కనిపించినది వారేనని ఆమె గుర్తించింది. తర్వాత మశీదు చేరాక సాయి, "అమ్మా, ఎంతో కాలంగా నా చేతులు, కడుపు, నడుము నొప్పి పుడుతున్నాయి. ఈ క్షణంలో చిత్రంగా తగ్గిపోయాయి!" అని ఎంతో మధురంగా నవ్వారు. నిజానికి, అలా జరిగినది ఆమెకే!! తానడుగకనే తన బాధలను గుర్తించి తొలగించిన ఆయన శక్తికి ఆమె ఆశ్చర్యపోయింది. కాని సపత్నేకర్ నమస్కరించుకోగానే బాబా కసిరారు. గతంలోని తన తప్పిదాలకే బాబా కసురుకున్నారని గుర్తించి, మశీదులో ఆయన ఒక్కరే వున్నప్పుడు వెళ్ళి శరణు వేడాడు. ఈసారి ఆయన ప్రేమతో తల నిమిరారు.

ఇంతలో ఒక గొల్లెల కాపరివచ్చి, బాబాకు నడుము పిసకనారంభించింది. ఆమెతో బాబా ఒక వర్తకుని కథ చెప్పారు. అది సపత్నేకర్ కథే! చివరికి అతనిని చూపి, "నేను తన బిడ్డను చంపానని వీడు నన్ను నిందిస్తున్నాడు. నేనలా చంపుతానా? ఈ మశీదులో కాలుపెట్టాక గూడ యింకా దుఃఖిస్తాడెందుకు? మరలా ఆ బిడ్డనే ఆ తల్లి గర్భంలో వుంచుతాను!" అన్నారు. అతడు నమస్కరించగానే, "ఆద్యంతాలు లేని యీ పాదాలు పరమ పవిత్రమైనవి, నాపై పూర్తి విశ్వాసముంచు, నీ కోరిక నెరవేరుతుంది" అన్నారు. మర్నాడు అతడు జనంలో త్రోసుకు వస్తుంటే చూచి, "హృదయ పూర్వకమైన ఆ నమస్కారమొక్కటే చాలు, ఎందుకిన్నిసార్లు?" అన్నారు బాబా. భక్తిని నిలుపు

కొనడమే నిజమైన నమస్కారము. చివరకు వాళ్ళు శెలవు కోరినప్పుడు అతనికొక కొబ్బరికాయ యిచ్చి, "ఇది నీ భార్యకివ్వు! సంతోషంగా బయల్దేరండి'' అని ఆశీర్వదించారు. సంవత్సరంలోగా వారికి కొడుకు పుట్టాడు.

బాలక్‌రామ్‌మాన్కర్, తన భార్య గతించాక శిరిడీలో వుండిపోయాడు. ఒకరోజు బాబా అతనికి రూ.12/-లు యిచ్చి మత్స్యేంద్రనాథుడు తపస్సు చేసిన మచ్ఛేంద్రగడ్‌లో కొంతకాలముండమని చెప్పి, ''అక్కడ గూడ నీకు దర్శనమిస్తాను'' అన్నారు. అతడు మచ్ఛేంద్రఘడ్ వెళ్ళాక, ఒకనాడు ధ్యానమయ్యాక, సాయి అతనికి భౌతికంగా దర్శనమిచ్చారు. అతడు నమస్కరించుకోగానే ఆయన, "కేవలం నేను యీ దేహమేననుకుంటున్నావు. భక్తుడెక్కడ స్మరిస్తే అక్కడ నేనున్నానని తెల్పడానికే నిన్నిక్కడకు పంపాను'' అని చెప్పి అదృశ్యమయ్యారు. కొంత కాలానికి శిరిడీ బయల్దేరిన మాన్కర్‌కు పూనా రైల్వేస్టేషన్‌లో రద్దీవలన టిక్కెట్టు దొరకలేదు. ఇంతలో ఒక వ్యక్తి, తమవద్దనున్న టికెట్టు అతనికిచ్చి, పైకమిచ్చేలోగా అదృశ్యమయ్యాడు.

లాలా లక్ష్మీచంద్‌కు 1910లో ఒకరోజున కలలో గడ్డమున్న ఒక వృద్ధ ఫకీరు, ఆయన చుట్టూ భక్తులు కనిపించారు. ఒకసారి హరికథ చెబుతున్న దాసగణు ప్రక్కన బాబా పటం చూచి, తనకు దర్శనమిచ్చినది వారేనని గుర్తించాడు. సాయిలీలలు విని అతడు శిరిడీ వెళ్ళాలనుకుంటుంటే మిత్రుడు శంకర్రావు అతనిని గూడ శిరిడీ రమ్మని పిలిచాడు. లక్ష్మీచంద్ రూ. 15/-లు అప్పు తీసుకొని బయల్దేరాడు. రైలులో కొందరు భక్తులతో కలసి, వీరుగూడ భజన చేసారు. తర్వాత శిరిడీకి చెందిన ముస్లింలు కనిపిస్తే వారిని బాబా గురించే అడిగాడు. లక్ష్మీచంద్ శిరిడీ చేరాక సాయి అతనిని చూపి, "వీడెంత టక్కరి! ఒకవంక భజన చేస్తూనే నన్ను గురించి యితరులను అడుగుతాడు. ఏదైనా మనమే చూచి తెలుసుకోవాలి'' అని అతనితో, "నీ కల నిజమైందా లేదా? అప్పుచేసి శిరిడీ రావడమెందుకు?'' అన్నారు.

ఒకసారి మద్రాసునుండి కాశీ వెళ్తున్న భజన బృందం సాయిని దర్శించి భజన చేసారు. అందరూ బాబాయిచ్చే కానుకలకోసం చేస్తే, లక్ష్మి అనే ఆమె మాత్రం భక్తితో చేసింది. నాటి మధ్యాహ్నం సాయి ఆమెకు శ్రీరాముడిగా దర్శనమిచ్చారు. కాని అది ఆమె భ్రమేనని ఆమె భర్త గోవిందస్వామి అన్నాడు. నాటి రాత్రి అతనికొక చిత్రమైన స్వప్నం వచ్చింది, అతనికి పోలీసులు సంకెళ్ళు వేస్తుంటే సాయి చూస్తున్నారు. అతడు తనను రక్షించమంటే, పాపమనుభవించక తప్పదన్నారు బాబా. ఆ పాపాన్ని దహించి వేయమని అతను కోరాడు. అతనికంత విశ్వాసముంటే కన్నుమూసి తెరవమన్నారు సాయి. అలా చేయగానే అతడు విడుదలై, పోలీసులు చచ్చిపడియున్నారు. అతడు సాయి చేసిన మేలు మరచి సంతోషిస్తుంటే బాబా, "వీరిని చంపినందుకు శిక్షపడుతుందిలే!'' అన్నారు. అతడు భయంతో బాబా కాళ్ళు పట్టుకున్నాడు. ఆయన అతనిని మరొకసారి కన్నులుమూసి తెరవమన్నారు. అలా చేసేసరికి అతడి ఆపద తొలగిపోయింది. కృతజ్ఞతతో అతడు నమస్కరించగానే, ''మొదటి నమస్కారానికీ దీనికీ భేదమున్నదా?'' అన్నారు బాబా. మొదట ఆయన ముస్లిం అన్న శంకతోను, కాన్కలపై ఆశతోను, యీసారి విశ్వాసంతోనూ నమస్కరించానన్నాడతడు. "నీవు చాటుగా పంజా, తబూత్ వంటి ముస్లిం ప్రతీకలను పూజిస్తావు గదా?'' అడిగారు బాబా. అతడు సిగ్గుపడి తన గురువైన సమర్థ రామదాసస్వామి దర్శనం కోరాడు. సాయి అతనిని వెనుకకు తిరిగి చూడమన్నారు. చూస్తే అక్కడ ఆ స్వామి కనిపించి అతడు నమస్కరించాక అదృశ్యమయ్యారు. అప్పుడతడు, "బాబా, మీరెంతో వృద్ధులు. మీ వయస్సెంత?'' అన్నాడు. "ఏమిటి, నేను వృద్ధుడినా? నాతో పరిగెత్తు చూస్తాను!'' అని సాయి పరుగెత్తి అదృశ్యమయ్యారు. అంతటితో అతనికి బాబాపై భక్తి కలిగింది. ఈ కలలోని బోధయే ఆయనిచ్చే అసలైన కానుక.

★★★



ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 4

భక్త సులభుడు

భక్తులకు ఇహపర శ్రేయస్సు చేకూర్చడానికే వచ్చానని బాబా చెప్పేవారు. ఐహికమైన కోర్కెలతో బాబాను దర్శించరాదని చెబుతున్న భక్తునితో, "అలా చెప్పవద్దు. నా వద్దకు అందరూ మొదట అలానే వస్తారు. కష్టాలు, కోరికలూ తీరి జీవితంలో స్థాయి చిక్కాక నన్ననుసరించి సన్మార్గానికి వస్తారు" అన్నారు. అందుకే సాయి భక్త సులభుడు. భక్తులకెట్టి కఠోర నియమాలూ పెట్టక దర్శన స్మరణలతో ప్రసన్నులవుతారు.

రేగే అను భక్తుడు హైకోర్టులో జడ్జిగా పనిచేశాడు. ఉపనయనమైనప్పటినుండి అతడు ఆసన, ప్రాణాయామాలతో పాటు సూర్యుని బింబము మధ్యలో శ్రీమన్నారాయణుడున్నట్లు ధ్యానిస్తూండేవాడు. అతనికి 1910లో ఒకే రాత్రి మూడు కలలు వచ్చాయి : 1) అతడు తన శరీరము నుండి విడివడి, ఎదుట శ్రీమన్నారాయణుని చూస్తున్నాడు. 2) ఈసారి శ్రీమన్నారాయణుడు తన ప్రక్కనున్న ఒక వ్యక్తిని చూపి, 'ఈ శిరిడీ సాయి నీవాడు; ఆయననాశ్రయించు' అన్నాడు. 3) అతడు గాలిలో తేలి ఒక గ్రామం చేరాడు. ఒక వ్యక్తి కన్పించి అది శిరిడీ అని చెప్పి, అతనినొక మశీదుకు తీసుకెళ్ళాడు. అక్కడ సాయి కాళ్ళు చాపుకొని కూర్చొని వున్నారు. అతడు నమస్కరించగానే లేచి, అతనిని కౌగిలించుకొని, 'నీవు నా దర్శనానికి వచ్చావా? నేనే నీకు ఋణపడ్డాను; నేనే నీ వద్దకు రావాలి' అని అతనికి నమస్కరించారు. తర్వాత కొంతకాలానికి అతడు శిరిడీ వెళ్ళి బాబాకు నమస్కరించగానే ఆయన, 'అరే! మనిషిని పూజించడమేమిటి?' అని అతని సంశయముపై దెబ్బతీసారు. స్వప్నంలోలాగ తనను దగ్గరకు తీయలేదని నిరాశ చెంది, మధ్యాహ్నం బాబా ఒక్కరే వున్నప్పుడు ఆయనను దర్శించాడు రేగే. ఆయన అతనిని కౌగిలించుకొని, "నీవు నా వాడివి. క్రొత్తవారి ఎదుట బిడ్డలను దగ్గరకు తీయము" అన్నారు. అతని కల నిజమైంది. ఇష్టదైవం అతనికి సద్గురువును చూపాడు! అతని ఆనందానికి అవధులు లేవు. అతడు 1915లో రామనవమికి ఒక మస్లిన్ గుడ్డ తీసుకొని శిరిడీ చేరాడు. సహజంగా బాబా భక్తులిచ్చే గుడ్డలు ప్రసాదంగా తిరిగి వారికే యిచ్చేసేవారు. కాని తానిచ్చే గుడ్డను వారే వుంచుకోవాలనుకొని రేగే దానిని రహస్యంగా వారి ఆసనం క్రింద పెట్టాడు. బాబా అందరిచ్చిన గుడ్డలు తిరిగి యిచ్చివేసి, లేచి నిలబడి, ఆసనం దులిపివేయమన్నారు. అపుడు కన్పించిన ఆ మస్లిన్‌ను తీసి కప్పుకొని, "ఇది నాది! నేను కప్పుకొంటే బాగుండలేదూ?" అని అతనికేసి చూచి నవ్వారు. అలాగే ఒక గురుపూర్ణిమనాడు భక్తులందరూ బాబాకు మాలలు వేస్తున్నారు. తానేమీ తీసుకురాలేదని రేగే నొచ్చుకుంటుంటే బాబా తన మెడలోని మాలలన్నీ అతనికి చూపి, "ఇవన్నీ నీవే!" అన్నారు.

ఒకనాటి మధ్యాహ్నం రేగేను మశీదుకు పిలిపించి, బాబా ప్రేమగా "నా ఖజానా తాళంచెవి నీ చేతిలో పెట్టాను, నీకేమి కావాలో కోరుకో, యిస్తాను!" అన్నారు. రేగే వివేకంతో, 'అన్ని జన్మలలోనూ మీరు నాకు తోడుండాలి!' అన్నాడు. ఆయన, "తప్పక వుంటాను" అని సంతోషంతో అతని వీపు తట్టారు. నాటినుండి అతనికెప్పుడూ బాబా తన దగ్గరున్నట్లే వుండేది. అతని బిడ్డ చనిపోయినప్పుడు రేగే ఎదుట సాయి ప్రత్యక్షమై, "నీకు నేను కావాలా, బిడ్డ కావాలా? బిడ్డ కావాలంటే బ్రతికిస్తానుగాని, మనకెట్టి సంబంధమూ వుండదు. నీకింకా బిడ్డలు కలుగుతారు" అన్నారు. "మాకు మీరే కావాలి?" అన్నాడు రేగే. "అయితే దుఃఖించకు!" అని బాబా అదృశ్యమయ్యారు.

బల్వంత్ నాచ్నే మొదటిసారి శిరిడీ వెళ్తుంటే దారిలో ఒక స్టేషన్ మాస్టర్ కలసి, సాయి పట్ల మోసగాడని చెప్పడంతో నాచ్నే మనస్సు కలతపడింది. అతడు శిరిడీ చేరేసరికి సాయి లెండీ నుండి వస్తూ అతనిని చూచి, "మమల్తదార్‌కు చెప్పకుండా వచ్చావేమి? ఇలా ఎప్పుడూ చేయకు!" అన్నారు. ఆ మాట నిజమే! నాచ్నే అక్కడున్న మూడు రోజులలో యిలాంటి లీలలెన్నో చూచాడు. అతనికి బాబాపై విశ్వాసం కలిగింది.

అతడు 1915లో శిరిడీ వెళ్తుంటే, సామంత్ అనే వ్యక్తి సాయికివ్వమని ఒక కొబ్బరికాయ, రెండు అణాలు యిచ్చాడు. నాచ్నే కొబ్బరికాయ సాయికి సమర్పించాడు గాని దక్షిణ యివ్వడం మరచాడు. అతడు తిరిగి వెళ్ళేటప్పుడు సాయి, "మంచిది. వెళ్ళిరా! కాని ఆ పేద బ్రాహ్మణుడు యిచ్చిన రెండణాలు యివ్వవేమి? ఒప్పుకున్న పని సరిగా చేయి, లేకుంటే ఒప్పుకోకు!" అన్నారు. అతడవి తెచ్చి సమర్పించాడు.

సాయిని చాలాకాలం సేవించిన శ్రీమతి చంద్రాబాయి బోర్కర్ యిలా చెప్పింది : "మావారు 1909లో పండరిలో వున్నారు. నేను శిరిడీ వెళ్ళాను. ఒకరోజు బాబా, 'అమ్మా, నీవు వెంటనే పండరి వెళ్ళు. నేను తోడుగా వుంటాను. నాకు రైలు అక్కరలేదు' అన్నారు. నేను మరిద్దరితో కలసి వెళ్ళేసరికి మావారు అక్కడ పని వదలి ఎక్కడికో వెళ్ళిపోయారు. నా వద్దనున్న పైకంతో తిరిగి కురుద్వాడీ చేరి, దిక్కుతోచక స్టేషన్‌లో కూర్చున్నాను. ఒక ఫకీరు వచ్చి, 'ఆలోచిస్తావేమి? వెంటనే వెళ్ళు, మీవారు ధోండ్ స్టేషన్‌లో వున్నారు' అన్నాడు. నా దగ్గర చార్జీలు లేవంటే అతడు మూడు టిక్కెట్లు యిచ్చాడు. మేము ధోండ్ చేరేసరికి, మావారక్కడ కునుకు తీస్తుంటే కలలో ఫకీరు కన్పించి, 'నా తల్లినిలా అశ్రద్ధ చేయకు, యిప్పుడు రైల్లో వస్తుంది' అన్నారట. మావారు ఎదురొచ్చి నన్ను తీసుకెళ్ళారు. నా దగ్గరున్న సాయి పటం చూచి తనకు కన్పించినది వారేనన్నారు.

నేను 48 సం॥ల వరకూ గర్భిణిని కానేలేదు. బాబా 1918లో ఒకసారి, 'తల్లీ, నీకేమి కావాలి?' అన్నారు. 'మీకు తెలుసు!' అన్నాను. ఆయన సరేనన్నారు. తర్వాత 3 సం॥లకు నాకు ఋతుక్రమం ఆగిపోయింది. ఆ వయస్సులో గర్భం అవదని, అది వ్రణమనీ వైద్యులన్నారుగాని నేను పది మాసాల వరకు శస్త్రచికిత్స చేయించు కోనన్నాను. చిత్రం! నాకు సకాలంలో సుఖప్రసవమైంది.

అలానే మరొకసారి కలలో బాబా, 'నీ రాముని తీసుకుపోతాను. నీవు ధైర్యంగా నీ విధి నిర్వర్తించు!' అన్నారు. బాబా చెప్పినట్లే చాతుర్మాస్యంలో మావారికి ప్రమాదంగా జబ్బు చేసింది. ఆయన కోరిక ప్రకారం చాతుర్మాస్యం వెళ్ళేదాకా మా వారిని నిలుపమని బాబాను కోరాను. చాతుర్మాస్యమైన ఏడవ రోజున మావారు టీ త్రాగి విష్ణు సహస్రనామము, ఆరతి చదివించుకొని విన్నారు. డాక్టర్లు ప్రమాదం తప్పిందన్నారుగాని, నాకు బాబా చెప్పింది గుర్తొచ్చి గంగ వేశాను. ఆయన, 'శ్రీరామ్' అంటూ కన్నుమూశారు". అంటే ఆమెపై ప్రేమతో ఆమె భర్తనుగూడ సాయి అనుగ్రహించారన్నమాట!

అన్వర్‌ఖాన్ ఖాజీ (అహ్మద్‌నగర్) సాయిని దర్శించి, తేలీకాకూట్ అనేచోట ఒక మశీదును పునరుద్ధరించడానికి ధనం కోరాడు. బాబా అతనితో, "ఆ మశీదు ఎవరినుండీ ధనం స్వీకరించదు. తానే యిస్తుంది. అక్కడ నింబారు క్రింద మూడడుగులు త్రవ్వితే నిధి లభిస్తుంది" అన్నారు. తర్వాత బాబా చెప్పినది అక్షరాలా నిజమైంది. మరొకసారి 'మీరాన్' (ఖాందేష్ జిల్లా) నుండి మద్దూషా ఫకీరొచ్చి అత్యవసరంగా రూ. 700/- లు కావాలని చెప్పి దుఃఖించాడు. ఆ పైకం బాపూసాహెబ్ జోగ్‌ను ఇవ్వమన్నారు సాయి. అతడాపైకం సాయికి యిచ్చాడు. దానిని ఆ ఫకీరుకివ్వమని గులాబ్, లక్ష్మణ్ అనే యువకులకిచ్చారు సాయి. వారు దానిలో రూ. 200/- లు తీసుకొని మిగిలినది మాత్రమే ఫకీరుకిచ్చారు. అతడెంత గోల పెట్టినా సాయి పలుకలేదు. అతడు కాలి నడకన వెళ్తుంటే నీమ్‌గాఁవ్ వద్ద అతనికి

"ఇగ్రస్ షా అనే పార్శీభక్తుడెదురై భిక్ష, 200/-లు సమర్పించాడు. కారణం ఆ ముందటి రాత్రి ఇగ్రస్‌షాకు సాయి కలలో కన్పించి టాంగాలో శిరిడీ వెళ్ళమని, నీమ్‌గాంవ్ దగ్గర ఎదురయ్యే ఫకీరుకు భోజనము, రూ. 200/- లు యివ్వమనీ చెప్పారు.

మరొకసారి లాసూర్‌నుండి వచ్చిన ముస్లిం రూ. 4000/-లు కావాలని ఏడ్చాడు. తామిచ్చినా అతనికి దక్కదని సాయి ఎంత చెప్పినా అతడు వినలేదు. 'రేపు ఉదయం మఱ్ఱిచెట్టు దగ్గరకెళ్ళు, లంకెబిందె దొరుకుతుంది' అన్నారు బాబా. అతడు నమ్మలేదు గాని, ఆ చెట్టు దగ్గరకెళ్ళాడు. అక్కడొక లంకెబిందె కన్పించింది! దానిని మోయలేక మరొకరిని తోడు తీసుకు వెళ్ళేసరికి అదక్కడ లేదు. అతడేడుస్తూ వచ్చి బాబాతో చెప్పాడు. దానిని రూయీ గ్రామస్థుడొకడు తీసుకుపోయాడన్నారు సాయి.

శిరిడీ సమీపంలోని కొర్హాలానుండి రోజూ ఆరతి, భజనలకు పిలాజీ గురవ్ శిరిడీ వస్తుండేవాడు. అతని భార్యకొకరోజు సాయి కలలో కన్పించి, అర్ధరూపాయిచ్చి, "దీనిని డబ్బుల సంచీలో పెట్టుకో, లోటుండదు" అన్నారు. ఆమె తన బాబుకొకగుడ్డ యివ్వమన్నది. "తర్వాత యిస్తాలే!" అన్నారాయన. ఆ రాత్రే గురవ్‌కు గూడ కలలో కన్పించి, "శిరిడీలో స్థిరపడండి, మీకే లోటూ రాదు" అన్నారు. మరురోజే వాళ్ళు శిరిడీ వచ్చేసారు. పిలాజీ రోజూ బాబా వద్ద సన్నాయి వాయించేవాడు. సాయి సమాధి చెందినప్పుడు కప్పిన గుడ్డ వారి కుమారునికి లభించింది. బాబా అలా తమ మాట నిలుపుకొన్నారు.

ఆత్మారాముని భార్య తగువు పెట్టుకొని, చాలా సం॥లు పుట్టింట్లోనే వున్నది. అతడు 1913లో తన తమ్ముడు బి. వి. వైద్య చెబితే బాబాను దర్శించి ఊదీ, ప్రసాదము తన భార్యకు పంపాడు. చిత్రం! అవి చేరగానే ఆమె భర్త యింటికి వచ్చేసి, "ఇదే నా యిల్లు! పుట్టింట్లో సుఖమేమున్నది?" అన్నది. నాటినుండి వారు సుఖంగా వున్నారు.

హరిభావూ ఫన్సే ఒక కలరా రోగికి బాబా ఊదీ యిస్తే ఆ వ్యాధి తగ్గడంతో రోగులెందరో వచ్చి అతని వద్ద నున్న ఊదీ అంతా తీసుకుపోయారు. ఇంకేమి చేయాలా అని అతడు కంగారుపడుతుంటే, నాటితో ఊళ్ళోనే ఆ వ్యాధి లేకుండా పోయింది. తర్వాత ఫన్సే ప్రక్కగ్రామంలో ఒక మిత్రుని వద్దకు వెళ్ళాడు. ఆ మిత్రుని తమ్మునికి ఎంతో ప్రమాదంగా జబ్బుచేసి ఏమి చేసినా తగ్గడంలేదు. అతని స్నేహితుడు, "సాయి మహాత్ముడైతే నీద్వారా నా తమ్ముణ్ణి కాపాడాలి" అన్నాడు. రోగి పరిస్థితి ప్రమాదంగా వుండడం వలన ఫన్సే తప్పించుకోజూచాడు గాని వీలుపడలేదు. నాటిరాత్రి ఆ రోగియే శ్రీసాయి పూజకు అన్ని ఏర్పాట్లూ చేసి, పూజంతా శ్రద్ధగా చూస్తూ కూర్చున్నాడు. ఎలాగైనా తప్పించుకోవాలని ఫన్సే ఎంత ఎక్కువ ఫీజు అడిగినా వాళ్ళు అంగీకరించారు. నాటి రాత్రి కలలో సాయి కన్పించి ఫన్సేకు మందు తెలిపారు. దానితో ఆ వ్యాధి తగ్గిపోయింది.

బాబాను నమ్మినవారికి తప్పక న్యాయం చేకూరుతుంది. గుహడా అనే ఊళ్ళో ఒక బ్రాహ్మణునికి ఒక చిన్న నేరానికి మరణశిక్ష విధించారు. అతని మిత్రుడైన ముస్లిం శిరిడీ వెళ్ళి సాయికి చెప్పుకుంటే ఆయన, "భగవంతుడు నాల్గు రోజులలో కరుణిస్తారు" అన్నారు. అతడు అప్పీలు చేసుకుంటే, సరిగా నాలుగవ రోజుకల్లా శిక్ష రద్దయింది. అలానే ఒకప్పుడు బాంద్రాలోని కుదువ వ్యాపారులు కొందరు వ్యాపారంలో అక్రమాలు చేశారు. కాని వారితోపాటు ఆదందలాలికి గూడ నిష్కారణంగా శిక్ష పడేలా వున్నది. అతడు ఒక భక్తుని యింట బాబా పటానికి మోకరిల్లి, "నేను నిర్దోషిని, నన్ను రక్షించు" అని ప్రార్థించాడు. అందరిలో అతనికొక్కడికే శిక్ష తప్పి పరువు నిలచింది. అతడు సంతోషంగా టీ త్రాగడానికి వెళ్తుంటే కూడా ఒక ఫకీరు వచ్చారు. కాని హోటల్‌వద్ద ఆదమ్ వెనుకకు తిరిగి చూసేసరికి ఆ ఫకీరు కన్పించలేదు.

కాకాసాహెబ్ దీక్షిత్ 1910లో శిరిడీలోని కొంతభూమి బేరం చేసాడు. ఆసామి లక్ష్మణ్‌భట్ దాని వెల రూ. 200/- లు చెబితే, దీక్షిత్ రూ.150/-లకు అడిగాడు. బేరమెంతకూ తెగలేదు. భట్ మశీదుకు వెళ్ళినపుడు సాయి, 'ఎందుకలా వాదించుకుంటారు? మధ్యేమార్గంగా పొండి. నీవు రూ.175/-లకు తగ్గవద్దు'' అన్నారు. కాని అతడా విషయం దీక్షిత్‌కు చెప్పలేదు. చివరకు రూ. 150/-కి కొనుగోలు జరిగింది. కాని లక్ష్మణ్ యింటికి వచ్చి డబ్బు లెక్క పెట్టుకుంటే రూ. 175/-లు వున్నది.

తుర్ఛేగాఁవ్‌లో శాంతాబాయికి వేలుమీద ఎముక కుళ్ళి చీము కారుతుండేది. ఆమెకు ఒకరోజు కలలో బాబా కన్పించి, ''దేకామాలి'' ఆకు పసరు పూసుకోమన్నారు. అలాచేస్తే ఆ పుండు త్వరలో తగ్గిపోయింది. ఆ విషయం ఆమె సెప్టెంబరు 1918లో బాబాకు జాబు వ్రాసింది. ముల్కీ అనే గ్రామంలో వెంకట్రావు అనే భక్తుడు ఒకరోజు గుండెపోటు వచ్చి పడిపోయాడు. ఆ స్థితిలో అతనికి బాబా, ఇద్దరు సేవకులు దర్శనమిచ్చారు. అతడు వారిస్తున్నా వినకుండా ఆ సేవకులు అతని కాళ్ళు వత్తారు. తరువాత వెంకట్రావు 1918లో శిరిడీ వెళ్ళినపుడు సాయివద్ద ఆ సేవకులిద్దరినీ చూశాడు. అంతవరకు తన తండ్రియొక్క భక్తి విశ్వాసాలను విమర్శిస్తూ వున్న వెంకట్రావు ఆస్తికుడు, సాయి భక్తుడయ్యాడు. అతనికి ఏ కష్టమొచ్చినా సాయికి వ్రాస్తే ఆ జాబు బాబాకు చేరగానే కష్టం తొలిగేది.

★★★

★ గురువారం పారాయణ సమాప్తము ★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

★ శుక్రవారం పారాయణ ప్రారంభం ★

శ్రీ సాయి లీలామృతము



అధ్యాయము - 5

సర్వజ్ఞుడు

శ్రీసాయి పిచ్చి ఫకీరులా కన్పించినా, వారి దివ్య లీలలెన్నో ఆకాశంలో నక్షత్రాలలా, సముద్ర తీరాన యిసుక రేణువులలా, మనస్సులో పుట్టే ఆలోచనలలా భక్తులకనుక్షణమూ అనుభవమవుతూ, వారి హృదయాలను పులకింప జేస్తుండేవి. అవి ఆయన ప్రయత్నంతో ప్రదర్శించినవి గాక పువ్వులకు పరిమళంలాగా, ఆకాశంలోని సంధ్యారాగంలా ఎంతో సహజంగానూ, సందర్భోచితంగానూ వుండేవి. వజ్రాల హారంలోని బంగారు తీగలా, పూలమాలలోని దారంలా యీ లీలలన్నింటిలో శ్రీసాయినాథుని సర్వజ్ఞత్వం అడుగడుగునా తొంగిచూస్తూ వుంటుంది. దానిని గుర్తించు కోగలవారు ఎవరినీ ఏమీ అడగనక్కరలేదు.

సాయిబాబా ఒకరోజు నాగపూర్‌లో వున్న మహనీయుడు తాజుద్దీన్‌బాబా గురించి మాట్లాడుతూ, సట్కాతో ప్రక్కనున్న నీటికుండను పదే పదే తట్టారు. కారణం అడిగితే 'తాజుద్దీన్ కుటీరం అంటుకుంటే ఆర్పుతున్నాను' అన్నారు. తర్వాత అది యదార్థమని తెలిసింది. మరొకరోజు లెండీకి వెళ్ళే సమయమైనా బాబా మసీదులో గోడ ప్రక్కనే నేలమీద పడుకున్నారు. కారణమడిగితే, 'నా సోదరుడు గజానన్ మహరాజ్ (షేగాం) పరమపదించారు' అన్నారు. త్వరలోనే అది నిజమని తెలిసింది. నాటి శృంగేరి శంకరాచార్యస్వామిచేత సాక్షాత్తూ దత్తాత్రేయ స్వరూపమని కీర్తించబడిన శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి రాజమండ్రిలో విడిది చేశారు. నాందేడ్ నుండి 'పుండలీకరావు' (దాసగణు) వారిని దర్శించాక తాను శ్రీ సాయిని గూడ దర్శిస్తుంటానని చెప్పాడు. ఆ స్వామి ఎంతో సంతోషించి, "సన్యాసులమైన మేము ఎవరికీ నమస్కరించము. కాని శ్రీ సాయి విషయం వేరు. ఈ కొబ్బరికాయ మా తరపున వారికి సమర్పించు. ఈ తమ్ముణ్ణి ఎప్పుడూ ప్రేమగా గుర్తుంచుకొమ్మని చెప్పు!" అని అతడికి ఒక కొబ్బరికాయ యిచ్చారు. తర్వాత అతడు, అతని మిత్రులూ మన్మాడ్‌లో దిగి, సమీపంలోని ఏటిదగ్గర కారపు అటుకులు తింటూ, పొరపాటున ఆ కొబ్బరికాయ కొట్టి, అందులో కలుపుకొని తిన్నారు. వాళ్ళందరూ శిరిడీ చేరగానే సాయి అతనిని చూస్తూనే, "నా సోదరుడు పంపిన కొబ్బరికాయ ఏది?" అన్నారు. అతడు తాను చేసిన తప్పు చెప్పుకొని, క్షమాపణ వేడుకొని, దానికి బదులు మరొక కాయ సమర్పిస్తానన్నాడు. బాబా, "నా సోదరుడిచ్చిన కాయకు మరేదీ సాటి కాజాలదు. అయినా జరిగినదానికి బాధపడకు, అంతటికీ భగవంతుడే కర్త!" అన్నారు. కన్నడ దేశంలోని వాడ్గాంలో విడిది చేసిన అప్పా అనే మహాత్ముని గురించి, బెంగాల్‌లోని శ్రీ రామకృష్ణ పరమహంస గురించి, పూనాలోని హజరత్ బాబాజాన్ గురించి - యిలా యింకెందరి గురించో సర్వమూ వారికి తెలుసు. పూనాలోని భీమశంకర ఆలయంలో వున్న ఒక సాధువును గాడ్గిల్ దర్శిస్తుండేవాడు. ఆయన ఒకసారి అతనిని శ్రీ సాయి దర్శనానికి పంపారు. అతడు శిరిడీ చేరి, "ఇక్కడ ఏ మహాత్ముడైనా వున్నారా?" అని విచారిస్తే, "ఇక్కడి మశీదులో ఒక పిచ్చి ఫకీరు మాత్రమున్నాడు" అని చెప్పారు. శ్రీ సాయి ముస్లిమని సంశయిస్తూనే గాడ్గిల్ మశీదు చేరాడు. అప్పుడు బాబా, "నీవీ మశీదులోకి రావద్దు. నేను ముస్లిమును, నీవు ఆ భీమశంకరాలయంలోని సాధువు కాళ్ళమీదే పడు!" అని కేకలేసారు. అలానే ఆయన ఒకరోజున పండ్లు, మిఠాయిలు కొని అందరికీ పంచారు. కారణమడిగితే, "ఈరోజు ఒక మహాత్ముని దర్బారునుండి ఒకడు యిక్కడకు వచ్చాడు" అన్నారు. విచారిస్తే అచ్చటివారిలో హుబ్లీలోని

శ్రీ గురు సిద్ధారూఢుల శిష్యులొకరు వున్నారని తెలిసింది.

ఇంతటి మహనీయులందరి గురించి అనుక్షణమూ తెలుసుకొనగల సాయికి సామాన్యులైన సాధువుల గురించి గూడ తెలుసు. ఆయన మహిమ విని 1911లో హరిద్వార్ నుండి సోమదేవస్వామియనే సాధువు శిరిడీ బయల్దేరాడు. అతడెక్కిన టాంగా శిరిడీని సమీపిస్తుండగా అచ్చటి మశీదుపై కట్టిన జెండాలు దూరం నుండి చూచి, "ఈయన నిజమైన సాధువైతే తన కీర్తిని యిలా చాటుకోడు. ఇలాంటి వాణ్ణి చూడనైనా కూడదు" అన్నాడు. కాని సాటివారి బలవంతంపై సాయిని దర్శించగానే అతడి హృదయం శాంతిని పొంది ఆనందభాష్పాలు కారాయి. అలా చిత్తశాంతినివ్వగలదే యోగ్యమైన స్థలమని తన గురువు చెప్పిన వాక్యం అతనికి గుర్తొచ్చింది. కాని సాయి కోపంతో, "జెండాలు ప్రదర్శించుకునే యీ కపట సాధువును చూడనైనా కూడదు. తిరిగి నీ స్వస్థానానికి వెళ్ళిపో! ఈ మశీదులోకి వచ్చావో జాగ్రత్త!" అని గద్దించారు. అతడు ఆయన సర్వజ్ఞత్వం చూచి, పశ్చాత్తాపంతో శరణు వేడాడు. అప్పుడతనిని మశీదులో ప్రవేశించనిచ్చారు బాబా.

భక్తుడు రేగే 1914లో మిత్రుడు అవస్తేను ప్రోత్సహించి శిరిడీ తీసుకెళ్ళాడు. దారిలో ఒక స్టేషన్లో సైనికాధికారి రైల్లోని ప్రయాణీకులను దింపి సైనికులను ఎక్కిస్తున్నాడు. కాని చిత్రంగా అతను వీరిద్దరినీ తిరిగి రైలెక్కించాడు. రేగే రాత్రంతా భజన చేశాడు. వారు శిరిడీ చేరగానే రేగేను చూపుతూ సాయి, "అతడికి ఎవరినైనా వెంట తీసుకొస్తేగాని తృప్తిలేదు. వాళ్ళు నా బిడ్డలను రైల్లోంచి దింపేయాలని చూచారు. కాని వీళ్ళిద్దర్నీ దింపవద్దని ఆ సైన్యాధికారితో చెప్పాను" అన్నారు. రేగేను చూపుతూ, "నాకు రాత్రంతా నిద్రలేదు. నా పడకచుట్టూ 'బాబా' 'బాబా' అన్న యితడి కేకలే!" అన్నారు.

మనం చేసేది ఎవరికి తెలియకున్నా మనకు తెలుస్తుంది. అలా మనలో అన్నీ తెలుసుకొనేది సాయియే. ఒకసారి శ్రీమతి కణీత్కర్ ద్రాక్షపండ్లు సమర్పిస్తే బాబా ఎంతో ప్రీతితో తీసుకున్నారు. కాని వెంటనే అందులోంచి కుళ్ళిన పండ్లు మాత్రమే తీసుకొని మిగిలినవి తిరిగి యిచ్చి, "ఇవి నీ బిడ్డలకిచ్చుకో!" అన్నారు. ఆమె బాధపడుతూ యిల్లు చేరాక వాళ్ళ అమ్మాయి, 'అమ్మా! నీవా పండ్లు బాబాకివ్వగానే, 'అయ్యో! బాబా ఆ పండ్లన్నీ అందరికీ పంచేస్తారు. ఆయన తిన్నట్లు గాదు, మనం తిన్నట్లూ గాదు' అనుకున్నాను!" అన్నది. ఆమె భావం కన్నతల్లికి తెలియకున్నా సాయికి తెలుసు! ఒకసారి గాడ్గిల్ మామిడి పండ్లు సమర్పిస్తే తీసుకొని, "ఆహా! ఇతడు కొన్న పండ్లన్నీ నాకే సమర్పించాడు. కాని పండిట్ నా కోసం కొన్న పండ్లలో కొన్ని తిని, మిగిలినవిచ్చాడు!" అన్నారు. పండిట్ సిగ్గుతో తలవంచుకున్నాడు.

చోల్కర్ అనే పేదగుమాస్తా, తాను పరీక్షలో పాసై ఉద్యోగమొస్తే శిరిడీ వచ్చి కలకండ పంచుతానని మ్రొక్కుకున్నాడు. అతని కోరిక నెరవేరింది. అతడు నిత్యమూ 'టీ' లో చక్కెర వేసుకోవటం మానివేసి, అలా కూడబెట్టిన పైకంతో శిరిడీ చేరి, కలకండ పంచాడు. తర్వాత జోగ్‌తో, "ఇతనిని తీసుకెళ్ళి, చక్కెరెక్కువ వేసిన 'టీ' యివ్వు" అన్నారు బాబా. దాసగణుకెంతో ఆచారం. అతడు ఉల్లి తినేవాడు గాదు. ఒకసారి బాబా అతనిని ఉల్లిపాయ, శెనగపప్పు కలిపి ('పితలా') వండి, కొంచెం తిని, తర్వాత తమకు తెమ్మన్నారు. అతడది తేగానే, నీవు తిన్నావా?" అన్నారు. అతడు తిన్నానన్నాడేగాని నిజానికి అతడు అందుకు ప్రత్యామ్నాయంగా దానిని వేలుతో తాకి పెదవికి, గడ్డానికీ అనించుకొని ముఖం కడుక్కున్నాడు. బాబా నవ్వి, అతడు చేసినది చేసి చూపారు. ఉల్లి అతనికి ఎంతో మేలు చేస్తుందని, తినమనీ చెప్పారు. ఒకసారి దీక్షిత్ మశీదుకు రాగానే బాబా, "నీవు తాంబూల మివ్వలేదు" అని అడిగి తీసుకున్నారు. గదిలో తాను పూజ చేసినప్పుడు తాంబూలం అర్పించడం మరచానని అతనికి అప్పుడు గుర్తొచ్చింది.

భిక్కుబాయి తెచ్చిన పూలమాల, నివేదన బాబా స్వీకరించలేదు. అవి స్వీకరించమని బ్రతిమాలిన భక్తులతో ఆయన, "ఈమె గోదావరివద్ద శోకంతో నన్ను నిందించింది. అలా తెచ్చినవి నాకొద్దు!" అన్నారు. ఆమె పట్టుదలంగా మాల వేయబోతే, అది మూడు ముక్కలై క్రింద పడింది! నిజమే! సాయి తన స్నేహితురాలైన రాధాకృష్ణ ఆయి ప్రాణం కాపాడలేదని ఆమె కోపర్గాంలోని గోదావరి వద్ద సాయిని నిందించి, శోకించి, తర్వాత ఆ మాల నివేదన తీసుకొని శిరిడీ వచ్చింది. అలానే ఒక లాయరు వచ్చి నమస్కరించగానే సాయి, "కొందరెంత దొంగలో! పాదాలమీద పడి దక్షిణ సమర్పిస్తారు. వీపు వెనుక వాళ్ళే విమర్శిస్తారు" అన్నారు. పండరిపురంలో ఒక పెద్దమనిషి తన జబ్బు తగ్గించమని సాయినాశ్రయించటం మూఢ నమ్మకమని విమర్శించాడా లాయరు.

సదాశివ్‌కు ఉదయం 9 గంటలకే భోజనం చేయడం అలవాటు. కనుక ఆ రోజు 11 గంటలు కావటంతో అతనికెంతో ఆకలిగా వుంది. కాని అతడు బిడియంతో మశీదులోనే కూర్చుండిపోయాడు. ఇంతలో ఒక భక్తుడొచ్చి బాబాకు పాలకోవా సమర్పించాడు. సాయి దానిని ఆత్రంగా అందుకొని సదాశివ్‌కు ఒక బిళ్ళ విసిరారు. అతడు దానిని ప్రసాదంగా యింటికి తీసుకెళ్ళాలనుకున్నాడు. "అది నీకిచ్చింది చేతిలో పట్టుకోవడానికి గాదు!" అన్నారు బాబా. అది తిన్నాక అతనికి మరో బిళ్ళ విసిరారు. అతడది యింటికి ప్రసాదంగా వుంచుకోగానే మరల సాయి అలానే అన్నారు. అదికూడా తినగానే అతనికి ఆకలి తీరింది.

ఒకసారి హరిభావూ తన తల్లికి చెప్పకుండా రామేశ్వరం బయలుదేరి, దారిలో శిరిడీ వచ్చాడు. సాయి అతని వద్దనున్న డబ్బంతా దక్షిణగా తీసుకొని, 'ఇంటికి వెళ్ళు, రామేశ్వరం నీ కోసం వస్తుంది. నీవు వెళ్ళకుంటే మరణిస్తుంది' అన్నారు. అతడిల్లు చేరేసరికి అతని తల్లి నిరాహారియై, 'బాబా, నీవు మహాత్ముడివైతే నా బిడ్డ తిరిగి రావాలి' అని రోజూ ప్రార్థిస్తున్నదని తెలిసింది. తల్లి రామేశ్వరమంత పవిత్రమైనదని బాబా భావం.

సాఠే శిరిడీలో తానుకొన్న స్థలం చూడ్డానికి తన భార్యను బయలుదేరమన్నాడు. ఇంతలో అతని మామగారు, ఆడపిల్ల స్థలం చూచేదేమిటని అడ్డు చెప్పడంతో ఆమె రానన్నది. తన మాట కాదన్నదన్న కోపంతో ఆమెను కొట్టడానికి కొరడా తీసుకున్నాడు సాఠే. ఆ క్షణమే అతనిని మశీదుకు రమ్మనమని బాబా కబురు పంపారు. అతడు వెళ్ళగానే ఆయన, "ఏమిటి నీ గోల? అమ్మాయి స్థలం చూడకపోతేనేమి?" అని మందలించారు. తన యింట జరిగే ప్రతిదీ ఆయనకు తెలుస్తుందని సాఠే గుర్తించాడు. అలానే ఒకసారి శ్రీమతి ప్రధాన్ ఆయనకు పాదపూజ చేస్తుండగా, "నీవు వెంటనే యింటికెళ్ళు" అన్నారు బాబా. ఆమె వెళ్ళేసరికి పాప గుక్కపెట్టి ఏడుస్తున్నది. ఆమె పాపను సముదాయించి మరలా మశీదుకు వెళ్ళింది. "ఇప్పుడు పూజ పూర్తి చేసుకో!" అన్నారు సాయి.

నూల్కర్ మొదటిసారి శిరిడీ వెళుతూ దక్షిణగా రూ. 20/-లు బాబాకు సమర్పించాలనుకున్నాడు. సాయిని దర్శించి, ఆయన కళ్ళలోకి చూస్తూనే, అంతటి మహాత్ముణ్ణి దర్శించుకోగలగడం మహాభాగ్యమనుకున్నాడు. బాబా వెంటనే దక్షిణ కోరారు. అతడొక బంగారు నాణెమిచ్చాడు. సాయి దానిని త్రిప్పిచూస్తూ, "దీని విలువెంత?" అన్నారు. "పదిహేను రూపాయలు" అన్నాడు నూల్కర్. సాయి దానిని తిరిగిచ్చి, 'ఇది నీవుంచుకొని రూపాయలివ్వు!' అన్నారు. అతనిచ్చిన రూ. 15/-లు తీసుకొని, "నాకు. రూ. 10/-లే ముట్టాయి. ఇంకా రూ. 5/-లు యివ్వు" అన్నారు. అతడిచ్చాడు. ఆ విధంగా అతడివ్వదలచిన రూ. 20/-లే తీసుకున్నారు బాబా. అలానే శ్రీమతి బాపత్ నాలుగణాలు యిచ్చినప్పుడు ఆయన నవ్వుతూ, 'మిగిలిన నాలుగణాలివ్వక యీ పేద బ్రాహ్మణ్ణెందుకు మోసగిస్తావు?' అన్నారు. ఆమె సిగ్గుపడి మరో నాలుగణాలిచ్చింది. కారణం మొదట ఆమె ఎనిమిది అణాలివ్వదలచిందట!

ఒక భక్తుడు బాబాకు దక్షిణగా శ్యామా పేరిట రూ. 2/-లు మనియార్డర్ పంపాడు. అది చేరినప్పుడు

బాబా భిక్షకు వెళ్ళారు. ఆయన సర్వజ్ఞతను పరీక్షించదలచి, శ్యామా ఆ కాసులు మశీదు ముంగిట పాతిపెట్టాడు. ఆయన వాటి విషయమై ఏమీ అనలేదు. ఆరుమాసాల తర్వాత శ్యామా యింట దొంగలుపడి సర్వం దోచుకు పోయారు. అతడు బాబాతో మొరపెట్టుకొంటే ఆయన నవ్వుతూ, "నీ యింట దొంగలు పడితే చెప్పుకోడానికి నేనైనా వున్నాను. నావి రూ. 2/-లు పోయి 6 మాసాలైంది. నేనెవరికి చెప్పుకోను!" అన్నారు. "అంత చిన్న తప్పుకు యింత పెద్ద శిక్షా?" అన్నాడు శ్యామా. "నీలాంటి ఉద్యోగికి అదెంతో, నాలాటి ఫకీరుకు రూ, 2/-లు అంతే" అన్నారు సాయి. కర్మసూత్రమెంత సూక్ష్మమో!

అందరినీ దక్షిణడిగిన బాబా కొలంబేను మాత్రం అడగలేదు. తాను త్రాగుడు మానినందుకు సాయి తననలా గౌరవించారని అతడు గొప్పలు చెబుతున్నాడు. సాయి వెంటనే అతనిని పిలిపించి, రూ. 2/-లు అడిగి తీసుకొన్నారు! గర్వము గూడా దోషమే! మరొక భక్తుడు సాయి దక్షిణకోరితే లేదని చెప్పవచ్చుని, తన దగ్గరున్న డబ్బు కొలంబే వద్ద దాచాడు. వారిద్దరూ మశీదుకు చేరగానే సాయి అతడికి కొలంబేను చూపి, "అతనివద్ద తీసుకొని రూ. 2/-లు దక్షిణివ్వు" అని చెప్పి తీసుకొన్నారు.

దాసగణు శిరిడీ వెడుతుంటే కోపర్గాంవ్‌లో స్టేషన్ మాష్టర్, సాయిని పిచ్చి ఫకీరని నిందించాడు. బాబాను స్వయంగా చూచి మాట్లాడమని చెప్పి, దాసగణు అతనిని శిరిడీ తీసుకొచ్చాడు. సాయి మశీదులోని కుండలన్నీ బోర్లిస్తున్నారు. కారణమడిగిన స్టేషన్ మాష్టర్‌తో,"నా దగ్గరకు వచ్చే కుండలన్నీ తలక్రిందులుగానే వస్తున్నాయి" అన్నారు. అంధమైన అవిశ్వాసంతో వచ్చేవారి హృదయాలు బోర్లించిన కుండలు, వాటిని జ్ఞానంతో నింపడం సాధ్యంగాదు. విశ్వాసంతో గాని, లేక కనీసం జిజ్ఞాసతోగాని వచ్చేవారి హృదయాలు సరియైన కుండలు, వాటిని నింపవచ్చు. కాని చిత్రం, ఆ మాటతో సాయి అతని హృదయమనే కుండను సరిజేశారు, విశ్వాసంతో నింపారు.

ఒకడు సాయి నిష్కారణంగా కోపించడం చూచి ఆయన పిచ్చివాడని తలచి, తానిచ్చిన దక్షిణంతా తిరిగి తీసుకోవాలనుకున్నాడు. కాని బాబా అతడడుగక ముందే అతని భార్యకు పైకమిచ్చి, "ఇంతవరకూ మీరిచ్చిన దక్షిణ నాకొద్దు, తీసుకో!" అన్నారు.

ఇంతవరకూ ఎక్కడెక్కడో వున్న మానవుల యొక్క పరిస్థితులు హృదయగతభావాలు బాబాకు అనుక్షణమూ తెరచి వున్న పుటలలాగా ఎలా తెలుస్తుండేవో గమనించాము. ఎక్కడెక్కడ ఏ భక్తులు ఆపదలో వున్నారో వారికేమి జరుగనున్నదో ఆయనకు తెలుసు. వాళ్ళకు శ్రేయస్కరమైతే, అట్టి ఆపదను నివారిస్తుండేవారు. ఎప్పుడైనా బాబా తమ చేతులు శంఖంలా కలిపి వూదితే అది ఏభక్తుని మరణమో సూచించేది. ఒకరోజు ఆయన అలా చేసి, "నానా చావనున్నాడు. కాని నేను చావనిస్తానా?" అన్నారు. నాటికి 8వ రోజున నానా చందోర్కర్ శిరిడీ వచ్చాడు. సరిగా బాబా అలా అన్నప్పుడే తానెక్కిన గుఱ్ఱపు బండి తలక్రిందులై, అతడు గుఱ్ఱం కాళ్ళవద్ద పడ్డాడు. అయినా అతనికెట్టి ప్రమాదమూ జరుగలేదని చెప్పాడు. ఒకసారి ఆయన తమకు కడుపు నొప్పిగా వున్నదని చెప్పి, ఒక గుడ్డ పొట్టకు చుట్టుకొని, భక్తులను కొసలు పట్టుకొని యింకా యింకా గట్టిగా లాగమని చెప్పి, చివరికి బాధ తగ్గిందన్నారు. అదే సమయంలో నీమ్‌గాంవ్‌లో ఒక భక్తురాలు ప్రసవవేదనపడి, ఆయన నొప్పి తగ్గినదన్న సమయంలోనే ప్రసవించిందని తర్వాత తెలిసింది. భక్తుల బాధలు గూడ ఆయనవే. ఒకరోజు ఆయన ప్రధాన్‌తో, "నా శరీరంలోని యీ ప్రక్కంతా నొప్పిగా వుంది. నాల్గురోజులలో తగ్గుతుందిలే!" అన్నారు. వారం తర్వాతగాని అతనిని యింటికి పోనివ్వలేదు. అతడు యిల్లుచేరాక తెలిసింది - సరిగ్గా బాబా అలా అన్న సమయంలోనే బొంబాయిలో అతని తల్లికి పక్షవాతం వచ్చింది. ప్రధాన్ శిరిడీలో వున్నంతవరకూ ఆమెకెట్టి ప్రమాదమూ జరుగదని, అవసరమైతే అతనిని సాయియే పంపగలరనీ నానా చందోర్కర్ ఆ యింటివారికి ధైర్యం చెప్పాడు. ఆ వారంలో ఆమె పరిస్థితి విషమించింది.

ఆమెకు విరోచనమైతే మంచిదని వైద్యులన్నారు. సరిగ్గా సమయానికి ప్రధాన్ యిల్లు చేరి, ఆమెకు తీర్థప్రసాదాలివ్వగానే నాల్గవరోజున జబ్బు తగ్గింది. అలానే సాయి ఒకనాడు మహల్సాపతితో, "నీ భార్య మెడవాచి బాధపడుతున్నది. నేనే తగ్గిస్తాను. ఇతరులవల్ల గాదు" అన్నారు. మరో ఊళ్ళోవున్న ఆమె అలా బాధపడిందని, తర్వాత ఆ బాధ తగ్గిపోయిందనీ కబురు వచ్చింది.

ఎప్పుడైనా ఆయన, భక్తులకు యిలాంటి బాధలు తొలగించకుంటే అందుకు బలీయమైన కారణం ఏదో వుండేది. మోహిలే అను భక్తుడు తన కుమార్తెను శిరిడీ తీసుకొచ్చాడు. ఆ పాపకు పై పెదవి చీలివున్నది. సాయి, "నేను యీ బిడ్డను బాగుచేయగలను, కాని దేవకోటికి చెందిన యీ పాప త్వరలో మరణిస్తుంది" అన్నారు. అలానే జరిగింది.

మానవుల గురించేకాదు, సర్వ ప్రాణకోటి గురించి ఎప్పుడేమి జరుగుతుందో, ఏమి జరుగనున్నదో బాబాకు తెలుస్తుండేది. ఒకనాడు మశీదులో బల్లి కూస్తుంటే, ఒక భక్తుడు అదేమి శకునమని అడిగాడు. సాయి, "ఇందులో శకునమేమున్నది? ఔరంగాబాదు నుండి తన చెల్లెలు వస్తున్నదని సంతోషిస్తున్నది" అన్నారు. నాటి మధ్యాహ్నం ఒక భక్తుడు గుఱ్ఱంమీద వచ్చి, దానిని మశీదు ముంగిట కట్టేసాడు. దానికి ఉలవలు పెట్టడానికి అతడు సంచీ దులిపితే అందులోంచి ఒక బల్లి బయటపడింది. అదీ, అంతకుముందు కూసిన బల్లీ ఆడుకుంటూ గోడపైకి ప్రాకాయి. బాబా వాటిని చూపగానే భక్తుడు విస్తుబోయి ఆ వ్యక్తిని విచారించాడు! అతడు ఔరంగాబాదు నుండి వస్తున్నానని చెప్పాడు. ఆ ఊరినుండే ఒక మనిషి గుఱ్ఱమెక్కి వస్తాడని, దాన్ని మశీదులోనే కట్టేసి, ఉలవలే పెడతాడని, ఆ సంచిలో ఒక బల్లి వున్నదనీ బాబాకెలా తెలుసు? ఇందులో ఏది జరగకున్నా ఆయన మాట వ్యర్థమవుతుంది. అలానే ఒకనాడు మహల్సాపతితో, "మీ యింటిదగ్గర రెండు పాములున్నాయి." అన్నారు సాయి. అతడిల్లు చేరేసరికి అతడి యింటి తలుపు దగ్గర ఒక పాము, ప్రక్కనే కుమ్మరివాని తల దగ్గర మరొకటీ కన్పించాయి! మరొకరోజు సాయి తమచేయి పాములా పెట్టి చూపుతూ, "రాత్రి నీవు వచ్చేటప్పుడు ఆ దొంగ ఎదురవుతాడు. కూడా లాంతరు తెచ్చుకో! అన్నారు. అతడా రాత్రి లాంతరు తీసుకొని వస్తుండగా దారిలో ఒక పాము ఎదురైంది.

శ్రీ సాయి ఏమి చేసినా, ఎంత చిన్నమాట చెప్పినా జరుగనున్నదంతా స్పష్టంగా తెలిసి, అలా చేస్తారని భక్తుల అనుభవాలు నిరూపిస్తుండేవి. సదాశివ తార్ఖాడ్, మిల్లు మేనేజర్ పదవికి రాజీనామాచేసి సకుటుంబంగా శిరిడీలో వున్నాడు. అతడు తిరిగి ప్రయాణమైనప్పుడు సాయి ఆశీర్వదించి, పూనా మీదుగా వెళ్ళమన్నారు. అతని భార్య మన్మాడ్ మీదుగా వెళితే ఖర్చు తగ్గుతుందని ఎంత చెప్పినా, అతడు సాయి చెప్పినట్లే పూనా చేరి ఒక మిత్రుని వద్ద ఆగాడు. అక్కడొక మిల్లు ఆసామి కలిసి అతనికి వెంటనే ఉద్యోగం యిచ్చాడు. శ్రీసాయిని నమ్ముకుంటే చాలు, ఏమీ కోరనక్కరలేదు. ఎప్పుడైనా ఆయన చేసినదే శ్రేయస్కరం, మనకు తోచింది గాదు. ఒక తల్లి తన కొడుకు నార్కేకు స్థిరమైన ఉద్యోగం లేదని బాధపడుతుండేది. ఒకరోజు బాబా ఆమెతో, "నీ బిడ్డను పూనాలో స్థిరపరుస్తాను" అన్నారు. అలానే అతనికి 1917లో పూనాలో స్థిరమైన ఉద్యోగం వచ్చింది. తర్వాత అతనితో ఒక రోజున, "నీ మామ బూటీ యిక్కడొక ఆలయం కడతాడు. నీవు దానికి ధర్మకర్తవవుతావు" అన్నారు బాబా. అలానే బూటీ 1918లో నేటి సమాధి మందిరం కట్టించాడు. తర్వాత దానికి నార్కే ధర్మకర్త అయ్యాడు.

ఒకసారి బాబాకెవరో మామిడి పండ్లు పంపారు. బాబా వాటిని భక్తులకు పంచుతూ, "ఇవి దామ్యాకు" అని 8 పండ్లు వేరుగా వుంచారు. "అతడిక్కడ లేడు కదా!" అంటే ఆయన , "అతడిప్పుడే కోపర్గాం చేరాడు. కొద్ది సేపట్లో వస్తాడు" అన్నారు. అలాగే కొద్దిసేపట్లో దామోదర్ రాస్నే వచ్చాడు. అంతలో ఆ పండ్లలోంచి నాలుగు

పిల్లలెత్తుకుపోయారు. సాయి, "దామ్యా, యీ పండ్లు తిని చావు!" అన్నారు. అతడు భయపడుతుంటే నవ్వి, "వాటిని నీ రెండవ భార్యకివ్వు. మొదట నీకిద్దరు కొడుకులు పుడతారు. మొదటివాడికి "దౌలత్‌షా" అని, రెండవవానికి "తానాషా" అని పేర్లు పెట్టు!" అన్నారు. దామోదర్ రాస్నేకు ఎంతోకాలంగా సంతానం లేదు. సాయి యీ ప్రసాదమిచ్చిన సంవత్సరానికి కొడుకు పుట్టాడు. ఆ బిడ్డను బాబాకు చూపి, వాడికేమి పేరు పెట్టాలని అడిగాడు రాస్నే. " 'దౌలత్‌షా' అని చెప్పానుగదా!" అన్నారు బాబా. దామ్యాకు మొత్తం ఎనిమిది మంది బిడ్డలు పుట్టి, నల్గురు జీవించారు.

ఒకరోజు బాలక్‌రామ్ కుమారుడు శిరిడీ వెళుతున్నానని చెబితే, బాబాకేమైనా పంపాలనుకున్నది శ్రీమతి తార్కాడ్. కాని యింట్లో ఒకసారి నివేదించిన పాలకోవా బిళ్ళతప్ప మరేమీలేదు. అదీగాక బాలక్‌రామ్‌కు మైలవచ్చింది. అయినా బాబాకు భక్తే ప్రధానమని తలచి దానినే పంపింది. అతడు శిరిడీ చేరాక ఆ పాలకోవా సంగతే మరచిపోయాడు. "బాంద్రానుండి నాకేమి తెచ్చావు?" అని బాబా ఎన్నిసార్లడిగినా అతనికి గుర్తు రాలేదు. చివరకు ఆయన, "ఆ తల్లి నాకు మిఠాయి పంపలేదా?" అన్నారు. అతడికి గుర్తొచ్చి వెంటనే పాలకోవా బిళ్ళ తెచ్చి సమర్పించాడు. బాబా దానినెంతో ప్రీతిగా ఆరగించారు. మన హృదయంలో శోకం లేకుంటే మైలసోకినా బాబా పూజ ఆపనక్కరలేదు.

ఒకసారి నానాచందోర్కరు, ఒక కీర్తనకారుడూ శిరిడీనుండి బయల్దేరుతుంటే, బాబా వాళ్ళను భోజనంచేసి వెళ్ళమన్నారు. ఆ కీర్తనకారుడు తొందరపడి భోజనం చేయకుండానే బయల్దేరాడు. నానా మాత్రం బాబా చెప్పినట్లే భోంచేసి బయల్దేరాడు. అతడు స్టేషన్ చేరేవరకు రైలు రానేలేదు. కీర్తనకారుడు ఆకలితో మాడవలసివచ్చింది. ఆరోజు రైలెంత ఆలస్యమయ్యేదీ బాబాకు తెలుసు! అలానే ఉదయం 8 గంటలకు బొంబాయి చేరాలని సంభారే బయల్దేరాడు. బాబా అతనికి ఊదీ యిచ్చి, 'మధ్యాహ్నానికి చేరుతావు పో!' అన్నారు. రైలు 4-30 గంటలు ఆలస్యమై అతడు మధ్యాహ్నానికే చేరాడు. నార్కర్ 1915లో ఒక రోజున సెలవు కోరినప్పుడు బాబా, "రైలందుతుంది, వెళ్ళు" అన్నారు. అతడు కోపర్గాం వద్ద నది ఒడ్డు చేరేసరికి చీకటిపడింది. నది వరదలవలన అప్పుడు పడవ నడపడంలేదు. బాబా మాట వ్యర్థమెలా అయిందా అనుకుంటుండగా ఒక మమల్తదారు అక్కడకొచ్చాడు. అతడికోసం ప్రత్యేకంగా వచ్చిన పడవలో నార్కర్‌గూడ నదిదాటి రైలందుకున్నాడు.

కాకా మహాజని శిరిడీలో ఒక వారముండాలని వచ్చాడు. అతనిని చూస్తూనే బాబా, "నీవింటికి ఎప్పుడు వెళ్తావు?" అన్నారు. "మీరు చెప్పినప్పుడు!" అన్నాడు కాకా. "అయితే రేపే వెళ్ళు!" అన్నారు సాయి. అతడా మర్నాడు బొంబాయి చేరేసరికి, ఆఫీసులో పై అధికారికి జబ్బుచేసి ఆరోజు కాకా తప్పక ఆఫీసుకు పోవలసివున్నది! ధూమల్ అనుభవం యింకొకలా వున్నది. అతడు మరురోజు నీఫాడ్‌లో కోర్టుకు హాజరుకావలసి వున్నది. అతడు దారిలో బాబాను దర్శిస్తే ఆయన అతడిని వారం రోజులు నిలిపేశారు. తర్వాత అతడు నీఫాడ్ చేరేసరికి, జడ్జీకి జబ్బు చేయటం వలన విచారణ ఆ రోజుకు వాయిదా పడిందని తెలిసింది. జోగ్ వద్ద ఒక వ్యక్తి రూ. 1400/-లు అప్పుతీసుకొని, నోటుగడువు దాటిపోతున్నా అప్పు తీర్చలేదు. ఒకరోజు జోగ్ అతనివద్దకని బయల్దేరుతుంటే బాబా నవ్వి, "నీ డబ్బెక్కడికీ పోదు; ప్రశాంతంగా కూర్చో. అదే వస్తుంది" అన్నారు. జోగ్ కోపంతో, 'నేను వెళ్తేనే యివ్వనివాడు దావా వేయకుంటే ఎలా యిస్తాడు? అది రాకుంటే నేనిక్కడ ఎలా బ్రతకాలి, మీ సేవెలా చేయాలి?'అన్నాడు. బాబా సెలవియ్యక పోయేసరికి అతడు ఆశ వదులుకున్నాడు. నోటు గడువు తీరిపోయింది. కానీ తర్వాత ఆ వ్యక్తి వచ్చి రూ. 1400/-లు యివ్వబోయాడు. కాని జోగ్ వడ్డీ గూడ యిస్తేనేగాని ఆ పైకం ముట్టనని పట్టుబట్టాడు. కాని వడ్డీ లేకుండానే తీసుకోమని సాయి చెప్పినందువల్ల అతడా పైకం తీసుకొని ఆయనకే అర్పించాడు. సాయి కొద్ది మాత్రమే తీసుకొని మిగిలినది అతనికే యిచ్చారు. వేరు గతిలేకుంటే తప్ప వడ్డీ తీసుకోవడం మహా పాపమని,

ఆచరించిన ధర్మమంతా వ్యర్థమైపోతుందనీ ఋషులు చెప్పారు.

మన మనఃప్రవృత్తిని బట్టే బాబా లీలలు అనుభవమవుతాయి. బాబాపై ఎట్టి విశ్వాసం లేకుండా ఆయనను పరీక్షచేయడానికి వచ్చిన హరికనోబా, తన క్రొత్త చెప్పులు మశీదుముందు విడచి, అవి కన్పించేలా లోపల కూర్చున్నాడు. దురభిమానంతో అతడు సాయిచెంతన కూడ తన తలపైనున్న జరీ తలపాగాను తీయలేదు. అతడు బయటకు వచ్చేసరికి చెప్పులు లేవు! అతడు భోజనముచేసి విచారంగా బసకు చేరాక, ఒక పిల్లవాడు ఆ చెప్పుల జత తన కర్రకు తగిలించుకొని, "హరికా బేటా, జరీకా ఫేటా" -- 'హరి అనేవాడి కొడుకు, జరీ తలపాగ కలవాడు ఎవరు?' అని కేకలు వేస్తున్నాడు. అతణ్ణి పిలచి విచారించగా, సాయి అతనికా చెప్పులిచ్చి, ఆ విధంగా విచారించి వాటిని ఆసామికివ్వమని చెప్పారని తెలిసింది. సాయికి తన పుట్టుపూర్వోత్తరాలు కూడ తెలుసని కనోబా గుర్తించాడు.

అంతటి మహనీయుని ఎప్పుడూ గుర్తుంచుకోడానికి ఆయన పటం దగ్గర వుంచుకోవడం సమంజసమే, కాని అది మాత్రమే చాలదు. ఒకరోజు కొందరు యువకులు బాబాను ఫోటో తీసుకుంటామని శ్యామాను అడిగారు. బాబా లెండీనుండి వచ్చేటప్పుడు సాఠేవాడ వద్ద నిలుపుతానని, అప్పుడు ఫోటో తీసుకోమనీ వాళ్ళతో శ్యామా చాటుగా చెప్పాడు. తర్వాత లెండీనుండీ తిరిగివస్తూ బాబా, "శ్యామా! ఏమిటీ గోల? ఫోటో తీయవద్దని పిల్లలకు చెప్పు! అడ్డుగోడ కూలదోస్తే అదే చాలు!" అని గబగబ వెళ్ళిపోయారు. ఆ యువకులు ఏ మధ్యవర్తినీ ఆశ్రయించక బాబానే ఆశ్రయిస్తే పని జరిగేదేమో! రాగద్వేషాలు విడిచి, అందరిలోనూ బాబా వున్నారని గుర్తుంచుకొనడమే అడ్డుగోడలు తొలగించుకోవడమంటే. మరొక రోజున తమను దర్శించవచ్చిన ఒక భక్తుణ్ణి అడిగి మరీ ఫోటో తీయించుకున్నారు బాబా. అందరూ ఆశ్చర్యపోతుంటే అతడిలా చెప్పాడు: "నేను శిరిడీ వస్తుంటే ఎలాగైనా సాయిని ఫోటో తీయ ఁమని నా మిత్రుడు జోషీ కెమేరా యిచ్చాడు."

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము



అధ్యాయము - 6

సకలదేవతా స్వరూపము

భగవంతునికి ఎట్టిరూపము, గుణము లేవు గనుక, ఆయన మన యింద్రియాలకూ, మనస్సుకూ గోచరించడు. మానవులు ఆయన గురించి తెలుసుకొని, ఆయనను ప్రేమించి తరించడం ఎలా సాధ్యం? అందువలన మనపై కరుణతో ఆయనయే మానవాకారంతో భూమిపై సద్గురువుగా అవతరిస్తుంటాడు. చూడడానికి సద్గురువుగూడ సామాన్య మానవునిలాగే వున్నా, ఆయన యొక్క శక్తిసామర్థ్యాలు మాత్రం అపారము. హేమాద్పంతు చెప్పినట్లు, **'సద్గురువు'** అన్నపదం గుర్తుకు రాగానే సాయియే మనస్సుకు వస్తారు. వారి లీలలను చింతనచేస్తే భగవంతుని తత్వంపై మనకు స్థిరమైన భక్తి శ్రద్ధలు కలుగుతాయి. కాని యిది తెలియక వేర్వేరు దేవతలను ఆరాధించడమే చాలునని అందరమూ అనుకొంటాము. కాని భగవద్గీతలో శ్రీకృష్ణుడు, "మానవుల అజ్ఞానం వలన అనేక కోరికలతో ఒక్కడేయైన పరమాత్మకు వేర్వేరు నామరూపాలు కల్పించుకొని, వేర్వేరు దేవతలను ఆరాధిస్తారు" (7: 20) అని చెప్పాడు. కాని పరమాత్మయైన తనకు, జ్ఞానికీ భేదమే లేదని కూడా చెప్పాడు. దేవతలందరూ భగవంతునికి అధీనులైనట్లు సాక్షాత్తు భగవంతుని ప్రతిరూపమైన సద్గురువుకు కూడ అధీనులే. అంతేకాదు, "శ్రీ గురుచరిత్ర" లోని దీపకుని వంటి సద్గురు భక్తునికికూడా దేవతలందరూ అధీనులే. కారణం సద్గురువు సర్వదేవతా స్వరూపము. ఈ విషయము సాయి భక్తులకెందరికో అనుభవమైంది.

పండరి విఠల్ : గౌలీ బువా అనే 95 ఏండ్ల సాధువు తనకున్న కొద్ది సామానూ ఒక గాడిదమీద పెట్టుకొని, ప్రతి సంవత్సరము కాలినడకన పండరిపురం వెళ్తుండేవాడు. అతడు 8 మాసాలు విఠలుని సన్నిధిలోను, 4 మాసాలు గంగాతీరంలోనూ గడిపేవాడు. ప్రతిసారీ అతడు శిరిడీ దర్శించేవాడు. అతడు బాబాను తదేకంగా చూచి ఆనందభాష్పాలు రాలుస్తూ, "ఈయన సాక్షాత్తు విఠలుడే! దీనజన రక్షకుడు, ఆపద్బాంధవుడు!" అనేవాడు.

రఘువీర పురందరే తన తల్లిని తీసుకొని 1913లో శిరిడీ వెళ్ళాడు. ఆమె విఠలుని భక్తురాలు గనుక త్వరగా పండరి వెళ్ళాలని అతనిని వత్తిడి చేయసాగింది. అప్పటినుండి సాయి ఆమెతో, 'నీవు పండరి ఎప్పుడు వెళతావు?' అని పదేపదే అడగసాగారు. ఒకరోజు ఆమెను పండరి తీసుకెళ్ళడానికి బాబా అనుమతి కోరదలచాడు పురందరే. నాటి మధ్యాహ్నం వారిద్దరికీ రుక్మాసమేతుడైన విఠలుడుగా సాయి దర్శనమిచ్చారు. అంతటితో ఆమెకు బాబాయే విఠలుడన్న విశ్వాసమేర్పడి, శిరిడీయే తనకు పండరి అని బాబాకు సమాధానమివ్వసాగింది.

శ్రీరాముడు : ఒక మమల్తదారుడు, ఒక డాక్టరును తనతో కూడ సాయి దర్శనానికి రమ్మంటుండేవాడు. ఆ డాక్టరు శ్రీరామునికి తప్ప మరెవ్వరికీ మ్రొక్కేవాడుకాదు. ఫకీరైన సాయికి మ్రొక్కడం తనవల్లగాదనేవాడు. ఆయనకు మ్రొక్కాలన్న నిర్బంధమేమీ లేదని చెప్పాకనే అతను గూడ శిరిడీ వెళ్ళాడు. కాని మశీదులో కాలు పెడుతూనే అతడు సాయి పాదాలపై వ్రాలి తన్మయత్వంతో ఆనందభాష్పాలు కార్చాడు. అతడు లేవగానే, "పిచ్చివాడా! రాముడెక్కడ లేడు? చూడగల్గితే అంతటా వున్నాడు, లేకుంటే ఎక్కడాలేడు!" అన్నారు సాయి. తన గురించి ఆయనకంతా తెలుసునని అతడికి అర్థమయింది. తర్వాత ఆ డాక్టరు చెప్పాడు; "సాయి నాకు శ్రీరామునిగా

కన్పించారు. నమస్కరించి లేచేసరికి సాయిగా కన్పించారు. ఆ యిద్దరూ వేరుగాదు'' తిరిగియిల్లు చేరాక రెండు వారాల వరకు అతనికి ఆ పారవశ్యం అలానే వున్నది. మద్రాసు నుండి వచ్చిన లక్ష్మి అనే భక్తురాలికి గూడ సాయి యిలాంటి దర్శనమే ప్రసాదించిన వివరము ముందొక అధ్యాయంలో చూచాము.

దత్తాత్రేయుడు : సం॥ 1911లో దత్త జయంతినాడు సాయంత్రం 5 గంటలకు బాబా అకస్మాత్తుగా, "నేను ప్రసవవేదన భరించలేకున్నాను!'' అని కేకలేసి భక్తులందరినీ మశీదునుండి తరిమివేశారు. కొద్దిసేపు తర్వాత ఆయనే అందరినీ మసీదులోకి పిలచారు. అలనాడు శ్రీ దత్తుని ప్రసవించిన అనసూయాదేవితో ఆయన తాదాత్మ్యం చెందారని భక్తులనుకున్నారు. అప్పుడు బల్వంత్ ఖోజోకర్ మసీదులోకి వెళ్ళగానే సాయికి బదులు ఆసనం మీద బాలుడైన దత్తాత్రేయుడు దర్శనమిచ్చారు. అలానే ఒకప్పుడు గోవా నుండి వచ్చిన యిద్దరు భక్తులలో ఒకరినుండి రూ. 15/- లు దక్షిణ అడిగి తీసుకున్నారు బాబా, కానీ రెండవ భక్తుడిచ్చిన దక్షిణ తీసుకోలేదు. అందుకు కారణమడిగిన శ్యామాతో బాబా యిలా చెప్పారు : "శ్యామా, నీకేమీ తెలియదు. నే నెవరినుండీ ఏమీ తీసుకోను. ఈ మసీదు తల్లి తనకు రావలసిన ఋణాన్ని అడిగి తీసుకుంటుంది. ఇల్లు, కుటుంబము లేని నాకు పైకమెందుకు? అతడు తనకు ఉద్యోగం వస్తే మొదటి జీతం దక్షిణగా యిస్తానని దత్తాత్రేయ స్వామికి మ్రొక్కుకున్నాడు. త్వరలో అతడికి ఉద్యోగం వచ్చింది. అతని మొదటి నెల జీతం రూ. 15/-లు. ఇప్పుడతని జీతం రూ. 700/- లు. కష్టం గడవడంతో అతడు మ్రొక్కును మరచాడు. ఋణము, శతృత్వము, హత్య - వీటికి పరిహారం చెల్లించక ఎన్నటికీ తప్పదు. అందుకే అతని నుండి రూ. 15/- లు అడిగి తీసుకున్నాను'' అన్నారు. తాను మ్రొక్కిన దత్తస్వామియే సాయి.

అలానే బాబా సాహెబ్ అనే దత్తభక్తుడు తన బంధువైన నానాచందోర్కర్ మాటను త్రోసివేయలేక, సం॥ 1900లో సాయిని దర్శించాడేగాని లోలోపల ఆయన ముస్లిం అన్న శంక వున్నది. కాని మశీదులో అతనికి సాయి బదులు దత్తమూర్తి దర్శనమిచ్చారు. అంతటితో అతడు తన జీవితమంతా సాయి సేవకే అంకితం చేసాడు.

మారుతి : ఎప్పుడూ సాయికి సేవ చేస్తుండే నిమోన్కర్ పనిమీద అహ్మద్‌నగర్ వెళ్తూ తన కొడుకు సోమనాథుణ్ని ఆయన సేవకు వినియోగించాడు. అప్పుడొక రోజు తనకు కల్గిన అనుభవం గురించి అతడిలా చెప్పాడు : "సాయి స్థానంలో ఆయన రూపంలేదు. మారుతియే వున్నారు. అయితే ఆయనకు తోక వున్నదో లేదో నేను చూడలేదు. మసీదు మెట్లపై కూర్చొనివున్న శ్యామాతో, అరుగో మారుతి, దర్శించుకో!' అని చెప్పాను'' అప్పటినుండి శ్రీ సాయి మారుతి అవతారమని సోమనాథుడు నమ్మాడు.

గణపతి : చిదంబరరావు గాడ్గిల్ అనే గణపతి భక్తుడు శిరిడీ దర్శించినప్పటినుండి యింటిదగ్గర బాబాను గణపతిగా పూజించేవాడు. ఒకరోజు అతడు శిరిడీ వచ్చినపుడు ఆయన నవ్వి, "ఈ ముసలాడు చాలా టక్కరి. ఎలుకే నా వాహనమని కనిపెట్టాడు'' అన్నారు.

ఒకసారి బాంద్రా నుండి ఒకామెవచ్చి సాయికి నమస్కరించి, ఆయన యెదుట కూర్చోగానే, ఆమెను 7 సం॥లుగా బాధిస్తున్న తలనొప్పి తగ్గిపోయింది. ఆ మాట చెప్పగానే బాబా, "అమ్మా! నీ చిన్నతనమునుండి నాకు సమృద్ధిగా అన్నీ తినబెడుతున్నావు'' అన్నారు. ఆమెకేమీ అర్థంకాలేదు. బాబా నవ్వుతూ, "నీవెవరిని పూజిస్తావు'' అన్నారు. గణపతిని పూజిస్తానని చెప్పిందామె. సాయి "నీవర్పించిన నివేదనలన్నీ నాకే చెందుతున్నాయి'' అన్నారు. విఘ్నేశ్వరుడు భోజనప్రియుడు. ఆ గణపతియే తామని బాబా సూచించారు.

నరసింహస్వామి : సదాశివజోషీ నిత్యమూ సాఠేవాడాలో ఆరతికి హాజరయ్యేవాడు. ఒకప్పుడతనికి అక్కడ సాయి పటంలో వరుసగా మూడు రోజులు నరసింహస్వామి దర్శనమయింది. తర్వాత అతడు తిరిగి వెళ్ళేటప్పుడు

ఊధీ, కొద్ది మిఠాయి ప్రసాదమిచ్చారు బాబా. అది చాలదంటే బాబా అతనికి 8 అణాలు యిచ్చి, "శిరిడీలో ఎక్కడైనా మిఠాయికొని తీసుకుపో, అదీ నా ప్రసాదమే!" అన్నారు. ఆయన సన్నిధిచేత పవిత్రమైన శిరిడీలోని పదార్థమంతా ఆయన ప్రసాదమే!

ఖండోబా : మహల్సాపతి కుమారుడు మార్తాండ్ ఒకరోజు ఖండోబా ఆలయద్వారం వద్ద కూర్చున్నాడు. బాబా అతని ఎదుట ప్రత్యక్షమయ్యారు. అతడు లేచి నిలబడగానే బాబా చిరునవ్వుతో ఖండోబా విగ్రహం వైపు నడచి, అందులో లీనమయ్యారు. మార్తాండ్ ఆశ్చర్యంతో విగ్రహం వెనుక చూచాడు. అక్కడెవరూలేరు. తిరిగి విగ్రహంనుండి బాబా వెలువడి, చిరునవ్వుతో అతనిని చూస్తూ బయటకు వెళ్ళిపోయారు. నాటినుండి అతడు ఖండోబాను బాబా రూపంగా పూజించేవాడు.

శ్రీ ఉపాసనీ బాబా అన్నగారైన బాలకృష్ణ ఉపాసనీ శాస్త్రి, 1907లో గయలోని త్రివేణి సంగమంలో శ్రాద్ధ ప్రదానం చేసాడు. నడిమధ్యకు వెళ్ళి ఆ పిండాన్ని వదలగానే, అకస్మాత్తుగా రెండుచేతులు నీటి పైకివచ్చి దానిని స్వీకరించి, మరల నదిలోకి అదృశ్యమయ్యాయి. అతనికి ఒకవంక అమిత సంతోషము, మరోవంక విపరీతమైన భయమూ కల్గాయి. తర్వాత 1912లో అతడు ఇంట్లోంచి వెళ్ళిపోయిన తన తమ్ముణ్ణి వెతుక్కుంటూ శిరిడీ చేరాడు. అతనిని చూచి నవ్వుతూ సాయి, "మరల ఎంతకాలానికి కన్పించావు!" అన్నారు. తానదే ప్రథమం గదా శిరిడీ రావడం అనుకొంటుంటే ఆయన, "ఎందుకంత ఆలోచిస్తావు? నీవా గయలో పితృదేవతలకు పిండ ప్రదానం చేసినప్పుడు స్వీకరించిన చేతులివిగావూ? గుర్తులేదా?" అంటూ తమ చేతులు చూపారు! పట్టలేని ఆనందము, కృతజ్ఞతలతో అతని కళ్ళవెంట ఆనందభాష్పాలు రాలాయి.

దేవతలంటే రూపాలుగాదు, అతీతమైన శక్తి సామర్థ్యాలే. సిరిసంపదలనిచ్చేది లక్ష్మియనీ, విద్యనిచ్చేది సరస్వతియనీ, యిలా దేవతలగూర్చి శాస్త్రాలు చెబుతాయి. తమనాశ్రయించిన భక్తులకు రోగాలు నివారించినందు వలన సాయియే ధన్వంతరి. ధనధాన్యాలు, ఉద్యోగమూ ప్రసాదించడం వలన ఆయనయే లక్ష్మీదేవి. దాసగణుకు ఒకసారి ఈశావాస్యఉపనిషత్సారము తెల్పారు. అలానే దాసగణు ఒకప్పుడు జ్ఞానేశ్వర్ మహరాజ్ వ్రాసిన 'అమృతానుభవము' అనే జటిలమైన వేదాంత గ్రంథానికి సరళమైన వ్యాఖ్య వ్రాయదలచి, అందులో నిష్ణాతులైన దాదామహరాజ్ అనే ఉత్తమ సాధకుని సంప్రదించాడు. "కొన్ని రోజులు నావద్ద అధ్యయనంచేయి, లేకపోతే వ్రాయలేవు" అన్నారు దాదాగారు. అతడు, 'శ్రీ సాయి అనుగ్రహిస్తే తగిన బుద్ధికుశలత అదే సిద్ధించగలదు" అన్నాడు, "సాయి ముస్లిం. ఆయనకు వేదాంతమేమి తెలుసు?" అన్నారు దాదాజీ. దృఢ విశ్వాసంతో సాయిని ప్రార్థించి దాసగణు వ్రాతకుపక్రమించాడు. తర్వాత ఆ వ్యాఖ్యచూచి ఆశ్చర్యచకితులైన దాదాగారు, "బాబా నిజంగా సమర్థులు. నీకు మరెవ్వరి సహాయమక్కరలేదు!" అన్నారు.

ఒకసారి ఒక భక్తుడు ఒక జ్యోతిష్య గ్రంథాన్ని సాయి ప్రసాదంగా తీసుకోదలచి ఆయన చేతికిచ్చాడు. ఆ గ్రంథాన్ని అటూ యిటూ తిరగేసి, ప్రక్కనున్న శ్రీమాన్ బూటీకిచ్చారు సాయి! ఆ శాస్త్రంపై ప్రీతిలేకున్నా, సాయి ప్రసాదించారని కష్టపడి ఒకసారి చదివాడు. అయినా అతడికి ఆ శాస్త్రంలో ప్రావీణ్యం కల్గింది. ఒకసారి ఎన్నికలు ఏ సమయంలో జరిగితే కాకాదీక్షిత్ గెలుస్తాడో బూటీ చెప్పాడు. ఎన్నికలు ఆ సమయంలోనే ఆరంభమై అతడు గెలిచాడు.

★★★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము



అధ్యాయము - 7

సకల సాధుస్వరూపము

నిర్గుణుడు, నిరాకారుడూ అయిన భగవంతుడు తపోనిష్ఠులైన మహర్షులకు మాత్రమే ధ్యానంలో గోచరిస్తాడు. సామాన్యులనుద్ధరించడానికి ఆయనయే పరిపూర్ణులైన మహనీయుల రూపాలలో భూమిమీద లభిస్తుంటాడని భాగవతాది సద్గ్రంథాలు చెబుతున్నాయి. కాని అందరు మహనీయులుగానూ వున్న దైవమే సాయిగా ప్రత్యేకించి అవతరించినదని భక్తుల అనుభవాలు నిరూపిస్తున్నాయి. అందుకే ఆయన అద్వితీయ పూర్ణదత్తావతారము, సకల సాధుస్వరూపము.

శ్రీ నరసింగ్ మహరాజ్: సాకోరి నివాసి, హంసరాజ్, ఉబ్బసంతో బాధపడుతున్నాడు. అతనికి సంతానంగూడ లేదు. అతడు ఈ రెండు బాధలూ నివారించమని నాసిక్ నివాసి, దిగంబరీయైన నరసింగ్ అను సిద్ధపురుషుణ్ణి ఆశ్రయించాడు. అతని దేహాన్ని ఒక భూతమావేశించి సంతానం లేకుండా చేస్తోందని, సాయిబాబాను దర్శిస్తే ఆయన అతని చెంపమీద రెండు దెబ్బలు కొట్టి భూతాన్ని పోగొడతారనీ ఆ మహనీయుడు చెప్పారు. అతడు 1911లో సాయిని దర్శించగనే, అతడేమీ చెప్పకముందే సాయి అతని చెంపమీద రెండు దెబ్బలు కొట్టి, "దుష్టగ్రహమా, ఫో బయటకు!" అని గద్దించారు. కొద్దికాలానికి అతడికి సంతానం కల్గింది. ఈ మహనీయులిద్దరి ఆంతర్యము ఒక్కటేనని ఈ సంఘటన నిరూపిస్తున్నది.

దహనూ నివాసి హరిభావూకార్నిక్ 1917లో గురుపూర్ణిమనాడు సాయిని దర్శించి శెలవు తీసుకొని మశీదు మెట్లు దిగుతూ, ఆయనకొక రూపాయి దక్షిణయిస్తే బాగుండునని తలచాడు. శెలవు తీసుకొన్నాక ఆయనను తిరిగి దర్శించరాదని శ్యామా అతనిని పంపివేశాడు. అతడు నాసిక్‌లో దిగి ఆలయంలో ప్రవేశిస్తున్నాడు. ద్వారంవద్ద భక్తులమధ్యనున్న నరసింగ్ మహరాజ్, హరిభావూ చేయిపట్టుకొని, 'నా రూపాయి నాకివ్వు!' అన్నారు. ఆ రూపంలో సాయియే తానివ్వదలచినది స్వీకరిస్తున్నారని గుర్తించి సంతోషంగా సమర్పించాడు కార్నిక్. సాయి, నర్సింగ్ ఒక్కరే!

మౌల్వీసాహెబ్: ధనికుడైన షాపూర్జీకి సంతానంలేదు. యాత్రలు, దానాలు, శాంతులు చేసినా ఉపకరించలేదు. దాసగణు సలహాపై అతడు సాయిని దర్శించాడు. అతడి మొరవిని సాయి రూ. 5/-లు దక్షిణ కోరారు గాని, మరలా తమకిదివరకే 3 రూపాయల 14 అణాలు ముట్టిందని చెప్పి, 1 రూపాయి 2 అణాలు మాత్రమే తీసికొని ఆశీర్వదించారు. ప్రథమంగా శిరిడీ దర్శించిన షాపూర్జీకి సాయి మాటలర్థంగాక దాసగణునడిగాడు. అతడాలోచిస్తే, ఒకరోజు నాందేడులో మౌల్వీసాహెబ్ అను సాధువును షాపూర్జీ సత్కరించాడని గుర్తొచ్చింది. నాటి ఖర్చులచీటీ చూస్తే 3 రూపాయల 14 అణాలు అయింది! ఆ రూపంలో అది సాయికే చెందినదని దాసగణు వివరించాడు. తర్వాత షాపూర్జీకి 12 మంది బిడ్డలుకలిగి, నలుగురు జీవించారు!

శ్రీ అక్కల్‌కోటస్వామి : అక్కల్‌కోటలో దత్తావతారమైన స్వామి సమర్థ (1856-78) నిర్యాణం చెందనున్నారు. భక్తుడు కేశవనాయక్ శోకిస్తుంటే, స్వామి తమ పాదుకలతనికిచ్చి, "నా అవతారం శిరిడీలో వున్నారు సేవించుకో!' అన్నారు. ఆ తర్వాత నాయక్ తన కొడుకును తీసుకొని శిరిడీ బయల్దేరాడు. రైల్లో శిరిడీ వెళ్ళేవారు కలసి సాయి

కేవలం పిచ్చిఫకీరని చెప్పారు. అయినా శిరిడీ చేరాక నాయక్‌తో వారు గూడ మసీదువద్దకొచ్చారు. నాయక్‌తో సాయి, "నువ్వూ, నీ కుమారుడు రావచ్చు, తక్కిన వారొస్తే భ్రష్టులవుతారు!" అన్నారు. తర్వాత వేపచెట్టు నుండి కొద్ది ఆకులు అందరకూ పంచి, రుచి చూడమన్నారు. అవి నాయక్‌లకు తియ్యగాను, మిగిలిన వారికి అతి చేదుగానూ వున్నాయి! సద్గురు భక్తులకు సంసారం మధురంగాను, విద్యాహంకారులకు చేదుగానూ వుంటుంది.

హరిశ్చంద్ర పితలే (బొంబాయి) కుమారుడి మూర్ఛవ్యాధి ఎన్ని వైద్యాలకూ లొంగలేదు. మిత్రుల సలహాపై సాయిని దర్శించగా, వారి ఆశీర్వచనంతో తగ్గింది. తర్వాత వారికి సెలవిస్తూ సాయి, "బాపూ, ఇదివరకు మీకు రూ. 2/- లిచ్చాను; ఇపుడు మరో రూ. 3/- లిస్తున్నాను. వీటిని గూడా పూజించుకో, మేలవుతుంది" అని 3 కాసులిచ్చారు. ప్రథమంగా శిరిడీ దర్శించిన పితలేకు ఆ మాటలర్థంగాక, ఇల్లుచేరి తన తల్లినడిగాడు. ఆమె, "నీ చిన్నతనంలో మనం అక్కల్కోట స్వామిని దర్శించాము. అపుడాయన రూ. 2/- లిచ్చి పూజించుకోమన్నారు. మీ తండ్రి చనిపోయాక అవి కన్పించలేదు. ఆయనే మరల సాయిబాబా రూపంలో నిన్ననుగ్రహించారు" అన్నది.

అక్కల్కోట స్వామి నిర్యాణమయ్యాక భక్తుడు కృష్ణజీ తరచు వారి సమాధిని దర్శిస్తూండేవాడు. ఒకనాటిరాత్రి అతనికి స్వామి దర్శనమిచ్చి, 'ఇపుడు అక్కల్‌కోటలో ఏముంది? నేనిపుడు శిరిడీలో వున్నాను. అక్కడ సేవించుకో!' అన్నారు. మర్నాడే అతడు శిరిడీచేరి, సాయిసన్నిధిలో ఆరుమాసాలున్నాడు; అలవాటు ప్రకారం అక్కల్‌కోట వెళ్ళడానికి అనుమతి కోరాడు కృష్ణజీ. సాయి, "ఇపుడు అక్కడేముంది? ఆ స్వామి యిపుడు నా రూపంలోనే వున్నారు. అక్కడకు వెళ్ళడమెందుకు?" అన్నారు.

నారాయణ్ (థాణే)కు ప్రమాదంగా జబ్బుచేసినపుడు మిత్రులు సాయిపటము, విభూతి యిచ్చారు. మరురోజే అతని జబ్బు తగ్గిపోయింది. అయినా దత్తావతారమైన అక్కల్‌కోటస్వామి పటం ప్రక్కనే ఫకీరైన సాయిపట ముంచకూడదని తలచి దూరంగా వుంచాడు నారాయణ్. నాటిరాత్రి స్వప్నంలో అతనికొక ఫకీరు దర్శనమిచ్చి, 'ఆ ఫకీరు, స్వామీ వేరుకాదు!" అని చెప్పాడు. మరురోజే అతడు సాయిపటాన్ని కూడా పూజలో పెట్టాడు. మరొకసారి ఆరతి సమయంలో బాపూసాహెబ్ జోగ్‌కు అక్కల్‌కోట స్వామిగా దర్శనమిచ్చారు సాయి. బాబా, అక్కల్‌కోటస్వామి ఒక్కరే!

గురుఘోలప్‌స్వామి: కోటీశ్వరుడు బూటీ (నాగపూర్) సాయి సన్నిధిలో వుంటున్న రోజులవి. ఒకరోజు ఉదయం సాయి లెండీతోటకు బయల్దేరుతూ, "ఈ రోజు కాషాయం ధరిస్తాను" అన్నారు గాని; భక్తులు తెచ్చినా ధరించలేదు. మధ్యాహ్నానికి నాసిక్‌నుండి మూలేశాస్త్రి అను శ్రోత్రియ బ్రాహ్మణుడు, బూటీతో పనిబడి శిరిడీ చేరాడు. ఇద్దరూ సాయిని దర్శించారు. బాబా తమ పైకంతో పండ్లుకొని భక్తులకు పంచారు. అపుడు బాబా చేతిలోని రేఖలు పరిశీలించాలని కోరాడు శాస్త్రి. బాబా నాలుగు అరటి పండ్లు ప్రసాదించి వూరుకున్నారు. చేయి చూడడానికి తాము మానవమాత్రులము గామని, నాలుగు పురుషార్థాలూ ప్రసాదించే దైవస్వరూపులమనీ వారి భావమేమో! తర్వాత బసకుచేరి స్నానంచేసి, అగ్నిహోత్రమారంభించాడు శాస్త్రి. మశీదులో ఆరతి సమయంలో బూటీని పిలిచి, "ఆ నాసిక్ బ్రాహ్మణుని దక్షిణ తీసుకురమ్మని చెప్పు!" అన్నారు బాబా. బూటీ ఆ మాట చెప్పగానే శ్రోత్రియుడైన తనను ముస్లిమైన బాబా అలా ఆజ్ఞాపించడం అతనికి చికాకన్పించింది. బూటీపై గౌరవంతో మాత్రమే అయిష్టంగా, శాస్త్రి మశీదు చేరి ముంగిట నుండే బాబాకు పుష్పాంజలి సమర్పించాడు. కాని అతనికి బాబా కన్పించలేదు. ఆ స్థానంలో అతని గురువు ఘోలప్‌స్వామి కాషాయధారియై కూర్చుని వున్నారు! పట్టలేని సంతోషంతో శాస్త్రి మసీదు ప్రవేశించి తన గురువు పాదాలకు ప్రణమిల్లాడు. భక్తులందరూ ఆరతి పాడుతుంటే శాస్త్రి తన్మయత్వంతో తన గురునామం స్మరిస్తున్నాడు. కొంతసేపటికి అదే స్థానంలో సాయి కన్పించి దక్షిణ కోరారు. కులగర్వం, విద్యాగర్వం

నశించి ఆనందభాష్పాలు రాలుస్తూ దక్షిణ సమర్పించాడు శాస్త్రి. అతడి అనుభవం విన్నాకగాని నాటి ఉదయం కాషాయం ధరిస్తామన్న బాబా మాటలకు అర్థం భక్తులకు బోధపడలేదు. సాయి - ఘోలప్‌స్వామి వేరుగాదు.

కాకా మహారాజ్ : ఒకనాడు శిరిడీ వచ్చిన డా॥ పండిట్‌ను భక్తుడైన దాదాకేల్కర్ యింటికి వెళ్ళమని చెప్పి, దారిగూడా చెప్పారు సాయి. తర్వాత కొంతసేపటికి డాక్టరుతో కలసి మసీదుచేరి బాబాను పూజించాడు కేల్కర్. అపుడు పండిట్, పళ్ళెంలోని చందనం తీసుకొని బాబా నొసట పెట్టాడు. ఎవరినీ అలా చేయనివ్వని బాబా ఆనాడు వూరుకుంటే కారణమడిగాడు కేల్కర్. "అతనికి ధోపేశ్వర్‌లో కాకామహరాజ్ అనే బ్రాహ్మణ గురువున్నారు. నాలో వారిని దర్శించి అతడలా చేసాడు. నేనెలా కాదనగలను!" అన్నారు బాబా.

ఆ సాధువెవరు? : సగుణమేరూనాయక్ అనే యువకుడు నర్సోబావాడి అనే క్షేత్రం దర్శించి, శ్రీ వాసుదేవానంద సరస్వతి అను మహనీయుని చూచాడు. అతడిని చూస్తూనే ఆ యతి, "నీవొక మహనీయుని దర్బారుకు చెందినవాడివి. నీకంతకంటే యేం కావాలి?" అన్నారు. అతడికి ఆ మాటలర్థం కాలేదు. తర్వాత అతడు కాలేజీలో చదువుకుంటుండగా నాస్తిక ప్రభావానికి గురయ్యాడు. అతని సందేహాలు తీర్చలేక అతడి తండ్రి బాబాను దర్శించమని చెప్పాడు. అతడు 1912లో శిరిడీ వెళ్ళాడు. అతనిని చూస్తూనే అతని మాతృభాషయైన కన్నడంలో "దేవుడు లేడంటావేమి? నిశ్చయంగా వున్నాడు!" అంటూ అతని కళ్ళలోకి చూచారు బాబా. ఒక్క వాక్యంతో, చూపుతో సంశయాలన్నీ తీరిపోయాయి. తర్వాత అతడు మశీదుకెళ్ళి బాబాయొక్క దివ్యవర్చస్సుకు తన్మయుడై కన్నార్పక చూస్తూ కూర్చున్నాడు. సాయి నవ్వి, "ఏమిటి, పిచ్చివాడిలా అలా చూస్తావ్? నీవు బాల్యంలో పశువులను మేపుతుండగా వచ్చాను కదా! మరచావా? మన తల్లిదండ్రులిక్కడే వున్నారు, మనమిక్కడే వుండాలి!" అన్నారు. సగుణ్ యిల్లుచేరి, తన తల్లితో సాయి చెప్పినది విన్నవించాడు. ఆమె, "నీ 9వ ఏట నీవు పొలంలో పశువులను మేపుతుండగా ఒక సాధువు కన్పించి నిన్ను పిలిచారు. నీవు నాతో చెబితే నేను గూడ వారికి భిక్ష యిచ్చాను. అపుడు ఆయన నీతో , "నీవు నా చెంతకు ఎప్పుడొస్తావు? అని, ఆశీర్వదించి వెళ్ళిపోయారు" అన్నది. అంటే ఆ సాధువు తమ రూపమేనని సాయి తెలిపారు. అపుడుగాని శ్రీ వాసుదేవానందులు చెప్పిన మాటలకర్థం సగుణ్‌కు తెలియలేదు. తర్వాత అతడు జీవితాంతం శిరిడీలో వుండిపోయాడు.

శ్రీ గోపాల్‌దాస్ : నాసిక్‌లో గోపాల్‌దాస్ మహరాజ్ అనే సిద్ధపురుషు డుండేవాడు. వారి భక్తులు డా॥ గణే బాబాను గూడా పూజించేవాడు. ఒకరోజు అతని మామగారు శిరిడీ వెళ్తుంటే నాసిక్‌లో గోపాలదాసుగారికి తన దక్షిణగా రూ. 5/-లు అందజేయమని యిచ్చాడు. నాటి సాయంత్రం రామాలయంలో సాధుసంతర్పణకని గోపాల్‌దాస్ స్వయంగా వంట చేస్తున్నారు. ఎందరో భక్తులక్కడ జేరారు. దక్షిణ అందజెయ్యడమెలా అని గణే మామగారు ఆలోచిస్తుంటే, స్వామి అతనిని పిలిచి, "1, 2, 3, 4, 5" అంటూ లెక్కించి దక్షిణ అడిగి తీసుకున్నారు. తర్వాత ప్రసాదమిచ్చి, "పరుగెత్తు, లేకుంటే బండి అందదు" అని నవ్వుతూ వీడ్కోలు చెప్పారు. అతడు శిరిడీ చేరగానే బాబా నవ్వుతూ ఆ సంఘటన తమకే జరిగినట్లు చెప్పారు. సాయి - గోపాలదాసు వేరు కాదు.

హుమాయున్ చక్రవర్తి గురువు : మహనీయుల మాటలు కొన్ని నిగూఢంగా వుంటాయి. శ్రీకృష్ణుడు తన జననానికి ఎన్నో యుగాలు ముందున్న వివస్వంతునికి యోగవిద్య ఉపదేశించానన్నాడు. యూదు జాతికి ఆది పురుషుడైన అబ్రహాముకు పూర్వమే తానున్నట్లు క్రీస్తు చెప్పాడు. అలానే బాబాగూడ ఒకసారి అన్నారు : "చాలాకాలం క్రిందట పైఠానులో నేనొక సద్బ్రాహ్మణునితో వున్నాను. నాకు అతడే భిక్ష యిచ్చేవాడు. ఈ రోజుల్లో అలాటివారు అరుదు. ఇపుడందరూ స్వార్థపరులే. ఇప్పుడతనెక్కడున్నాడో అల్లాకే ఎరుక! నేనంతకు కొన్నివేల సం॥ల పూర్వంగూడ వున్నాననుకో! నేనప్పటికే వృద్ధుడుగా ప్రయాగలో చుట్టకాలుస్తుండేవాణ్ణి. అక్కడ వీణ, చిరుతలు ధరించి, భజన

చేస్తుండే బ్రాహ్మణుడు నా వద్ద కొచ్చి, నమస్కరించి, 'ముకుంద్ బ్రహ్మచారి చేస్తున్న తపస్సు త్వరలో పూర్తవుతుంది. ఓరిమి వహించమని మీరతనితో చెప్పండి. నిజంగా యిది భగవదాజ్ఞ. నేనొక వ్రతమాచరిస్తున్నాను గనుక ఈ పని మీరే చేయాలి' అన్నారు. నేను ముకుంద్ నివసించే మఠానికి వెళ్ళాను. అది నీమ్‌గాఁవ్ గ్రామమంత పెద్దది. ముకుంద్, అతని శిష్యులూ నేను ముస్లిమునని తలచి, 'మేమిక్కడ అనుష్టానం చేసుకుంటున్నాము. నీ రాకవలన ఈ మఠం అపవిత్రమైంది. మేమంతా ఆత్మాహుతి చేసుకుంటాం. ఆ పాపం మీకు సంక్రమిస్తుంది' అన్నారు. నేను, 'అల్లామాలిక్!' అని చెప్పి, నేను చెప్పవలసిన మాట మనసుతోనే చెప్పి బయటకు వెళ్ళాను. బజారులో ఒక యువరాజు, అతని భార్య, కొద్దిమంది సేవకులూ కన్పించారు. ఆ యువతికి త్రాగే నీరు కావాలని భర్త అందరినీ అడుగుతున్నాడు. నా కమండలంలో నీరిచ్చాను. అవి త్రాగి ఆమె నా పాదాలపై పడింది. ఆమెను ఆశీర్వదించాను. వెంటనే యువరాజు మోకరిల్లి, 'నా గతి ఏమిటి? నాకు దిక్కెవరు?' అన్నాడు. నేను, "అమర్‌కోట వెళ్ళండి. అక్కడ మీకు కొడుకు పుడతాడు. అతడు ఈ దేశానికి రాజవుతాడు. నీకేమీ భయంలేదు" అని ఆశీర్వదించాను. వాళ్ళు అలాగే వెళ్ళారు. వారికి పుట్టిన బిడ్డడి పేరు జలాలుద్దీన్ మొహమ్మద్. అతడే తర్వాత అక్బర్ చక్రవర్తిగా కీర్తికెక్కాడు. అంతా భగవంతుని కృప. "

ఈ వృత్తాంతం వజ్రాలగని లాంటిది. అందులో ఎన్నో నిగూఢమైన సత్యాలు, చరిత్రగూడ దాగి వున్నాయి:- **(i)** ముకుంద్ బ్రహ్మచారి వంటి ఆచార పరాయణులైన తపస్వులు, శిష్యులు, వారి మఠాలు, దేశంలో ఎన్నైనా వుండవచ్చుగాక; వ్యక్తిగతమైన వారి తపస్సులతో భగవంతుడు గూడా సంప్రీతుడై వుండవచ్చుగాక, కాని ఒక వంక బ్రహ్మజ్ఞానుల విషయంలో కులము, మతము, వారి పుట్టుపూర్వోత్తరాలు, బాహ్యమైన వారి వేషభాషలూ పట్టించుకొనక వారిని పూజించి, వారి హితవాక్కులకు విధేయులమై వుండాలని సర్వశాస్త్రాలు చెబుతున్నా, మతమౌఢ్యంతో ప్రజలు మహాత్ములను నిరసించటం దేశానికే అరిష్టం. ఒకవంక ముకుంద్ యొక్క ఈ వైఖరి గూర్చి చెబుతూనే మరొకవంక సాయి తాము చుట్టకాలుస్తున్నా గూడ ఒక సద్బ్రాహ్మణుడు, భగవదాజ్ఞను పొందినవాడు గూడ, తమకు నమస్కరించారని చెప్పారు. ఈ పరమసత్యానికి చరిత్రలో లెక్కలేనన్ని తార్కాణాలున్నాయి.

(ii) మతద్వేషంతో సాటి మనిషియైన రాజకుమార్తెకు త్రాగడానికి నీరుగూడ యివ్వ నిరాకరించడం దైవనిర్ణీతమైన ధర్మానికే కళంకం. మానవులు ఏ దేశస్థులు, మతస్థులు అన్న ప్రమేయం లేకుండా సాటి మానవులపట్ల, మహాత్ముల పట్ల ప్రేమతో ధర్మబద్ధంగా నడుచుకుంటే దైవకృప లభిస్తుంది. లేకుంటే దేశానికి పతనము, పరాధీనమూ తప్పదని సూచించారు సాయి.

(iii) మహాత్ములకు మధ్య బాహ్యాచారాలకు, మత భేదాలకూ అతీతమైన ప్రేమానుబంధాలుంటాయి. కనుకనే సాయికి ఆ సద్బ్రాహ్మణుడు నమస్కరించాడు ; అంతకుముందు పైఠానులో ఒక సద్బ్రాహ్మణుడు సాయిని తన యింట వుంచుకొని నిత్యమూ ఆయనకు భిక్షనిచ్చేవారట.

పూర్వపు దత్తావతారాలు గూడ వారి రూపాలే : సింధియాకు అందరూ కుమార్తెలే. అతడు 1903లో గాణ్గాపూర్ దర్శించి, తనకు కొడుకు జన్మిస్తే దర్శనానికి వస్తానని మ్రొక్కుకున్నాడు గాని, అది నెరవేరాక అతడు మ్రొక్కు తీర్చలేదు. అతడు 1914లో శిరిడీ దర్శించాడు. అతడిని చూస్తూనే సాయి ఉగ్రులై, "ఒక్క కొడుకు పుట్టాడని నీకింత గర్వమా? అంతటి అదృష్టం నీ రాతలో లేదు. నా శరీరం చీల్చి నీకొకణ్ణి ప్రసాదించాను" అన్నారు. 15వ శతాబ్దానికి చెందిన శ్రీ నృసింహ సరస్వతియే నేటి సాయిబాబా అని సింధియా గుర్తించాడు.

బాబా ఒకరోజొక కథ చెప్పారు : "ఒకరోజు కొందరు ముస్లింలు వారితో విందారగించమని పట్టుబట్టారు. బ్రాహ్మణుడనైన నాకు మాంసాహారం నిషిద్ధమని చెప్పినా వారు వినలేదు. అప్పుడు నేను వంటకాలపై గుడ్డకప్పి

భగవంతుని ప్రార్థించాను. గుడ్డ తీసేసరికి ఆ మాంసం పెద్ద గులాబిపూలుగా మారింది. ఆ ముస్లిములు ఆశ్చర్యపడి క్షమాపణ వేడుకున్నారు. " ఈ లీల మూడవ దత్తావతారమైన శ్రీ మాణిక్య ప్రభువుల చరిత్రలో జరిగింది. సాయి - మాణిక్య ప్రభువులూ ఒక్కరేనన్నమాట.

శ్రీ సాయి పూర్ణదత్తావతారము గనుక దత్తాత్రేయుడు త్రిమూర్త్యాత్మకుడు, పరబ్రహ్మ స్వరూపి. సృష్ట్యాదిలో సృష్టి స్థితిలయాలకు కారణమైన త్రిగుణాలే త్రిమూర్తులు. ఆయన యెప్పుడూ గురు స్వరూపియై, మునిజన వంద్యుడై, అన్ని మతాలవారినీ, వారి ధర్మాన్ని, పాత్రతనూ అనుసరించి అనుగ్రహిస్తూ వచ్చారు. (అందుకే పై వృత్తాంతంలో తాము ముకుంద బ్రహ్మచారిని అనుగ్రహించ బోయారు గాని అతడు నిరసించాడు. తత్ఫలితంగా ముకుందుకు జన్మాంతరంలో వ్యక్తిగతమైన ఉన్నతి కల్గినా, సార్వజనీనమైన అతని సంకల్పం నెరవేరలేదని తర్వాత వృత్తాంతం తెల్పుతుంది).

(iv) భక్తులకు తామే దత్తస్వామి, దత్తావతారములైన నృసింహ సరస్వతి, మాణిక్యప్రభు, అక్కల్‌కోట స్వామియని అనుభవాలిచ్చారు. అందుకే వారి చరిత్ర పారాయణ ఎంతో ఆవశ్యకమని ఆయన సూచించారు.

(v) అయితే సనాతన ధర్మమూర్తియైన దత్తస్వామి ఈ సాయి అవతారంలో ఫకీరుగా దర్శనమిచ్చారు. ఏకనాథునికి, వారి గురువైన జనార్ధనస్వామికీ గూడ ఆయన దర్శనమిచ్చారు. అందుకే దత్తాత్రేయుడు కేవలం దేవతలలో ఒక్కరు మాత్రమేగాదు. అన్ని మతాలలోనూ మహనీయులుగా మానవాళికి యెప్పుడూ లభ్యమయ్యే సద్గురుతత్త్వమే దత్తస్వామి. అందుకే అట్టివారి చరిత్రలన్నీ ఒకే రీతిగా వుంటాయి. హిందూ ధర్మంలో దత్తస్వామి, బౌద్ధంలో పద్మసంభవుడూ, ఇస్లాంలో ఖిజర్ మరియు మహబూబ్ సుభానీలుగా ఆ తత్త్వమే ప్రకటమైంది. వీరందరూ సంకుచిత మతోన్మాదాన్ని నిరసించి సామరస్యాన్నే బోధించారు.

ఫిబ్రవరి, 1918లో బాపూజీశాస్త్రి అను భక్తుడు గంగాజలంతో సాయిపాదాలు కడిగి, పూజించి, శివాజీ గురువైన సమర్థరామదాసస్వామి పుణ్య తిథియైన 'దాసనవమి'కి సజ్జనగడ్ వెళ్ళడానికి అనుమతి కోరాడు. సాయి నవ్వి, "నేనే అక్కడా, యిక్కడా వున్నాను!" అని ఆశీర్వదించి పంపారు. బాపూజీ సజ్జనగడ్ వెళ్ళాడు. అక్కడ దాసనవమినాడు తెల్లవారు ఝామున 5 గంటలకు బాబా భౌతికంగా దర్శనమిచ్చారు. సాయియే సమర్థరామదాస స్వామిగూడా. **సద్గురు భక్తుడు సర్వాన్నీ తన గురువులోనే చూచుకోవాలి.**

సాయిబాబా ఒకప్పుడు అహ్మదాబాదునుండి వచ్చిన ఒక ముస్లిముకు మహమ్మదులవారి ఖలీఫా, హజరత్ ఆలీగా దర్శనమిచ్చారు. ఇటువంటి లీలలు సాయిబాబా తమ పూర్వజన్మలలోనే పరిపూర్ణులైన దివ్యపురుషుడని నిరూపిస్తాయి. ఆయన ఈ జన్మలో 'గోపాల్‌రావ్ దేశ్‌ముఖ్' ఉరఫ్ వెంకూసా కృపవలన పూర్ణుడైనట్లు తెలిపే కథ వాస్తవం కాజాలదు. చిత్రమేమంటే ముకుంద్ బ్రహ్మచారి గూర్చి సాయి చెప్పిన కథకు చారిత్రకమైన ఆధారమున్నది. నాటి మొగలు చరిత్రకారుడు 'బిల్లి గ్రామి' ఆ విషయం యిలా వ్రాశాడు :- ముకుంద్ అనే బ్రహ్మచారి మరుజన్మలో ముస్లిము రాజ్యాన్ని మనదేశంలో అంతమొందించాలన్న సంకల్పంతో ఘోర తపస్సు చేశారట. అతడే మరుజన్మలో అక్బరు చక్రవర్తిగా జన్మించి, తన పూర్వ సంస్కారాన్ననుసరించి కొందరు హిందూస్త్రీలను వివాహమాడి, తిలకధారణ మొదలైన కొన్ని హిందూ ఆచార సంప్రదాయలను ఆదరించాడని నాటి ప్రజలనుకునేవారట.

కనుకనే శ్రీ సాయి, మహాసమాధి తర్వాత గూడ ప్రకటమైన మహనీయుల రూపాలలోగూడ విజయం చేయనున్న దత్తాత్రేయతత్త్వమే. బాబా మహాసమాధి చెందినపుడు హార్దా నివాసియైన సదాశివ్ ఎంతగానో కుమిలిపోయాడు. ఒకరాత్రి బాబా అతనికి స్వప్న దర్శనమిచ్చి, "ఇపుడు సాయి ఖేడాలో వున్నాను, వచ్చి దర్శించుకో!

శోకించకు'' అన్నారు. ఆ కాలంలో ఆ ఊరిలో శ్రీ ధునీవాలా దాదా అనే మహాత్ములున్నారు. వారి దర్శనానికి వెళ్ళాడు సదాశివ్. కాని వారి స్థానంలో కొద్ది నిమిషాలు సాయిబాబా దర్శనమిచ్చారు. వారిద్దరూ వేరుగాదు. విదేశంనుండి రమణభక్తుడైన డోంగ్రే కుటుంబం మద్రాసు రాగానే కొందరు సాయిభక్తులు వారిని విరాళం కోరారు. "మేము రమణభక్తులము'' అన్నారు శ్రీమతి డోంగ్రే. "శిరిడీ వెళితే రమణ మహర్షి, సాయిబాబా వేరుకాదని మీకే తెలుస్తుంది'' అన్నారు ఆ సాయిభక్తులు. కొంతకాలానికి బొంబాయినుండి శ్రీమతి డోంగ్రే, ఆమె స్నేహితురాలు శ్రీమతి భాట్కల్ శిరిడీ వెళ్ళారు. అక్కడ గురుస్థానంలోని సాయిపటంలో వారిద్దరికీ రమణమహర్షి దర్శనమయింది. వారెంతో తృప్తిపడి, అక్కడే సాయిబాబా జీవితచరిత్ర ఒకవారం పారాయణ చేశారు.

★★★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 8

విశ్వరూపము

శ్రీ గురుగీత, సద్గురువు యొక్క ఆధ్యాత్మిక స్థితి గురించి 'గురుర్విశ్వం నచాన్యోஉస్తి' అంటే 'గురువు ఖల్విదం బ్రహ్మ' - "ఈ సర్వమూ బ్రహ్మమే" అని వేదాలు చెబుతున్నాయి. దీనినే "ఇందుగలడందులేడని సందేహము వలదు చక్రి" అని భాగవతం చెబుతుంది. ఆ బ్రహ్మమే, ఆ భగవంతుడే తానైనవాడు మాత్రమే గురువు. శ్రీకృష్ణుడు అర్జునునికి విశ్వరూపము దర్శనమిచ్చినట్లే, రెండవ దత్తావతారమైన శ్రీ నరసింహ సరస్వతీస్వామి త్రివిక్రమభారతియనే సన్యాసికిగూడ ప్రసాదించారు. ఈ కాలంలో అజ్ఞులైన ప్రజలందరికీ స్థూలమైన అనుభవాలద్వారా సర్వదేవతలు, మహాత్ములు, జీవులేగాక జడమని తలచబడే పూజావిగ్రహాలు, పటాలుగూడ తమ రూపమేనని తెల్పినవారు శ్రీ సాయి ఒక్కరేనేమో!

శిరిడీలో ఒకనాటి మధ్యాహ్నం శ్రీమతి తార్కాడ్ వడ్డన చేస్తుంటే, ఆకలిగొన్న కుక్క ఒకటి వచ్చి జాలిగా చూసింది. వెంటనే ఆమె ఒక రొట్టెవేస్తే ఎంతో ఆత్రంగా తిని వెళ్ళిపోయింది. నాటి సాయంత్రం మశీదులో సాయి ఆమెతో, 'తల్లీ! నీవు పెట్టిన రొట్టెతో నా ఆకలి, ప్రాణాలు కుదుటపడ్డాయి!" అన్నారు. ఆమె ఆశ్చర్యంతో, "నేను మీకెప్పుడన్నం పెట్టాను?" అన్నది. "మధ్యాహ్నం నీవు రొట్టెవేసిన కుక్కను నేనే. అన్ని జీవుల రూపాలలోనూ నేనే ఎప్పుడూ వుంటాను. ఆకలిగొన్న ప్రాణికి పెట్టాక నీవు తింటుండు, నీకెంతో మేలవుతుంది. మశీదులో కూర్చొని నేనెన్నడూ అబద్ధం చెప్పను" అన్నారు బాబా.

ఒకరోజు సాయంత్రం సాయి మసీదుముంగిట ప్రహరీకి ఆనుకొని నిల్చొని తాత్యా మొదలైన భక్తులతో మాట్లాడుతున్నారు. లక్ష్మీబాయిషిండే వచ్చి నమస్కరించగానే, "అమ్మా, నాకెంతో ఆకలిగా వున్నది" అన్నారు. ఆమె వెంటనే వెళ్ళి రొట్టెలు, కూర చేసుకొచ్చింది. కాని బాబా వాటిని ప్రక్కనున్న కుక్కకు వేసారు. ఆమె చిన్నబుచ్చుకుని, 'మీకోసమని శ్రమపడి చేసుకొచ్చానే!'అన్నది. అపుడు బాబా, "దాని ఆకలి తీరితే నా ఆకలి తీరినట్లే. దానికి నోరు లేకపోవచ్చుగాని ఆత్మ వున్నది. ఆకలిగొన్న ప్రాణికి అన్నం పెడితే నాకు పెట్టినట్లే!" అన్నారు. నాటి నుండి రోజూ అదే సమయానికి ఆమె నియమంగా జీవితాంతమూ బాబాకు రొట్టె సమర్పించింది. అందుకే తమ చివరి క్షణంలో సాయి ఆమెననుగ్రహించి రూ. 9/-లు ప్రసాదించారు.

ఏటా కొన్ని నెలలు శ్రీమతి ఖాపర్డే శిరిడీలో వుండి, నిత్యమూ భోజనం బాబాకు నివేదించేది. ఆమె అప్పుడప్పుడూ ఆయనను తన యింటికి భోజనానికి ఆహ్వానించేది. కొద్దిరోజులాయన నవ్వి వూరుకున్నారు. రెండుసార్లు వస్తానన్నారు గానీ రాలేదు. ఆ తర్వాతరోజు ఆమె వంట చేస్తూంటే ఒక కుక్క వాసనబట్టి యింట్లో జొరబడింది. అది వంటకాలను తాకుతుందన్న తొందరలో ఆమె పొయ్యిలోని కట్టెతీసి దానిపై విసిరేసరికి ఆ కుక్క పారిపోయింది. తర్వాత ఆమె మసీదుకు నైవేద్యం తీసుకుపోగానే బాబా, "నేను వస్తే మండుతున్న కట్టె నాపై విసురుతావా?" అన్నారు. మొదట ఆమె నివ్వెరబోయింది గాని, తర్వాత వాస్తవం తెలుసుకున్నది.

ఉబ్బసంతో బాధ భరించలేక హంసరాజ్ సతీసమేతంగా శిరిడీలో కొద్దికాలమున్నాడు. బాబా కృపవలన

వ్యాధి తగ్గిందిగాని, సాయి అతనిని పుల్లపెరుగు సుతరామూ తినవద్దన్నారు. కాని అతడు మూర్ఖించి భార్యచేత రోజూ పాలు తోడు పెట్టించేవాడు. ఆ విషయం బాబాతో చెప్పనివ్వలేదు. అదేమి చిత్రమోగాని, రోజూ ఆ యిద్దరూ ఆరతికి వెళ్ళి వచ్చేలోగా ఒక పిల్లి ఆ పెరుగు త్రాగిపోయేది. ఒకరోజతడు కోపంతో ఆరతికి గూడ వెళ్ళక, పొంచివుండి, పిల్లివచ్చి పెరుగు తాకగానే కర్రతో కొడితే పారిపోయింది. తర్వాత అతడు మసీదుకు వెళ్ళగానే బాబా, "ఇక్కడొక మూర్ఖుడు పుల్లపెరుగు తిని చావాలని చూస్తున్నాడు. కాని రోజూ అతను తినకుండా చూస్తున్నాను. వాడు నన్నీరోజు కర్రతో కొట్టాడు!" అన్నారు. సాయి ఒకవంక భక్తులను రక్షిస్తూ, మరొకవంక వారినుండి తిట్లు, దెబ్బలు భరించవలసివచ్చేది. ఒకసారి నానాసాహెబ్ డెంగళే రుచికరమైన వంటకాలు వెండి పళ్ళెంలో వుంచి బాబాకు అర్పించాడు. ఆయన చప్పట్లు చరిచారు. వెంటనే ఒక నల్లకుక్క వచ్చి వాటిని తింటోంది. అదిచూచి అతడు మనసులో అసహ్యించుకున్నాడు. వెంటనే బాబా ఆ పళ్ళెం దూరంగా తోసేసి, "దీనిని నీవే తీసుకో, నాకొద్దు! అన్నాడు. ఆ జీవినసహ్యించుకుంటే వారిని అసహ్యించుకున్నట్లే.

ఒకసారి శిరిడీ వాస్తవ్యులొకరు ఒక కోడెదూడకు నొసట త్రిశూలముద్ర వేసి, శివునిపేర అబోతుగా విడిచారు కొంతకాలానికి అది ఎదిగి పైర్లను పాడుచేస్తోంది. శివుని అబోతని ఎవరూ దానిని దండించేవారుగాదు. చివరకు ఊరి పెద్దలంతా కలసి దానిని బందిల దొడ్డిలో వుంచి, తమ ఖర్చుతో దానిని పుష్టిగా మేపాలని నిర్ణయించి, ఒక నెలఖర్చు యిచ్చి ఒక మార్వాడీతో దానిని యేవలాకు పంపారు. సాయంత్రానికి అతడు శిరిడీవచ్చి ఆ కార్యం నెరవేర్చానన్నాడు. మరుసటి తెల్లవారుఝామున గ్రామంలో ఒక భక్తునికి సాయి మూడుసార్లు స్వప్నంలో కన్పించి, "నన్ను రహటాలో ఒక కసాయి ముంగిట్లో కట్టేసారు. వెంటనే వచ్చి విడిపించు" అన్నారు. తెల్లవారాక అతడాశ్చర్యంతో యేవలా వెళ్ళి విచారిస్తే నిజంగానే మార్వాడి అబోతును రూ. 14/- లకు ఒక కసాయికి అమ్మేసినట్లు తెలిసింది. అప్పుడతడు దానిని విడిపించి, బందిలదొడ్లో అప్పగించి, శిరిడీ వచ్చి గ్రామ పెద్దలకు ఫిర్యాదు చేసాడు. పెద్దలు మార్వాడీకి శిక్ష విధించారు.

ఒకరోజు సాయి పోళీలు కావాలంటే నానాచందోర్కర్ స్వయంగా వండి వాటిని నివేదించాడు. సాయి వాటిని తాకనైనా తాకకుండా కూర్చున్నారు. వాటిమీద ఈగలు, చీమలు చేరాయి. అపుడు సాయి నానాతో, "నేను ఆరగించాను. నీవు తీసుకో!" అన్నారు. నానా ఎంతో నిరుత్సాహపడి, అలిగి అన్నంగూడ తినకుండా చావట్లో పడుకున్నాడు. సాయి అతనిని పిలిపించి, "నానా, 18 సం॥లు నా దగ్గరుండి నీవు గ్రహించినదిదేనా? ఆ చీమలు, ఈగల రూపంలో నేనే ఆరగించాను. నీవు ప్రసాదం తీసుకో!" అన్నారు. "వాటి రూపాలలోనూ మీరే ఆరగించారని నాకు ఋజువేమిటి?" అన్నాడు నానా. బాబా వెంటనే ఒక భంగిమ చేశారు. తనకు తప్ప మరెవ్వరికీ తెలియని తన జీవిత రహస్యం బాబాకు తెలుసునని అతడు గ్రహించాడు. తన హృదయంలోలాగే అన్ని జీవులలోనూ బాబాయే వున్నారని నానాకు అర్థమై ప్రసాదం తీసుకున్నాడు.

నిజానికి జడమైన వస్తువులుగూడ బ్రహ్మమే. ఆ సత్యాన్ని తెల్పే తమ లీలలను భక్తులు పూజించే విగ్రహాలు, పటాలవరకే సాయి పరిమితం చేశారు. లేకుంటే మన నిత్యజీవితాలే తారుమారవుతాయి. భగవంతరావు క్షీరసాగర్ మరణించాక అతని కొడుకు ఇంట్లోని దేవతా విగ్రహాలకు పూజ, నైవేద్యము మానేసాడు. అతడు మొదటిసారి శిరిడీ రాగానే సాయి, "ఇతని తండ్రి నాకాప్తుడు. నాకు నివేదించక తినేవాడు గాదు. ఆయన మరణించాక యితడు నైవేద్యమివ్వక నన్నూ, విఠలుణ్ణీ పస్తుంచాడు. ఇతనికి హితం చెప్పడానికే రప్పించాను" అన్నారు. తల్లిదండ్రులు చేసిన భక్తి సంతతినిగూడ కాపాడుతుంది. వారు యిండ్లలో చేసుకొన్న పూజలు సాయికి చెందుతాయి.

అలానే ఒకప్పుడు కొందరు భక్తులు బాబాను ఫోటో తీయడానికి అనుమతి కోరారు. సాయి మొదట

అనుమతించలేదు. వారు పదేపదే అర్థిస్తూంటే అంగీకరించారు. ఫోటో తీసాక చూస్తే అందులో సాయి పాదాలు మాత్రమే కన్పించాయి. ఆ విషయం చెబితే, "ముఖ్యమైనవి పాదాలే గదా!" అన్నారు బాబా. అదే దత్తపాదుకల ప్రాముఖ్యత. మరొకడు ఆయన అనుమతి పొందకనే ఫోటో తీసాడు. తర్వాత చూస్తే అందులో పడినది అతని గురువు చిత్రమే!

ఒకప్పుడు కాకాదీక్షిత్, తన కుమారుడి ఉపనయనానికి శ్రీ సాయిని నాగపూర్ ఆహ్వానించడానికి శిరిడీ చేరాడు. అదే సమయానికి నానాచందోర్కర్, తన కుమారుడి వివాహానికి సాయిని గ్వాలియర్ ఆహ్వానించటానికి వచ్చాడు. సాయి ఆ యిద్దరితో తమ ప్రతినిధిగా శ్యామాను తీసుకెళ్ళమని చెప్పి, తాము కాశీ, ప్రయాగ, దర్శించి శ్యామాకంటే ముందుగానే గయ చేరగలమని మాట యిచ్చారు. శ్యామా ఆ శుభకార్యాలకు హాజరయ్యాక వారందరూ కొద్ది మాసాలు అయోధ్యలోను, కాశీలోనూ గడిపి, గయలో ఒక పూజారింటికి వెళ్ళారు. అక్కడ సాయిపటం దర్శనమిచ్చింది. దానిని చూడగానే శ్యామాకు ఆనందభాష్పాలొచ్చాయి. ఆ పూజారి 12 సం॥లకు పూర్వం శిరిడీ వెళ్ళి, శ్యామా యింటనున్న ఆ పటం తనకు కావాలన్నాడు. సాయి ఆజ్ఞననుసరించి శ్యామా ఆ పటమిచ్చాడు. శ్యామాకంటే ఎన్నో సం॥ల ముందే సాయి అచటికి చేరారు. శ్యామా ఆ పూజారి యింటనే బస చెయ్యడం ఆశ్చర్యం! అక్కడగూడా బాబా తమవాణ్ణి తమవద్దనే వుంచుకున్నారు.

ధోపేశ్వర్‌నుండి కాకా మహరాజ్ అనే సిద్ధపురుషుడు ఒకసారి పూనా వచ్చారు. అచటి భక్తులు తమ తమ యిండ్లకు ఆహ్వానిస్తుండడంవలన సాయి భక్తుడు సాఠే యింటికి రాలేనని ఖండితంగా చెప్పారు. కాని సాయంత్ర మయ్యేసరికి ఆయనే సాఠే యింటికి వస్తున్నామని కబురుచేసి వచ్చారు. సాఠే ఆశ్చర్యపోతుంటే ఆ స్వామి అక్కడున్న సాయిపటం చూపి, "ఇక్కడకొచ్చేవరకూ ఆయన నన్ను విడువలేదు!" అన్నారు. ఇంట్లో సాయి పటముంటే సాయి వున్నట్లే!

భగవంతుడైన సద్గురువుకు తన రూపాలైన పంచభూతాలు ఆధీనంలో వుంటాయి. వేసవిలో ఒకనాడు ఎండ భరించలేక భక్తులంతా ఇళ్ళకు వెళ్ళారు. అయిదుగురు మాత్రం మసీదులో వుండిపోయారు. సాయి వారిని ధునిదగ్గర కూర్చోమన్నారు. కొద్ది నిముషాలలో మసీదంతా చల్లబడింది. భక్తులంతా ఆశ్చర్యపోయారు. అలానే ఒకసారి కొండాజీ అనే భక్తునితో సాయి, "నీ గడ్డివామికి నిప్పంటుకుంది, వెళ్ళు!" అన్నారు. అతడు వెళ్ళి చూస్తే అక్కడ పొగ కూడా లేదు. సాయి మరలా అలాగే అన్నారు. ఈసారి గడ్డివామి నుండి దట్టంగా పొగలేస్తోంది! దానిచుట్టూ ఎన్నో వాములున్నాయి. గాలి బాగా వీస్తున్నది. గ్రామస్థులు ఆపద నివారించమని సాయిని ప్రార్థించారు. ఆయన దానిచుట్టూ కొద్ది నీరుచల్లి, అది ఒక్కటే తగలబడుతుందని అభయమిచ్చారు. అలానే జరిగింది.

ఒకరోజు సాయి ధునిలో కట్టెలు వేస్తున్నారు. మంటలు విజృంభించి, మసీదువాసాలు అంటుకునేట్లున్నాయి. భక్తులు ఆందోళన చెందుతూంటే, సాయి సట్కాతో ప్రక్కనున్న స్తంభాన్ని కొడుతూ మంటనుద్దేశించి, "తగ్గు, తగ్గు, జాగ్రత్త!" అన్నారు. ధుని అణిగి మందంగా వెలగసాగింది.

భీమా అనేవాడు సాయిలీలలు చూడాలని శిరిడీ వచ్చాడు. మధ్యాహ్నం ఆరతికాగానే సాయి, "నేను పిలిచేవరకు మీ గదులలోనే వుండండి!" అని అందర్నీ పంపేసారు. వారు గదులు చేరగానే సుమారు 15 ని॥పాటు యిళ్ళ కప్పులెగిరిపోయేలా పెనుగాలి వీచింది. మబ్బుపట్టి కొద్ది వర్షం కూడా కురిసింది. తరువాత భక్తులను పిలిపించి "భయపడ్డారా?" అన్నారు బాబా. భీమా ఆయన పాదాలకు నమస్కరించగానే, "భగవంతుని లీల చూచావా? ఇలా ఎన్నైనా చూడగలవు" అన్నారు. ఒకరోజు హైకోర్టు న్యాయవాది ప్రధాన్ తప్పక బొంబాయి

బయలుదేరవలసివున్నది! కాని అంతలో తీవ్రమైన గాలి, వాన చెలరేగాయి. అలాగే పావుగంట కొనసాగి కాలువలు పొంగితే బొంబాయి చేరలేమని అతడు భయపడ్డాడు. వెంటనే బాబా మసీదు అంచుకువచ్చి, ఆకాశంకేసి చూచి, "భగవంతుడా! వర్షమాపు. నా బిడ్డలు యిల్లు చేరాలి. వారిని సుఖంగా వెళ్ళనివ్వు!" అన్నారు. వర్షం వెంటనే నిలచిపోయింది. ప్రధాన్ బయలుదేరి బొంబాయి వెళ్ళాడు!

సద్గురువు సాక్షాత్తు భగవంతుడు. సర్వ పుణ్యతీర్థాలూ వారి పాదాలలో వుంటాయని 'గురుగీత' చెబుతుంది. గంగ విష్ణుపాదాలనుండి ఉద్భవిస్తుందంటారు. సద్గురువు ఆ విష్ణుమూర్తే. అయితే దాసగణు తన హరికథలలో సాయిని శ్రీహరిగా కీర్తించినా, అతని హృదయంలో అట్టి విశ్వాసం దృఢపడలేదు. భక్తుడికట్టి విశ్వాసమివ్వవలసినది గూడ సద్గురువే.

ఒక మహాశివరాత్రినాడు దాసగణు గోదావరిలో స్నానంచేసి రాదలచి, సాయి అనుమతి కోరాడు. సాయి, 'గణూ! అందుకోసం అంతదూరం వెళ్ళాలా? శ్రద్ధాభక్తులుంటే ఆ తీర్థాలిక్కడే వున్నాయి. లేకుంటే అక్కడాలేవు!' అన్నారు. 'ఇవిగో, గంగాయమునలు', అని అతని చేతులు తమ పాదాలవద్ద వుంచమన్నారు. సన్నని ధారగా అతని దోసిలి నిండా తీర్థమొచ్చింది. అతడానీరు తీసుకొని క్షణమాలోచించి నెత్తినమాత్రం చల్లుకున్నాడు. బాబా చిరునవ్వుతో మౌనంగా చూచారు. ఆయన సమాధి చెందాక దాసగణు మరొకయోగిని దర్శించినప్పుడు ఆ యోగి, "మూర్ఖుడా! సాయి అంతటి మహనీయుని పాదాలనుండి వచ్చిన తీర్థజలాన్ని, ఆయన ముస్లిమన్న సంకోచంతో, శిరస్సున ధరించావేగాని, నోటిలో పోసుకోలేదుగదా! నీకెన్ని జన్మలకైనా మరల అట్టిది లభిస్తుందా? అంతటి మహనీయుడు మరల దొరుకుతాడా?" అని మందలించారు.

'అభినవ తుకారాం' అని పేరుపొందిన బాలబువాసుతార్, మొదట 1917లో శిరిడీ వచ్చాడు. అతడు నమస్కరించగానే సాయి, 'నాకితడు నాలుగు సం॥ల నుండి తెలుసు!' అన్నారు. అతడు మొదట ఆశ్చర్యపోయాడు గాని, తర్వాత గుర్తొచ్చింది - తాను సరిగ్గా నాలుగు సం॥ల క్రిందటనే బొంబాయిలో మొదట బాబా గురించి విని, వారి పటానికి నమస్కరించాడు. అదే బాబా చెప్పినది!

సదాశివ తార్కాడ్ విగ్రహాలను, గురువులను పూజించటం తగదని నమ్మేవాడు, కాని సాయి భక్తులైన భార్యాబిడ్డలకు అడ్డు చెప్పేవాడు కాదు. ఒకసారి అతడి భార్య శిరిడీ వెళ్ళాలనుకున్నది. తార్కాడ్ తన కొడుకును ఆమెకు తోడుగా వెళ్ళమన్నాడు. కాని అతడు, తాను వెళితే నిత్యమూ తాను సాయి పటానికి చేసే పూజ జరుగదని తలచి వెళ్ళనన్నాడు. తార్కాడ్ గత్యంతరం లేక ఆ పూజ తాను చేస్తానని మాట యిచ్చాక, ఆ తల్లీ కొడుకులు ఒక శనివారంనాడు శిరిడీ చేరారు. తార్కాడ్ సోమవారంవరకు తానిచ్చిన మాటప్రకారం యథావిధిగా బాబా పటాన్ని పూజించాడు. కాని మంగళవారంనాడు ఆఫీసు తొందరలో నైవేద్యం యివ్వటం మరిచిపోయాడు! తర్వాత ఆ సంగతి తెలిసి, బాబాకు తన తప్పుకు క్షమాపణ చెప్పమని శిరిడీకి జాబు వ్రాసాడు. సరిగా ఆరోజు అదే సమయానికి శ్రీమతి తార్కాడ్‌తో సాయి, "అమ్మా! ఆకలేస్తుంటే ఏమైనా పెడతారని మీ యింటికి వెళ్ళాను. పూజగది తలుపు తాళంవేసి వున్నది. నేనెలాగో లోపలికి ప్రవేశించాను. అక్కడ 'భావూ' (సోదరుడు) నాకు తినడానికి ఏమీ వుంచలేదు. ఆకలితో తిరిగివచ్చాను" అన్నారు. ఆమెకేమీ అర్థంకాలేదు, కాని తన ఇంట పూజ గురించి ఆందోళన చెందుతున్న ఆమె కొడుకుకు అర్థమయింది. ఆరతి అయ్యాక, నాడు సాయి అన్న మాటలు, పూజలో లోపం జరుగ నివ్వవద్దనీ తన తండ్రికి జాబు వ్రాసాడు. ఒకే సమయానికి ఒకరి జాబులొకరికి చేరాయి. సాయికి, వారి పటానికీ భేదం లేదన్నమాట!

బాబా 1917లో ఒకనాటి రాత్రి స్వప్నంలో హేమాద్పంతుకు సన్యాసి రూపంలో దర్శనమిచ్చి, మరురోజు

మధ్యాహ్నం వారింట భిక్షకు రాగలమని చెప్పారు. అతడా విషయం తన భార్యకు చెబితే, మరురోజు ఆమె ఒక అతిథికి గూడ వంట చేసింది. వర్ధనగూడ చేసి ఆయన రాకకై భక్తితో ఎదురుచూస్తున్నారు. సరిగా భోజన సమయానికి అలీ అహమ్మదు, మౌలానాయిస్మూముజావర్ అను ముస్లింలిద్దరు వచ్చారు. వాళ్ళు కాగితంలో చుట్టిన ఒక పటం అతనికిచ్చి, దాని వివరం తర్వాత చెబుతామని వెళ్ళిపోయారు. తీసిచూస్తే అది బాబాపటం! సరిగా సమయానికి సాయియే ఆ రూపంలో వచ్చారు; తమరాకను ముందుగా తెల్పారు. ఆ దంపతులు ఆ పటానికి నైవేద్యమిచ్చి, తర్వాత భోజనం చేసారు.

★★★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 9

ఉపదేశాలు I

ఇహపర శ్రేయస్సుకు సద్గురువును సేవించి, ఆయన అనుగ్రహానికి పాత్రులవడమే ముఖ్యం. ప్రాయశ్చిత్త మేలేని మహా పాపాలకు గూడ సద్గురుసేవే తరుణోపాయమని ధర్మశాస్త్రం చెబుతుంది. కనుక ప్రజలలో ఎక్కువ మందికి అదొక్కటే తరుణోపాయం. మరలా సాధన చివరిదశలో ఆత్మనిష్ఠుడు, శ్రోత్రియుడూ అయిన జ్ఞానిని ఆశ్రయించితీరాలని శాస్త్రం.

అటువంటి గురువులలో ఉత్తములు శ్రీసాయిబాబా. ముముక్షువు ఎలాటి గురువు నాశ్రయించాలో, ఎలా సేవించాలో ఒకప్పుడు సాయి ఆచరించి చూపారు. ఈ విషయమే మరలా తిరిగి చిత్రమైన రీతిన, ఉత్తమమయిన తమ బోధగా, శ్యామాచేత చెప్పించారు. ప్రపంచంలోని అన్ని మతాల ఆధ్యాత్మిక సాంప్రదాయాల, మహనీయుల, అనుభవాలసారమంతా అందులోనే వున్నది.

సాఠే అను పెద్దవ్యాపారి ఒకప్పుడెంతో నష్టపోయి యిల్లువిడచి పోవాలని తలచాడు. స్నేహితుల సలహాపై 1911లో సాయి సన్నిధిలో కొద్దిరోజులున్నాడు. అపుడు "శ్రీ గురుచరిత్ర" ఒక సప్తాహం పారాయణ చేశాడు. నాటిరాత్రి ఆ గ్రంథాన్నే చేతబట్టుకుని సాయి స్వప్న దర్శనమిచ్చి, దానిని గురించి యేమో చెప్పారు. మరుసటి ఉదయమే దాని భావమేమని అతడు కాకాసాహెబ్‌చేత బాబాను అడిగించాడు. అతడింకొక పారాయణ చేయాలని ఆయన వివరించారు. అది వినిన హేమాద్పంతు, తాను 40 సం॥లుగా పారాయణ, 7 సం॥ల నుండి సాయిసేవ చేస్తున్నా లభించని కృప సాఠేకు అంత త్వరగా లభించిందే అని కలతచెందాడు. వెంటనే అతనిని లేపి, "శ్యామా వద్దకు వెళ్ళి అతనివద్ద రూ. 15/-లు దక్షిణ తీసుకొని, అతనితో కొద్దిసేపు మాట్లాడిరా!" అని బాబా ఆదేశించారు.

హేమాద్పంతు వెళ్ళేసరికి శ్యామా పూజకు కూర్చుంటున్నాడు. అక్కడ వున్న ఏకనాథ భాగవతం చూడగానే, తానారోజు పారాయణ చేయలేదని గుర్తొచ్చింది. దానిని తెరవగానే ఆ రోజు చదవవలసిన భాగమే వచ్చింది! తననందుకే బాబా పంపారని తలచి పారాయణ పూర్తిచేసాడు హేమాద్పంతు. ఇంతలో శ్యామాగూడ పూజ పూర్తి చేసుకుని వచ్చాడు. బాబా తననుంచి దక్షిణ కోరారని విని, "నావద్ద పైకంలేదని ఆయనకు తెలుసు! నా 15 నమస్కారాలే దక్షిణగా సమర్పించు. సరేగాని, నీవంటి విద్యావంతుణ్ణి నా మాటలు వినడానికెందుకు పంపారో! అయినా, ఆయన స్ఫురింపజేసిన లీల చెప్తాను:

'సంగమనేర్ నుండి వచ్చిన రాధాబాయి, తాను కోరకనే సాయి తనకు ఉపదేశమిస్తేగాని, అంతవరకూ అన్నం తిననని నిశ్చయించుకొన్నది. మూడవరోజు ఆమెకేదైనా హితం చెప్పమని సాయిని కోరాను. బాబా ఆమెను పిలిపించి యిలా చెప్పారు: 'అమ్మా, వ్యర్థంగా నిన్ను నువ్వు బాధించుకోకు. నా వృత్తాంతం విను. నీకెంతో ఉపకరిస్తుంది. నా గురువు గొప్పయోగి, దయామయుడు. వారినుండి ఉపదేశమాశించి 12 సం॥లు సేవించాను. కాని ఆయన నాకే మంత్రమూ ఉపదేశించలేదు; నా తల బోడిచేయించి రెండు పైసలు దక్షిణ కోరారు. ఆయన

కోరినది ధనంకాదు; మొదటి పైస నిష్ఠ, అంటే స్థిరమైన విశ్వాసం; అది సమర్పించాను. ఆ ప్రేమ మూర్తి ఎప్పుడూ ధ్యానంలో వుండేవారు. ఆయనను చూస్తూనే నేను ఆనందంలో మునిగి ఆకలి దప్పులు గూడా మరిచాను. ఆయనను మరచి నాకు శాంతి ఉండేదికాదు. నా మనస్సు వారియందే నిలిచింది. అంత కాలమూ నాకు అన్నవస్త్రాలకు లోటులేదు. ఈ ప్రేమయే, విశ్వాసమే, నేను సమర్పించిన మొదటి పైస. ఆయన కోరిన రెండవపైస సబూరి, అంటే సంతోషము-పట్టుదలతో కూడిన ఓరిమి. అది సర్వ పాపాలను, కష్టాలనూ తొలగించి విజయాన్నిస్తుంది. సర్వ సద్గుణాలకు నిధి. విశ్వాసానికి సోదరి. నేను దీనిని సమర్పించాను. ఆయన కృపకోసం వేచి వున్నాను. ఆయన తమ మనోదృష్టిని నాపై నిలిపి నన్నుద్ధరించారు. నా యత్నమేమీ లేకనే వారి కృపవలన నాకీస్థితి కలిగింది. ఆయన నాకే మంత్రమూ ఉపదేశించనపుడు, నేను నీకెలా ఉపదేశిస్తాను? మంత్రముగాని, మరే ఉపదేశంగాని ఎవరివద్ద నుంచీ పొందవద్దు. నన్ను గురించి సదా ప్రేమతో చింతన చేస్తూండు. నేనూ నీపై దృష్టి నిలుపుతాను. అలాచేస్తే నీకు పరమార్థం తప్పక లభిస్తుంది. మశీదులో కూర్చొని నేనెన్నడూ అబద్ధం చెప్పను. వేరే సాధనగాని, శాస్త్ర విజ్ఞానంగాని అవసరం లేదు. పూర్ణ విశ్వాసమూ, ఓరిమి కల్గివుండు. గురువే దైవం. ఆయనే సర్వమూ సమకూర్చగలడు.'

ఈ కథ వినడంతోనే హేమాడ్పంతుకు పట్టరాని ఆనందంతో కంఠం గద్గదమై, నేత్రాలు ఆనందభాష్పాలతో నిండి, శరీరమంతా రోమాంచితమైంది. ఇంతలో గంటలు విన్పించి, మధ్యాహ్న ఆరతికి ఇద్దరూ మశీదు చేరారు. భక్తులు చేతులు తడుతూ మేళతాళాలతో ఆరతి పాడుతున్నారు. పంత్‌ను చరచరా లాక్కుపోయి సాయికి కుడిప్రక్కగా శ్యామా కూర్చున్నాడు. పంత్ ఎదురుగా కూర్చున్నాడు. సాయి వారు చెప్పిందంతా విని, "అర్థమైందా?" అన్నారు. "అర్థమైంది, నా చిత్తం శాంతించింది, సరైన మార్గం తెలిసింది" అన్నాడు పంత్.

"నా పద్ధతి అత్యాశ్చర్యకరము. ఈ ఒక్క సంఘటనా గుర్తుంచుకొంటే చాలు" అని బాబా దాని సారాంశమిలా చెప్పారు; "ఆత్మజ్ఞానానికి నిరంతరం ధ్యానమవసరం. ధ్యానం వలన మనస్సు స్థిరమౌతుంది. సర్వగతుడైన ఈశ్వరునియందు మనస్సు నిలపటమే పరమార్థం. ఇది కుదరకపోతే నా ఆకృతిని నఖశిఖ పర్యంతమూ అహర్నిశలూ నీ మనస్సులో నిలుపుకో! నీ మనస్సు ఆ ఒక్క రూపాన్నే పొందుతుంది. ధ్యానించే నీవు, ధ్యానింపబడే నేను, ధ్యానమనే క్రియా వేరుగా అనుభవమవక, సర్వగతమైన చైతన్యమే అనుభవమవుతుంది" అన్నారు. ఇంతలో ఆరతి పూర్తయి భక్తులంతా జయజయధ్వానాలు చేశారు. పంత్ చేతిలో ప్రసాదముంచుతూ బాబా, "అలా చేస్తే నీ స్థితి కూడా ఈ ప్రసాదంలాగా మధురమై సర్వార్థసిద్ధి లభిస్తుంది" అన్నారు. ఈ లీలగూర్చి హేమాడ్పంత్ యిలా అంటాడు : "నా మనసులో అశాంతిని రేకెత్తించి, నన్ను శ్యామా యింటికి పంపి, నాటి పారాయణ పూర్తి చేయించి, శ్యామానోట ఈ లీలను సాయియే చెప్పించారు. "

నిజమైన గురువెలావుంటాడో తెలుసుకోవడం మన మొదటి కర్తవ్యం. అందుకే ఒకప్పుడు సాయి అన్నారు: "సద్గురువును తెలుసుకోవాలి. లేకపోతే ఎందుకొచ్చినట్లు, పిడకలు ఏరుకోడానికా?" మానవుడు జన్మకొచ్చింది సద్గురు కృపతో మృత్యువును జయించడానికే. సద్గురు లక్షణాలీ వృత్తాంతంలో యిలా కన్పిస్తాయి. శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయినవారినే సేవించాలని వేదాలు చెబుతున్నాయి. తత్త్వదర్శినే సేవించాలని శ్రీకృష్ణుడు (భగవద్గీత 4 : 34) చెప్పాడు. వశిష్ఠుని ఆశ్రయించక విశ్వామిత్రుడు గూడ బ్రహ్మర్షిగాలేదు. రాముడు తన ఆచరణద్వారా అదే తెలిపాడు. 'శ్రీ గురుగీత' అట్టివాడే గురువని చెబుతుంది. అందుకే, 'నిజమైన ఫకీరు చాలా అరుదు' అని సాయి అన్నారు.

సాయి సేవించిన ఆ గురువులాగ, సాయిబాబాలాగ, అక్కల్కోట స్వామి, రమణమహర్షులలాగ సద్గురువు

ఎవరినీ తమ శిష్యులని తలచరు. సర్వాన్నీ ఆత్మగానే దర్శిస్తారు. సాయి అందరినీ 'భావూ' (సోదరా) అంటే, రమణమహర్షి ప్రతిజీవినీ 'వారు' అనేవారు. అందువలన వారు ఎవరికీ ఏ మంత్రమూ ఉపదేశించరు. ఆధ్యాత్మ ప్రచారము, శిష్యసేకరణ, గ్రంథరచన, ఆలయ, మఠ, ఆశ్రమ నిర్మాణ నిర్వహణలు చేయరు. ముముక్షువే వారిని గురువుగా విశ్వసించి, ప్రేమమూర్తిగా ధ్యానించి, సేవించి తరించాలి - సాయి చేసినట్లు. అందుకే ఎవరివద్దా ఉపదేశం కోసం ప్రాకులాడవద్దని ఆయన హెచ్చరించారు.

అటువంటి గురువు దొరికాక ఆయనను నిష్ఠ, సబూరీలతో సేవించాలి.

ఒకసారి బాపూసాహెబ్‌జోగ్ మశీదులో కూర్చుని, "సద్గురువు శిష్యుణ్ణి తనంతటివాడుగా చేస్తాడంటారు. సాయి నన్నింకా అలా చేయలేదే" అనుకున్నాడు. వెంటనే ఆయన నవ్వుతూ అతనిని చూపి, "వీడు నా స్థానమాక్రమించాలని చూస్తున్నాడు!" అన్నారు. మరొకప్పుడతడే ఆయన పాదాలొత్తుతూ, "బాబా, నా సేవ పూర్తియైనట్లు గుర్తేమి?" అన్నాడు. "నీవూ సర్వబంధాలూ విడిచి, భిక్షువై నాలా జీవించడమే!" అన్నారు సాయి. అంటే జీవిత విధానమంతా ఆయనలాగా నిర్వహించగలవాడే గురువు. ముక్తుడైనవాడేగదా యితరుల నుద్ధరించగలడు? అట్టివారంతా పూర్ణత్వం చెందకముందు లోకానికి వెల్లడిగారు. అకాలంలో పుట్టిన శిశువు సంపూర్ణమెలా అవుతుంది? పిందె కోస్తే పండెలా అవుతుంది?

బాబా చెప్పిన గురుసేవా వృత్తాంతంలో సామాన్యంగా వేర్వేరని తలచబడే ధర్మంలో (మార్జాలకిశోర న్యాయము, మర్కటకిశోర న్యాయము) గురుశిష్య సంబంధాలు రెండూ మేళవించబడి వున్నాయి. శ్రీసాయివలె నిష్ఠ, సబూరీలతో గురువునంటిపెట్టుకోగలవాడే శిష్యుడు. ఆయన గురువువలె కేవలం తమ మనోదృష్టితోనే భక్తుణ్ణి సదా కాపాడి పూర్ణుణ్ణి చేయగలవాడే గురువు. సాయివంటి గురువు లభించాక సకల శాస్త్రాల సారము భక్తులకు లీలల రూపంలో అనుభవమవుతుంది. ఈ కాలంలో అలాంటి "నిజమైన ఫకీరు చాలా అరుదు" అని --సాయియే చెప్పారు. మనకై మనంగా గాని, ఆత్మజ్ఞానం లేనివారివద్దగాని, శాస్త్రాలు చదివితే (మనకెంతో తెలుసునన్న) గర్వం వచ్చి, సద్గురువును ఆశ్రయించ లేకపోతాము -- ఉపాసనీబాబా లాగా, 'శ్రీ గురుచరిత్రలోని' త్రివిక్రమ భారతి లాగా, కేవలం పూర్వపుణ్యంవలన దానిని సద్గురువు తొలగించవలసిందే. ఇందుకొక ఉదాహరణ; భగవద్గీత చక్కగా చదువుకొన్నవాడని నానాచందోర్కర్‌ను అందరూ గౌరవించేవారు. సాయి సన్నిధిలో తన మనసులో వికారాలు తలెత్తకుండా అతడు భగవద్గీత వల్లించుకునేవాడు. ఒకసారి అతడు వల్లిస్తున్న శ్లోకం పైకి చదివి అర్థం చెప్పమన్నారు బాబా.

అపుడతడు 4వ అధ్యాయంలోని 34వ శ్లోకం --

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।

ఉపదేక్ష్యన్తి తేఽజ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥

-- చదివి 'గురువులకు సాష్టాంగ నమస్కారము, సేవచేసి ప్రశ్నించు; అపుడా బ్రహ్మజ్ఞానులు నీకు జ్ఞానముపదేశిస్తారు' అని దాని అర్థం చెప్పాడు. అప్పుడు సాయి అతనినిలా అడిగారు:

సాయి : పాతమంటే నమస్కారమే అయితే, మరల 'ప్రణి' అని, 'ప్రశ్న'అనకుండా 'పరిప్రశ్న' అనీ అనడమెందుకు?

నానా : నాకు తెలిసిన అర్థమదే !

సాయి : సేవ అంటే ఏమిటి?

నానా : మేమెప్పుడూ చేసేదే.

సాయి : జ్ఞానమనే పదానికి బదులు యింకేదైనా చేర్చవచ్చా?

నానా : 'అజ్ఞానం'(జ్ఞానం) అని చదివితే ఛందస్సు సరిపోతుందిగాని, భాష్యాలేవీ అలా వివరించలేదు.

సాయి : అయితేనేమి? అంతకంటే మంచి అర్థమొస్తే అలానే చదువవచ్చుగదా! అర్థమెలా సరిపోతుందో చెబుతాను! పరబ్రహ్మ స్వరూపమైన కృష్ణుడు యితర జ్ఞానులను సేవించమని అర్జునునికి చెప్పడమేమిటి?

నానాకేమీ తెలియలేదు. అతని విద్యాగర్వం అణిగింది. అపుడు సాయి ఆ శ్లోకాన్ని యిలా వివరించారు: "గురువుకు నమస్కారం చేస్తే చాలదు, ఆత్మ సమర్పణ చేసుకోవాలి. అదే ప్రణిపాతమంటే. బుద్ధి పుట్టినపుడు మాత్రమే సేవచేయడంగాక, తన శరీరం గురుసేవకోసమే వున్నదని, దానిపై తనకెట్టి అధికారమూ లేదనీ తలచి చేసినదే సేవ. అట్టివాడే శిష్యుడు. అతడు కేవలం మోక్షంపై కోరికతో, యోచనతో అడిగి సందేహ నివృత్తి చేసుకోవడమే పరిప్రశ్న.

వెలుగంటే చీకటిని పారద్రోలడమే; జ్ఞానమంటే అజ్ఞానాన్ని తొలగించడమే. శిష్యుడు సహజంగా జ్ఞాన స్వరూపియేగాని అతడే జీవుడనని, శరీరమే తాననీ తలచి సుఖదుఃఖాలకు, కర్మబంధాలకూ లోనవుతాడు. జ్ఞానం అనుభవంతో మాత్రమే కల్గుతుందిగాని మాటలకు, ఊహలకు అందదు. కనుక దానిని వాచా బోధించడం సాధ్యంకాదు. కాలులో గ్రుచ్చుకున్న ముల్లును మరో ముల్లుతో తీసినట్లు, పాత్రకు పట్టిన మసిని మట్టితో రుద్ది పోగొట్టినట్లు, గురువు తన బోధయనే సాత్వికమైన అజ్ఞానంతో శిష్యుని అజ్ఞానం తొలగిస్తాడు. అప్పుడు శిష్యునిలో దాగివున్న జ్ఞానం శిష్యునికే అనుభవమవుతుంది. కనుక గురువు వాచా బోధించేది గూడా అజ్ఞానమే. సర్వమూ దైవస్వరూపమని, తత్వద్రష్టలందరూ ఆ భగవంతుని రూపాలేననీ సద్భక్తుడు గుర్తిస్తాడు. తత్వదృష్ట, లేక బ్రహ్మజ్ఞానీ యైన గురువుగూడ శిష్యుణ్ణి ఆ భగవంతుని రూపంగానే దర్శిస్తాడు. అటువంటి గురుని ప్రాశస్త్యం తెలిపేందుకే కృష్ణుడు ఆత్మజ్ఞానులను సేవించాలన్నాడు" అని చెప్పారు బాబా.

నానాసాహెబ్ ఆ శ్లోకం వల్లిస్తున్నప్పుడే సాయి అలా అడగడానికి కారణమేమిటి? సకలశాస్త్రసారమైన భగవద్గీత రూపొందడానికి కారణం గూడ అర్జునుడు ఈ శ్లోకంలో చెప్పినట్లే శ్రీకృష్ణుణ్ణి పరిప్రశ్నలు వేయడమే. నానాసాహెబ్‌ను అనేకరీతుల ప్రశ్నించి పరిప్రశ్న చేయడమెలానో సాయి తెలిపారు. ఆ శ్లోకంలో చెప్పినట్లు, నానాకు తత్త్వదర్శియైన గురువు లభించారు. కాని అతడు ఆ శ్లోకం వల్లిస్తూగూడ పరిప్రశ్న, సేవల తత్త్వం తెలుసుకోకుండానే వ్యర్థంగా వల్లిస్తున్నాడు. వాచా బోధించినది చాలనపుడు అతీతమైన విశ్వరూపదర్శనం వంటి దివ్యానుభూతిని ప్రసాదించ గలవాడే సద్గురువు. అట్టివారిని సేవించక తప్పదని, అలాగాక దేవతలను మాత్రమే ఉపాసించేవారు ఆ పుణ్య మున్నంతకాలం ఆయా లోకాలలో వుండి ఆ పుణ్యమైపోగానే యీ లోకంలో మరలా జన్మిస్తారనీ శ్రీకృష్ణుడు చెప్పాడు. సాక్షాత్తూ త్రిమూర్తులు, పరబ్రహ్మము తానేయైన గురుని సేవిస్తే ముక్తి లభిస్తుంది. వైద్యం నేర్వకుండానే మందులిచ్చేవాడు, ఆత్మజ్ఞానం లేకనే శిష్యసేకరణ చేసేవాడు, అట్టి కపట గురువునాశ్రయించినవారూ భ్రష్టులవుతారని శాస్త్రం. 'గు' అంటే అజ్ఞానమనే చీకటి. 'రు' అంటే దానిని పోగొట్టేవాడని అర్థం. వెలుగే చీకటిని పోగొట్టగలదు. చీకటిని వెలుగుగా భావించి దానిని పోగొట్టుకోగలిగితే యిక వెలుగెందుకు? మానవమాత్రులను పరబ్రహ్మ స్వరూపులుగా దర్శించడం బ్రహ్మజ్ఞానికి మాత్రమే వీలవుతుంది గాని, అజ్ఞుడైన సామాన్యునికెలా సాధ్యం? అందుకే

సప్తశృంగీదేవి, శ్రీమన్నారాయణుడు, తమ భక్తులను సాయి వద్దకు పంపారు. అందుకే వేదఋషులు, శ్రీకృష్ణుడు మొదలుకొని సాయివరకూ మహాత్ములందరూ గురువునే సేవించాలన్నారు.

కాని, యీ ప్రపంచంలోని సాధువులందరిలో, ఎవరు బ్రహ్మజ్ఞానులో, ఎవరు కారో ఎలా తెలుసుకోవాలి? మనకై మనమే నిర్ణయించుకుంటే యెలా వుంటుందో, యిందుకు సరియైన మార్గమేదో సాయి తెలిపారు. కుశాభావు అనే టీచరు ఒక సాధువును ఆశ్రయిస్తే ఆయనొక మంత్రం నేర్పాడు. దానివలన అతడు కోరగానే పండ్లు, మిఠాయిల వంటి వస్తువులు చిత్రమైన రీతిన అతని చేతులలోకొచ్చేవి. అదిచూచి జనం అతని చుట్టూ చేరసాగారు. కొందరు అతనిని రకరకాలుగా విమర్శించసాగారు. వీరిని దండించడానికి తగిన మంత్రాలు నేర్పమని అతడు ఆ సాధువును వేధించసాగాడు. ఆ సాధువు, అతనిని యిక నుంచి సాయిబాబాను ఆశ్రయించమని చెప్పి, హిమాలయాలకు వెళ్ళిపోయాడు. కుశాభావు 1909లో శిరిడీ చేరాడుగాని బాబా అతనిని మశీదులోనికి రానీయక, అతడు ఆ శక్తులను గోదావరి నదిలో విడిస్తేగాని రానివ్వనని పట్టుబట్టారు. ఆ మంత్రశక్తితో అతడు వేరొక చోటునుండి వస్తువులను తెప్పిస్తున్నాడని, కనుక అవి అమాయకులను అపవిత్రం చేస్తున్న దొంగసొత్తనీ ఆయన చెప్పారు. అతనిని చూచినవారికి గూడ అటువంటి శక్తులపై వ్యామోహం కల్గుతుంది గదా? ఇలా అతనిని, సాటివారినీ అపవిత్రం చేస్తున్న ఆ శక్తులను అతడు విడిచిపెట్టాలని ఆయన చెప్పారు. చివరకు అతడు దానిని గోదావరిలో విడచివచ్చాక, బాబా అతనిచేత రోజూ శ్రీ సమర్థ రామదాసస్వామి వ్రాసిన ''దాసబోధ'' చదివించారు. అతనిచేత 'శ్రీగురుచరిత్ర' 108 పారాయణలు చేయించాకనే అతనిని యీక్రింది రీతిన అనుగ్రహించారు. ఒక ఏకాదశినాఁడు కుశాభావు ఉపవసిస్తున్నాడు. అతడు బాబాను దర్శించి, ప్రసంగవశాత్తు, పూర్వం ఋషులు కందమూలాలు తినేవారని చెప్పాడు. సాయి ఆ పదాన్ని ''కాంద'' (ఉల్లిగడ్డ) అని చమత్కరించి, అతనికి కొన్ని ఉల్లిగడ్డలిచ్చి తినమన్నారు. అతడు దిక్కు తోచక, ఆయన తింటే తానూ తింటానన్నాడు. అప్పుడు యిద్దరూ చెరికొన్నీ తిన్నారు. అప్పుడు సాయి కొందరు భక్తులను పిలిచి, ''ఈ సద్బ్రాహ్మణుడు చూడండి, ఏకాదశినాడు ఉల్లి తిన్నాడు!' అని చెప్పి గేలిచేశారు. అతడు, తనను బాబా ఆదేశిస్తేనే ఉల్లి తిన్నానని, ఆయనగూడా తిన్నారనీ చెప్పాడు. బాబా అంగీకరించక, తాము తిన్నది కక్కి చూపారు. అందులో కందమూలాల ముక్కలే వున్నాయిగాని, మచ్చుకైనా ఉల్లిలేదు. కుశాభావు అదే మంచి అవకాశమని తలచి ఆయన కక్కినది మహా ప్రసాదమైన గురూచ్ఛిష్టంగా (గురువు ఎంగిలి) తినేశాడు. బాబా అతనిని తిట్టి, కొట్టి వారించాలని చూచారుగాని అతడు వినలేదు. అతడి భక్తిశ్రద్ధలకు ఆయన కన్నులవెంట ఆనందభాష్పాలు కారాయి. ఆయన అతనిని ఆశీర్వదించారు. అతడు మంచి గురుభక్తుడయ్యాడు.

ఈ లీలద్వారా లోకానికి ''శ్రీగురుచరిత్ర'' యొక్క ప్రాశస్త్యం తెల్పారు బాబా. దాని పారాయణ కుశాభావును పవిత్రుణ్ణిచేసి సద్గురుకృపకు పాత్రుణ్ణి చేసింది. సాఠేకు, హేమాద్పంత్‌కూ గూడ అట్టి శ్రేయస్సునే ప్రసాదించింది. శ్రీవాసుదేవానంద సరస్వతీ, రంగావధూత, నానే మహరాజ్‌వంటి వారెందరికో యీ గ్రంథ పారాయణమే వారు ఆశ్రయించదగిన గురువును గురించి తెల్పి, వారిని గురుకృపకు పాత్రులను చేసి, మహాత్ములుగా రూపొందించింది. పూర్ణులైన గురువును ఎలా అన్వేషించి, ఆశ్రయించాలో చెప్పిన గ్రంథమదొక్కటే. రెండవ దత్తావతారమైన శ్రీ నృసింహ సరస్వతీస్వామి అంతర్హితులయ్యాక, వారి దివ్యలీలలు విని నామధారకుడు ఆయన సాక్షాత్కారం కోసం తపిస్తూ గాణ్గాపురం చేరాడు. అతనికక్కడ సిద్ధుడనే యోగిరూపంలో శ్రీ నృసింహ సరస్వతి స్వప్న దర్శనమిచ్చారు. నామధారకుడు నిద్రలేవగానే ఆ సిద్ధయోగియే ప్రత్యక్ష దర్శనమిచ్చి అతనికి ''శ్రీ గురుచరిత్ర'' చెప్పాడు.

''శ్రీగురుచరిత్ర''కు అంత ప్రాముఖ్యమివ్వడం ద్వారా లోకానికి శ్రీసాయి ఎన్నో ఆధ్యాత్మ రహస్యాలు సూచనగా

తెల్పడమే జరిగింది. సాధకులు నామధారకునిలా, మొదట శ్రీ దత్తావతారమైన సద్గురుని లీలలు వింటే వారిని దర్శించి ఆశ్రయించాలన్న బలమైన కోరిక కలుగుతుంది. అతడు సహజంగానే ఆ లీలలను గురించి ఆయన గురించి చింతనచేస్తూ ఆయన కోసం తపిస్తాడు. అప్పుడాయన ఏదో రూపంలో స్వప్నదర్శనమిస్తారు. తర్వాత ప్రత్యక్షదర్శనమిచ్చి అనుగ్రహిస్తారు. పైన చెప్పినట్లు ఆ మహనీయులందరి అనుభవమూ యిలానే వున్నది. సూఫీ సంప్రదాయంలోగూడ సాధకుడు మొదట పరమపదించిన ఒక మహాత్ముని ఆశ్రయించి, తానాశ్రయించవలసిన గురువెవరో తెల్పమని ప్రార్థిస్తాడు. సకాలంలో ఆ మహనీయుడా విషయం వారికి స్వప్నంలో చెబుతారు. ఇది ఉత్తమమైన మార్గం కనుకనే శ్రీ సాయి దానికంత ప్రాధాన్యమిచ్చారు. ఆయనగూడ వెనుక జన్మలలో తమను సేవించిన వారికి ముందుగా స్వప్న దర్శనమిచ్చాకనే వారిని శిరిడీలో ప్రత్యక్షంగా తమచెంతకు రప్పించుకున్నారని "శ్రీసాయి సందర్శనము" అనే అధ్యాయంలో గమనించాము. అందుకే శ్రీసాయిభక్తులకు "శ్రీగురుచరిత్ర" పారాయణ ఎంతో ముఖ్యం.

అలానే ఒక సాధకుడు యోగమభ్యసిస్తూవుంటే దూరదృష్టి లభించింది. దూరాన తన యంత్రశాల తగల బడుతూ వుంటే అతడు ధ్యానంలో చూడగలిగాడు. అతడు శిరిడీ వచ్చినపుడు బాబా, "ఎందుకా వేశ్యప్రదర్శనలను చూస్తావు? నేనెప్పుడూ అలా చేయను. అదెవరికీ తగదు" అన్నారు. ఆత్మజ్ఞానంతో లభించే శక్తులు లోకహితం చేస్తాయి. ఇటువంటి శక్తులు సాధకులను, ప్రజలనుగూడ ప్రక్కదారి పట్టిస్తాయి. కోరి శక్తులను సాధించి, లోకాన్ని మెప్పించడం వేశ్య వృత్తి. అట్టి సాధకుని భక్తి ఆ భగవంతనిపట్ల వ్యభిచరించి అతనికి, లోకానికీ గూడ కీడు చేస్తుంది.

సామాన్య బోధకునిలాగా సాయిబాబా 'మాయ', 'బ్రహ్మము' మొ॥న పెద్ద పెద్ద మాటలు వల్లించలేదు. సామాన్యులకవి నిరుపయోగమేగాక, అహాన్ని పెంచుతాయిగూడ. సామాన్యంగా ఎంతో చిన్నవనిపించే విషయాలే చాలా పెద్దవి. వాటిని చక్కదిద్దుకొని, నిజమైన మానవత్వాన్ని అలవరచుకొనడమే ధర్మమని, దాన్ని సాధించకనే సాధన ప్రారంభిస్తే ఇహపరాలు రెండూ చెడతాయనీ ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. వెనుక సాయిచెప్పిన మామిడిపూతవలె మనం సద్గురుభక్తి నుండి మధ్యలో రాలిపోకుండాను, మరుజన్మలో దుఃఖం కలుగకుండానూ వారి ఉపదేశాలు ఉపకరిస్తాయి. సాయి భక్తులనెలా హెచ్చరించేవారో చూద్దాము: ఒకసారి అంజన్వేల్ నుండి మధురదాస్ అనే భక్తుడువచ్చి, సగుణమేరునాయక్ ఇంట్లో దిగాడు. ఒకరోజు వాళ్ళిద్దరూ సాటివారి దోషాల గురించే మాట్లాడుకున్నారు. తర్వాత మధురదాసు మశీదుకు వెళ్ళగానే బాబా చికాకుగా, "ఏమిటి సగుణ్ అంటున్నాడు?" అన్నారు. తమ సంభాషణ బాబాకెంతో బాధ కలిగించిందని అతడు గ్రహించాడు. దుష్ప్రచారము, దానిని ఆసక్తితో వినడమేగదా దుస్సాంగత్యమంటే? అది నిజమైనా, అబద్ధమైనా సర్వమూ సాయిరూపమన్న వివేకాన్ని పాడుచేసి, పుణ్యమపహరించి, హృదయాన్ని కలుషితం చేస్తుంది. అలాగే ఒకరోజు వసతిగృహంలో ఒకడు వేరొకరి గురించి అపవాదులు కల్పించి, వారి మనస్సులు విరిచేయాలని తలచాడు. తర్వాత అతడు బాబా లెండీకి వెళ్తుంటే ఎదురయ్యాడు. అపుడాయన, మలం తింటున్న ఒక పందిని అతనికి చూపి, "అది మలమెంత ప్రీతిగా తింటోందో చూచావా? సాటివారి గురించి అపవాదులు కల్పించడమలాంటిదే! క్రమంగా మనలను సాటివారు ఏవగించుకుంటారు. అంతేకాదు, అలాచేస్తే మనం కష్టపడి సంపాదించుకున్న పుణ్యమంతా వారికి, వారి పాపం మనకూ వస్తాయి. ఇక శిరిడీ యాత్రవలనగూడ మనకేమి ప్రయోజనం?" అన్నారు. అందుకే క్రీస్తు, "ఇతరుల దోషాలెంచకు; ఎంచితే భగవంతుడు నీ లోపాలెంచుతాడు. (క్షమించడు)" అని, సాటివారినెంత కొద్దిగా నిందించినా నరకంలో శిక్ష తప్పదనీ చెప్పాడు. "ప్రక్కవాడి కంట్లో నలుసు తీసేముందు, నీ కంటిలోని (తప్పులెంచే లక్షణమనే)

దూలాన్ని తొలగించుకో!'' అన్నాడు.

ఇతరులను మనస్సులో గూడ ద్వేషించకూడదు. హత్య, శతృత్వము, ఋణము - వీటి ఫలితమనుభవించక తప్పదన్నారు సాయి. ఒకరోజొక భక్తుడు రవ్వకేసరి ప్రసాదంగా పంచుతున్నాడు. వేరొక భక్తునితో, ''ప్రసాదం తీసుకున్నావా?'' అన్నారు బాబా. అతడికి, తనకూ భేదాభిప్రాయాలుండటం వల్ల ప్రసాదం తీసుకోలేదన్నాడతడు. అపుడు సాయి, 'ఇచ్చేది, యివ్వబడేది, పుచ్చుకొనేది యెవరు? అంతా ఒక్కటే. ఎవరినీ శతృవులుగా తలచవద్దు' అన్నారు. ద్వేషమెంత ప్రమాదకరమో! చెన్నబసప్ప - వీరభద్రప్ప అనే పాము - కప్పలకు పూర్వజన్మలో సాయిసన్నిధి లభించినా, పరస్పర ద్వేషంవలన హీనజన్మలు లభించాయి.

పై రెండు బలహీనతలకూ భిన్నమయిన మరొకదానిని గురించి ఒకసారి సాయి నానాచందోర్కరుతో యిలా చెప్పారు; 'యాచించిన వారికి శక్తి కొద్దీ సమర్పించు. ఇంకా అడిగితే వీలుకాదని సౌమ్యంగా చెప్పు. కోపించవద్దు.' కొంత కాలానికి కల్యాణ్‌లో అతనింటికి ఒక బిచ్చగత్తె వచ్చి, పెట్టినదానితో తృప్తి చెందక ఇంకా కావాలని పట్టుబట్టింది. అతను సేవకునితో, ''పెట్టింది తీసుకు పొమ్మను, లేకుంటే మెడపట్టి గెంటు!'' అన్నాడు. ఆమె వెళ్ళిపోయింది. తర్వాత అతడు శిరిడీ వెళ్ళినపుడు సాయి అతనితో పలుకలేదు. కారణమడిగితే, ''నా మాట విననివారితో నాకేం పని? ఆ బిచ్చగత్తెను, అధికంగా భిక్షకోరినందుకు మెడపట్టి గెంటమంటివే? ఆమె వాకిట్లో కూర్చుంటే నీదేం పోయింది' ' అన్నారు. అంతేగాదు, ఆవేశమెన్నడూ తగదని సాయి ఎంత చమత్కారంగా బోధించారో! ఆయన ఒక భక్తుని దక్షిణ అడిగారు. అతడు తన వద్ద పైకం లేదన్నాడు. అయినా ప్రతి 10, 15 నిIIలకు సాయి అతనిని తిరిగి తిరిగి అడిగారు. చివరకతడు విసిగిపోయి, ''నా వద్ద డబ్బు లేదంటూంటే!'' అని గొంతు చించుకున్నాడు. సాయి కొంటెగా నవ్వి, ''లేకపోతే లేదని నెమ్మదిగా చెప్పు. అదీగాకుంటే ఊరుకో, అరుస్తావెందుకు?'' అన్నారు.

కోపతాపాలన్నింటికీ 'నాది' అనే మమకారం మూలకారణం. ఒకరోజు బాగ్‌చంద్ మార్వాడీ రాగానే అతనిని గూర్చి భక్తులతో సాయి అన్నారు: ''ఇతడు తన గడ్డివామి అంటుకుందని, దానిని కాపాడమనీ కోరుతున్నాడు. చావు-పుట్టుకలు, లాభనష్టాలు దైవాధీనాలు. మూఢులు ఈ విషయం మరచి లాభిస్తే సంతోషించి, నష్టమొస్తే ఏడుస్తారు. 'ఇది నాది' అంటారు. గడ్డివామి మార్వాడీది కాదు, అది గడ్డేకానీ అతని శరీరంకూడ కాదుగదా! భూమి, వర్షము, ఎండలవలన విత్తుల నుండి పెరిగింది గనుక వాటికి చెందినదే. ఆ మూడింటిలోనూ అగ్ని వున్నది. అదే ఈ గడ్డివామిని కాల్చింది. భగవంతుడు ఒకచేతితో యిస్తాడు, మరోచేతితో తీసుకుంటాడు. '' అని తిరిగి మార్వాడీతో, ''ఈ నష్టం మరలా సర్దుకుంటుందిలే, పో!'' అన్నారు.

నిత్యజీవితంలో మనస్సు, ఇంద్రియాలను ఎలా నిగ్రహించుకోవచ్చో సాయి తెల్పారు. ఒకసారి ముస్లిము స్త్రీలిద్దరు బురఖాలు ధరించి దర్శనానికి వచ్చారు. నానా లేచి బయటకు వెళ్ళబోతే బాబా, ''నీవిక్కడే వుండు, వాళ్ళు రాదల్చుకుంటే వస్తారు'' అన్నారు. వాళ్ళు ముసుగులు తొలగించుకొని బాబా దర్శనం చేసుకున్నారు. వారిలో ఒక యువతిని చూడగానే నానా మనస్సు చలించింది. వెంటనే బాబా అతని తలపై చరచారు. అతడు సిగ్గుతో తలవంచుకోగానే ఆయన, ''నానా, నీవు మానవుడవు గనుక ఇంద్రియాలు విషయాలపై ప్రసరించినపుడు కోరిక కలుగుతుంది. కాని అందమైన దేవాలయాలెన్ని లేవు? మనం బాహ్యసౌందర్యాన్ని గాక లోనున్న దైవాన్ని చూడాలి. ఆ సౌందర్యాన్ని కల్పించిన దైవలీలలను చూడాలి. ఇదెప్పుడూ మరువకు'' అన్నారు.

సాయి ఒకరోజు మధ్యాహ్నం ఒక నిచ్చెన తెప్పించి, వామన్ గోండ్కర్ అనే భక్తునింటి పైకెక్కి, రాధాకృష్ణ ఆయి యింటిమీదుగా నడచి అవతలివైపుకు దిగారు. రాధాకృష్ణఆయిని మలేరియా జ్వరంనుండి అలా రక్షించారని

భక్తులు తలచారు. అపుడు బాబా ఆ నిచ్చెన తెచ్చినవాడికి రూ. 2/-లు యిచ్చారు. అంతెందుకిచ్చారని భక్తులడిగితే, "ఏ సేవకైనా ఉదారంగా ప్రతిఫలమివ్వాలి. ఉచితంగా పొందరాదు" అన్నారు. నేటి విద్యావంతులలో గూడ ఎక్కువమంది నేర్చుకోవలసిన బోధ యిది.

ఇటువంటి నైతికసూత్రాలు నిత్యజీవితంలో ఆచరించాలని వినినవారిలో ఎక్కువమంది చేసే పొరబాటు-సాటివారు ఎంతవరకు పాటిస్తున్నారో గమనించి వారిని విమర్శించడం. **ధర్మాచరణలో ఆత్మవిమర్శ ఒక్కటే తగినది.** ధర్మమెంతో సూక్ష్మమైనదని ఎరుగరు. ఒకరోజు ఒకడు డబ్బుకావాలని బాబానడిగాడు. ఆయన లేదన్నారు. కాని ఆయన జేబులో డబ్బున్నదని శ్యామాకు తెలుసు. ఆ వ్యక్తి వెళ్ళగానే శ్యామా, "సాయి, నీవు సత్యాన్ని, వైరాగ్యాన్నీ అవలంబించిన ఫకీరువు గదా! మాకు నీతులు బోధించి నీవబద్ధం చెప్పావేమి?" అన్నాడు. డబ్బివ్వడం అతడికి శ్రేయస్కరం కాదు. చెబితే వినడు, కనుక అతని మేలు కోసమే అలా చెప్పాను" అని సాయి శాంతంగా సమాధాన మిచ్చారు. శ్రేయస్సు చేకూర్చే అసత్యమే సత్యమని, శ్రేయస్సును పాడుచేసే సత్యమే అసత్యమనీ ఆర్షధర్మ సూత్రంగూడ.

దాసగణు 1910లో శిరిడీ వెళుతూండగా దారిలో ఒకవ్యక్తి బాబాను నిందించాడు. అంతటితో దాసగణు మనస్సు చలించింది. శిరిడీ చేరగానే నూల్కర్ అనే భక్తుడు అతనిని సమాధానపరచి ఆరతికి తీసుకువెళ్ళాడు. అపుడు సాయి, "గణూ, నీవు నూల్కర్‌ను హృదయపూర్వకంగా సేవించాలి. అందులో న్యూనతేమీ లేదు." అన్నారు. అతడు సేవించబోతే నూల్కర్, 'బాబా నీకేమైనా చెప్పనీ, ఏ ప్రత్యేకతాలేని నన్నిలా యిబ్బంది పెట్టకు" అన్నాడు నూల్కర్. దాసగణు సాయివద్దకు వెళ్ళి, "మీ ఆదేశం నాకర్థం కాలేదు." అన్నాడు. సాయి ఉగ్రులై, "**అనుభవమనేది ఎద్దులకు రాదు!**" అన్నారు. బాబా చెప్పినది అర్థమైందాకా వెళ్ళకూడదనుకున్నాడు గణు. సాయి వెంటనే, "అదే సరైన పద్ధతి!" అన్నారు. తర్వాత దాసగణు యింటికి వెళ్ళడానికి శ్యామా అనుమతి అడిగితే, "వాణ్ణి కుక్కలా పడుండనీ నేను, వాడు తేల్చవలసిన లెక్కలున్నాయి" అన్నారు సాయి. సద్గురుడైన సాయిపట్ల దాసగణుకు భక్తి స్థిరపడేలాగ సహకరించడంలో మరే మానవుడూ చేయలేనంతటి సహాయం చేసిన నూల్కర్ సాయి అనుగ్రహానికి ప్రతీక. కనుకనే అతడు పూజ్యుడు. అతనిని సేవిస్తే దాసగణుకు అహంకారమంతరిస్తుంది. అయితే "నీ గురువు నూల్కర్" అని మాత్రం సాయి దాసగణుకు చెప్పలేదు. అతడు చేసిన మేలును గుర్తించి కృతజ్ఞత కల్గివుండడం ఎంతో ముఖ్యమని సాయిబోధ!

ఒక భక్తుడు శిరిడీ వెడుతూంటే, అతనితో సాటి ప్రయాణీకుడు మానవుడైన సాయిని కొలవడం వ్యర్థమని వాదించాడు. ఆ భక్తుని మనస్సు కలత చెందింది. అతడు మశీదు చేరగానే శ్యామాతో, "ఇతనికేదైనా మంచి మాటలు చెప్పు!" అన్నారు సాయి. అపుడు శ్యామా అతనిని బయటకు తీసుకువెళ్ళి, "సాయి గూర్చి యితరులన్నవి పట్టించుకోవద్దు. నీ అనుభవాన్నే అంటిపెట్టుకో!" అని చెప్పాడు. తర్వాత వారిద్దరూ మశీదులోకి రాగానే సాయి అతనితో, "నువ్వు శ్యామా చెప్పినట్లు చెయ్యి, మేలు జరుగుతుంది" అన్నారు.

మన సహాయం ఎవరైనా అర్థిస్తే, తప్పక చేయడంగాని, లేక చేయించడం గాని మన ధర్మమన్నారు సాయి. వారుగూడ యీ ధర్మం పాటించారు. ఒకప్పుడొక రైతు తన పొలంలో బావికై అర్జీ పెట్టుకుంటే జిల్లా కలెక్టరు త్రోసిపుచ్చాడు. అతడు బాబాతో చెప్పుకుంటే ఆయన, "నీవు నానా చందోర్కర్‌తో కలసి కణీత్కర్‌తో మాట్లాడు. నేను నానాతో చెబుతాను" అన్నారు. తర్వాత నానా సహకారంవలన కలెక్టరు అది మంజూరు చేసాడు. అతడు బావి త్రవ్వించుకొని, పంటలొచ్చాక తన అప్పులన్నీ తీర్చుకున్నాడు.

★ శుక్రవారం పారాయణ సమాప్తము ★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

★ శనివారం పారాయణ ప్రారంభం ★

శ్రీ సాయి లీలామృతము



అధ్యాయము - 10

యోగీశ్వరుడు

శ్రీరాముడు, శ్రీ కృష్ణుడువంటి అవతారాలు దుష్టశిక్షణ చేస్తారు. శ్రీ దత్తాత్రేయుడు, శ్రీదక్షిణామూర్తి అవతారాలు మానవులకు ఆధ్యాత్మిక విద్యనందించి ధర్మాన్ని పోషిస్తారు. సద్గురువులందరూ వీరి రూపాలే. వీరు పూర్ణ సిద్ధులుగానే అవతరిస్తారు. అయినా వారు గూడా తాము సద్గురువును సేవించి తరించామని చెప్పి, సాధకులకు ఆదర్శమవుతారు. శ్రీ దత్తాత్రేయుడు 24 మంది గురువులనుండి జ్ఞానమార్జించానని భాగవతంలో చెబుతారు. పుట్టగానే ప్రణవముచ్చరించి, ఉపనయనమవగానే వేదాలు వల్లించిన శ్రీ నృసింహ సరస్వతి స్వామి గూడ - బాల్యంలోనే తల్లికి తననోట విశ్వరూపం చూపిన శ్రీకృష్ణునిలాగ - సద్గురువును సేవించారు. వీరు తామే దైవమని, గురువులమనీ చాటుకోరు. భక్తులే వారి అనుభవాలను బట్టి వారిని అలా గుర్తిస్తారు. శ్రీసాయిగూడ తాము పేదఫకీరునని, భగవంతుని బానిసనని మాత్రమే చెప్పేవారు. ఏ పండూ తాను పండునని చాటుకోదు; వెలుగు వెలుగునని చాటుకోదు.

శ్రీమతి తార్కాడ్, ఆమె కుమారుడూ 1917లో శిరిడీ వచ్చారు. ఆ కుర్రవాణ్ణి రూ. 18/-లు దక్షిణ అడిగారు బాబా. అతడు అది తీసుకొని రావడానికి వెళ్ళేసరికి కొందరు భక్తులకు 'ధృవచరిత్ర' చదివి వివరిస్తున్నాడు జోగ్. ఆ కుర్రవాడు వెంటనే తిరిగివచ్చి, "సాయి! నన్నక్కడికెందుకు పంపారు? మీవంటి సాధువులు దైవం ప్రసాదించిన శక్తులుగల మానవులేగాని, దైవస్వరూపులుగారని అతడు చెబుతున్నాడు. భగవంతుడు తనను నిందించినా కోపించడుగాని, మీవంటి సాధువులను చులకన చేస్తే సహించడు గదా!" అన్నాడు. బాబా నవ్వి, "అతడు చెప్పింది నిజమే! నేను ఫకీరునేగాని దైవాన్ని కాదు. దైవమెంతో గొప్పవాడు. ఆయనతో ఎవరూ పోలరు" అన్నారు. ఆ పిల్లవాడు, "సాయి! మాటలతో మమ్ము ఏమారుస్తున్నారు గాని మీరు దైవమే!" అన్నాడు. బాబా అతని తల నిమురుతూ, "నీవు నిత్యమూ సద్గ్రంథపారాయణ, నామజపమూ చేయి" అన్నారు. కుర్రవాడు, "అది మధ్యలో ఆగిపోతే దోషం గనుక చేయను" అన్నాడు. సాయి సంతోషంగా అతని తల్లితో, "నీ బిడ్డయొక్క సర్వ బాధ్యతలూ నావే" అని అతనిమీద తమ యోగదృష్టిని సారించారు. నిజమైన గురువు ఎలా వ్యవహరిస్తాడో చూచాము.

సాయి కేవలం యోగమభ్యసించి, కొన్ని అద్భుతశక్తులు పొందిన సాధువేనని తలచే కొందరు వ్యక్తులు, ఆయన యేమి అభ్యసిస్తారోనని గమనించేవారు. యోగులు తమ జీర్ణకోశం శుభ్రం చేసుకొనేందుకు మూడంగుళాల వెడల్పు, 22 అడుగుల పొడవుగల శుభ్రమైన గుడ్డను నెమ్మదిగా మ్రింగి, అరగంట జీర్ణకోశంలో వుంచి, తరువాత నెమ్మదిగా బైటకు లాగేస్తారు. కాని బాబా చేసిన యీ "ధౌతి" అద్భుతం. మూడురోజులకొకసారి ఆయన బావి దగ్గరకెళ్ళి ప్రేగులు వెడలగ్రక్కి నీటిలో కడిగేవారు. తరువాత వాటిని చెట్టుకొమ్మపై ఆరబెట్టి తిరిగి మ్రింగేవారు.

శిరిడీ నివాసి అప్పాభిల్ అనేవాడు రాత్రులలో పహరా కాచేవాడు. అతడొక రాత్రి మశీదు చేరి, అక్కడ బాబా దేహం ముక్కలుగా పడివుండటం చూచాడు. ఎవరో దుర్మార్గులు ఆయనను హత్య చేశారని భావించాడు. మొదట ఆ సంగతి మునసబు కరణాలతో చెబుదామనుకున్నాడు. కానీ ధైర్యం చాలక తిరిగి యిల్లుచేరి భయంతో

బైటకురాలేదు. మరుసటి ఉదయం మశీదుకెళ్ళొస్తున్న వారెవరూ ఆ ప్రస్తావనే చేయడం లేదు. ఆశ్చర్యంతో అతడు మశీదుకెళ్ళేసరికి బాబా అతనిని చూచి, "రాత్రి భయపడ్డావా?" అన్నారు. సాయి ఖండయోగం చేసేవారని తర్వాత అందరికీ తెలిసింది.

సాయి మశీదులో నేలపై పడుకోటం చూచి, నానాసాహెబ్ డేంగలే నాల్గు మూరలు పొడవు, జానెడు వెడల్పుగల చెక్క సమర్పించాడు. ఆయన దానిని సన్నని గుడ్డపీలికలతో మశీదు కప్పునుండి మూరెడు క్రిందకు వ్రేలాడదీశారు. రాత్రి దానికి నాలుగుమూలలా ప్రమిదలు వెలిగించి వాటిమధ్యన నిద్ర పోయేవారు. ఆ బల్లనే మోస్తాయో లేదోనన్పించే ఆ గుడ్డపీలికలు ఆయననుగూడ మోయడమే చిత్రం ! అంతేకాదు, మశీదులో నిచ్చెనగూడ లేదు. ఆయన ఆ బల్లమీదికెలా ఎక్కేవారో, ఎలా దిగేవారో తెలిసేది గాదు. అంతవరకు క్రిందనే వున్న బాబా దానిపై పడుకుని కన్పించేవారు; అలానే దిగేవారు. అది చూడ్డానికి జనం విరగబడుతుంటే ఆయన ఒకరోజు ఆ బల్ల విరిచి ధునిలో వేశారు. "మెలకువగా కళ్ళు తెరచి నిద్రించగలవారికే అది సాధ్యం. నేను నిద్రించేటప్పుడు మహల్సాపతి చేతిని నా గుండెపైనుంచి నా హృదయంలో జరిగే దైవస్మరణను గుర్తించమంటాను" అని ఆయనే ఒకసారి చెప్పారు.

శిరిడీలో రోడ్డుప్రక్కన లెండీతోపు వున్నది. బాబా రోజూ రెండు పూటలా అందులో ఒక్కరే కొంతసేపుండేవారు. అప్పుడప్పుడు సేవకుడు అబ్దుల్లా ఆయనతో కూడా వుండేవాడు. అతడిలా చెప్పాడు, "ఆ తోపులో ఒకచోట రెండడుగుల లోతున ఒక గుంటలో అఖండదీపం పెట్టారు బాబా. అది ఆరిపోకుండా పైనొక రేకు, చుట్టూ సుమారు 20 తెరలు వుండేవి. నేనా దీపాన్ని కనిపెట్టుకుని వుండేవాణ్ణి. సాయి దానిదగ్గర కూర్చునేవారు. ఆయన కూర్చున్న చోటునుంచి ఆ దీపం కన్పించేది గాదు. ఆయనదగ్గరే రెండు బక్కెట్లతో నీరు పెట్టేవాణ్ణి. ఆయన ఆ నీరు అన్నివైపులకూ చల్లి, ఒక్కొక్క దిక్కుగా కొన్ని అడుగులు నడిచి అటు తదేకంగా చూచేవారు. అప్పుడాయన మంత్రమేదైనా చదివేవారేమో తెలియదు".

అలానే ఊరికి ఉత్తరానున్న ఒకబావి అంచుమీద ఆయన ఒక్కొక్కప్పుడు గంటల తరబడి కూర్చునేవారు. ఆ ప్రక్కనే అయిదడుగులు లోతు గొయ్యి ఆయనే త్రవ్వారు. అందులో నిలబడి ఆయన చాలాసేపు యేమో చేసేవారుగాని ఎవరూ గమనించలేకపోయారు.

దాసగణు ఒక వివరం చెప్పాడు: "సాయి అరుదుగా మధ్యాహ్నం 1-2 గం॥ల మధ్య, తామొక్కరే వున్నప్పుడు, తమ యెదుట తెరలాగా ఒక గుడ్డపెట్టుకొని, ఒక గుడ్డసంచినుంచి 10, 15 కాసులు బైటకు తీసేవారు. వాటిలో దమ్మిడీ, అణా, అర్ధణా, కాణి, బేడా, పావలా, అర్ధరూపాయి, రూపాయి కాసులుండేవి. అవన్నీ అరిగిపోయినవే. సాయి ఒక్కొక్క కాసునూ తమ వేళ్ళతో రుద్దుతూ, 'ఇది నానాది', 'ఇది బాపూది', 'ఇది కాకాది', అని గొణిగేవారు. ఎవరైనా వస్తే వెంటనే అవన్నీ సంచిలోవేసి దాచేసేవారు." ఆయనారీతిన భక్తులెరుగకనే వారి దుష్ట సంస్కారాలను అరగతీసి పవిత్రం చేసేవారు కాబోలు! వారిపై దృష్టి నిలిపే భక్తులమీద బాబా తమదృష్టి అంతకంటే ఎక్కువగానే వుంచేవారు.

శ్రీసాయి బయటకు వెళ్ళేప్పుడు మారుతి ఆలయమెదుట ఆగి, ఏమో గొణుగుతూ, మారుతివైపుకు ఏవో భంగిమలు చేసేవారు. తర్వాత ఒక్కొక్క దిక్కువైపు తిరిగి అలానేచేసి, తదేకంగా చూచేవారు. ఒకప్పుడు ఎవరినో మందలిస్తున్నట్లు అన్ని దిక్కులవైపు సట్కా ఊపేవారు; లేక, రాయి విసురుతానని బెదిరించేవారు. లేక చెడ్డగా తిట్టేవారు. తెలియనివారు ఆయన పిచ్చివాడనుకొనే వారు. తెలిసినవారు ఆయన ప్రకృతి శక్తులనాదేశిస్తున్నారనేవారు.

"నేనొకసారి మసీదులో వున్నప్పుడు తీవ్రమైన గాలివాన వచ్చింది. సాయి మసీదు ముంగిటకొచ్చి 'జరాధావ్!' (కొంచెం శాంతించు) అని కేక వేశారు. వెంటనే గాలివాన నిలిచి పోయింది" అన్నాడు జయకర్. మరొకరోజు బాబా నిష్కారణంగా "అబ్బా!" అని కేకపెట్టారు. తక్షణమే ఆయన తలకు, వంటికీ వున్న గుడ్డలన్నీ తడిసి, నీరు బొట్లుగా పడి మడుగు కట్టింది. భక్తులాశ్చర్యపోయారుగాని ఆయననడిగే ధైర్యంలేదు, మూడవరోజున సాయి తనను రక్షించినందుకు టెలిగ్రామ్‌ద్వారా కృతజ్ఞత తెలిపాడు జహంగీరు. అసలు వృత్తాంతమిది: రష్యా-- జపాన్ యుద్ధంలో అతడొక నౌకాధిపతి. తన మూడు నౌకలను శత్రువులు ముంచివేశారు. తన నౌకను కాపాడమని అతడు కన్నీటితో బాబాను ప్రార్థించాడు. సాయి అతనిముందు కనపడి ఆ నౌకను భద్రంగా ఒడ్డుచేర్చారు.

సాయివద్ద మసీదులో ఒకమూల తిరగలుండేది. బాబా అప్పుడపుడు నేలమీద ఒక గోనె పరచి, దానిమీద తిరగలి పెట్టుకుని కూర్చునేవారు. తర్వాత కఫ్నీ చేతులు ముడుచుకొని, ఒకచేత్తో గోధుమలు విసిరేవారు. ఆ పిండి భక్తులకిచ్చి ఊరి పొలిమేరలో చల్లమనేవారు. ఒకసారి కారణమడిగితే, "ప్లేగు, మశూచి దేవతలు ఊరిలో కొందరిని పొట్టనపెట్టుకోవాలని చూస్తున్నాయి. వారికిబదులు ఈ పిండి తీసుకొమ్మని వాటినాజ్ఞాపించాను" అన్నారు. ఒకసారి 1911లో భక్తులు వారి ఆదేశం పాటించలేదు. కొద్ది రోజులకు శిరిడీలో ప్లేగు వ్యాపించింది. తెల్లవారుతూనే సాయి వంటిమీద కూడా 7 ప్లేగు బొబ్బలు కనిపించాయి. భక్తులు భయపడి వాటికి చికిత్స తెల్పమంటే ఆయన, "ఈ బొబ్బలు శిరిడీలో ప్లేగుతో ఏడుగురు మరణిస్తారని సూచిస్తున్నాయి. నాకే చికిత్సా అవసరం లేదు" అన్నారు. భక్తులు వత్తిడిచేయగా, కాల్చిన దూది నూనెలో తడిపి అద్దమన్నారు. తర్వాత గ్రామంలో ఏడుగురు ప్లేగుకు బలి అయ్యారు. బాబా వంటిమీద బొబ్బలు తగ్గేసరికి గ్రామంలో వ్యాధి అదృశ్యమైంది.

అప్పుడప్పుడు వచ్చినవారందరికీ సాయి స్వయంగా వంటచేసేవారు. బజారు నుండి దినుసులు కొనుక్కు రావటం, పొయ్యి వెలిగించి ఎసరు పెట్టడం, ఉప్పు, మిరియాలు వంటివి నూరడం అన్నీ ఆయన స్వయంగా చేసుకునేవారు. ఒకప్పుడు పరమాన్నము, మరొకప్పుడు మాంసపు పలావు వండేవారు. పులుసుకాచి, అందులో గోధుమరొట్టెలు, మిరియాలపొడి వేసేవారు. తర్వాత అంబలికాచి మజ్జిగతో కలిపేవారు. ఉడుకుతున్న గుండిగలో చెయ్యిపెట్టి బాగా కలిపేవారు. ఆయన చెయ్యి కొంచెంగూడ కాలేదిగాదు. వంట కాగానే పాత్రలను మౌల్వీచేత నివేదన చేయించేవారు. మొదట్ల కొంచెం మహల్సాపతికి, తాత్యా పాటిల్‌కూ పంపి తర్వాత అందరికీ వడ్డన చేసేవారు. ఒక్కొక్కప్పుడు బాబా 15, 16 శేర్లు గోధుమలు విసిరి ఆ పిండితో ఎంతో నైపుణ్యంతో చపాతీలు చేసి నేరుగా ధునిమీద కాల్చి భక్తులకు పంచేవారు. ఒకొక్కదానిలో సుమారు 15, 16 పొరలుండి తిండిపుష్టిగల వ్యక్తులకుగూడ ఒక్కటి తినడంగూడా కష్టమయ్యేంత వుండేవి. వారెంత ధన్యులో! అది వారి అనుగ్రహానికి చిహ్నమే. మాంసాహారము వండినపుడు శాకాహారులను అచటికి రానిచ్చేవారు గాదు.

ఒకొక్కప్పుడు ఆయన భక్తులను చెడ్డగా తిట్టేవారు. కారణమడిగిన ఒకరితో, 'నేను తిట్టలేదు, ఆశీర్వదించాను' అన్నారు. జూన్ 27, 1922న నార్కే అను భక్తుడు దీక్షిత్‌కు యిలా వ్రాశాడు, "నేను ఖాపర్డే జాబుననుసరించి శ్రీ మౌలీ మహరాజ్ అనే సిద్ధపురుషుని దర్శించాను. శ్రీ సాయి గొప్ప మహనీయులని వారు చెప్పేవారు. ఒకరోజు ఒక బ్రాహ్మణుడు, 'నా యెదుట సాయి ఒక పేదరాలిని చాలా చెడ్డగా తిట్టాడు. ఆయన సాధువెలా అవుతారు?' అన్నాడు. "నీకర్థంగాలేదు. ఆ విధంగా ఆమె కోరిక నెరవేర్చారు బాబా. మొదట ఆమెకు సంతానమేలేదు. ఇపుడామెకు బిడ్డలున్నారు. పోయిచూడు" అన్నారా మహనీయుడు. " ఒక అర్ధరాత్రి మశీదులో సాయి ఒక్కరే వున్నారు. దూరాన ఒక ముంగిట్లో ఒక ప్రక్కగా పడుకున్న ఒక ముస్లిం భక్తునికి మెలకువవచ్చి చూచాడు. సాయి ఏమో గొణుగుతూ ఆతృతగా అటూ యిటూ తిరుగుతున్నారు. ఇంతలో ఆకాశంలోంచి కాంతి గోళమొకటి

మశీదువైపుకు దూసుకొస్తోంది. బాబా త్వరత్వరగా అరబ్బీలో ఏవో మంత్రాలు పఠిస్తూ, ధునిమీదకు తలవంచి, మెడపై సట్కా పెట్టుకున్నారు. ఆ కాంతిగోళం మశీదులోకి రాగానే కొద్దిసేపు మసీదంతా వెలిగిపోయింది. మర్నాడు సాయి, "అతిథులొచ్చారు, సత్కరించాలి!" అంటూ మాంసం వండి మసీదులో ఒకచోట వుంచారు. దాని భావమేమో ఎవరికీ తెలియలేదు.

ఒకరోజు ధునిదగ్గర స్తంభానికి ఆనుకొని కూర్చున్న లక్ష్మీబాయి షిండేతో సాయి, "ఇక్కడకు రోజూ వచ్చే పామును చూచావా?" అన్నారు. ఆమె చూడలేదన్నది. కొద్ది నిమిషాలలో ఒక పాము ఆయన వీపుమీదుగా భుజముపైకి ప్రాకి కూర్చున్నది. ఆమె భయంతో, "అదిగో పాము!" అన్నది. అదేమీ చేయదని, తనదారిన తాను తులసీ బృందావనం వద్దకు వెళుతుందనీ బాబా చెప్పారు. ఆ క్షణంలో సాయి ఆమెకు శంకరునిలా తోచారు. కొద్దిసేపటికా పాము తులసిచెట్టు వద్దకు పోయింది. ఇందుకొక సారూప్యాన్నిస్తాను. చింతపల్లి అడవులలో నివసించిన సిద్ధపురుషుడు శ్రీ పాకలపాటి గురువుగారితో నేను, "మీకీ అరణ్యంలో భయమెయ్యలేదా!" అన్నాను. "అసలు భయమెలా వుంటుందో నాకు తెలియదు" అన్నారాయన. "మాకెందుకు భయమేస్తుంది?" అన్నాను. ఆయన, "వేరు అన్పించడంవల్ల!" అన్నారు. అన్యత్వభావం వల్లనే భయం కల్గుతుందని మన ప్రాచీన గ్రంథాలు చెబుతాయి. దానికి భిన్నమైనది అనన్యమైన ఆత్మభావం. "ఆత్మవత్సర్వ భూతాని" అన్నట్లు, సర్వజీవులనూ, తమ రూపంగా చూడగలవారు భయరహితులు; అట్టివారే జీవులకభయమివ్వగలరు.

★★★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 11

ఆశ్రిత కల్పవృక్షము

భగవంతుడు సర్వ జీవులనూ సృష్టించి సర్వులకూ తండ్రి అయ్యాడు. తానే పంచభూతాలై తన నుండే జీవులందరికీ దేహాలు, పోషణ యిచ్చి తల్లి అయ్యాడు. వేదాలు మొదలుకొని సర్వ శాస్త్రాలూ అనుగ్రహించి ఆప్తవాక్యం చెప్పే మిత్రుడయ్యాడు. సకల సృష్టినీ తన అధీనంలో వుంచుకొనడం వలన జీవులకు ఈశ్వరుడయ్యాడు. మహనీయుల రూపంలో అవతరించి గురువయ్యాడు. ఒక్కమాటలో చెప్పాలంటే యిన్ని రీతుల సర్వజీవుల శ్రేయస్సుకోసం తనను తానే వారికి దత్తం - అంకితం - అయ్యాడు. భూమిమీద ఆయన ప్రతిరూపమైన సద్గురువు రూపంలో ఆయన అవతరించినప్పుడు తననాశ్రయించిన వారందరికీ కల్పవృక్షము, కామధేనువు, చింతామణీ అవుతాడు. అదే శ్రీసాయి చరిత్ర అంతా. అందుకే ఆయన చరిత్రను "శ్రీసాయి లీలామృతము" అనడం సమంజసం.

కేవలం మాటమాత్రంతో బాబా యెందరికో బాధలు తీర్చారు. ఒకరోజు శ్యామా ఆయన చేతులు తుడుస్తుంటే ప్రేమగా ఆయన అతని బుగ్గ గిల్లారు. అతడు కోపం నటిస్తే, "72 జన్మలనుండి రక్షిస్తున్నా, నిన్ను ఎన్నడూ గిల్లనైనాలేదు. ఇప్పుడు తాకీతాకకముందే కోపగించుకుంటావెందుకు?" అన్నారు. "ఇలా గిల్లేదేవుడు మాకొద్దు. ప్రేమతో ముద్దులు, మిఠాయిలు పెట్టే దేవుడే కావాలి. అటువంటి మీపై నాకు పూర్ణవిశ్వాసం వుండేలా అనుగ్రహించండి" అన్నాడు శ్యామా. సాయి, "నేనందుకే వచ్చాను" అని ఆశీర్వదించారు. కాని ఇతనికొకసారి పాము కరచి త్వరగా విషమెక్కుతున్నది. అతని స్నేహితులు విరోబా ఆలయానికి పోదామన్నా అతడు మశీదుకే వచ్చి మెట్లెక్కుతున్నాడు. బాబా ఉగ్రులై, "ఓరీ దొంగపూజారీ! పైకెక్కవద్దు ! దిగు! పో బయటికి! పైకెక్కావో జాగ్రత్త!" అని గద్దించారు. శ్యామా నివ్వెరబోయాడు. ఆయన మరుక్షణమే ఎంతో ప్రేమగా, "భయంలేదు, యీ ఫకీరు నిన్ను తప్పక కాపాడుతాడు" అన్నారు. తక్షణమే శ్యామాకు బాధంతా తగ్గిపోయింది. అంతకుముందు ఆయన కసిరినది అతని రక్తంలో కలసిపోయి పైకెక్కుతున్న విషాన్నే! శ్రీమతి మాలంబాయికి క్షయరోగం వచ్చింది. ఏ చికిత్సా ఉపకరించకపోయేసరికి ఆమె శిరిడీ వచ్చింది. బాబా ఆమెను ఆశీర్వదించి, కేవలం దుప్పటిమీద మాత్రమే పడుకోమని, నీరు మాత్రమే త్రాగమనీ చెప్పారు! వారం రోజులలో ఆమె మరణించింది. నాడు ఉదయం 8 గం॥లైనా బాబా చావడిలోనే వుండిపోయారు. దహనానికి యేర్పాట్లు జరుగుతుండగా ఆమెకు తిరిగి ప్రాణమొచ్చింది! ఆమె, 'నన్నెవరో నల్లటిమనిషి ఎత్తుకుపోతుంటే నాకేక విని సాయివచ్చి నన్ను విడిపించుకొచ్చారు' అని చెప్పింది. అంతవరకూ ఆమె చావడిని చూడనేలేదు. అయినా దానిని చక్కగా వర్ణించి చెప్పింది. సరిగా ఆమె లేచే సమయానికి సాయి ఆవేశంతో తిడుతూ, సట్కాతో బెదిరిస్తూ ఎందుకు బయటకొచ్చారో అప్పుడందరికీ అర్థమయింది.

డా॥ పిళ్ళేకు నారికురుపు లేచింది. అతడు ఆ బాధ భరించలేక దానిని 10 జన్మలలో అనుభవించేలా చేయమని బాబాకు చెప్పించాడు. సాయి, "పది జన్మలెందుకు, పదిరోజులు చాలు" అని చెప్పి అతనిని రప్పించి, తమ దిండుకు అనుకోమని చెప్పి, "సర్వకర్తయైన దైవాన్నే శరణు పొంది ఓరిమితో కర్మఫలమనుభవించు, ఆయనెలా

చక్కబెడతారో చూడు!" అన్నారు. మరురోజు, 'ఇప్పుడొక కాకి వచ్చి ఈ కురుపును పొడవగానే బాధ తగ్గిపోతుంది' అన్నారు. ఇంతలో ప్రక్కనే పనిచేస్తున్న అబ్దుల్లా పొరపాటున పిళ్ళేకాలు త్రొక్కాడు. అది పగిలి పురుగులన్నీ బయటకొచ్చేసాయి. తర్వాత అతడు, "కాకి వచ్చేదెప్పుడు?" అంటే, "ఆ కాకివచ్చి కురుపును పొడిచేసింది!" అన్నారు బాబా. కొద్ది రోజులలో ఆ కురుపు మానిపోయింది. ఎందుకోగాని అబ్దుల్లాను "కాకి" అనేవారు బాబా. ఒకసారి శిరిడీలో ప్లేగు చెలరేగి, అందరూ ఊరు విడిచి పోతున్నారు. నందరామ్ మార్వాడీకి గూడ కళ్ళు ఎర్రబడ్డాయి. అతడు భయంతో ఊరువిడిచి పోవడానికి అనుమతి కోరితే సాయి, "నీవు పారిపోనక్కరలేదు. నేనున్నంతవరకూ నీకెట్టి ప్రమాదమూ వుండదు" అన్నారు. అప్పుడే అతడికి జ్వరం తగ్గిపోయింది. అలానే 1911లో ఒక వైశ్యుడు తన కుమార్తెను మోసుకొచ్చాడు. ఆమె కాళ్ళు చచ్చుబడిపోయాయి. సాయి ఆమెనాశీర్వదించి కొద్ది రోజులు శిరిడీలో వుండమన్నారు. మూడవ రోజుకల్లా ఆమె లేచి నడవసాగింది. అలానే ఆయన గయాసిస్, అనే రైల్వే ఉద్యోగి భార్యకు పక్షవాతం తగ్గించారు. పర్భనీనుంచి ఒకడు వచ్చి తనపై మంత్రప్రయోగం జరిగిందని, దానివలన అన్నం వెంట్రుకల్లా కన్పించి కంపుకొడుతున్నదని, తననెవరూ రక్షించలేకపోయారనీ చెప్పుకున్నాడు. బాబా, "అల్లా అచ్చా కరేగా!" అని ఆశీర్వదించారు. అంతటితో ఆ బాధ తొలగింది. ఒకరోజు ఒక నిరుపేదరాలు నమస్కరించగానే బాబా, "అమ్మా, నీ యింటికొస్తున్నాను, నిరాకరించవద్దని నీ భర్తతో చెప్పు!" అన్నారు. ఆమెకేమీ అర్థం కాలేదు. సరిగా అప్పుడే వాడాలో వున్న దీక్షిత్‌కు, ఆ కుటుంబానికి సహాయం చేయాలని పించింది. అతడు ఒక కవరులో పైకముంచి, మశీదుచేరి, "బాబా యిది పంపనా?' అన్నాడు. "ఎవరికి, ఏమిటి?" అనైనా అడగకుండా సాయి 'పంపించు' అన్నారు. ఆ పైకం చూడగానే ఆ పేదరాలికి సాయి మాటలు అర్థమయ్యాయి. కోరకనే లభించిన సహాయం భగవత్ప్రసాదమని సాయి భావం. ఒకరోజు నిరుపేదయైన కార్నిక్‌ను చూచి సాయి నవ్వుతూ, "ఆవో షాహుకార్!" అన్నారు. కొద్ది సం॥లలోనే అతడు కోటీశ్వరుడయ్యాడు.

భీమాజీపాటిల్ (నారాయణ్ గాం(వ్)కు క్షయరోగమొచ్చి తరచూ నెత్తురు కక్కుతున్నాడు. వైద్యులు అతడు బ్రతకడని చెప్పేసారు. నానాసాహెబ్ సలహాపై అతడు శిరిడీ దర్శించాడు. శ్రీ సాయి మొదట, అతడికి ఆ వ్యాధి పూర్వ పాపం వల్ల వచ్చిందని, తాము నివారించమనీ చెప్పేసారు! కాని అతడు కన్నీటితో శరణువేడితే కరిగిపోయి, "భయపడకు, యీ మశీదులో కాలుపెట్టగానే ఎంత కష్టమైన తీరవలసిందే! ఇక్కడి ఫకీరు దయామయుడు" అన్నారు. సాయిని దర్శించిన క్షణంనుండి అతనికి నెత్తురు కక్కడం ఆగిపోయి అతని పరిస్థితి మెరుగు కాజొచ్చింది. బాబా అతడిని భీమాబాయి యింటివద్ద వుంచారు. నిజానికి ఆ యిల్లు అటువంటి రోగికి యేమాత్రమూ తగదు. కొద్ది రోజులకు అతడికి రెండు కలలు వచ్చాయి. మొదటి కలలో పద్యాలు వల్లించనందుకు భీమాజీని టీచర్ కొట్టాడు. రెండవ కలలో, అతడి గుండెలమీద ఎవరోగాని పెద్ద రోలర్‌ను అటూ యిటూ దొర్లిస్తున్నారు. అతనికి భరించలేనంత బాధకల్గింది. మెలకువ వచ్చేసరికి అతని వ్యాధి పూర్తిగా తగ్గిపోయింది! అందుకు కృతజ్ఞతగా అతడు శ్రీ సాయిసత్యవ్రతం చేసుకోసాగాడు.

గ్రహబలంగూడ గురుని అనుగ్రహ బలానికి లోకువే! ఒక జ్యోతిష్కుడు ఒకరోజు బూటీకి గండమున్నదని చెప్పాడు. బూటీతో సాయి, "ఏమిటీ, నీకు గండమున్నదా? అదేమి చేస్తుందో నేను చూస్తాను" అన్నారు. నాడు చీకటిపడ్డాక బూటీ బయటకు వెళ్ళినప్పుడు ఒక పెద్ద పాము ఎదురైందిగాని ఏమీ చేయలేదు. ఒకసారి మేరీకర్‌తో గూడ సాయి, "నీకు ద్వారకామాయి తెలుసా? ఇప్పుడు నీవు కూర్చున్నది అదే, ఈ మశీదు తల్లిని ఆశ్రయిస్తే కష్టాలు తొలుగుతాయి" అన్నారు. అప్పుడు తన చేయి పాములా పెట్టి, "ఆ పెద్ద మనిషి భయంకరుడే గాని, ద్వారకామాయి బిడ్డలను అతడేమీ చేయలేడు. అతణ్ణి మనం వినోదంగా చూడగలం!" అన్నారు. అతడు ఆ మరుసటి రాత్రి చితలీ చేరి, మారుతి ఆలయంలో బసచేశాడు. అక్కడ అతడి ఉత్తరీయంమీద పెద్దపాము పడు

కుంది గాని, ఏమీ చేయలేదు. సాయి మనలను యే రూపంలోనైనా రక్షించవచ్చు.

టెండూల్కర్ అనే భక్తుని కుమారునికి జాతకంలో గ్రహాలు, దశ బాగాలేవని, కనుక అతడు పరీక్షలో కృతార్థుడు కాజాలడనీ జ్యోతిష్కులందరూ చెప్పారు. అంతటితో ఆ యువకుడు భయపడి, ఆ సంవత్సరం పరీక్షకే వెళ్ళనని పట్టుబట్టాడు. అతని తల్లి ఆ విషయం బాబాతో చెప్పుకున్నది. బాబా, "నన్ను నమ్ముకోమని మీ వాడికి చెప్పు. ఆ జాతకాలు, జ్యోతిష్కులు చెప్పిన ఫలితాలూ అవతల పారేసి, బుద్ధిగా చదువుకోమను. ధైర్యంగా పరీక్షకు వెళ్ళమను. తప్పక పాసవుతాడు" అన్నారు. అతడలాగే చేసి పరీక్ష పాసయ్యాడు. అలానే దామోదర్ రాస్నేకు చాలాకాలం సంతానం కలుగలేదు. జ్యోతిష్కులందరూ అతనికి సంతాన ప్రాప్తిలేదని చెప్పారు. కాని సాయి అనుగ్రహంతో అతనికి బిడ్డలు కలిగిన లీల క్రిందటి అధ్యాయాలలో చూడవచ్చు.

ఒకసారి మార్తాండ్ అనే దర్జీవానికి జబ్బు చేసింది. అతడితో సాయి, "నీవు నీమ్‌గాంవ్‌లోని డేంగ్లే వద్దకు వెళ్ళు, ఆదరిస్తాడు" అన్నారు. అతడు నీమ్‌గాంవ్ చేరగానే, డేంగ్లే, "బాబా నాకు కలలో కన్పించి, నిన్ను నా వద్దకు పంపుతున్నానని చెప్పారు. ఇది నీ యిల్లనుకొని కావలసినది నిస్సంకోచంగా అడుగు!" అన్నాడు. మార్తాండ్ త్వరలో కోలుకున్నాడు.

ఒకరోజు యశ్వంత్‌దేశ్‌పాండే అనే భక్తుని తండ్రి సాయిని దర్శించి, తనకు కళ్ళు కనిపించడంలేదని చెప్పాడు. దైవం మేలుచేస్తాడని ఆయన ఆశీర్వదించగానే అతడికి దృష్టివచ్చింది. మరొక అంధుడు తనకు వారి దర్శనభాగ్యం కలుగలేదని బాధపడ్డాడు. తక్షణమే అతడికి దృష్టివచ్చి, సాయిని తృప్తిగా చూచాక మరలా పోయింది! సం॥ 1912లో బలరామ్ దురంధర్ సోదరులు సాయిని దర్శించారు. వారితో సాయి, "మనం 60 జన్మలనుండి సన్నిహితులం" అని, చిలిం పీల్చి బలరామ్‌కిచ్చారు. అభ్యాసంలేని అతడు ఎంతో కష్టంమీద పొగ పీల్చాడు. ఆరు సంవత్సరాలుగా అతనిని బాధిస్తున్న ఉబ్బసం నాటితో అంతరించింది.

ఒకరోజు బాపూసాహెబ్‌జోగ్ తన తండ్రి శ్రాద్ధానికి తన శాఖ బ్రాహ్మణులను తీసుకురావడానికి బయలుదేరాడు. కాని బ్రాహ్మణులు వారికై వారే వస్తారని బాబా చెప్పారు. సరిగా ఆ రోజుకు పుంతంబా నుండి యిద్దరు బ్రాహ్మణులు సాయివద్దకొచ్చారు. ఆయన వారిని జోగ్‌వద్దకు పంపారు. వారిద్దరూ గొప్ప పండితులేగాక, జోగ్ శాఖవారే!

ఒకరోజు ఠాణేనుండి ఒక పెద్దమనిషి వచ్చి తన కుమారుడు కొన్ని సం॥లుగా కన్పించలేదని సాయితో మొరపెట్టుకున్నాడు. బాబా అన్నారు: "తప్పక త్వరలో నీ బిడ్డను కలుసుకుంటావు. " కాని అతనికి వెంటనే సెలవివ్వక రెండు రోజులు శిరిడీలోనే వుంచేశారు. మూడవరోజు అతడు మన్మాడునుండి బొంబాయి వెళ్ళే రైలులో ఠాణే చేరాడు. అప్పుడే బొంబాయి నుండి రైలొచ్చింది. అందులోంచి అతని కుమారుడు దిగాడు. తండ్రీకొడుకు లిద్దరూ ప్లాట్‌ఫారంమీద కలుసుకున్నారు! ఎప్పుడేమి చేయాలో మనకంటే ఎక్కువ బాబాకే బాగా తెలుసునని గుర్తుంచుకోవాలి. అదే సబూరీ!

మండు వేసవిలో ఒక మధ్యాహ్నం ఒక మేకపిల్ల ఎండకు తట్టుకోలేక క్రిందపడింది. సాయి దాని చుట్టూరా తిరిగి దానిపై నీళ్ళు చల్లారు. వెంటనే లేచి అది గంతులు వేస్తూ వెళ్ళిపోయింది. కేవలం సాయి సన్నిధే జీవులకు స్వస్థత చేకూర్చగలదు. సం॥ 1917లో ఒక పిచ్చికుక్క గ్రామంలోని యితర కుక్కలను తరిమి కరుస్తున్నది. గ్రామస్థులు దానిని చంపాలని తరుముతుంటే అది వచ్చి మశీదులో సాయివెనుక చేరింది. వాళ్ళు దానిని బయటకు తరమమని కోరితే; సాయి వారిని తిట్టి వెళ్ళగొట్టారు. ఆ తర్వాత ఆ కుక్కకు గాని, దానివలన మరే ప్రాణికిగాని యెలాంటి బాధా కలుగలేదు.

వారి సన్నిధి పతితులలో నైతిక పరివర్తన కలిగించేది. ఒక యువకుడు త్రాగడం మానుకోలేకుంటే అతనిని శిరిడీలో వారముండమని సాయి ఆదేశించారు. అంతటితో అతనికి ఆ దురభ్యాసం తొలగిపోయింది. అలాగే సంభారేతో ఆయన, "ఇదే నా హెచ్చరిక: నువ్వు త్రాగుడు మానాలి, లేకుంటే నీ కర్మకు నిన్ను విడుస్తాను" అన్నారు. అంతటితో ఆ కోరిక అతడికి నశించింది. ఒకప్పుడు పై అధికారి అతనిని త్రాగమని నిర్బంధించారు. సంభారే సాయిని స్మరించగానే దీపాలు ఆరిపోయాయి. ప్రక్కనున్న మిత్రుడు అతని గ్లాసులోని మద్యం త్రాగేసాడు. మరుక్షణమే లైట్లు వెలిగాయి. సంభారే మద్యం త్రాగాడని తలచి అధికారి సంతోషించాడు.

గోవానుండి వచ్చిన ఒక భక్తుడు రూ. 35/-లు సమర్పించగా సాయి తీసికొనక నిగూఢరీతిన యిలా చెప్పారు : "నావద్ద 30 సం॥లుగా వున్న వంటవాడు దుస్సాంగత్యానికి లోనై, ఒకరాత్రి గోడకు కన్నంవేసి, రూ. 30,000/- దొంగిలించాడు. ఆ దిగులుతో నేను పిచ్చెత్తినట్లు కూర్చున్నాను. ఒక ఫకీరొచ్చి నా దిగులుకు కారణం విని, "శిరిడీలో సాయిబాబా అనే మహాత్ముడున్నాడు. నీ పైకం తిరిగివస్తే శిరిడీ వస్తానని మ్రొక్కుకుని, అంతవరకూ భోజనంలో నీకిష్టమైన వంటకం తినడం మానుకో!" అన్నాడు. అలాగే చేస్తే కొద్దికాలానికి ఆ వంటవాడు తిరిగివచ్చి పశ్చాత్తాపంతో పైకం తిరిగి యిచ్చాడు. వెంటనే శిరిడీ బయల్దేరాను. మొదట నౌకలో సరంగు ఖాళీలేదన్నాడు. ఇంతలో ఒక జవాను వచ్చి సరంగునొప్పించి నన్ను నౌక ఎక్కించాడు!" సాయి తన గత జీవితమంతా వివరించడమేగాక, ఆయనే తనకు పైకం దొరికేలా చేసిన ఫకీరని, నౌకలో తనకు స్థలమిప్పించిన జవానుగూడ వారేననీ ఆ భక్తుడు గుర్తించాడు. ఒకరోజు మధ్యాహ్నం 2 గం॥లకు బాబా, "ప్రధాన్ వచ్చాడా?" అని దీక్షిత్‌ను అడిగారు. "లేదు, కబురు చేసేదా?" అన్నాడు దీక్షిత్. "చేయి" అంటూ కొద్ది విభూతినిచ్చి, "ఇది పంపించు" అన్నారు. ఆ విభూతి, ఒక ఉత్తరమూ బాలాషింపీ ద్వారా ప్రధాన్‌కు పంపాడు దీక్షిత్. అపుడు వెల్లడైన వివరాలు: శిరిడీలో బాబా అతని గురించి హెచ్చరిస్తున్న క్షణంలో హైకోర్టులో కొందరు స్నేహితులతో మాట్లాడుతున్న ప్రధాన్, అకస్మాత్తుగా స్పృహతప్పి పడిపోయాడట. కొద్దిసేపట్లో తనంతట తానే తెప్పరిల్లుకొని, రైలులో యిల్లు చేరాడు. తెల్లవారేసరికి విభూతి, జాబులతో బాలాషింపీ బొంబాయి చేరాడు. సాయికి మన బాధలు నివేదించనక్కరలేదు. ఆయన అనుక్షణమూ మనను కనిపెట్టి వుంటారని గుర్తుంచుకొంటే చాలు.

శ్రీసాయి తమను నమ్మినవారి వెంటనుండి కాపాడుతారు. సం॥1914లో శివరాత్రి ముందురోజున, హర్దాలో మేజిస్ట్రేటుగా పనిచేసిన ఛోటూభయ్యా తన కుటుంబమందరితో శిరిడీ బయల్దేరాడు. వాళ్ళు నేమేవర్‌వద్ద నది ఒడ్డుకు చేరేసరికి చీకటిపడింది. ఎంత డబ్బిస్తామన్నా బెస్తవాళ్ళు పడవ వేయమన్నారు. దిక్కుతోచక వాళ్ళందరూ సాయిని స్మరిస్తుంటే, తలగుడ్డ, కఫ్నీగల ఒక ఫకీరు వీరివద్దకు వచ్చి, "ఆడవాళ్ళను తీసుకొని యింత పొద్దుపోయి వచ్చారేమి? పై ఆఫీసరుచేత చెప్పిస్తాను, వాళ్ళ యజమాని వచ్చైనా మిమ్మల్ని నది దాటించాలి!" అని చెప్పి, పది అడుగులు వెళ్ళి యిక కన్పించలేదు. ఇంతలో పడవవారే పరుగునవచ్చి, అందరినీ పడవ ఎక్కమని చెప్పి సామానులు పడవలో సర్దారు. బాడుగ యెంతో చెప్పమంటే, "మీ చిత్తమొచ్చినంత యివ్వండి. లేకుంటే ఏమీ యివ్వకండి" అన్నారు. ఆ కుటుంబం శిరిడీ చేరాక, జరిగినదంతా తమ లీలేనని సాయి సూచించారు. శ్రీ సాయి, నమ్మినవారిని సురక్షితంగా జీవిత సాగరం దాటించి తమ చెంతకు చేర్చుకుంటారు.

గణపతి ధోండూకదమ్ సం॥ 1914లో సకుటుంబంగా శిరిడీ వెళుతున్నపుడు వారెక్కిన రైలు పెట్టెలో మరెవ్వరూ లేరు. అతడు, "భక్తిమార్గప్రదీపిక" అనే సద్గ్రంథం పెద్దగా చదువుతున్నాడు. ఇంతలో 15 లేక 20 మంది భిల్లులు ఆ పెట్టెలోకెక్కి అతని చెంతన కూర్చున్నారు. వాళ్ళు తాను చదివేది వినడానికొచ్చారని అనుకున్నాడు గణపతి ధోండు. ఐదు ని॥ల తర్వాత, రైలు వేగంగా పోతుండగానే వాళ్ళందరూ ఆ పెట్టెలోనుండి దూకి పారిపోయారు.

ధోండ్ ఆశ్చర్యంతో తలుపు దగ్గరకు వెళ్ళి చూచాడు. ఆ భిల్లులు వెనుకకు చూస్తూ పరుగెత్తుతున్నారు. ధోండ్ గూడా వెనుకకు తిరిగి పెట్టెలో చూస్తే, ఒక పక్కగా వృద్ధ ఫకీరొకరు కూర్చున్నారు. ఆయన ఆ పెట్టెలోకెలా వచ్చారో అతడికర్థం కాలేదు. మరలా చూచేసరికి ఆయనక్కడ లేరు! అందరూ ఆశ్చర్యపోయారు. వాళ్ళు శిరిడీ చేరగానే సాయి నవ్వి, "అరె, భద్రంగానే వచ్చారే!" అన్నారు. ఆ మార్గంలో భిల్లులు తరచు రైళ్ళు దోచేవారు. అలానే ఒకప్పుడు నానాచందోర్కర్ ఒక అడవిలోనున్న ప్రసిద్ధమైన గణపతి ఆలయానికి బయల్దేరాడు. రైలు ఆలస్యమై, అతడు అడవి చేరేసరికి ప్రొద్దు గూకింది. అతడు ధైర్యంచేసి నడకసాగించి, 'బాబా! 9 గం॥కు మందిరం మూసేస్తారు. నేనక్కడకు చేరేసరికి 11 గం॥లవుతుంది. నాకప్పుడు ఒక కప్పు టీ కావాలి" అని ప్రార్థించాడు. అతడు 10 మైళ్ళు నడచి ఆలయం వద్దకు రాగానే, "ఏడీ, నానా వచ్చాడా" అని పూజారి అనడం వినిపించింది. "నేను వస్తున్నట్లు మీకెలా తెలుసు?" అని ఆశ్చర్యంగా అడిగాడు నానా. పూజారి అతనికి టీ అందిస్తూ, "నానా వస్తున్నాడు, అతడికి టీ సిద్ధం చేయండి" అని సాయి మాటలు విన్పించాయి" అన్నాడు.

ఏ పరిస్థితిలోనైనా సాయి ఆజ్ఞే శ్రీరామరక్ష. ఒకసారి నాసిక్‌లో ప్లేగు చెలరేగి ధూమల్ ఇంట్లోగూడ ఎలుకలు చచ్చిపడసాగాయి. అతడు సాయికి జాబువ్రాసి వారి అనుమతితో ఇల్లు మారాడు. ఆ ప్రాంతంలో గూడా ప్లేగు వ్యాపించి, చివరకు మంచినీటి బావిలోగూడ ఎలుకలు చచ్చిపడసాగాయి. ధూమల్ మరల బాబాకు జాబువ్రాసి, ఆయనెలాగూ యిల్లు మారమంటారని తలచి, క్రొత్త యింటికి వెళ్ళాడు. ఆ యింటి తలుపులు తెరుస్తుండగా, అతను యిల్లు మారనక్కరలేదని శిరిడీ నుండి జాబు వచ్చింది. ధూమల్ వెంటనే పాత ఇంటికి వచ్చేసి, బాబా మాటలపై పూర్తి విశ్వాసంతో అక్కడే వున్నాడు. అయినా ఎవరికీ ఏ ప్రమాదమూ జరుగలేదు.

సాయి స్మృతిమాత్ర ప్రసన్నుడు. మార్చి 6, 1913న ధూలియాలో రావూజీ బిడ్డకు జ్వరమొచ్చింది. రావూజీ బాబాను ప్రార్థించాడు. నాటిరాత్రి 2 గంటలకు అతనికి కలలో సాయి కన్పించి, బిడ్డకు విభూతి పెట్టి, "భయం లేదు, 1, 2 గంటలలో బిడ్డకు చెమటపోస్తుంది. తెల్లవారేసరికి తగ్గుతుంది. తర్వాత దర్శనానికి తీసుకురా!" అన్నారు. అలానే జరిగింది. మూడవరోజు శిరిడీ నుండి రావూజీకి జాబొచ్చింది; "నేను ధూలియాలో నీ మిత్రుడు రావూజీ యింటికి వెళ్ళాను" అని శ్యామాతో బాబా అన్నారట. రెండువారాల తర్వాత ఆ కుటుంబం శిరిడీ బయలుదేరారు. ఆరోజు ఆరతి సమయంలో సాయి, "శ్యామా! ఆరతి కొంచెమాగి ప్రారంభించు. ఆ టాంగావాడు జాగుచేస్తున్నాడు" అన్నారు. అతడలాగే చేశాడు. ప్రసాదం పంచేవేళకు రావూజీ అక్కడకు చేరాడు. అతడి బిడ్డతో సాయి, "నీకు జబ్బు చేసినప్పుడు ధూలియా వచ్చాను గుర్తుందా?" అన్నారు.

ఒక వేసవి శలవులలో నానాచందోర్కర్ తన స్నేహితులతో కలసి హరిశ్చంద్ర గుట్ట వెళ్ళాడు. మధ్యలో అతడు ఎండకు డస్సిపోయి, "నీరు త్రాగక నేనొక్క అడుగైనా వేయలేను. సాయియే నన్ను కాపాడాలి" అని ఒక బండమీద కూలబడ్డాడు. మరుక్షణమే ఒక భిల్లుడు కట్టెలు మోసుకొస్తూ, నానాతో, "మీరు కూర్చున్న బండక్రింద మంచినీరుంది, త్రాగండి" అన్నాడు. చూడగా బండ క్రింద స్వచ్ఛమైన నీరున్నది! అతడు దప్పిక తీర్చుకున్నాడు. సరిగా అదే సమయంలో శిరిడీలో సాయి, "నానా దప్పికతో చావనున్నాడు. కాని నేను చావనివ్వను" అన్నారని తెలిసింది!

అన్నాసాహెబ్‌బాబరే శిరిడీ వెళ్ళినపుడు అతని గ్రామంలో ప్లేగు చెలరేగింది. అందరూ ఊరు విడిచి వెళ్ళిపోయారు. అతని భార్య, బిడ్డ మాత్రమే అక్కడ వుండిపోయారు. ఆ వ్యాధి అంతరించి, గ్రామస్థులు తిరిగి వచ్చేదాకా సాయి ఆమెకు 10, 12 సార్లు సాక్షాత్కరించి అభయమిచ్చారు!

ఒకరోజు రామగిరిబువా అనే గోసాయి యింటికి వెళ్ళడానికి బాబాను శలవుకోరాడు. సాయి అతనిని 'బాపూగిర్' అని సంబోధించేవారు. ఆయన, "నీవు మొదట జామ్నేర్ వెళ్ళి, నేనిచ్చే ఊదీ, ఆరతిపాట, నానాచందర్కోర్‌కు యిచ్చి, మీ ఊరువెళ్ళు!" అన్నారు. "నేను సిద్ధమే! కాని నావద్ద డబ్బు జల్గాం వరకే సరిపోతుంది. ఆపైన జామ్నేర్‌కు బండిలో సుమారు 30 మైళ్ళు వెళ్ళాలి గదా" అన్నాడు రామగిర్. "అన్ని ఏర్పాట్లు జరుగుతాయి వెళ్ళు!" అన్నారు సాయి. అర్థరాత్రి 2 గం॥లకు అతడు జల్గాం చేరాడు. అతనివద్ద రెండు అణాలు మాత్రం మిగిలాయి. అతడికి దిక్కుతోచలేదు. ఇంతలో ఒక బిళ్ళబంట్రోతు అతనివద్ద కొచ్చి, "శిరిడీ నుండి వచ్చిన బాపూగిర్ యెవరు?" అని విచారించి, అతనికోసం చందోర్కర్ టాంగా పంపాడని చెప్పి తీసుకెళ్ళాడు. టాంగా జామ్నేర్ పొలిమేర చేరాక, రామ్‌గిర్ లఘుశంకకు వెళ్ళివచ్చేసరికి, ఆ టాంగా యెక్కడా కన్పించలేదు. ఆ సమయంలో నానాసాహెబ్ కుమార్తె మైనతాయి ప్రసవవేదన పడుతోంది. సరిగా సమయానికి రామ్‌గిర్‌వచ్చి, ఆరతిపాట, ఊదీ యిచ్చాడు. నానా సంతోషంతో మైనతాయికి ఊదీ యిచ్చి, సాయికి ఆరతి యివ్వగానే ఆమెకు ప్రసవమైంది. తమకు సకాలంలో ప్రసాదమందించినందుకు నానా కృతజ్ఞత చెబితే, తనకోసం టాంగా పంపినందుకు రామ్‌గిర్ కృతజ్ఞత చెప్పాడు! నిజానికి టాంగా, బంట్రోతులను నానా పంపలేదు; శిరిడీనుండి ఒకరు వస్తున్నట్లుగూడ అతనికి తెలియదు! ఆ సంగతి విన్న రామ్‌గిర్‌కు, స్టేషన్‌లో బంట్రోతు తనను సాయిలాగానే పిలిచాడని, సాయి అన్ని యేర్పాట్లూ జరుగుతాయని చెప్పినదీ గుర్తొచ్చింది. అదంతా సాయి లీలేనని వారు తెలుసుకున్నారు.

ఒకరోజు నాగపూర్‌లో దీక్షిత్ తమ్ముడు జబ్బుపడినట్లు జాబొచ్చింది. దీక్షిత్, "బాబా! నా తమ్ముడికి నేనే సాయమూ చేయలేకున్నాను" అన్నాడు. వెంటనే బాబా, "సహాయం నేను చేస్తాను" అన్నారు. అదే సమయానికి నాగపూర్‌లో అతని సోదరునికి చిత్రమైన వ్యక్తి కనబడి తక్షణమే స్వస్థుణ్ణి చేశాడు! ఒకసారి సెలవు తీసుకుంటున్న ఒక భక్తునికి సాయి మరొక ఊదీ పొట్లమిచ్చి, "రైల్లో నిన్ను జానెడు స్థలమిమ్మని కోరినవాడికి ఆ పొట్లమివ్వు!" అన్నారు. దారిలో ఠాణే స్టేషన్లో రైలు బయలుదేరగానే ఒక ప్రయాణీకుడు పరుగున రైలెక్కి అతనివద్దకొచ్చి, "నాకు తల తిరుగుతోంది, కూర్చోడానికి జానెడు స్థలమివ్వండి" అన్నాడు. భక్తుడు అతనికి చోటిచ్చి, ఊదీగూడ యిచ్చాడు. ఆ వ్యక్తి ఆనందబాష్పాలు కారుస్తూ, తానెంత యత్నించినా శిరిడీ దర్శించలేక పోయానని, సాయియే తనకు ప్రసాదం పంపాలని ప్రార్థించాననీ చెప్పాడు.

రోగమేగాక అజ్ఞానమనే రోగంగూడ తొలగాలి. అందుకు బాధలను ధైర్యంగా ఓర్చుకోగలగడం అవసరం. అందుకే వ్యాధి మరీ ప్రమాదకరం కానప్పుడు రోగిని తనవద్దనుండి వెళ్ళిపొమ్మనేవారు బాబా. పరోక్షంగాగూడ ఆయన రక్షిస్తారని భక్తునికి తెలియాలిగదా! శిరిడీలోని కాకాదీక్షిత్‌కు తీవ్రంగా జ్వరమొచ్చి, శ్యామా ద్వారా బాబాకు కబురుచేశాడు. ఆయన "నేనేమీ వైద్యుణ్ణి కాదు. అతడిని యింటికి పొమ్మను!" అన్నారు. శ్యామా నివ్వెరబోయి, "అతడు మిమ్మల్నే నమ్ముకున్నాడు. జ్వరంతో ఎలా వెళ్ళగలడు?" అన్నాడు. సాయి తిరిగి కఠినంగా అలానే ఆదేశించారు. సెలవు తీసుకోడానికి కాకా మశీదుకు రాగానే సాయి, "నీవింటికి పో! ఎలా వచ్చిన జ్వరం అలానే నాల్గురోజుల్లో పోతుంది. సీమబాదము, పిస్తావేసిన పాయసం తిని తిరుగు. పడుకోకు!" అన్నారు. అతనికి ఊదీ యిచ్చి శ్యామాను తోడు పంపారు. వాళ్ళు రాత్రి 11 గం॥కు రైలుదిగి నడిచి యింటికి వెళ్ళారు. అక్కడ యెవరు చెప్పినా వినకుండా కాకా సాయి చెప్పినట్లే చేసాడు. వైద్యుడు, "నీవు ఆ పిచ్చి ఫకీరు చెప్పినట్లు చేసేటట్లైతే నేనెందుకు?" అని గద్దించాడు. అయినా కాకా వినలేదు. 9వరోజుకు జ్వరం తగ్గింది. తర్వాత అతడు శిరిడీ వెళ్ళినపుడు బాబా, "బొంబాయిలో మీవాళ్ళేమన్నారు" అని అన్నారు.

శ్రీ నృసింహ సరస్వతిలాగా బాబాగూడ యిలా అపథ్యమైన ఆహారంతో జబ్బులు తగ్గించేవారు. ఒకసారి

బూటీకి కలరావచ్చి, డాక్టర్ పిళ్ళే యెన్ని మందులిచ్చినా తగ్గలేదు. చివరకు బాబాను అడిగితే బాదము, పిస్తా వేసిన పాయసం తినమన్నారు. అలా చేయగానే జబ్బు తగ్గిపోయింది! ఒకరోజు కాకా మహాజనికి విరేచనాలు అవుతుంటే మశీదులో ప్రక్కనే కుండతో నీరుంచుకొని తరచుగా బయటకు వెళ్ళివస్తున్నాడు. బాబా సర్వజ్ఞులుగదా! అని ఆయనతో చెప్పలేదు. భక్తులు మశీదు ముంగిట పనిచేస్తున్నారు. సాయి అకస్మాత్తుగా కోపించి అందర్నీ తిట్టసాగారు. భయంతో అందరూ పారిపోయారు. కాకాను మాత్రం సాయి బలవంతాన కూర్చోబెట్టి అక్కడెవరో విడిచిన వేరుశెనగపప్పు అతనిచేత తినిపించి, ఆ కుండలో నీరు తాము కొంచెం త్రాగి అతడిచేత త్రాగించి, "నీ జబ్బు తగ్గిపోయింది!" అన్నారు. అతడికి ఆ క్షణంలోనే ఆ వ్యాధి తగ్గిపోయింది. ఈ చికిత్సలలోని రహస్యం ఆయన సంకల్పమే. ఒకసారి శ్యామా మొలలతో బాధపడుతుంటే ఆయన సోనాముఖి కషాయంచేసి, కొంచెం అతనికిచ్చి, కొంచెం ఆయన త్రాగారు. ఆ రోజుతో ఆ బాధ తగ్గిపోయింది. మూడు సం॥ల తర్వాత శ్యామాకు ఆ వ్యాధి మరలా వచ్చింది. వెనుక బాబా చేసిన వైద్యమే అతడు చేసుకుంటే వ్యాధి తీవ్రమై, మరల సాయి అనుగ్రహంతోనే, ఊదీతోనే తగ్గింది.

రఘువీర్ పురందరే మొదటిసారి శిరిడీకి బయల్దేరినప్పుడు అతని బిడ్డకు బాగా జ్వరమొచ్చింది. అతని భార్యకు తోడుగా అతని తల్లి వుంటానన్నది. కాని అతడు పట్టుపట్టి ఆమెనుగూడ తనతో తీసుకెళ్ళాడు. వాళ్ళు శిరిడీచేరిన మూడవ రోజున పురందరే భార్యకు బాబా కలలో కనిపించి, బిడ్డకు ఊదీ యిచ్చారు. ఆ క్షణంనుండి జ్వరం తగ్గిపోయింది.

సాయి మనం కోరినదల్లా నెరవేర్చక, పూర్వకర్మ దృష్ట్యా మనకు శ్రేయస్కరమైనదే చేస్తారు. ఒకామె తన బిడ్డను పాము కరచిందని ఆయనతో మొరపెట్టుకున్నది. ఆయన ఊదీ యివ్వలేదు, ఆశీర్వదించలేదు. ఆ పిల్లవాడు చనిపోయాడు. ఆ తల్లి శోకం చూడలేక, బిడ్డను బ్రతికించమని దీక్షిత్ కోరాడు. సాయి, "బావూ, యీ విషయంలో కల్పించుకోకు. ఇది అతడి మంచికే జరిగింది. అతడీ శరీరంతో చేయలేని పనులు ఆ శరీరంతో చేయగలడు. అతనిని బ్రతికిస్తే ఆ దేహం మరణిస్తుంది. అందుకు బాధ్యత నీవు వహిస్తావా?" అన్నారు. దీక్షిత్ తన తప్పు తెలుసుకున్నాడు. అలానే 1911లో హర్దానుండి వచ్చిన ఒక క్షయరోగి మరణించాడు. అతనిని రక్షించలేదని అతని బంధువులు బాబాపై అలిగారు. తర్వాత వారిలో ఒకరికి బాబా కలలో కనిపించి, రోగి తలను తమ తలపై నుంచుకొని కుళ్ళిన అతని ఊపిరితిత్తులు చూపుతూ "అతనిని యింతటి చిత్రహింస నుండి నేను విడుదల చేసాను" అని చెప్పారు. అతని బంధువర్గమంతా తిరిగి సాయిని సేవించసాగారు.

బాబా తామెప్పుడైనా భక్తులు కోరినది ప్రసాదించదల్చకపోతే ఏమీ మాట్లాడేవారు కారు. సాయి తనకొక మగబిడ్డను ప్రసాదించాలన్న కోరికతో గోవిందరావు శిరిడీ వస్తుండేవాడు. కాని బాబా యేమీ చెప్పేవారుగాదు. మరో వివాహం చేసుకుంటే బిడ్డలు కల్గుతారేమోనని చెప్పమంటే గూడ ఆయన మాట్లాడలేదు. అతడికి సంతానం కల్గనేలేదు.

★★★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 12

దక్షిణ

సృష్టిలో వాస్తవానికి సర్వమూ భగవంతునిదే. మనకు సర్వమూ ఆయాచితంగా ప్రసాదించిన భగవంతుడే మనపై అనుగ్రహంతో సద్గురువుగా సాక్షాత్కరిస్తారు. ఆయన ప్రసాదించినదే కృతజ్ఞతతో వారికి సమర్పిస్తున్నామని గుర్తించడమే దక్షిణలో వుండవలసిన భావం. అందుకే బుద్ధిమాంద్యంవలన భక్తులు మనస్సు మార్చుకొని, మొదట యివ్వదలచిన దానికంటె తక్కువ యిచ్చినపుడు అతడు మోసం చేస్తున్నాడనేవారు సాయి.

కొద్దిక్షణాలు గూడ మనస్సును, యింద్రియాలను నిగ్రహించి ఏకాగ్రం చేయడమెంతో కష్టం. అటువంటప్పుడు సద్గురువెంత కృషిచేసి నిరంతరము, సహజమూ అయిన ధ్యాననిష్ఠను సాధించి వుండాలి? ఆ శక్తితోనే అనుక్షణము భక్తుల కష్టాలు, కోరికలూ తీరుస్తూ పరమార్థాన్ని చేకూరుస్తున్నారో గదా! ఇది తెలిస్తేగాని ఆయనకు కృతజ్ఞత ఎలా తెలుపుకోవాలో అర్థంగాదు. సద్గురువు కోరేది అటువంటి అవగాహన,కృతజ్ఞత, ప్రేమలనే. కారణం వాటి ద్వారా మాత్రమే మనం తరించగలం. భక్తులు కోరేది అశాశ్వతమైన లౌకిక విషయాలే అయినా, ఆయన వాటిని సమకూరుస్తూ, మనస్సును ఆత్మజ్ఞానం వైపుకు నడిపిస్తారు. ఆ కృతజ్ఞతే 'దక్షిణ'. ఒకసారి కుదిరిన ఆ భావం మరల చెదరకుండా చూచుకోవడమే నిజమైన దక్షిణ. వారు నిరంతర తపస్సుతో కూడబెట్టిన తపశ్శక్తిని, మనం వారి రక్షణలో పొందుతాము గనుక మనం గూడ ఎంతో శ్రమించి, ప్రీతితో కూడబెట్టుకున్న ధనంలో సాధ్యమైనంత దక్షిణగా సమర్పించడం ధర్మమని ఋషులు చెప్పారు. వారినుండి మనం పొందే లౌకికమైన సహాయం మనకు మాత్రమే ఉపయోగం. మనమాయనకర్పించేది, తిరిగి సకల జీవుల శ్రేయస్సుకూ ఉపయోగపడుతుంది. కనుక దాని ఫలితం కోటిరెట్లుగా ఐహికంగానో, పారమార్థికంగానో మనకే సంక్రమిస్తుంది. అందుకే తాము స్వీకరించినదానికి తిరిగి వందరెట్లుగా మేలుచేయవలసి వుంటుందనేవారు బాబా.

అధమపక్షంగా దక్షిణను దానంగా తలచినా, ఆ దానాన్ని స్వీకరించేవారి ప్రాశస్త్యాన్ని బట్టి దానఫలముంటుందని శాస్త్రం. అలా సాయికి సమర్పించబడిన దక్షిణ సకల దేవతలకు, సత్పురుషులకేగాక సకలసృష్టికీ, పరమాత్మకూ చెందుతుంది. మనభావము, గుర్తింపులపై మనమిచ్చే దక్షిణయొక్క ప్రాశస్త్యమాధారపడుతుంది. సాయి అడిగిన దక్షిణ అదే. సాయి కొందరు భక్తులవద్ద దక్షిణ అడిగి తీసుకొనేవారు. కొందరిస్తే తీసుకొనేవారు. కొందరితో తాము సాధువు గనుక ధనం స్వీకరించరాదని సౌమ్యంగా వద్దనేవారు. కొందరిచ్చే దక్షిణ కఠోరంగా నిరాకరించేవారు. దక్షిణ అడిగే రీతులుగూడ వేర్వేరుగా వుండేవి. కొందరివైపు మౌనంగా చేయిచాపేవారు. కొందరితో, "దక్షిణ, కుక్షణ ఏమైనా యిస్తావా?" అనేవారు. ఎవరైనా యివ్వకున్నా యేమీ అనేవారుగాదు. అబద్ధం చెబితే బయట పెట్టేవారు. అయిష్టంగా ఇచ్చినా, ఆ పైకం అన్యాయార్జితమైనా స్వీకరించేవారు గాదు. సాయి, దక్షిణలో కొంత ధునిలోకవసరమయిన కట్టెలు కొనడానికి, మశీదులోను, దేవాలయాలలోనూ దీపాలకు నూనె కొనడానికీ ఖర్చు పెట్టేవారు. మిగిలిన పైకమంతా సాయంత్రమయ్యేసరికి పేదలకు, సాధువులకు పంచేసేవారు. ఇదంతా తెలియనివారు సాయి, భక్తులవద్ద డబ్బు గుంజుతారని ప్రచారం చేసేవారు.

భక్తులు ఆపత్సమయాలలో దేవతలకు మ్రొక్కుకుని, కష్టాలు తొలిగాక మర్చిపోతే బాబా వారివద్ద ఆ పైకం స్వీకరించి ఋణవిముక్తులను చేసేవారు. తరచు ఆయన కోరే పైకం ఆధ్యాత్మికసత్యాలను సూచించేదిగా వుండేది. రఘువీర్ పురందరేవద్ద బాబా ఎప్పుడూ రూ. 2/లు మాత్రమే దక్షిణ కోరేవారు. అతడొకసారి కారణం అడిగాడు. 'నాక్కావలసింది కాసులు కావు; నిష్ఠ-సబూరీ'' అన్నారు సాయి. ''బాబా, నేనా రెండూ యెప్పుడో సమర్పించానే!' అన్నాడతడు. ''నీవు వాటిని సమర్పించలేదు. నీ భక్తి నిశ్చలం కాలేదు. నీవు నన్ను దృఢంగా అంటి పెట్టుకొనివుంటే నేను నీవెంటే వుంటాను'' అన్నారు. బ్రహ్మ సత్యమన్నారు గనుక, సత్యానికి దూరమైనవాడు పరబ్రహ్మ స్వరూపానికి దూరమే కదా? బాబాను సంపూర్ణంగా విశ్వసిస్తే అసత్యమెందుకు అవసరమౌతుంది? ఒకసారి నార్కే ఉద్యోగం లేనపుడు శిరిడీలో ఒక సంవత్సరమున్నాడు. అపుడు సాయి అతనిని ప్రతిసారీ రూ. 15/-లు అడుగనారంభించారు. ఒకసారి అతడు, ''సాయి, నాకుద్యోగంలేదు. సరైన దుస్తులుగూడ లేవు. నేను రోజూ మీకు రూ. 15/-లు యెలా సమర్పించగలను?'' అన్నాడు. ''నీ పరిస్థితి తెలుసు. నీవు చదువుతున్న యోగవాశిష్ఠంలోని బోధ నీ మనస్సులో నాటుకోవాలి. ప్రపంచంలో జీవిస్తున్నా విషయాలపట్ల నిస్సంగుడవైయుండాలని నా భావం'' అన్నారు.

గురుబోధయొక్క సారం గ్రహించి దానిప్రకారం మన యోచనను, పనులను సంస్కరించుకున్నపుడే మనం నిజంగా గురువును ఆశ్రయించినట్లు. అలాగాకుంటే అది మిథ్యాభక్తే. దహనూ నివాసి ఉద్ధవేశ్ 'జ్ఞానేశ్వరి' పారాయణ చేశాడు గాని, అతడికేమీ అర్థంగాలేదు. బాబా ఆజ్ఞాపిస్తే తప్ప అతడు మరల పారాయణ చేయదలచలేదు. తర్వాత అతడు శిరిడీలో ఉన్నపుడల్లా బాబా అతనిని రోజూ రూ. 11/లు అడిగేవారు. అతడు వరసగా 10 రోజులిచ్చాడు. తర్వాత రోజు, ''బాబా, నాలోని పదకొండూ (5 జ్ఞానేంద్రియాలు, 5 కర్మేంద్రియాలు, మనస్సు) మీకెపుడో సమర్పించాను'' అన్నాడు. ''అవి సమర్పించటానికి నీవెవరు? అవెప్పుడో నాపరమైనాయి'' అని, బాపూసాహెబ్‌జోగ్ వద్దనుండి 'ఏకనాథ భాగవతము' తెప్పించి, అందులో 11వ అధ్యాయం తెరచి, అది జాగ్రత్తగా చదవమన్నారు. ఆత్మ సమర్పణ చేశాక 'నేను సమర్పించాను' అనడమెలా సాధ్యం? అలా అంటే అవి తనవేనన్న భావమున్నట్లేగదా!

దీక్షిత్ ఒకసారి ఏకనాథ భాగవతంలో ఆత్మసమర్పణ గూర్చిన శ్లోకం చదువుతున్నాడు. సాయి అపుడే అతనినుండి రు. పదహారున్నర తీసుకురమ్మని బూటీని పంపారు. బాబా నిజంగా కోరింది ఆ శ్లోకం జాగ్రత్తగా అర్థం చేసుకోమనేనని దీక్షిత్‌కు తోచింది. అంతకుముందు తాను లెక్కించిన తత్త్వాలు యివి : త్రికరణాలు 3, ఇంద్రియాలు 10, బుద్ధి 1, అహంకారం 1, తన ప్రకృతి 1/2 - మొత్తం 15 1/2. సాయి కోరిన దక్షిణకు అర్థం తెల్పమని ప్రార్థించి, శ్లోకం మరోసారి చదివాడు. ఏకనాథుడు చిత్తాన్ని ఒక తత్త్వంగా చెప్పినట్లు గుర్తించాడు. మొత్తం పదహారున్నర. అదే సాయి కోరారు.

ఒకప్పుడు దీక్షిత్ ఒక వేదాంత గ్రంథము చదువుతున్నాడు. అందులో బ్రహ్మమే సత్యమని; నామరూపాలతో గోచరించే జగత్తు 'మిథ్య' యనీ చెప్పి వున్నది. అందుకు నగలు జగత్తుకు, బంగారం బ్రహ్మానికీ పోలికగా చెప్పి వున్నది. బ్రహ్మం సత్యమైతే, దాని రూపమైన జగత్తు మిథ్యయెలా అవుతుందో అతనికి అర్థంగాక, అతను సాయిని ప్రార్థిస్తుంటే అప్పుడే అతనిని రూ. 100/-లు దక్షిణ పంపమని కబురు చేసారు సాయి. వెంటనే అతనికిలా స్ఫురించింది: ''వేదాంతం ఈ జగత్తు లేదనదు. జగత్తనే నామరూపాలు నశిస్తాయని, వాటికాధారమైనది నిత్యమనీ చెబుతుంది. బాబా కోరిన 100లో '1' లేకపోతే, '0' లకు ఉనికి లేనట్లే, నిత్యమైన సద్వస్తువుకన్యంగా రూపాలుండవని ఒక '0', పేర్లుండవని మరొక '0' తెల్పుతున్నాయి. నిత్యవస్తువును '1' సూచిస్తున్నది.

ఒకరోజు రేగే తన జేబులో రూ. 100/-లు వుంచుకొని బాబాను దర్శించాడు. సాయి అతనివద్ద 40,

తర్వాత 40, ఆ తర్వాత 20 రూపాయలూ దక్షిణ తీసుకొని, మరలా రూ. 40/-లు అడిగారు. ఆయనవద్ద పైకం లేదంటే శ్యామావద్దకు పంపారు. అతడిలా అన్నాడు: "ఆయన కోరేది డబ్బుగాదు, నీ మనస్సు, బుద్ధి, కాలము, ఆత్మలనే." సాయి ఈసారి దీక్షిత్ వద్దకు పంపారు. అతడు, "నీ దగ్గర ధనంలేదని, యాచించడం అగౌరవమను కోరాదనీ సాయి బోధించారు" అన్నాడు. తర్వాత బాబా అతనిని చందోర్కర్ వద్దకు పంపారు. అతడు, "సాయి కోరినపుడు మనవద్ద పైకం లేకపోవడం బాధాకరమే. అందుకే సగం పైకం కోపర్గాములో వుంచి, నా వద్దనున్నది అయిపోయినపుడు తెప్పిస్తాను" అన్నాడు. ఆ విషయం చెప్పగానే సాయి అతనిని పిలిపించి మొదట రూ. 40/-లు, తర్వాత రూ. 40/-లు, ఆ తర్వాత రూ. 20/-లు తీసుకున్నారు. అతడు కోపర్గాము నుంచి పైకం తెప్పించుకునే లోగానే మరల దక్షిణ కోరారు సాయి. నానాసాహెబ్ చిన్నబుచ్చుకున్నాడు. భక్తి ప్రధానంగాని యుక్తిగాదని సాయి అతనికి తెల్పారు.

ఒకప్పుడు తార్కాడ్ భార్యను రూ. 6/-లు కోరారు బాబా. అది విని, "ఆయన కోరినది అరిషడ్వర్గాలు విడవమని" అన్నాడు తార్కాడ్. ఆమె మశీదుకు వెళ్ళినపుడు సాయి మరల దక్షిణ కోరారు. తాను వాటిని సమర్పించానని చెప్పగానే, "ఆ స్థితి తొలగిపోకుండా చూచుకో!" అన్నారు. అలా భావం నిలిస్తేనే నిజంగా దక్షిణ సమర్పించినట్లు.

సాయి బి. వి. దేవ్ వద్ద దక్షిణగా 4 నవర్లు తీసుకొని కూడ, 'నీవు నాలుగిచ్చినా బాబాకు చెందినదొక్కటే!' అన్నారు. భక్తుడెన్నిసార్లు తన అంతఃకరణ చతుష్టయం భగవంతునికర్పించినా ఆయనకు చెందేది ఆత్మ ఒక్కటే, ఒక్కసారే.

ఒకప్పుడు మరికొంతమందితో పాటు రఘు అనే సాయి భక్తునికి గూడ జైలుశిక్ష విధించారు. అతడు వ్రాసుకున్న 'అప్పీలు మెమో' చూచి చందోర్కర్, దీక్షిత్ మొ॥న వారు కేసు చాలా బలంగా వున్నదని, లాభంలేదనీ చెప్పారు. అప్పుడు సాయి అతనిని ధూమల్ వద్దకు పంపారు. నిజానికి యెట్టి ఆశా లేకున్నా కేవలం సాయి ఆదేశంగా మాత్రమే ధూమల్ అహ్మద్‌నగర్ మేజిస్ట్రేట్‌తో మాట్లాడాడు. నాటిరాత్రి రఘుకు కలలో సాయి కనపడి, "రేపు మీరంతా విడుదలవుతారు, ఏడవకండి!" అని చెప్పారు. ఆశ్చర్యం! క్రింది కోర్టులోని రికార్డు తెప్పించకుండానే, ఆ కోర్టులో అప్పీలుగాని, విచారణగానీ జరుగకనే, అది కేవలం గ్రామ తగాదాలవలన ఆరోపించబడిన నేరమని నిర్ణయించి మేజిస్ట్రేటు వారందరినీ విడుదల చేసాడు. ఇది న్యాయశాఖ చరిత్రలోనే అపూర్వం. రఘు రూ. 300/-లు ఫీజుగా ధూమల్‌కు చెల్లించాడు. వెంటనే ధూమల్ శిరిడీ వెళ్ళాడు. సాయి ఆ పైకమంతా దక్షిణగా తీసేసుకుని రఘు విడుదలైంది కేవలం తమ కృపవల్లనేనని సూచించారు. అలానే సాయి అతనినొకసారి రూ. 50/-లు దక్షిణడిగారు. అతనివద్ద పైకం లేదంటే సాఠేనడిగి తెమ్మన్నారు. అంతకు ముందు సాఠే తన పెన్షన్ రూ. 50/-లు పెంచమని ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నాడు. సాఠే సంతోషంగా రూ. 50/-లు ధూమల్‌కిచ్చాడు. ఆ రోజునే అతని పెన్షన్ పెంచుతూ ప్రభుత్వం ఆదేశించింది!

భక్తుల బాధలు తొలగించడానికి గూడ బాబా దక్షిణ అడిగేవారు. ఒకసారి ఆయనడిగితే ఒక పోలీసు ఆఫీసరు తనవద్ద పైకం లేదన్నాడు. "నీ పర్సులో రూ. 50/-లున్నాయి!" అన్నారు బాబా. అతడాశ్చర్యంతో ఆ పైకం సమర్పించాడు. ఆయన కొద్దిమాత్రమే తీసుకుని, "మిగిలినది నీకవసరమౌతుంది" అన్నారు. త్వరలో అతడు చిక్కులపాలై వాటిని తొలగించుకోడానికి ఆ పైకం ఖర్చయింది. కష్టాలు తీరాక అతడా మొత్తం సాయికి దక్షిణగా సమర్పించాడు. అతడాపని ముందే చేసే వుంటే చిక్కులే వచ్చేవిగావు.

ఒక భక్తుడు దక్షిణ యివ్వాలని రూ. 2/-లు వేరుగా జేబులో పెట్టుకున్నాడు గాని తర్వాత ఆయనకు రూ. 1/- మాత్రమిచ్చాడు. సాయి నవ్వుతూ, "ఎంత మోసం; మొదట ఈ ఫకీరుకని రూ. 2/-లు జేబులో పెట్టుకుని గూడ ఒక్క రూపాయి మాత్రమిస్తారు. చాలినంత డబ్బు వేరే జేబులో వున్నది గదా!" అన్నారు. అతడు ఆశ్చర్యపోయాడు.

సాయికోరే దక్షిణ ఒక్కొక్కప్పుడు భవిష్యత్తును నిగూఢంగా సూచించేది. అయిదు గదులతో భవనం నిర్మించదలచి సాయిని దర్శించాడు దేవ్. అపుడు బాబా నేలమీద 25 గీతలు గీస్తూ, "గదికొక రూపాయి చొప్పున రు. 25/-లు దక్షిణివ్వు!" అన్నారు. అతడు సమర్పించాడు. ఆశ్చర్యం! అది 25 గదుల భవనమైంది. అలాగే 1912లో ఒకరోజు పోలీసు ఇన్స్పెక్టర్ సోమనాథ్ వద్ద సాయి రు. 10/-లు దక్షిణ తీసుకొన్నారు. ఆ రోజునుంచే అతని నెల జీతం రూ. 10/-లు పెంచినట్టు ఆరు నెలల తర్వాత అతనికి ప్రభుత్వం నుండి ఉత్తర్వు వచ్చింది.

నాచ్నే, శంకర్రావు నమస్కరించగానే, బాబా రూ. 15/-లు దక్షిణ కోరారు. అతడు తనవద్ద డబ్బులేదన్నాడు. వెంటనే సాయి రూ. 30/-లు యివ్వమన్నారు. అతడు తిరిగి అదే బదులు చెప్పాడు. సాయి రూ. 64/-లు కావాలన్నారు. వెంటనే అతడు, "బాబా! మేము పేదవాళ్ళము. అంత యివ్వలేము" అని మొరపెట్టుకున్నాడు. అపుడు సాయి వారిని ఆ డబ్బు పోగు చేసివ్వమన్నారు. ఆయన భావమేమో వారికి తెలియలేదు. తర్వాత 1916లో బాబాకు జబ్బు చేసినపుడు ఆయనకు ఆరోగ్యం చేకూరాలని సప్తాహం, అన్నదానాల కోసం నాచ్నే, శంకర్రావు గూడ వసూళ్ళు చేసారు. వారు సేకరించి పంపినది సరిగా రూ. 64/-లు.

సాయి పవిత్రులవద్ద మాత్రమే దక్షిణ స్వీకరించేవారు. ఉంపుడుకత్తెనుంచుకొని, సుఖ రోగాలతో బాధపడే వాడొకడు శిరిడీ చేరి బాబాకు రూ. 50/-లు నివ్వబోయాడు. సాయి కోపంతో, "నీ డబ్బు నాకొద్దు. నీవొకతె నుంచుకున్నావు గదా, ఆమెకివ్వు" అన్నారు. అతడు సిగ్గుతో తలవంచుకొని వెళ్ళిపోయాడు.

ఒకప్పుడు దక్షిణ విషయమై సాయి, "నేనెవరినుండైనా ఒక్క రూపాయి దక్షిణ తీసుకుంటే దానికి పదిరెట్లు తిరిగివ్వవలసి వుంటుంది. నేనెప్పుడూ యేదీ ఊరికే తీసుకోను. ఆ ఫకీరు చూపినవారినుండే స్వీకరిస్తాను. వాళ్ళు దక్షిణ రూపంలో పుణ్యం నాటి, తర్వాత సమృద్ధిగా ఫలితాన్ని పొందుతారు. సిరిసంపదలు ధర్మాన్ని సాధించటం కోసమే వున్నాయి. కేవలం సుఖాలకోసం వెచ్చిస్తే అది వ్యర్థమే. ఇదివరకు ధర్మంచేసి వుంటేనే యిప్పుడు సంపద పొందుతావు. అదీ భగవంతుడిచ్చినదే గనుక, భగవంతునికివ్వడం వలన భక్తి జ్ఞానాలు వృద్ధి పొందుతాయి. నేనుమాత్రం చేసేదేమిటి? ఒకటి స్వీకరించి, పదిరెట్లు యిస్తున్నాను" అన్నారు.

★★★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము



అధ్యాయము - 13

సాయి - సాంప్రదాయము

ఇహపర శ్రేయస్సు చేకూర్చే జీవిత విధానమే ధర్మం. సృష్టి - మానవుల తత్త్వమెరిగిన మహనీయులు అన్ని దేశాలకూ తగిన ధర్మం బోధించారు. ప్రకృతిలో ప్రతి దానికీ వృద్ధి - క్షయము - పునరుద్ధరణ సహజమైనట్లే, ధర్మానికి గూడ సహజం. కాలక్రమేణ ధర్మంలో మూఢాచారాలు చోటుచేసుకొనడంవలన మతద్వేషాలేర్పడ్డాయి. అందుకే ప్రతి యుగంలోవలెనే యీ యుగంలోగూడ నిజమైన ఆధ్యాత్మిక ధర్మం తెలిపి మూఢాచారాలు తొలగించడానికి బాబా అవతరించారు. శ్రీకృష్ణుడు, బుద్ధుడు, క్రీస్తు, మహమ్మదులవలెనే ఆయన మనకు ధర్మం తెలిపారు.

ఒక పేద బ్రాహ్మణుడు బాబాను ధనసహాయం కోరాడుగాని, లోలోపల ఆయన ముస్లిమనే శంకగూడ వున్నది. మొదట కొంతసేపు సాయి పట్టించుకోలేదు గాని, చివరికొక కాగితపు పొట్లమిచ్చి, ''దీనిని యింటికి తీసుకుపోయి నువ్వు, బిడ్డలూ తినండి. దారిలో విప్పి చూడవద్దు'' అన్నారు. అతడు తన ఊరికి బయలుదేరాడు. పోను పోను కుతూహలమెక్కువై చివరికొక కాలువ గట్టు చేరి, ఆ పొట్లం విప్పి చూచాడు. అందులో పొట్టేలు మాంసమున్నది. వెంటనే దానిని కాలువలో పారేశాడు. నీటికి తగులగానే ఆ మాంసం బంగారంగా మారి, చూస్తుండగా మునిగిపోయింది. అతడు నిరాశగా తన పైపంచ ఆ కాలువలో పిండుకున్నాడు. అపుడందులో ఒక సన్నని బంగారుపోగు కన్పించింది. సద్గురువు యొక్క వేష భాషలు పట్టించుకోక, ఆయనను విశ్వసించినవాడే కృతార్థుడౌతాడు.

నిత్య జీవితంలో మనోనిగ్రహం సాధించినవారికి మాత్రమే ఉపవాసం యింద్రియనిగ్రహం సాధించడానికి పనికొస్తుంది. మిగిలినవారికి ఉపవసించినపుడు రుచుల మీదకు మనస్సు పోతుంది గనుక వ్యర్థమేగాక, అనర్థం గూడ. అందుకే సాయి తన భక్తులను ఉపవసించనిచ్చేవారుగాదు. ఒకరోజు దాదా కేల్కర్‌తో ఆయన, ''ఇపుడు 'సిమోగా' పండుగలు కదా, బిడ్డలను ఉపవసించనివ్వము!'' అన్నారు. ఆయనమాటలెవరికీ అర్థంగాలేదు. కొద్దిసేపట్లో శ్రీమతి గోఖలే శిరిడీ చేరి, కేల్కర్ ఇంట్లో సామానుపెట్టి మశీదు చేరింది. అప్పుడు సాయి నెమ్మదిగా, ''ఈ ఉపవాసము, తపవాసము ఎందుకు? దాదా కేల్కర్ యింటికి వెళ్ళి పోళీలు చేసి మనం తినాలి. దాదాకు, అతని బిడ్డలకు పెట్టాలి!'' అన్నారు. సరిగ్గా అదే సమయంలో కేల్కర్ భార్య బహిష్టు అయింది. ఇంట్లో వంటచేసే వారెవరూలేరు. కనుక శ్రీమతి గోఖలేనే ఆ యింట్లో వంటచేసి, ఆ కుటుంబానికి పెట్టి తినవలసివచ్చింది. నిజానికి ఆమె మొదట శిరిడీ వెళ్ళి సాయి సన్నిధిలో 3 రోజులు ఉపవసించాలనుకున్నదట!

ఒకసారి దీక్షిత్ యావజ్జీవితమూ రాత్రి ఉపవసించాలని నిశ్చయించుకున్నాడు. నాటి సాయింత్రం అతడు మశీదు చేరగానే సాయి, ''రాత్రి భోజనానికి ఏమి చేయిస్తావు?'' అన్నారు. ''మీరేది చేయించమంటే అది!'' అన్నాడు దీక్షిత్. ''మామూలే! రొట్టెలు, కూర చేయించి, అక్కడే నైవేద్యం పెట్టి, నీవూ తిను'' అన్నారు బాబా. ''బాబా, ఈరోజు అలానే చేస్తాను. రేపటినుంచీ నేను రాత్రి భోజనం చేయను'' అన్నాడు దీక్షిత్. బాబా అప్పుడేమీ మాట్లాడలేదు

గాని, రోజూ సాయంత్రం అలానే హెచ్చరిస్తున్నారు. అంతటితో ఆ నియమం మానుకున్నాడు దీక్షిత్.

ఒకరోజు అందరూ ఆరతికి మసీదుకు వెళ్ళినపుడు బల్వంత్‌నాచ్నేను వెళ్ళి భోజనం చెయ్యమన్నారు బాబా. ఆరోజు ఏకాదశి. సాటి భక్తులిద్దరూ ఉపవసిస్తుంటే తాను తినడం బాగుండదని, అతడారోజు భోజనం చెయ్యనన్నాడు. నిజానికి అతడెన్నడూ ఉపవసించడు. బాబా అతని సహచరులను చూపి, "వీరు పిచ్చివాళ్ళు, నీవైనా వాడాకుపోయి భోజనం చేసిరా!" అన్నారు. వంటవాడు చికాకుపడి, ఆరతి అయితేగాని భోజనం పెట్టనన్నాడు. నాచ్నే మశీదు చేరగానే "భోజనం చేశావా?" అన్నారు బాబా. అతడు జరిగినది చెప్పక, ఆరతి అయ్యాక తింటానన్నాడు. బాబా పట్టుదలగా, 'భోజనమయ్యాకనే ఆరతి జరుగుతుంది!" అన్నారు. వంటవాడు వడ్డించక తప్పలేదు. భోజనం తర్వాత నాచ్నేచేత తాంబూలం తినిపించారు బాబా.

శ్యామా తరచుగా, "ద్వారకలో యాభైకోట్లమంది యాదవులుండే వారని, రామునికి యుద్ధంలో సహాయంగా కోటిమంది వానరులొకచోట చేరారనీ వ్రాశారు. అది నిజమేనా?" అని అడిగితే సాయి, "ఆఁ నిజమే! రాముడు, కృష్ణుడు అవతరించినది గూడ నిజమే, వారంతా చీమలపుట్టల్లా ఒకరిపైనొకరు చేరారు" అన్నారు. అతడు, "చూచినట్లే చెబుతున్నారే!" అంటే ఆయన, "అవును, చూచాను. నాకు, నీకూ ఎన్నోజన్మలు గడిచాయి. నాకన్నీ గుర్తున్నాయి. నీకులేవు. ఇప్పుడెలా వున్నానో అప్పుడూ అలానే వున్నాను" అన్నారు. మరోసారి యితడే బ్రహ్మలోకము మొ॥వి వుంటే తనకు చూపమని పట్టుబట్టాడు. భగవంతుని ముందు అవి అల్పాలని, అశాశ్వతములని, వాటిని పట్టించుకోవద్దనీ చెప్పినా అతడు వినలేదు. బాబా అతనిని కళ్ళు మూసుకోమన్నారు. అతనికి ఆయా లోకాలు కన్పిస్తుంటే బాబా సత్యలోకంలో బ్రహ్మను, వైకుంఠంలో విష్ణువును, కైలాసంలో శివుణ్ణి చూపి, "మనం కోరవలసినది వీటికతీతమైనది" అన్నారు.

నాగపూర్‌జిల్లాకు చెందిన భీష్మకు 1908లో ఒకరాత్రి కలలో ఒక నల్లని సద్బ్రాహ్మణుడు దర్శనమిచ్చి ఒక కాగితంమీద, "సచ్చిదానంద" అన్న మంత్రం చూపాడు. తర్వాత అతడొక సాధువును అడిగితే అది అతని సద్గురు నామమని చెప్పాడు. తర్వాత అతడు శిరిడీ వచ్చినపుడు సాయి అతనిని చూస్తూనే నవ్వి, "జై సచ్చిదానంద!" అన్నారు. అతనాశ్చర్యపోయి తనకు స్వప్న దర్శనమిచ్చిన గురువు వీరేనేమోననుకున్నాడు గాని, వారు వైష్ణవులు, సాయి ముస్లిము గదా అని శంకించాడు. ఒకరోజు సాయి, "మేమే సర్వత్రా సంచరిస్తున్నాము. బొంబాయి, పూణే, నాగపూర్ మొ॥న ప్రదేశాలన్నీ రామమయమే, తెలిసిందా మిత్రమా? నీవు 5 లడ్డూలివ్వాలి" అన్నారు. మరురోజు తెల్లవారగానే అతని హృదయంలో కవిత పెల్లుబికి వెంటనే రెండు పాటలు వ్రాశాడు. కాని, ఆపై ఒక్కటిగూడ నడవలేదు. వాటిని సమర్పించగానే, సాయి అతనినే పాడి విన్పించమన్నారు. అతడు పాడాక అతని తలపై చేయిపెట్టి ఆశీర్వదించారు. అతనికి మళ్ళీ స్ఫూర్తిగలిగి, మరి మూడు పాటలు వ్రాసి ఆయనకు వినిపించాడు. అవే మొదటి శిరిడీ ఆరతులు. **సాయి యిలా కోరి, తమ తపశ్శక్తి ధారపోసి వ్రాయించుకుని దక్షిణగా తీసుకున్నవి.** తర్వాత దాసగణు, మాధవ్‌లు మరి కొన్ని పాటలు చేర్చి నేటి శిరిడీ ఆరతులు కూర్చారు. అందుకే భావమెరిగి వాటిని పాడుకొనడమెంతో శ్రేయస్కరం.

మన శాస్త్రాలను బాబా చక్కగా వివరించారు. శ్రోత్రియుడు నానాచందోర్కర్, తనకు భోజన సమయంలో తరచుగా అతిథులు దొరకడం లేదన్నాడు. బాబా అన్నారు: "నానా, శాస్త్రాల్లో పొరబాటేమీ లేదు. వాటిని నీవే సరిగా అర్థం చేసుకోలేదు. అతిథి అంటే మానవుడేగాదు, భోజన సమయానికి వచ్చిన ఏ ప్రాణియైనా అతిథే, క్రిమికీటకాదుల నుండి మానవులవరకూ నిజంగా లభించిన అతిథులను నువ్వు గుర్తించడం లేదు. కాకబలికి బయట సమృద్ధిగా అన్నం విడిచిరా. ఏ ప్రాణినీ పిలువవద్దు, తరమవద్దు. ఏ ప్రాణి వచ్చిందన్నది పట్టించు

కోవద్దు. అలా చేస్తే లక్షలాది అతిథులను ఆదరించినట్లే."

ఏ విషయంలోనైనా కొంతవరకూ జాగ్రత్త అవసరమే, సహజమే కాని సర్వానికీ కర్త భగవంతుడేనని, సద్గురు అనుగ్రహాన్ని మించినదేదీ లేదన్న సత్యాన్ని అది మరిపించకూడదు. అది పిరికితనంగా, మూఢనమ్మకంగా మారగూడదు. ఒకప్పుడు శిరిడీ పరిసరాలలో కలరా వ్యాపించింది. ప్రక్క గ్రామాలతో సంబంధం లేకుండా ఆ గ్రామస్తులు జాగ్రత్తపడ్డారు. మంచిదే, కాని ఊరిలోకి కట్టెల బండి ప్రవేశించడం అశుభమని నమ్మి, నిషేధించి, దానిని ఉల్లంఘించిన వారికి జరిమానా ప్రకటించారు. ఇంతలో ఆ ఊరు సమీపించిన కట్టెలబండిని సాయియే పిలిచి, మశీదులో ధునికి కట్టెలు వేయించారు. ఎవరూ ఆయనకు ఎదురు చెప్పలేదు.

ధర్మం ఉల్లంఘించమని సద్గురువెన్నడూ చెప్పడు. మనకు ధర్మ సూక్ష్మం అర్థంగాక అలా అనిపించవచ్చు. శాస్త్ర వాక్యాన్ని విడచి ఆయన ఆజ్ఞనే పాటించమని ధర్మశాస్త్రము, ఆధ్యాత్మ విద్య చెబుతాయి. కారణం, ధర్మాలన్నీ సద్గురు కృపను ప్రసాదించేవే. అయితే ఆయన యందు దృఢ విశ్వాసమున్నవారికే ఉత్తమ ఫలితం లభిస్తుంది. సద్గురువును తాము పూర్ణంగా విశ్వసించామని భ్రమించి, ఆయన తమను కరుణించలేదని భక్తులు వాపోతారు. అందుకని అప్పుడప్పుడు సద్గురువు వారి విశ్వాసమెంతటిదో వారికి నిరూపిస్తుంటారు. ఒకరోజు ఒక కృశించిన ముసలిమేక మసీదులోకి వచ్చింది. బడేబాబాను పిలిచి, "నీవు ఆ మేకను ఒక్క దెబ్బతో నరుకు!" అన్నారు సాయి. అది తన వల్లగాదని చెప్పి అక్కడనుండి వెళ్ళిపోయాడు బడేబాబా. శ్యామాను పిలచి, రాధాకృష్ణ ఆయి వద్ద నుండి కత్తి తెచ్చి ఆ మేకను నరకమన్నారు సాయి. ఆమె మొదట తెలియక కత్తి పంపిందిగాని, ఎందుకో తెలిసి తిరిగి తెప్పించుకున్నది. శ్యామాగూడ వేరొక కత్తి తెస్తానని వెళ్ళి తిరిగిరాలేదు. సాయి అలానే దీక్షిత్‌ను ఆజ్ఞాపించారు. అతడు కత్తి తెచ్చాడు. కాని సాయి కేవలం తన భక్తిని పరీక్షిస్తున్నారని తలచి వెనుకాడుతుంటే, మేకను నరకమని ఆజ్ఞాపించారు. సరిగ్గా అతను నరకబోయే సమయానికి వారించి, "దానిని విడిచిపెట్టు. నేనే చంపుతాను. కాని, మశీదులో కాదు" అన్నారు సాయి. ఆ మేక కొన్ని అడుగులు బయటకు నడచి, చచ్చి క్రిందపడింది.

దాదాకేల్కర్ ఆచారపరుడు. ఒకప్పుడతనికి పైకమిచ్చి మాంసము తెమ్మన్నారు బాబా. ఆ సద్బ్రాహ్మణుడు నిస్సంకోచంగా బయలుదేరాడు. అప్పుడు సాయి అతనిని వారించి మరెవ్వరినైనా పంపమన్నారు. తరువాత అసలు మాంసమే అవసరం లేదన్నారు! మరొకప్పుడు ఆయన వంట చేస్తూ అతనిని పిలిచి, "మాంసపు పలావ్ ఎలా వున్నదో చూడు!" అన్నారు. అతడు చూడకుండానే, "బాగానే వున్నది" అన్నాడు. "చూడకుండానే బాగుందంటావేం? మూత తీసి చూడు!" అంటూ సాయి అతని చేతిని గుండిగలోనికి తోసి, "గరిటతో కొంచెం పళ్ళెంలో వేయి, ఆచారం గురించి భయపడకు!" అని అతనిని ప్రేమగా గిల్లారు.

ఇటువంటి విషయాలలో సాయి ముస్లిమ్ భక్తులను కూడ విడిచిపెట్టలేదు. ఒక ముస్లిం తనకు సంతానం కల్గితే శిరిడీలో మిఠాయి పంచుతానని మ్రొక్కుకున్నాడు. అతని కోరిక ఫలించింది. అతడు శిరిడీ చేరి మిఠాయి పంచటానికి బాబా అనుమతి కోరాడు. ఆయన నవ్వి మారుతి ఆలయంలో పంచమన్నారు. అతడు నివ్వెరబోయి, "నేను ముస్లిమ్‌ను గదా అదెలా సాధ్యం?' అన్నాడు. బాబా నవ్వుతూ, "ఇటీవల వారికి జరిగిన యుద్ధంలో మారుతి అల్లాహ్‌ను ఓడించాడు!" అని, ఉగ్రులై, "ఏం ముస్లిమ్‌వురా నీవు! ఆలయంలో మిఠాయి పంచుపో!" అని గద్దించారు. సర్వగతుడైన భగవంతునిపై భక్తికి మతభేదం ఆటంకంగాదని వారి భావం. అతడు బాబా ఆజ్ఞను పాటించాడు.

నైజాం రాష్ట్రానికి చెందిన ఒక ముస్లిమ్‌మత ప్రముఖుడు (హాజీ) శిరిడీ వచ్చి, మసీదులో అగ్నిహోత్రము,

గంటలు మో॥వి వుంచటం గురించి బాబాతో, "ఇది ముస్లిమ్‌లైన మీకు తగదు. అల్లాహ్ మిమ్ము సహించడు". అన్నాడు. సాయి ఉగ్రులై, "నీవు అసలు ముస్లిమ్‌వేనా? నీకు 'నమాజ్', 'షరియత్' (ఇస్లాం ఆచార ఖాండ), ఖురాన్‌లు తెలుసా? ముస్లిమ్‌లు మాత్రమే దేవునిచేత సృష్టింపబడ్డారా? తక్కినవారిని ఎవరికైనా జీతానికి అప్పగించారా? వారి చావు పుట్టుకలు, ఆకలి దప్పులలో ఏమైనా భేదమున్నదా? అసలైన ఇస్లాం నాకు తెలుసు! భగవంతుని శక్తిని ఋజువు చేయగలవాడే ముస్లిమ్" అన్నారు. ఆ ఖాజీ సాయంత్రం వరకూ మౌనంగా మశీదు ముంగిట పచార్లుచేసి, బాబాకు మోకరిల్లి తనను అనుగ్రహించమని కోరాడు. అతనిని 3, 4 రోజులు తమదగ్గ రుంచుకొని ఆశీర్వదించి పంపారు బాబా. ధర్మాచరణ, భగవంతునికి శరణాగతి మాత్రమే 'ఇస్లాం' ధర్మమని 'ఖురాన్' చెబుతుంది.

సాయి మతమౌఢ్యాన్ని నిరసించేవారు. భక్తులాయనను మొదట పూలతో మాత్రమే పూజించేవారు. ఒక్క మహల్సాపతి మాత్రమే ఆయన కంఠానికి చందనమద్దేవాడు. ఒకనాటి రాత్రి అతనికి స్వప్నంలో ముఖానికి చందనం ధరించి సాయి దర్శనమిచ్చారు. మరురోజునుండి అతడు సాయిని అలానే అలంకరించ సాగాడు. అతనిని వారించమని ముస్లింలు కోరినా ఆయన అభ్యంతరం చెప్పలేదు. వారిలో కొందరు సంగమనేరులోని ఖాజీతో సంప్రదించి, సాయి ముఖాన చందనమద్దినవారిని దండించదలచారు. మొహుద్దీన్ తంబులీ ఆ విషయం మహల్సాపతికి చెప్పాడు. మరురోజతడు మసీదు ముంగిటనుంచే సాయిని పూజిస్తున్నాడు. సాయి అతనిని, "లోపలకొచ్చి నా ముఖాన చందనమద్దు, ఎవరడ్డొస్తారో చూస్తాను!" అని గద్దించారు. ఆ ముస్లింలు భయపడి వెళ్ళిపోయారు. హిందువులు నిర్భయంగా తమ మతానుసారం సాయిని ఆరాధించసాగారు.

వేరు మతాలవారికి దైవం వేరైతే, మతం మార్చుకోవడం ద్రోహము, లజ్జాకరము. దైవమొక్కడే అయితే మతం మార్చుకొనడం అనవసరము. ఒక హిందూ యువకుణ్ణి ముస్లింగా మార్చి, గర్వంగా బాబాకు చూపాడు బడేబాబా. సాయి ఉగ్రులై, ఆ యువకుని చెంపమీద కొట్టి, "నీ అబ్బను మార్చుకున్నావుట్రా?" అన్నారు.

హిందువులు తమ మతాచారాలతో మశీదును అపవిత్రం చేస్తున్నారని తలచాడు ఒక పఠాను. ఒకనాటి రాత్రి చావడిలో పడుకున్న సాయి చెంతకు వెళ్ళి, అక్కడ నిద్రిస్తున్న హిందువులను చూపుతూ, 'మీరు అనుమతిస్తే మశీదును అపవిత్రం చేస్తున్న వీరందరినీ యిప్పుడే చంపేస్తాను!" అన్నాడు. సాయి శాంతంగా, "ఇందులో తప్పేదైనా వుంటే అది నాదే. వారందరినీ చంపేకంటే నన్నే చంపుతే సమస్య తీరుతుంది!" అన్నారు. అతడు నివ్వెరపోయి, ఆ సంకల్పము విడిచాడు. కాని మరొక పఠాను అందుకు గూడ సిద్ధమయ్యాడు. ఒకరోజు సాయి మశీదులో అటు, యిటూ తిరుగుతున్నారు. ఇతడు చేతిలో దుడ్డుకర్ర తీసుకుని వెనుకనుండి వచ్చి సాయిని కొట్టబోయాడు. అతడు కర్ర యెత్తిన క్షణంలో ఆయన అతనివైపు తీవ్రంగా చూసి అతడి చేయి తాకారు. అదేమీ చిత్రమో, అతడి బలమంతాపోయి, కుప్పకూలాడు. నాటితో అతడా సంకల్పం విడిచాడు. ఇలాటి ముస్లిమే మరొకడు హిందువులను భ్రష్టులను చేయదలచి, బాబా లెండీకి వెళ్ళినపుడు మశీదులోని మంచినీటి కుండలలో తాను త్రాగిన నీళ్ళు కలిపాడు. ఇంతలో బాబా తిరిగి వచ్చి, ఆ నీళ్ళు పారబోసి, కుండలు పగలగొట్టి, పెద్దగా తిట్టారు.

హిందూ భక్తులకువలే, పాత్రులైన ముస్లిమ్‌లను గూడ సంస్కరించి అనుగ్రహించేవారు సాయి. ఎన్నోసార్లు మక్కాయాత్ర చేసిన ఒక ముస్లిమ్ హాజిసిద్దిక్ సాల్కే శిరిడీ వచ్చాడు. అతనిని చూస్తూనే బాబా ఉగ్రులై రెండు నెలల వరకూ అతనిని మశీదులో ప్రవేశించనీయలేదు. ఒకరోజు శ్యామా అతని తరపున ప్రార్థిస్తే, "ఆ హాజీ బార్వే బావిదగ్గరకు సన్నని కాలిబాటన వస్తాడా?" అన్నారు బాబా. హాజీని అడిగితే అతడు వస్తానన్నాడు. అది విని సాయి, "నాలుగు వాయిదాలలో రూ. 40,000లు చెల్లిస్తాడా?" అన్నారు. శ్యామా అడిగివచ్చి, అతడు 40 లక్షలైన

యివ్వడానికి సిద్ధమేనని చెప్పాడు. ఈసారి ఆయన, "మేమొక మేకను కోస్తాము. అతడికి తల, పిరుదులు, వృషణాలు, యేది కావాలో కనుక్కో!" అన్నారు. "బాబాగారి మట్టికుండలోని చిన్న రొట్టెముక్క చాలు" అని కబురు చేశాడు హాజీ. అది విన్న సాయి పట్టరాని ఆవేశంతో మసీదులోని పాత్రలన్నీ బయటపారేసి, కఫ్నీ చేతులు పైకి మడుచుకొంటూ, కోపంగా హాజీవద్దకొచ్చి, "ఇక్కడున్నది ఎవరనుకున్నావ్? మక్కాయాత్ర చేశానని గర్వమా? ఖురాన్ అలా చెప్పిందా? ఇంతా చేసి నీవు నన్నెరుగవు!" అన్నారు. హాజీ భయంతో వణికిపోయాడు. బాబా మసీదుకు తిరిగివచ్చి తమ వద్దనున్న పైకంతో పండ్లుకొని హాజీకి పంపి, రూ. 50/-లు కూడ యిచ్చారు. నాటినుండి అతడు మసీదు ప్రవేశించటానికి సాయి అనుమతించారు. ఆయన చెప్పిన మేక శరీరంలోని భాగాలు ధర్మార్థకామాలు; హాజీ కోరినది సాయి నిత్యమనుభవించే మోక్షం. 'సాయి పాత్రలోని చిన్న రొట్టెముక్క' కోరడంలో హాజీ గురూచ్ఛిష్టం కోరాడు; సాయి చెప్పిన కాలిబాట కఠోరమైన సాధన. రూ. 40,000/-లు అంతఃకరణ చతుష్టయం; కాని అవి మొదట తాను హాజీననే గర్వంలో చిక్కుకున్నాయి. అతడు తమను శరణుపొందాకనే, సాయి కోపంతో అతని గర్వమణచడం సరియైన గురువుల పద్ధతి. అది నెరవేరగానే తమ సంతోషానికి సంకేతంగా సాయి పండ్లు, కానుక ప్రసాదించారు.

ఇలానే హిందువులను గూడ సంస్కరించారు సాయి. బల్వంత్‌నాచ్నే 1915లో ఒకనాటి రాత్రి 8 గంటలకు సాయిని దర్శించి ముక్తిమార్గం చెప్పమని ప్రార్థించాడు. "దేవ్‌పూర్ వెళ్ళి, అక్కడ అనాదిగా మీ పూర్వీకులు అర్చిస్తున్న శిలలను ఆశ్రయించు" అన్నారు సాయి. అతనికేమీ అర్థంగాలేదు. ఇంటికి వెళ్ళాక, నిజంగానే వారి పూర్వీకులు దేవపూర్‌లో కొన్ని విగ్రహాలను పూజించేవారని అతని తండ్రి చెప్పాడు. ఐదు తరాలకు ముందు వారి పూర్వీకుడు, బాబో ప్రయాగ్ తమ 70వ యేట సంతానం కోసం ఏకనాథుని శిష్యుడైన 'బాబా భాగవత్' అనే మహాత్ముని త్రయంబకేశ్వరంలో దర్శించాడు. ఆయన ఆశీస్సులతో కలిగిన పసిబిడ్డను దేవపూర్ తీసుకువెళ్ళి, 'జ్ఞానేశ్వరి' వ్రాతప్రతి చేతిలో పెట్టారు భాగవత్. వంశం నిలబడితే ఆ వంశస్థులు, భాగవత్ వంశస్థులనుండి ఉపదేశం పొందుతామని ఆ పూర్వీకుడు మ్రొక్కుకున్నాడు. ఇదంతా సాయికి తెలియడమే ఆశ్చర్యం! అయినా చాలా సం॥రాలకు నాచ్నే 1927లో 'నానూమహరాజ్, అనే 15 సం॥ల మహాత్ముని దర్శించాడు. ఆయన, "దేవపూర్ వెళ్ళావా?" అన్నారు. నాచ్నే ఆశ్చర్యపోయి, "ఆ గురువంశంలో నాకంటె పెద్దలెవరూ లేరని వెళ్ళలేదు" అన్నాడు. "అయితేనేం? నా గురువు శ్రీదోయ్‌పాడే నాకంటే చిన్నవారు. నీ గురువు పేరు భాగవత్" అన్నారు ఆ మహాత్ముడు. నాచ్నే త్వరలో దేవపూర్ వెళ్ళి ఉపదేశం పొందాడు. సంవత్సరం తరువాత 'నానూ మహరాజ్' బొంబాయి వస్తున్నారని అతనికి తెలిసి స్టేషన్‌కు వెళ్ళాడు నాచ్నే. 'నానూ మహరాజ్' అతనికి తమ గురువైన 8 సం॥లు 'శ్రీపాద దోయ్‌పాడే' గారిని చూపారు. తర్వాత ఈ శ్రీపాదులు కొంతకాలం గుంటూరులో మెట్రిక్ చదివారట.

★★★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 14

జన్మాంతర జ్ఞానం

శ్రీ సాయి వంటి సద్గురువు లభించినా ఆయన కృపతో ఒకటి రెండు జన్మలలో తరించగల ధీరులెంతో అరుదు. కారణం భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లు, నిజంగా ఆత్మజ్ఞానం ('సిద్ధి') కోసం యత్నించేవారు కొన్నివేల మందికి ఏ ఒక్కరో వుంటారు. రాగద్వేషాలలో చిక్కి మనం అడుగడుగుకూ 'పరమపద సోపానపటం'లోని పావులలాగ సద్గురువును గూడ తగురీతిన సేవించలేము. మామిడిపూత, పిందెలులాగ రాలిపోతుంటాము. ఒకసారి ఆయన,"ఎవరు నా శిష్యులనేది? అలాంటివాడు నాకొక్కడూ కన్పించలేదు" అన్నారు. కారణం భగవద్గీతలో చెప్పినట్లు నిజంగా ఆత్మజ్ఞానం కోసం యత్నించేవారు కొన్నివేల మందిలో యే ఒక్కరో వుంటారు. మిగిలిన అందరమూ బాబా అంతటి సద్గురువు దొరికినా అనేక జన్మలెత్తే వాళ్ళమే కనుక ఆయన రక్షణ మనకు ప్రతిజన్మలోనూ అవసరమే. అది అందించగల్గడమే ఆయన విశిష్టత. శ్రీమతి తార్ఖాడ్‌తో ఒకరోజు బాబా, "ఎన్ని జన్మలలో మీతో వున్నానో! ముందు జన్మలన్నింటిలోనూ మీతో వుంటాను. మనం మళ్ళీ మళ్ళీ కలుసుకుంటాం. నాకిచ్చిన ప్రతిపైసాకూ నేను భగవంతునికి లెక్క చెప్పుకోవాలి" అన్నారు. పైసా అంటే జీవి. భగవదనుగ్రహము లేక సాయిని ఆశ్రయించ లేము. ఇలా భగవంతుడు తమకప్పగించిన ప్రతి జీవినీ తిరిగి ఆ పరమాత్మకప్పగించడానికే బాబా అవతరించినది. అందుకే ఆయన, "నేనెవరినీ మధ్యలో విడువను. చివరికంటా గమ్యం చేరుస్తాను" అన్నారు.

బాబా తమ పూర్వజన్మ వృత్తాంతాలిలా చెప్పారు. "నేనొకప్పుడు గుడ్డలు, తలపాగా, పట్టువస్త్రాలు, తివాచీలు నేసేవాణ్ణి. ఇన్ని పనులు చేసినా తిండిగూడ గడిచేదిగాదు." బాల్యంలో నేను శాలువలు నేసేవాణ్ణి. నా నేర్పరితనానికి మెచ్చి నా తండ్రి రూ. 5/- లు బహూకరించారు." "నేనొకసారి బాల్యంలో వృత్తికై అన్వేషించి భీడ్ అనే వూరిలో జరీ అంచు వస్త్రాలు నేసేపని సంపాదించాను. నా ఫకీరు (యజమాని) మంచితనం వల్ల నేనెప్పుడూ నా పనిలో విసుగొందలేదు. నలుగురి పని ఒక్కడినే చేసేవాణ్ణి. ఒకడు రోజుకు రూ. 50/- లు, మరొకడు రూ. 100/- లు, యింకొకరు రూ. 150/- లు విలువచేసేవి నేస్తే, నేను రూ 600/- లు విలువచేసే వస్త్రాలు నేశాను. యజమాని సంతోషించి ప్రేమతో యితరుల యెదుట నన్ను ప్రశంసించి, నాకు చక్కటి దుస్తులు, తలపాగా, శాలువా బహూకరించారు. నేను వాటిని వాడుకోక యితరులకిచ్చాను. భగవంతుడిచ్చేది నశించదు. మానవులిచ్చేది నిలవదు!"

ఆయనే ఒకసారి, "నేను ముందు జన్మలో కబీరును, నూలు వడికేవాడిని" అన్నారు. కబీరు సద్గురువుగా అవతరించి, యోగసాధనకు సంకేతంగానే ఆ వృత్తి చేసారు. గురుసేవను, ఆ వృత్తినీ గూడ త్రికరణశుద్ధిగా, మరెవరూ చేయలేనంతగా చేసి, గురువనుగ్రహంతో సాటిలేని పూర్ణత్వాన్ని సాధించామని సాయి భావమేమో! ఒకటి మాత్రం నిశ్చయం: ఆయన ఎన్నో జన్మల క్రిందటనే మహనీయుడుగా వున్నారు. "నేనొకప్పుడు 4వేల మందిలో వుండగా ఆ ప్రాంతంలో అంటువ్యాధి చెలరేగింది. భయపడిపోతున్న ఆ జనంతో, "నేను బ్రతికుండగా మీలో యెవ్వరినీ మరణించనివ్వను అని అభయమిచ్చి రక్షించాను" అని ఆయనే చెప్పారు. కొన్ని జన్మలలో వారు

గూడ మహనీయులను సేవించారు. "శిరిడీలో యిప్పుడు ఈ మశీదున్నచోట ఒకానొకప్పుడు 'ముజాఫర్‌షా' అనేవారుండేవారు. వారి అబ్బాయికి మైళ్ళకొద్దీ భూసంపద వుండేది. నేనాయనకు వంటచేసి పెట్టేవాణ్ణి. ఇప్పుడు ధుని వున్నచోటే వారు మరణించారు" అని ఆయనే చెప్పారు. పూర్వ జన్మలలో గూడ సాయి విస్తారంగా పర్యటించేవారని, ఆయనకు వృక్ష వైద్యంవంటి విద్యలెన్నో తెలిసినట్లు అర్థమవుతుంది. ఒకప్పుడాయన, "చిన్నతనంలో నేను జాల్నా నుండి చాలాదూరం నడిచాక దారిలో ఒక మామిడిచెట్టు కన్పించింది. దాని పిందెలన్నింటికీ పురుగులు పట్టివున్నాయి. నేను దాని బోదెకు యినుప మేకు కొట్టాను. దానితో ఆ దోషం పోయింది" అన్నారు. ఈ జన్మలో గూడా లెండీలో ఆయన ఒక రావిమొక్క, రెండు వేపమొక్కలు నాటారు. రావిమొక్క ఎంతకూ ఎదగలేదు. ఆయన నిత్యమూ దానిని స్వహస్తాలతో అటూ యిటూ వంచేవారు. తర్వాత అదెంతో ఏపుగా పెరిగింది.

ప్రతి జన్మలోనూ సాయిమాత్రం ధర్మమెప్పుడూ తప్పలేదు. అది లోకానికి విరుద్ధంగా తోచినా లెక్కచేయనూ లేదు. "ఒకప్పుడొక తోటలో రోహిల్లా ఈతకల్లు అమ్మే ఆమెను మోహించి వివాహమాడాడు. ఆమె నీతి తప్పి నడచుకున్నది. చివరకు ఆమె పాదాలు పుండ్లుపడి పురుగులుపట్టాయి. ఆమె ఎలాంటిదైనా నాకు తల్లి గనుక ఆమెకు చికిత్స చేసాను" అన్నారు బాబా. ఆమె తన పాపాలవలన రోగంతో మరణించింది. సాయి, లోకానికి వెరవకుండా తమ ధర్మం తాము నిర్వర్తించి, మాతృసేవవలన పరిశుద్ధులయ్యారు.

ఆయన అందరిపట్లా యిలాంటి ధర్మనిరతి కల్గియుండేవారు. ఒకసారి ఆయనిలా చెప్పారు : "ఈ ప్రాంతంలోని పాటిల్ తరచూ నావద్దకొచ్చేవాడు. అతనికి 12 మంది భటులుండేవారు. మరొకసారి అతనితో భేదాభిప్రాయం కల్గి అతనిపై బడ్డపుడు నేనతనికి తోడ్పడ్డాను. ఒకసారి వాళ్ళు అతనిని బలవంతంగా ఒక నగరానికి తీసుకుపోతే, నేను జోక్యం చేసుకొని అతనిని విడిపించాను" మరొకప్పుడు ఆయనిలా అన్నారు : "సోదరులిద్దరం ఒక మార్గాన పోతున్నాము. నా సోదరుడు ముందుపోయి క్రూరజంతువుల పాలైనాడు. అయిదారుగురు వచ్చి, 'నీ సోదరుడేడి?' అన్నారు. జరిగినది చెప్పి అతని శరీరంమీద వస్త్రం కప్పానని కూడా చెప్పాను. వారు నామాట నమ్మక, వారిస్తున్నా వినకుండా, నా సోదరుని కోసం వెళ్ళి ఆ జంతువుల పాలయ్యారు. తర్వాతా స్థూలకాయురాలైన ఒక స్త్రీ గూడ నా సోదరుని వెదుకబోయింది. ఆమెకూ అదేగతి పట్టింది. ఆమె శవంమీద గుడ్డకప్పి ముందుకు సాగిపోయాను." జ్ఞానం కావలసినవారు ముందుకు పోతారుగాని, 'ముందుకు పోవాలి!' అని ఆరాటపడేవారు సిద్ధులకోసం ప్రాకులాడే వారని అర్థం. అలాటి సాధకులెందరో సిద్ధులనే క్రూర మృగాలకు బలయ్యారు. ఆయన మాత్రం తొందరపడక భద్రంగా ముందుకు సాగిపోయారు. వారు హెచ్చరించినా ఆ సాధకులు వినలేదు! ఇది పారమార్థికమైన కథ.

జన్మాంతరాలలో సాధకావస్థలో ఆయన గూడ పొరబడి, తప్పులు చేసి తర్వాత తమ తప్పు దిద్దుకున్నామని చెప్పారు : "నాతండ్రికి ధనపురాసులుండేవి. నేను వాటిలో ఒకదానిపై కూర్చొని పెద్ద పామునయ్యాను. కొంతకాలం తర్వాత ఆ ధనం విడిచిపెట్టి, తిరిగి మానవరూపం పొందాను." అంటే అంతకు ముందు జన్మలలో ఆయన సిరిసంపదలపై కోరికతో పుణ్యకార్యాలు చేసి, మరు జన్మలో శ్రీమంతుడిగా పుట్టి, వాటిమీద వ్యామోహం కల్గియున్నారు. అదే ధనపురాశిమీద కూర్చోడమంటే. అపుడా ధన వ్యామోహము, గర్వాల వలన సాటివారికెంతో హానికరంగా, పాముల్లాగా అయి కొన్ని జన్మలు హీనజన్మలెత్తారు. పరమపద సోపాన పటంలో మన బలహీనతలను పాములలాగా చిత్రించేదిందుకే. అయినా చివరకు తన తప్పు గ్రహించి, ధనాన్ని త్యజించారు. అంటే సిరిసంపదలను దానధర్మాలకు వినియోగించారు. ఇటువంటి కథలెన్నో "శ్రీసాయి ప్రబోధామృతం"లో చూడవచ్చు.

శ్రీసాయి భక్తుల గత జన్మల వృత్తాంతాలు గూడ చెప్పేవారు. తమను బాబా జన్మ జన్మలనుండి

కాపాడుతున్నారని తెలిస్తే భక్తులు కృతజ్ఞతతో ఆయనకు మరింత సన్నిహితులవుతారు గదా! శ్రీమతి ప్రధాన్‌కు బాబు జన్మించడానికి సం॥ ముందే భక్తులతో బాబా, "ఆమె 'బాబు' కు తల్లి" అనసాగారు. ఈ 'బాబు' హరి వినాయక్ సాఠే మామగారైన గణేష్ కేల్కర్ బంధువు. ఒకసారి అతనికి బాబా స్వప్న దర్శనమిచ్చి పిలవడం వలన, అతడిల్లు విడచి కాలినడకన శిరిడీచేరి బాబాను దర్శించాడు. తర్వాత యితడు కోపర్గాం మరియు యవలా గ్రామాలకు సర్వేయరయ్యాడు. ఇతని పై అధికారి లిమయే, సాఠేకు క్రింది వుద్యోగి. బాబు పూర్తిగా బాబా సేవలో వుండి తమ ఉద్యోగ ధర్మాన్ని అశ్రద్ధ చేస్తుంటే సాఠే, కేల్కర్‌లు బాబాకు ఫిర్యాదు చేశారు. బాబా, "ఆ పనులన్నీ అలా ఉంచి నా సేవ చేసుకోనివ్వండి" అని అన్నారు. అప్పటినుండి వారు బాబుకు ఎక్కువ పనులు చెప్పేవారుగాదు. సాయి ఒక్కొక్కప్పుడు మంచి మంచి ప్రసాదాలన్నీ అతనికి పెట్టేవారు. సం॥1910లో ఒకసారి ఆయన "బాబు విషయంలో జాగ్రత్త తీసుకో!" అని కేల్కర్‌ను హెచ్చరించారు. అతనికేమీ అర్థంగాలేదు. కొద్ది రోజులలో బాబుకు తీవ్రమైన జ్వరమొచ్చింది. ఒకరోజు కేల్కర్‌తో, "బాబు యింకా జీవించే వున్నాడా?" అన్నారు బాబా. కొద్దిరోజులలో బాబు శిరిడీలోనే, తన 22వ యేట చనిపోయాడు. అటు తర్వాత గూడ ఆయన తరచుగా అతనిని తలచుకుంటూండేవారు.

పై కథలో బాబా చెప్పిన 'బాబే' కేల్కర్ బంధువైన ఈ బాబు. ఇతడు మరణించిన కొద్ది కాలానికి శ్రీమతి ప్రధాన్ కడుపున మరలా జన్మించాడు. నాలుగు మాసాల ఆ బిడ్డనెత్తుకుని సాయి ఎంతో ప్రేమగా, "బాబూ! ఎక్కడికెళ్ళావు? నేనంటే విసుగుపుట్టి వెళ్ళి పోయావా" అన్నారు. ఆయనను చూస్తూనే ఆ బిడ్డ కిలకిలా నవ్వాడు.

మొదటిసారి శిరిడీ దర్శించిన నార్కేను శ్యామా పరిచయం చేయబోతే సాయి, "వీడిని నాకు పరిచయం చేయడమా? ముప్పై జన్మలనుండి వీడు నాకు తెలుసు!" అన్నారు. అలాగే తమకు రఘువీరపురందరేతో ఏడు శతాబ్దాల నుండీ సంబంధమున్నదని చెప్పి, 'నేనితనినెప్పుడూ మర్చిపోను. ఇతడు 2000 మైళ్ళ దూరానున్నా సరే, ఇతడు లేకుండా నేనొక్క మెతుకైనా తినను" అన్నారు. బాబాను మనమంతగా గుర్తుంచుకోగలమా?

ఒకప్పుడు లెండీ ప్రక్కగా పోతున్న మంద నుండి బాబా రూ. 32/-లకు రెండు మేకలు కొని తెచ్చారు. వాటి అసలు విలువ రూ. 8/-లు. సాయి మోసపోయారని శ్యామా, తాత్యాలు గోలచేసారు. సాయి 4 శేర్ల పప్పులు కొని ఆ మేకలకు పెట్టి, వాటిని తిరిగి ఆ మందల కాపరికిచ్చేసారు. తర్వాత భక్తులతో ఆయన, "ఈ మేకలు పూర్వజన్మలో నా పొరుగింటి మానవులు. మొదట వారిద్దరూ ఎంతో ప్రేమగా వుండేవారు. నన్ను గూడ యెంతగానో ప్రేమించేవారు. తర్వాత ద్వేషాలు పెంచుకొని ఒకరినొకరు చంపుకుని యిప్పుడలా పుట్టారు. నా ప్రక్కగా వెళ్తూ అవి నావంక చూచినపుడు, వాటిపై ప్రేమవల్ల కొంతసేపు నావద్ద వుంచుకొని తృప్తిగావించాను. నా బేరం మీకు నచ్చకపోవడంవల్ల వాటిని త్రిప్పి పంపేశాను" అన్నారు. అలాగే జోగ్, దాదాకేల్కర్, శ్యామా, ఖాపర్డే, దీక్షిత్‌లు తమతోపాటు తమ గురువుచెంత చిన్న వీధిలో నివసించేవారని, ఆ ప్రీతివల్లనే తాము వీరందరినీ ఈ జన్మలో తమచెంతన చేర్చుకున్నామనీ బాబా ఒకప్పుడన్నారు.

ఒకరోజు భక్తులెందరు నైవేద్యమిచ్చినా, బాబా వాటిని తాకలేదు. ఇంతలో శ్రీమతి ఖాపర్డే మశీదుచేరి నివేదనీయగానే బాబా దానిని వెంటనే రుచిచూచి, "ఈమె పూర్వమొక వైశ్యుని గోవు. నాకా గోవు సమృద్ధిగా పాలిచ్చేది. తర్వాత ఆమె ఒక తోటమాలి కూతురిగా జన్మించింది. ఆమెనొక క్షత్రియుడు పెంచాడు. ఆమె ఒక వైశ్యుని వివాహమాడింది. ఆ తర్వాత బ్రాహ్మణ కులంలో జన్మించింది. ఎన్నో జన్మల తర్వాత మళ్ళీ ఇప్పుడీమెను చూస్తున్నాను. ఆమెకు నాపైగల ప్రేమవల్ల ఆమె సమర్పించే ఆహారం నాకెంతో ప్రీతి" అన్నారు.

కళ్యాణ్ నివాసి టి. ఎ. కార్నిక్‌తో, "నిన్ను 2000 సం॥ల నుండీ యెరుగుదును. నీవెప్పుడూ పెడబుద్ధీ, కోతియుక్తులూ గలవాడవు" అన్నారు. దుష్ట సంస్కారాలు పోవడమెంత కష్టమో! యశ్వంతరావు గురించి, "వీడు పూర్వజన్మలో పవిత్రమైన నడవడి గలవాడు. అందుకే యిప్పుడీ తల్లి గర్భాన జన్మింపజేశాను. ఇప్పటికీ యితనిలో మంచి గుణాలున్నాయి" అన్నారు. ఒకసారి మశీదులో నింబారుపై నివసిస్తున్న పిచ్చుకల గురించి ఆయన, "అవి గతజన్మలో యిక్కడే గూడు కట్టుకున్నాయి, వాటినొక పాము మ్రింగింది. అవి తిరిగి మళ్ళీ యిక్కడే గూడు కట్టుకున్నాయి" అన్నారు.

సాయి ఒకప్పుడిలా చెప్పారు-- "ఒకరోజుదయం నేను అల్పాహారం చేసి కాలినడకన ఒక చిన్న నదికి వెళ్ళి స్నానంచేసి విశ్రాంతిగా కూర్చుని చిలిం సిద్ధం చేసుకుంటున్నాను. ఒక బాటసారి నమస్కరించి నా ప్రక్కన కూర్చున్నాడు. ఇంతలో ఒక కప్ప అరుపు విన్పించింది. అదేమిటని అతడడిగాడు. కప్పనొక పాము పట్టుకున్నదని, వారిద్దరూ కర్మఫలం అనుభవిస్తున్నారనీ చెప్పాను. అతడు చూచివచ్చి 10, 15 నిమిషాలలో ఆ పాము కప్పను మ్రింగివేస్తుం దన్నాడు. 'అలా జరగనివ్వను. దానినెలా రక్షిస్తానో చూడు!' అని వాటిని సమీపించి, 'ఓ వీరభద్రప్పా! నీవు పాముగాను, చెన్నబసప్ప కప్పగానూ జన్మించినా మీ ద్వేషాలు వీడలేదా? ఇప్పుడైనా విడవండి!' అన్నాను. కప్పను విడచి పాము నదిలోకి దూకింది. కప్ప పొదలలో దాక్కుంది. ఆ బాటసారి అసలు వృత్తాంతం చెప్పమంటే యిలా చెప్పాను :

"ఒకప్పుడు నేనుండే ప్రదేశానికి 5 మైళ్లలో ఒక శిథిలమైన మహాదేవుని ఆలయం వుండేది. భక్తులు ఆలయ పునరుద్ధరణ కోసం విరాళాలు ప్రోగుచేసి, స్థానికుడైన ఒక ధనికుడికి అప్పజెప్పారు. ఆ లోభి రెండుసార్లూ ఆ ధనం సొంతానికి వాడుకుని, దొంగ లెక్కలు చెప్పాడు. ఒకరోజు మహాదేవుడతని భార్యకు స్వప్న దర్శనమిచ్చి, గర్భగుడికి కప్పు వేయిస్తే ఆమె వెచ్చించిన దానికి వందరెట్లివ్వగలనన్నాడు. ఆ లోభి, 'ఆ శివుడు నాకే యెందుకు చెప్పకూడదు? ఇది కేవలం మనమధ్య స్పర్థను కల్పించడానికి వచ్చిన పీడకల' అని ఆమె మాటను త్రోసిపుచ్చాడు. అయిష్టంతో యిచ్చిన విరాళాలు భగవంతుడిష్టపడడు. భక్తితో ఎంత స్వల్పంగా యిచ్చినా తృప్తి చెందుతాడు. ఆయన తిరిగి ఆమెకు స్వప్నంలో కనపడి, 'నీ భర్త మాటలు పట్టించుకోకు; నీకిష్టమైతే నీ ధనం వెచ్చించి పని జరిపించు' అని చెప్పారు. తన పుట్టింటివారిచ్చిన నగలను అందుకై వెచ్చించదలచానని ఆమె భర్తతో చెప్పింది. ఆ కుత్సితుడు రూ. 1,000/-ల విలువగల ఆ నగలు తీసుకొని అందుకు బదులుగా ఒక పేదరాలు రూ. 200/-లకు తనకు తాకట్టు పెట్టిన ఒక ఊసరక్షేత్రాన్ని దేవుడి పేరపెట్టి, దానిని పూజారికి అప్పగించాడు. కొద్ది కాలానికి వారింటిమీద పిడుగుపడి భార్యభర్తలు మరణించారు. మరుజన్మలో ఆ లోభి మధురలో వీరభద్రప్ప అనే బ్రాహ్మణుడుగా జన్మించాడు. అతని భార్య ఆలయ పూజారి కూతురు గౌరిగాను, భూమిని తాకట్టు పెట్టిన పేదరాలు ఆలయ ధర్మకర్త కొడుకైన చెన్నబసప్పగానూ జన్మించారు. ఆ పూజారి నా భక్తుడు. యుక్త వయస్కురాలైన గౌరికి వరాన్వేషణ చేస్తున్నాడు. సమయానికి వరుడు తనకై తానే రాగలడని నేను చెప్పినట్లే వీరభద్రప్ప వచ్చాడు. అతడికి ధనాశ పోలేదు. అదృష్టవశాత్తు ఆ దేవుడి మాన్యం 1 లక్షకు, అంటే గత జన్మలో ఆమె దేముడికిచ్చిన నగలకు వందరెట్లు విలువకు అమ్మకమైంది. ఆ ధనంకోసం తగవుపడి, అందరూ నాతో సంప్రదించారు. నేను ఆ ఆస్థి దేముడిదని, వారసురాలైన గౌరి అనుమతి లేకుండా దానినేమీ చేయరాదని, ఆమె భర్తకైట్టి హక్కూ లేదనీ చెప్పాను. నేను గౌరిని మంచి చేసుకొని, ఆస్థిని చేజిక్కించుకోచూస్తున్నానని వీరభద్రప్ప నన్ను నిందించాడు. నేను భగవంతుని స్మరించి వూరుకున్నాను. గౌరి నన్ను శరణువేడితే అభయమిచ్చాను. నాటిరాత్రి మహాదేవుడామెకు స్వప్నంలో కన్పించి, 'ఆ ధనమంతా నీది; ఎవరికీ యివ్వవద్దు. అందులో కొంత చెన్నబసప్ప చెప్పినట్లు ఆలయానికి వెచ్చించు. మిగిలింది వెచ్చించాలనుకుంటే మసీదులోని బాబాతో సంప్రదించు' అని చెప్పాడు. ఆమె నన్నడి

గినప్పుడు అసలు మొత్తాన్ని ఆమెనుంచుకోమని, వడ్డీలో సగం చెన్నబసప్పకిమ్మనీ, అందులో వీరభద్రప్పకెట్టి ప్రసక్తీ లేదనీ చెప్పాను. ఇంతలో వీరభద్రప్ప చెన్నబసప్పను చంపుతానని బెదిరించాడు. అతడు భయపడి నన్ను శరణువేడాడు. కొంతకాలానికి వారిద్దరూ మరణించి, వీరభద్రప్ప పాముగాను, చెన్నబసప్ప కప్పగానూ జన్మించారు. అప్పుడు చెప్పబసప్పకిచ్చిన వాగ్దానమే నేనిప్పుడు పాలించాను. భగవంతుడు తన భక్తుడైన యితనిని కాపాడటానికే నన్నిక్కడకు పంపాడు" ఈ వృత్తాంతం ఒక గొప్ప సూక్ష్మాన్ని తెలుపుతుంది. మానవులు చేసిన కర్మలేకాదు, భావాలుకూడ మరు జన్మలకు కారణమౌతాయి. అందుకే సాటి మనిషిని, "పనికిమాలినవాడా!" అని తిట్టినాగూడ నరకమొస్తుందని క్రీస్తు చెప్పాడు. సాటివారిని పరోక్షంగా నిందించడం పాపమని సాయి బోధించిన మరొక సంఘటన యింతకుముందు గమనించాము. అందుకే **మానవుడు సాత్త్వీక భావాలనలవరచుకుని అసుర భావాలను తొలగించుకోడం ఆధ్యాత్మిక జీవితానికంతటికీ పునాదిగా చెప్పింది** భగవద్గీత.

★★★

★ శనివారం పారాయణ సమాప్తము ★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

★ ఆదివారం పారాయణ ప్రారంభం ★

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 15

సద్గతి

జీవుడు మరణ సమయంలో స్మరించిన దానినే మరుజన్మలో పొందుతాడని శాస్త్రం. అందుకే పరీక్షిన్మహారాజు చివరి దశలో శుకుని నుండి భాగవతం విని ఉత్తమగతి పొందాడు. అందుకే కాశీవంటి క్షేత్రాలలో మరణించాలని ముసలితనంలో ఎందరో అక్కడకు చేరుతారు. సకల దేవతలూ తానైన సద్గురు సన్నిధిలో మరణించిన జీవులు గూడ తప్పక సద్గతి పొందుతాయి. అది ఎన్నో జన్మల పుణ్యఫలం. అందుకే సద్గురువులను 'జంగమ' (సంచరించే) తీర్థాలంటారు.

మద్రాసునుండి మానససరోవరానికి బయల్దేరిన విజయానందస్వామి దారిలో శిరిడీ వచ్చాడు. హరిద్వార్ నుండి వచ్చిన ఒక సన్యాసి ఆ యాత్ర కష్టమని చెబితే అతడా తలంపు విడిచాడు. తర్వాత బాబా అతణ్ణి చూస్తూనే కోపంతో, "ఈ దొంగ సన్యాసిని బయటకు గెంటండి! కష్టానికి వెరచేవాడు సన్యాసేగాడు" అన్నారు. అది విని విజయానందుడు సిగ్గుపడ్డాడు. రెండురోజుల తర్వాత అతని తల్లికి జబ్బు చేసిందని జాబొచ్చింది. వెంటనే అతడింటికి వెళ్ళడానికి బాబా అనుమతి కోరాడు. "ఇంత మమకారముంటే ఎలా సన్యసించావు? వసతి గృహంలో ద్వారాలు బంధించి, ఓర్పుతో, జాగ్రత్తగా వేచివుండు. దొంగలు సర్వం దోచుకుపోతారు. ధనము, శరీరము అశాశ్వతాలని గుర్తుంచుకో! సుఖాపేక్ష విడిచి నీ ధర్మంలో నిలు. నీ పూర్వపుణ్యమే నిన్నిక్కడకు తెచ్చింది. భాగవతం శ్రద్ధగా పారాయణ చెయ్యి. కృతార్థుడవౌతావు" అన్నారు బాబా. అతడు ప్రయాణం మానుకుని లెండీలో పారాయణ పూర్తిచేసాక, మూడవరోజున తన గదిలోనే బడేబాబా ఒడిలో వొరిగి ప్రాణం విడిచాడు! సాయి అతని దేహాన్ని ఒకరోజు ఆగి సమాధి చేయమన్నారు. కారణం భక్తులకర్థం గాలేదు! అతని మరణంలో ఏదో మోసముందని శంకించి పోలీసులొచ్చి విచారించారు. తర్వాత మోసమేమీ లేదని నిర్ణయించి ఆ శరీరాన్ని సమాధి చేయడానికంగీకరించారు, విజయానందునితో సాయి చెప్పిన 'వసతిగృహం' అశ్వాశ్వతమైన దేహమే! యమదూతలే దొంగలు, ఆయన మూయమన్న ద్వారాలు యింద్రియాలు, మనస్సు. పారాయణద్వారా భగవంతునిపై మనస్సు నిలిపి శరీరం విడవమనే బాబా చెప్పినది. అతడు తల్లిపై మమకారంతో చనిపోతే పతితుడైన సన్యాసిగా దుర్గతి పొందేవాడే. సాయి సన్నిధిని సద్వినియోగం చేసుకొనేలా సాయియే చూచుకోవలసి వచ్చింది.

హెచ్. వి. సాఠేవద్దనున్న మేఘుడనే వంట బ్రాహ్మణుడు ఎప్పుడూ శివస్మరణ చేసేవాడు. అతని మేలుకోరి సాఠే అతనిని శిరిడీ పంపాడు. దారిలో సాయి ముస్లిమని ఎవరో చెప్పడంతో అతడు సంకోచిస్తూనే శిరిడీ చేరాడు. సాయి అతనిని చూచి ఉగ్రులై, "ఈ వెధవను బయటకు గెంటండి. అతడేమో పవిత్ర బ్రాహ్మణుడు, నేను ముస్లిమ్‌ను! ఇక్కడికొస్తే అతడి ఆచారం మంటగలుస్తుంది!" అని కేకలేసారు. సాయి సర్వజ్ఞతకు మేఘుడాశ్చర్య పోయాడేగాని తన శంక తొలగక శిరిడీ నుండి వెళ్ళిపోయాడు. 'కాని సాయి వెళ్ళగొట్టదలచినది అతని శంకనే గనుక త్వరలో 'అతడు హృదయపరివర్తన చెంది, బాబా సాక్షాత్తూ శంకరుడన్న విశ్వాసం పొంది మళ్ళీ శిరిడీ చేరాడు. . నిత్యమూ నాలుగుమైళ్ళు నడచి, గోదావరీ జలం తెచ్చి, శిరిడీలోని దేముళ్ళకు అభిషేకం చేసి చివరకు మశీదులో సాయిని పూజించేవాడు. ఒకరోజు ఖండోబా ఆలయం మూసివుంటే అతడు తిన్నగా మశీదు చేరాడు.

కాని బాబా, "ఇప్పుడా మందిరం తెరిచారు. పూజించిరా! నిత్యక్రమం ఎప్పుడూ మార్చకూడదు" అన్నారు. అతడు వెళ్ళి చూచేసరికి ఆలయం తెరచివున్నది.

అలానే ఒక సంక్రాంతికి సాయిని సాక్షాత్తు శివునిలా అర్చించదలచి అతడు గోదావరి జలం తెచ్చాడు. "నేను ఫకీరును. నాకు స్నానం తగదు" అని ఆయనెంత చెప్పినా వినలేదు. చివరకు సాయి తమ తలను మాత్రమే అభిషేకించమన్నారు. కాని అతడు భక్త్యావేశంతో, "హరహర మహదేవ!" అంటూ నీరు వారిపై కుమ్మరించాడు. అయినా వారి తలమాత్రమే తడిసింది.

అతడు తన గదిలో బాబా పటాన్ని గూడ పూజించేవాడు. ఒకరోజు తెల్లవారుఝామున అతడు మెలకువగా కళ్ళు మూసుకొని పడుకొన్నప్పుడు అతని మనోనేత్రానికి సాయి స్పష్టంగా గోచరించి, అక్షింతలు చల్లి "గోడమీద త్రిశూలం గీచి అర్చించు" అన్నారు. కళ్ళు తెరిచేసరికి యెవరూ లేరు. గది తలుపులు మూసేవున్నాయి. కాని అతని ప్రక్కమీద అక్షింతలున్నాయి! వెంటనే మేఘుడు బాబాను దర్శించి, ఆ విషయమై అడిగాడు. "నేను స్పష్టంగా చెప్పానుగదా! నా మాటలెన్నటికీ వ్యర్థంకావు. నేను యిళ్ళలోకి ప్రవేశించటానికి ఏ ద్వారాలూ అక్కరలేదు. నేను సర్వదా సర్వత్రా వున్నాను" అన్నారు సాయి. వెంటనే అతడు తన గది గోడమీద త్రిశూలం గీచి, పూజించాడు. మరురోజే పూణేనుండి వచ్చిన భక్తుడు సాయికొక శివలింగం సమర్పించాడు. సరిగ్గా సమయానికి మేఘుడు మశీదుకొచ్చాడు. సాయి శివలింగమతనికిస్తూ, "సాక్షాత్తూ శివుడే వచ్చారు. సేవించుకో!" అన్నారు. కాకాసాహెబ్ దీక్షిత్ సరిగా అదే సమయంలో గదిలో సాయిని స్మరిస్తుండగా అతనికి ధ్యానంలో ఒక శివలింగం కన్పించింది. కొద్దిసేపటికి అలాంటి లింగమే మేఘుడు తీసుకొచ్చాడు. నిత్యపూజ గూడ సద్గురువనుగ్రహంతోనే సఫలమవుతుంది.

మేఘుడు 1912లో చనిపోయాడు. సాయి ఆ శవాన్ని నఖశిఖ పర్యంతమూ నిమిరి, "ఇతడే అసలైన భక్తుడు!" అన్నారు. శవాన్ని తీసుకుపోతుంటే బాబా గూడ కొంత దూరం వెళ్ళి శవంపై పూలు చల్లి వచ్చారు. దహనమయ్యాక ఆయన సామాన్యునిలా శోకించి, తమ ఖర్చుతో అందరికీ సంతర్పణ కూడా చేసారు. తర్వాత అతడికిచ్చిన శివలింగాన్నే ఆయన గురుస్థానంలోని వేపచెట్టుక్రింద ప్రతిష్ఠించారు.

బల్వంత్ నాచ్నేకు చాలాకాలం సంతానం దక్కకుంటే ఆ దంపతులు 1915లో శిరిడీ వచ్చారు. నాచ్నే భార్యకొక కొబ్బరికాయ ప్రసాదించమని బాబాను వత్తిడి చేశాడు శ్యామా. అపుడు సాయి కన్నీటితో శ్రీమతి నాచ్నేకొక కొబ్బరికాయ ప్రసాదించి, నాచ్నేను తమ పాదాలొత్తమన్నారు. తర్వాత అతని వెన్ను నిమిరి అతనిని కౌగలించుకున్నారు. అతనికి 1919లో కొడుకు పుడితే కాలూరామ్ అని పేరు పెట్టారు. వాడు 3వ యేటనే 'హరేరామ్' అని జపిస్తూండేవాడు! హెగ్డే అను పండితుడు వాణ్ణి గమనించి అతడు శ్రీకృష్ణుని బాల్య మిత్రులలో ఒకడని చెప్పాడు. కాలూ కృష్ణునితో తన ఆటపాటల గురించి యేరోజేమి చెప్పేవాడో అదే ఆరోజు హెగ్డే చేసే 'హరి విజయము' పారాయణలో వచ్చేది. "కృష్ణుడు నన్నేడిపించేవాడు. అతడు నా వీపుపైనెక్కి, నేను అతని కాలు గిచ్చి పైకి చూచేసరికి నా ముఖాన వెన్న కొట్టేవాడు" ఇలా చెప్తుండేవాడు కాలూ. అప్పుడప్పుడతడు తలపై గుడ్డ కప్పుకొని కళ్ళు పైకిత్రిప్పి యోగిలా కూర్చునేవాడు. ఒకరోజు 'సందేశ్' అనే పత్రికను తెప్పించి, దాని అట్టమీద ప్రణవంలోనున్న శ్రీకృష్ణుని బొమ్మ గోడ కంటించాడు. ఆ పుస్తకంలోని ఒక వ్యాపార ప్రకటనలో గ్రాంఫోన్ముందు కూర్చున్న కుక్కబొమ్మ చూపి, "అది శ్రీకృష్ణ సందేశం - ఆ కుక్క దాని యజమాని వాణి ఎంత శ్రద్ధగా వింటుందో! అలా చేస్తే నీకూ బాబా మాటలు విన్పిస్తాయి. నేనలాగే చేస్తుంటాను" అన్నాడు కాలూ. "బాబా గొంతు నీకెలా తెలుసు!" అంటే అతడు చెప్పలేదు. అతనిని చూడ్డానికి మహాత్ములు, ఉపాసనీ బాబా మరియు గాడ్గీ బాబా (అంధేరీ) వచ్చారు. కాలూకు 1927లో వంటికి నీరుపట్టి జ్వరమొస్తే బాబా ఊదీ మాత్రమే యిచ్చారు. పవిత్రమైన కార్తీక శుద్ధ ఏకాదశినాడు అతడు

తండ్రితో "జ్ఞానేశ్వరి' 13 వ అధ్యాయం విన్పించు. నేను వెళ్ళిపోతున్నాను" అన్నాడు. తండ్రి దుఃఖంవలన చదవలేకపోతే, అతడా గ్రంథాన్ని చూస్తూ ప్రాణం విడిచాడు. వెనుక కొబ్బరికాయ ప్రసాదించేటప్పుడు సాయి కన్నీరెందుకు కార్చారో నాచ్నేకు అర్థమైంది.

సం॥ 1914లో ఒకరోజు సాయి గర్భిణియైన శ్రీమతి రేగేతో "నా వరప్రసాదం నీ దగ్గరున్నది" అన్నారు. బిడ్డ జన్మించాక ఆయనొకరోజు, "బిడ్డ నీవాడా, నావాడా?" అన్నారు. "మీవాడే" అన్నాడు రేగే. "వాణ్ణి నావాడుగా పెంచు" అన్నారు బాబా. రెండోయేట ఆ బిడ్డ మరణావస్థలో వుండగా రేగే, "బాబా! ఈ బిడ్డ కర్మశేషం నాకిచ్చి, వాడికి మీ పాదాల చెంత ఆత్మశాంతి ప్రసాదించండి!" అన్నాడు. అదే విశ్వాసమంటే. వెంటనే ఆ బిడ్డ చిరునవ్వుతో యోగిలాగా బ్రహ్మరంధ్రం గుండా ప్రాణం విడిచాడు! ఆ తర్వాత వారు శిరిడీ వెళ్ళినపుడు రేగే గురించి, "ఆ బిడ్డ నావాడు; ఇతని ప్రార్థననుసరించి ఆ బిడ్డను శాశ్వతంగా నా హృదయంలో వుంచుకున్నాను" అన్నారు బాబా.

ఒకప్పుడొక అంధుడు తనకు దృష్టి ప్రసాదించమని ఎంత ప్రార్థించినా బాబా పలుకలేదు. అతడు ఖండోబా ఆలయంలో ఉపాసనీ బాబాను దర్శిస్తే ఆయన, "ఈ వయస్సులో దృష్టివస్తే కోర్కెలు హెచ్చుతాయి. జ్ఞానం కోరుకో!" అన్నారు. అతడు మశీదుచేరి జ్ఞానమిమ్మని సాయిని కోరినపుడు, అతనిని శిరిడీలో వుండమన్నారు. నెలరోజులలోగా అతడు గొప్ప ఆధ్యాత్మిక పరిణతి చెంది ఆ క్షేత్రంలోనే మరణించాడు. "మరణించినది అతని భార్యే (అజ్ఞానం) గాని అతడుగాదు. అతడు సద్గతి పొందాడు" అన్నారు బాబా.

మహల్సాపతి సాయినెంతగానో సేవించాడు. కొన్ని సేవలు అతడు మాత్రమే చేసేవాడు. ఉదా: ఎప్పుడూ సాయివద్దనుండే ఇటుకపై, ఒక గుడ్డ, దానిపై దుప్పటి పరచి ప్రక్కవేయడం మాహల్సాపతి మాత్రమే చేసేవాడు. అతనికి సాయి సద్గతినిచ్చారు. సెప్టెంబరు 11, 1922 సోమవారం నాడు అతడు పూజచేసుకుని, "నేడు నా తండ్రి శ్రాద్ధానికి వంట త్వరగా చేయండి. నేడే నేను గూడ స్వర్గానికి వెళతాను" అన్నాడు. అందరి భోజనాలయ్యాక అతడు గూడ తాంబూలమేసుకుని, కఫ్నీ ధరించి, కుమారుడు మార్తాండ్‌కు తన దండమిచ్చి, "భక్తిమార్గంలో జీవించు" అని చెప్పి, 'రామా!' అని ప్రాణం విడిచాడు.

ఒక మేకకు, ఒక బత్తెకు, ఒక పెద్దపులికి గూడ సాయి సద్గతెలా ప్రసాదించారో, వేరు అధ్యాయాలలో చూస్తాము. అలాగే ఒకరోజు శ్రీమతి జోగ్‌తో బాబా, "తల్లీ! బాగా నెయ్యివేసి పులగం వంటి మధ్యాహ్న ఆరతయ్యాక మీ దొడ్డివైపుకొచ్చే గేదెకు పెట్టు" అన్నారు. ఆమె పులగం చేసేసరికి దొడ్డివైపొక గేదెవచ్చి పులగం తిని చనిపోయింది. ఆమె భయపడుతూంటే బాబా, "నీకే దోషమూ లేదు. దాని చివరి కోర్కెతీరి మంచి జన్మకెళ్ళింది" అని అభయమిచ్చారు.

★★★



ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 16

ఎందరు భక్తులో అన్ని రూపాలు

ఎక్కడెక్కడ ఎందరు భక్తులున్నా, అవసరమైనప్పుడు వివిధ రూపాలలో వారికి దర్శనమిచ్చి అనుగ్రహించారు బాబా. విశ్వమంతా తమ మనోరూపంగాగల ఆ సద్గురువుకు అదొక లెక్కలోనిది గాదు. ఒకప్పుడు బాంద్రాలో శ్రీమతి పురందరేకు కలరా వచ్చింది. వైద్యులుగూడ ఆశలేదన్నారు. అపుడు వారింటి ఎదుట దత్తమందిరం ప్రక్కన నిలబడి సాయి దర్శనమిచ్చారు. పురందరేకు ఊదీయిచ్చి, తీర్థంతో కలిపి ఆమెకివ్వమన్నారు. అలా చేయగానే ఆమె త్వరలో కోలుకున్నది.

ఒకసారి మహల్సాపతి పల్లకీలో ఖండోబా విగ్రహం పట్టుకొని ఆ దేవునికి ముఖ్యస్థానమైన జజూరీలో జరిగే ఉత్సవానికి తీసుకెళ్ళాడు. ఆ సమయంలో అక్కడ కలరా వ్యాపించిందని తెలిసి అతడు దిగులుగా పల్లకీనానుకొని నిలుచుండగా, తనవెనుక యెవరో వున్నట్లుతోచి తిరిగిచూస్తే, అక్కడ సాయి స్పష్టంగా దర్శనమిచ్చి అదృశ్యమయ్యారు. ఆయన తనతో వున్నారని గుర్తించిన మహల్సాపతి సాటివారికి ధైర్యం చెప్పి, 4 రోజులూ ఉత్సవంలో పాల్గొన్నాడు. తర్వాత అందరూ శిరిడీ చేరగానే సాయి, "యాత్ర బాగా జరిగింది కదూ! నీవు పల్లకీనానుకొని నిల్చున్నప్పుడు నేనక్కడకొచ్చాను" అన్నారు.

శ్రీమతి చంద్రాబాయిబోర్కర్ 1908లో చాతుర్మాస్యానికి కోపర్గాంలో వున్నది. ఒకరోజు ఆమెవద్దకొక ఫకీరొచ్చి రొట్టెలు, ఉల్లిపచ్చడి కోరారు. చాతుర్మాస్యంలో తాను ఉల్లి వాడనని ఆమె చెప్పగానే ఆ ఫకీరు వెళ్ళిపోయారు. బాబా ఉల్లి తింటారు గనుక ఆ ఫకీరు వారేనని ఆమెకు స్ఫురించింది. తర్వాత ఆమె శిరిడీ వెళ్ళినపుడు, "నాకు రొట్టెలు, ఉల్లి పచ్చడి యివ్వలేదుగదా, ఎందుకొచ్చావు?" అన్నారు బాబా. ఆమె అవి సమర్పించడానికే వచ్చానన్నది.

బల్వంత్‌ఖోజేకర్ 1911లో ఒకరోజున మశీదులో బాబావద్ద శలవు తీసుకొని తిరుగుప్రయాణమై కొంత దూరమెళ్ళాక అదే తనకు చివరి దర్శనమని తోచి మరల ఆయననొక్కసారి చూడాలన్పించింది. కాని అది శిరిడీ సంప్రదాయానికి విరుద్ధము కదా అనుకుంటే, అక్కడ లెండీలో కంచెలోంచి బాబా తొంగిచూచి, "వెళుతున్నావా? మంచిది. వెళ్ళిరా?" అన్నారు. మశీదులోవున్న బాబా, లెండీవద్ద దర్శనమివ్వడమే ఆశ్చర్యం!

రేగే తన కుమార్తె వివాహానికి 1914లో బాబాకు ఆహ్వానం పంపాడు. స్వయంగా వివాహానికి రాగలనని ఆయన జాబు వ్రాయించారు. సరిగా ముహూర్తానికి పోస్టులో సాయివద్దనుంచి విభూతి, దానిని వధూవరులకు పెట్టమన్న ఆదేశమూ అందాయి. అదే సమయానికి ఒక ఫకీరొచ్చి అతని మామగారిని ఒక పైస దక్షిణ కోరాడు. పని తొందరలో అతడు పట్టించుకోలేదు కాని వచ్చింది సాయియేనని తర్వాత స్ఫురించి బాధపడ్డాడు. ఆ వచ్చినది సాయియే అయితే, మరలా రావాలని రేగే అన్నాడు. మర్నాడే ఆ ఫకీరొచ్చి పైస దక్షిణకోరి తీసుకున్నాడు గాని విందారగించలేదు!

దహనులో ఒక భక్తురాలు 30 నోములు పూర్తిచేసి, 200 మంది బ్రాహ్మణులకు సంతర్పణ తలపెట్టింది.

దానికి బాబాను ఆహ్వానిస్తూ ఆమె కొడుకు దేవ్ జాబు వ్రాశాడు. బాబా, "నా భక్తుల సత్సంకల్పాలు నెరవేరుస్తాను. సంతర్పణకు నేను, జోగ్, మరొకరూ కలసి వస్తాము, నాకే వాహనాలూ అవసరం లేదు" అని జాబు వ్రాయించారు. సరిగా సంతర్పణరోజు ఒక సన్యాసి వచ్చాడు. రెండుమాసాల ముందతడు గోసంరక్షణ నిధికోసం రాగా, తర్వాత రమ్మని చెప్పాడు దేవ్. కాని యిప్పుడితడు తాను నిధికై రాలేదని, భిక్షకోసమే మరిద్దరితో కలిసి వచ్చానని, భోజన సమయానికి రాగలమని, తమకు బండి అవసరంలేదనీ చెప్పి వెళ్ళాడు. అలాగే ఆ ముగ్గురూ వచ్చి మధ్యాహ్నం భోంచేశారు. తర్వాత, సాయి తనకిచ్చిన మాట ప్రకారం సంతర్పణకు రాలేదని దేవ్ నిష్ఠూరంగా శిరిడీకి జాబు వ్రాశాడు! ఆ ఉత్తరం తెరవకముందే బాబా, "దేవ్ నిష్ఠూరంగా వ్రాసిన జాబులే అది! నేను విరాళాలకు రాలేదని, మరిద్దరితో కలిసి విందుకు రాగలనని, మాకు బండి అవసరం లేదనీ చెప్పి, అతనికి తెల్పుకోజూచాను. నన్నతడు గుర్తుపట్టలేదు" అన్నారు. అది తెలిసి దేవ్, అతని తల్లీ సంతోషించారు.

బల్వంత్‌నాచ్నే అన్నగారిని ప్రమాదకరమైన శస్త్ర చికిత్సకని 1909లో బొంబాయిలో బేజేకర్ ఆస్పత్రిలో చేర్చారు. దహనులో కుటుంబమంతా ఆతృతగా వున్నారు. ఇంతలో ఒక సాధువొచ్చి భిక్ష కోరాడు. నాచ్నే వదినగారు ఎంతో ఆదరంతో ఆయనకు భిక్ష పెట్టారుగాని, ఆయన బెండకాయకూర కావాలన్నాడు. అందరూ తినగా మిగిలిన బెండకాయకూర వున్నదని, అది అతిథికి తగదని తలచి వేయలేదనీ ఆమె చెప్పింది. ఆ కూరే అడిగి వేయించుకున్నాడా సాధువు. భోజనమయ్యాక అతడు అందరినీ ఆశీర్వదించి, బొంబాయిలో శస్త్రచికిత్స క్షేమంగా జరిగిందని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ సాయంత్రమే ఆస్పత్రి నుంచి శస్త్రచికిత్స బాగా జరిగిందని, ఆ వెంటనే ఒక సాధువొచ్చి రోగిని ఆశీర్వదించి వెళ్ళారనీ కబురొచ్చింది. తర్వాత 4 సం॥కు నాచ్నే మొట్టమొదటిసారిగా శిరిడీ వెళ్ళాడు. సాయి అతనిని చూస్తూనే "నేనొకపుడు యితనింటికి భోజనానికి వెళ్ళాను. నేను అడిగితేగాని యితని వదినగారు బెండకాయకూర వేయలేదు!" అన్నారు.

ఆదందలాలీ తన అనుభవమిలా చెప్పాడు : "ఒకప్పుడు సాయి ఒక బ్రాహ్మణ రూపంలో వచ్చి దక్షిణ అడిగితే నేను రెండణాలిచ్చాను. మరోసారి ఒక మర్వాడిలా వచ్చి తమకు ఆకలిగా వుందని చెప్పారు. నాల్గణాలిచ్చి, మార్వాడీ హోటలుకెళ్ళి భోంచేయమన్నాను. తర్వాత నేను శిరిడీ వెళ్ళినపుడు యీ వివరాలన్నీ ఆయన చెప్పి, 'నేనితని దగ్గరకెళ్ళినపుడు మార్వాడీ హోటలుకెళ్ళి భోంచేయమన్నాడు!' అన్నారు".

ఒకప్పుడు శిరిడీలో టెండూల్కర్ అనే భక్తుడు రోజూ భోజనానికి సాయిని ఆహ్వానించి, నిత్యమూ ఇద్దరికీ భోజనం సిద్ధం చేయించేవాడు. ఒకనాటి రాత్రి 10 గం॥కు హోటల్ యజమాని పాత్రలు తోముకుంటుండగా ఒక సాధువువచ్చి, "నా అన్నం నాకివ్వు" అన్నారు. అతడు భోజనమివ్వగానే, "ఇది సిద్ధం చేయించిన వ్యక్తిని పిలు" అన్నారా సాధువు. టెండూల్కర్ గాఢనిద్రలో వుండి, కబురుచేసినా రాలేదు. "మాది నాథ సాంప్రదాయం. నీవెప్పుడూ యిలాగే ఆకలిగొన్న వారికి అన్నం పెడుతూండు!" అన్నారాయన. మరురోజు, ఆ సాధువు తామేనని టెండూల్కర్‌తో చెప్పి, "ఎవరైనా అన్నమడిగితే వ్యర్థంగా త్రిప్పి పంపకూడదు. ఏమీ లేకుంటే బెల్లం ముక్కైనా యివ్వాలి" అన్నారు బాబా.

భక్తులకు సాయి బాహ్యరూపాలలోనేగాక స్వప్నంలో గూడ దర్శనము, సందేశమూ యిచ్చేవారు. జీవులకు బయట, లోపలా ఆయనే వున్నారు. ఒకనాడు రహటానుండి కుశాల్‌చంద్‌ను తీసుకురమ్మని కాకాకు టాంగా యిచ్చి పంపారు బాబా. అతనిని చూస్తూనే కుశాల్‌చంద్ ఆశ్చర్యపోయాడు. కారణం నాటి మధ్యాహ్నమే స్వప్నంలో అతనికి బాబా కన్పించి వెంటనే శిరిడీ రమ్మని చెప్పారు : కాని అతడు గుఱ్ఱం దగ్గరలేక వెంటనే రాలేకున్నానని బాబాకు కబురు పంపాడు. అంతలోనే టాంగా తీసుకుని కాకా అక్కడకు చేరాడు. ఇద్దరూ వెంటనే శిరిడీ చేరారు.

ఒక శివరాత్రినాడు సాయి అనుమతితో దాసగణు గోదావరి స్నానానికి కోపర్‌గాఁవ్ వెళ్ళాడు. అక్కడ స్నానమయ్యాక ఒక సాధువుకు పావలా యిచ్చాడు. అతడు శిరిడీ చేరగానే బాబా నవ్వుతూ, "గోదావరివద్ద నీవిచ్చిన దక్షిణ చేరింది" అని తమ చేయి చూపారు. అక్కడ దాసగణు ఆ సాధువుకిచ్చిన పావలాకాసే ఆయన చేతిలో వున్నది! సద్గురువు ఆశీస్సులతో యాత్ర చేస్తేనే ఉత్తమ ఫలితముంటుందని వారి భావం.

ఒకరోజు పాటిల్‌భాయితో సాయి నవ్వుతూ, "నువ్వు గొప్ప ధనవంతుడవై బొంబాయిలో పెద్ద భవనం కట్టిస్తావు. అపుడు నన్ను గూడ పిలవాలి సుమా?" అన్నారు. పాటిల్, "బాబా! నన్నెందుకెగతాళి చేస్తారు? అది జరిగేది కల్ల!" అన్నాడు. అచటి భక్తులు గూడ నవ్వుతూ, "గృహప్రవేశానికి బాబాతోపాటు మమ్మల్ని గూడా పిలవాలి" అన్నారు. బాబా తమాషాకే అలా అన్నారని వారి భావం. కాని కొద్ది కాలానికి అతడు నిజంగానే భవనం నిర్మించాడు. గృహప్రవేశానికి అందరినీ ఆహ్వానించాడు గాని, బాబాను మాత్రమే పిలవటం మరచాడు! నాటి మధ్యాహ్నం అతడింటివద్దకొక బిచ్చగాడొచ్చి, "భిక్ష యివ్వండి, వెళ్ళాలి" అన్నాడు. కాని యింట్లోనివారు, అతిథుల భోజనమయ్యాక భిక్ష యిస్తామన్నా అతడు వినలేదు. ఇంతలో ఆ యిల్లాలికి తన భర్తతో వెనుక బాబా అన్నమాటలు గుర్తొచ్చి, అతనికి నమస్కరించి భోజనం పెట్టింది. తర్వాత అతడు దక్షిణ అడిగి తీసుకున్నాడు. తర్వాత పాటిల్ శిరిడీ వచ్చినపుడు సాయి ఆ వివరం చెప్పి, "నువ్వు పిలవకున్నా భిక్ష, దక్షిణ నాకు ముట్టాయి" అన్నారు!

దీక్షిత్ తన డైరీలో యిలా వ్రాసుకున్నాడు : "ఒకనాటి సాయంత్రం నేను ఆఫీసునుండి వస్తుంటే ఒక బిచ్చగాడు నావద్దకొచ్చి, 'కొద్ది చిల్లరడబ్బు లిస్తావా! అనడిగాడు. ఎందుకో అతనిపట్ల పవిత్రభావం కలిగి చిల్లరడబ్బు లిచ్చాను. అతడు వెంటనే, మరెవ్వరినీ ఏమీ అడగకుండా, వేగంగా వెళ్ళిపోయాడు. నాటి సాయంత్రం నేను శిరిడీ చేరగానే సాయి నవ్వుతూ, 'నీవిచ్చిన చిల్లర డబ్బులు నాకు చేరాయి' అన్నారు!"

★★★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 17



ఉపదేశాలు II

అనుగ్రహబలము

ముముక్షువైనవాడు శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడూయైన గురువునే, సమిధలు చేత పట్టుకొనిపోయి ఆశ్రయించాలని ఉపనిషత్తులు చెప్పాయి. ఆ గురువు నిరతాగ్ని హోత్రపరాయణుడుగా గూడా వుండాలని దీనిభావం. బ్రహ్మనిష్ఠులెక్కడో ఒక్కరైనా దొరకవచ్చు. శ్రోత్రియులెందరో దొరకవచ్చు; నిరతాగ్నిహోత్ర పరాయణులు గూడ ఎక్కడో ఒక్కరైనా దొరకవచ్చు. కాని యీ మూడు లక్షణాలూ గల సద్గురువు దొరకడం యెంతో కష్టం.

ఈ కాలంలో అది దాదాపు అసంభవమనే చెప్పాలి. శ్రీసాయి అట్టివారే. ఆయన బ్రహ్మనిష్ఠులని ఎందరో గుర్తించారు. ఆయన నిరతాగ్నిహోత్రియన్న సంగతి అందరూ చూచిన విషయమే. కాని ఆయన సాటిలేని శ్రోత్రియులన్న సంగతి తెలుసుకున్నవారెంతో అరుదు. కారణం శ్రోత్రియులను గుర్తించగలగాలంటే మనకెంతో శాస్త్ర ప్రావీణ్యం వుండాలి. అంతేగాదు. శ్రోత్రియులంటే నిజానికి వేదమెరిగిన వారే; వేదవిదులే. మహాపతివ్రత తన సౌందర్యాన్ని, ప్రేమనూ సంపూర్ణంగా తన భర్తకు మాత్రమే ఏకాంతంలో యెలా సమర్పించుకుంటుందో, అలానే వేదంగూడ అర్హుడైనవానికే తన అర్థమంతటినీ తెలియనిస్తుందని, వారే వేదవిదులనీ వేదమే చెప్పింది. బాబా అలాంటి వారే. ఆయనకు ముస్లింలకు వేదమైన ఖురాను మాత్రమేగాక, వేదంగూడ తన జ్ఞానసంపదనంతటినీ సమర్పించింది.

కొందరు దక్షిణాది బ్రాహ్మణులు దేశసంచారం చేస్తూ, వేద పండితులను సాయి ఘనంగా సత్కరిస్తారని విని, శిరిడీ చేరారు. సాయి ముస్లింవలె వుండడంతో ఆయనకు నమస్కరించక, వాళ్ళు ప్రత్యామ్నాయ పద్ధతిన నేలమీద పిడికళ్ళుంచి, భగవంతుని పాదాలని భావించి నమస్కరించి, వేదం చదువనారంభించారు. కాని ప్రతిసారీ మధ్యలో మంత్రం మరచారు. అపుడు బాబా నవ్వి, వారికి మంత్రం అందించేసరికి వారు ఆశ్చర్యపోయారు. అపుడు బాబా కొంటెగా నవ్వి "మీరు ఎవరికి నమస్కరించారో వారినుండే కానుక పొందండి!' అన్నారు. భగవదను గ్రహం పొందడానికే వేదం చదవాలిగాని, లౌకికమైన కానుకలకోసం గాదని వారిభావం. తర్వాత వారిని బాబా ఘనంగా సత్కరించి పంపారు. అసలు అనుగ్రహించవలసింది వారేగా!

సద్గ్రంథపఠన గూడ సద్గురుని అనుగ్రహంవల్లనే సార్థకమవుతుంది. అనుగ్రహానికి భక్తే సాధనంగాని, యుక్తి గాదు. "జ్ఞానేశ్వరి" పారాయణ ఎప్పుడు మొదలు పెట్టినా దేవ్‌కు ఏదో ఒక ఆటంకమొస్తుంటే, దానిని బాబా చేతి మీదగా తీసుకోదలచి, అందులో ఒక్క రూపాయి వుంచి ఆయనకివ్వాలనుకున్నాడు. వెంటనే ఆయన కోరి అతనివద్ద రు. 20/-లు తీసుకున్నారే గాని, పారాయణ విషయమే ఎత్తలేదు. అప్పుడతడు మాన్కర్ అనే భక్తుడు వారి కృపనెలా పొందగల్గాడో చెప్పమని అతనిని అడిగాడు. తక్షణమే బాబా అతనిని రప్పించి, రూ. 20/-లు దక్షిణ వసూలు చేసారు. దేవ్ మరల మర్నాడు మాన్కర్‌ను ఆ విషయమే అడిగాడు. వెంటనే సాయి మరలా అతనిని పిలిపించి, రూ25/- లు అడిగి తీసుకొని కోపంతో, "నీవు మశీదులోనే కూర్చో! నా గుడ్డపీలికలెందుకు దొంగిలిస్తావు?

తలనెరిసినా యీ పద్ధతి పోలేదా? గొడ్డలితో నరుకుతా జాగ్రత్త!" అని కేకలేసారు. అతడికేమీ అర్థంగాలేదు. నాటి మధ్యాహ్నం బాబా అతనితో ప్రేమగా, "గుడ్డపీలికల విషయం చెప్పి నిన్ను బాధపెట్టానా? దొంగతనం చేస్తే ఒప్పుకోక తప్పదు. ఏం చేస్తాం? దైవమే సాక్షి!" అని, మరల రూ. 12/-లు దక్షిణ తీసుకున్నారు. "నీవు రోజా ఉదయం వాడాలో 'జ్ఞానేశ్వరి' పారాయణ చెయ్యి. నీకు మంచి జరీశాలువ యివ్వదలచాను. చింకి గుడ్డలు దొంగిలించడమెందుకు!" అన్నారు. ఈసారి దేవ్‌కు పారాయణ చక్కగా సాగింది. అతడు భక్తితో సద్గ్రంథపఠన ద్వారా సాయి అనుగ్రహాన్ని పొందాలి గానీ, వారినీ, వీరినీ ఆశ్రయించకూడదని వారి భావం. సామాన్యుల బోధలు చింకి గుడ్డలు, సద్గురువిచ్చేది జరీ శాలువ! దానిని పొందాలంటే దానినివ్వగలవారినే అడగాలి!

ఎవరి సంస్కారానికి తగిన ఉపదేశం వారికివ్వగల్గడమే సద్గురువు యొక్క ప్రత్యేకత. లేకుంటే లెక్కకు మీరిన సద్గ్రంథాలే మానవులందరికీ మోక్షమిచ్చి వుండేవే గదా! ఎంతటి వైద్య గ్రంథమైనా, సమర్థుడైన వైద్యునితో సమానం కాదు గదా!

బాబా ఒకరోజు నానాసాహెబ్ నిమోన్కరుతో, "కాకా, నీవు రోజా భాగవతం చదువరాదా?" అన్నారు. "చదవాలనే వున్నది. కాని నాకు సంస్కృతం రాదు" అన్నాడు నిమోన్కరు. "ఫర్వాలేదు, ఈ మసీదు తల్లే నేర్పుతుంది. చదువు" అన్నారు. అతడలాగే ప్రారంభించాడు. కొద్దికాలానికి అతడికా గ్రంథమర్థమై, దీక్షిత్, జోగ్, మొ॥న పండితులకు గూడ జటిలమైన శ్లోకాలు వివరించగల్గేవాడు. తన పాండిత్యం గురించి అతనిలో అహంకారం తలెత్తిందో ఏమో, కొన్నాళ్ళ తర్వాత అతనిని, "ఇతరులకు చెప్పేందుకు మనమెవరం? దాని వలన మనలో అహం బలపడుతుంది" అని వారించారు సాయి. ప్రతివారూ నిమోన్కర్ వలెనే సద్గ్రంథాలు అర్థంగావడానికి సాయి వంటి సద్గురుని కృప పొందాలి.

దాసగణుకు ఈశావాశ్యోపనిషత్తు సరిగా అర్థంగాలేదు. పండితులెవ్వరూ అతనికి తృప్తిగా వివరించలేకపోయారు. బ్రహ్మజ్ఞానియే వివరించగలరని తలచి బాబాను కోరాడు. సాయి, "ఇందులో కష్టమేముంది? తిరిగి వెళ్ళేటప్పుడు కాకాదీక్షిత్ ఇంటిలో పనిపిల్ల నీ సందేహం తీరుస్తుంది" అన్నారు. సాయి పరాచికమాడారని అందరూ అనుకున్నారు గాని, దాసగణు మాత్రం ఆయన మాట పూర్తిగా నమ్మి కాకాదీక్షిత్ ఇంటికి వెళ్ళాడు. మరురోజే ఒక పాతచీర ధరించిన పనిపిల్ల గిన్నెలు తోముతూ అందమైన ఎర్రని చీర గురించి పాడుతోంది. దాసగణు జాలిపడి ఆమెకొక మంచిచీర యిప్పించాడు. మర్నాడు ఆమె ఆ కొత్తచీర ఇంట్లో దాచి, పాతచీరే కట్టుకొని వచ్చింది. అయినా ఆమె ముఖంలో సంతోషమలాగే వున్నది. ఆ సన్నివేశంలో ఈశోపనిషత్తు సారాంశం దాసగణుకు యిలా తోచింది : సుఖదుఃఖాలు మనోకల్పితాలు! సర్వమూ ఈశ్వరమయమని, ప్రసాదమనీ గుర్తించేవాడు ఏ పరిస్థితిలోనయినా ఆనందిస్తాడు. "

బాబా తమను సేవించేవారికి సాధనలో తగిన సూచనలిచ్చేవారు. సేవకుడు అబ్దుల్లా యిలా చెప్పాడు: "ఖురాను చదివేటప్పుడు కునికిపాట్లు పడవద్దని బాబా చెప్పారు. 'కొద్దిగా తిను, రుచులకు పోవద్దు, ఒక్క వంటకం చాలు. ఎక్కువ నిద్రపోవద్దు' అన్నారు. . . . . నేను ఒకరాత్రి ప్రార్థనచేస్తూ అరచేతుల్లో ముఖముంచుకొని కునుకుతీసాను. అపుడు సాయి, 'చంద్రుణ్ణి చూడ యత్నిస్తున్నావా ఏమి?' అన్నారు. నేను కొద్దిసేపటికి మళ్ళీ నిద్ర తూగి ఆయనమీద పడ్డాను. ఆయన ప్రేమతో నా పాదాలు తట్టి లేపారు. నేను మరురోజు మధ్యాహ్నం దోసిట్లో నీళ్ళు తీసుకున్నప్పుడు అందులో స్పష్టంగా చంద్రబింబం గోచరించి, పులకించిపోయాను. ఆ దర్శనం ప్రసాదించబోతామని ఆయన ముందుగా చెప్పారు. ఒక్కొక్కసారి ఆయన నన్ను చెడ్డగా తిట్టేవారు. నన్నూ, జోగ్‌నూ కొట్టారుగూడ! అదీ ఆశీర్వచనమే!

ఆశ్రితుల భక్తి విశ్వాసాలను బాబా ఎన్నో రీతుల పటిష్టం చేసేవారు. ఆయన అప్పుడప్పుడూ భక్తులకు పంచడానికి దుకాణంనుండి మిఠాయి తెప్పించేవారు. ఆ వర్తకుడు 1916లో ఒకరోజు ప్లేగుతో మరణించాడు. శవమింకా అక్కడే వున్నది. బాబా అప్పుడే మిఠాయితెమ్మని నార్కేను పంపారు. ధైర్యముంటే అలమరాలోని మిఠాయి తీసుకుపొమ్మని ఆ వర్తకుని భార్య చెప్పింది. అతడు భయపడుతూనే మిఠాయి తీసుకెళ్ళాడు. బాబా అదే ప్రసాదంగా పంచి నార్కేతో, "అది తింటే చచ్చిపోతావని, ఊరు విడిస్తే బ్రతుకుతావనీ అనుకుంటున్నావు. అలా ఎన్నటికీ జరగదు. ఎక్కడున్నా సమయమొచ్చినపుడు మృత్యువు కొడుతుంది" అన్నారు. బాబా ఒక్కొక్కసారి కుష్ఠురోగులచేత ఊధీ అందరికీ యిప్పించేవారు. అయినా ఎవరికీ ఏ ప్రమాదమూ జరుగలేదు. శ్రీమతి మేనేజర్ యిలా చెప్పింది : "వెళ్ళిపోతున్న ఒక కుష్ఠురోగిని వెనక్కు పిలిచి అతని మూటలోని పాలకోవా నాకిచ్చారు. ఆయనచర్య ఎవరికీ అర్థంకాలేదు. కాని సాయి నా అసహ్యం గుర్తించి నాకు నమ్రత, సహనము, సోదరభావము బోధిస్తున్నారని నాకు తెలుసు. ఆయన శక్తి ఆరోగ్యసూత్రాలకు అతీతమని గుర్తించాను.

ఒకరోజు సీతాఫలాలు అమ్మే మనిషి ఫలాల వెల ఎక్కువ చెప్పింది. సాయి చాలాసేపు బేరమాడి 10 అణాలకు 6 పండ్లు కొన్నారు. ఇంతలో మరొకామె ఆ పండ్లే తెచ్చింది. ఆమెను 6 అణాలకు 10 పండ్లిమ్మన్నారు బాబా. ఆమె వెంటనే యిచ్చింది. అపుడు సాయి చెరో రూపాయి యిచ్చి "మొదట వచ్చిన పండ్లకు గిరాకీ ఎక్కువ గనుక 6 పండ్లకు 10 అణాలు, తర్వాత వచ్చిన పండ్లకు విలువ తగ్గుతుంది గనుక తక్కువ వెల నిర్ణయించాము. అయినా ఎవరి పుణ్యఫలం వారు పొందారు" అన్నారు. పుణ్యసూత్రమెలా పనిచేస్తుందో!

సాయి అనుగ్రహం ఒక్కొక్కప్పుడు మాటలకందని అనుభూతిగా భక్తులకు లభించేది. 'నారాయణాశ్రం' యిలా చెప్పాడు : 'భక్తుల ఆత్మ వికాసానికి బాబాగారి ప్రత్యక్ష సాన్నిధ్యమక్కరలేదు. మశీదులోనేగాక గదిలోగూడ వారి ప్రభావముండేది. అయితే బాబా ప్రసాదించేదంతా స్వీకరించగలవారెవరూ లేరు గాబోలు, ఆయన తర్వాత వారి స్థానానికెవ్వరూ వారసులు కాలేదు. వారి స్పర్శ కొన్ని చిత్రమైన అనుభవాలు, శక్తులూ ప్రసాదించేది. ఒక్కొక్కసారి భక్తుని తలను ఒక ప్రత్యేకరీతిన స్పృశించేవారు. లేక అపవిత్ర భావాలను అణచివేస్తున్నట్లు భక్తుని శిరస్సుపై గట్టిగా నొక్కేవారు. లేక పదేపదే తట్టేవారు. అలాగాకుంటే భక్తుని శిరస్సు, వెన్ను చిత్రమైన రీతిన నిమిరేవారు. ఒక్కొక్క స్పర్శకు ఒక్కొక్క ప్రభావముంటుంది. ఆయన అదృశ్యంగా గూడ భక్తునిలో అద్భుతమైన మార్పు తెచ్చేవారు. నాకు 1914లో శిరిడీ వెళ్ళినపుడు ఆయన మౌనంగానే, ఈ సృష్టిలోని భేదాలు అసత్యమని, అన్నింటికి ఆధారమైన దొక్కటే సత్యమన్న అనుభవమిచ్చారు. కాని నాకు తెలిసినంతలో ఆయన మాటలలో యిలా ఎన్నడూ చెప్పలేదు' అదే దక్షిణామూర్తి తత్త్వమని ఆదిశంకరులు కీర్తించారు. జనార్ధన్ గల్వంకర్ (బాంద్రా) యిలా వ్రాశాడు; "సాయి 1917లో ఒకసారి తమచేయి నా తలమీదుంచగానే నాకో చిత్రమైన అనుభూతి కలిగి, పరిసరాలనేగాక నన్ను నేనే మరచాను. ఆనాటినుండి నాకు ఆధ్యాత్మికతపై శ్రద్ధ కలిగింది. అలానే ఒకరోజు ఖాపర్డేకు సాయి పదేపదే చిలిం అందించారు. అతడా పొగపీల్చగానే అతడి సందేహాలన్నీ తీరి ఎంతో ఆనందం కల్గింది. చిలిమ్‌లో సాయి పొగాకు మాత్రమే వేసుకున్నారు సుమా!

బాబా సందేశం సమయానికి వచ్చిన సద్గ్రంథాల ద్వారా గూడ భక్తులకు చేరేది. అంబేద్కర్ 7 సం॥లు యెన్నో కష్టాలు పడ్డాడు. ఎన్నిసార్లు శిరిడీ వెళ్ళినా అవి తొలగలేదు. చివరకు బాబా సన్నిధిలో ప్రాణం విడిస్తే మరుజన్మైనా బాగుండవచ్చని తలచి 1916లో శిరిడీ చేరాడు. అతడు దీక్షిత్ వాడావద్ద కూర్చొని ఆలోచిస్తుంటే, సగుణమేరూనాయక్ అతనికొక పుస్తకమిచ్చాడు. అది తెరవగానే వచ్చిన ఘట్టమిది : అక్కల్‌కోటస్వామి భక్తుడొకడు కష్టాలోర్వలేక ఒక బావిలో దుకాడు. స్వామి అతనిని రక్షించి, 'కర్మ అనుభవించక తప్పదు. ఇలా తప్పుకుంటే

మళ్ళీపుట్టి అనుభవించాలి. దానికి ఆత్మహత్యా పాపం తోడవుతుంది. అంతకంటే ఒకేసారి అనుభవించేస్తే మేలు' అన్నారు. తర్వాత అంబేద్కర్ మశీదు చేరగానే, "నీవు అక్కల్‌కోట స్వామి చెప్పినదానినే అనుసరించు" అన్నారు బాబా. అలానే ఒకసారి 'పరమహంస' లక్షణాలు సాయి చెప్పాలని తలచాడు శ్యామా. అతనిని వెంటనే వెళ్ళి దీక్షిత్ చెబుతున్న పురాణం వినమన్నారు బాబా. అతడు వెళ్ళేసరికి భాగవతం (11:18) లోని పరమహంస లక్షణాలు వివరిస్తున్నాడు దీక్షిత్. సం॥ 1909లో ఒకరోజు మశీదులోనున్న శ్యామరావు మనస్సులో ఒక ప్రశ్న వచ్చింది. బాబా అతనిని వెంటనే ఒక దేవాలయంలో ఒక భక్తురాలు చదువుతున్న పురాణం వినమన్నారు. అతడు వెళ్ళేసరికి ఆమె చదువుతున్న శ్లోకం అతనికి సమాధానమైంది.

★★★



ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 18



శిరిడీలో ఉత్సవాలు

పల్లకీ - చావడి ఉత్సవము : ఒకరోజు పెద్ద వర్షమొచ్చి, మశీదంతా తడిసిపోయి, బాబాకు కూర్చునేందుకు చోటుగూడ లేకపోయింది. భక్తు లాయనను నాటి రాత్రికి చావడిలో వుండమన్నారు. ఆయన అంగీకరించకపోయేసరికి పట్టుబట్టి ఆయనను అక్కడికి తీసుకుపోయారు. ఆ రాత్రి ఆయన అక్కడ విశ్రమించారు. నాటినుండి ఆయన ఒక రాత్రి మశీదులోను, ఒకరాత్రి చావడిలోనూ నిద్రించేవారు. వారిని భక్తులు మశీదునుండి చావడికి వేడుకలతో తీసుకెళ్ళడం క్రమంగా డిసెంబరు 10, 1909 నాటికి అది గొప్ప చావడి ఉత్సవంగా రూపొందింది. నేటికీ యిది గురువారం రాత్రి పల్లకి ఉత్సవంగా జరుగుతున్నది.

ఒకప్పుడు హార్దానుండి భక్తులు బాబాకొక పల్లకీ పార్సెల్ చేసి పంపారు. బాబా దానిని మశీదు ముంగిట పెట్టించి, మూడు మాసాలు దానిని తెరవనివ్వలేదు. ఒకరోజు రఘువీర్ పురందరే చనువుగా, "బాబా, ఈరోజు పల్లకీ బయటకు తీసి పూలతో అలంకరించి అందులో మిమ్మల్ని చావడికి తీసుకుపోతాం" అన్నాడు. సాయి ఆ పార్శిలు విప్పడానికే ఒప్పుకోలేదు. అయినా అతడు పంతంగా విప్పుతుంటే బాబా గద్దించి పట్టరాని కోపంతో సటకా తీసుకుని, చంపేస్తానని అతనిమీదకు పరుగెత్తారు. భక్తులు భయంతో పారిపోయారు. పురందరే అదేమీ పట్టించుకోకుండా నెమ్మదిగా పార్శిలు విప్పి, పల్లకీని పూలతో అలంకరించాడు. ఇక బాబా మౌనంగా వుండి పోయారు. అది చూచిన పురందరే పంతంగా, 'ఇకనుంచి మిమ్మల్ని పల్లకీలో ఊరేగింపుతో చావడికి తీసుకెళ్తాము!' అన్నాడు. "అలామాత్రమెన్నటికీ జరుగనివ్వను" అన్నారు బాబా. అతడు, "అయితే పల్లకీ ఖాళీగా మోసుకుపోతామా ఏమి?" అన్నాడు. సాయి ఉగ్రులై, "నీవు ముందు బయటికి పోతావా, లేదా?" అని చెడ్డగా తిడుతూ సటకాతో బెదిరించారు. అతడు త్వరగా ఆ పని పూర్తిచేసి స్వగ్రామం వెళ్ళిపోయాడు. అతడనుమతి కోరినపుడు బాబా ఏమీ మాట్లాడకుండా 'ఊధీ' యిచ్చారు. తర్వాత చావడికి వెళ్ళవలసినరోజు సాయంత్రమయ్యేసరికి భక్తులందరూ మొట్టమొదటి పల్లకీ ఉత్సవానికి మశీదువద్ద చేరారు. బాబా మాత్రం పల్లకీ ఎక్కనని భీష్మించారు. ఊరినుంచి అప్పుడే వచ్చిన పురందరే తాను సిద్ధంచేసిన పల్లకీ లేకుంటే తాను ఉత్సవానికి రానన్నాడు. భక్తులెంత బ్రతిమాలినా బాబా తమ పట్టు విడువలేదు. చివరకు పల్లకీలో వారి పాదుకలు వూరేగించాలని, సాయి పాదచారియై వూరేగింపుతో వెళ్ళాలనీ రాజీ కుదిరింది. "బాబా, పల్లకీ నేను కూడా మోసేదా?" అన్నాడు పురందరే. "వద్దు, నీవు 125 వత్తుల దివిటీ పట్టుకో!" అన్నారు బాబా. అలా దివిటీల ఊరేగింపుతో పల్లకీ చావడి చేరింది.

నాటి ఉత్సవమయ్యాక సాయి పల్లకీని మశీదులో పెట్టనివ్వలేదు. గనుక 3,4 రోజులు అది చావడిలోనే వున్నది. చివరికెలాగో ఒకరాత్రి మాత్రం మశీదు ముంగిట వుంచనిచ్చారు. ఆ రాత్రి దానికున్న రెండు వెండి సింహాలూ దొంగలెత్తుకెళ్ళారు. కనుక దానికొక షెడ్డును నిర్మించనారంభించాడు పురందరే. బాబా లెండీనుండి గబగబా వచ్చి "ఏమిటి చేస్తున్నావ్?" అని గద్దిస్తే అతడు నవ్వుతూ చెప్పాడు. ఆయన ఉగ్రులై, "నువ్విక్కడనుంచి పోతావా, లేక నీ తల పగలగొట్టనా?" అని మీదకెళ్ళారు. అతడాయన కాళ్ళావేళ్ళాపడి బ్రతిమాలాడు. ఆయన

మరింత గట్టిగా, 'నాకు నువ్వూ వద్దు, పల్లకీ, షెడ్డు అసలేవద్దు; నన్ను విసిగించకు, ఫో!'' అని అరచారుగాని, అతడు చేస్తున్న పనిలో మాత్రం జోక్యం చేసుకోలేదు.

మధ్యాహ్నం ఆరతయ్యాక భక్తులందరూ భోజనాలు చేసి తిరిగి మశీదు చేరినా పురందరే మాత్రం వెళ్ళకుండా పనిచేస్తూనే వున్నాడు. సాయి కొన్నిసార్లు అతనికి నెమ్మదిగా చెప్పారు. మందలించారు, గద్దించారు; భోజనానికి వెళ్ళకుంటే కొడతానని బెదిరించారు. అయినా అతడు వినిపించుకోలేదు. పట్టరాని కోపంతో పలుకకుండా పదేపదే అతనికేసి చూస్తారు; చేత్తో పొట్ట తడుముకుంటారు. "ఆ పనికిమాలినవాడు భోజనానికిగూడ పోకుండా నా ప్రాణం తీస్తున్నాడు. నువ్వైనా పిలుచుకుపో!'' అని కాకా సాహెబ్‌తో చెప్పారు. "అతడు సెలవుపెట్టాడు. అదయ్యేలోగా పని పూర్తిచేయాలని చూస్తున్నాడు. అతనిని భోజనానికి పిలుచుకెళ్ళనా?'' అన్నాడు కాకా. "వాడు రాడు, ఆ మూర్ఖుడు నేను చెప్పినా వినలేదు!'' అన్నారాయన. వెంటనే పురందరే వారి పాదాలపైబడి పసిపిల్లవానిలా ఏడుస్తుంటే, "ఎందుకేడుస్తావ్? వూరుకో!'' అన్నారు బాబా. అతడు కళ్ళు తుడుచుకొని, "ప్రొద్దుటినుండీ నన్నింతలా తిడుతున్నారు; కొడతాను, చంపుతాను అని బెదిరిస్తున్నారు. కాని నేనొక్కపూట భోంచేయకపోతే అంత తల్లడిల్లిపోతున్నారే! నాపై మీకెందుకింత దయ? మమ్మింతలా పట్టించుకునేదెవరు?'' అన్నాడు. "నోర్ముయ్! వెళ్ళి భోజనం చెయ్యి; కడుపు మండిపోతుంది!'' అన్నారు బాబా. అతడు రెండడుగులు వేసి చటుక్కున వెనక్కు తిరిగి, "నేను వెళితే మీరిదంతా పీకేస్తారు!'' అన్నాడు. బాబా ప్రసన్నులై, 'నేనేమన్నా రాక్షసుడనా? నేనలా ఏమీ చేయనులే!' అన్నారు.

అతడు భోంచేసి వచ్చి సాయంత్రానికల్లా ఆ షెడ్డుకొక తలుపు బిగించాడు. అపుడు పల్లకీ ఆ గదిలో పెట్టి, సాయికి నమస్కరించి, "బాబా, సెలవయిపోయింది, నేను వెళ్ళాలి. ఇంకా ఒక్క తలుపు బిగించాలి. ఆ పని తాత్యాకు అప్పగించి వెడతాను'' అన్నాడు. " ఆ పని రేపాలోచిస్తాములే. నీవుపోయి విశ్రాంతి తీసుకో!'' అన్నారు బాబా. తెల్లవారగానే అతడు మళ్ళీ సాయిని సెలవు కోరాడు. "అక్కడికి వెళ్ళి ఏం చేస్తావు? మనం ప్రారంభించిన పని పూర్తిచేయాలి గాని యింకొకరికప్పగించకూడదు. వీలైనంత తరచుగా శిరిడీ వస్తుండాలి'' అన్నారు బాబా. "మీరు సంకల్పిస్తేనే రాగలం'' అన్నాడు పురందరే. "శిరిడీకి నేనందరినీ పిలుస్తాను. కాని రావడానికందరూ సిద్ధంగా వుండరు. పని పూర్తిచేసి, కాకడ ఆరతయ్యాక వెళ్ళు'' అన్నారు. పురందరే మర్నాడు వెళ్ళాడు. అప్పటినుండి 'చావడి ఉత్సవం' 'పల్లకి ఉత్సవం'గా మారింది.

ఆ ఉత్సవానికి ముందే భక్తులంతా మశీదు ముంగిట చేరి తాళాలు చిడతలు మొ॥న వాద్యాలతో భజన చేసేవారు. ఇంతలో అబ్దుల్లా, రాధాకృష్ణ ఆయి-యిద్దరూ బాబా తిరిగే వీథులన్నీ శుభ్రంచేసి, నీళ్ళు చల్లి, ముగ్గులేసి, మశీదునుంచి చావడిదాకా బాటమీద గుడ్డలు పరిచేవారు. వెనుక చిన్న రథము, కుడివైపున తులసికోట, ఎదుట సాయి, మధ్యలో భక్తబృందమూ వుండేవారు. కొందరు మసీదు గేటువద్ద దివిటీలు సిద్ధం చేస్తుంటే, కొందరు పల్లకీనలంకరించేవారు. కొందరు దండాలు ధరించి, "సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై'' అని కేకలేస్తుండేవారు. మశీదంతా దీపాలతోను, తోరణాలతోనూ కళకళలాడుతుండేది. దాని ఎదుట ముంగిట్లో చక్కగా అలంకరించిన శ్యామకర్ణ (గుఱ్ఱం) నిలబడేది. అపుడు తాత్యా వచ్చి బాబాను సిద్ధంగా వుండమని చెప్పేవాడు. తర్వాత అతడు సమయానికొచ్చి చంకలో చెయ్యివేసి సాయిని లేవదీసాక అప్పుడు సాయి నెమ్మదిగా నిలబడి తమ చంకలో సట్కా, చేతిలో చిలుముగొట్టం, పొగాకూ తీసుకుని, భుజానికొక పాతగుడ్డ వేసుకునేవారు. ఆయన అడుగు ముందుకు వేసే సమయానికి తాత్యా ఒక బంగారు జరీశాలువా ఆయన భుజాలపై కప్పేవాడు. అప్పుడాయన అడుగు ముందుకువేసి, కుడికాలుతో ధునిలో కట్టెలు సర్ది, కుడిచేతితో అక్కడున్న దీపమార్పి బయల్దేరేవారు.

వెంటనే భక్తులెంతో ఉత్సాహంగా మేళతాళాలు మ్రోగించేవారు. వివిధ కాంతులు చిమ్మే టపాసులు పేలుస్తూ మేళతాళాలతో అందరూ ముందుకు సాగేవారు. కొందరావేశంతో నృత్యం చేసేవారు. కొందరు జండాలు, ధ్వజాలు మోసేవారు. సాయి మశీదు మెట్లమీదకు రాగానే వందిమాగధులు ఎలుగెత్తి జై కొట్టేవారు. భక్తులు చామరాలతో వీస్తూ బాబాను ముందుకు నడిపించేవారు. తాత్యా ఒక చేత్తో లాంతరు, మరొక చేత్తో బాబా ఎడమచెయ్యి పట్టుకునేవాడు; కుడిచెయ్యి మహల్సాపతి పట్టుకుని, తర్వాత విడిచి సాయి దుస్తుల అంచులు పట్టుకుని నడిచేవాడు. జోగ్ ఆయనకు ఛత్రం పట్టేవాడు. ఆయన ముందు శ్యామకర్ణ, వెనుక భక్తులు, సేవకులు, వాద్యగాళ్ళు నడిచేవారు. నామసంకీర్తనం, వాద్యాలు, జయకారాలు మిన్నుముడుతుంటే, ఊరేగింపు నెమ్మదిగా మశీదు మలుపు చేరేది.

అక్కడ సాయి చావడివైపు తిరిగి నిలిచినప్పుడు, ఆయన రూపం దివ్యంగా వుండేది. ఆయన ఏకాగ్ర మనస్కులై ఎవరినో మనస్సుతో పిలుస్తున్నట్లు కన్పించేవారు. తమ కుడిచెయ్యి క్రిందికి, పైకీ వూపి వింతైన భంగిమలు చేసేవారు. కాకాసాహెబు వెండి పళ్ళెంలో గులాల్ పూసిన పూలు తెచ్చి ఆయనపై చల్లుతుండేవాడు. అపుడు వాద్యఘోష ఆకాశాన్నంటేది. 'అప్పుడు బాబా ముఖంలో పుట్టిపడే దివ్యకళను మించినదేదీ వుండజాలదు' అన్నాడు ప్రధాన్. దానిని స్వయంగా చూచిన హేమాద్‌పంత్, 'ఆ దృశ్యము, దాని వైభవము వర్ణించ సాధ్యంగాదు' అని వ్రాశాడు. ఒక్కొక్కప్పుడు మహల్సాపతి దివ్యమైన ఆవేశంతో నృత్యం చేసేవాడు. అయితే ఏకాగ్రమైన సాయిదృష్టిని యివేవీ కించిత్తు గూడా ఆకర్షించలేకపోయేవి. దివ్యమైన ఆ ఉత్సవాన్ని చూడడానికి ఎందరెందరో గుమిగూడేవారు. సాయి చాల నెమ్మదిగా నడిచేవారు. అలా ఊరేగింపు చావడి చేరేది. "ఆ రోజులు గడిచిపోయాయి. ఇపుడు గాని, యిక ముందుగాని అలాటి ఉత్సవమెవరూ చూడలేరు. అయినా దానిని స్మరించి మనం కొంతవరకూ తృప్తి పొందవచ్చు" అంటాడు హేమాద్‌పంత్.

అంతకుముందే చావడి కప్పును తెల్లగుడ్డతో అలంకరించేవారు. చుట్టూ రంగు రంగుల దీపాలు, అద్దాలు అమర్చేవారు. ముందుగా తాత్యా వెళ్ళి బాబాకు ఆసనము, ఆనుకోవడానికి చెక్క అమర్చి, సాయిని కూర్చోబెట్టి, అందమైన కోటు తొడిగేవాడు. భక్తులు చక్కని కుచ్చు కిరీటము, పూలమాలలు, ఆభరణాలతో ఆయననలంకరించి, వారి నుదుట కస్తూరి చందనాలతో నిలువుగీతలు గీసి, చుక్కపెట్టి, బాబాను తనివితీరా చూచి ఆనందించేవారు. ఆయన ఏ క్షణాన కోపమొచ్చి వాటిని పారేస్తారోనన్న భయంతో కొందరు తాము తెచ్చిన తలగుడ్డలు, కిరీటము ఆయన తలపై పెట్టక ఆ పైగా పట్టుకునేవారు. సాయి ప్రేమతో వారి భావానికి తలవొగ్గేవారు. ఆ అలంకారంతో ఆయనెంతో అందంగా వుండేవారు. అపుడు నిమోన్కర్ బాబాకు ఛత్రం పట్టేవాడు. భక్తులొకవంక చామరాలతో వీస్తుంటే, శ్యామా చిలింలో నిప్పేసి తాత్యాకిచ్చేవాడు. అతడది రాజుకునేలా చేసి సాయికిచ్చేవాడు. ఆయన పొగపీల్చి మహల్సాపతికి, మిగిలిన భక్తులకూ అందించేవారు. ఆ ఛిలిం గురించి హేమాద్‌పంత్ యిలా వ్రాశాడు: "అచేతనమైన ఆ చిలిం ధన్యమైంది. మొదట అదెంతో కఠోర తపస్సు చేసింది. కుమ్మరి దానిని మట్టిగా కాళ్ళక్రింద త్రొక్కి, గొట్టంచేసి, ఎండబెడతాడు. తర్వాత నిప్పుల్లో కాలుస్తాడు. అప్పుడే దానికి సాయి స్పర్శ, పెదవుల స్పర్శ లభించేది."

ఇలాంటి సందర్భాలలోగూడ సాయిలో ఒక్కొక్కప్పుడు కోపావేశం తొంగిచూచేది. ఫిబ్రవరి 26, 1912న చావడి ఉత్సవానికి మసీదుపై దీపాలు పెట్టడానికి పైకెక్కినవాళ్ళను ఆయన తిట్టారు. ఊరేగింపు బయల్దేరగానే శ్రీమతి జోగ్‌పై సట్కా విసిరారు. చావడిలో ఆరతి కాగానే కోపంతో జోగ్ చేతులు పట్టుకుని, 'ఆరతెందుకిచ్చావ్?' అని గద్దించారు. బాలషింపీ, త్రయంబక్‌లు అవి ఆశీస్సులని తలచి సాయికి సాష్టాంగ నమస్కారం చేశారు.

ఉత్సవమయ్యాక భక్తులు సాయిమెడలో మాలలు వేసి, ఆయనకు పూలగుత్తులు సమర్పించేవారు. చివరకు

జోగ్ మంగళవాద్యాలతో, శేజారతి చేశాక, ఒక్కొక్కరే సాయివద్ద సెలవు తీసుకొని యిళ్ళకు వెళ్ళేవారు. అపుడు బాబా ప్రేమగా, "నన్ను కనిపెట్టివుండు, రాత్రివచ్చి, నన్ను విచారించి వెళ్ళు" అని తాత్యాతో అనేవారు. అందరూ వెళ్ళాక భక్తులిచ్చిన గుడ్డలు స్వయంగా పరచుకుని సాయి విశ్రమించేవారు.

రోజు విడిచి రోజు సాయి చావడిలో నిద్రించనారంభించాక, భక్తులు దానికి తగిన మార్పులు చేసారు. అన్నాచించినీకర్ దంపతులెంతోకాలం శిరిడీలో వుండి బాబాను సేవించారు. అతనికి 50 సం॥లు దాటినా సంతానం కలుగలేదు. ఒకనాడు శ్యామా, "బాబా! నీవెందరి కోరికలో తీరుస్తున్నావుగాని, వీరింతగా సేవిస్తున్నా ఒక్క బిడ్డను గూడ ప్రసాదించవేమి?" అన్నాడు. ఆయన నవ్వి, "నన్ను నిజంగా కోరితే ఎప్పుడైనా తీర్చకుండా వున్నానా? ఏమి తెలియనివాడిలా మాట్లాడతావేం? వీరేమీ అడగలేదు. వీరికి కొడుకును ప్రసాదించినా ఒక్క తరంకంటే వీరి వంశం నిలవదు. అంత కంటె కలకాలం కొనసాగే వంశప్రతిష్ట ప్రసాదిస్తాను" అన్నారు. ఆయన భావమెవరికీ అర్థంకాలేదు. అప్పట్లో అన్నాకొక కోర్టు వ్యాజ్యం 3 సం॥లు నడిచింది. దానిని గురించి ఎప్పుడడిగినా, "అల్లాహ్ మేలు చేస్తాడు" అనేవారు సాయి. ఒకరోజు అతడు వ్యాజ్యంలో ఓడిపోయినట్లు ఎవరో జాబు వ్రాశారు. అది తీసుకొని దీక్షిత్, అన్నా కోపంతో మశీదు చేరగానే సాయి ఉగ్రులై, "ఈ ముసలాడికి నా మీద నమ్మకం లేదు, ఆ ఉత్తరం అవతల పారేయండి!" అని కసిరారు. కొద్ది నెలల తర్వాత కోర్టువారు అన్నాకు అనుకూలంగా రూ.1800/-లకు డిక్రీ చేశారు. ఆ భక్తులిద్దరూ సంతోషంతో బాబావద్దకొచ్చి, ఆ పైకమంతా దక్షిణగా వారినే తీసుకోమన్నారు. ఆయన నవ్వి, "అది నేనేం చేసుకుంటాను? నాకు యిల్లా, కుటుంబమా? నీవే తీసుకో!" అన్నారు. చివరకు సాయికి ఆశ్రయమైన చావడి మరమ్మత్తుకు ఆ పైకం వినియోగించారు. అందుకే అక్కడ, "లక్ష్మీబాయి దామోదర్ బాబరే" అని ఆ దంపతుల పేర్లుంచారు.

నిత్య ఆరతులు : ప్రతిరోజూ ఉదయం 5 గం॥ల ప్రాంతంలో భక్తు లందరూ ఛత్రచామరాలు, దండాలూ తీసుకుని ఆరతికి మశీదు చేరేవారు. ఒకరు బాబా ప్రక్కన నిలచి ఛత్రం పడితే, ఒకరు చామరంతో వీస్తుండేవారు. అప్పుడు మేఘుడు అంతా సిద్ధంచేసి బాబాకు ఆరతిచ్చేవాడు. వెంటనే భక్తులందరూ, "శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ మహరాజ్‌కీ జై!" అని ఎలుగెత్తి చాటి, తాళాలు, చేతులు తడుతూ ఆరతి పాడేవారు. ఆరతి తమ యెదుట తిరగకుండా ఛత్రచామరాలు పట్టినవారు దూరంగా వొదిగి నిలచేవారు. తర్వాత ఒక్కొక్కరే సాయికి నమస్కరించి, ఊధీ తీసుకుని, కాలకృత్యాలకెళ్ళేవారు, కొద్దిమంది బాబా సన్నిధిలో కూర్చునేవారు. ఇలా రోజుకు నాల్గు ఆరతులు జరిగేవి. మేఘుడు జీవించివున్నంత కాలం అతడే ఆరతిచ్చేవాడు. తర్వాత బాపూసాహెబ్ జోగ్ ఆ కార్యక్రమాన్ని స్వీకరించాడు. ఇవి నేటికీ యిలానే జరుగుతున్నాయి.

లెండీ యాత్ర : రోజూ ఉదయం 8-30 ప్రాంతంలో సాయి లెండీకి వెళ్ళి వచ్చేవారు. అప్పుడు మొదట మశీదు ముంగిట వాద్యగాళ్ళుచేరి మేళం వాయించేవారు. టోపీ, దండం ప్రత్యేక దుస్తులు ధరించిన యిద్దరు సేవకులు మశీదు మెట్లవద్ద నిలచేవారు. వారందరితో కలిసి సాయి బైటకొచ్చి, మశీదు మలుపులో మారుతి ఎదుటికొచ్చి, అటువైపుకు కుడిచేత్తో చిత్రమైన సైగలు చేసేవారు. తర్వాత నాల్గు దిక్కులవైపూ తిరిగి తీక్షణంగా చూస్తూ అవే సైగలు చేసేవారు. తర్వాత గురుస్థానం దగ్గరనున్న వీథుల కూడలిలో నిలిచి, అచటి వేపచెట్టు వైపుకు చూస్తూ తమ గురుస్థానానికి శ్రద్ధాంజలి చెప్పుకుంటున్నట్లు సైగలు చేసేవారు. తరువాత మిగిలిన మూడు దిక్కుల వైపుకూ అలానే సైగలు చేసేవారు వాడాలోనివారు, అప్పుడే శిరిడీచేరిన భక్తులు వారిని అక్కడ దర్శించి నమస్కరించుకునేవారు. తర్వాత ఆయన దక్షిణంగా వున్న వీథుల కూడలిలో నిలిచి సైగలు చేసేవారు. ఇప్పుడక్కడ గుర్తుగా గూటిలో సాయి పాదుకలు ప్రతిష్టించారు. అక్కడ పిలాజీ గురవ్ యిల్లు మాత్రమే వుండేది! అక్కడనుండి

లెండీ కన్పించేది. ఒకరోజు ఆ సమయంలో లెండీలోని ఒక చెట్టును ప్రభుత్వ కూలీలు నరుకుతున్నారు. అదిచూచి గురవ్ కుమారునితో సాయి,"ఆ చెట్టు నరకవద్దని చెప్పు, దానికీ ప్రాణముంటుంది!"అన్నారు. ఆ యువకుడు, "వారు మనం చెబితే వింటారా" అన్నాడు. క్షణంలో బాబాకు కోపంవచ్చి, "వెధవా, నీకెంత తెలివి పెరిగిందిరా!" అని అతణ్ణి, ప్రక్కనే చూస్తూ వూరుకున్న బూటీ, జోగ్, ఫన్లేలను గూడ కొట్టారు. కాని మరుక్షణమే శాంతించారు.

తర్వాత ఆయన దక్షిణంగా, యిప్పుడు విఠలుని మందిరమున్న చోట, ఆ యింటి గోడనానుకుని నిలిచేవారు. భక్తులాయనకు మరలా నమస్కరించుకొన్నాక యింకా దక్షిణంగా చౌరాస్తాలో నిలిచి అన్ని దిక్కులవైపు సైగలు చేసేవారు. అక్కడనుండి పడమరగా యిప్పుడు కానిఫ్‌నాథ్ మందిరమున్నచోట రహదారి ప్రక్కనే నిలిచి, మొదట ఖండోబావైపు, తరువాత మిగిలిన దిక్కులవైపూ తిరిగి సైగలు చేసేవారు. అక్కడినుండి ఉత్తరంగా రహదారి ప్రక్కనే నడిచి లెండీకి చేరేవారు. అందులోకి దక్షిణంగా వుండిన చిన్నబాటన సాయి, అబ్దుల్లా లెండీలోకి ప్రవేశించేవారు. మిగిలినవారు తూర్పుగా వున్న బాటవద్ద వేచియుండేవారు. సాయి ఆ తోపులో నిత్యకృత్యాలు తీర్చుకునేవారు. మానవశ్రేయస్సు కోసం **సాయి నిత్యమూ అక్కడ సల్పిన కృషికి ఆ చెట్లు, ఆయన స్థాపించిన శాశ్వతమైన జ్ఞానజ్యోతికి ఆ నందదీపమూ సంకేతాలుగా నిలిచాయి.**

అక్కడ నిత్యకృత్యాలు తీర్చుకున్నాక సాయి, వచ్చినదారినే తిరిగొచ్చే వారు గాని, తూర్పుగా దగ్గరదారిన మశీదుకొచ్చేవారుగాదు. జీవుల శరీరంలో శ్వాస, ప్రకృతిలోని మానవతా ధర్మాలలాగా సాయిగూడ తమ పంథాను ఎన్నడూ మార్చేవారు గాదు. **శిరిడీలో మనం ఎప్పుడు నడచినా, ఆ బాటలోని ప్రతి యిసుకరేణువూ సుమారు 60 సం॥లు సాయి సంచారంతో పవిత్రమైనదని గుర్తుంచుకోవాలి.**

ఉరుసు - శ్రీరామనవమి : శిరిడీలో జరిగే పండుగలన్నింటిలో మతసామరస్యమే సాయి సంకల్పం గనుక శిరిడీలో శ్రీరామనవమి జరపాలని హిందువులకు, ఉరుసు జరపాలని ముస్లిములకూ స్ఫురించింది.

కోపర్గాఁవ్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టరుగా పనిచేసిన గోపాల్రావ్ గుండుకు మూడు వివాహాలు చేసుకున్నా, దామూ అన్నాకు రెండు వివాహాలు చేసుకున్నా బిడ్డలు కలుగలేదు. చివరకు సాయి ఆశీస్సులతో వారికి సంతానం కల్గింది. అందువలన వీరు 1897 లో సాయి సన్నిధిలో ఉరుసు జరపాలనుకున్నారు. కాని ఆ గ్రామాధికారి అడ్డు చెప్పడం వలన ప్రభుత్వం ఒప్పుకోలేదు గాని చివరకు సాయిదయతో అనుమతించింది. నాడు శ్రీరామనవమి గూడ అయింది. ఆ ఉత్సవానికెందరో జనమొస్తారు. ఆ ఊరిలో ఒక బావి ఎండిపోయింది; రెండవ దానిలోనివి ఉప్పునీరు. అప్పుడు బాబా ఆ బావిలో పూలు వేశారు. అప్పటినుంచి అది మంచినీరైంది. ప్రక్క గ్రామాలనుండి గూడ నీరు సరఫరా చేసారు. ఊళ్ళో ఎన్నో దుకాణాలు వెలిశాయి. ఆ ముందురోజు రాధాకృష్ణ ఆయి మశీదు కడిగి, మసిబారిన గోడలు శుభ్రం చేసేది. సాయి మశీదులో వుంటే చేయనివ్వరని, ఆయన చావడికి వెళ్ళిన రాత్రే ఆమె ఆ పనులు చేసేది. ఉరుసుకు దామూ అన్నా, నిమోన్కర్‌లు రెండు జెండాలు, అమీర్ షక్కర్‌దలాల్ చందనము సమర్పించేవారు. ఆ గంధమొక పళ్ళెంలో వుంచి, జెండాలతోపాటు మేళతాళాలతో వూరేగించి, చివరకు ఆ గంధం మశీదులో గోడలమీద చేతులతో అద్దేవారు. జెండాలు మశీదుకు రెండువైపులా కట్టేవారు. ఉత్సవం ఏర్పాట్లన్నీ తాత్యా చూస్తే, భక్తుల అవసరాలు రాధాకృష్ణ ఆయి చూచుకునేది. భారీ ఎత్తున అన్నదానము గూడ ప్రతి సంవత్సరమూ జరిగేది.

భీష్మ అనే భక్తునికి 1911లో శ్రీరామనవమి గూడ జరపాలని తోచి సాయిని కోరితే ఆయన సమ్మతించారు. 'సంఠ్‌వాడ' (శొంఠి -పటిక బెల్లంపొడి) ప్రసాదం రాధాకృష్ణఆయి తయారు చేసేది. మశీదంతా పచ్చని తోరణాలు కట్టారు. రామజననం సందర్భంగా రాధాకృష్ణఆయి మశీదులో ఒక ఊయల కట్టింది. భీష్ముడు కీర్తనకారుడుగా

నిలచాడు. భీష్ముని కీర్తనకంతా సిద్ధమవగానే సాయి, కాకామహాజనితో, "ఏమిటీ హంగామా?" అన్నారు. రామనవమి సంగతి చెప్పగానే నింబారు వద్ద నున్న ఒక పూలమాల హార్మోనియం వాయించనున్న కాకామహాజని మెడలోను, మరొకటి భీష్ముని మెడలోనూ వేయించారు. కీర్తన దిగ్విజయంగా ముగిసింది. భక్తులు తన్మయులై జయకారాలతో, నృత్యగీతాదులతో, గులాబ్ (ఎర్రనిపొడి) పైకెగురవేశారు. అది సాయి కళ్ళల్లో పడడంతో ఆయన ఉగ్రులై అందరినీ తిట్టారు. ఎటువాళ్ళటు పారిపోగా, కొద్దిమంది మాత్రం ఆ తిట్లను ఆశీస్సులుగా స్వీకరించారు. మానవులలోని అరిషడ్వర్గాలనే రాక్షసులను చంపడానికి రాముడవతరించినపుడు సాయి ఆవేశపడడం సహజమే. అంతేకాదు. భక్తులెపుడు క్రొత్తపని ప్రారంభించినా బాబా ఆవేశపడేవారు. అపుడాయన ఊయల విరగ్గొడతారని భయపడి, కాకా మహాజని దానిని విప్పబోయాడు. సాయి శాంతించి, ఉత్సవం పూర్తిగాలేదని చెప్పి వారించారు. నాటి ఆరతి, మరురోజు కీర్తన, గోపాలకళోత్సవాలు గూడ చక్కగా జరిగాయి. ఇలా ఒకేరోజు రామనవమి, పగలు జెండా ఉత్సవము, సాయంత్రం గంధము జరిగాయి. భక్తులు మతభేదాలు మరచి రెండింటిలోనూ ఉత్సాహంగా పాల్గొన్నారు. సం॥ 1913 నుండి నవమికి ముందు నామసప్తాహం గూడ ప్రారంభించారు. ఆ సంవత్సరం బాలాబువామాలి, 1914లో బాలాబువా సుతార్‌లు కీర్తన చేసారు. ఆ తర్వాత నుండి సాయి ఆ సేవను దాసగణుకు అప్పగించారు. క్రమంగా ఆ ఉత్సవానికొచ్చే జనుల సంఖ్య కొన్ని సం॥లలో 75 వేల దాకా పెరిగింది. అయినా అంటువ్యాధులు, కలహాలవంటివి ఎన్నడూ జరుగలేదు. దుకాణాలు, సంతర్పణలు, కుస్తీపోటీలవంటి వినోద కాలక్షేపాలు పెరిగిపోయాయి. గుర్రము, పల్లకీ, రథము, వంటపాత్రలు మొ॥వి భక్తులు సమర్పించడంతో సాయి సన్నిధి ఒక సంస్థానంగా రూపుదిద్దుకున్నది. అయినా నేటి విద్యుద్దీపాలకు అతీతంగా వెల్గే నక్షత్ర గ్రహగోళాలలాగా, మహానగరాల సవ్వడి మాటునున్న అతి సామాన్యము, అపారమూ అయిన ఆకాశంలా, యీ వైభవం చాటున సాయి మాత్రం మహత్తరము, అతి నిరాడంబరమూ అయిన జీవితాన్నే కొనసాగిస్తున్నారు.

ఒక రామనవమికి మహానగరాలనుండి కోటీశ్వరులెన్నెన్నో మిఠాయిలు తెచ్చి అర్పించారు. కాని సాయి, "నా భోజనమింకారాలేద"న్నారు. కొంతసేపటికి ఆయన శ్యామాతో, "ఈ జనంలో నెట్టుకురాలేక ఒక ముసలి పేదరాలు రోడ్డుప్రక్కన చెట్టుక్రింద కూర్చున్నది. ఆమెను తీసుకురా!" అన్నారు. తీసుకురాగానే ఆమెతో బాబా, "నాకేమి తెచ్చావు?" అన్నారు. ఆమె ఆ ముందురోజు సాయికోసం జొన్నరొట్టెలు చేసుకొచ్చింది గాని, మశీదులోని విలువైన నైవేద్యాలు చూచి సిగ్గుపడి ఏమీ తేలేదన్నది. కాని సాయి ఆమె దాచిపెట్టుకున్న మూట అడిగి తీసుకుని, "ఇదీ, మన భోజనం!" అంటూ ఎంతో యిష్టంగా తిన్నారు.

గురుపూర్ణిమ : స॥ 1908లో ఒకరోజు పండరినుండి వచ్చిన కృష్ణజీ నూల్కర్ చావడిలో వున్నాడు. బాబా శ్యామాతో, "ఆ ముసలయ్య (నూల్కర్) ను ధునివద్ద స్తంభాన్ని పూజించుకొమ్మని చెప్పు" అని అతడు చెప్పి రాగానే, "మీరంతా గూడా చేసుకోరాదా!" అన్నారు సాయి. 'దేవా! మీకైతే చేస్తాము గాని, స్తంభాన్నెందుకు పూజిస్తాము?' అన్నాడు శ్యామా. మొదట అంగీకరించని బాబా అతడు పట్టుబట్టినమీదట ఒప్పుకున్నారు. ఇంతలో నూల్కర్ పంచాంగం చూస్తే, నాడు (వ్యాస) గురుపూర్ణిమ! తాత్యా, దాదాకేల్కర్, శ్యామా మొ॥న వారు సాయికి ధోవతులిచ్చి పూజించారు. అప్పటినుండి శిరిడీలో గురుపూర్ణిమ చేసుకోవటం ఆచారమైంది. **సాయి నోటిమీదుగా భక్తులకు చేసుకోమని చెప్పిన ఉత్సవమిదొక్కటే!**

అయితే సాయి స్తంభాన్నెందుకు పూజించమన్నారు? భక్తుల శ్రేయస్సుకోరి మాత్రమే, 'గురువును సేవించు' అన్న భావాన్నే సంకేతంగా సాయి చెప్పారు. గురువెన్నడూ "నన్ను పూజించు" అనడు. జ్ఞాని దృష్టిలో అందరూ పరమాత్మ రూపాలే. వారికి శిష్యులెలావుంటారు? తాను గురువునని తలచేవాడు ఆ పేరుకే తగడన్నారు రమణమహర్షి.

అలా అనలేదు గనుకనే సాయి సద్గురుడు. ఇంటికప్పును మోసే ఆధారం స్తంభము. అది నేలలో దృఢంగా నాటుకొని వుంటుంది. అదే దాని బలము. ఆ బలంతోనే అది ఆ భవనాన్నాశ్రయించే వారందరినీ రక్షిస్తుంది. అలానే సద్గురువు సర్వానికీ ఆధారమైన ఆత్మనిష్ఠలో, గురుభక్తిలో నాటుకొని వుంటారు. అంటే గురుభక్తి రూపమైన ఆత్మనిష్ఠవలన గురువు గూడ తమనాశ్రయించినవారిని రక్షిస్తారు -- స్తంభంలాగే! గురురూపాన్ని తగురీతిన కొలవమని సాయి భావం. అంతేగాదు. సాయి శరణానందులతో తాము మశీదులోని స్తంభం క్రిందనున్న గుహలో చాలాకాలం తపస్సు చేసినట్లు సాయి చెప్పారు. చతుర్విధ పురుషార్థాలనూ 'సాధించుకోవడానికి సర్వజీవులకు ఆశ్రయము, అవకాశమూ ('ద్వారక') అయిన యీ జగత్తనే 'ద్వారకామాయి'కి ఆధారమైన మూల స్తంభమే సకల విశ్వరూపుడైన సద్గురువు. అందుకే అట్టి మహనీయుని ఇస్లాంలో "కుతుబ్" ("ధర్మస్తంభము") అంటారు.

'ద్వారకామాయి' యనే శరీరం, మూలాధారం నుండీ సహస్రారం వరకూ వున్న వెన్నెముక (మేరుదండము) అనే స్తంభంమీద ఆధారపడి వుంటుంది. అన్ని ఆధ్యాత్మిక స్థితులనూ తనలో యిముడ్చుకున్న గురువుకది సంకేతం. నిరంతరం గురువును సేవించిన వారికి అప్రయత్నంగా ఆ మార్గం తెరచుకొని, యోగవిద్య సిద్ధిస్తుంది -- సాయికి వారి గురువువలన సిద్ధించినట్లు. అదే సాయి చెప్పినది.

గోపాలరావ్‌గుండ్ ఒకసారి శిథిలమైన మశీదును మరమ్మత్తు చేయించాలని రాళ్ళు తెప్పించి చెక్కించాడు. ఆ తర్వాత పని నానాచందోర్కర్‌కు, నేల చదునుచేసి బండలు పేర్చడం కాకాదీక్షిత్‌కూ అప్పగించారు బాబా. మొదటి శ్రీ సాయి యిందుకు ఒప్పుకోలేదు. మహల్సాపతి ఎలాగో ఒప్పించాడు. సాయి చావడిలో నిద్రించిన రాత్రి, మశీదులో నేల బాగుచేసి ఎత్తయిన పీఠం అమర్చారు. నాటినుండీ సాయి గోనెమీద కూర్చోడం మాని దానిపై కూర్చొనారంభించారు. సం॥ 1914లో భక్తులెంతో శ్రమపడి మశీదు ముంగిట బాగుచేశారు. మొదట అది చాలా చిన్నదిగా వుండి భక్తులకెంతో యిబ్బందిగా వుండేది. దానిని పెద్దదిచేసి పైన కప్పించాలని కాకాదీక్షిత్ పని ప్రారంభించాడు. రాత్రంతా కష్టపడి భక్తులు కమ్ములు నాటారు. ఉదయాన్నే చావడినుండి వచ్చిన సాయి అది చూచి కోపించి, ఆవేశంతో ఇద్దరు ముగ్గురు కలసిగాని నాటనలవిగాని ఆ కమ్మెలను ఒక్కరే పీకి పారేశారు. ఆయన ఒక చేత్తో కమ్మె పెరికివేస్తూ, మరొకచేత్తో సమీపంలోని తాత్యాపాటిల్ గొంతు పట్టుకున్నారు. అతని తలపాగా బలవంతాన లాక్కుని, దానికి నిప్పంటించి, ఆ కమ్మె పాతిన గుంటలో వేశారు. కోపంతో సాయి కన్నులెర్రగా అగ్నికణాలలాగ వెలిగాయి. అందరూ భయభ్రాంతులై చూస్తుండగా శ్రీసాయి తమ జేబులోనుంచి ఒక రూపాయి నాణెం తీసి, భగవదర్పితమన్నట్టు గౌరవంతో ఆ గుంటలో వేశారు. అంతసేపూ ఆయన తాత్యాగొంతు విడచిపెట్టలేదు. తాత్యాభయంతో వణికిపోతున్నాడు. అతనికేమి జరుగనున్నదో ఎవ్వరికీ అంతుపట్టలేదు. జోక్యం చేసుకోవడానికెవ్వరికీ ధైర్యం చాలలేదు. చివరకు ధైర్యంచేసి వారింపచూచిన భాగోజీని బలంగానెట్టి, అతనిమీద యిటుకముక్కలు విసిరారు సాయి. కొంతసేపటికి ఆయన శాంతించి ఒక భక్తుని దుకాణం నుండి జరీతలపాగా తెప్పించి, తాత్యా తలకు చుట్టారు. అదిచూచి భక్తులాశ్చర్యపోయారు. చివరకు మశీదు మరమ్మత్తులన్నీ సక్రమంగా పూర్తయిననాడు సాయి నీమ్‌గాఁవ్ వెళ్ళారు. అక్కడ నుంచి ఆయనను భక్తులు మేళతాళాలతో, ఊరేగింపుతో, పునరుద్ధరించిన మశీదుకు తీసుకొచ్చారు. ఈ కట్టుబడిపని చేసినవారిలో కొండాజీ, గాబాజీ, తుకారాం అనే ముగ్గురు సోదరులు, వడ్రంగి కుటుంబానికి చెందినవారు ప్రధానపాత్ర వహించారు.

★★★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 19

ఉపదేశాలు III

సమర్థ సద్గురువు

భగవద్గీతలో శ్రీకృష్ణుడు యీ ముల్లోకాలలోనూ తాను పొందవలసినదేదీ లేదని, అయినా లోకానికి ఆదర్శంగా ధర్మం నెరవేరుస్తుంటాననీ చెప్పాడు. సిసలైన గురువుకూడ పూర్ణసిద్ధుడైనా సాధకునిలా స్వధర్మానికి చెందిన విధినిషేధాలు పాటిస్తూనే భక్తుల భావాలకు తగినట్లు వారితో వ్యవహరించి తగురీతిన సంస్కరిస్తాడు. ఈ అంశాలన్నీ సాయిబాబాలో చూడవచ్చు. అందుకే ఆయన సమర్థ సద్గురువు.

ఒక మారుమూల కుగ్రామంలో ఊరూ పేరూ లేని పిచ్చి ఫకీరుగా వెలసిన సాయిబాబాను ఎందరెందరు సాధువులు చూచి ప్రశంసించారో! అప్పా అనే కన్నడ సాధువు ఠాకూరును, తపోవనంలోని సాధువు బాలకృష్ణ ఉపాసనీ శాస్త్రిని, ఇమాంభాయి ఛోటేఖాన్‌ను దర్వేన్‌షా అను ముస్లిం మహనీయుడు, అబ్దుల్లాను గురువైన అమీరుద్దీన్ ఫకీరూ, సాయి దర్శనానికి పంపారు. అంతేగాక, ఉపాస్య దైవమైన శ్రీమన్నారాయణుడు తన ఉపాసకుడైన రేగేను, సప్తశృంగిదేవి తన పూజారినీ గూడ దేవాధిదేవుడు, మునిజన వంద్యుడూ అయిన సాయి సద్గురుని దర్శన సేవలకు పంపారు. తులజాపూర్‌లోని భవానీదేవి, తర్వాత చండలేశ్వరీదేవి గూడ నరహరిశర్మ అనే భక్తుణ్ణి శ్రీ నృసింహ సరస్వతీ స్వామిని ఆశ్రయించమనడం "శ్రీ గురు చరిత్ర"లో చూడవచ్చు. శివకేశవులను శ్రద్ధగా ఉపాసిస్తే ఆ దేవతలు సద్గురువును చూపుతారని, సద్గురుకృప కలిగినపుడు శివకేశవుల కృప అదే కలుగుతుందని 'శ్రీగురు చరిత్ర' చెబుతుంది. దేవతలకంటె సద్గురువధికుడన్నది నిశ్చయం. హిందువులలో రేగేకు, బాలాభాటేకు, ముస్లింలలో షేక్ అబ్దుల్లా, అన్వర్‌ఖాన్ వంటి వారికీ ఉన్నతమైన ఆధ్యాత్మిక వికాసము మొదలుకొని, ఎందరెందరికో యెన్నోరీతుల శ్రేయస్సుననుగ్రహించారు సాయి. ఆయన ఆశ్రిత కల్పవృక్షము. నిజమైన భక్తితో ఎవరెక్కడ స్మరించినా సాయి వారివెంటనే వుండి రక్షిస్తారు.

జిజ్ఞాస, భక్తి విశ్వాసాలతోగాక అధికార మదము మొ॥న భావాలతో బాబాను దర్శించినవారున్నారు. ఒకరోజు 1910లో బాబా ఉగ్రులై, "నన్నొక దుష్టుడు చూడ్డానికి వస్తున్నాడు. సహజ మానవావయవాలు గల నన్ను చూచేదేమిటి?" అని కేకలేశారు. కొద్దిసేపట్లో రెవిన్యూ కమీషనర్ కర్టిస్, అతని భార్య, జిల్లాకలెక్టర్ మాక్నెల్ (ఆంగ్లేయులు) శిరిడీలో చావడికొచ్చారు. కమీషనర్ ఒక భక్తునితో, "పెద్ద ఉద్యోగులు దర్శనానికి వచ్చారు; సాయిని త్వరగా సిద్ధంగమ్మను!" అన్నాడు. సాయినలా యెవరూ ఆజ్ఞాపించలేరని ఆయన దయకోసం వేచి వుండవలసినదేననీ భక్తులు చెప్పారు. అరగంట తర్వాత బాబా, భిక్షకు బయల్దేరుతుంటే నమస్కరించి, "మహరాజ్! మీతో మాట్లాడాలి" అన్నది శ్రీమతి కర్టిస్. ఆయన, "నేను భిక్షకు వెళ్ళాలి; అరగంట ఆగు" అన్నారు గాని 10 ని॥లలోనే తిరిగి వచ్చారు. తమకోసమే సాయి త్వరగా వచ్చారని తలచి మరల ఆమె నమస్కరించింది. సాయి, "ఒక గంట ఆగు" అని చెప్పి మరల భిక్షకు వెళ్ళారు! అహం దెబ్బతిన్న ఆ దొరలు వెళ్ళిపోయారు. అధికారుల మెప్పుకోసం ప్రాకులాడడం సాధు సత్పురుషులకు నిషిద్ధమని ఆయన తెల్పారు.

మరోవంక ఆయన నిజమైన ప్రేమను గుర్తించి ఆదరించేవారు. సం॥ 1913లో శ్రీరామనవమికి ముందు నామసప్తాహం జరుగుతున్నది. ఎక్కడ చూచినా జనం కిటకిటలాడుతున్నారు. శ్యామాను పిలిచి సాయి "గోడవతల ఒక వృద్ధుడున్నాడు, తీసుకురా!" అన్నారు. చూస్తే అక్కడొక వృద్ధుడున్నాడు. అతని నోట చొంగ కారి, ఈగలు ముసురుతున్నాయి. అతడిని మశీదులోకి తీసుకురాగానే, బాబా అతని మూటలోని కలకండ తీసుకొని కొంచెం తిని మిగిలినది అతనికిచ్చి, అతని తలపై చెయ్యి పెట్టి ఆశీర్వదించారు. అలానే మశీదు ముంగిట ఎప్పుడూ ఒక కుక్కవుండేది. సాయి దానికి రొట్టెలు పెట్టేవారు. ఒకరోజు దానిని మాధవ్‌ఫస్లే, "ఛీ, ఫో!" అని తన్నాడు. సాయి అతనిని "అది నాకోసమొచ్చింది గాని నీకోసం గాదు. దానినేమీ చేయవద్దు!" అని తీవ్రంగా మందలించారు.

ఒక ధనికుడు, తనకు భగవంతుడన్నీ యిచ్చాడని, బ్రహ్మజ్ఞానమొక్కటి లభిస్తే తన జీవితం సంపూర్ణమవుతుందనీ తలచి శిరిడీ వచ్చాడు. "బాబా, మీరు ముముక్షువులకు తక్షణమే బ్రహ్మజ్ఞానమిస్తారని విని వ్యయప్రయాసలకోర్చివచ్చాను" అన్నాడు. సాయి నవ్వి, "నావద్దకందరూ కోరికలతో వచ్చేవారే; బ్రహ్మజ్ఞానం కోరేవాడు దొరకడమే నా అదృష్టం!" అన్నారు. అతడు పొంగిపోయాడు. సాయి అతనితో మాట్లాడుతూనే తమకు అప్పుగా రూ. 5/- లు తెమ్మని బాలావంటి వర్తకుల వద్దకు పంపుతున్నారు. ప్రతిసారీ అతడొచ్చి ఆ వర్తకుడు లేడనో, అప్పు దొరకలేదనో చెబుతున్నాడు. అదంతా చూస్తూ కూడా ఆ ధనికుడు పైసాగూడ రాల్చకుండా, "బాబా, నేను వెళ్ళాలి, త్వరగా జ్ఞానం ప్రసాదించండి" అన్నాడు. సాయి, "నా యత్నమంతా అదే! కాని నేనేమి చేసేది? జ్ఞానం కావాలంటే (1) పంచప్రాణాలు, (2) జ్ఞానేంద్రియాలు, (3) మనస్సు, (4) బుద్ధి, (5) అహంకారం -- యీ ఐదింటినీ భగవంతునికర్పించాలి. అదెంతో కష్టం. నీవద్ద నాకవసరమైన దానికి యాభై రెట్లున్నా ఫకీరుగా నాకు అర్హత లేదు కాబట్టి అప్పు లభించదు. డబ్బే నీ పాలిట బ్రహ్మం. దానిపై మోహం నశిస్తేగాని జ్ఞానం కలుగదు" అన్నారు. అంటే బాబావద్ద జ్ఞానమెంత వున్నా అర్హతలేని అతడికది లభించలేదు. ఏసుగూడ యిటువంటి శ్రీమంతునితోనే, "సూది బెజ్జంలోంచి ఒంటైనా పోగలదేమో గాని, స్వర్గ ద్వారంలోనికి ధనికుడు మాత్రం పోలేడ"ని చెప్పారు. వాచా ఆత్మజ్ఞానం కోరినా లభించదు. డబ్బుపై ప్రీతి మనిషి ప్రవర్తననంతటినీ మలచినట్లు ముముక్షుత్వం మలచినపుడే అది వాస్తవమవుతుంది; జ్ఞానం లభిస్తుంది.

ఫిబ్రవరి 15, 1915న హార్దాలో సాధూభయ్యా తన స్నేహితులతో కలసి నడుస్తూండగా సాయి అతడికెదురుగా వచ్చి, అతడి చేతిలో పళ్ళు కుట్టుకునే వెండి పుల్ల వుంచి అదృశ్యులయ్యారు. మిత్రుడామాట శంకించి, శ్యామాకు జాబు వ్రాశాడు. సరిగా ఆనాడదే సమయానికి ఆ విషయం శిరిడీలో సాయి భక్తులతో చెప్పారని జాబొచ్చింది. తర్వాత సాధు భయ్యా శిరిడీ వచ్చినపుడు అతని అనుభవం బడేబాబాకు చెప్పమన్నారు. అది విని బడేబాబా ఏడుస్తూ సాయితో, "మీరు నాకు డబ్బిస్తారు గాని, అతనికి సాక్షాత్కారమే యిచ్చారే!" అన్నాడు. సాయి నవ్వి, "ఏం చేస్తాం? ఎవరు కోరింది వాళ్ళు పొందుతారు!" అన్నారు.

నిత్యజీవితంలో ధనంకోసం ప్రాకులాడుతూ, ఆలయానికి వచ్చినపుడు మాత్రం మోక్షం కోరడం ఆత్మవంచనే. ఒకడు సాయినలానే కోరాడు. సాయి వెంటనే ఒక పిల్లవాణ్ణి ఏ వర్తకునినుండైనా రూ. 100/- లు అప్పుగా తెమ్మన్నారు. వాళ్ళు తమ వద్ద డబ్బులేదని చెప్పి, అందుకు బదులు తమ నమస్కారాలర్పించారు. నానాసాహెబ్‌ను పిలిపించి అతనిని పైకమడిగారు బాబా. అతడు చీటి వ్రాసి పంపగానే వర్తకుడు రూ. 100/-లు అప్పుగా పంపాడు. సాయి మొదట ప్రశ్నించిన భక్తునితో, "అంతా యిలాగే వుంటుంది. అర్హత కలవారికే భగవద్దర్శనమవుతుంది - ఉద్యోగి, సంపాదకుడూ అయిన సంసారికి మాత్రమే అప్పు పుట్టినట్లు!" అన్నారు.

సాయివంటి సద్గురువుమీద ప్రీతి పెరిగిన కొద్దీ భక్తులకు ధనంపై ప్రీతి తగ్గుతుంది. సాయిగూడ వారినారీతినే

అనుగ్రహిస్తారు. శ్యామా ఒకనాడు, "బాబా. నీవెందరికో సిరిసంపదలిచ్చావు. నాకివ్వలేదేమి? నీవుగూడ చింకి గుడ్డలేసుకొని పాత మశీదులో గోనెమీద నిద్రిస్తావు. పీనాసివి. తిండిగూడ ఇతరులను అడుక్కుంటావు. నిన్నందరూ దేవుడంటారు. నిజానికి నిన్నొక దేవుణ్ణి చేసింది మేమే. మేము కాదంటే అడిగేదెవరు?" అన్నారు. సాయి ఎంతో ప్రేమగా, "సిరిసంపదలు నీకు తగవు. నీకివ్వవలసినది వేరు" అన్నారు. ఒకసారి సింధీ వర్తకుడొకడు శ్యామాకు బంగారు నాణాలు సమర్పించబోతే, సాయి అతనిని కఠినంగా వారించారు! అతనికివ్వదలచినదేమో సాయి తమ చర్యలలో సూచిస్తున్నారు.

శిరిడీలో ఒక రామదాసి రోజూ స్నానం చేసి మశీదులో విష్ణుసహస్ర నామపారాయణ చేసేవాడు. బాబా ఒకరోజు తమకు కడుపునొప్పిగా వుందని, బజారునుండి 'సోనాముఖి' అనే మూలిక తెమ్మనీ అతనిని పంపారు. అతడు వెళ్ళగానే, బాబా అతని విష్ణు సహస్రనామం పుస్తకం శ్యామాకిచ్చి, "ఇదెంతో శక్తివంతమైనది. ఒకప్పుడు నాకు గుండెదడ వచ్చి, మరణం తప్పదనిపించింది. అపుడు దీనిని హృదయానికి హత్తుకోగానే, భగవంతుడే దిగివచ్చి వ్యాధి తగ్గించినట్లనిపించింది. ఇది తీసుకొని రోజుకొక్క నామమైనా భావయుక్తంగా నెమ్మదిగా చదువు. ఎంతో మేలు చేస్తుంది" అన్నారు. ఆయన వినోదంగా తనకూ, రామదాసికీ తగవు పెడుతున్నారని తలచి, "ఈ రామదాసి ముక్కోపి. ఈ పుస్తకం నేనే దొంగిలించానని తలచి పోట్లాడుతాడు. నాకొద్దు, నేను సంస్కృతం చదవలేను గూడ!" అన్నాడు శ్యామా. కాని సాయి పట్టుబట్టడంతో తీసుకున్నాడు. రామదాసి రాగానే, భక్తుడు అన్నా చించనీకర్, సాయికి వినోదం కల్పించాలని, "నీ పుస్తకం శ్యామా వద్దనున్నదేమిటి?" అన్నాడు. రామదాసి ఉగ్రుడై ఆ పుస్తకం దొంగిలించడానికే అతడు బాబాతోచెప్పి తనను బజారుకు పంపాడని నిందించి, పుస్తకమివ్వకుంటే తల పగుల కొట్టుకుని చస్తానన్నాడు. ఒకవంక శ్యామాకు హితం చేస్తూనే, రామదాసినిగూడ సంస్కరించారు బాబా. బాబా, "నీవు రామభక్తుడవైనా, ఈ గ్రంథ పారాయణ చేస్తున్నా, నీ మనస్సు పవిత్రం అవలేదేమిటి? అది నీకిది వరకే కంఠస్థమైంది గదా? ఇక అది నీకెందుకు? శ్యామా మనవాడే గదా! నేనే అతడికా పుస్తకమిచ్చాను. దానిపై వ్యామోహమే ఇంత కోపానికి కారణం. ప్రశాంతంగా ఆలోచించు. డబ్బు పారేస్తే పుస్తకాలు దొరుకుతాయి! మనుషులలా గాదు. ఇంతా చేస్తే ఆ పుస్తకం వెల ఎంత?" అన్నారు. ఈ సంఘటన ద్వారా ఎవరికేది అవసరమో అది వారికి ప్రసాదించారు సాయి. శ్యామాకు పవిత్ర గ్రంథం, రామదాసికి వివేకం.

భక్తుని హృదయంలో తమపై ప్రీతివున్నా, పచ్చి లౌకికుల దుస్సాంగత్యంలో జీవించక తప్పనివారిని సత్సాంగత్యంలోకి లాగుతారు బాబా. దాసగణు యిలా చెప్పాడు: "నేను పోలీసు శాఖలో పని చేస్తుండగా, నానా చందోర్కర్‌తో కలిసి సాయిని సందర్శించాను. సాయి నానాతో, 'ఇతడికి తమాషాలన్నా, ఉద్యోగమన్నా వ్యామోహ మెక్కువ. అవి వదలమను' అన్నారు. అంతటితో నేను తమాషా (వీధి నాటకాలు) లలో పాల్గొనడం మానేశాను గాని, ఉద్యోగం వదలలేక పోయాను. ఆయనెప్పుడు ఆ మాట చెప్పినా, 'చూస్తాను' అనేవాణ్ణి. బాబా యిలా పదేళ్ళు చెప్పి చెప్పి, చివరికి, 'వీణ్ణి కొరత వేస్తేగాని ఉద్యోగం మానడు!' అన్నారు. తర్వాత ఒకసారి మరో ముగ్గురు పోలీసులతో పాటు నన్ను కాణాభిల్ అనే పేరుమోసిన బందిపోటుపై నిఘా వుంచారు. అతడు కనిపెట్టి ఆ ముగ్గుర్నీ చంపేశాడు. నేను భయంతో శ్రీరాముని ప్రార్థించాను. కాణాభిల్ నన్ను బెదిరించి విడిచిపెట్టాడు. తర్వాత అతడొక కొండప్రాంతంలో తిరుగుతూంటే అధికారులకు తెల్పాను. పోలీసులు అన్నివైపుల నుండీ దాడి చేశారు. చాలామంది పోలీసులు గూడ మరణించారు. అతడు మాత్రం తప్పించుకున్నాడు. ఇక నాకు ధైర్యం చాలక సెలవుకై ఒక దొంగ డాక్టరు సర్టిఫికేట్ దాఖలు చేసి, శెలవు మంజూరు గాకముందే నా స్థానం విడిచి యాత్ర చేశాను. అందుకు వుద్యోగంలో యిబ్బంది రాకుంటే ఈసారి వుద్యోగం విడుస్తానని గోదావరిలో నిలబడి సాయికి మ్రొక్కుకున్నాను. అక్కడొక దొంగలముఠా కన్పించడంతో నా ప్రయాణానికి సాకు దొరికింది. ఇంతలో ప్రమోషన్

పరీక్షగూడ పాసయ్యాను. అయినా నాకు ప్రమోషన్ రాదన్నారు బాబా. తర్వాత నాకు బదిలీ అయిన చోటికి శిరిడీ మీదుగా వెళుతూ బాబాకు కన్పించవలసి వస్తుందేమోనని మసీదు వైపుకు తిరగకుండా తిన్నగా పోతున్నాను. కానీ సరిగ్గా లెండీ దగ్గర బాబా ఎదురయ్యారు. గుఱ్ఱం దిగి నమస్కరించాను. 'గణూ, గోదావరీ జలం చేతబట్టి ప్రమాణం చేసినదెవరు?' అన్నారు. 'అలాగే చేస్తానుగదా!' అన్నాను. 'సరే వుండు, ఇలా చెబితే వినవులే!' అన్నారు బాబా. కొద్దికాలమైంది. ఒక నేరస్తుని నుండి వసూలు చేసిన జరిమానా పైకం నా సాటి పోలీసు కాజేసాడు. నాకు శిక్ష తప్పదు. ఈసారి శిక్ష తప్పితే తప్పక వుద్యోగం విడుస్తానని మ్రొక్కుకొని, శిక్ష తప్పగానే 1903లో రాజీనామా చేశాను. బాబా ఆ విషయం ప్రస్తావించినప్పుడల్లా, 'నీవు నాందేడులో వుండు' అనేవారు. 'నాకు భుక్తెలా?' అంటే, 'నేను పోషిస్తాను!' అనేవారు. కనుక నేను నాందేడులో స్థిరపడ్డాను. మొదట కీర్తనలే నాకు జీవనమయ్యాయి. తర్వాతొక భక్తుడు తక్కువ ధరకిచ్చిన పొలమే నాకు జీవనాధారమైంది."

సాయి విశ్వాసంలేని వారిని గూడ కష్టాలలో రక్షించి, భక్తిని ప్రసాదించి తర్వాత తమ సేవలోనే భుక్తి, ముక్తి ప్రసాదిస్తారు. ఆ తర్వాత దశ మహల్సాపతిలో చూస్తాము. అతడు బంగారుపని, తరతరాలుగా వంశాచారంగా వస్తున్న 'ఖండోబా' ఆలయంలో అర్చకత్వము చేసేవాడు. సాయి అతనిచేత బంగారు పని మాన్పించి అర్చకత్వము, భిక్ష చేయించారు. ఇంకా తర్వాత దశ ఉపాసనీ బాబా, అన్వర్‌ఖాన్ వంటి వారి జీవితాలలో చూడవచ్చు. ఇలా క్రమపద్ధతిన సాయి తన సద్భక్తుని ఉద్ధరిస్తారని తోస్తుంది. అయితే ఎక్కువ మందికి అంత స్థిరమైన మనస్సుండదు కనుక సాయివంటి సద్గురుసేవ దొరికినా కొంతకాలమయ్యాక దానిని విడచి, ఆయనపట్ల శ్రద్ధ కోల్పోతారు. ఆ విషయమే మామిడి పూతను ఉదాహరణగా చెప్పారు సాయి.

అయితే పరిపాకం రాకుండానే తనకై తానే యిల్లు, వాకిలి విడచిన హరిభావుఫన్సేను ఆయన మరలా యిల్లు చేర్చారు. పరిపాకం లేకుండా సన్యసించి భ్రష్టుడు కాబోయిన విజయానందునెలా మందలించి రక్షించినదీ చూచాము. సద్గురువు ఎవరినీ, వారి శక్తికి మించి ఆత్మపథంలోకి లాగజూడరు. అనివార్యంగా అనుభవించవలసిన కర్మఫలాన్ని సాధనంగా చేసుకొని వాళ్ళ పరిపాకాన్ని పెంచుతారు. అవసరమైతే దానినే తమ మందలింపుగా వినియోగిస్తారు. ఒక ఉదాహరణలో ప్రధానమైన ఆధ్యాత్మ జీవిత సూత్రాలన్నీ సాయి తెల్పారు. పూనాలో 1914లో ప్లేగు చెలరేగింది. దూబే అను భక్తుడు భయంతో శిరిడీ వస్తానని మ్రొక్కుకున్నాడు. కానీ తర్వాత మనసు మార్చుకొని సకుటుంబంగా 'సాసర్‌వాడ' వెళ్ళాడు. అక్కడ అతని పసిబిడ్డ ఆ వ్యాధితోనే మరణించింది. అతని భార్యగూడ తీవ్రంగా జబ్బుపడింది. నాటి రాత్రి సాయి దూబేకు స్వప్నదర్శనమిచ్చి, "మానవుడు మొక్కులు చెల్లించి తీరాలి. లేకుంటే యిలా బాధలొస్తాయి" అని చెప్పి, అతని భార్యకు నుదుట విభూతి పెట్టారు. వెంటనే దూబే నిద్రలేచి, తన భార్య నుదుట విభూతి చూచి ఆశ్చర్యపోయాడు.

★★★

★ ఆదివారం పారాయణ సమాప్తము ★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

★ సోమవారం పారాయణ ప్రారంభం ★

శ్రీ సాయి లీలామృతము



అధ్యాయము - 20

సాయి నాటిన కల్పవృక్షాలు

పండ్లను బట్టి చెట్టును విలువకట్టాలి. అలానే ఎందరిని పరిపూర్ణులుగా చేశారన్న దానిని బట్టి ఆ సద్గురువును తెలుసుకోవచ్చు. కాని, అందరికంటే గొప్ప సిద్ధపురుషుడు భగవంతుడే. ఆయన అన్ని మతాలకూ చెందిన ఎందరిని అనంతమైన కాలగతిలో తన ప్రతిరూపాలుగా చేసి భూమిపై ప్రతిష్టించాడో ఎవరు చెప్పగలరు? కాని ఆయన దీనికంతటికీ కర్తృత్వమెన్నడూ వహించరు. అన్నీ తానే చేస్తున్న సంగతి జీవులకు తెలియనివ్వరు. సద్గురువులలోకెల్ల అగ్రేసరులైన సాయిబాబా వలన ఎందరు పూర్ణ పురుషులయ్యారో స్పష్టంగా తెలియడంలేదు. ప్రొద్దు గ్రుంకినకొద్దీ నక్షత్రాలొక్కొక్కటే, ఆకాశంలో ప్రకటమైనట్లు, కాలం గడుస్తుంటే శ్రీసాయివలన పూర్ణులైన వారి సంగతులొక్కక్కటే బయటకొస్తున్నాయి. సాయి రెండవసారి శిరిడీకి వచ్చే ముందు గాడ్గీ మహరాజ్ అను సిద్ధపురుషుని రూపొందించిన విషయం చూచాము.

శ్రీ ఉపాసనీ బాబా :- పాండిత్యానికి, భక్తికీ ప్రఖ్యాతి చెందిన మహారాష్ట్ర బ్రాహ్మణ 'ఉపాసనీ' కుటుంబంలో మే 5, 1870న సట్నాలో జన్మించాడు కాశీనాథ్. బడి చదువులు విడచి కాలమంతా సంధ్యావందనం, యోగాభ్యాసము, విష్ణు సహస్రనామ పారాయణలో గడిపేవాడు. వివాహం చేశాక గూడ అతనిలో మార్పేలేదు. సరికదా ఒకనాడు ఇల్లు విడచి కాలినడకన నాసిక్ చేరాడు. రెండు నెలల తర్వాత తల్లికి జబ్బు చేసిందని తెలిసి, తిరిగివచ్చిన కొద్ది కాలానికే అతని భార్య, తల్లీ మరణించారు. పెద్దలు రెండవ వివాహం చేసినా మళ్ళీ ఇల్లు విడిచి వెళ్ళిపోయి, ఎన్నో కష్టాలోర్చి సాధు సాంగత్యం చేస్తుండేవాడు. తర్వాత మళ్ళీ స్వగ్రామమైన సట్నాకు వెళ్తుండగా ఒక అడవిలో ఒక కొండమీద గుహ కన్పించింది. అందులో కూర్చొని ప్రాయోపవేశం చేయదలచి ఒక పెద్దచెట్టు పైకెక్కి అందులో దూకాడు. అక్కడ నిరంతరం జపంచేస్తూ త్వరలో బాహ్యస్మృతి కోల్పోయాడు. ఒకనాడు మెలకువ వచ్చినపుడు ఒక దివ్యదర్శనమైంది. ప్రక్కన ఎవరో నిల్చొని అతని చర్మం వలుస్తున్నారు. భయపడి కళ్ళు తెరిచేసరికి ఎవరూలేరు. మళ్ళీ బాహ్యస్మృతి కలిగేసరికి విపరీతమైన దాహమేసింది. ప్రక్కనే వాననీరు చిన్న మడుగుకట్టివుంటే త్రాగి, వాటితో శరీరం తుడుచుకున్నాడు. నాల్గవరోజు మరో దర్శనమైంది. దప్పికతో తానొక కాలువ దగ్గరకెడుతున్నాడు. తనకొకవైపు ఒక ముస్లిం సాధువు, మరోవైపొక సన్యాసి వున్నారు. వారిద్దరూ అతడి పాత చర్మం తీసివేసి, లోపల బంగారం వంటి దేహమతనికి చూపి, "ఎందుకు చావయత్నిస్తావ్? మేము నిన్నెన్నటికీ చావనివ్వము!" అన్నారు. అప్పుడతడు గుహనుండి దిగి, జూలై 22, 1890న ఇల్లు చేరాడు. ఎన్నో నెలల తరబడి తాను సమాధి స్థితిలో వున్నట్లు తెలుసుకొన్నాడు.

ఒక సం॥లోగా అతని తండ్రి, తాత, రెండవ భార్య మరణించారు. కుటుంబం అప్పుల పాలయ్యేసరికి లోకమాన్య బాలగంగాధర తిలక్‌గారు ఆదుకున్నారు. తర్వాత అతడు వైద్యమభ్యసించి అమరావతిలో గొప్ప వైద్యుడై శ్రీమంతుడయ్యాడు. గాని వ్యాపారంలో అంతా నష్టపోయాడు. బంధువులు మూడవ వివాహం చేశాక ఆ దంపతులు యాత్రలు చేశారు. ఓంకారేశ్వర్‌లో అతడు తీవ్ర సమాధి స్థితిలోనుండగా భార్య భయపడి నీరుచల్లి మేల్కొలిపింది. అప్పటినుండి అతనికి గాలి పీల్చడమెంతో కష్టమయ్యేది. నిద్రపోతే శ్వాస నిలిచిపోయేది. ఏ

వైద్యానికీ ఆ బాధతగ్గలేదు. చివరకు యోగంలో వచ్చిన బాధను యోగపూర్ణులే తొలగించగలరని తలచి, భార్యను ఇంటవదలి, 1911లో అట్టివారిని వెదుకుతూ బయలుదేరాడు కాశీనాథ్.

అతడు రాహురిలో యోగి కులకర్ణిని దర్శిస్తే ఆయన, "నీవు మంచి స్థితిలో వున్నావు. నిన్ను సాయిబాబా మాత్రమే ఉద్ధరించగలరు" అన్నారు. కాని, సాయి "ముస్లిమ్" అని తలచి, వారిని దర్శించలేదు కాశీనాథ్. తర్వాత దారిలో ఒక వృద్ధుడు కన్పించి, "చన్నీరు త్రాగవద్దు, వేడినీరు మాత్రమే త్రాగు!" అని చెప్పాడు. అతడా మాట లెక్కపెట్టక, వేరొకచోట నీరు త్రాగడానికి కాలువకు వెళ్తుంటే ఆ వృద్ధుడే మళ్ళీ ఎదురై మందలించి, ప్రక్క గ్రామంలో వేడినీరు త్రాగమని ఆదేశించి అంతర్ధానమయ్యాడు! కాశీనాథుడు ఆశ్చర్యపడి అలానే చేశాడు. బాధ చాలావరకు తగ్గింది. తర్వాత అతడు ఖేడ్‌గాంబేట్‌లో దత్తావతారంగా ప్రసిద్ధికెక్కిన శ్రీ నారాయణ మహరాజ్‌ను దర్శించాడు. ఆయన అతనికి తాంబూలమిచ్చి, "నీవు లోపల, బయట బంగారం పూసినట్లు, మంచి యోగస్థితిలో వున్నావు. నీవు కోరదగినదేమీ లేదు" అన్నారు. అతని బాధ మాత్రం తగ్గలేదు. అతడు మరలా యోగి కులకర్ణిని దర్శించాడు. ఆయన వెనుకటి సలహానే యిచ్చాడు. గత్యంతరంలేక జూన్ 27, 1911న శిరిడీ చేరాడు కాశినాథ్.

రెండు రోజులు సాయి సన్నిధిలో వుండడంతోనే అతని బాధ మటుమాయమైంది! అయినా అతనికి 'ఫకీరు' సన్నిధి దుర్భరమనిపించి తిరిగి వెళ్ళడానికి అనుమతి కోరాడు. "నీవు వెళ్ళొద్దు; వెడితే 8వ రోజుకు రావాలి!" అన్నారు బాబా. ఆ మాట అతనికి నచ్చలేదు. అపుడు సాయి, "సరే, వెళ్ళు. నేను చేసేది చేస్తాను" అన్నారు. కాశీనాథుడు పట్టుదలతో ఎంత వేగంగా నడచినా, 8వ రోజుకు 20 మైళ్ళలోనున్న కోపర్గాము చేరాడు! అక్కడ ప్రథమంగా శిరిడీ పోతున్న భక్తులు బలవంతాన అతనిని తోడుగా తీసుకెళ్ళారు. సాయి అతణ్ణి చూస్తూనే నవ్వి, "నీవు వెళ్ళి ఎన్ని రోజులయింది?" అన్నారు. ఎనిమిది రోజులయిందన్నాడు కాశీనాథ్. అప్పుడతనిని వాడాలో వుండమని బాబా ఆజ్ఞాపించారు. ఈసారి అతడు ఆయన మాటకు తలవొగ్గాడు.

శిరిడీలో నిత్యమూ భక్తుల అనుభవాలు వినడంతో అతని మనస్సు క్రమంగా మారింది. ఒకరోజు బాబా అతనివైపు చూచి నవ్వుతూ భక్తులతో అన్నారు -- "ఒకప్పుడు ఒక స్త్రీ గర్భిణియై కొన్ని సం॥లయినా ప్రసవించలేదు. ఆమెను వేడినీరు మాత్రమే త్రాగమని చెప్పాను. ఆమె నా మాట లెక్కచేయక నీరు త్రాగడానికి ఒక కాలువకు వెళుతున్నది. ఆమె గర్భంలోని బిడ్డలు నశిస్తారేమోనని నేను ఆమెను మరలా మందలించాను. ప్రక్క గ్రామంలో వేడినీరు త్రాగాక ఆమెకు బాధ చాలావరకూ తగ్గింది" అన్నారు. తనకు రెండుసార్లూ దర్శనమిచ్చిన వృద్ధుడు ఆయనేనని గుర్తించి పులకించాడు కాశీనాథ్, తర్వాత బాబా, "కొన్నివేల సం॥లుగా మనిద్దరికీ ఋణానుబంధ మున్నది" అని, "ఒక బావి ప్రక్క చెట్టుమీద రెండు పక్షులుండేవి. ఒకటి బావిలో పడితే దానిని రక్షించడానికి రెండవది తన ప్రాణాలు తెగించవలసి వచ్చింది" అన్నారు. మాయలోబడిన శిష్యుని రక్షించడానికి సద్గురువు అవతరించవలసి వచ్చిందని వారి భావం గాబోలు! తర్వాత కాశీనాథ్‌తో, "ఎవరితోనూ సంబంధం లేకుండా మౌనంగా ఖండోబా ఆలయంలో 4 సం॥లుండు; ఖండోబా కృప లభిస్తుంది" అన్నారు బాబా.

రోజూ శ్రీ కాశీనాథ్ స్వయంగా వంట చేసుకొని, మొదట మశీదులో సాయికి నివేదించి, తర్వాత భోజనం చేసేవాడు. ఒకరోజు "నేనక్కడికి వస్తే నీవు గుర్తిస్తావా?" అన్నారు బాబా. అతడికేమీ అర్థంగాలేదు. ఒకరోజొక నల్లకుక్క అన్నంకోసం అతని వెంటపడింది. దానిని తరిమేసి నివేదనతో మశీదు చేరగానే సాయి, "ఇంతదూరం రానక్కరలేదు. నేనక్కడే వున్నాను. ఆ నల్లకుక్కను నేనే!" అన్నారు. మరొకసారి అతడు వంట చేస్తుంటే ఒక బిచ్చగాడు ఆశగా చూస్తున్నాడు. ఆచారవంతుడైన కాశీనాథ్ అతనిని తిట్టి వెళ్ళగొట్టాడు. సాయి ఆనాడు నివేదన అంగీకరించక, "అక్కడ హరిజనుడి రూపంలోనున్న నన్ను తిట్టావు. నీవెక్కడ చూస్తే, అక్కడే వున్నాను గుర్తుంచుకో!" అన్నారు.

అతడు సాయి చెప్పినది మరచి వేదాంతగోష్ఠి చేస్తుంటే ఆయన మందలించేవారు. ఇలా 3 సం॥లకు పైగా గడచింది. ఆ కాలంలో అతడెన్నో బాధలనుభవించాడు. ముక్కోపము, ఆత్మాభిమానమూ గలవాడేమో, ఈ బాధలు మరీ తీవ్రంగా వుండేవి. ఒకప్పుడు కొన్ని మాసాలు అన్న ద్వేషమనుభవించాడు. తుంటరులైన యువకులు ఆయనను ఎన్నోరీతుల బాధించేవారు. ఆ బాధలు భరించలేక అతడెన్నోసార్లు శిరిడీ వదలి వెళ్ళాలనుకున్నాడు. కాని సాయి వెళ్ళనివ్వలేదు. "నీవిప్పుడెంత ఓర్చుకొంటే నీ భవిష్యత్తు అంత ఉజ్జ్వలంగా వుంటుంది. నాలుగు సం॥లు యిక్కడుంటే నా స్థితే నీకూ కల్గుతుంది" అనేవారు. కాని అతడు సుమారు 3 1/2 సం॥లున్నాక సాయితో చెప్పకుండా భక్తులతో కలసి ఖరగ్‌పూర్ వెళ్ళిపోయాడు. కాని అప్పటికే అతనిలో యోగశక్తులు ప్రకటమయ్యేవి. ఉదాహరణకు, నెవాసా నుండి కొందరు భక్తులతో నరహరి సాయిని దర్శించాడు. కాని ఆయన ముస్లిమని శంకించాడు. వెంటనే సాయి అతనికేసి ఉరిమిచూచారు. అతడు బయటకు పోయి ఖండోబాలో ఉపాసనీ శాస్త్రికి నమస్కరించబోయాడు. ఆయన తనకాళ్ళు వెనక్కు తీసుకుని, "నీవు బ్రాహ్మణుడవు, సాయి ముస్లిమ్! నువ్వాయనకు నమస్కరించకూడదు! అటువంటప్పుడు నీతో నాకేమి పని?" అన్నారు. చివరకు ఆయన శిరిడీ దగ్గరున్న సాకోరిలో ఉపాసనీ బాబాగా స్థిరపడి, డిసెంబర్ 24, 1941న సమాధి చెందారు. శ్రీ సాయి ఆదేశించినట్లు ఆయన 4 సం॥లు పూర్తిగా శిరిడీలోనే వుంటే ఏమయ్యేదో!

సయ్యద్ జలాలుద్దీన్ : రెడ్‌హిల్స్ (తమిళనాడు) లో 'స్వామియార్'గా ప్రసిద్ధికెక్కిన యీ మహనీయుడు పెషావర్‌లో జన్మించి, కొంతకాలం సైన్యంలో పనిచేశారు. ఈయన ఉన్మత్తావస్థలోనున్న అవధూతగా 'రెడ్‌హిల్స్' లో వుండేవారు. ఈయన ఏ అంగట్లో తినుబండారాలు తీసుకున్నా వారికి ఆ వ్యాపారం అద్భుతంగా జరిగేది. ఒకరోజు ఆయన వీధివెంట వెడుతుంటే ఒక పిచ్చివాడు ఎదురయ్యాడు. ఆయన అతని చెంపమీద కొట్టారు. వెంటనే అతనికి పిచ్చి తగ్గిపోయింది. ఎందరెందరో రోగులు ఆయన దగ్గరకొచ్చేవారు. ఆయన ఒక్కసారి రోగికేసి తీవ్రంగా చూచి, ఏదో గొణుగుతూ ఆకాశంకేసి చూచేవారు. వెంటనే ఆ రోగం తగ్గవలసిందే!

ఆయన 1955లో బుదూర్ అనే గ్రామం వద్ద సర్వితోటలో నివసించారు. వర్షాలు లేవని రైతులు ప్రాధేయపడితే ఆయన ఆకాశంకేసి చూచి ఏమో గొణిగేవారు. కొద్దిసేపట్లో తృప్తిగా వర్షం పడేది. ఒకసారి 10 రోజులు వర్షం కురిసి, అంతా జలమయమై, ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఆయన సన్నిధిలోవున్న, రామానుజం శెట్టియార్, కాశీ, మునుస్వామి, ఘనశ్యామ్ సింగులు తమకు వేడి వేడి బిర్యానీ పెట్టించమన్నారు. ఆయన పకపకా నవ్వి ఆకాశంకేసి చూచారు. అంతలో కుటీరం ముందు ఒక జట్కా ఆగింది. ఇద్దరు వ్యక్తులు పెద్ద పాత్రనిండా వేడిగా నేతితో వండిన చికెన్ బిర్యానీ, అరటి ఆకులూ తెచ్చిపెట్టి, త్వరగా పాత్ర ఖాళీచేసివ్వమన్నారు. భక్తులు వివరమడుగుతే, "మేమెక్కడ నుంచి వస్తే మీకెందుకు? మీరు కోరినది లభించింది కదా?" అన్నారు. భక్తులు విస్తుపోయి, తృప్తిగా తిన్నారు. అలాగే టీ త్రాగే సమయమైంది. కుటీరంలో టీ పొడుము, చెక్కెర వున్నాయి గాని పాలులేవు. అనుకోగానే అకస్మాత్తుగా ఒక వ్యక్తి వచ్చి 2 లీటర్ల పాలుపోసి వెళ్ళిపోయాడు.

వీరిలో ఘనశ్యాంసింగ్ ప్రతిరోజూ అర్ధరాత్రి వరకూ ఆ ఫకీరుగారి సేవచేస్తుండేవాడు. జీవితాంతము బ్రహ్మచారిగా వారి సేవలోనే వుండాలని ఆశించాడు. ఒకరాత్రి ఆ ఫకీరు నవ్వి, "నీకు పెళ్ళవుతుంది. ముగ్గురు బిడ్డలు కల్గుతారు" అన్నారు. అలానే జరిగింది. అక్టోబరు 28, 1964 సాయంత్రం 7 గంటలకు ఆ ఫకీరు, "ఆవో జిబ్రాయిల్! ఏ మేరా ఆర్డర్ హై!" (దేవదూత అయిన ఓ జిబ్రాయిలూ, ఇటురా! ఇది నా ఆజ్ఞ!") అని పెద్దగా కేకలేశారు. ఇక 4 గంటలలో తాము సమాధి కాబోతున్నామని చెప్పారు. సరిగా 11-45 గం॥కు "అల్లాహో!" అని ఏడుసార్లు స్మరించి భగవంతునిలో ఐక్యమయ్యారు.

ఒకరోజు ఈ ఫకీరును, "మీ గురువెవరు" అని అడిగాడు ఘనశ్యామ్. 'రేపు చెబుతా'మన్నారు. మరుసటి ఉదయమే 8 గం॥లకు అతనిని బయటికెళ్ళి సూర్యుని చూడమని సైగ చేశారు. చూడగా ఆ బింబంలో 5 ని॥లపాటు ద్వారకామాయిలో కూర్చున్న సాయిబాబా ముఖం దర్శనమిచ్చింది. ఆశ్చర్యంతో ప్రణమిల్లిన ఘనశ్యామ్‌కు, "నిన్నటి నీ ప్రశ్నకు సమాధానమిదే" అన్నట్లు చిన్న సైగచేసి నవ్వారా ఫకీరు!

శ్రీరామ మారుతీ మహరాజ్ : సం॥1910లో ఒకరోజు బొంబాయి నుండి వచ్చిన త్రయంబకరావు, కులకర్ణి, మార్తాండ్ మొ॥న భక్తులతో సాయి, "రేపు మాకు పర్వదినం దీపావళి!" అన్నారు. మరురోజుదయమే ఆయనెంతో సంతోషంగా, "ఈ రోజు నన్ను చూడడానికి నా తమ్ముడొస్తున్నాడు. ఒకప్పుడు మా యిద్దరి భార్యల మధ్య తగువొచ్చింది మేము వేరుగా వుంటున్నాం." అన్నారు. మధ్యాహ్నం ఆరతికి ముందు నానాచందోర్కర్‌తో, "మారుతి వస్తున్నాడు!' ' అన్నారు. ఆరతి ప్రారంభమైన కొద్దిసేపట్లో ఠాణే నుండి తమ భక్తులతో కలసి శ్రీరామ్ మారుతీ మహరాజ్ అను మహనీయుడొచ్చారు. వెంటనే సాయి ఆరతి ఆపించి, తమ సోదరుని చూచి తమ చెంతకు రమ్మనట్లు నవ్వారు. తండ్రి దగ్గరకు బిడ్డలాగా రామమారుతి పరుగున వెళ్ళి సాయిని కౌగలించుకొని, ముద్దు పెట్టుకున్నారు. వారు ఒకరిచేతులొకరు ఎంతో ఆప్యాయంగా పట్టుకుని కూర్చున్నారు. తర్వాత ఆరతి కొనసాగించమని సాయి ఆదేశించారు. ఆరతి అయ్యాక ఆ మహనీయుడు ఖండోబాకు వెళ్ళి అక్కడ నివసిస్తున్న ఉపాసనీ శాస్త్రితో, 'రామునిసేవ విడువకు!' అని చెప్పారు. అక్కడ తమ భక్తులతో సాయికి నైవేద్యంగా 'శీరా' (రవ్వకేసరి) తయారు చేయించారు. ఈలోగా బాబావద్దకు భక్తులెందరో తమ నైవేద్యాలను తెచ్చి సమర్పించారు. "ఉండండి, ఈరోజు మొదట నా తమ్ముడిచ్చే నైవేద్యం తీసుకోవాలి" అని కొద్దిసేపు వేచియున్నారు బాబా. అది రాగానే ఎంతో సంతోషంగా దానిని కొంచెం తిని, తర్వాత మిగిలిన నైవేద్యాలు తీసుకున్నారు. నాటి మధ్యాహ్నము, సాయంత్రం చావడి ఉత్సవంలోనూ ఆ మహాత్మున్ని తమ చెంతనే వుంచుకుని రాత్రి మాత్రం ఆయనను ఖండోబాలో నిద్రించమని పంపించారు సాయి. ఈ రీతిన తన తమ్ముని 14 రోజులు తమ చెంతనుంచుకుని పంపించారు సాయి.

శ్రీరామ మారుతీ మహరాజ్ శ్రీ బాలముకుందస్వామిని గురువుగా ఆశ్రయించినా, తమ పరాత్పర గురువు సాయినాథుడేనని చెప్పేవారు. తాననుసరించిన నాథ సాంప్రదాయానికి ఆదిపురుషుడైన ఆదినాథుడే సాయి నాథుడనేవారు. వీరు సెప్టెంబరు 28, 1918న మహాసమాధి చెందారు. బహుశః ఎన్నో జన్మలుగా తమ శిష్యుడిగా వుంటున్న మారుతీ మహరాజ్ ఈ జన్మలో వేరొక గురువునాశ్రయించడాన్నే "వారి భార్యల (మనస్సుల) తగవు" గా సాయి అభివర్ణించారేమో!

శ్రీ శాంతావన్‌జీ మహరాజ్ : వీరు గుజరాత్‌లో గొప్ప మహనీయులు. వీరు సాధకదశలో చాలాకాలం హిమాలయాలలో వుండి తర్వాత గంగాతీరంలో బ్రహ్మచారిగా 30 సం॥లు తీవ్రమైన గాయత్రీ ఉపాసనలో గడిపారు. వారొకసారి తమ అనుభవమొకటి చెప్పారు. "నేనొకప్పుడు పాలనపురం వద్ద బలరామ క్షేత్రంలో గాయత్రి సాధన చేస్తున్నాను. ఒకసారి మనస్సెంతకూ ఏకాగ్రమవలేదన్న నిరాశతో నదిలో దూకి ఆత్మహత్య చేసుకోదలచాను. ఒక శివ మందిరంలో దేవిని ప్రార్థించి, గాయత్రిని స్మరించి నదిలో దూకబోతుండగా ఒక ఫకీరు నావద్దకొచ్చారు. ఎంతో తేజోవంతమైన కళ్ళు, గడ్డముగల ఆయనెంతో మధురంగా నవ్వుతూ వచ్చి నా చేయి పట్టుకొని తమవెంట రమ్మన్నారు. నేను మంత్ర ముగ్ధుడనై వారి వెనుకనే నడచాను. వారు నాకు 'కలోల్' గ్రామానికి టికెట్టు యిచ్చి అకస్మాత్తుగా అదృశ్యమయ్యారు. ఆయనెవరో నాకర్థంగాలేదు. కొంతకాలం తర్వాత నేను తరచూ హిమాలయాలకు వెళ్ళి, చివరకు నర్మదాతీరంలోని 'కరణాలీ' లో స్థిరపడ్డాను. పై దర్శనమైన 30 సం॥ల తర్వాత 1976లో సూరత్‌లోని సాయిబాబా మందిరంలో దత్త జయంతికి గాయత్రి యజ్ఞము చేయమని నన్ను భక్తులాహ్వానించారు. నేనంతవరకూ

ఏ సాయిబాబా మందిరమూ చూడలేదు. అక్కడొక రాత్రి బాబా స్పష్టంగా కలలో కనిపించి, 'నన్ను మరిచి పోయావా? 30 సం॥ల క్రిందట బలరామక్షేత్రంలో నదిలో దూకి ఆత్మహత్య చేసుకోబోతుంటే నిన్ను రక్షించినదెవరు?' అన్నారు. నాకెంతో ఆనందం కల్గింది. మరురోజు నేను ధ్యానానికి కూర్చోగానే గాయత్రీదేవి బదులు నాకు సాయిబాబా దర్శనమిచ్చి ప్రగాఢమైన ఆనందమనుగ్రహించారు. మరింత భక్తి శ్రద్ధలతో ఆ మందిరంలో సాయిపూజ, గాయత్రీ యజ్ఞమూ ముగించాను.

గజానన్ మహరాజ్ : గజానన్ పట్వేకర్ అను యువకునికి 8వ యేట ఉపనయనం చేశాక, అతని పినతండ్రి అతనికి మహనీయుల దర్శనము, ఆశీస్సులు యిప్పించడానికి అతనిని షహపూర్ వద్ద నది ఒడ్డున వున్న ఉదుంబరవృక్షం క్రింద విడిదిచేసిన ముగ్గురు సాధువులవద్దకు తీసుకువెళ్ళి, వారికి నమస్కారం చేయించాడు. వారిలో ఒకరు గురుకృప వలన పట్వేకర్, మహనీయుడు అవుతాడని ఆశీర్వదించారు. తర్వాత అతని కుటుంబానికి సుపరిచితుడైన నానాచందోర్కర్ శిరిడీ దర్శించినపుడు బాబా, "నీ మిత్రుని కొడుకు గజానన్ నన్ను షహపూర్‌లో నది ఒడ్డునున్న ఉదుంబర వృక్షంక్రింద దర్శించుకున్నాడు. నేనపుడతనిని ఆశీర్వదించాను. అపుడు నాతోకూడా గురుసిద్ధారూఢులు (హుబ్లీ), కళ్యాణ్ నివాసియైన రామ్ మారుతీ స్వామికూడ వున్నారు. నీవుగూడ అవకాశమున్న ప్పుడల్లా అక్కడ నదిలో స్నానంచేసి అచటి నా స్థానాన్ని గూడ దర్శించుకో!" అని చెప్పి పట్వేకర్‌కు ప్రసాదంగా పాలకోవా పంపారు.

ఆ మాటవిని ఆశ్చర్యపోయాడు నానాచందోర్కర్. తరువాత అతడు హేమాద్‌పంత్‌తో కలిసి మళ్ళీ శిరిడీ వెళ్ళినపుడు సాయి, "మీ గజానన్ ఆ మారుతి ఆలయంలో యింకెంతకాలముంటాడు?" అన్నారు. తర్వాత హేమాద్పంతు, "సాయి సచ్చరిత్ర" ప్రతిని షహపూర్‌లోని ఆ ఉదుంబర వృక్షంక్రింద వుంచి పూజించాడు. అంగోన్‌కవాడ్‌కు చెందిన సఖారం మహరాజ్, గాడ్గే మహరాజ్ మొ॥న మహాత్ములు గూడ ఆ చెట్టుక్రింద తపస్సు చేసుకున్నారు. తర్వాత సాయి చెప్పినట్లే గజానన్ పట్వేకర్ ఎందరో మహనీయులను దర్శించి, రత్నగిరి జిల్లాలోని పటగాం నివాసియైన శ్రీ దాదా మహరాజ్ అను మహనీయుని అనుగ్రహానికి పాత్రుడై, తర్వాత గజానన్ మహరాజ్‌గా ప్రసిద్ధికెక్కాడు. అలనాడు సాయితో కలిసి ఆ వృక్షంక్రింద అతనికి దర్శనమిచ్చిన రామ్‌మారుతీ మహరాజ్ సాక్షాత్తూ మారుతియేనని చెప్పి, అక్కల్‌కోట స్వామిగూడ కొందరు భక్తులను వారి దర్శనానికి పంపేవారు. ఈ రామమారుతి మహరాజ్ తమ భక్తులతో శ్రీ గురుసిద్ధారూఢులు, శ్రీ సాయిబాబా వేరుకాదని తెల్పే ఎన్నో అనుభవాలు చెబుతుండేవారు.

ఇమాంభాయి చోటేఖాన్ అనే భక్తుడిలా అన్నాడు : "నాకు తెలిసిన ఇద్దరు ముస్లిములు బాబావల్ల ఉద్ధరింపబడ్డారు. మా ఊరికి చెందిన షేక్ అబ్దుల్లాతో బాబా, "మనమీ రోజు చనిపోయినా, మామూలుగానే మూడవ రోజు గూడ గడిచిపోతుంది. ఇల్లు, భూమి మొ॥న వాటివల్ల ఏమిటి ప్రయోజనం?' అన్నారు. షేక్ అబ్దుల్లా స్వగ్రామానికి తిరిగొచ్చి, తన ఇల్లూ-వాకిలీ భార్యాబిడ్డలకు అప్పగించి వీధులలోనూ, మహాత్ముల సమాధుల దగ్గర కాలం గడుపుతూ, ఎప్పుడూ తనలో తాను గొణుక్కుంటూండేవాడు. అడగకుండా ఎవరైనా పెడితేనే తినేవాడు. అతనికి 12 సం॥లలో అద్భుత శక్తులు ప్రాప్తించాయి. ఒకప్పుడు నేను ప్రయాణమవుతుంటే నన్ను వెళ్ళవద్దని, ఒకచోట పాము తారసిల్లుతుందన్నాడు. అది పగలు కావడాన నేనతని మాట వినలేదు. అతడు చెప్పినచోట పాము కనిపించింది. మరోసారి అతనితో మావూళ్ళో బీడీలమ్ముకొనే అబ్బాసేట్, 'భార్యాబిడ్డలను విడిచి ఎందుకు పిచ్చివాడిలా తిరుగుతావ్?' అన్నాడు. 'నీకే తెలుస్తుందిలే!' అన్నాడు అబ్దుల్లా. అబ్బాస్ మళ్ళీ అట్లానే అన్నాడు. అతనివైపుకు అదృశ్య వస్తువు విసిరినట్లు తన పిడికిలి విసిరి, 'నువ్వూ అలాగే అవుగాక!' అన్నాడు అబ్దుల్లా. అబ్బాసేట్

అ క్షణంలోనే యిల్లు, వ్యాపారము విడిచి, పిచ్చివాడై వీధులపాలైనాడు.

భోపాల్‌నుండి అన్వర్‌ఖాన్ అనే వ్యక్తి ఒకప్పుడు శిరిడీవచ్చి చావడిలో 12 మాసాలున్నాడు. అతడు తనకు సంసారం వద్దన్నాడు. ఖురాన్ మొదటి అధ్యాయంలోని ఒక వాక్యాన్ని అర్ధరాత్రి 101 సార్లు జపించమని 'దరూద్' అనే అధ్యాయం పఠించమనీ కూడ సాయి చెప్పారు. తర్వాత బాబా అతనికి పాలకోవా ప్రసాదంగా యిచ్చి, అరేబియాలోని బాగ్దాదు నగరానికి పొమ్మని ఆదేశించారు. అతను బొంబాయి చేరేసరికి అక్కడ ఖాసిం అను శ్రీమంతుడొకడు చిత్రంగా అన్వర్‌ఖాన్ అరేబియా వెళ్ళే ఏర్పాట్లు చేశాడు. అతడు మరెప్పుడూ తిరిగి రాలేదు.

హీడాబేగ్ అను భక్తుడు సాయిని దర్శించాడు. అప్పుడు ఢిల్లీనుంచి యాకూబ్ అనే మౌల్వీగూడ శిరిడీవచ్చి, అహర్నిశలూ ఖురాన్ పారాయణ చేస్తుండేవాడు. సాయి ఒకరోజు రాత్రి 3గంIIలకు హీడాబేగ్‌తో, 'నువ్విక్కడుండ వద్దు. కణాడ్ సమీపంలోని కంటోన్మెంట్ దగ్గరుండు. నీపేరు 'పంజాబ్ షా' అన్నారు. ఇతడు కణాడ్‌లో గొప్ప హకీమ్‌గా పేరుపొందాడు''.

★★★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము



అధ్యాయము - 21

కాలాని కప్పల

బాబా కీర్తి 1914 నాటికి అన్నిదిక్కులా వ్యాపించి ఉదయసూర్యుని శోభలా నానాటికీ వృద్ధి చెందుతున్నది. ఎందరెందరో భక్తులు శిరిడీ వచ్చిపోతున్నారు. కాని బాబా శిరిడీ వచ్చిన మొదటి రోజుల్లోనే, "ఇక్కడ పెద్ద భవనాలు లేస్తాయి. పెద్ద పెద్ద వారొస్తారు. వైభవంగా ఊరేగింపులు జరుగుతాయి. గుఱ్ఱము, రథము గూడ వస్తాయి" అన్నారు. ఆ 'పిచ్చిఫకీరు' ఆలోచనలకు అందరూ నవ్వుకున్నారుగాని, 1914 నాటికి యివన్నీ నిజాలయ్యాయి. ఒకరోజు జోగ్ భార్యకు ఊరి బయట వేపచెట్టు ప్రక్కనున్న జాగా చూపి, "ఇది మా స్థలము. ఇక్కడొక భవనం లేస్తుంది. మేమక్కడే వుంటాము. పెద్దలు నన్నక్కడ కనిపెట్టుకొని సేవలు చేస్తారు" అన్నారు. ఆమెకు ఆ మాటలు అర్థం కాలేదు.

బాబా అప్పుడప్పుడు ఉబ్బసంతో బాధపడుతుండేవారు. అది వచ్చినప్పుడు ఆయన ఆహారం గూడ తీసుకోలేకపోయేవారు. సంకల్పమాత్రాన భక్తుల వ్యాధులు తగ్గించగల ఆయనలా బాధపడడం చిత్రమే. అనుభవించి తీరవలసిన కర్మఫలాన్ని భక్తులు అనుభవించలేనప్పుడు వారి జబ్బులు ఆయన స్వీకరించేవారు. **భక్తులపై తమకుగల ప్రేమను వారికలా తెలిపి, వారి భక్తిశ్రద్ధలను బలపరచి, ఆయన ఉద్ధరిస్తారు.** అయినా ఆయన ఆ బాధలు అనుభవిస్తున్నప్పుడు చూచిన భక్తుల ఆందోళన, నిస్సహాయతలు వాళ్ళల్లోని మానవత్వాన్ని పెంచుతాయి. అంటే వారి యొక్క అస్వస్థత గూడ భక్తులకు శిక్షణే. సం॥ 1915లో ఆయనలా బాధపడుతుంటే చూడలేక పురందరే ఏడ్చేసాడు. సాయి, "ఎందుకేడుస్తావు? మూడునాల్గు రోజులలో తగ్గిపోతుంది, రెండురోజుల క్రిందటే నిన్ను రమ్మని వ్రాయమని కాకాతో చెప్పాను" అన్నారు. నిజానికతను వ్రాసే లోపలే "నీవు వ్రాయవద్దు. అతడే వస్తున్నాడు" అన్నారు బాబా. సరిగా అప్పుడే అక్కడ పురందరే హృదయంలో శిరిడీ వెళ్ళాలన్న ప్రేరణ కల్గింది. తర్వాత ఆయన చెప్పినట్లే ఆ బాధ తగ్గిపోయింది.

బాబా తమకు జబ్బుచేసినపుడు సామాన్యంగా మందు, భిక్ష తీసుకొనేవారుగాదు. అయినా ఆ భిక్షపై జీవించే జీవులకోసం ఆయన విధిగా భిక్షకెళ్ళేవారు. నడవలేనప్పుడు తమను పట్టుకొని భిక్షకు, లెండీకి తీసుకెళ్ళమనేవారు. అయినా వారిలో దైన్యము, అసహాయతా కన్పించేవిగావు. ఒకసారి ఒక భక్తుడు ఒక చక్రాల కుర్చీ సమర్పించాడు గాని, ఆయన దానినెన్నడూ వాడలేదు. అరుదుగా ఆయనే చికిత్స చేసుకొనేవారు. ఒకసారి కండ్లకలక వస్తే, మిరియాలు నీటిలోనూరి ఆ ముద్దను కళ్ళల్లో పెట్టుకున్నారు. త్వరలో ఆ బాధ తగ్గిపోయింది. ఒక్కొక్కప్పుడు మలబద్ధకానికి సోనాముఖీ కషాయం కాచి భక్తులకిచ్చి సాయిగూడ సేవించేవారు.

సం॥ 1916 లో ఒక వింత జరిగింది. విజయదశమికి వచ్చిన భక్తులతో శిరిడీ వీధులు కిటకిటలాడుతున్నాయి. నాటి సాయంత్రం అందరూ పూజాద్రవ్యాలు తీసుకొని, మేళతాళాలతో ఊరి పొలిమేరకు వెళ్ళి సీమోల్లంఘనము పూజచేసి వస్తున్నారు. పూర్వం రాజులు ఆ రోజున దిగ్విజయానికి బయలుదేరి పొలిమేరలు దాటేవారని చెబుతారు. అందరూ శమీపత్రము, ఆలింగన, నమస్కారాలు యిచ్చి పుచ్చుకొని, పాతద్వేషాలు మరచి నాటినుండి పరస్పరం

ప్రేమభావం వహిస్తారు. అలా సీమోల్లంఘనం చేసి అందరూ తిరిగి వస్తూండగా బాబా ఉగ్రులై తమ తలకున్న రుమాలు, కఫ్నీ, లంగోటా తీసి ధునిలో పారేసి, అగ్నికణాలవంటి కళ్ళతో మసీదు ముంగిట నగ్నంగా నుంచున్నారు. వారిలో ఒక దివ్యమైన వర్చస్సు ప్రస్ఫుటమైంది. "మూఢులారా! ఇప్పుడు చూచి నేను హిందువునో, ముస్లింనో తేల్చుకోండి!" అని కేకలేశారు. అందరూ భయపడిపోయారు. చివరకు కుష్ఠురోగి భాగోజీ సాహసించి ఆయన నడుముకు లంగోటా చుట్టి, "బాబా, శుభమా అని సీమోల్లంఘనం జరుగుతూంటే మీరెందుకిలా భక్తులను భయపెడతారు?" అన్నాడు. కాని సాయి సట్కా నేలకేసికొడుతూ, "ఈ దినమే నా సీమోల్లంఘనం!" అని కేకలేశారు. ఆ మాటలెవరికీ అర్థంగాలేదు. నాడు చావడి ఉత్సవం జరుగదని భక్తులు తలచారు. కాని కొంతసేపటికి బాబా శాంతించి, గుడ్డలు ధరించి తమ ఆసనంపై కూర్చున్నారు. రాత్రి 11 గంటలకు జరిగిన చావడి ఉత్సవంలో మామూలుగా పాల్గొన్నారు.

తర్వాత కొద్దికాలానికి, స్థానిక భక్తుడు రామచంద్రపాటిల్‌కు జబ్బుచేసి, ఎన్ని చికిత్సలు చేసినా తగ్గలేదు. అతడు భయంతో సాయిని స్మరిస్తున్నాడు. ఒకరాత్రి అతనికి బాబా సాక్షాత్కరించారు. ఆయన పాదాలపై బడి, తన అంతిమ ఘడియ యెప్పుడో తెల్పమని పాటిల్ కోరాడు. "భయం లేదు. మృత్యుదేవత ఉత్తర్వు రద్దయింది. త్వరలో నీ జబ్బు తగ్గుతుంది. కాని నాకు తాత్యా గురించే ఆందోళనగా వున్నది. అతడు సం॥ 1918, విజయదశమి రోజున మరణించవలసివున్నది. ఈ సంగతి ఎవరికీ చెప్పవద్దు" అన్నారు బాబా. రామచంద్ర పాటిల్ కొద్దిరోజులలో కోలుకొన్నాడు. గాని, తాత్యా గురించి కలత చెంది, ఆ విషయం బాలాషింపీకి మాత్రం చెప్పాడు.

బాబా తాము సంకల్పించిన కార్యాలు నెరవేర్చమని ఎవరినీ అర్థించరు, ఆజ్ఞాపించరు. భగవంతుడే ఆయన యజమాని. ఆయన ఎవరినర్థించాలి? అంతటా నిండిన అన్ని జీవుల చైతన్యమే ఆయన గనుక, ఆయన సంకల్పమే వ్యక్తుల మనస్సులను, పరిస్థితులనూ ఆదేశించి నెరవేర్చేది. నాగపూర్‌కు చెందిన కోటీశ్వరుడు బాపూసాహెబ్ బూటీ ఒకనాడు సిద్ధపురుషుడైన హజ్రత్ తాజుద్దీన్ బాబా గారిని దర్శించాడు. ఆయన "నీవిక్కడికెందుకొచ్చావ్? నీ గురువు శిరిడీలో నీకోసం వేచియున్నాడు, త్వరగా వెళ్ళు!" అన్నారు. అతడు త్వరలో సాయిని దర్శించి ఆయన దివ్య మహిమకు మంత్రముగ్ధుడై, తరచూ శిరిడీలో ఎక్కువ కాలముండసాగాడు. కనుక అక్కడే ఒక భవనం నిర్మించుకోదలచాడు. అతడు ఒక రాత్రి దీక్షిత్ వాడాలో నిద్రిస్తుంటే కలలో బాబా కన్పించి, శిరిడీలో ఒక భవనము, అందులో ఒక పూజామందిరమూ నిర్మించమని ఆజ్ఞాపించారు. అతడికి మెలకువ వచ్చి చూచేసరికి, ప్రక్కనే శ్యామా కలవరిస్తూ కన్నీరు కారుస్తున్నాడు. నిద్రలేపి, కారణమడిగితే, "స్వప్నంలో బాబా కన్పించి, 'ఒక భవనము. మందిరమూ నిర్మించండి, నేనక్కడుండి అందరి కోరికలూ తీరుస్తాను!' అని స్పష్టంగా చెప్పారు. అందుకు నాకు భావోద్రేకం కలిగింది" అన్నాడు! శ్యామా, కాకాదీక్షిత్‌ల సహాయంతో ప్లాను గీయించి బాబా అనుమతి, ఆశీర్వచనమూ పొందాడు బూటీ. వెంటనే పని ప్రారంభమై త్వరగా క్రింది అంతస్థు పూర్తయింది. సాయి నిత్యమూ లెండీకి వెళ్ళి వచ్చేటప్పుడు తగిన సూచనలిస్తూ వుండేవారు. పూజామందిరములో మురళీధరుని ప్రతిష్ఠకు ఒక వేదిక నిర్మించాలన్నాడు బూటీ. బాబా, "అది పూర్తికాగానే అందులో నేనే వుంటాను. మనమందరమక్కడే ఆడుకొంటూ ఆలింగనం చేసుకుంటూ ఆనందంగా వుందాం" అని చిన్నగా నవ్వారు. ఆ క్షణమే పరమ పవిత్రమని టెంకాయకొట్టి పని ప్రారంభించారు. మురళీధరుని విగ్రహం చేయమని శిల్పులను నియమించారు. భవనం కట్టుబడి సక్రమంగా సాగుతున్నందుకు బూటీ పొంగిపోయాడు.

వేగంగా పెరిగిపోతున్న శిరిడీ వైభవం చూచి పారవశ్యంతో రోజులు పరుగెడుతున్నాయి. సం॥ 1918లో కొద్ది నెలలు గడిచాయి. తరచు శిరిడీ దర్శించే ఉద్ధవేశ్‌బువా, శ్రీమతి చంద్రాబాయిబోర్కర్‌లతో ఒకరోజు సాయి,

"ఇకనుంచీ మీరు శ్రమపడి తరచూ శిరిడీ రానక్కరలేదు" అన్నారు. కొన్నిరోజుల తరువాత బడేబాబా కుమారుడు కాశిమ్‌కు కోడి పలావు తినిపించి సాయి, "నీవు ఔరంగాబాద్‌లో ఫకీరు షంషుద్దీన్‌మియాను ఈ రూ. 250/-లతో 'మౌలు', 'కవ్వాలి', 'నియాజ్' జరిపించమను. తర్వాత ఫకీరు బన్నేమియా మెడలో నేనిచ్చే ఈ పూలమాల వేసి,- - "(ముస్లిముల పంచాంగంలో) 9వ నెలలో, 9వ రోజున అల్లాహ్ వెలిగించిన దీపం అల్లాహ్‌యే తీసుకుపోతారు, ఆయన దయ అలా వున్నది అని చెప్పు" అన్నారు. బాబా యిచ్చిన పైకము, పూలమాల తీసుకుని కాశిమ్, చోటేఖాన్, అమీర్‌లు ముగ్గురూ ఔరంగాబాదు చేరారు. స్టేషన్‌లో ఫకీరు షంషుద్దీన్ రైలువద్దకొచ్చి, "సాయి ఫకీరు వద్దనుండి వచ్చినదెవరు?" అని విచారిస్తున్నారు. వాళ్ళు నమస్కరించగానే వాళ్ళు చెప్పదలచిన వార్తగూడ ఆయనే చెప్పారు!! తర్వాత ఆ ఫకీరు ఆ ముగ్గురికీ తన ఇంట భోజనం పెట్టి, బాబా పంపిన పైకంతో అన్నదానము (నియాజ్), కవ్వాలీ, సంకీర్తనలు (మౌలు) విధిగా జరిపించారు. మరురోజు అందరూ బన్నేమియాగారి దగ్గరకు చేరారు. ఆయన ఒక చేయి ఆకాశంవైపు, రెండవ చేయి నేలవైపు చాచి నిశ్చేష్టులై నిలబడియున్నారు. అక్కడ అరేబియా నుండి వచ్చిన కొందరు భక్తులున్నారు. ఆ స్థితిలో ఆయనను పలుకరిస్తే ఆ ఫకీరు ఉగ్రులై మీదకొస్తారని వారు హెచ్చరించారు. కాని గంటయినా ఆయన మేల్కోలేదు. చివరకు ఆయన మెడలో మాలవేశాక వెంటనే మేల్కొని, పైనున్న చేతిని దించారు. సాయి పంపిన సందేశము విని కొద్దిక్షణాలు ఆకాశంవైపు చూచి కన్నీరు కార్చారు. ఆ ముగ్గురికీ దాని భావమేమో తెలియలేదు.

అక్టోబరు నెల ప్రవేశించింది. బాబా అంతకు కొద్దిరోజుల ముందు నుండే వాఝే అనే భక్తునిచేత రోజూ "రామ విజయం" అనే గ్రంథం నియమంగా చదివించుకొని విన్నారు. ఆరోజు బాబా భిక్షకు వెళ్ళారు. వారు తమ గురుప్రసాదమని ప్రాణప్రదంగా చూచుకొనే ఇటుక మశీదులో నేలపై నున్నది. నిత్యమూ దానికి మహల్సాపతి, కాశీరామ్ షింపీలు అభిషేకము, పూజచేసి, ధుని దగ్గరనున్న స్తంభం ప్రక్కన పెట్టేవారు. ఆనాడు మాధవ్ ఫస్లే మశీదు చిమ్ముతూ, దానిపై దుమ్ముపడకుండా చేతిలోకి తీసుకోగానే, అది జారి క్రిందపడి విరిగిపోయింది. సాయి కోపిస్తారని ఫస్లే భయంతో వణికిపోయాడు. కొద్దిసేపట్లో సాయి రానేవచ్చారు. విరిగిన యిటుక చూచి కోపించలేదు. దానిని చెక్కిలికి ఆనించుకొని కన్నీరు కారుస్తూ, "విరిగినది ఇటుక కాదు, నా ప్రారబ్ధం. ఇది నా జీవిత సహచరి, ప్రాణానికి ప్రాణం. దాని సహాయంతోనే నేను ఆత్మను ధ్యానించేది. అది విరిగిపోయింది, ఇక నేనెక్కువ కాలం జీవించను" అన్నారు. అప్పుడు బాబా అనుమతిస్తే ఆ రెండు ముక్కలనూ వెండి తీగతోగాని, లేక బంగారు తీగతోగాని కలిపి గట్టిగా చుట్టించి యిస్తానన్నాడు బూటీ. కాని బాబా అందుకు అంగీకరించలేదు.

అక్టోబరు 3న పురందరే, దీక్షితులు దర్శనానికి రాగానే, "నేను ముందు వెళ్తాను, మీరు వెనుక వస్తారు.", "నా సమాధి మాట్లాడుతుంది. నా మట్టి సమాధానం చెబుతుంది; నా నామం పలుకుతుంది" అని వెంటనే ఊదీ యిచ్చి, వారిని పంపివేశారు. ఆ మాటలెవరికీ అర్థంగాలేదు. కొద్ది రోజుల తర్వాత మహల్సాపతితో, "నేను యిక్కడ నుండి ఎక్కడికైనా వెళ్ళిపోతాను" అన్నారు.

నవరాత్రులు ఆరంభమవుతూనే తాత్యాకు భయంకరమైన జబ్బు చేసింది. అతడు మశీదుకు గూడ వెళ్ళలేకపోయాడు. బాబాకు గూడ తీవ్రంగా జ్వరమొచ్చి, రోజురోజుకీ ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. బూటీ వాడాను పావనం చేయకుండానే బాబా సమాధి అవుతారని భక్తులు భయపడ్డారు. అయినా ఆయన నిత్యమూ తాత్యాకు ఊదీ పంపేవారు. ఒకరోజు భోజనానికి అతనిని మశీదుకు రమ్మని పాయసం తినిపించారు. అతడెంతో కష్టపడి మ్రింగాడు. అప్పుడతని నొసట విభూతి పెట్టి, "తాత్యా! మొదట మనిద్దరి కోసం రెండు ఊయలలు తెప్పించాను. కాని మరలా మనస్సు మార్చుకున్నాను. నేను ఒక్కడినే వెళ్తున్నాను, నువ్వింటికి వెళ్ళు" అని అతనిని

పంపేశారు. ఇక్కడ 'ఊయల' అంటే సమాధి అని అర్థం. సాయి దృష్టిలో మృత్యువంటే తాత్కాలికమైన నిద్ర. జీవులు మరల జన్మించవలసిందేగదా! బయాజామామీ తన బిడ్డడైన తాత్యాను, సాయినీ సమానంగా చూచింది; కాదు, సాయినే ఎక్కువగా చూచుకొన్నది. అందుకని బాబా అతనిని తమ మరొక రూపంగా ప్రేమించారు. ఒకే ఆత్మ రెండు దేహాలుగా జీవించిన వారిద్దరూ మరణంలో గూడా విడిపోగూడదని బాబా తలచారు గాబోలు; కాని తాత్యా కుటుంబాన్ని తలచి తన సంకల్పాన్ని మరల మార్చుకున్నారు గాబోలు!

తాత్యా కంట తడిపెట్టి, "సాయీ! నన్నే ముందు పంపరాదా!" అన్నారు. "ఫకీరును, నేనుపోతే శోకించే వారెవరూలేరు. నీవుపోతే నీ వాళ్ళంతా దుఃఖిస్తారు" అన్నారు సాయి. "నేనుపోతే నా బంధువులే దుఃఖిస్తారు; మీరుపోతే ఎందరో దిక్కులేని వారవుతారు. మీరుంటే మీ దర్శనంతో ఎందరో తరిస్తారు! నా జీవితం నాకూ, సాటివారికీ గూడా బంధమే" అని వెక్కివెక్కి ఏడుస్తున్నాడు తాత్యా. "నోర్ముయ్, పో యింటికి' అని బాబా గద్దించి, అతణ్ణి పంపేసారు. కాలఫలకం మీద ఆయన తిరుగులేని శాసనం వ్రాసేసి, చెమ్మగిల్లిన కళ్ళతో యింటికి వెళుతున్న తాత్యాను చూస్తుండిపోయారు. ఇదంతా ప్రక్కనే పనిచేస్తున్న దామోదర్ విని కట్టలు తెంచుకొస్తున్న దుఃఖం అణుచుకొంటూ ప్రక్కకు పోయి కన్నీరు కారుస్తున్నాడు. తాను విన్నది మరొకరితో చెప్పలేడు, దాచుకోలేడు. సాయిని కన్నెత్తి చూడలేకున్నాడు. వెంటనే సాయి, "దామ్యా, ఎందుకురా ఏడుస్తావ్? బుద్ధిలేదూ, నాకు మరణమెక్కడిది? వూరుకో ఎవ్వరికీ చెప్పకు, జాగ్రత్త!" అని గద్దించారు.

ఆయన వాఝే అనే భక్తునిచేత 'రామవిజయం' వారం రోజులలో ఒకసారి, రెండవ వారంలో రెండుసార్లూ చదివించుకొని విన్నారు. అప్పుడతనికి ఒక కొబ్బరికాయ దక్షిణ యిచ్చారు. అప్పటి నుండి ఆయన యెక్కువసేపు మౌనంగా వుండసాగారు. ఆయన సాయంకాలపు సూర్యునిలా క్షీణిస్తున్నారు. మరీ నీరసించి లెండీకి, భిక్షకూ వెళ్ళడం మానేసారు. బూటీ, కాకా దీక్షిత్ ఎప్పుడూ ఆయన దగ్గరే వుంటున్నారు. విజయదశమి యింకా వారమున్నదనగా కొందరు ఫకీర్లు ఒక బండిమీద ఒక పులిని గొలుసులతో కట్టి మశీదువద్దకు తెచ్చారు. జబ్బుగావున్న పులిని ఒక సర్కస్ కంపెనీవద్ద చౌకగాకొని, గ్రామాలలో ప్రదర్శించి ఆ ఫకీర్లు డబ్బు సంపాదించుకుంటున్నారు. దాని జబ్బు తగ్గితే ఎక్కువ వెలకు దానిని సర్కస్‌వారే కొనవచ్చని వారి ఆశ. అదెంతో బాధతో గర్జిస్తుంటే చూచి సాయి, "పాపం దానిని అలా కట్టేసారేమి? విప్పండి దాని బాధ నేను తీరుస్తాను" అన్నారు. ముందు ఆ ఫకీర్లు భయపడ్డారుగాని, తర్వాత గంపెడాశతో దానిని విప్పారు. అది మెల్లగా బండి దిగి, మశీదు మెట్లెక్కి ఆయన ఎదుటకొచ్చింది. మంత్రముగ్ధయైనట్లు కొన్ని క్షణాలు తదేకంగా ఆయనను చూచి, వారి చూపులకు తట్టుకోలేక కాబోలు తలదించుకొన్నది. బాబా పాదాలు వాసన చూచింది. మూడుసార్లు తోకతో నేలనుకొట్టి, అక్కడే పడి ప్రాణం విడిచింది. అదెక్కడ పుట్టిందోగాని మహాభక్తునిలా సాయి పాదాల వద్ద శాశ్వతంగా దుఃఖనివృత్తి పొందింది. ఫకీర్లకు ఆ నష్టం కొంతైనా భర్తీ చెయ్యాలనో, ఆ రూపంలో వున్న ఆ భక్తుణ్ణి తమ చెంతకు చేర్చి మేలు చేసినందుకు బహుమానమోగాని, సాయి వారికి రూ. 50లు బహూకరించారు. ఆ మృగరాజు వలెనే సాయి మహరాజుగూడ, ఋణానుబంధం వలన తమపై ఆధారపడిన జీవులను అంతటి రోగబాధలోనూ పోషిస్తున్నారు. దానివలెనే ఆయన గూడ యిక విడుదల, విశ్రాంతి కోరడానికి చిహ్నమన్నట్లున్నది యీ సంఘటన.

విజయదశమికి నాలుగు రోజులున్నది. సాయి ఆనాడు నందూ మార్వాడి భార్యతో, "ద్వారకామాయిలోనూ, చావడిలోనూ వుండాలంటే నాకేమీ బాగుండలేదు. నేను బూటీవాడాకు పోతాను. అక్కడ నాకు పెద్ద పెద్ద వారు సేవలు చేస్తుంటారు" అన్నారు. బాబా రెండు రోజులకు సమాధి చెందుతారనగా భక్తులతో, "మీరెవరూ శోకించగూడదు" అని హెచ్చరిస్తున్నారు. అన్ని రోజులు అస్వస్థతగావున్నా ఒక్కసారి గూడ విశ్రమించలేదు. రోజంతా

కూర్చునే వుండేవారు.

అక్టోబరు 15, 1918న విజయదశమి, తెల్లవారేసరికి బాబా చాలా బలహీనంగా వున్నారు. అయినా దర్శనానికి వస్తున్న భక్తులను ఆదరిస్తూనే వున్నారు. ఇంతలో రామచంద్రపాటిల్, బాలాషింపీలు భయపడినట్లే తాత్యాకు నాడి బలహీనమవుతోందని కబురు వచ్చింది. మధ్యాహ్న ఆరతి కాగానే భక్తులందరినీ భోజనాలకు పంపారు బాబా. శ్రీమతి లక్ష్మీబాయి, భాగోజి, బయ్యాజి అప్పాకోతే పాటిల్, బాలాషింపీ, నిమోన్కర్, శ్యామాలు మాత్రం ఆయన దగ్గరే వుండిపోయారు. అపుడు బాబా, "నాకిక్కడ ఏమీ బాగాలేదు, ఆ 'దగడీవాడా' (రాతిమేడ, అంటే బూటీవాడా)కు తీసుకుపొండి. అక్కడ నాకు సుఖంగా వుంటుంది" అన్నారు. ఆయన ఆసనంమీద కూర్చొని మాధవ్‌ఫస్లేనడిగి 'పాన్' (తాంబూలం) తీసుకున్నారు. తర్వాత ఆయన మంచినీళ్ళు త్రాగుతుండగా మధ్యలో మ్రింగుడుపడక సగం నీరు బయటకు వచ్చి వారి కళ్ళు అర్థ నిమీలితాలయ్యాయి. అప్పుడాయన లక్ష్మీబాయిషిండేను పిలిచి మొదట 5, తర్వాత 4 రూపాయ నాణేలూ యిచ్చి, వాటిని జాగ్రత్తగా వుంచుకోమన్నారు. అబ్దుల్లాను వెంటనే రమ్మని కబురు చేశారు. అతడు కొద్దిసేపాగి వస్తానని కబురు చేశాడు. సాయి చిన్నగా నవ్వి, తమకు మశీదులో బాగుండలేదని, బూటీవాడాకు తీసుకెళ్తే బాగుంటుందనీ చెప్పి, బయ్యాజీ అప్పాకోతే పాటిల్ వైపుకు వొరిగి కన్నుమూసారు. భాగోజి అది గమనించి, నిమోన్కర్‌తో చెప్పాడు. అతడు సాయినోట్లో కొంచెం నీరుపోసి, అది బయటకు వచ్చేయడం చూచి అందరూ పెద్దగా ఏడ్చారు. ఆ కబురు వినగానే డాక్టరు పిళ్ళే బాబాకు నాడి చూచి కంట నీరుపెట్టాడు. సాయి శరీరం విడచారని వినగానే గ్రామస్థులు, భక్తులు హృదయవిదారకంగా శోకాలు పెడుతూ మశీదు చేరారు. క్షణంలో శిరిడీ యావత్తు జీవచ్ఛవమైంది. అబ్దుల్లా పరుగున అక్కడకు చేరి, తన దురదృష్టానికెంతో దుఃఖించాడు. భక్తులు నమస్కరించుకోడానికి వీలుగా బాబా శరీరాన్ని కూర్చోబెట్టారు. అక్కడకెందరు భక్తులు చేరారంటే, " ఆ రద్దీలో సుమారు 5 గంటల సేపు నాకు బాబా దేహాన్ని చూచే అవకాశమే కలుగలేదు" అంటాడు నృపతీ పాటిల్. బాబా శరీరం మీద లెక్కలేనన్ని పూలమాలలు, రాసులు రాసులుగా పువ్వులూ వేస్తున్నారు. ఎప్పుడూ భయము, దుఃఖము ఎరుగని నానావల్లీ గూడ ఆ రోజు కన్నీరు తుడుచుకుంటూ కొద్దిసేపు అక్కడ నిలబడి తర్వాత మారుతి ఆలయానికి వెళ్ళిపోయాడు. అప్పటినుండి 13 రోజులపాటు, "ఓ మామా! నీవులేక నేను బ్రతుకలేను. నేనూ వచ్చేస్తాను" అని శోకాలు పెడుతూ, అన్న పానీయాలు గూడ మాని సమాధి చెందాడు! మరో చిత్రం; సాయి నిర్యాణమైన కొద్ది గంటలలోనే తాత్యా ఆరోగ్యం బాగుపడింది.

సాయి కోరికననుసరించి వారి దేహాన్ని బూటీవాడాలో సమాధి చేయడానికి భక్తులు సిద్ధం చేస్తున్నారు. ఇంతలో కుశాల్‌చంద్ ఆధిపత్యాన కొందరు ముస్లిములు తమ మతానుసారం ఆ దేహాన్ని ఆరుబయట సమాధి చేయాలని పట్టుబట్టడంతో భక్తులలో వివాదం చెలరేగి ఎంతకూ తెగలేదు. చివరకు ఎక్కువమంది భక్తులు ఎలా కోరితే అలా చేయాలని పెద్దలు రెండు పక్షాలవారి సంతకాలు, వేలిముద్రలు సేకరిస్తే సాయి సంకల్పమే నెగ్గింది. బూటీవాడలో మురళీధరుని విగ్రహ ప్రతిష్ఠకని ఏర్పరచిన వేదికక్రింద సాయి దేహాన్ని 17వ తేదీన సమాధిచేసి, దానిపై వారి పటముంచారు. అంత్యక్రియలలో బాలాభాటే ప్రధాన పాత్ర వహించాడు. సాయికి గురుప్రసాదంగా లభించిన యిటుక విరిగింది గదా! దాని ముక్కలు రెండూ కలిపి వెండితీగతో కట్టి సమాధిలో బాబా తలక్రింద వుంచారు. అలానే బాబా దగ్గర ఎప్పుడూ ఒక చిన్నమూట వుండేది. ఆయన దానినెప్పుడూ ఎవరినీ ముట్టుకోనిచ్చేవారు గాదు. వారు మహాసమాధి చెందాక చూస్తే, అందులో వారికి కాశీరామ్ ఏనాడో సమర్పించుకున్న ఆకుపచ్చని పాత కఫ్నీ, టోపీ వున్నాయి. దానిని గూడ సమాధిలో వుంచారు. ఆరోజున భక్తులు రూ. 2400/- లు పోగుచేసి, భారీయెత్తున అన్న సంతర్పణ చేసారు.

బూటీవాడాలో తమను పెద్దలు సేవిస్తుంటారన్నారు బాబా. పెద్దలంటే శ్రీమంతులని తలచేటట్లయితే బూటీకంటే పెద్దలెవరుంటారు? మురళీధరునికని నిర్మించిన మందిరంలో బాబా దేహాన్ని సమాధి చెయ్యడంకంటే ఘనమైన సత్కారమేమున్నది? ఈనాటికీ కోటీశ్వరులెందరో శిరిడీలో వైభవంగా ఉత్సవాలు చేస్తున్నారు. కాని ధనానికి సాయిదృష్టిలో ధాన్యపు గింజకున్నంత విలువగూడ లేదు. కనుక పెద్దలంటే మహాత్ములని వారి భావం. రానున్న సాయి ____ ్యాణాన్ని షంసుద్దీన్, బన్నేమియా వంటి యోగులు ముందుగానే ఇస్లాం పద్ధతిలో గౌరవించారు. అలానే ఖాందేష్‌లో శ్రీ గురుగోవిందులనే మహాత్ముడుండేవారు. వీరు సాయికి గురుబంధువని వినికిడి. వీరికి 12-10-1918న తీవ్రంగా జ్వరమొచ్చింది. విజయదశమినాడు భక్తులతో ఆయన, "నేడు సాయి అనే దివ్యజ్యోతి చంద్రునిలో లీనం కాబోతున్నది" అన్నారు. భక్తుడు మదన్‌పాటిల్ తనకు తెలిసిన సాయి భక్తులందరికీ వెంటనే ఆ విషయం తెలిపాడు. సాయి సమాధి చెందారని వినగానే శ్రీ గురుగోవిందులు తమ శిష్యులందరినీ స్నానం చేయమన్నారు. ఈయన బాబాను, "ఆ గురుచంద్రులు" అనేవారు. ఎందరికో దైవ స్వరూపులుగా పూజింపబడిన మెహర్‌బాబా, స్వామి ముక్తానంద (గణేశ్‌పురి) వంటి ప్రముఖ సాధువులెందరో సాయి సమాధిని దర్శించారు. స్వామి పూర్ణానంద (శ్రీశైలం) గారితో వారి గురువు రాఖాడీబాబా, "శిరిడీలో ఒక సప్తాహం సాయిని సేవించి, ఆయన ప్రేరేపించినచోట ఆశ్రమవాసివై వుండు" అని ఆదేశించారు. ఇంకెందరో మహాత్ములు శిరిడీ రాకున్నా సాయిని సేవిస్తూనే వున్నారు. పెద్దపెద్దవారు తమను సేవిస్తుంటారని శ్రీ సాయి చెప్పినది ఈ విషయమే.

శరీరమే తామని భ్రమించే పామరులకు జనన మరణాలుంటాయి. మృత్యువుపై విజయం సాధించినవారే మహాత్ములు, సాయి సశరీరులుగా వున్నప్పుడే మనలా శరీర పరిమితులుగా ఎన్నడూ లేరు. అన్ని రూపాలలో వున్న పరమాత్మగా జీవించారు. అలాంటి వారికి మరణమెలా సంభవం?

భౌతిక శరీరంతో వున్నప్పుడే మృత్యువుపై సాయి విజయంతో యిదెంత సత్యమో భక్తులొకసారి చూచారు. ఆగష్టు 13, 1886వ సాయి తీవ్రమైన ఉబ్బసంతో బాధపడ్డారు. రాత్రి 10 గం॥లకు మహల్సాపతితో, "నేను అల్లాహ్ వద్దకు వెళ్తున్నాను. వస్తే మూడు రోజులలో వస్తాను. అలా రాకుంటే శరీరాన్ని ఆరుబయట పాతిపెట్టి, గుర్తుగా రెండు జండాలు పాతు" అని చెప్పి, అతని ఒడిలో ఒరిగిపోయారు. శ్వాస, నాడి నిలిచిపోయాయి. సాయి మరణించారని తలచి జనం గుమిగూడారు. ఆ ఊరి కరణం పంచాయితీగూడ జరిపించాడు. శవాన్ని యిక ఎక్కువ సమయముంచక అంత్యక్రియలు చేయాలని గ్రామస్తులు తొందరచేసారు. కాని మహల్సాపతి పట్టుబట్టి మూడు రోజులు సాయి తల తన ఒడిలో వుంచుకొని కూర్చున్నాడు. మరోవంక అంత్యక్రియలు తమ తమ మతానుసారం చేయాలని హిందువులు, ముస్లిములు పట్టుబట్టారు. ఘర్షణ తప్పదనుకొని ప్రక్క గ్రామాలవారు తమ పక్షాలను బలపరచుకోవాలని శిరిడీ చేరుకున్నారు. గ్రామాధికారికి దిక్కుతోచక పోలీసుపటేల్ ద్వారా అహ్మద్‌నగర్ జిల్లా కలెక్టరుకు కబురు చేశాడు. "విదేశీయులమయిన మేమేం చేసినా ప్రజలు ఉద్రిక్తులవుతారు. గ్రామపెద్దలే ఎలాగో చక్కబెట్టండి. కాని సాయి తిరిగి బ్రతికితే నాకు తెలుపండి దర్శిస్తాను, క్రీస్తుతప్ప మరెవ్వరూ మరణించాక తిరిగి జీవించలేదు" అన్నాడు కలెక్టర్.

గ్రామ పెద్దలు ఈ సంగతి ప్రజలకు తెల్పక యుక్తిగా, కలెక్టర్ ఏ క్షణాన్నైనా వచ్చి తగు చర్య తీసుకుంటారని, ఈలోగా త్వరపడి ఏమైనా చేస్తే శిక్షిస్తారనీ చెప్పారు. ఆగష్టు 16, 1886 తెల్లవారు ఝామున 3 గం॥లకు శరీరంలో నాడి, శ్వాస ప్రారంభమై కొద్దిసేపట్లో సాయి లేచారు! భక్తుల సంతోషము, ప్రజల ఆశ్చర్యము వర్ణనాతీతం! శ్యామా మాత్రం ఆయనను, "దేవా! ఎక్కడికి పోయావు, ఏం చేశావు?" అనడిగాడు. బాబా నవ్వి, "అల్లాహ్ వద్దకెళ్ళాను. మొదట నేను తిరిగి రాదలచలేదు! కాని అల్లాహ్, 'నీవు చేయవలసినదెంతో వున్నది. బెంగాల్‌లో గదాధర్ అనే

భక్తుడు నాలో కలవాలని ఆరాటపడుతున్నాడు. కాని అతని పుణ్యఫలం, అవతార కార్యం యింకా మిగిలాయి, నీవవి తీసుకొని అతనిని విడుదలచేసి, నీ స్థలానికి వెళ్ళు!' అన్నారు. నేనలానే చేసాను'' అన్నారు. ఆశ్చర్యంతో శ్యామాకు మాట పెగలలేదు. తెల్లవారుతూనే సాయి ఎప్పటిలా తమ నిత్యకృత్యానికుపక్రమించారు. ఖండయోగం సిద్ధించిన సాయికి యిది ఒక లెక్కా? ఈ వార్త తెలియగానే ఎందరోవచ్చి సాయిని దర్శించారు. వారిలో కలెక్టరొకడు. ఇంకో విశేషం. ఆ రోజు రాత్రి 1 గం॥ 2 ని॥లకే శ్రీరామకృష్ణ పరమహంస నిర్యాణమయ్యారు. వారి అసలు పేరు గదాధరుడు.

సమాధి చెందిన నాటి రాత్రి హనుమాన్ ప్రసాద్ జోషీ యింటి గోడకు తగిలించిన బాబాపటము అకస్మాత్తుగానూ, నిష్కారణంగానూ చాలాసేపు బాగా వూగింది. విలేపార్లేలోని మాధవరావ్ దీక్షిత్ అను భక్తునికి కలలో నాసిక్‌లోనున్న ఒక గొప్పయోగి మహాసమాధి చెందుతున్నట్లు కలవచ్చింది.

అస్తమించిన సూర్యుడు మరలా ఉదయించాడు! బాబా సమాధి చెందిన మరుసటి తెల్లవారుఝామునే పండరిపురంలో దాసగణుకు, స్వప్నంలో బాబా కన్పించి, "మశీదు కూలిపోయింది. నూనె వర్తకులు, యితర వర్తకులు నన్నెంతో వేధించారు. అందుకే ఆ చోటు విడచిపోయాను. ఆ విషయం చెప్పడానికే వచ్చాను. నీవు త్వరగా వెళ్ళి, నా సమాధిని పూలతోకప్పు!'' అన్నారు. తెల్లవారి శిరిడీనుంచి జాబు రానే వచ్చింది. అతను వెంటనే శిష్యులతో శిరిడీచేరి, సమాధి పూజ, ఏకాహము, అన్నదానము చేసాడు. సాయి ఆరోజే ఉదయం లక్ష్మణ్ మామా జోషీకి స్వప్నంలో కనిపించి, "నేను మరణించాననుకొని ఈ రోజు జోగ్ ఆరతివ్వడానికి రాడు. నీవు వచ్చి, పూజ, ఆరతి చెయ్యి'' అని చెప్పారు. అతడు వెంటనే వెళ్ళి సాయి దేహానికి ఆ సేవ జరిపించాడు. నాటి మధ్యాహ్నం మిగిలిన భక్తులతో కలసి జోగ్ సాయి దేహానికి పూజ, ఆరతి చేసాడు. బాబా చేతి వేళ్ళు తెరచి దక్షిణ అందులో పెట్టాడు. సమాధియైన 21 గం॥ల తర్వాత గూడ సాయి వేళ్ళు బిగిసిపోకుండా సులువుగా తెరిస్తే తెరుచు కున్నాయి. మళ్ళీ మూస్తే మూసుకున్నాయి. దశమినాటి రాత్రంతా బూటీవాడాలో సమాధి త్రవ్వుతున్నారు. బుధవారం సాయంత్రం బాబా శరీరాన్ని నాలుగు చక్రాలుగల ఒక వాహనంపై వుంచి, పైన అర్ధచంద్రాకృతిలో ఆచ్ఛాదన నేర్పాటుచేసి, గ్రామమంతా ఊరేగించి బూటీవాడాలోని హాలులో వుంచారు. సుమారు 36 గం॥ల తర్వాత గూడ సాయి శరీరం కొంచెం గూడ బిగవక కఫ్నీ విప్పడంగూడ ఎంతో తేలికగా వీలైంది, బుధవారం బాబా నోటివెంట కొద్ది రక్తమొచ్చింది.

బాబా సమాధియైన మరునాటి రాత్రి 12-30 గం॥లకు శ్రీమతి ప్రధాన్‌కు ఒక కల వచ్చింది. ఆయన సమాధి చెందుతుంటే చూచి, "బాబా చనిపోతున్నారు!''అని కేకలు పెడుతున్నది. అపుడు బాబా, "మహాత్ములు చనిపోరు. సమాధి అవుతారు'' అన్నారు. మరుక్షణమే ఆయన శరీరం నిశ్చలమైంది. అందరూ దుఃఖిస్తున్నారు. తెల్లవారేసరికి సాయి మహాసమాధి చెందిన వార్త అందింది.

మూడవరోజు తెల్లవారుఝామున యం. డబ్ల్యు. ప్రధాన్ వదినగారికి స్వప్నంలో బాబా కన్పించి, "మీ సంచిలోనున్న పీతాంబరం పంపి నా సమాధిపై కప్పించండి!'' అన్నారు. వెంటనే మెలకువ వచ్చి చాలా సం॥లుగా, వుతికిన ఒక పీతాంబరం వారి సంచిలో వున్న సంగతి జ్ఞాపకమొచ్చి, ఉదయమే దానిని శిరిడీ పంపారు. సం॥ 1923 వరకు తరచు దానినే బాబా సమాధిమీద కప్పేవారు. బాబాసమాధియైన తర్వాత 7వ రోజున ఉపాసనీబాబా కాశీ వెళ్ళి, 1100 మంది బ్రాహ్మణులచేత విశ్వేశ్వరునికి అభిషేకం చేయించి, వారందరికీ భోజనము, దక్షిణ, శాలువలు యిచ్చారు. బొంబాయి భక్తులు 13 వ రోజున హిందూపద్ధతిన రూ. 3000/- ల ఖర్చుతో 3 వేల మందికి పంచభక్ష్య పరమాన్నాలతో భోజనం పెట్టారు. తర్వాత మాసికము రోజున దాసగణు గూడ అంత వైభవంగానూ

చేసాడు. ఆ రోజునే సాయి మరో భక్తునికి స్వప్న దర్శనమిచ్చి, ఆ రోజు ప్రత్యేకపూజ, పేదలకు అన్నదానం చేయమని చెప్పగా, అతడా విధంగానే చేసాడు. త్రైమాసికమప్పుడు రూ. 5000/- ల ఖర్చుతో సంతర్పణ, వస్త్రదానములతో పాటు, ఆ కార్యం జరిపించిన బ్రాహ్మణులకు పట్టుబట్టలు, వెండి గ్లాసులు దానమిచ్చాడు దాసగణు. అప్పట్లో సాయి సంస్థానానికి దాసగణు అధ్యక్షుడుగా వున్నాడు.

★★★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 22



దైవం మానుషరూపేణ

దైవమెప్పుడవతరించినా ఆ రూపమెంతో విలక్షణంగా వుంటుంది. శ్రీరాముని రూపం పురుషులను గూడ సమ్మోహనపరచేదట. శ్రీకృష్ణుని జూచి సర్వజీవులూ తమను తామే మరచేవట. దత్తావతారమైన సాయిరూపం గూడా అలానే వుండేదిట. ఆయనను సగుణమేరునాయక్ తన్మయుడై కన్నార్పకుండా చూస్తూంటే సాయియే, "పిచ్చివానిలా అలా చూస్తావేమి?" అనేవారు. దేనిమీదా నిలువని మనస్సు సద్గురువు మీద నిలుస్తుంది. అదే ధ్యానమంటే. వారు మన మనస్సును, చిత్తాన్నీ - అంటే యితర ఆలోచనలూ హరిస్తారు. సాయికి తమ గురువు దగ్గర అలానే జరిగిందట.

"నేను ఆయన పాదాలొత్తాను. అవి చెప్పలేనంత మృదువుగా వున్నాయి. ఆయనెంతో ప్రసన్నంగా నవ్వారు. ఆ నవ్వు చూడడానికి శిరిడీలో ఎన్ని సంవత్సరాలైనా వేచి వుండవచ్చు. నేను పరవశించి పిచ్చివానిలా కన్నార్పకుండా చూస్తుండి పోయాను. ఆయనీరోజు భక్తులందరిపైనా యోగదృష్టి సారించారు. రోజంతా చెప్పలేని పారవశ్యంతో గడచిపోయింది. " అని ఖాపర్డే తన డైరీలో వ్రాసుకున్నాడు. "బాబాలో వర్ణించనలవిగాని ఆకర్షణ వుండేది. ఆయన చర్యలు, ముఖవర్చస్సూ చూస్తేనే ఆయన బ్రహ్మజ్ఞానియని తెలిసిపోతుండేది" అంటాడు నృపతీపాటిల్.

శ్రీ సాయిని దర్శించినప్పటి తన అనుభవం హేమాద్పంతు యిలా వ్రాశాడు. "నేను శిరిడీలో దిగేటప్పటికి తాత్యాసాహెబ్ నూల్కర్ మశీదు నుండి తిరిగివచ్చి, 'త్వరగా పద, భక్తులతో కలసి బాబా వాడా మలుపు వద్దకొచ్చారు. ఆయన లెండీకి వెళ్ళకముందే పాద నమస్కారం చేసుకొందాం' అన్నాడు. నేను త్వరగా బాబా వున్న చోటుకెళ్ళి ఆ మట్టిలోనే వారి పాదాలకు సాష్టాంగ నమస్కారం చేశాను. అప్పటి నా సంతోషానికి అవధులు లేవు. నానాసాహెబ్ చెప్పిన దానికంటేగూడ వారిలో ఎంతో ఎక్కువ గొప్పతనం కన్పించింది. వారి దర్శనమయినందుకు నా జన్మ ధన్యమైనదనిపించింది. వారిని చూస్తూనే నా కన్నులు చెమ్మగిల్లాయి, ఆకలి దప్పులు అదృశ్యమయ్యాయి. నా జ్ఞానేంద్రియాలు స్థిరంగా నిలబడిపోయాయి. సాయి పాదాలు తాకినమీదట నాకు కలిగిన అనుభూతి నా జీవితమంతటిలోకి మహాభాగ్యం. అప్పటినుండి నాకు కొత్త జీవితం ఆరంభమైంది. నా మనస్సులోని సందేహాలన్నీ నశించాయి. అవధులులేని ఆనందం కట్టలు తెంచుకున్నది. సాయి సన్నిధి మన మనస్సు యొక్క స్థితిని మార్చివేస్తుంది. గత జీవిత స్థితులు అంతరించిపోయి, ఇంద్రియ విషయాలపట్ల క్రమంగా వైరాగ్యముదయిస్తుంది. కేవలం వారి దర్శనం వలన నేనెంతో పవిత్రుడనయ్యాను. సాయి రూపంతో కన్నులు నింపుకుంటే యీ సృష్టి యావత్తూ సాయి రూపంగా గోచరిస్తుంది. (అటు తర్వాత) సద్గురువు అన్నమాట తలపుకురాగానే శ్రీ సాయియే మనస్సుకు స్ఫురిస్తారు. ఊదీ మన నొసట పెట్టి, ఆశీర్వచనంగా తమ చేయి మన తలపై పెట్టినట్లు దర్శనమిస్తారు".

నార్కే యిలా వ్రాశాడు : "మొదట ఏప్రిల్, 1913లో నేను శిరిడీ వెళ్ళాను. ప్రధానంగా నా దృష్టినాకర్షించినవి వారి నేత్రాలు. అవి నన్ను అణువణువునా గ్రుచ్చి చూచాయి. అప్పుడు చావడిలో కూర్చున్న బాబా ఆకారం నా హృదయంపై శాశ్వతంగా ముద్రించుకుపోయింది". ఇంకొంచెం వివరించమని అడిగితే శ్రీ సాయి శరణానంద

నాతో యిలా చెప్పారు : "సాయిబాబా అయిదున్నర అడుగులు ఎత్తుండేవారు. ఆయన సన్నమూ గాదు, లావూ గాదు. శరీరచ్ఛాయ పచ్చని పసిమి. వారి కనుగుడ్లు నీలంగా వుండి, చీకటిలో మెరిసేవి. అది భక్తులెంతో విశేషంగా చెప్పుకునేవారు. ఆయన నవ్వెంతో మధురంగా వుండేది". ఉద్ధవరావ్ దేశ్‌పాండే యిలా చెప్పాడు "బాబా దేహచ్ఛాయ ఎప్పటికప్పుడు మారుతుండేది. ఒక్కొక్కపుడు, అప్పుడే తీసిన అరటిపూచమీద బంగారు రంగు ఎండపడుతున్నట్లు వుండేది".

శ్రీ సాయియొక్క దివ్యలీలలు, మనోహరమైన వారి రూపము అత్యంత పరిశుద్ధమైన సాధు జీవితము ప్రజలనెందరినో సుదూర ప్రాంతాల నుండి గూడ శిరిడీకి తరలివచ్చేలా చేసాయి. ధనికులిచ్చిన కాన్కలతోను, విలువైన వస్తువులతోనూ అక్కడొక సంస్థానం రూపొందింది. కాని బాబా మాత్రం తమయొక్క ఫకీరు జీవితంలో ఎట్టిమార్పూ రానివ్వలేదు. ఆయన తెల్లవారు ఝామునే నిద్రలేచి, ధునిదగ్గర స్తంభానికి ఆనుకొని కొంతసేపు నిశ్చలంగా ధ్యాన నిమగ్నులయ్యేవారు. తర్వాత అక్కడే నిలచి ఏవేవో భంగిమలు చేస్తూ, నెమ్మదిగా 'యాదేహక్' ('దైవాన్నెల్లప్పుడూ స్మరించాలి') వంటి అరబ్బీ పదాలు ఉచ్చరించేవారు. అప్పుడు తమ దగ్గరకెవ్వరనీ రానిచ్చేవారు గాదు. ఈలోపు సేవకుడు మాధవ్‌ఫస్లే మశీదు శుభ్రం చేసి, బక్కెట్లతో నీరు పెట్టేవాడు. సాయి ఆ నీరు పుక్కిలించి, కాళ్ళు చేతులు, ముఖమూ ఎంతో నాజూకుగా కడుక్కునేవారు. తర్వాత కొంతసేపు కన్నులరమోడ్చి మౌనంగా కూర్చొనేవారు. అప్పుడు ధునిలో కట్టెలు సవరిస్తూ, భక్తులతో ఆ ముందటి రాత్రి తాము ఎక్కడెక్కడి భక్తులను ఎలా కాపాడినది, మరణించిన వారి ఆత్మలను పైలోకాలకు తాము ఎలా తీసుకువెళ్ళినదీ చెప్పేవారు. ఈ సమయంలోనే వేరు వేరు భక్తులకు కలిగిన దివ్యానుభూతుల సంగతి బయటపడేది. ఒకనాటి రాత్రి బల్వంత్ అనే పిల్లవానికి కల వచ్చింది. కలలో జోగ్ అనే భక్తునితోపాటు సాయి వారింటికి వస్తే బల్వంత్ భిక్ష యిచ్చాడు. అది కలయే కదా అని ఎవరూ పట్టించుకోలేదు. కాని మరురోజు అతడు మశీదుకు రాగానే బాబా, "నిన్న మీ యింటికి వచ్చాను. భిక్ష యిచ్చావు గాని దక్షిణ యివ్వలేదు. రూ. 25/- లు యివ్వు" అన్నారు. బల్వంత్ దక్షిణ తెచ్చి సమర్పించాడు. మరొకరోజు ఖాపర్డేకు సాయి పదే పదే చిలిం అందించారు. ఆ పొగ పీల్చగానే అతని సంశయాలన్నీ తొలగి ఎంతో ఆనందం కలిగింది.

ఒకప్పుడు ఆయన ధునిలో తమ చేయిపెట్టి, వేరొక గ్రామంలో కమ్మరి కొలిమిలో పడబోయిన బిడ్డను రక్షించారు. అప్పుడాయన చేయి బాగా కాలింది. అదిచూచి తాత్యా కంటతడి పెట్టాడు. సాయి నవ్వి, "తాత్యా! ఎందుకేడుస్తావు? రెండువేల పిడకలు పేర్చి, వాటిపై ఈ శరీరాన్ని కాలుస్తున్నా మనం చలించగూడదు. నిజమైన జ్ఞానానికి అదే గీటురాయి!" అన్నారు. అప్పటినుండి భక్తుడు, కుష్టురోగియైన భాగోజీ వారి చేతికి నిత్యమూ నేయి మర్దించి, ఆకువేసి కట్టుకట్టేవాడు. అతను తన శ్రద్ధను కాపాడుకోడానికి సాధనగా కాబోలు, ఆ గాయం మానిపోయాక గూడ బాబా యావజ్జీవితమూ అతని చేత ఆ సేవ చేయించుకొనేవారు. అది పూర్తయ్యేసరికి ఉదయం 7-30 గం॥లు అయ్యేది.

మొదటి రోజులలో బాబా, మూడు నాలుగురోజుల కొకసారి యీ సమయంలో బావి దగ్గరకు వెళ్ళి, కాళ్ళు, చేతులు కడుక్కొని నీరు పుక్కిలించి వుమ్మేసేవారు. కుష్టురోగులు ఆ నీరు వంటికి రాసుకునేవారు. ఎందరికో ఆ వ్యాధి తగ్గిపోయింది. తర్వాత తర్వాత, భక్తులు రెండు రాగి హండాలలో వేడినీళ్ళు, రెండు బిందెలు చన్నీళ్ళ మశీదులో పెట్టి, చుట్టూరా తెరలు దించేవారు. సాయి ఆ నీరు కలుపుకొని సుమారు గంటన్నరసేపు స్నానం చేసి, ధుని దగ్గర నిలబడేవారు. సన్నిహిత సేవకులు, వీపు , మెడ, తల తుడిచేవారు. యోగికి చన్నీటి స్నానము, స్నానము చేసి తీరాలన్న నియమమూ యోగశాస్త్ర గ్రంథాలు నిషేధించాయి. అంతేగాదు, ఎవరైనా స్నానం చేయమని

చెబితే, నేనిప్పుడే కాశీ వెళ్ళి గంగలో స్నానం చేసి వచ్చాను, మరల యిక్కడ స్నానమెందుకు?'' అనేవారు. నిత్యమూ కాశీలో స్నానం చేయడం శ్రీ దత్తాత్రేయుని ఆచారం. అంటే తామే దత్తాత్రేయుడని ఆయన సూచించారన్న మాట. ఈ రీతిన ఒక్కొక్కసారి ఆయన ఆరు వారాల దాక గూడ స్నానం చేసేవారు గాదు. స్నానమయ్యాక ఆయన ఒక రంగు వస్త్రంకట్టుకొని, ఒక్కొక్కపుడు కఫ్నీ తడిపి, ధునిమీద ఆరబెట్టి, తిరిగి తొడుక్కునేవారు. ఆ కఫ్నీ, తలకట్టూ గూడా ఆయన కొన్ని నెలలదాకా మార్చేవారు గాదు. అవి మార్చదలచినప్పుడు కాశీనాథుడనే దర్జీవాణ్ణి పిలిచి, క్రొత్తది తెమ్మనేవారు. అతడు తీసుకురాగానే అది ధరించి, పాతది ధునిలో పారేసి నమస్కరించేవారు. ఒక్కొక్కప్పుడు తమతోపాటు మరికొందరు భక్తులకు గూడ కఫ్నీలు యిచ్చేవారు. ఆయన కఫ్నీ మార్చడం మరీ ఆలస్యమై, పాతది చిరిగిపోయేది. అప్పుడు తాత్యా ఆయన దగ్గరజేరి, దానిని చూచే మిషమీద ఆ చిరుగులనింకా పెద్దవి చేసేవాడు. అయినా ఆయన క్రొత్తది వేసుకునే బదులు మధ్యాహ్నం ఒంటరిగా వున్నప్పుడు ఒక ముల్లును సూదిగా చేసుకొని, ఆ చిరుగులన్నింటికీ మాసికలు వేసుకునేవారు. అలాగే ఆయనకు బుద్ధిపుట్టినప్పుడు బాలా అనే మంగలిచేత తన తల సున్నగా గొరిగించుకొని, మీసం కోసుగా కత్తిరించుకొనేవారు. దర్జీవానికిగాని, మంగలివానికి గాని చేతికొచ్చినంత పైకమిచ్చేవారు. అయితే అదెప్పుడూ వారి పనికి తగిన కిరాయికంటే యెంతో ఎక్కువ వుండేది.

బాబా యెంతో మితభాషి, ఎక్కువగా కన్నులరమోడ్చుకొని, భక్తులు రాగానే ఒక్కసారి వారికేసి చూచేవారు. పిల్లలతో వినోదంగా మాట్లాడేవారు. పసిపిల్లలను ఎత్తుకొని పలుకరించేవారు. ఒకసారి ప్రక్క గ్రామం నుండి తరచు శిరిడీ వచ్చే పిలాజీ గురవ్, తన10 సం॥ల కొడుకు తనతో గూడా వస్తానని మారాం చేస్తే వాణ్ణి కొట్టాడు. గురవ్ శిరిడీ చేరగానే బాబా కోపంగా, "ఆ చిన్న వెధవను కొడితే వూరుకోను! వాడు నీతోగూడ వస్తే నీదేం పోతుంది? ఈసారి వాణ్ణిగూడ తీసుకు వస్తూండు!'' అన్నారు. అప్పటినుండి అతడలానే చేసేవాడు.

సుమారు 9 గం॥ల ప్రాంతంలో బాబా, ఎడమ భుజానికి నాల్గు మడతలు వేసిన గుడ్డను జోలెగా కట్టుకుని, కుడిచేతిలో రేకుడబ్బా తీసుకొని, నిత్యమూ ఆ అయిదు యిళ్ళవద్ద మాత్రమే భిక్ష తీసుకొచ్చేవారు. ద్రవాహారాలు డబ్బాలోను, రొట్టెలవంటి ఘనపదార్థాలు జోలెలోనూ వేయించుకొనేవారు. అయిదు యిళ్ళలో బయజాబాయి యిల్లు ఒకటి. బాబా కేక వేయగానే, ఆ తల్లి పనులన్నీ ఆపివేసి, ఆయనను ఆహ్వానించి, ఆయన ఎదుటనే కూర్చొనేది. అపుడు 7,8 సం॥ల వయసుగల ఆమె కొడుకు తాత్యా, ఆయన భుజాలపైన ఎక్కడమో, ఆయన వడిలో పొర్లడమో చేసేవాడు. ఆమె అతనిని కసిరినా, ఆమె ముఖంలో ఏ మాత్రం చికాకు వ్యక్తమైనా బాబా, "ఎందుకమ్మా వాణ్ణి కోప్పడతావు? వాడి యిష్టమొచ్చినట్లు చేయనివ్వు!'' అనేవారు.

ఇలా భిక్ష తీసుకొని మశీదుకు చేరగానే బాబా, ఒకరొట్టె, కొద్ది అన్నమూ ధునికి ఆహుతిగా వేసి, మిగిలినవన్నీ ఒక మట్టిబొచ్చెలో మూత పెట్టకుండా వుంచేవారు. మొదటిరోజుల్లో కుక్కలు, పిల్లులు, బిచ్చగాళ్ళు, సేవకులూ దాని నుండి తమకు కావలసినంత తీసుకొనేవారు. ఆయన ఏ ప్రాణినీ అసహ్యించుకొని వెళ్ళగొట్టేవారుగాదు. చివరకు మిగిలినవన్నీ రుచి, విచక్షణ లేకుండా కలిపి, కొన్ని ముద్దలు మాత్రం తినేవారు. హిందూ ధర్మప్రకారం బాబా నైష్ఠిక బ్రహ్మచారి. అందుకే తమ గురువు దేహంతో వున్నంతకాలం వారిచెంతనే వుండి సేవచేశారు. వారు పరమపదించాక, వారి ప్రతిరూపంగా నిరతాగ్నిహోత్రం నిర్వహించారు. ఎల్లప్పుడూ తెల్లని ముతక (కోరా) గుడ్డలు ధరించేవారు. లెండీకి వెళ్ళేటప్పుడుదప్ప మరెప్పుడూ పాదరక్షలు వేసుకొనే వారుగాదు. పగలెన్నడూ వెన్నువాల్చక, గోడకు గూడ జానెడు దూరంలో కూర్చొనేవారు. పండ్లు తోముకోకుండా నీళ్ళు మాత్రం పుక్కిలించేవారు. భిక్షాన్నం మాత్రమే తినేవారు. అంతరంగికంగా మాత్రం సర్వమూ భగవంతుని రూపంగా ("వాసుదేవః సర్వమితి'' - భగవద్గీత) చూచే అరుదైన మహాత్ముడు సాయి. (స మహాత్మా సుదుర్లభః - భగవద్గీత). అందుకే ఆయన ఏ ప్రాణినీ

అసహ్యించుకోలేదు. ఆయన ఆదర్శ భిక్షువు. ఎవరినీ భిక్షకోసం పీడించలేదు. బాబా శిరిడీ చేరిన రెండు సంవత్సరాలకు ఆ ప్రాంతంలో కరువొచ్చింది. అప్పుడు ధనికులైన నందూ, తాత్యాల ఇండ్లవద్ద మాత్రమే ఒక్కొక్క ఇంటినుండి సగం రొట్టె మాత్రమే తీసుకొనేవారు సాయి.

భిక్షకు వెళ్ళివచ్చాక, 9 గంటల ప్రాంతంలో బాబా పాదరక్షలు ధరించి లెండీకి వెళ్ళివచ్చేవారు. భక్తులు దారి పొడుగునా ఆయనకు గొడుగు పట్టేవారు. అప్పుడు తీసిన ఫోటోలో ఆయనకు ఎడమవైపున బూటీ, కుడివైపున నిమోన్కర్, గొడుగు పట్టుకొని భాగోజీ వున్నారు. వీరందరినీ లెండీ తోపుబయట విడిచి, అబ్దుల్లాతో కలసి లెండీలో కొంతసేపు గడిపి వచ్చేవారు. సుమారు 10-30 గం॥ల ప్రాంతంలో ఆయన మశీదు చేరాక గాయకులు, నర్తకీనర్తకులు, గారడీవారు, ఆయన ముందు తమ కళలను ప్రదర్శించేవారు. లేకుంటే మధ్యాహ్నందాకా ఆయన భక్తులతో మాట్లాడుతూ, ఎన్నెన్నో కథలు చెప్పేవారు. ★ ఒకరోజు భక్తులు ఆయనను పూజిస్తుండగా నానావల్లి వచ్చి, "లే! ఆసనం మీద నేను కూర్చోవాలి!!" అని గర్జించాడు. సాయి ఎంతో నిర్లిప్తంగా లేచారు. ఆ స్థానంలో అతడు కూర్చొని, మరుక్షణమే లేచి, బాబాకు నమస్కరించి, వెళ్ళిపోయాడు. మరొకప్పుడు హరిద్వార్‌బువా అనే సాధువు రోజూ మశీదులో ఒకేచోట కూర్చునేవాడు. ఒకరోజు చిన్నపిల్ల ముందుగా వచ్చి అక్కడ కూర్చున్నది. ఆ సాధువు ఆ పాపను కసిరి, అక్కడనుంచి లేపేసి, అక్కడ కూర్చునేవాడు. వెంటనే బాబా ఉగ్రులై మసీదు నుండి అందర్నీ వెళ్ళగొట్టేసారు. కొద్ది సేపట్లో ఆ సాధువు మళ్ళీ అక్కడ కూర్చోబోతే సాయి అతనిని మరల వెళ్ళగొట్టారు. సృష్టిలో సర్వానికీ యజమాని భగవంతుడే అయితే రోజూ కొద్దిసేపు కూర్చొన్నంత మాత్రాన ఏ ప్రదేశమైనా ఆ సాధువుదిగాని, లేక తమదిగాని ఎలా అవుతుందని పైరెండు సందర్భాలలోని బాబా భావం.

కొందరు భక్తులు తమ భోజనంలో మొదట కొంత బాబాకు అర్పించేవారు. ఆయన అందులో కొంచెం భక్తులకు పంచి, పళ్ళెంలో కొంచెం వుంచి తిరిగి యిచ్చేవారు. తర్వాత ఆయనగూడ భక్తుల పంక్తిలో భోజనం చేసేవారు. ఆయనకు కుడిప్రక్కన తాత్యా, రామచంద్రపాటిల్, బయాజీ పాటిల్, ఎడమవైపు బడేబాబా, శ్యామా, బూటీ, కాకాదీక్షిత్‌లు కూర్చోగానే చుట్టూ తెరలు దించేవారు. ఆ తర్వాత అందులో ఎవరూ ప్రవేశించేవారు గాదు. తరచుగా ఆ పంక్తిలో భాగోజీ, మాధవఫస్లే, నిమోన్కర్‌లు గూడ కూర్చొనేవారు. శ్యామాకు మాత్రం అతడి ఆచారం ప్రకారం పాయసమొక్కటే వడ్డించేవారు బాబా. వేసవికాలంలో బాబా, రోజూ ఒక మామిడి పండు స్వల్పంగా రుచి చూచి భక్తులందరికీ పంచేవారు. తర్వాత శేరుపాలు, శేరు రొట్టెలు, శేరు చక్కెర గిన్నెలో పిసికి, ప్రసాదంగా పంచేవారు. అప్పుడాయనే అందరి పళ్ళాలూ వంటకాలతో నింపేవారు. భక్తులు భోజనానికి తమ బిడ్డలను గూడ తీసుకొచ్చినప్పుడు, మొదట వారికిష్టమైనవి పెట్టాకనే భోజనం వడ్డించేవారు. ఒకసారి అందరూ భోజనం చేస్తుండగా శిథిలమైన మశీదు కప్పునుండి పెటపెటమని శబ్దమైంది. వెంటనే సాయి చేయి పైకెత్తి, "ఆగు, ఆగు" అన్నారు. ఆ శబ్దం ఆగిపోయింది. భోజనమై అందరూ బయటకు రాగానే, మశీదు కప్పునుండి ఒక భాగం సరిగ్గా వీరు కూర్చొన్న చోటనే విరిగి పడింది. బాబా ఆగమన్నదెవరినో అప్పుడందరికీ అర్థమై ఆశ్చర్యపోయారు. భోజనాలయ్యాక సగుణమేరునాయక్ మశీదు శుభ్రంచేసి, సాయి యథాస్థానంలో కూర్చున్నాక, ఆయనకు తాంబూలము, తర్వాత గ్లాసెడు మంచినీళ్ళు, రూ॥2/-లు దక్షిణా యిచ్చేవాడు. అప్పుడు సాయి కొంతసేపు ఏకాంతంగా గడిపేవారు. మధ్యాహ్నం 2-30 గం॥ల ప్రాంతంలో భక్తులు మరల మశీదులో చేరేవారు. హరిదాసులు, పగటి వేషగాళ్ళు, సర్కస్‌వాళ్ళు ఆయన సన్నిధిలో ప్రదర్శనలిచ్చేవారు. ఆయన ఒక్కొక్కరికి రూ॥2/- లు యిచ్చేవారు. లక్ష్మణ్, బాలాషింపీవంటి యువకులు కొందరు ఆ కానుకలలో కొంతభాగం కాజేసేవారు. అయినా సాయి వాళ్ళను

★ బాబా చెప్పిన భావగర్భితమైన కథలు "శ్రీసాయి ప్రబోధామృతము"లో వివరణతో సహా పొందుపరచాను.

యేమీ అనేవారుగాదు.

ఈ సమయంలోనే యెన్నో చిత్రాలు జరిగేవి. ఉదాహరణకు జనవరి 1, 1912 న "సాయి మూడు కథలు చెప్పారు. మూడవ కథ ప్రారంభించగానే ఒక ఫకీరొచ్చి ఆయన పాదాలు తాకాడు. సాయి కోపంతో నెట్టివేసినా అతడు విడవకుండా ఆయన పాదాలు పట్టుకున్నాడు. తర్వాత అతడు బయటకువెళ్ళి మశీదు ప్రహరీగోడవద్ద నిలుచున్నాడు. ఆ కోపంతో సాయి ఆరతి సామాన్లు, నైవేద్యాలు బయట పారవేసి, రామమారుతి అనేవాణ్ణి అమాంతంగా పైకెత్తేసారు. అతడికప్పుడు పై లోకానికి వెళ్ళినంత ఆనందం కలిగిందట! అలాగే భాగ్య అనేవాణ్ణి, మరో యువకుణ్ణి కొట్టారు. ఆ కోపంలోనే ఖాపర్డే కొడుకు బల్వంత్‌ను ప్రమాదం నుండి రక్షించామని చెప్పి, 'ఆ ఫకీరు ఖాపర్డేను చంపాలనుకున్నాడు! కాని నేను అడ్డుపడ్డాను' అన్నారు. ఆరతి సమయంలో తమ స్థానం నుంచి లేచిపోయి, ఆరతి అయ్యాక తిరిగివచ్చి కూర్చున్నారు". **(ఖాపర్డే డైరీ)**

ఇటువంటి ఆగ్రహంతోపాటు బాబాలో భక్తులపై ఎంతో చల్లని ప్రేమగూడ ప్రకటమవుతుండేది. తరచూ ఆయనే పండ్లుకొని, ముక్కలు చేసి, భక్తులకు పంచేవారు. అరటిపండ్లు ఒలిచి, గుజ్జు భక్తులకిచ్చి, తొక్కు తాముంచుకొనేవారు. మామిడిపండ్లను ఎంతో నేర్పుగా అన్నివైపులా నొక్కి భక్తులకిచ్చేవారు. రసమంతా సులభంగా నోట్లోకొచ్చి, తొక్కు, టెంక పారవేయడానికి వీలుగా వుండేవి. సుఖసౌఖ్యాలు భక్తులకిచ్చి, వారి దుఃఖం తాము స్వీకరిస్తామని, వారికి మాయను తొలగించి దివ్యానుభవం సులభమయ్యేలా చేస్తామనీ యీ చర్యలలోని వారి భావమై వుండవచ్చు. ఒక్కొక్కప్పుడు అదేమి చిత్రమోగాని, ఆయన చెప్పిన కథలు వినిన భక్తులందరూ గూడ ఆ కథలను పూర్తిగా మరచిపోయేవారు. ఒకరోజు ఆయన - గత జన్మలలో ఆయన, బాపూసాహెబ్ జోగ్, దాదాకేల్కర్, శ్యామా, ఖాపర్డే, దీక్షిత్‌లు ఒక చిన్న వీధిలో తమ గురువుతో కలసి వుండేవారట, అందువల్లనే తామీ జన్మలో అందర్నీ మళ్ళీ కలుపుతున్నామని బాబా చెప్పారు.

సాయంత్రం బాబా మశీదు ప్రాంగణంలో కొద్దిసేపు పచార్లుచేసి ప్రహరీనానుకొని నిలచి వీధినపోయే జనంతో ఏమేమో మాట్లాడేవారు. ఉదాహరణకు : "పది పాములు వెళ్ళిపోయాయి. కాని చాలా వస్తాయి." "ఇక్కడకు జనం చీమలపుట్టల్లా చేరుతారు"; "వణీ, తేలీ నన్నెంతో బాధిస్తున్నారు. నేనీ మశీదులో వుండను" అని చెప్పి, ఒక్కొక్కసారి అప్పటికప్పుడే ఆయన వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యేవారు. అప్పుడు తాత్యా పరుగున వచ్చి, "నేను వాళ్ళను దండిస్తాను. ఇప్పుడు శాంతించండి, మరోరోజు వెళ్దాం" అని బుజ్జగించాకనే ఆయన శాంతించేవారు.

సాయంత్రం 5 గం॥ల ప్రాంతంలో బాబా మరలా లెండీకి వెళ్ళి వచ్చేవారు. అప్పుడు పిలాజీగురవ్ మశీదు ముందు సన్నాయి వాయించగానే ఆయన ఆవేశంతో, "వాడు నన్ను తిడుతున్నాడు!" అని, అతనిమీదకు కొట్టడానికి వెళ్ళేవారు. అతడు చిక్కకుండా తప్పుకొని మరీ వాయించేవాడు. తర్వాత కొంత సేపు ఆయన మశీదుకు, చావడికీ మధ్య పచార్లు చేసేవారు. తర్వాత 6 గంటలకు ఆరతి అయ్యేది, అప్పుడు కొంతసేపు సత్కాలక్షేపం జరిగేది. బూటీ 1914లో ప్రఖ్యాత గాయకుడైన ఖాన్ సాహెబ్ గాన కచ్చేరి ఏర్పాటు చేశాడు. అందరూ మశీదు ముంగిట సమావేశమయ్యాక ఆ గాయకుణ్ణి మరాఠీలో భజనలు పాడమన్నారు బాబా. అతడు ఆయనకు నమస్కరించి, తుకారామ్ వ్రాసిన, "హేచి దాన్ దేగా దేవా" ("దేవా! ఒక మనవి వినుమా") అనే పాట ఎంతో మధురంగా పాడాడు. సాయి మంత్ర ముగ్ధులైనట్లు కన్నులు మూసుకొని శ్రద్ధగా విని, "ఎంత చక్కగా పాడావు! ప్రసాదించకుండటం సాధ్యపడని దానినే కోరాడు తుకారామ్" అన్నారు.

ఆ తరువాత బాబా, ఆరోజు భక్తులు సమర్పించిన దక్షిణంతా అందరికీ పంచేసేవారు. ఆయన లెక్క

పెట్టకుండా జేబులో చెయ్యిపెట్టి చేతికొచ్చినంత యిచ్చివేస్తున్నా, ప్రతి భక్తునికీ ఎప్పుడూ ఒకే మొత్తం ముట్టేది! ఇలా నిత్యము బడేబాబాకు రూ॥ 50/-లు, తాత్యాకు రూ॥ 35/-ల నుండి భాగోజీకి రూ॥4/- వరకు ముట్టేది. క్రొత్తవారికి వారికెంత అవసరమో అంతే ముట్టేది. శ్రీరామనవమివంటి ఉత్సవాలలో దాదాకేల్కర్‌కు, బడే బాబాకు రెండు నోట్లకట్టలు, పేదలకు పంచమని బాబా యిచ్చేవారు. ఇలా ఆయన పంచేసే దక్షిణ రోజుకు ఐదు వందలదాకా వుండడంతో బ్రిటిష్ ప్రభుత్వము పన్ను వేయదలచింది. ఆ లెక్క వ్రాయడానికి హిందువునో, ముస్లింనో నియమిస్తే పక్షపాతం చూపుతారని చక్రనారాయణ్ అనే క్రైస్తవుణ్ణి నియమించారు. ఆయన వైరాగ్యాన్ని గమనించి చివరకు అతడుగూడా భక్తుడయ్యాడు. ఇలా తనకున్నదంతా సర్వులకూ యిచ్చివేసి, తను వారి ప్రేమపై జీవించే భిక్షువుగా మాత్రమే వుండగలవాడు నిజానికి భగవంతుడే. త్రిమూర్తి స్వరూపుడైన దత్తాత్రేయుడే. ఆయన కృతవీర్యుని కుమారుడైన అర్జునునికి సామ్రాజ్యమిచ్చి, తాను సాధువుగానే వుండిపోయాడు. ఆయన యొక్క అవతారమైన శ్రీ నరసింహ సరస్వతిగూడ ఒక రజకునికి మరుజన్మలో రాజ్యమిచ్చి తాను యతిగా వుండిపోయారు. మూడవ దత్తావతారమైన మాణిక్యప్రభువు భారీ యెత్తున దానధర్మాలు చేస్తూగూడ ఫకీరులాగానే జీవించారు. నాల్గవ అవతారమైన అక్కల్కోటస్వామి పాదసేవ కోసం నాటి రాజులు పోటీపడుతుంటే ఆయన మాత్రం ఒక మఠమైనాలేని అవధూతగానే జీవించారు. శ్రీ సాయిగూడ యిటువంటి మహరాజే. శిధిలమైన మశీదే ఆయనకు రాజభవనము. ధునిలోని విభూతియే ఆయన యొక్క ధనం. చినిగివున్న కఫ్నీయే చీనాంబరము. సట్కాయే ఆయన రాజదండము. తలచుట్టూ రుమాలే వారికున్న రత్న కిరీటము. భిక్షగాళ్ళే వారి కొలువులోని వారు. ఆయనవద్ద ఎప్పుడూ వుండే యిటుకరాయి, గోనెపట్టాలే వారికి దిండు, పట్టుపరుపులు. ఒక రేకు డబ్బా, కొద్ది మట్టికుండలే వారికి స్వర్ణపాత్రలు. మశీదు ముంగిటనున్న పెద్ద రాయియే వారి సింహాసనము. పోనీ యింతటి దానకర్ణుడు ఎవరేమిస్తే అదల్లా తీసుకున్నారా!. ఒకనాడు కొందరు బోయీలు పరదాలు కట్టిన పల్లకీ తెచ్చి మశీదు ముంగిట దించారు. ఒక రాణిగారు, ఒక వాసెన కట్టిన బిందె మశీదులోకి పంపింది. దానిని విప్పిచూసిన భక్తుడు, 'బాబా, యిది బంగారం!' అన్నాడు. సాయి తమ హృదయాన్ని చూపుతూ ఎగతాళిగా, "బంగారం యిదా, లేక అదా?" అన్నారు. అతడు మైకంలోంచి మేల్కొని, "మీరే అసలైన పెన్నిధి" అన్నాడు. "అయితే దానిని వెంటనే త్రిప్పి పంపివేయి!" అని ఆజ్ఞాపించారు సాయి. ఆ మహారాజు ముందు ఆ రాణిగారు బిచ్చగత్తెయై తుచ్ఛమైన బంగారం తీసుకుపోవలసి వచ్చింది. రాత్రి భక్తులందరూ భోజనాలకు వెళ్ళాక 9 గం॥ల ప్రాంతంలో తాత్యా తెచ్చిన రొట్టెలు తీసికొని, బాబా అతనికి రూ॥ 35/-లు యిచ్చేవారు. ఈ వివరం అతడే యిలా చెప్పాడు : "రోజూ రాత్రి పాలు, బెల్లంతో పాటు రొట్టెలుకాని, సంకటి ముద్దగాని తీసుకువెళ్ళి బాబా ముందుంచే వాణ్ణి. ఆయన కొంచెం తిని కొంచెం నా నోట్లో పెట్టి, ఆ పాత్ర దూరంగా పెట్టగానే దానిని కోండ్యా ప్రసాదంగా తీసుకొనేవాడు. తర్వాత అతడు కొన్ని కిళ్ళీలు సిద్ధం చేసేవాడు. సాయి వాటిలో కొన్ని తిని మిగిలినవి భక్తులకు విసిరేవారు. వాటిని భక్తులు ప్రసాదంగా తీసుకొనేవారు. బాబాకు తాంబూలమంటే ఎంతో యిష్టం - రాత్రి, పగలూ గూడ వేసుకొనేవారు. కొంతకాలం తర్వాత వాటిని రాధాకృష్ణ ఆయీ సిద్ధం చేసేది. అవి తిన్నాక బాబా ఎక్కువగా మంచి నీరు త్రాగేవారు." అప్పుడు పవ్వళింపు (శేజ్) ఆరతి జరిగేది. భక్తులు తుకారామ్, జ్ఞానేశ్వరుల ఆరతి పాడుతుంటే బాబా శ్రద్ధగా చేతులు జోడించి నమస్కరించేవారు.

ఆరతి అవగానే బాబా పడుకునేవారు. మొదటి రోజులలో ఆయన ఎప్పుడూ ఒకే గోనెపట్టా పడకగా వేసుకునేవారు. పగలు దానిపైనే కూర్చునేవారు. కొంతకాలానికి భక్తులు సమర్పించిన దుప్పట్లు ఒకదానిపై నొకటి తామే పరచుకొని పడుకునేవారు. కాని క్రమంగా ఆ సేవ భక్తులే చేయసాగారు. ఎక్కడ చిన్న మడతవచ్చినా వాళ్ళు దుప్పట్లన్నీ తీసి సరిగా వేయవలసిందే! ఒకసారి దీక్షిత్ ఆయనకొక మంచం తెస్తానన్నాడు. "మహల్సాపతిని

క్రింద విడిచి నేను మంచంమీద ఎలా పడుకునేది? అతనిని దానిపై పడుకోమని నేను క్రింద పడుకోవచ్చు" అన్నారు బాబా. అతడు వారిద్దరికీ చెక్కపలకలు యిస్తానన్నాడు. కాని బాబా అంగీకరించలేదు. వారికి దోమలబాధ నివారించాలని దోమతెర కడదామంటే ఆయన ఒప్పుకోలేదు. ఒకసారి పట్టుదలగా కడితే ఆయన కోపంతో దానిని పీకి అవతల పారేసారు. ఇలానే తీవ్రమైన వేసవిలో ఆయనకు చల్లదనమివ్వాలని భక్తులు, మశీదు ముంగిలి నీటితో తడిపేవారు. కాని సాయి ధునిలో ఎక్కువ కట్టెలువేసి, వేడిమి పెంచి దాని దగ్గర కూర్చునేవారు. అలాగే చలి కాలంలో ఆయనకు మంచు సోకకుండా మశీదు ముందుభాగానికి రాత్రి సమయంలో భక్తులు దట్టమైన గుడ్డ వ్రేలాడదీసేవారు. అది చూచి ఆయన ఎగతాళిగా, 'అవునవును! మీరంతా నన్నిలా కాపాడకపోతే యేమైపోతాను' అని, వెంటనే గంభీరంగా, "మీరు నన్నేమి కాపాడగలరు? నేనే మీ అందర్నీ కాపాడుతాను" అనేవారు. మశీదులో బాబాతోపాటు తాత్యా, మహల్సాపతిగూడ వుండేవారు. మహల్సాపతి ఆయన పాదాలొత్తేవాడు. అతడికి నిద్రతూగితే ఆయన తట్టిలేపేవారు. అతనిని రాత్రి లఘుశంకకు గూడ బయటకు పోనివ్వక, "మశీదు నుండి దిగితే చచ్చిపో తావు, జాగ్రత్త!" అనేవారు. ఈ ముగ్గురూ వారి తలలు తూర్పు, పడమర, ఉత్తర దిక్కులకు పెట్టుకొని, మశీదు మధ్యలో పాదాలు కలిసేలా పడుకొని, ఎంతోసేపు మాట్లాడుకునేవారు. వారిలో ఎవరికి నిద్రతూగినా రెండవ వారితో కలసి సాయి అతనిని అటూ యిటూ వూపి, అతని తల, వీపు, కాళ్ళు నొక్కి నిద్ర లేపేవారు. ఇలా 14 సం॥ల పాటు తాత్యా మశీదులోనే నిద్రించాడు. అతడు తండ్రి మరణించాక మాత్రమే యింట్లో పడుకునేవాడు. అతడు యీ విషయం గురించి యిలా చెప్పాడు : "నేను, మహల్సాపతి, బాబా మశీదులో పడుకునే వాళ్ళము. అప్పుడు రాత్రి 9-30 గం॥లయ్యేది. కొద్దిసేపటికి మహల్సాపతి లేచి, ప్రమిదలలో నూనె నింపి, వత్తులు సవరించి, బాబా రొట్టెలు పెట్టుకుండే కుండమీద మూతపెట్టి, ధునిలో కట్టెలు వేసేవాడు. నేను పగలంతా కష్టం చేయడం వలన నా ఒళ్ళు నెప్పులుగా వుంటుందని గమనించి, నాకు నిద్ర పట్టాక మహల్సాపతితో కలిసి నా ఒళ్ళు, కాళ్ళు, చేతులు పిసికేవారు. నాకదెంతో బాధనిపించేది. అలా చేస్తే నేను మశీదుకే రానని బెదిరించి, ఒకసారి నేను 10, 12రోజులు వెళ్ళనేలేదు. బాబా బాధపడి దూరాన వెడుతున్న నన్ను కేకవేసే వారు. ఆయనతో నాకెట్టి సంబంధమూ లేదని సైగలతో తెలిపి వెళ్ళిపోయే వాణ్ణి. బయాజామామి కొడుకును గనుక ఆయనకు నాపై ఎంతో ప్రేమని నచ్చజెప్పి, కాకాసాహెబ్ నన్ను మశీదుకు తీసుకువచ్చేవాడు. "

ముందటి అధ్యాయాలలో మనము గమనించినట్టు మహాద్భుతమైన శక్తి, యీ అధ్యాయంలో గమనించినట్లు సాటిలేని వైరాగ్యముగల సాయి, కేవలం ఒక సామాన్య మానవునిలా, అంతకంటే గూడ అసమానమైన వినమ్రతలతో ప్రవర్తించేవారు. కొన్ని సమయాలలో మహల్సాపతి, తాత్యావంటి భక్తులతో చెలగాటమాడేవారు. తాత్యా తలపాగా దాచేసి, అతడు వెతుక్కుంటుంటే వినోదించేవారు. ఒక్కొక్కప్పుడు దానిని తామే ధరించి, అతని నడక చక్కగా అనుకరించేవారు. తాత్యా గూడ సాయిని ప్రేమగా, "మామా!" అని పిలిచేవాడు. వారిద్దరూ నిజంగా మామ మేనల్లుడిలా మసలుకొనేవారని ప్రధాన్ వ్రాసాడు. అలానే, మశీదులో ఆ యిద్దరే వున్నప్పుడు బాబా, మహల్సాపతి కాళ్ళు పిసికి, అతడు వారిస్తే, "ఫర్వాలేదులే, మనిద్దరమొక్కటే! అందరూ నన్ను గొప్పవాడనుకుంటారు గాని, అది నిజంగాదు. నేనూ నీలాంటివాడినే!" అనేవారు. తాత్యాగూడ యిలా చెప్పాడు : "ఒకనాడు బాబా అకస్మాత్తుగా నా పాదాలు తాకారు. నాకెంతో బాధన్పించి, 'మీరిలా చేయవచ్చా?' అన్నాను. 'నోర్ముయ్, నీకేం తెలుసు?' అని చేతులు విడిపించుకొని మరలా నా పాదాలు తాకి నమస్కరించి, 'జయదేవా, జయదేవా' అన్నారు. " ఇటువంటి చనువు వల్లనే సన్నిహిత భక్తులు అప్పుడప్పుడు ఆయన మాటలకివ్వవలసిన విలువ యివ్వలేక, కష్టాలకు గురి అవుతుండే వారు. ఒకరోజు తాత్యా, "బాబా, శివరాత్రికి టాంగాలో జజూరీ వెళ్ళివస్తాను" అన్నాడు. బాబా, "ఎందుకంత బాధ!" అన్నారు. అతడు "నీవెప్పుడూ ఇంతే! అడ్డుపుల్ల వేస్తావు" అన్నాడు. సాయి చికాకుగా, "సరే

ఫో!'' అన్నారు. అతడు బయల్దేరిన కొద్దిసేపట్లో టాంగా బోల్తాకొట్టింది! అతడు గాయాలు తుడుచు కుంటూ మశీదుకు చేరగానే సాయి అతనిని చూచి నవ్వి, ''చెబితే బుద్ధి వుండక్కరలా? అడగడమెందుకు, వద్దంటే వెళ్ళడమెందుకు?'' అన్నారు. అలానే బాలాభాటే కూతురు సాయిబాయి కోసం కాకాదీక్షిత్ మంచి పెండ్లి సంబంధం తీసుకొచ్చాడు. బాబాతో చెప్పగానే ఆయన, ''అంతకంటే ఆమెను అప్పా అనే వంటవాడికి యివ్వడం మేలు!'' అన్నారు. సమయం చూచుకొని అతడు మరల ఆ ప్రస్తావన తేగానే ఆయన చికాకుగా, ''వాడికే యిచ్చి చేసుకో ఫో, ఏడ్చుకో!'' అన్నారు. తీరా వివాహం జరిపించాక, ఆరు మాసాలలో ఆ యువకుడు మరణించాడు. ఆ వార్త వినగానే భక్తులతో బాబా, ''ప్రతివాడూ 'బాబా నీకు తెలియనిది ఏమున్నది?' అంటాడేగాని, చెప్పినట్లు విని చచ్చేవాడు ఎవడూ లేడు!'' అన్నారు. **ఎన్నిసార్లు ఆయన చరిత్ర చదివినా, మనం మాత్రం చేసేదేమిటి?**

బాబా వైఖరిలో వేదాంతము, చమత్కారమూ మేళవించి వుండేవి. ఒక గృహిణి, తన భర్త యిల్లువిడిచిపోయి 3 సం॥లయిందని కన్నీటితో చెప్పుకుంది. ఆయన, ''నా భర్త ఎప్పుడూ నాతో వుంటూ గూడ ఒక్కసారైనా పలకడు, ముఖం చూపించడు. నేనేమి చేసేది?'' అని పెద్దగా శోకించారు. ఆమె విస్తుబోయింది గాని, ఆమెకేమీ అర్థంకాలేదు, కొద్దికాలానికి ఆమె భర్త తిరిగివచ్చాడు గాని, ఆమెతో మాట్లాడలేదు. ఆమె ముఖం గూడ చూడలేదు. ఆ బాధకామె, అతడు యిల్లు విడిచిన రోజులే మేలనుకున్నది. క్రమంగా అతడు ప్రతి చిన్నదానికీ ఆమెను తిడుతూ, కొడుతూ వుండేవాడు. అప్పుడామె, అతడు మౌనంగా వున్నరోజులే మేలనుకున్నది. కొంతకాలానికి అతడు చనిపోయాడు. ఆ తర్వాత ఆమె వేదాంత శ్రవణం చేస్తుంటే బాబా మాటలర్థమయ్యాయి. పరమాత్మే అసలైన భర్త. ''ఎప్పుడూ కూడా వుంటున్నా కన్పించడు, మాట్లాడడు.'' **మానవులు పాటుపడవలసినది నిజానికి ఆయనొక్కడి కోసమే.**

★★★

★ సోమవారం పారాయణ సమాప్తము ★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

★ మంగళవారం పారాయణ ప్రారంభం ★

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 23

సమాధానమిచ్చే సమాధి

(i)

జీవన్ముక్తులు ప్రళయంలో గూడ నశించరని భగవద్గీత, యోగవాశిష్టమూ చెబుతున్నాయి. ఇక పూర్ణ దత్తావతారమైన బాబాకు జీవులనుద్ధరించడమే అవతారకార్యం గనుక ఆయన లీల మహాసమాధికి ముందులాగానే నేడుగూడ కొనసాగుతోంది. అంతవరకు భక్తులతో ఆయనకుగల అనుబంధం అలానే కొనసాగుతుంది. కాకా మహాజనికి నవంబర్ 13, 1918న స్వప్నంలో సాయి కన్పించి, "నేను సమాధి చెంది నెల అయింది. మాసికపూజ చేయి" అన్నారు. అతడు నిద్రలేచి చూస్తే ఆ మాట అక్షరాలా నిజమైంది. ఆ రోజు అతడు సాయిని పూజించి కాకాదీక్షిత్, ప్రధాన్, హేమాద్పంతులకు భోజనం పెట్టాడు. అలానే, నాగేష్ అనే భక్తుడు సమాధి ప్రక్కగదిలో నిద్రించేవాడు. అప్పుడప్పుడతనికి, తోటివారికీ సమాధి నుండి రకరకాల సంగీతం వినిపిస్తుండేది. అంతటితో వారాగదిలో నిద్రించడం మానేసారు. కె. కె. ప్రధాన్‌కు అనేకసార్లు గురుస్థానంలో సాయి భౌతికంగా దర్శనమిచ్చారు. ఒకప్పుడు తాత్యా తీవ్రమైన ఉబ్బసంతో బాధపడ్డాడు. వైద్యుడు మందిచ్చి దానిని 'అంజీర్' పండ్లరసంతో తీసుకోమన్నాడు. అది ఆ పండ్లు దొరికే ఋతువుగాదు. ఒకరోజు ఆరతయ్యాక అతడింటికి వస్తూ, "ఇప్పుడు బాబా నన్ను పట్టించుకోవడంలేదా? ఇప్పుడా పండ్లు దొరకవే, ఏం జేయాలి?" అనుకున్నాడు. ఆశ్చర్యం! తలుపు తెరిచేసరికి పూజలో బాబాపటం వద్ద అప్పుడే కోసిన అంజీరాలు 14 వున్నాయి! ఒక చైత్రమాసంలో దాసగణు శిరిడీలో 17 రోజులు హరికథ చెప్పాడు. ఒకరోజు బాబా పాదాలనుండి గంగా-యమునా జలాలు వచ్చిన లీల విని కొందరు భక్తులు నమ్మలేదు. చిత్రం! నాటినుండి కొన్నిరోజులు సమాధి పడమర అంచున నీరు సన్నని ధారలా కారింది. అదెక్కడి నుండి వస్తున్నదో ఎవరికీ తెలియలేదు.

సాయి దేహంతో వున్నప్పుడు అతి చనువు వలన వారిని చాలినంత భక్తిశ్రద్ధలతో పూజించలేకపోయానని శ్యామా పరితపించాడు. ఆయన ప్రసాదించిన ఊదీ పొట్లం ప్రాణప్రదంగా పూజలో పెట్టుకున్నాడు. అతడు బొంబాయి వెళ్ళినపుడు ఒకరాత్రి బాబా కలలో కన్పించి, "నేనిచ్చిన ఊదీ పొట్లం రోడ్డుప్రక్కన చెత్తకుండీలో వున్నది. త్వరగా వెళ్ళు!" అని హెచ్చరించారు. శ్యామా యిల్లు చేరి చూస్తే పూజలో ఆ పొట్లంలేదు, ఇల్లు సర్దడంతో దానినెవరో తీసారు! ఇంటి ప్రక్కనున్న చెత్తకుండీలో చూస్తే పొట్లం దొరికింది.

సం॥ 1942 నుండి శిరిడీవచ్చే భక్తులసంఖ్య పెరగజొచ్చింది. వారికోసం వసతిగృహాలు నిర్మించడానికి సంస్థానంవారు గురుస్థానం దగ్గర భూమిని కొనదలిచారుగాని, కేశవనారాయణ కులకర్ణి అది అమ్మనన్నాడు. వారు సాయికి మొరపెట్టుకోగా, తరువాతి గురువారంరోజు రాత్రి కులకర్ణికి కలలో బాబా కన్పించి, "నిజానికాభూమి నాది; అది నీవు సంస్థానానికి వెంటనే అమ్ము. నీకు మూడింతలు లాభమొస్తుంది" అన్నారు. అతడు వెంటనే సంస్థానానికే అమ్మాడు. ఆ పైకంతో అతడు గ్రామంలో వేరొక స్థలం కొనాలని చూస్తే ఆ ఆసామి అమ్మనన్నాడు. ఆ ఆసామికి కలలో బాబా కన్పించి, ఆ స్థలం అతనికి అమ్మమని చెప్పారు. ఆ వ్యవహారం వలన అతడికి మూడురెట్లు

లాభమొచ్చింది.

డాక్టర్ రుస్తుంజీ సం॥ 1930లో నిమోనియా వచ్చి బొంబాయిలోని పార్శీ జనరల్ ఆస్పత్రిలో స్పృహలేకుండా పడివున్నాడు. ఆ మైకంలో అతనికి ఒక ఫకీరు కన్పించి, "నేనెవరో తర్వాత నీకే తెలుస్తుంది" అని, ఒకసారి అతని మంచం చుట్టూ తిరిగి అదృశ్యులయ్యారు. తరువాత డాక్టర్లు అతనిని పరీక్షించి అతడారోగ్యంగా వుండటం చూచి విస్తుబోయారు. తనను కాపాడిన ఫకీరెవరా అని అతడాలోచిస్తూండేవాడు. ఒకసారి, బస్సులో సాటి ప్రయాణీకుని దగ్గర ఒక పుస్తకంలో బాబాపటం చూచాడు. తనను కాపాడినది ఆయనేనని గుర్తించి, వారి చరిత్ర పారాయణ, పూజ ప్రారంభించాడు. అతనిని 1949లో సాయి సంస్థానంవారు శిరిడీలోని ఆస్పత్రిలో నియమించారు. ఒకప్పుడితని భార్యకు కళ్ళజబ్బు వచ్చింది. ఆమె రోజూ సాయి సమాధికి ప్రదక్షిణంచేసి, తనకు వ్యాధి తగ్గితే సాయిబాబా పల్లకీకి స్వయంగా గుడ్డకుట్టి సమర్పిస్తానని మ్రొక్కుకున్నది. డాక్టర్లు ఆ వ్యాధికి మందులేదని నిర్ణయించినా, ఆమె వ్యాధి ఒక సం॥లోగా తగ్గిపోయింది. ఆమె తనమ్రొక్కు చెల్లించుకున్నది.

భయంకరమైన క్షయవ్యాధితో బాధపడుతున్న శివశంకర్ దీక్షిత్‌కు ఒకరాత్రి కలలో ఎవరో ముస్లిం మహాత్ముని పటం కన్పించింది. అతడు నమస్కరిస్తుండగా స్వప్నంలోనే ఒక ఫకీరు అతని నొసట ఊదీ పెట్టి, త్వరలో రోగం తగ్గుతుందని చెప్పాడు. మొదట అతడు ఆ స్వప్నాన్ని పట్టించుకోలేదు. కాని, నాటినుండీ ఏమందూ లేకుండానే వ్యాధి తగ్గిపోయింది! ఆ సంగతి విని, ఆ ఫకీరు సాయి అయివుండవచ్చని ఒక మిత్రుడు చెప్పాడు. నాలుగు రోజుల తర్వాత పిల్లలాడుకొంటూ ఒక కాగితం అతని ముందు పడేసి వెళ్ళారు. అందులో సాయి సమాధి చిత్రము, దానిపైనొక సాయిపటమూ వున్నాయి. తనకు స్వప్నదర్శనమిచ్చినది వారేనని గుర్తించి అతడు శిరిడీ వెళ్ళాడు. కాని అక్కడ సమాధిమీద చిత్రపటానికి బదులు పాలరాతి విగ్రహమున్నది. భక్తులను విచారించగా, 1956 వరకూ అక్కడ చిత్రపటమే వుండేదని, ఆ సంవత్సరమే విగ్రహం ప్రతిష్ఠించారనీ చెప్పి ఆ ఫోటోను చూపారు.

చిత్తూరు జిల్లాలోని ఒక గ్రామంలో 1959లో మొహరం పండుగనాడు ముస్లింలందరూ చేరారు. మౌల్వీగూడ సిద్ధమయ్యాడు గాని, పీరు ఎత్తవలసిన భక్తుడు రాలేదు. అప్పుడక్కడున్న కె. తిరువెంగళంను పీరు ఎత్తమన్నారు. అతని నడుముకు పీరుకొయ్య కట్టి, ఆ గుడ్డతో అతని ముఖం కప్పారు. వెంటనే అతనికి బాహ్యస్మృతి తప్పింది. "నాకొక్కసారిగా మెరుపుల కాంతి కన్పించింది. ఎక్కడా చిన్న రాయిగాని, గడ్డిపోచగాని లేని బ్రహ్మాండమైన మైదానం అన్నివైపులా కన్పించింది. చిన్నపిల్లవానిలా వున్న నావైపు చేతులు చాపుతూ దూరంలో ఒక ముసలాయన కన్పించారు. ఇంతలో ఎవరో నన్ను కదిలించడంతో నాకు మెలకువ కల్గింది. అప్పటినుండి భక్తిగీతాలు, భగవద్గీత విన్నా, వెంకటేశ్వరుని చూచినా, శరీరమంతా వణికి కన్నీరు కారుతుంది. ఒకసారి సాయిపటం కొన్నాను. ఎందుకోగాని ఆ మూర్తి నాకెంతో పరిచయంగా వున్నది. ఒకరోజు రేడియోలో భక్తిగీతము, నామావళి వినేసరికి నాకు బాహ్యస్మృతి తప్పి, అలనాడు పీరునెత్తినప్పటి దర్శనమే అయింది. అప్పుడు నాకు దర్శనమిచ్చిన మహనీయుడు సాయిబాబా అని గుర్తించగల్గాను" అని వ్రాస్తున్నాడు ఆ ధన్యజీవి.

నెల్లూరులో డా॥ రాజగోపాలాచారికి 1938లో ఒకరోజు కలలో ఒక ఫకీరు కన్పించారు. ఆయన మోకాళ్ళవరకూ పుండ్లున్నాయి. మరురోజు గోడకున్న పటాల మధ్యనున్న బాబాపటంపై వారి దృష్టిపడింది. అందులో బాబాకు మోకాళ్ళవరకూ చెదలుపట్టి వున్నాయి. సాయికి, వారి పటానికీ భేదం లేదని డాక్టరు గుర్తించాడు. నాటినుండి వారింట సాయిభజన, పూజ ప్రారంభించారు. కొంతకాలానికి నెల్లూరులో చక్కని సాయి మందిరం వెలసింది.

బి. బి. దూబే (హోషంగాబాద్) 1957లో ప్రమాదకరమైన ఉదరరోగంతో చాలాకాలం బాధపడ్డాడు. వైద్యులుగూడ ఆశ వదలడంతో శ్రీకృష్ణుని ధ్యానిస్తున్నాడు. నాటి తెల్లవారుఝామున కలలో కఫ్నీ, తలకు గుడ్డ

ధరించిన ఒక మహనీయుడు కన్పించారు. వెంటనే అతడు, "ఆహా! ఈయనే నా గురువు!" అని కేకపెట్టాడు. ఆ కేకకు అతనికే మెలకువ వచ్చింది. అయినా ఆ సంగతి అతనెవ్వరికీ చెప్పలేదు. సం॥లు దొర్లిపోతున్నా ఆ మహనీయుడు మరపురాలేదు. ఆయన గురించి ఏమైనా తెలుస్తుందేమోనని ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలు, పత్రికలు చదువుతుండేవాడు. అతనికి 1970లో హోషంగాబాద్ బదిలీ అయింది. అతడక్కడ ఒక షాపులో ఆ మహనీయుని పటం చూచి విచారిస్తే, ఆయన శిరిడీ సాయిబాబా అని మాత్రమే చెప్పగలిగారు. తర్వాత 1972లో ఉద్యోగరీత్యా పిపారియాకు వెళ్ళినపుడు అతని మిత్రుడు తన యింట్లో సాయిపటం చూపి, ఆయన లీలలు వివరించారు. తర్వాత అతడు 1973లో శిరిడీవెళ్ళి, అప్పటినుంచి సాయిని కొలుచుకుంటున్నాడు.

శ్రీమతి సుశీలమ్మగారికి చాలాకాలం బిడ్డలు లేకుంటే, సాయిని పూజించుకొమ్మని ఆమె అన్నగారు ఒక పటమిచ్చాడు. కొద్దికాలానికి అబ్బాయి జన్మిస్తే సాయిబాబా అని పేరు పెట్టారు. ఒకసారి ఆమెకు తీవ్రంగా విరేచనాలై ఎన్ని మందులిచ్చినా తగ్గలేదు. ఆమె 21వ రోజు తెల్లవారుఝామున బైటకు వెళ్ళలేక మంచం ప్రక్కనే కూర్చుంది. సాయి గదిలో ప్రవేశించి, 'ఆ గూట్లో తాయెత్తుంచాను. కట్టుకో; బాధ తగ్గుతుంది. మూడవ రోజు దానిని పారవేయి!' అని చెప్పి వెళ్ళిపోయారు. "ఏ గూట్లో, బాబా?' అని కేకలేస్తే అందరూ ఆమెకు భ్రమ కలిగిందనుకున్నారు కాని గూట్లో చూస్తే తాయెత్తున్నది! అది కట్టగానే విరేచనాలు ఆగిపోయాయి. తరువాత ఆమె భర్త పిళ్ళేగారు కొద్ది కాలానికి రిటైరవుతారనగా వారి అబ్బాయి 'ఎమ్.ఎస్.సి' పాసై, తుమ్మలగుంటలో బంధువులింట వుండి ఉద్యోగ ప్రయత్నాలు చేశాడు. కొంతకాలానికి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో యింటర్వ్యూ వచ్చింది. సిఫార్సు లేకుంటే వెళ్ళి ప్రయోజనంలేదని తెలిసినా, తల్లి ప్రోద్బలం మీద హాజరయ్యాడు. ఆగష్టు 24, 1976న సుశీలమ్మకు సాయి స్వప్న దర్శనమిచ్చి, "నీ బిడ్డ కాగితాలు తుమ్మలగుంట వచ్చాయి. తెప్పించుకొని ఉద్యోగంలో చేరమను" అని రెండు మూడు సార్లు చెప్పారు. తుమ్మలగుంట బంధువులు అప్పుడు కాళహస్తిలో వున్నారు. వాళ్ళకు పిళ్ళే ఉత్తరం వ్రాస్తే, ఆ కాగితాలు తుమ్మలగుంట చేరాయని, వెంటనే అతడు వుద్యోగంలో చేరాలనీ టెలిగ్రామ్ వచ్చింది. అతడలా చేయడంతో పిళ్ళే రిటైరయ్యేముందు ఆ కుటుంబానికొక ఆధారం ఏర్పడింది. మరికొంత కాలానికి సుశీలమ్మగారికి దృష్టి మందగించింది. ఆమె బాధపడుతూంటే శ్రీ సాయి స్వప్నంలో కన్పించి, "కర్మానుభవం తప్పదు. ఈ జన్మలో అనుభవిస్తావో, మరుజన్మలో అనుభవిస్తావో చెప్పు!" అన్నారు. ఆమె చెప్పేలోపలే మెలకువ వచ్చింది. తరువాత ఆమె వేరే బాధల్లో వున్నప్పుడు సాయి కలలో కన్పించి, "శ్రీరామరామ రామేతి రమేరామే మనోరమే...." అన్న శ్లోకం జపించమన్నారు. మార్చి 1978లో ఆమె కన్ను ఆపరేషన్ చేయించుకొని యింటికొచ్చాక రాత్రి మేడమీద నిద్రపోతుంటే ఒక గబ్బిలం కన్ను పీకింది. మరురోజు డాక్టరుకు చూపిస్తే కన్నురాదని చెప్పి, యింటికి పొమ్మన్నారు. ఆమె బ్రతిమాలితే నాలుగు రోజులు ఆస్పత్రిలో వుంచారు. చివరిరోజు రాత్రి కలలో సాయి ఆమెకు కట్టువిప్పి తీర్థమిచ్చారు. పై శ్లోకమే చెప్పించి, "ఇప్పుడు కన్పిస్తున్నదా?" అన్నారు. "కన్పిస్తున్నదిగాని, యీ కర్మ మరుజన్మలో అనుభవించాలన్నారే" అని బాధపడింది. "నీకు దృష్టి యిచ్చినా, యివ్వకున్నా గొడవేనే!" అని కేకలేసి, "గుడ్డివారికి అన్నంపెట్టి, చేతనైన సహాయం చేయి. దేవునికి 10 టెంకాయలు కొట్టు. ఆ కర్మ తొలుగుతుంది' ' అన్నారు. తెల్లవారి కట్టు విప్పేసరికి ఆమెకు కళ్ళు కన్పిస్తున్నాయి. అది బాబా లీలే అన్నారు డాక్టర్లు. అంటే ఆమెకు సంతానము, ఆరోగ్యము, జీవనోపాధి, కర్మనివృత్తి ప్రసాదించారు సాయి.

పోలీసు ఆఫీసర్‌గా రిటైరయిన బి. ఉమామహేశ్వరరావుగారికి 1960 నుంచి గుండె జబ్బు, తరచుగా గుండెనొప్పితో 2,3 రోజులు స్పృహలో లేకుండా వుండేవారు. వైద్యులు ఆపరేషన్ చేయాలన్నారు గాని ఆయన యిష్టపడలేదు. బంధువుల ప్రోద్బలంతో 1980లో శిరిడీ దర్శించి అక్కడొక చిత్రమైన అనుభూతి పొంది, నాటినుంచీ సాయిని ప్రార్థిస్తున్నారు. సెప్టెంబరు 1983లో ఆయన గుండెనొప్పితో స్పృహ కోల్పోయారు. నాడి 40కి పడిపోయింది.

3వ రోజు తెల్లవారుఝామున 3 గం॥లకు స్వప్నంలో ఒక ఫకీరు వారి నుదుట ఊదీ పెట్టి, బాధ తగ్గుతుందని చెప్పారు. ఆయన వెంటనే భార్యను లేపి తన స్వప్నం చెప్పారు. ఆయన నొసట విభూతి వున్నది. తరువాత ఆయనకు గుండెనొప్పి రాలేదు. నవంబర్ 16, 1983 రాత్రి ఆయన సాయిని ధ్యానిస్తుండగా ఆ పటంనుండి చిత్రమైన కాంతి వారి గుండెమీద పడి, శరీరంలో కరెంట్ ప్రవహించినట్లయింది. వారి ఎడమరొమ్ముచుట్టూ వలయంలా చర్మం కాలినట్లు మచ్చవున్నది. అప్పటినుంచీ ఆయన ఆరోగ్యంగా వున్నారు. నవంబర్ 28, 1984న ఆయనకు బాబా కలలో కన్పించి, "రేపు నీకు గండమున్నది. బంధువులను పిలిపించుకో! నేనున్నాను, భయంలేదు" అన్నారు. ఉదయమే అందరూ సిద్ధంగా వున్నారు. ప్రొద్దున్నే ఆయన ధ్యానంలో కూర్చున్నప్పుడు పడిపోయారు. హాస్పిటల్‌కు తీసుకుపోతే ఆయన దక్కేది కష్టమన్నారు. వారి శ్రీమతి బాబాను ప్రార్థించాక ఆయన కోల్కొని, అప్పటి నుండీ సాయిసేవ చేస్తున్నారు.

దశరథరామయ్య, (కలిచేడు) యిలా వ్రాశారు : "సం॥ 1981లో ఒకనాటి రాత్రి మా యింటి ఎదుట రామమందిరంలో జరిగిన బాబా సత్సంగం నుండి మా అమ్మ ప్రసాదం తెచ్చి నాకిచ్చింది. నేనది తిని పడుకొన్నాక, బాబా కలలో కన్పించి, తమకు గడ్డిసంపంగి మాల వేయమన్నారు. మరురోజు అది సమర్పించినప్పటినుండి ఆయన మమ్మల్ని కాపాడుతున్నారు. సుమారు 20 రోజులకు నాకు గుండె నొప్పి వచ్చి, నా గదిలో పడుకొన్నాను. కలలో ఒక ఆజానుబాహుని పాదం మాత్రం నాపై నుంచి దాటుకొని పోతున్నది. నేను దానిని తాకి దండం పెట్టుకున్నాను. నా ప్రక్కమీదనున్న మూడు తమలపాకులు, రెండు వక్కలూ తినమన్న ఆదేశం వినిపిస్తే తిన్నాను. తెల్లవారేసరికి గుండెనొప్పి తగ్గిపోయింది. మరొక నెలకు పొట్టవాపు, ఆయాసమూ వచ్చాయి. ఇంట్లో అందరూ అన్నాలు గూడామాని నా మంచం చూట్టూ కూర్చున్నారు. నాకు కునుకు పట్టగానే కలలో శ్రీ సాయి దర్శనమిచ్చి, ఆవాలసైజు మాత్ర ఒకటి నోట్లో వేశారు. తెల్లవారేసరికి ఆరోగ్యంగా వున్నాను. మరోసారి ఇంజక్షన్ వలన 'రియాక్షన్' వచ్చి నా వళ్ళంతా గొడ్డళ్ళతో కొట్టినట్లు నొప్పి వచ్చింది. మళ్ళీ డాక్టర్ వద్దకు వెళ్ళలేక ఏడుస్తూ పడుకున్నాను. కునుకు పట్టగానే బాబా నా తలవద్ద కూర్చుని నా మాడుకు విభూతి అద్దుతున్నారు. ఆ స్పర్శకు నాకు మెలకువ వచ్చింది. అపుడు రాత్రి 3 గంటలైంది. నాకు తలనొప్పి మచ్చుకు గూడా లేదు. తరువాతొకసారి బాబా స్వప్నంలో నాకో నామంచెప్పి దానిని జపించుకోమన్నారు."

శ్రీమతి శేషారత్నం (ఒంగోలు) యిలా వ్రాస్తున్నారు : "బాబా మందిరంలో జరిగే అన్నదానాలకు వంట చేస్తూండటంతో చిన్ననాటి నా బాబా భక్తి మళ్ళీ మేల్కొన్నది. ఒక గురువారం నాడు మాస్టరుగారి వద్ద 'శ్రీ సాయి లీలామృతము' తీసుకున్నాను. నాటి సాయంత్రం మగతగా పడుకున్నపుడు శిరిడీలోని మశీదు, సమాధుల దర్శనమైంది, సమాధిపై గాలిలో బాబా కూర్చుని కన్పించారు. ఆయన నావైపు బెత్తం చూపి, తమ ఎదుట బాసిపట్టు వేసుకొని తలపై చీరకొంగు కప్పుకొని కూర్చోమన్నారు. అపుడు ఒక యోగముద్రచూపి, అరబ్బీలో ఒక మంత్రం చెప్పి దానిని జపించమన్నారు. మెలకువ వచ్చేసరికి ఆ మంత్రం మర్చిపోయాను. ఆ విషయం మాస్టరుగారితో చెపితే ఆయన ఆ మంత్రం కాగితంమీద వ్రాసి యిచ్చారు. మా ఆరేళ్ళపాప "శ్రీసాయి లీలామృతము" అక్షరాలు గుణించుకొని చదవటంలో తప్పులు దొర్లుతుంటే బాబా కల్లో కనిపించి, సరిగా చదవకుంటే తంతానని బెదిరించారు. పాప భయపడి చదవడమే మానేసింది. మాస్టరుగారితో చెబితే పాపకు ప్రసాదమిచ్చి, "ఈసారి సరిగా చదువు, బాబా కొట్టరులే!" అన్నారు. నాటి రాత్రి పాపకు మళ్ళీ కలలో బాబా కనిపించి, 'భయంలేదు. చదువు' అని ప్రేమగా చెప్పారు.

కె. నవనీతం (వడమాలపేట) యిలా వ్రాస్తున్నది : "నేను 1975లో యమ్. ఏ. పాసై ఒక యోగ శిక్షణా

శిబిరంలో శిక్షణ పొందుతుండగా ఒక సహపాఠి సులోచన చదువుతున్న 'శ్రీసాయి లీలామృతము' విని ఆ గ్రంథం తెప్పించి పారాయణ చేస్తున్నాను. ఒకరోజు ధ్యానంలో కాంతిమయ దేహంతో బాబా దర్శనమై చెప్పలేనంత సంతోషం కల్గింది. మరొకరోజు నా మేనల్లుడు జబ్బుచేసి చనిపోయినట్లు, నేను సాయిని స్మరించి తాకగానే అతడు జీవించినట్లు కనిపించింది. అప్పుడు మా వూళ్ళో అతనికి జబ్బుచేసి కొద్దిలో ప్రమాదం తప్పిందట. ఒకప్పుడు ధ్యానంలో నా శరీరం పైకెగిరి దూరాన పడుతుండటం వలన ఒళ్ళు నొప్పులు, జ్వరమూ వచ్చాయి. అప్పుడు ఊదీ తీసుకొని, బాబా సందేశం కోసం 'శ్రీసాయి లీలామృతం' తెరచి చూస్తే, ప్రధాన్‌తో అతడి తల్లికి వచ్చిన పక్షవాతం గురించి సాయి 'నాల్గురోజులలో తగ్గుతుంది' అని చెబుతున్నారు. అందువలన నాకెంత బాధగా వున్నా మందు తీసుకోలేదు. నాల్గవరోజు రాత్రి 9-30 గంటలకుగూడ నొప్పులు తగ్గేలాలేవు! నేను, సులోచన బాబా గురించి, మాష్టర్‌గారి గురించి 11-30 దాకా మాట్లాడుకుని పడుకున్నాము. నిద్రపట్టిన 5 ని॥లలో నన్నెవరో బలంగా అదిమేసినట్లయి, భయంతో 'బాబా!' అని కేకగూడ పెట్టలేకపోయాను. తెల్లవారేసరికి నొప్పులన్నీ తగ్గిపోయాయి. నాటినుండి నా నోటివెంట శివనామం బదులు సాయినామం దొర్లుతుండటం నాకే ఆశ్చర్యమనిపించింది. "

శిరిడీలో సమాధిమీద వున్న విగ్రహం చెక్కడానికి బొంబాయినుండి తాలిమ్ అనే శిల్పి వచ్చాడు. అనేక కోణాలలో తీసిన సాయిఫోటోలే లేవు. బాబాకు తీసిన ఫోటోలు చాలాకొద్ది. అవిగూడ వేరు వయస్సులకు చెందినవి. కనుక తాలిమ్, ఎంత శ్రమించినా నమూనామూర్తి తృప్తికరంగా రాలేదు. చివరి ప్రయత్నంగా అతడు సాయిని ప్రార్థించాడు. నాటి రాత్రి బాబా అతనికి కలలో కన్పించి, "నన్ను మళ్ళీ చూడాలంటే సాధ్యంగాదు. జాగ్రత్తగా చూడు!" అన్నారు. అతడు సాయిచుట్టూ నెమ్మదిగా తిరుగుతూ, ఆయన రూపాన్ని అన్నివైపులనుండి చూచాడు. తెల్లవారగానే ప్లాస్టర్‌తో చక్కని నమూనా మలచి దానినిబట్టి పాలరాతి విగ్రహం చెక్కాడు. దానిని శ్రీసాయి శరణానంద 1954లో సమాధిమీద ప్రతిష్టించారు. అంటే అది సాయి ప్రత్యక్షంగా చేయించుకున్న మూర్తి అన్నమాట.

సాయికి, ఆయన విగ్రహానికీ భేదం లేదు. శ్రీ దిలీప్‌కుమార్‌రాయ్ అను ప్రఖ్యాత సాధకుడు పూణేలో "హరేకృష్ణ ఆశ్రమం" స్థాపించాడు. వీరికొక మిత్రుడు 1968లో ఒక సాయి విగ్రహమిచ్చాడు. ఆయన దానిని ఆశ్రమం బయట వుంచారు. నాటి రాత్రి సాయి ఆయనకు కలలో కన్పించి, "నేను చలిలో వణికిపోతున్నాను. వెచ్చగా లోపల వుంచు!" అన్నారు. ఆయన వెంటనే నిద్రలేచి, మర్నాడే ఆ విగ్రహాన్ని ఒక ప్రత్యేకమైన మందిరంలో స్థాపించారు.

(ii)

కొందరికి సాయి అశరీరవాణి ద్వారా తమ సాన్నిధ్యమిచ్చి ఆపదలను తొలగిస్తున్నారు. కీ.శే. వెంకట నారాయణరాజు, మైసూరు సాయి మందిరంలో పూజారి. ఆయన సుమారు 17 సం॥ల పాటు రోజూ ఉదయమే కొన్ని ఆలయాలు చిమ్మి, ముగ్గులువేసి, పూజ చేసేవాడు. తర్వాత కోర్టువద్ద దస్తావేజులు వ్రాసి రోజుకు రూ 2/- లు సంపాదించేవాడు. ఒకరోజు యితడు ఈ కష్టజీవితాన్ని అంతమొందిచాలని విషం దగ్గరుంచుకొని, ఒక ఆలయంలో ధ్యానం చేసుకుంటున్నాడు. అపుడు, "నీవలన ఎన్నో జరగాలి, చనిపోవద్దు" అన్న మాటలు విన్పించాయి. వెంటనే రమణమహర్షి శరీరంతో దర్శనమిచ్చి, పై మాటలు అని, అతని చేయి పట్టుకుని, గేటు అవతల దించి వెళ్ళిపోయారు. అప్పటినుండి రాజుగారు వారినే తన గురువని తలచాడు. ఆయనే మళ్ళీ ఒకరోజు దర్శనమిచ్చి, "నీ గురువు నేనుగాదు, శిరిడీ సాయిబాబా!" అని చెప్పి అదృశ్యమయ్యారు. అప్పటినుండీ రాజుగారు సాయి భక్తుడయ్యాడు. శ్రీసాయి తరచూ వారికి కన్పించి మాట్లాడేవారు. ఎన్నోసార్లు కాకి, కోతి, ఆవుల రూపాలలో వారింటికొస్తే రాజుగారి భార్య గుర్తించక అదలించేవారట. తర్వాత బాబా అతనితో, "నేను వస్తే అమ్మ అదలించింది" అనేవారు. రాజుగారు

కొంతకాలం ఒక మర్వాడీవద్ద లెక్కలు వ్రాసేవారు. ఒకరోజు బాబా, "నీవిక కలం పట్టవద్దు. నా సేవ చేసుకో. అన్నమదే వస్తుంది!" అన్నారు. రాజు వెంటనే ఆ పని మానేశాడు.

ఒకరోజు వారింట్లో బియ్యం లేవు. నాడు ఆ మార్వాడీ భార్యకు బాబా పటంలో నుంచి, "వెంటనే రాజుకు బియ్యం పంపించు అని ముమ్మారు వినిపించింది. ఆమె వెంటనే బస్తా బియ్యం పంపింది గాని, రాజుగారు, "ఇవి తీసుకొమ్మని సాయి నాతో చెప్పాలి గదా!" అన్నారు. బాబా తర్వాత అతనిని అలానే ఆజ్ఞాపించారు. మరొక రోజు అతని భార్య బెంగుళూరు వెళ్ళారు. ఇంట్లో తినడానికేమీ లేదు. రాజుగారు సాయియే తనకన్ని యేర్పాట్లు చేస్తున్నారు గదా అని తలచి, దక్షిణ నుండి రూ॥ 10/- లు తీసుకోబోయారు. వెంటనే బాబా చెంపమీద కొట్టి, "నా డబ్బు తీసుకుంటావట్రా" అన్నారు. అతడు నివ్వెరబోయి వీధిలోకి వెళ్ళగానే అతని బాల్య స్నేహితుడు కన్పించి, బలవంతంగా హోటల్లో భోజనం పెట్టించాడు. తర్వాత ఆ మిత్రుడు ఆ రోజు ఊళ్ళోనే లేడని తెలిసింది. రాజుగారు మైసూరు సాయిబాబా మందిరంలో చాలాకాలం సేవచేసి యిటీవలే పరమపదించారు.

యఫ్. యం. భంగారా (కొత్త ఢిల్లీ) యిలా వ్రాసాడు: "పార్శీ సాంప్రదాయకురాలైన నా భార్య, బాబాలను నమ్మదు. నేను మాత్రం నమ్ముతాను. సం॥ 1956లో ఒక సాయిబాబా క్యాలెండరు మా యింట్లో వుండేది. ఒకరోజు అనాలోచితంగా ఆయనకు నమస్కరించి, ఆయన గురించి ఏమీ తెలియకుండానే అలా యెలా చేసానని ఆశ్చర్యపోయాను. ఇల్లు సర్దుతుండగా నా భార్యకు ఆ గదినుండి, 'బిడ్డా! నాకు మాలవెయ్యి. మేలు జరుగుతుంది' అని విన్పించిదట. ఆమె వెంటనే ఆ కేలండరుకు మాల వేసింది. అప్పటినుండి దానిని పూజిస్తున్నాము. అప్పట్లో మేము ఆర్థిక యిబ్బందులలో వున్నాము. ఆమె మా కుటుంబ శ్రేయస్సు కోసము, మాకు బాబు పుట్టాలనీ సాయిని ప్రార్థించింది. ఏడాదిలోగా మాకు బాబు పుట్టాడు. నా జీతంగూడ పెరిగి, మంచి బ్యాంక్ ఆఫీసర్‌గా పేరొచ్చింది. అలా మేము కోరుకున్నదల్లా జరిగేది. అవసరంలో ఆయన సందేశంగూడ అందేది. కాని యివన్నీ మా భ్రాంతు లేమోననుకునే వాళ్ళం. ఒకరోజు నేను యిన్‌స్పెక్షన్ కోసం వెళ్తుంటే, సాయంత్రానికి తిరిగి రావాలని నా భార్య పట్టుబట్టింది. కాని బాబా దగ్గర నాకు, 'నీవీరోజు తిరిగి రాలేవు!' అని విన్పించింది. దారిలో ఒకచోట రైలుగేటు వేస్తే ఆగాము. ప్రక్క బస్సులోని పెద్దమనిషి మా డ్రైవరుతో మాట్లాడి, మా కారులో కూర్చున్నాడు. నాకు కోపమొచ్చిందిగానీ, అతనిని బాబా పంపారని సర్దుకున్నాను. తర్వాత ఒక ఘాట్ రోడ్డు మలుపులో కారు బ్రేకులు విరిగిపోయాయి. కారు వేగంతో పల్లానికి దిగుతోంది. ఎడమవైపు పెద్ద లోయ వున్నది. డ్రైవరు కారును కుడివైపు కొండకు మోటింప జూచినప్పుడల్లా ఏదో ఒకటి ఎదురొచ్చి, కొద్దిలో ప్రమాదం తప్పుతోంది. బాబా మాటలు జ్ఞాపక మొచ్చి నాకు మరణం తప్పదనిపించింది. నా హస్తరేఖలూ అలానే సూచిస్తున్నాయి. నేను భయంతో 'సాయి, నా కుటుంబం కోసమైనా నన్ను రక్షించు!' అని ప్రార్థించాను. వెంటనే టైరుబ్రద్దలై కారాగింది. డ్రైవరు టైరుమార్చి బయల్దేరాక మర్నాడే యిల్లు చేరగలిగాను. బాబా మాటే నిజమైంది"

పార్సీ మతస్థుడు మానిక్‌షా (బొంబాయి) బాబాకు సమర్పించకుండా ఏమీ తినేవాడుగాదు. అయినా చాలాకాలం శిరిడీ వెళ్ళలేకపోయాడు. ఒకసారి నాగపూర్ వెళ్తూ, మధ్యాహ్నం మన్మాడ్ స్టేషనులో నిద్ర లేవగానే, ఒక అస్పష్టమైన మానవాకారం, "నీవు మన్మాడ్‌లో దిగిపో!" అని చెప్పి అదృశ్యమైంది, వెంటనే అతడు దిగిపోయాడు. శిరిడీ దర్శించి వచ్చేసరికి నాటి మధ్యాహ్నం అతడు దిగిన రైలుకు ఆ స్టేషన్ దాటగానే పెద్ద ప్రమాదమై ఎందరో మరణించారని తెలిసింది! అలానే సంతోష్‌వ్యాస్ (హోషంగాబాద్) అక్టోబరు 1980లో శిరిడీ వెళ్తూ రైలులో యింజను నుండి మూడవబోగీలో కూర్చున్నాడు. దారిలో ఇటార్సీలో అతని హృదయంలో, "వెంటనే దిగి చివరి పెట్టెలో ఎక్కు!" అని వినిపించింది. రైలు కదిలినా అతడు త్వరగా దిగి చివరి పెట్టెలో ఎక్కాడు. మరి రెండు ని॥లలో ఆ

రైలొక గూడ్సును ఢీకొని, మూడవ బోగీలోనివారు ఎందరో చనిపోయారు.

డి.యల్. కాంతారావుగారు కొమరవోలు గ్రామంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రోజులవి. ఆ దగ్గరలో ఎక్కడా వైద్యవసతిలేదు. ఒకరోజు వారి భార్యకు ప్రసవమయ్యాక బయటపడవలసిన 'మావి' చాలాసేపు పడిపోలేదు. గంటలోగా అది పడిపోకుంటే తల్లి ప్రాణానికి ప్రమాదం. ఆమెకు స్పృహ తప్పింది. ఆయన పూజగదిలోకి వెళ్ళి, సాయిని ప్రార్థిస్తుండగా బయట, "సుబ్బమ్మ వచ్చింది!" అన్న మాటలు విన్పించాయి. ఆమె ఒక నర్సు. ఆమె వెంటనే లోపలికి వెళ్ళి ఆ బాలింతరాలి పొట్ట నొక్కగానే 'మావి' పడిపోయి, ప్రమాదం తప్పింది. ఆమె ప్రక్కన పడివున్న బిడ్డను పొర్లించగానే కెవ్వున ఏడ్చాడు. తర్వాత తెలిసింది. సుబ్బమ్మ ఆ గ్రామస్థురాలే. విజయవాడలో నర్సుగా పనిచేస్తోంది. ఆ రోజెందుకో ఆకస్మిక ప్రేరణ కలిగి, సెలవు గూడ పెట్టకుండా వచ్చింది. వెంటనే వెళ్ళిపోవాలనుకున్నది. కానీ ఆమె యిల్లు చేరగానే యీ సంగతి తెలిసి అక్కడకొచ్చింది. **సాయి అనుగ్రహం ఎవరిద్వారానైనా మనకు చేరగలదు.**

(iii)

మహాసమాధి తర్వాతగూడ సాయి పల్కుతున్నా అది ఆయన శరీరంతో వున్నదానితో సమానంగా కాదనుకొంటాము. దాసగణుతో కలసి 1924లో శ్రీరామనవమికి శిరిడీ వెళ్ళి తిరిగి వస్తున్నారు రామచంద్ర పాటేవర్, అతని భార్య. మధ్యలో శ్రీమతి పాటేవర్‌కు దాహమేస్తుంటే రైలుదిగి, దూరాన పంపు దగ్గరకు వెళ్ళగానే రైలు కదిలింది. ఆమె తొందరగా ఒక పెట్టెలో ఎక్కబోయి కాలుజారి, రైలుకూ, ప్లాట్‌ఫారంకూ మధ్యలో పడిపోయింది. అందరూ కేకలుపెట్టి, గొలుసు లాగారు. రైలు కొంచెం ముందుకుపోయి ఆగింది. ఆమె భద్రంగా ప్లాట్‌ఫారం పైకెక్కి, కంగారుపడుతున్న జనంతో యిలా చెప్పింది : "కాలు జారగానే నాకేమీ తోచక బాబాను తలచాను. ఆయన నా ప్రక్కనే కనబడి, తమ చేతితో నన్ను ప్లాట్‌ఫారం క్రిందకు అదిమిపట్టి, నా ప్రక్కనే వున్నారు. కనుక నాకిక భయమేయలేదు. నేను పైకొచ్చేవరకు ఆయన కనిపిస్తూనే వున్నారు!"

ఆర్. యస్. చిట్నీస్ (కొత్తఢిల్లీ) 1950లో ఎవరో మహాత్ముని చిత్రపటం చూచి మంత్రముగ్ధుడయ్యాడు. ఆయన బాబా అని తెలిసాక, వారి చరిత్ర చదివి 1952లో శిరిడీవెళ్ళి సాయి సమాధిని చూడగానే అతని జీవితమే మారిపోయి అపారమైన శాంతి అనుభవమయింది. అప్పటినుండి బాబాను పూజించుకుంటున్నాడు. సం॥ 1957లో తన చెల్లెలికి జబ్బుచేసిందని తెలిసి విమానాశ్రయంలో కూర్చున్నాడు. తాను బొంబాయి చేరేలోగా తన చెల్లెలికి జబ్బు తగ్గించమని ప్రార్థిస్తున్నాడు. ఇంతలో అతని ప్రక్కనే కాళ్ళకు చెప్పులు లేకుండా తెల్లని కఫ్నీ, తలకు గుడ్డ ధరించిన ఒక వృద్ధ ఫకీరున్నారు. ఆయన నిరాశగా చేతులు, తలా త్రిప్పి అదృశ్యమయ్యారు. ఇంకెవ్వరూ ఆయనను చూడలేదట. అతడు బొంబాయి చేరేసరికి అతని చెల్లెలు మరణించింది. సం॥ 1965లో అతనికి విపరీతమైన కడుపునొప్పి వచ్చి, నీరు త్రాగడం గూడ కష్టమైంది. డాక్టర్లు ఆపరేషన్ చేయాలంటే అతడు భయపడి బాబాను ప్రార్థించాడు. నాటిరాత్రి కలలో భయంకరులు నల్గురు అతనిపైబడ్డారు. వెంటనే సాయి వారిపైబడి తరిమేసారు. తెల్లవారేసరికి చిట్నీస్‌కు జబ్బేలేదు. సం॥ 1966లో ఒక గురువారం సాయిచరిత్ర పారాయణ పూర్తిచేసి, ఆగ్రా వెళ్ళి, దారిలో సాయి దర్శనమివ్వాలని ప్రార్థించాడు. సుమారు 60 మైళ్ళు వెళ్ళాక కారు అకస్మాత్తుగా నిలిచిపోయింది. బాబావంటి ఫకీరొకరు కారు ప్రక్క నుండి ఆశీర్వదించి, దక్షిణ తీసుకొని మాయమయ్యారు. డ్రైవరు బ్రేకులు వేయకపోయినా కారు ఆగిపోవడం, చిట్నీస్‌కూ, వారి అబ్బాయికి, డ్రైవరుకూ తప్ప కారులోని మరెవ్వరికీ ఆ ఫకీరు కన్పించకపోవడమే చిత్రం!

ఇలాంటి అనుభవాలు సాయి అన్ని మతాలవారికీ ప్రసాదిస్తున్నారు. 'ఓస్‌బోర్న్' అను ఆంగ్లేయుడితో 1960 లో కలకత్తాలో ప్రక్కయింట్లో వున్న కుమారి డట్టన్ తన అనుభవం యిలా చెప్పింది : ఆమె కొంతకాలం ఒక క్రైస్తవ మఠంలో వున్నాక అధికారులతో భేదమొచ్చింది. తాను ఆశ్రమం విడిచిపోయాక తన గతేమిటని ఆలోచిస్తూ దిగులుగా కూర్చొన్నది. ఒక ఫకీరొచ్చి, "భయంలేదు, అంతా బాగుంటుంది" అని చెప్పి దక్షిణ కోరాడు. వెంటనే ఆమెకు ప్రశాంతి కల్గింది. ఆమె వద్ద పైకం లేదంటే ఆయన, "నీ సొరుగులో రూ॥ 35/- లున్నాయి చూడు" అన్నారు. చూస్తే పైకమున్నదిగాని, ఫకీరేలేడు. క్రైస్తవ స్త్రీల ఆశ్రమంలోకి పురుషుడు, ముస్లిమూ అయిన ఫకీరెలా వచ్చాడన్నదే ఆశ్చర్యం! ఆమె ఆశ్రమం విడిచాక, ఆమె మేనల్లుడు ఆమెనెంతో ప్రేమగా చూచుకుంటున్నాడు. ఇదంతా విని ఓస్‌బోర్న్, అప్పుడామెకు సాయి పటం చూపాడు. ఆమె ఆశ్చర్యంతో, "నాకు దర్శనమిచ్చినది వీరే!" అన్నది.

మహబూబ్‌బాషా, సెప్టెంబరు 30, 1982 న తన భార్యకు గర్భకోశంలో వ్రణముంటే గూడూరులో డా॥ సి. ఆర్. రెడ్డిగారి ఆస్పత్రిలో చేర్చాడు. ఆపరేషన్ జరుగుతున్నది. ఆపరేషన్ మధ్యలో ఆమె పరిస్థితి ప్రమాదించింది. బాషా ఒక్కడే డాక్టర్‌గారి గదిలోని బాబాపటం ముందు నిలచి కన్నీటితో ప్రార్థిస్తుండగా వెనుకనుండి తెల్లని గుడ్డలు ధరించిన ఒక ఆజానుబాహువు భుజంతట్టి, "నీ భార్యకేమీ అవదు. బాధపడకు" అన్నారు. బాషా కన్నీరు తుడుచుకొని మళ్ళీ వెనుకకు తిరిగి చూచేసరికి అక్కడెవరూ లేరు! మరుక్షణమే రోగికి ప్రమాదం తప్పిందని నర్సు చెప్పింది.

దయాళ్ శరణ్ (కర్నూల్) యిలా వ్రాశారు : "సం॥ 1981 లో 'శ్రీ సాయి లీలామృతము', 'శ్రీ గురుచరిత్ర' పారాయణ చేసి శ్రీ అయ్యప్ప దర్శనానికి వెళ్ళాను. వ్యానులో కొంతదూరం వెళ్ళాము. తర్వాత 'ఇరుముడి' తో కొండలమీదుగా కొంతదూరం వెళ్ళాక, 49 సం॥ల వయస్సు గల నాకు నీరసమొచ్చి, దిక్కుతోచక బాబాను ప్రార్థించాను. కొద్ది క్షణాలలో చేతిలో కర్ర, కాళ్ళకు రబ్బరు చెప్పులు వేసుకున్న ఒక వృద్ధుడొచ్చి, నా ఎడమ చేయి తన చంకలో పెట్టుకొని, 'భయంలేదు, నిదానంగా నా వెంట నడు!' అన్నారు. వెంటనే నీరసమంతా పోయింది. 'ఈయనెవరు, కొండపైకి చెప్పులతో వచ్చాడు?' అనుకున్నాను. ఆ జనం తొక్కిడిలో కొందరు కాలుజారి పడుతున్నారు. కొందరి 'ఇరుముడు'లు పడిపోయాయి. అందరూ ఎంతో శ్రమపడి నడుస్తున్నారు. అరగంటలో లైట్లతో వెలుగుతున్న ఒక చోటుకు రాగానే, నాచేయి వారి చంకలోంచి జారిపోయింది. వారికి కృతజ్ఞత చెప్పాలని చూస్తే ఆయనెక్కడా కన్పించలేదు!! అందరి కాళ్ళూ పరీక్షగా చూచాను గాని, చెప్పులేసుకున్న వాళ్ళెవ్వరూ లేరు. ఆ రూపంలో సాయియే నన్ను గమ్యం చేర్చారు. "

ఒకరోజు శిరిడీకి 600 మంది భక్తులు వస్తున్నామని సాయి సంస్థానాధికారి పాఠక్‌గారికి కబురు చేశారు. వారి ఏర్పాటుకు రూ-- 1200/- లు కావాలి. కాని నాటి నిధులు ట్రెజరీలో జమచేసామే. ఎలా? అనుకుంటుంటే ఎవరో యిద్దరొచ్చి, 'మేము త్వరగా వెళ్ళాలి, ఈ పైకం రేపు వినియోగించండి' అని బ్రతిమాలి, రూ॥ 1200/- యిచ్చి వెళ్ళిపోయారు. వాళ్ళు శిరిడీ గ్రామస్థులమని చెప్పారు. కాని విచారిస్తే ఆ గ్రామస్థులు కారని తెలిసింది. మూడవరోజు ఒక భక్తుడు పాఠక్‌తో, "సాయి, అబ్దుల్లా వచ్చి మీకు డబ్బిచ్చినట్లు నాకు మూడురోజుల క్రితం కలొచ్చింది" అన్నాడు.

బాబా తమ భక్తులనెన్నడూ పస్తుంచనన్నారు. బోరీబందర్‌కు చెందిన ఒక అడ్వకేట్ శిరిడీ వెళుతుంటే టిక్కెట్టు, రూ॥ 100/- లు రైల్లో ఎవరో దొంగిలించారు. ఆ సంగతి ఎంత చెప్పినా టికెట్ కలెక్టరు వినలేదు. అంతలో ఒక వృద్ధుడు అతని చేతికొక టికెట్ యిచ్చి, తనవారొకరు రానందున ఆ టికెట్ అదనంగా వుందని చెప్పాడు. తాను సాయిభక్తుడనని పరిచయం చేసుకొని, అతని శిరిడీ ఖర్చులన్నీ గూడ భరించి బాబా చరిత్ర గ్రంథంగూడ యిచ్చాడు. బొంబాయిలో తన చిరునామా గూడ యిచ్చి వెళ్ళిపోయాడు. అడ్వకేట్ తిరిగివస్తూ, దారిలో

చరిత్ర గ్రంథం తెరవగానే దానిలో రూ. 10/-ల నోట్లు పది వున్నాయి. అతడిల్లు చేరేసరికి రైల్లో పోయిన పర్సు బాబాపటం దగ్గర వున్నది! ఆ వృద్ధుడికివ్వవలసిన పైకం తీసుకెళ్ళి బొంబాయిలో విచారిస్తే అతని ఆచూకీయే లేదు!! ఆ వృద్ధుడు శ్రీ సాయి బాబాయే.

రాహూరీలో కులకర్ణి తండ్రి 1965లో జబ్బుపడ్డప్పుడు ఒక ఫకీరు వచ్చారు. రోగి భార్య ఆయనకు భిక్ష యిచ్చి, తన భర్తను రక్షించమని కోరింది. ఆయన చిటికెడు పాదధూళి యిచ్చి, "దీనిని నీళ్ళలో వేసి త్రాగమను, 3 రోజుల్లోపల తగ్గుతుంది. వెంటనే నా దర్శనానికి శిరిడీ రమ్మను" అని చెప్పి వెళ్ళిపోయారు. అలానే మూడురోజుల్లో అతని రోగం తగ్గింది. ఆ కుటుంబం శిరిడీ వచ్చి స్థిరపడ్డారు. సం॥ 1976లో కులకర్ణికి జబ్బు చేసింది. ఒకనాటి రాత్రి అతడికి మెలకువ వచ్చేసరికి, బాబా అతడి ప్రక్కనే కన్పించారు : అప్పుడు తలుపులు వేసేవున్నాయి. ఇంట్లో దొంగ దూరాడని అతను కేకలేసేసరికి బాబా నవ్వి, ఆశీర్వదించి మాయమయ్యారు. తెల్లవారేసరికి అతడి జబ్బు తగ్గిపోయింది.

ఒక పేద వితంతువు 1956 లో, పోలియో వచ్చిన తన కొడుకును శిరిడీ తీసుకొచ్చింది. అతనిని కూలివాని భుజంమీద కూర్చోబెట్టి సమాధికి ప్రదక్షిణం చేయిస్తోంది. అది సిగ్గనిపించి, అతడొకరోజు తన బదులు తల్లినే ప్రదక్షిణ చేయమని చెప్పి, ఒంటరిగా గదిలో కూర్చున్నాడు. అకస్మాత్తుగా ఒక సాధువు అతని యెదుట కన్పించి, బలవంతంగా అతనిని లేవదీసి సమాధి వద్దకు తీసుకెళ్ళాడు. అక్కడ అతనికొక స్తంభం పట్టుకు నుంచోమని చెప్పి, ఆయన మాయమయ్యాడు. తర్వాత కొడుకు తనతోకూడా నడవడం చూచాకగాని తల్లి అతని మాట నమ్మలేదు.

బొంబాయిలో ఉద్యోగం చేస్తున్న కరుణాకర్ ఉబ్బసం బాధ భరించలేక ఉద్యోగం మాని, శిరిడీ చేరి, అక్కడ చావడిలో సేవ చేస్తున్నాడు. ఒకరాత్రి అతడు తీవ్రమైన జ్వరము, దగ్గుతో బాధపడుతున్నాడు. కొద్ది కునుకుపట్టగానే కలలో సాయి కన్పించి, "ధునిలో కొబ్బరికాయ, అగరవత్తులు, కర్పూరము సమర్పించు!" అన్నారు. అతడు మరురోజు ధునిపూజ చేసాక, పగలు బాధలు తగ్గి, రాత్రి మాత్రం రాసాగాయి. అతడు ఒంటిపూట భోంచేస్తూ పగలంతా పనిచేసేవాడు. ఆ రోజుల్లో శివనేశన్ స్వామి మధ్యాహ్న భోజనమయ్యాక, ద్వారకామాయిలోని రథశాలలో పడుకునేవారు. ఒకరోజు సాయంత్రం 4 గం॥లకు కరుణాకర్ ఆయనవద్ద కొచ్చి, 'నాకు మీరేమైనా తినడానికిచ్చారా?' అన్నాడు. లేదన్నారు స్వామి. అతడాశ్చర్యపోయి, "అదేమిటి, మీరు నాకీ వేరు యిచ్చి, దీన్ని నోట్లో వుంచుకుంటే నా బాధ తగ్గుతుందని చెప్పారు కదా?" అని ఒక వేరు చూపాడు. ఇద్దరూ ఆశ్చర్యపోయి అది సాయిలీలే అని గుర్తించారు. దానితోనే అతడి ఆరోగ్యం బాగుపడింది. అతడు శిరిడీ విడిచి వెళితే వ్యాధి మళ్ళీ వచ్చి, తిరిగి శిరిడీ రాగానే తగ్గేది! అందుకే అతడు శిరిడీలో వుండిపోయాడు.

జె. వి. రమణమూర్తి (రాజమండ్రి) యిలా వ్రాసారు : "స్వతహాగా నేనెంతో కోపిష్టిని. ఎన్నో అపరాధాలు చేసాను. 'శ్రీ సాయిలీలామృతము' ఒకసారి చదివాక నాకు కోపం తగ్గిపోయింది. కొంతకాలానికి నేను శుష్కిస్తుంటే డాక్టర్లు పరీక్షచేసి కాన్సర్ అన్నారు. నేను చికిత్సకు మద్రాసు వెళ్ళాలని రూ॥ 3000/- లు సిద్ధం చేసుకొని జూన్ 25 సాయంత్రం 'శ్రీసాయి లీలామృతం' పారాయణ చేస్తుండగా ఒక వృద్ధ బ్రాహ్మణుడు విఠల్ నామం ముద్రించిన శాలువ కప్పుకొని వచ్చాడు. మొదట కొద్దిసేపు నావద్దనున్న గ్రంథాలు తిరగేసి, 'బాగుంది! నాకు రూ. 20/- లు కావాలి' అన్నారు. నా దగ్గర డబ్బు లేదంటే, 'మద్రాసు వెళుతున్నావుగా, వెళ్ళు నీకేమీ వుండదు!' అని వెళ్ళిపోయారు. ఇంతలో నా భార్యవచ్చి, ఆ రూపంలో బాబాయే వచ్చారనగానే నాకు దుఃఖమాగలేదు, మరురోజు గురువారం, భరద్వాజగారినడిగితే, బాబాకు అగరొత్తిపెట్టి క్షమాపణ చెప్పుకోమన్నారు. అలానే చేసాను. నాటి సాయంత్రం సత్సంగం నుండి యింటికి వెళ్ళేలోగానే ఆ స్వామి వచ్చి రూ. 20/- లు తీసుకెళ్ళారట. తర్వాత నన్ను మద్రాసులో పరీక్షచేసి నా వ్యాధి కేన్సర్ కాదని తేల్చారు".

యస్. బాబువలీ యిలా వ్రాసాడు : "బి. ఎ. చదివిన నేను నాస్తికుడిగా, దేశదిమ్మరిగా తిరిగేవాణ్ణి. సం॥ 1985 లో నా వివాహమై ఒంగోలు వస్తుంటే నా సోదరికి జ్వరమొచ్చింది. ఒక స్టేషన్‌లో ఒక సాధువు వచ్చి సాయిని స్మరించి విభూతి యిస్తే గంటలో ఆమెకు జ్వరం తగ్గింది. అప్పటినుండి నాకు విశ్వాసం కల్గి, 'శ్రీ గురుచరిత్ర', 'శ్రీ సాయి లీలామృతము' పారాయణ చేస్తున్నాను. ఆ క్రిందటి సంవత్సరం నా తల్లిదండ్రులు పారాయణ చేస్తుంటే ఒక సాధువు ఒంగోలులో మాయింటికొచ్చి, నాకు త్వరలో వివాహమవుతుందని, తాము నవంబర్ 1985లో వస్తామనీ చెప్పారు. ఆ లోపలే నాకు పాప పుట్టింది. తర్వాత ఆ సాధువు మా ఎదురింటికి వచ్చి, మాయింట్లో 'గులాబి' వున్నదని, అందువలన ఆ పురుటింటికి వెళ్ళననీ చెప్పారట. పాప పుట్టిన 40వ రోజున భరద్వాజ మాస్టర్‌గారి దగ్గరకు తీసుకువెళ్ళి వారికి నచ్చినపేరు పెట్టమంటే, ఆయన పాపకు 'గులాబి' అని పేరు పెట్టారు!"

ఒకరోజు శ్రీమతి పి. అరుంధతి 'పైలాను'లో వారి యింటి గడపలో పడుకొన్నారు. ఇంటి పూజగదిలోంచి బాబావచ్చి, "మంచం అడ్డం తియ్యి! అక్కడ అబ్బాయి ఆపదలో వున్నాడు!!" అన్నారు. ఆమె మంచం తీయగానే ఆయన బైటకు వెళ్ళి మరలా వచ్చి, "అదృష్టం! నీవు మంచం తీయడం ఆలస్యమైంది గనుక నేనొకచెట్టు అడ్డమేసాను. దానికి కొట్టుకొని జీపు ఆగింది" అని పూజ గదిలోకి వెళ్ళిపోయారు. కొద్దిసేపట్లో కబురొచ్చింది. వారి అబ్బాయి నాగార్జునసాగర్‌లో జూనియర్ ఇంజనీర్. సరిగా ఆ రోజు అదే సమయానికి అతడెక్కిన జీపు ఒక లోయను సమీపిస్తుండగా బ్రేకులు పనిచేయలేదు. కొద్ది అడుగులలో జీపు ఒక లోయలో పడుతుందనగా చిత్రంగా ఒక చెట్టుకు కొట్టుకొని ఆగిపోయింది. ఎవరికీ ఎట్టి ప్రమాదమూ జరగలేదు. ఇంట్లో పటముంటే సాయి వున్నట్లే!

గుజరాత్‌లో (1898 - 1976 మధ్యకాలంలో) చునీలాల్ ఆశారామ్ భగత్ అనే గొప్ప సాయి భక్తుడుండేవాడు. అతడు మొదట శ్రీ ఉపాసనీబాబా వద్ద ఉపదేశము, తర్వాత శ్రీధునివాలేదాదాగారి అనుగ్రహమూ గూడ పొందాడు. అటు తర్వాత అతడు ఒకరోజు కరాచీలో సముద్రతీరాన నడుస్తున్నాడు. హఠాత్తుగా శ్రీ సాయిబాబా అతనికి ప్రత్యక్షమై, అతనిని సముద్రంలోకి నడవమన్నారు! వెంటనే అతడు సముద్రంలోకి నడిచాడు. అతడి తల మునిగిన క్షణంలోనే అతణ్ణి నీరు విసురుగా ఒడ్డున పడేసిందిగాని అప్పటికే అతడు బాహ్యస్మృతి కోల్పోయి చాలాసేపటివరకూ స్పృహలోకి రాలేదు. అతడు తిరిగి యిల్లు చేరాడు. తర్వాత ఒక బక్రీద్ పండుగనాడు అతనికి మశీదుకు వెళ్ళి నమాజు చేయాలన్పించింది. అతడు ధోవతి, టోపి పెట్టుకొని నమాజుకు వెడితే ముస్లిములు దండిస్తారని బంధువులు హెచ్చరించినా అతడు అలానే వెళ్ళాడు. అక్కడ అతనికెవరూ అడ్డుచెప్పలేదు. అతడు 'నమాజు' పూర్తి చేసుకొని బయటకు రాగానే మరలా సాయిబాబా అతనికి భౌతికంగా దర్శనమిచ్చి భుజంతట్టి, 'భేష్, చాలా మంచిపని చేసావు! ఇప్పుడు నగ్నంగా ఇంటికి పో!' అన్నారు. అతడు నివ్వెరపోయాడు. అది ఇస్లాముకు విరుద్ధం గనుక అలాచేస్తే అచటి ముస్లింలతో తగువు కొనితెచ్చుకోవడమే అవుతుంది. కాని సద్గురువు ఆజ్ఞ మీరడమంటే జీవితాంతమూ కష్టించి సాధన చేసాక అంతిమ పరీక్షలో విఫలులవటమే; వంటంతా చేసుకొని అన్నం తినలేకపోయినట్లే! అట్టి అవకాశం యికరాదు. వెంటనే అతడు ఒక స్నేహితునికి సాయి ఆజ్ఞ తెల్పి, తాను విడచిన వస్త్రాలు భద్రంగా యిల్లు చేర్చమని చెప్పి వెంటనే తన వస్త్రాలు విడిచాడు. అలా చేయగానే అతనికి ఆనంద పారవశ్యంకల్గి, పెద్దగా కేకపెట్టి, జనంతో కిక్కిరిసిన కరాచీ వీధులవెంట సుమారు 6,7 మైళ్ళు పట్టపగటి సమయంలో పరిగెత్తాడు! అంతకు మించి అతడికింకేమీ తెలియలేదు. ఒక్కచోట మాత్రం ఒక బ్రిటిష్ పోలీస్ యిన్స్పెక్టర్ అతనిని అడ్డగించబోయాడు. చునీలాల్ పెద్దగా "సాయిబాబా! ఈద్ ముబారక్!" అని కేకవేయడంతో ఆ పోలీసు అధికారి గూడ వైదొలగి, 'ఈద్‌ముబారక్' చెప్పాడు!!

తర్వాత కొద్దికాలంలోనే అతనికి ఆధ్యాత్మిక వికాసం కల్గింది. శ్రీ సాయిబాబా ఆయన ఎదుట సాక్షాత్కరించి

ఎన్నెన్నో యోగసాధనలు నేర్పారు; ఎన్నో అద్భుతమైన అనుభవాలు ప్రసాదించారు. చిట్టచివరకు శ్రీరామనవమి, మార్చి 29, 1939న వారణాసిలో అతనికి అద్వైతానుభవంగూడ ప్రసాదించారు. అటుతర్వాత ఆయన 'శ్రీ మోటా మహరాజ్' అనుపేర పరిపూర్ణుడైన సిద్ధపురుషుడిగా పేరు పొందారు. 'నశ్వరమైన శరీర సౌఖ్యాలపట్ల ఉదాసీనత చెంది, అత్యంతిక సుఖంకోసం యత్నించే భక్తులకు పరమార్థాన్ని చేకూర్చడం శ్రీ సాయిబాబాకెంతో సంతోషము'' అన్న ''శ్రీసాయి సచ్చరిత్ర (మరాఠీ) వాక్యం ఎంత సార్థకమో!

★★★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 24

శ్రీ సాయిబాబా సూక్తులు

ఆత్మనిష్ఠులైన ఋషుల నోటినుండి వెలువడిన వాక్యాలే వేదాలు, ఉపనిషత్తులు, ధర్మశాస్త్రాలు, పురాణాలు. బ్రహ్మాన్ని తెలుసుకున్నవాడు బ్రహ్మమే అవుతాడని గదా ఇవన్నీ చెప్పేది? కనుక అవి భగవంతుని వాక్యాలే. ఏ శాస్త్రంలో ఆరితేరిన వారినోట ఆ శాస్త్రమే పలుకుతుంది. కారణం అది వారి అనుభవం. వారు ఆ రీతిన సాధనచేసి పూర్ణులయ్యారు. గనుక వాటి అర్థాన్ని గూడ మళ్ళీ వారే మనకు చక్కగా వివరించగలరు. రోగికి వైద్య గ్రంథం కంటే ఆరితేరిన వైద్యుడే మేలు చేయగలిగినట్లు శాస్త్ర వాక్యం కంటే మహనీయుల వాక్యమే ఎక్కువ ప్రమాణం. అందుకే వారినాశ్రయించాక, 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య' అన్న సూత్రాన్ని పాటించాలి. అందుకే సద్గురువునాశ్రయిస్తే శాస్త్రషట్కం అక్కర్లేదన్నారు సాయి. అంతేకాదు, పరబ్రహ్మ స్వరూపులైన మహనీయుల అనుభవం నుండి వెలువడే వాక్యాలు వేదంవలె మంత్రాలు. వాటిని విని (శ్రవణం చేసి), బాగా ఆలోచించి, (మననం చేసి) జీవించాలి. అదే ఉపనిషత్తులు, భగవద్గీత చేప్పేది. అనేక సందర్భాలలో వేరువేరు భక్తులతో శ్రీ సాయి చెప్పిన వాక్యాలు ఒక వరుసలో కూర్చుకొని చదివితే సంపూర్ణమైన ఆధ్యాత్మబోధ లభిస్తుంది. కనుక వాటిని వేరువేరు సూక్తులుగా గాక, వరుసలో కూర్చుకొని చూస్తేగాని వాటికి సరియైన అర్థం బోధపడదు.

బాబా : "ఆద్యంతాలు లేని యీ పాదాలు పరమ పవిత్రమైనవి, నాపై పూర్తి విశ్వాసముంచు, నీ కోరిక నెరవేరుతుంది. నాపై నీ దృష్టి నిలుపు, నేనూ నీపై నా దృష్టి నిలుపుతాను. నిన్ను చివరికంటా గమ్యం చేరుస్తాను. నన్ను నమ్మినవారినెన్నడూ పతనం కానివ్వను. ఈ సద్బ్రాహ్మణుడు లక్షలాది జనాన్ని శుభ్రమార్గంలో గమ్యం చేరుస్తాడు. నన్నే ధ్యానించి నా లీలలు గానం చేసేవారు నేనుగా మారిపోతారు; వారి కర్మ నశిస్తుంది. నేనెప్పుడూ వారి చెంతనే వుంటాను. నా సమాధి నన్నాశ్రయించిన వారితో మాట్లాడుతుంది. వారి వెంటనే తిరుగుతుంది. నా సమాధి నుంచి గూడ నేను నా కర్తవ్యం నిర్వహిస్తాను. నా నామం పలుకుతుంది. నా మట్టి సమాధానం చెబుతుంది. (అలాచేస్తే) నీవు వేల మైళ్ళ దూరాన వున్నా చివరి క్షణంలో నా చెంత చేర్చుకుంటాను, నేను ఎందరినో కాపాడడానికి వేల క్రోసులు వెళ్ళాలి. ఈ నా దేహం ఎవరి సేవకుడూగాదు. అది అల్లాకు మాత్రమే బానిస.

బాబాను ఎలా ధ్యానించాలి :- "నేను భగవంతుని బానిసను; భగవంతుడే యజమాని. బ్రహ్మ నా తండ్రి, మాయ నా తల్లి, వారి ఐక్యం వల్లనే నాకీ దేహమొచ్చింది; నేనే దైవం; నేనే శిరిడీలోను, ఎల్లెడలా వున్నాను. సర్వజగత్తూ నాలోనే వున్నది. నీవు చూసేదంతా కలసి నేను; సాయి శిరిడీలోనే వున్నారనుకొనేవారు నన్నసలు చూడనట్లే. అన్నీ నావే; నేనే అన్నీ అందరికీ యిచ్చేది. నా ఆజ్ఞలేక ఆకైనా కదలదు, నేను అందరినీ సమానంగానే చూస్తాను; నాకెవ్వరిమీదా కోపంరాదు. తల్లికి ఎప్పుడైనా బిడ్డపై నిజంగా కోపం వస్తుందా? సముద్రమెన్నడైనా నదులను త్రిప్పివేస్తుందా?"

జగత్తు-సంసారము :- "ఈ ప్రపంచం చాలా వింతైనది. అందరూ నా ప్రజలే. నేను అందరినీ సమానంగానే చూస్తాను. (కాని) ఈ ప్రపంచం మన మధ్య (నేను-నీవు అనే) భేదమనే అడ్డుగోడ నిలుపుతుంది. (అందుకే)

పదిమంది ఒకచోట చేరితే ఏదో ఒక గొడవ రేగుతుంది. వారిలో కొందరు దొంగలవుతారు. వారికి నేను చేయగల్గినదేమున్నది? రేపాకనాటికి చావబోయే వారు గూడ (ఈరోజు) ఇతరులను చంపడానికి (నాశనం చేయడానికి) పన్నాగాలు చేస్తుంటారు. వారు నాకెంతో బాధను కల్గిస్తారు. ''

తరించే మార్గం :- నీవు యీ (భేదమనే) గోడను కూలద్రొయ్యి. ఎవరికెవరు శత్రువులు? అంతా ఒక్కటే.

సాధన :- ''ఎవరైతే ఎప్పుడూ నన్నేచూస్తూ, నా గురించే వింటూ, ఎప్పుడూ 'సాయి, సాయి' అని స్మరిస్తూ, నా యందే మనస్సు నిలుపుతారో, వారు నిశ్చయంగా దైవాన్ని చేరుతారు. వారు యిహపరాల గురించి భయపడనక్కర లేదు. నా భక్తుని యింట్లో అన్నవస్త్రాల లేమి వుండదు. నా బిడ్డలనెలా పస్తుండనిస్తాను? (కాని మీరు) తల్లికి తగిన బిడ్డలుకండి, (పుణ్యము, జ్ఞానము అనే) మీ భాండాగారాలను నింపుకోండి. నాకు అర్పించకుండా ఏమీ తినని వారికి నేను బానిసను. నావాణ్ణి ఎన్నటికీ దూరంగానివ్వను. నన్ను నమ్మినవారినెన్నడూ పతనం గానివ్వను. (నాపై నీకు విశ్వాసముంటే) సత్యాన్ని అంటిపెట్టుకో, నీ చెంతనుండి కాపాడుతాను. ఇచ్చిన మాట తప్పక నెరవేర్చు. నాపై విశ్వాసముంచి, ఓరిమితో వుండు, నీవెక్కడ వున్నా నీ వెంట నేనుంటాను.

పనిచేయి; దేవుని నామము ఉచ్ఛరించు; సద్గ్రంథాలు చదువు. పోటీలు, వంతులు కీచులాటలూ మానితే దేవుడు కాపాడతాడు. నీవేమి చేసినా క్షుణ్ణంగా చేయి; లేదా చేస్తానని ఒప్పుకోకు. ఎవరి సేవనూ ఉచితంగా తీసుకోవద్దు. ఉదారంగా ప్రతిఫలమివ్వు. ఇది మన నియమం గావాలి.

నీ దగ్గరకు ఏ ప్రాణివచ్చినా తోలెయ్యవద్దు, ఆదరించు. ఋణానుబంధంపై నమ్మకముంచి గుర్తుంచుకో. ఆకలిగొన్న వారికి అన్నం, గుడ్డలు లేనివారికి గుడ్డలు యివ్వు. భగవంతుడు సంతోషిస్తాడు. నిన్నెవరైనాసరే ఏమైనా అడిగితే సాధ్యమైనంతవరకు యివ్వు, లేక యిప్పించు. ''లేదు'' అనవద్దు. ఇచ్చేందుకు ఏమీలేకపోతే మర్యాదగా చెప్పు. చులకన చేయడం, కోపగించుకోవడం తగదు. నీ దగ్గరున్నా యివ్వాలనిపించకపోతే లేదని అబద్ధం చెప్పవద్దు. ఇవ్వలేనని మర్యాదగా చెప్పు. ఇవ్వలేకపోతే దానికి కారణం చెప్పు. అయిష్టమే కారణమైతే అదే చెప్పు.

ప్రాణులన్నిటి రూపాలలో నేనే సంచరిస్తుంటాను. ఎవరెవరిపై కోపించినా, దూషించినా నాకు చాలా బాధ కల్గుతుంది. ఎవడు ధైర్యంగా నిందను, దూషణనూ సహిస్తాడో వాడు నాకెంతో ఇష్టుడు. నిన్నెవరైనా బాధించినా వాడితో పోట్లాడవద్దు. సహించలేకపోతే ఒకటి రెండు మాటలలో ఓర్పుగా సమాధానం చెప్పు. లేకుంటే నా నామం స్మరించి అక్కడనుండి వెళ్ళిపో. వాడితో యుద్ధంచేసి దెబ్బకు దెబ్బ తీయవద్దు. నీవెవ్వరితోనైనా పోట్లాడితే నాకు చాలా ఏహ్యం కల్గుతుంది. ఎవ్వరి గురించి తప్పుగా మాట్లాడవద్దు. నీగురించి ఎవరైనా మాట్లాడినా చలించకు. వాడి మాటలు నీకేమీ గుచ్చుకోవుగదా! ఇతరులు చేసే పనులకు ఫలితం వారే అనుభవిస్తారు.

నీవు చేసే పనుల ఫలితమే నీకుంటుంది. తక్కిన ప్రపంచం తలక్రిందులు కానివ్వు. దాన్ని లక్ష్యపెట్టక, ఋజుమార్గంలో వెళ్ళు. ఆనందానికి యిదే మార్గం.

అరిషడ్వర్గాలలో అసూయను జయించడం చాలా సులువు. దానివలన మనకే లాభమూ లేదు. అవతలవారికి ఏ నష్టమూలేదు. అసూయంటే యితరుల బాగును సహించలేకపోవడమే. ఓర్చుకోలేక అపవాదులు కల్పిస్తాము. వారు నష్టపోతే సంతోషిస్తాము. దానివలన మనకేమి ప్రయోజనము? అవతల వాడికి మంచి జరిగితే మనకేమి నష్టము? కాని యిది ఎవరూ ఆలోచించరు. వాళ్ళు బాగుపడితే మనకే మేలు జరిగినట్లు భావిద్దాం! లేదా మనమూ ఆ మేలును పొందే యత్నం చేద్దాం. వాడు మన సొత్తేమి లాక్కున్నాడు? వాడి కర్మననుసరించి ఫలితాన్ని వాడు

పొందుతాడు.

భగవంతుడికి చెడంటేను; చెడుకు భగవంతుడంటేనూ భయం; మంచి యొక్క ఫలితం గొప్పది; చెడుకు ఫలితం స్వల్పం. మన శరీరంలో ఒక హీనజాతివాడున్నాడు. వాడిని వెళ్ళగొట్టాలి. (అందు కోసం) మన వాడాలోని వారందరినీ తెలుసుకోవాలి. ఎవ్వరితోనూ వాదించవద్దు, పది మాటలకు ఒక మాటతో సమాధానమివ్వాలి; మనుష్యులు వారంతా ఒకరినుంచి యింకొకరు వేరనుకుంటారు. కాని అదే పొరపాటు; 'నేను నీలో వున్నాను, నీవు నాలో వున్నావు'. ఇలా భావన చేస్తుండు. అదే అనుభవమవుతుంది. అల్లాహ్ కానిదేదీలేదు; ఆయన పేదలపాలిటి పెన్నిధి. దైవమిచ్చింది పోదు, మానవుడిచ్చింది నిలవదు. భోగి కంటే (యిది తెలిసిన) యోగి ఎప్పుడూ మెరుగే. 'రాజై వుండిగూడ బిచ్చగాని దుస్తులు ధరించేవాడే (విరాగియే) మంచివాడు. (అంటే), మనను భగవంతుడు ఎలా సృష్టించాడో అలానే తృప్తిగా వుండాలి'. అల్లాహ్‌యే సర్వస్వం. అల్లాహ్ నామమే శాశ్వతం. స్వల్పంగా తిను. రుచులకు పోవద్దు. ఒకటి రెండు వంటకాలతో తృప్తిచెందు. యాత్రకు, పబ్బానికి, పండుగకు అప్పు చేయవద్దు. "నన్ను సరిగా వినియోగిస్తే చక్కగా సేవచేస్తాను" అంటుంది ధనం. "నన్ను సరిగా వండితే నీకు బాగా ఉపయోగపడతాను" అంటుంది అన్నం. (అందుకే) వైరాగ్యాన్ని అంటిపెట్టుకో, దైవాన్ని స్మరిస్తూ అహాన్ని చంపుకో, సన్యాసికి స్త్రీలుచాలా ప్రమాదం, కామాన్ని జయించనివాడెవడూ దైవాన్ని చూడనైనాలేడు. (అందుకే) ఏమీకోరక సర్వగతుడైన దైవంమీద మనస్సు నిలుపు. (అదే ధ్యానం) అలా చేస్తే గమ్యం చేరుతావు.

శాస్త్రాలు, మంత్రాలు అబద్ధమెన్నటికీ కావు. వాటిని తప్పుగా అర్థం చేసుకొని అతిథి అంటే మానవుడేనని, బ్రాహ్మణుడేనని అనుకుంటున్నావు. అందుకే నీకు అతిథులు దొరకటం లేదు. ఆకలితో వేళకు వచ్చిన ఏ ప్రాణియైనా సరే -- పక్షైనా, పురుగైనా అది అతిథే, ఆకలితో ఆహారం కోసం వచ్చేవన్నీ అతిథులే. (కనుక) కాకబలికి సమృద్ధిగా అన్నం యింటి బయట విడిచిరా. వేటినీ పిలవవద్దు. తరమవద్దు. అలాచేస్తే లక్షలమంది అతిథులను సత్కరించినట్లవుతుంది.

భూమి విత్తును ధరిస్తుంది, మేఘాలు వర్షిస్తాయి. సూర్యుడు తన రశ్మితో వాటిని మొలిపిస్తాడు. (అయినా)విత్తనాలు మొలచినందుకు యివేవీ సంతోషించవు. మాడితే దుఃఖించవు; వాటి పని అవి చేసుకుపోతాయి. నీవూ అలానే చలించకూడదు. ఇక దుఃఖమెక్కడిది? దుఃఖం లేకపోవడమే ముక్తి.

(ఇవన్నీ ఆచరించగల్గాలంటే) మనం ఒకరిని ఆశ్రయించాలి; లేక (మనకివన్నీ చేతనైతే) యితరులకు మార్గం చూపాలి. (అందుకోసం) గురువును తెలుసుకోవాలి. లేకపోతే నీవెందుకొచ్చినట్లు? పిడకలేరుకోడానికా? సద్గురువుకు పగ్గాలప్పగించాక చింతకు తావేలేదు. గురువునే ఎల్లప్పుడూ నమ్ముకో! అదే అసలైన సాధన. గురువే సర్వదేవతలూనూ. సాధన చతుష్టయము, ఆరు శాస్త్రాలు అక్కరలేదు. గురువుయొక్క కృపాదృష్టే శిష్యునికి అన్నపానీయాలు. అచంచలమైన విశ్వాసంతో నీ గురువునే అంటి పెట్టుకో. ఇతర గురువులు ఎంత గొప్పవారైనా, నీ గురువు ప్రతిభ ఎంత తక్కువదైనా సరే (నీ సద్గురువునైన) నన్ను కేవలం ఆనందంగా ధ్యానించు. అది కష్టమైతే నా రూపాన్ని గురించే ఆలోచించు. మనస్సు ఆ ఒక్క రూపంలోనే నిలచిపోతుంది. ధ్యానం చేసేవాడు, ధ్యానములనే భేదం నశించి, 'చైతన్య ఘనత' లేక 'బ్రహ్మ సమరసత' కలుగుతుంది.

బాబా జీవిత విధానమే ముముక్షువులకు, గురువులకూ ఆదర్శప్రాయం. వారి జీవితమే ఒక ఉపదేశం, సూక్తి; వారి నిరహంకారానికి ఒక ఉదాహరణ :

ప్రధాన్ అను భక్తుడు బాబాయొక్క తైలవర్ణ చిత్రాన్ని గీయించడానికి ఠాణే నుండి, శ్యామారావ్ జయకర్

అనే ప్రఖ్యాత చిత్రకారుని తీసుకొచ్చి బాబా అనుమతి కోరాడు. బాబా సవినయంగా యిలా అన్నారు : "పేద ఫకీరువైన నా చిత్రం గీయడమెందుకు? శ్యామా! నీవు టీచరువి, అంతకంటే నీ చిత్రమే గీయించుకోవచ్చుగదా!" చివరకు భక్తుల కోరికపై ఆయన అంగీకరించక తప్పలేదు.

★★★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 25



నిత్యసత్యుడు

(i)

మహాసమాధి చెందాకగూడ సాయి యథాపూర్వం శాశ్వతంగా వుంటారని వారి సూక్తులన్నీ సూచిస్తున్నాయి. కనుక ఆయన సశరీరులుగా వున్నప్పుడు జరిగిన లీలలు నేటికీ అంతగానూ జరుగుతున్నాయి. శ్రీ సాయి నేటికీ తాము సకల దేవతా స్వరూపులమని భక్తులకనుభవాలనిస్తున్నారు. ఆయన నిత్యసత్యులు.

దత్తస్వామి :- శశికాంత్ రాట్వే "శ్రీ గురుచరిత్ర" పారాయణ, గాణ్గాపూర్ దర్శనమూ చేస్తుండేవాడు. సం॥ 1953లో ఒకనాడు కలలో ఒక తెల్లని కుక్క అతణ్ణి ఒక దర్గావద్దకు తరుముకొచ్చింది. అక్కడ జబ్బమీద చిరిగిన జుబ్బా, తలకుగుడ్డ, నొసట చందనమూ గల ఒక మహాత్ముడు అతనిని చూచి, "అల్లాహ్ మాలిక్! నీ కోసమెంతో కాలంగా చూచి నా సేవకుడు అబ్దుల్లాను పంపాను. భిక్షాటనం మా ఆచారం. నీకదే పెడతాను" అంటూ తమ భిక్షాపాత్రలోని అన్నము, ఒక అణాకాసు యిచ్చారు. "మీరు ముస్లింలు. నేను దర్గాకు రాను. మీరిచ్చినవి తీసుకోను!" అన్నాడు శశికాంత్. ఆయన, "నేను సాయిబాబాను. నా వేషమెలా వున్నా నేను - నృసింహ సరస్వతీ వేరుగారు. శిరిడీ నా రాజ్యానికి ముఖ్య పట్టణం, ఇది దర్గాగాదు, వెళ్ళిచూడు!" అని అతని చేతిలో తమ మృదువైన తమ చేయి వుంచారు. దర్గాలోపల ఎడమవైపు గదిలో సత్యనారాయణ పూజ చేస్తున్నారు. ప్రక్కనే కొబ్బరికాయలు కొట్టే స్థలమున్నది. శశికాంత్, "నేను శిరిడీ ఎప్పుడు వెళతాను?"అన్నాడు. సెప్టెంబర్ 16, 1964 న సాయంత్రం 4 గం॥లకు వెళ్తావు. ఇప్పటి నా గుడ్డలే ఆరోజుగూడా అచటి విగ్రహం పై వుంటాయి" అన్నారు బాబా. పది సం॥లు గడిచిపోయాయి. సాయి ముస్లిమని, హిందూ ద్వేషియనీ ఎవరో చెప్పడంవలన ఆయనపై సద్భావం పోయింది. అతడు ఉద్యోగంకోసం 1964లో కోపర్గాఁవ్ వెళ్ళినపుడు ఆసామి వూళ్ళోలేడు. అతడు ముందు సాయి భక్తులకే ఉద్యోగమిస్తాడని విని శశికాంత్ శిరిడీ చేరేసరికి సాయంత్రం 4 గంటలైంది. అక్కడ విగ్రహానికి వేసిన దుస్తులు అలనాడు కలలోని ఫకీరు ధరించినవే! నాడు సెప్టెంబరు 16. సాయి చెప్పినది అక్షరాలా నిజమైంది! ఆ ఉద్యోగమొచ్చి కోపర్గాఁవ్‌లో పనిచేసిన 3 సం॥లలో అతడు తరచూ శిరిడీ దర్శించేవాడు.

పాండురంగ్ అనే దత్తభక్తుడు భీడ్ వద్ద 'గోదావరి చక్కెర ఫ్యాక్టరీ' లో పనిచేసేవాడు. అతడు శిరిడీ దర్శించి శాంతిని పొందాడు. అయినా, సాయి దత్తావతారమయితే తనకట్టి నిదర్శనం కావాలని ప్రార్థించాడు. నాటి రాత్రి బాబా కలలో కన్పించి, 'నేనూ - దత్తాత్రేయుడూ వేరుగాదు, ఇక నుండి నీవు గాణ్గాపూర్ వెళ్ళనవసరంలేదు' అన్నారు.

మనాకీవాలా (అహ్మదాబాద్)కు 1952లో వంటికి నీరు, కడుపులో పుండు వచ్చి, నోట నెత్తురుపడేది. అతడు రెండు రోజులలో మరణిస్తాడని డాక్టర్లన్నారు. మిత్రులు చెబితే అతడు బాబాను ప్రార్థించాడు గాని, ఆయన ముస్లిమని సందేహించాడు. ఒక ఉదయం సాయి దర్శనమిచ్చి, 'నేను ఫకీరును గాను, దత్తాత్రేయుడను.

తాజుద్దీన్‌బాబా, ధునీవాలాదాదా, అక్కల్కోట స్వామి, వాసుదేవానంద సరస్వతీ రూపాలలో గూడ నేను నా కార్యం నిర్వహిస్తున్నాను'అన్నారు. తర్వాత డాక్టర్లు పరీక్షించి యిక 2 గంటలలో అతడు మరణిస్తాడన్నారు. వాళ్ళు వెళ్ళగానే అతనికి, అతని తల్లికీ ఒక వింతైన వెలుగు, దాని వెనుక బాబా దర్శనమిచ్చి, "భయంలేదు. నీ బాధ

తొలగించాను. నీ కొడుకును శిరిడీ పంపు" అని చెప్పి బయటకు వెళ్ళిపోయారు. అతడి కొడుకు చిన్నవాడు. రోగి మరణిస్తే అంత్యక్రియలకు అతడుండాలి గదా అనుకొనిగూడ సాయి చెప్పారని అతణ్ణి శిరిడీ పంపారు. నాటి సాయంత్రం మళ్ళీ బాబా కన్పించి, "నేను నీ బిడ్డ వెంటే వున్నాను. అతడు క్షేమంగా శిరిడీ చేరినట్లు రేపు తంతి వస్తుంది" అన్నారు. అలానే మర్నాడు తంతి వచ్చింది. వెంటనే రోగికి విరేచనాలు అధికమై, అతడి బరువు 300 నుండి 75 పౌండ్లకు తగ్గింది. కొద్ది నెలల్లో జబ్బు తగ్గింది. తరువాత ఆగష్టు 23, 1954 న బాబా అతనికి కన్పించి చేతిలోని సట్కానూగిస్తూ, "నా భక్తుల ఎదుట నేనెప్పుడూ వున్నాను!" అన్నారు.

రైల్వే గుమస్తా వినాయక్ దాజీభావే తనకు సద్గురువు లభించాలని 'గురుగీత' నిత్యపారాయణచేసి, దత్తమందిరానికి వెళ్తూండేవాడు. ఒక గురువారం ఆ మందిరంలో దత్తమూర్తికి బదులు యెవరో మహాత్ముని సమాధి దర్శనమైంది! మరురోజు మిత్రుని యింట 'శ్రీసాయి సచ్చరిత్ర' లో శ్రీ సాయి సమాధియొక్క చిత్రపటం చూచి అదే తనకు దర్శనమిచ్చినదని గుర్తించి, సాయినే తన గురువుగా సేవించసాగాడు. కాని మళ్ళీ సమాధి గురువెలా అవుతుందని శంకించి, మరొక సప్తాహం 'గురుగీత' పారాయణ చేశాడు. స్వప్నంలో అతనికి దత్తావతారమైన శ్రీ నారాయణ మహరాజ్ (ఖేడ్‌గాఁవ్ భేట్) అనే సిద్ధ పురుషుడు దర్శనమిచ్చారు. భావే వెంటనే ఖేడ్‌గాఁవ్ చేరాడు. తిరిగి అక్కడ ఆ స్వామి దర్శనమిచ్చి, "నేను - సాయి వేరుగాదు. నీవక్కడికే ఫో! అన్నారు. అతడీసారి నిస్సంశయంగా సాయిని ఆశ్రయించాడు. తర్వాత ఒక సాధువు అతని చెయ్యిచూచి, "నీ గురువు సాయిబాబా!" అని చెప్పాడు. సాయియే దత్తస్వామి.

బదరీనాథుడు :- వి. సుందర్ 1926 లో బొంబాయిలో సాయి గురించి విని శిరిడీ దర్శించాలనుకున్నాడు గాని వీలుపడలేదు. మార్చి 1948లో ఒక మిత్రునితో కలసి బదరీనాథ్‌కు బయల్దేరబోతుంటే ఆ మిత్రునికి టెలిగ్రాం వచ్చి అకస్మాత్తుగా అతని యాత్ర నిలచిపోయింది. ఆ చింతతో నిద్రిస్తూంటే నాటిరాత్రి అతనికొక స్వప్నమొచ్చింది. అతడొక భయంకరమైన అడవిలో నుండి బదరీనాథ్‌కు నడచి వెడుతున్నాడు. అకస్మాత్తుగా అతనికొక పెద్దపులి 10,12 అడుగుల దూరంలో ఎదురైంది. అపుడతడు భయంతో - "సాయి, బదరీనాథ్" అని నామం స్మరిస్తుంటే ఆ పులి అతి చిన్నదైపోయి పారిపోయింది. వెంటనే సాయిని పోలిన ఒక వృద్ధుడు ప్రత్యక్షమై, "సాయి వేరు, బదరీనాథుడు వేరు అనుకున్నావా? ఇద్దరూ ఒక్కటే! ఇది తెలుసుకొని నా నామం 500 సార్లు జపించు!" అని చెప్పి అదృశ్యులయ్యారు.

మారుతి :- కొత్త ఢిల్లీకి చెందిన శర్మ చాలా సం॥ల క్రిందట బాబా పటం కొన్నాడు గాని తర్వాత దానిని పూజించలేదు. తర్వాత ఆ కుటుంబం కష్టాలలో వుంటే ఆయనకు, "నా పటాన్ని పూజించు, కష్టాలు తొలుగుతాయి" అని వినిపించింది. బాబా గురించి యేమీ తెలియకపోయినా అప్పటినుంచి ఆయన బాబాను పూజించసాగాడు. కాని ఆయన భార్యకు మాత్రం మన దేవతలను వదలి, ఆ ఫకీరును పూజించటం యిష్టంలేక హనుమంతుణ్ణే పూజించేది. ఒక రాత్రి ఆమెకు స్వప్నంలో హనుమంతుడు దర్శనమిచ్చాడుగాని, ఆయన ముఖం మాత్రం సాయిబాబాదే! అప్పటి నుంచి ఆమెలో క్రమంగా మార్పువచ్చి, 'శ్రీ సాయి లీలామృతము' (ఆంగ్లము), 'శ్రీ సాయిసచ్చరిత్ర' చదవటం ప్రారంభించింది.

ప్రణవ స్వరూపం :- కుమారి విజయలక్ష్మీ (క్రొత్తఢిల్లీ) "శ్రీసాయి లీలామృతము" (ఆంగ్లము) పారాయణ

చేస్తే ఆమె సమస్యలు తొలిగి, మనశ్శాంతి లభించింది. తన భక్తిని ఆటంకపరచని వ్యక్తితో తనకు వివాహమవ్వాలని ఆమె బాబాను ప్రార్థిస్తే ఆమెకు 1986లో ఒక డాక్టరుతో వివాహమైంది. అతడు ఆర్యసమాజానికి చెందటం వలన అతనికి మూర్తి పూజలో నమ్మకం లేదు. ఆమె తృప్తికోసం బాబాకు అగరొత్తిగూడ పెట్టినా, ఓంకారమొక్కటే ధ్యానించదగినదనేవాడు. అతడు జర్మనీ వెళ్ళేముందు ఆమె తృప్తికోసం బాబాకు పూజచేశాడుగాని, "ఏనాడో పరమపదించిన బాబా, మన ప్రార్థన ఎలా వింటారు?" అన్నాడు. రెండు రోజుల తర్వాత అతడు ఆస్పత్రిలో పడుకొనివుండగా కలలో గాఢాంధకారము కన్పించి, అందులో ఒక చిత్రమైన కాంతిగోళము, దానిమధ్య వెన్నెలలా మెరిసిపోయే కఫ్నీ ధరించి బాబా కన్పించి, చేయెత్తి ఆశీర్వదించారు. వారిచేతిలో బంగారు కాంతిగల ఓంకారమున్నది. దాని నుండి వెలుగు అతనిపైబడింది. వెంటనే బాబా కన్నులు మూసుకొని ధ్యానస్థులయ్యారు. క్రమంగా ఆయన రూపం అనంతమైన విశ్వంలోని నక్షత్ర గ్రహగోళాలు, పాలపుంతలతో చేయబడిన ఎంతో పెద్ద ప్రణవాక్షరంగా మారిపోయింది. వెంటనే అతడు యింటికివచ్చి, ఆనంద భాష్పాలు రాలుస్తూ ఆమెకు చెప్పాడు. సాయియే ప్రణవం.

నరసింహస్వామి :- త్రికూటం నటరాజబాబా (కర్నూలు) గారికి సాయిని హిందూదేవతల అవతారంగా భావించడం నచ్చేదిగాదు. తర్వాత ఆయనకు శ్రీ సాయి, తాము, నృసింహస్వామీ వేరుకాదన్న అనుభవాన్నిచ్చిన వివరం 'పారాయణ మహాత్మ్యము' అన్న అధ్యాయంలో వ్రాశాను. అంతేగాక వారి అమ్మాయికి గూడ అలాంటి నిదర్శనమే కలిగింది.

బాల :- జె. విశ్వేశ్వరరావు (పాడేరు) గారికి శ్రీ సాయి 'బాల'గా ద్వారకామాయిలో దర్శనమిచ్చారు. ఈ వివరంగూడ అదే అధ్యాయంలో చూడవచ్చు.

శ్రీ వెంకటేశ్వరుడు :- బి. వి. రమణయ్య యిలా వ్రాశాడు : "ఒకప్పుడు నా వ్యాపారం మరొకరికిచ్చేయాలనుకున్నాను. నాటి రాత్రి సాయి స్వప్నంలో కన్పించి, 'అలా చెయ్యవద్దు, అలా చేస్తే నీవేం తింటావ్?' అన్నారు. ఇంతలో ఒక స్త్రీ వారి మాటలు విన్పించకుండా నన్ను దూరంగా తీసుకెళ్ళింది. బాబా మాట వినకుండా వ్యాపారం మరొకరికిచ్చినందుకు నాకెన్నో యిబ్బందులొచ్చాయి. భరద్వాజగారి దగ్గరకెళితే 'శ్రీసాయి లీలామృతము', 'శ్రీ గురుచరిత్ర' పారాయణ చేయమన్నారు. పారాయణ ప్రారంభించిన కొద్దిరోజులలోనే నా భార్యకు బాబా కలలో కన్పించి, 'మీవారు శిరిడీ పోవాలనుకుంటున్నాడు. పోతాడా?' అని 'వెనుకటి వ్యాపారమే చేయమను!' అన్నారు. మొదట అందుకు ఆఫీసరు అంగీకరించలేదు గాని ఆ మర్నాడే అతడు మనస్సు మార్చుకొని అనుమతించాడు. మేము వెంటనే నవంబరు 12,1987న శిరిడీ బయల్దేరి వెళ్ళాము. తుఫానువలన రైళ్ళన్నీ రద్దయ్యాయి. ఆ రాత్రి కలలో సాయి, 'తిరుపతి, శిరిడీ వేరుగాదు. అక్కడా, ఇక్కడా, నేనే వున్నాను' అన్నారు. తర్వాత మేము మంత్రాలయం వెళ్ళాము. అక్కడ రాత్రి నా భార్యకు స్వప్నంలో శ్రీ రాఘవేంద్రస్వామి కన్పించారు. ఆమె, 'మావారు వ్యాపారం లేదని బాధపడుతున్నారు' అని అంటే, ఆయన నావైపు తిరిగి, "సాయిబాబా నీకు తల్లివంటివారు. ఆ మహానుభావుడు చెప్పినట్లే నడచుకో! అన్నీ ఆయనే చూచుకొంటారు" అన్నారు. తర్వాత శిరిడీలో 3 రోజులుండి యిల్లు చేరాము.

(ii)

సాధు స్వరూపము :- మహనీయులందరూ తమ రూపాలేనని ముముక్షువులకు సాయి యీనాటికీ నిదర్శనమిస్తున్నారు. మెహర్‌బాబా చెప్పినట్లు దత్తస్వామిగా ఆయన మహాత్ములలో సామ్రాట్టు! వారిని ప్రార్థిస్తే

యే మహాత్ముల ఆశీస్సులైనా భక్తులకు లభిస్తాయి. అహ్మద్ నగర్ దగ్గర బోడేగాంలో బన్నూమాయీ అను దిగంబరియైన ముస్లిం యోగిని ఉండేవారు. నిండు యవ్వనంలోనే ఆమె దిగంబరిగా సంచరిస్తుంటే లోకులామెను పిచ్చిదనుకునేవారు. నానాచందోర్కర్ ఒకప్పుడు బాబా అనుమతితో ఆమె దర్శనానికి వెళ్ళాడు. చాలాసేపు ఆమె కనపడలేదు. సాయిని ప్రార్థించిన కొద్దిసేపట్లో ఆమె అతని యెదుటకు వచ్చింది. నానా ఆమెకు నమస్కరించి, ఆమె పాదాలలోని ముళ్ళు తీసాడు. ఆమె వెంటనే వెళ్ళిపోయింది. ఆమె స్నానం చేసి, తాను సమర్పించిన వస్త్రాలు, ఆభరణాలు ధరించి, తన గుడారంలో నైవేద్యం స్వీకరించాలని నానా మరలా బాబాను ప్రార్థించాడు. కొద్దిసేపట్లో ఆమె మళ్ళీ వచ్చి అలానే చేసింది. మరునటి ఉదయం ఆమె దర్శన కోసం బాబాను ప్రార్థిస్తే ఆమె మూడోసారి దర్శనమిచ్చింది. సాయి దయవలన అతడెట్టి మనోవికారమూ చెందక ఆమెకు నమస్కరించి సెలవు తీసుకున్నాడు.

ఇది నా అనుభవం గూడ. నేను 1967లో టైఫాయిడ్ జ్వరంతో చీరాల ఆస్పత్రిలో వున్నాను. ఒక గురువారంనాడు సాయిగురించి సాటి రోగులకు చెబుతుంటే ఒకరు ఆ ఊళ్ళో ఒకాయన ఎండా, వానా లెక్కచేయక తిరుగుతుంటారని, ఆయన పిచ్చివాడో, మహాత్ముడో చూడమనీ చెప్పాడు. అది నాకు సాయి సందేశమనిపించింది. ఆస్పత్రినుండి డాక్టరుగారు వెళ్ళగానే ఒక మిత్రుడు నన్ను రిక్షాలో ఆయన దగ్గరకు తీసుకెళ్ళాడు. ఆయనొక హోటల్ పెంకులపంచలో వున్నారు. వారి గుడ్డలు చినిగివున్నాయి. జుట్టంతా జడలుకట్టి వున్నది. కుడికాలు బోద, సిగరెట్టు తాగుతూ మతిలేనివానిలా నిర్వికారంగా చూస్తున్నారు. నేనెన్ని సార్లు నమస్కరించినా ఆయన పట్టించుకోలేదు, గాని వారి సన్నిధిలో నా మనసెంతో ప్రశాంతమైంది. ఆయన అవధూత; ఎవరి సన్నిధిలో చిత్తం శాంతిస్తుందో వారు జ్ఞానులని రమణమహర్షి చెప్పారు. మరురోజు ఆయనను నేనొక్కణ్ణే దర్శించాను. మరలా అదే నిర్లిప్తత! సకలసాధు స్వరూపియైన సాయిని వందసార్లు స్మరించేలోగా నేనడగకనే ఆయన ప్రసాదమివ్వాలని బాబాను ప్రార్థించాను. సుమారు 40 సార్లు స్మరించేసరికి ఆయన నాకొక సిగరెట్టు, అగ్గిపెట్టె యిచ్చి కాల్చమన్నారు. నాకు అలవాటు లేదనబోయాను. కాని అది సాయి నా విశ్వాసానికి పెట్టిన పరీక్ష అని తోచి సిగరెట్టు కాల్చాను. వెంటనే మరొకటి కాల్పించారు. ఇంతలో హోటల్ సర్వర్‌తో నాకు యిడ్లీ, చట్నీ, కారప్పొడి పెట్టమన్నారు. అతడు తెచ్చాడు గాని నాకు జ్వరమని తీసుకోలేదు. అతడవి స్వామిచేతికిచ్చాడు. ఆయన కొద్దిక్షణాలు దానికేసి చూసి, నాకిచ్చి తినమన్నారు. అది మరొక పరీక్షని తలచి తిన్నాను. తర్వాత దోసె, ఉప్మా తినిపించి, పాలు, కాఫీ, త్రాగించారు. ఇంకొద్ది సేపట్లో డాక్టరు ఆస్పత్రికొస్తారుగదా అనుకోగానే స్వామి నన్ను వెళ్ళిరమ్మన్నారు. నాటినుండి నాకు జ్వరమే లేదు! ఇలానే సాయి నాకు శ్రీ పాకలపాటి గురువుగారు, శ్రీఅవధూత వెంకయ్యస్వామి అనే మహాత్ముల ఆశీస్సులు ఎలా లభింపజేశారో వారి చరిత్రలలో వ్రాసాను.

నేను గృహస్థునయ్యాక 1975లో మొదటిసారిగా మా అమ్మగారి అబ్దీకం చేసుకోబోతూ, ఆ రోజెవరైనా మహాత్ములు భోక్తగా రావాలని ఆ ముందటి రాత్రి బాబాను ప్రార్థించాను. ఆ రోజు తెల్లవారుతూనే ఎవరో తలుపు తట్టారు! చూస్తే ఆయన శ్రీరామ భక్తాగ్రేసరుడు రంగన్నబాబుగారు; ఆయనతోగూడ కొందరు సాయిభక్తులొచ్చారు. నాడు వారే భోక్తలు. ఆ రోజు వారితోగూడ వెళ్ళి వాకాడులో యజ్ఞంచేస్తున్న శ్రీ సమర్థ నారాయణ మహరాజ్ గారికిగూడ భిక్ష యిచ్చాను. మా అమ్మ ధన్యురాలు, కారణం శ్రీ సాయి కృప.

'శ్రీ గురుచరిత్ర' 'సాయిబాబా జీవిత చరిత్ర'ల పారాయణ, సత్సంగము చేసుకునేవారికి మహాత్ముల దర్శన ఆశీస్సులు లభిస్తాయి. చి॥ విజయకుమార్ యిలా వ్రాస్తున్నాడు: "మొదట నేను, నా భార్య పరాడ్ సింగాలో అవధూత అనసూయామాతను దర్శించాము. ఆమె మమ్మల్ని చూస్తూనే, 'సాయి, సాయి' అన్నారు. నాటిరాత్రి,

విద్యానగర్ మందిరానికి ఆమె ఆశీస్సులు మనస్సులోనే కోరాను. వెంటనే ఆమె మరాఠీలో, 'కొత్తమహల్ కడుతున్నారు. అక్కడ పిల్లలు భజన చేస్తారు' అన్నారు. నాకు గురుభక్తి, విశ్వాసము వుండాలని మనసులో కోరగానే అమ్మ, 'అవధూత అవుతాడు' అన్నారు. నా భార్య, మాస్టర్-బాబా పటాలున్న ఫ్రేము చూపితే అమ్మ అది తీసుకొని ఒడిలో వుంచుకొని ఎంతకూ యివ్వలేదు. నేను 'శ్రీ సాయి లీలామృతము' యిస్తే దానిని పదేపదే తిరగేసి, ఫోటోలతో బాటు ఒడిలో వుంచుకున్నారు. నాకు ధ్యానం ప్రసాదించమని మనసులో చెప్పుకోగానే, నీకా చింత అవసరం లేదు' అన్నారు. తర్వాత నా భుజం మీద చేయివేసి ఊరంతా తిరిగాక, తమను ఎత్తుకుని తీసుకుపొమ్మన్నారు. నేను ఆమె నిలయం చేరాక సెలవిచ్చారు. తర్వాత టాకల్ ఘాట్‌లో శ్రీయుక్తబాబా, మూర్తిజాపూర్‌లో శ్రీ పుండలీక మహరాజ్‌లను దర్శించి శిరిడీ చేరాము. అక్కడ అవధూత శ్రీ పోతేబాబా 3 రోజులు మావద్ద భిక్ష తీసుకొని కాళ్ళు పత్తించుకున్నారు. మరొకరు వత్తబోతే అంగీకరించలేదు. తర్వాత 'మీరిద్దరూ నావాళ్ళు!' అని మా ఇద్దరి చేతులు తమ తలపైనుంచుకున్నారు. తర్వాత శ్రీ గజానన మహరాజ్ (అక్కల్కోట) గూడ విద్యానగర్ మందిరానికి, మాకూ ఆశీస్సులిచ్చారు. "

సత్సంగ సభ్యుడు చి. శ్రీనివాసులరెడ్డి (మెట్టు) గూడ 1979లో అనసూయామాతను దర్శించాడు. అప్పుడామె గుడ్డకప్పుకొని నిద్రపోతున్నారు. అతడు పండ్లు ఆమె పాదాలవద్ద వుంచి, ధ్యానానికి కూర్చోగానే ఆమె లేచి ఆ పండ్లు దుప్పటిలోకి తీసుకొని, "నీ ఇహపరాల గూర్చి నీకెట్టి చింతా అక్కర్లేదు" అన్నారు. ఒకరోజు తమను యెత్తుకునే అవకాశం అతనికిచ్చి, తర్వాత భక్తులు యిచ్చిన తినుబండారాలన్నీ అతనివైపే విసిరారు. అతడు, "ఈమె రూపంలోగూడ బాబానే వున్నారా?" అనుకోగానే, "దైవమే అన్ని రూపాలలోనూ వున్నాడు! ఒక క్షణం నాకేసి చూసి మరుక్షణం చూడవేమి? అన్నారు. తర్వాత సుమారు 20 ని॥ల తదేకంగా అతనికేసి చూసి, "నీవు నన్ను ఏ దృష్టితో చూస్తావు? బాబానే ఇక్కడున్నారు" అన్నారు అమ్మ.

అశోక్‌కుమార్ ఆనంద్ (కొత్త ఢిల్లీ) తన అన్నగారు బాబాను పూజిస్తుంటే చూచి, "బాబా భగవంతుడైతే గురునానక్ రూపంలో దర్శనమివ్వాలి" అనుకున్నాడు. తర్వాత అతనికొక కలవచ్చింది. ఒక అడవిలో అతడు, బాబా వున్నారు; అతడు తన కోరిక తెల్పగానే బాబా ఏవో సైగలు చేసి, అతనినొక కుటీరంలోనికి తీసుకువెళ్ళి కూర్చోబెట్టి, వారు మరో గదిలోకెళ్ళి యికరాలేదు. అతడా గదిలోకి వెళ్ళగానే అక్కడ గురునానక్ నవ్వుతూ, "నీ సందేహం తీరిందా?" అన్నారు. ఆ కంఠధ్వని బాబాదే. మళ్ళీ ఆయన, "కొద్ది రోజుల్లో మీ ఇంట్లోని బాబాపటం క్రింద గురునానక్ పటముంటుంది" అన్నారు. తర్వాత ఒక దీపావళికి అతని అన్నగారు ఒక గురునానక్ బొమ్మను బాబా పటం క్రిందగా పెట్టారు!

వి. ఆదినారాయణరెడ్డి, అతని తల్లిననుసరించి శ్రీ వెంకయ్యస్వామి (గొలగమూడి)ని సేవిస్తున్నారు. అయనిలా వ్రాసాడు: "నేను శ్రీ సాయి లీలామృతము చదివినప్పటినుండి సాయి నామము స్మరించడం అలవాటైంది. వెంకయ్యస్వామి భక్తుడనైన నేనలా చేయగూడదేమో అనుకునేవాణ్ణి. ఒకనాటి రాత్రి స్వామి నాకు కలలో కన్పించి, "ఏ నామమైనా ఒకటేలేయ్యా! అన్నారు".

అలానే వైద్యుల సుధాకర్ (నెల్లూరు) తమ్మునికి వారి అక్కకుమార్తెనిచ్చి వివాహం చేయాలనుకున్నారు గాని, అబ్బాయి ఒప్పుకోలేదు. ఆ వివాహం జరిగితే శ్రీ వెంకయ్యస్వామి సమాధివద్ద కొత్త దంపతులను నిద్రచేయిస్తానని మ్రొక్కుకున్నారు. మాసంలోగా అబ్బాయి అంగీకరించాడు. వివాహమవగానే దంపతులు గొలగమూడి ఆశ్రమంలో నిద్ర చేసారు. నాటి రాత్రి అమ్మాయికి కలలో సాయి కన్పించి, "నీకు పెళ్ళయింది గదా! సత్యనారాయణ వ్రతం చేయి" అన్నారు. "మా ఇల్లు చిన్నది. పెద్ద ఇల్లు కట్టించివ్వు, చేస్తాను" అన్నదామె. బాబా ఆమెకు వెంకయ్యస్వామి

భక్తులకిచ్చే దారమిచ్చి మెడలో వేసుకోమన్నారు. నిద్ర లేచేసరికి ఆమె పడకమీద దారమున్నది. శ్రీ వెంకయ్యస్వామి గూడ దత్తావతారమైన సాయి రూపమే!

కె. వి. యస్. సుబ్రహ్మణ్యం (రాజమండ్రి) కేరళ-తమిళ దేశాలలో పనిచేస్తున్నప్పుడు ఒక మిత్రుడు బలవంతంగా 'క్విలన్' వద్దనున్న ఒక స్వామి దర్శనానికి తీసుకువెళ్ళాడు. భక్తులందరూ అచట హుండీలో ఒక రూపాయివేసి వారికి నమస్కరిస్తున్నారు. సాయి భక్తుడైన సుబ్రహ్మణ్యంగారిని చూచి ఆ స్వామి, "ఆగు! నీవు వేయవద్దు. నీవు కొలిచే సాయి బ్రహ్మచారి, మహాశక్తి స్వరూపము, సాక్షాత్తూ భగవంతుడు. నీవు నా వద్దకేగాదు, ఇంకెవ్వరివద్దకూ ప్రశ్నలకు వెళ్ళొద్దు, వారి రక్షణ నీకెప్పుడూ వుంటుంది" అన్నారు.

శ్రీమతి శోభాశర్మ (కొత్తఢిల్లీ) ఇలా వ్రాశారు: "ఒకసారి నాకు ప్రమాదంగా జబ్బు చేసినప్పుడు 'హరి హర మహరాజు' అను మహాత్ముడు నాకు ఆయుర్వేద మందు, యోగాసనాలు చెప్పారు. వాటితో వారంలో కోలుకున్నాను. తర్వాత ఒక రోజు మావారికి ధ్యానంలో బాబా కన్పించి, "నా అనుగ్రహం ఆ మహాత్ముని ద్వారా మీకు ప్రకటమవుతున్నది" అన్నారు. తర్వాత మావారు హరిహర మహరాజ్‌ను కలుసుకున్నప్పుడు ఆయన ప్రసంగవశాత్తు, 'శ్రీ సాయిబాబా ఉచ్ఛకోటిలోని మహాత్ములు, నేనుగూడ శిరిడీ దర్శించాలనుకుంటున్నాను' అన్నారు. నాకు మరోసారి ప్రమాదంగా జబ్బు చేసినప్పుడు మావారు బాబాను ప్రార్థిస్తుండగా ఒక దృశ్యం కన్పించింది: మా గది ద్వారం దగ్గర కమండలము, జపమాల ధరించిన మహాత్ముడు నిలచారు. ఆయనతో వున్న శిష్యులు వెళ్ళిపోదామని ఆయనను తొందరచేస్తుంటే ఆయన 'ఆగు! ఇక్కడొక భక్తుడు ఆపదలో వున్నాడు!" అన్నారు. మూడవ రోజున హరిహర మహరాజ్‌గారు స్వయంగా మా యింటికొచ్చి నాకు చికిత్స చెప్పారు. దానితో నా వ్యాధి త్వరలో తగ్గిపోయింది.

గుంటూరులో నల్లపాడువద్ద సాయిబాబా మందిరం నిర్మించే ముందు ఆ మందిర స్థలాన్ని మహనీయుల పాదస్పర్శతో పవిత్రం చేయదలచి ఎందరో భక్తులు "శ్రీసాయి లీలామృతం", "శ్రీ గురుచరిత్ర" పారాయణ చేశారు. కర్నూలువద్దనుండి శ్రీ అవధూత రామిరెడ్డిగారిని తీసుకురావడానికి వెళ్ళారు. కాని వారు సామాన్యంగా రారని ఎందరో ఆ భక్తులను వారించారు. కాని ఆయన వచ్చి మందిర స్థలంలో కుటీరంలో సుమారు 20 రోజులు వున్నారు. అలానే 1986లో శంఖుస్థాపనకు శ్రీ రామిరెడ్డి తాతగారు, కన్యాకుమారి నుండి అవధూత మాయీ అమ్మ రావాలని భక్తులు ఆ రెండు గ్రంథాలూ పారాయణ చేశారు. ఆ సద్గురుని అనుగ్రహంవల్ల ఆ ఇద్దరు అవధూతలూ అచట రెండు చోట్ల శంఖుస్థాపనలు చేశారు. ఇద్దరు అవధూతలు ఒకే మహత్కార్యంలో కలవడమెంతో అరుదు. తర్వాత నేను తాతగారిని, "ఈ శాల ఎవరిది?" అని అడిగాను. ఆయన సంతోషంగా, "మన నాయనది కదా, సాయిబాబాది కదా?" అన్నారు. ఎంతోకాలంగా నిరంతరం శ్రీ సాయి గురించి వ్రాయడము, చదవడము, చెప్పడమూ - ఇలా సాయిని స్మరిస్తుండడంవల్ల గాబోలు, మొదట రామిరెడ్డితాత గుంటూరు వచ్చినప్పుడు ఒంగోలులో మనింటికివచ్చి కొద్ది గంటలుండి మాతో కలసి గొలగమూడికి వచ్చారు. దారిలో ఒకరు, "తాతా, దత్తస్వామి ఎక్కడున్నారు" అంటే ఆయన, "ఇప్పుడు మనం వచ్చిన ఇంట్లో వున్నారు" అన్నారు. నా సేవతో దత్తస్వామి శ్రీ సాయి సంప్రీతులై మనింట్లో వున్నారని తెలిసి ఎంతో సంతోషించాను. అలానే మాయీ అమ్మను గుంటూరు తీసుకువెళుతూ ఆ 'వ్యాన్' మనింటి ముందు ఆగింది. అంత దీర్ఘమైన ప్రయాణం వలన అమిత వృద్ధురాలైన అమ్మ ఎంతగానో అలసివుంటారని తలచి, సాధ్యమైనంత త్వరగా గుంటూరుకు పంపి వేయాలనుకున్నాను గాని మనసులో మాత్రం వారు రావాలనేవుంది. వ్యానులోనే భజన, ఆరతి, నైవేద్యము అయ్యాక అమ్మ బహిర్దేశానికన్న వంకతో, వ్యాన్ దిగి మనింటి వరండాలో సుమారు ఒకగంట కూర్చొని వెళ్ళారు. ఇదీ సత్సంగ ఫలమే, పారాయణ ఫలితమే. గుంటూరు వెళ్ళే దారిలో అమ్మ అనేకసార్లు 'సాయిబాబా' అని స్పష్టంగా అన్నారట. తిరుగు ప్రయాణంలో

శ్రీ సీతారామయ్య శిరిడీనుండి తెచ్చిన సాయి వస్త్రమొకదానిని అమ్మ పాదస్పర్శగూడ కోరి అమ్మ పాదాలపై వుంచారు. కాని వీడ్కోలు సమయంలో అమ్మ ఎంతో ఆత్రంగా దానిని లుంగజుట్టి తమ ఒడిలో వుంచుకొని తిరిగివ్వక తమతోగూడ తీసుకు పోయారు. దత్తావతారమైన సాయి వస్త్రమంటే ఆమెకు గూడా అంత ప్రీతి కాబోలు! గుంటూరులోగూడ ఒకరాత్రి అమ్మ ఎక్కడా విశ్రమించడానికంగీకరించక, శ్రద్ధగా చరిత్ర పారాయణ చేసుకొనే ఒక భక్తుడింట తమకై తామే రాత్రంతా విశ్రమించారు. అదీ పారాయణ సత్సంగాల మహిమ.

వి. బాబా ప్రసాద్ ఇలా వ్రాస్తున్నాడు : " 'శ్రీ సాయి లీలామృతము" 20 సార్లు పారాయణ చేశాను. బాబా రెండు మూడు సార్లు స్వప్న దర్శనమిచ్చి, మా సమస్యలెన్నో తీర్చారు. నేనీమధ్య కంచి కామకోటి పీఠాధిపతులు (పెద్దస్వామి) దర్శనానికి వెళ్ళాను. ఆ రోజు వారిని దూరంనుండి గూడ చూడలేమనిపించేంత జనం వచ్చారు. నేను కొద్దిసార్లు సాయి నామం స్మరించగానే స్వామి లేచి, మేమున్న చోటికొచ్చి, ఆశీర్వదించి వెంటనే వెళ్ళి యథాస్థానంలో కూర్చున్నారు!"

చి॥ కె. వి. రంగారావు (ఒంగోలు) యిలా వ్రాశాడు : "ఒక ఆదివారం శ్రీ అవధూత రామిరెడ్డిగారి దర్శనానికి వెళ్ళాను. వారింటివద్దలేరు. పది రోజులుగా భక్తులకు వారి దర్శనం లభించలేదట. నేను సాయిని ప్రార్థిస్తూంటే వారొకసారి వచ్చి కోపంగా మాట్లాడి వెళ్ళిపోయారు. కొద్ది సేపట్లో మళ్ళీ వచ్చి నమస్కరించగానే వెళ్ళిపోయారు. ఈసారి వారు సామాన్యంగా కూర్చునేచోట అగరువత్తులు, నైవేద్యము వుంచి సాయిపై పాటలు పాడుకుంటున్నాను. ఈసారి ఆయన వచ్చి నేపెట్టిన నైవేద్యం ప్రక్కనే కూర్చుని నాకు ప్రసాదమూ, ఆశీస్సులూ యిచ్చి నాకేసి చూచి, నా జీవితంలో మరువలేని రీతిన అలౌకికమైన నవ్వు నవ్వారు. నా 'శ్రీసాయి లీలామృతం' పారాయణ వల్లనే నాకీ మహనీయుని దర్శనం లభించింది."

సి. దయాళ్ శరణ్ (కర్నూలు) యిలా వ్రాశారు : "మేము పారాయణ మొదలు పెట్టినప్పటి నుంచి మహనీయులు మా యింటికి రావడం జరుగుతున్నది. కర్నూలులో శ్రీ ఖాన్‌సాహెబ్ అనే మహనీయులు ఎప్పుడూ ధ్యానంలో వుంటూ ఎవరితో పలుకకుండా పిచ్చివానిలా తిరుగుతూ భక్తులను తరిమేస్తుండేవారు. వారిని తరచుగా దర్శిస్తూ, వారు మా యింటికి వస్తే బాగుండుననుకునేవాణ్ణి గాని, పిలిచే ధైర్యంలేదు. అక్టోబరు 18, 1984 సాయంత్రం 4 గం॥లకు నేను నమస్కరించగానే వారు మంచినీళ్ళు, తర్వాత బిర్యానీ కావాలన్నారు. అవి తెప్పించే లోపలే వారు నా చేయూతతో లేచి ఒక రిక్షాలో కూర్చుని, నన్ను ప్రక్కనే కూర్చోమన్నారు. వారి దగ్గరకెళ్ళడమే భయం; ప్రక్కన కూర్చోడానికి మరీ భయం. ఒక ప్రక్కగా ఒదిగి కూర్చొని రిక్షాను మా యింటికి పోనీయమన్నాను. ఇల్లు చేరగానే యింట్లో సత్సంగంలోని భక్తులందరూ బయటకొచ్చి వారి దర్శనం చేసుకున్నారు. స్వామి, "బిర్యానీ వున్నదా?' అన్నారు. నేను మాంసం వున్నదని చెప్పి, మా యింట్లో తయారైన చపాతీలు, తెప్పించిన ఆ మాంసాహార పొట్లము తీసుకొన్నాను. వెంటనే ఆయన మళ్ళీ నన్ను రిక్షాలో కూర్చోబెట్టుకొని బయల్దేరి లాల్‌మశీదు ప్రక్కన ఒక హోటల్‌లోకి వెళ్ళి నేను తెచ్చిన చపాతీలే తిన్నారు. ఈ అదృష్టం నాకు చరిత్రల పారాయణ వల్లనే కలిగింది. "

డి. భాస్కరలక్ష్మి యిలా వ్రాసింది. "స్వప్నంలో బాబా దర్శనమాశించి 'శ్రీ సాయి లీలామృతము' పారాయణ చేశాను'. 1984, మే 30, తెల్లవారుఝామున కలలో బాబా గుడికని వెళ్ళాను'. ఒక చిన్న కుటీరంలో పాలరాతి పలకపై అవధూత చివటం అమ్మ కూర్చొని వున్నారు. ఆమె బాబా అన్న భావంతో నేను నమస్కరించేసరికి నన్ను దగ్గరకు పిలచి, నా చేతిలో ఊదీ వేశారు. తామూ, అమ్మ వేరుగాదని, దగ్గరలో వున్న ఆమెను సేవించుకొమ్మని సాయి తెల్పారు. మరురోజు (గురువారం, జూన్ 6) అమ్మ పుణ్య తిథి కరపత్రం మాకు చేరింది".

(iii)

శ్రీ సాయిలీలలకు జాతి, దేశ, మత భేదాలు లేవు. మొదట నేను శిరిడీ దర్శించాక, సశరీరులైన సద్గురువుకోసం అన్వేషిస్తూ 1968లో జిల్లెళ్ళమూడిలో కొంతకాలమున్నాను. అపుడు అక్కడున్న కుమారి మార్వా అనే అమెరికన్ మహిళ సాయిగురించి విని శిరిడీ దర్శించాలనుకున్నది. కాని అకస్మాత్తుగా ఆమె తల్లికి జబ్బుచేయడం వలన ఆమె వెంటనే తన దేశానికి బయల్దేరుతూ నాతో, "బాబాలో శక్తిలేదు. నేను శిరిడీ చూడకుండానే వెళ్ళిపోతున్నాను!' అన్నది. కాని బొంబాయిలో తుఫాను వలన విమానాల రాకపోకలు 48 గం॥లు ఆగిపోయాయి. అపుడామె టాక్సీలో శిరిడీ చేరింది. నాడు విజయదశమి. బాబా మహాసమాధి స్వర్ణోత్సవం వైభవంగా జరుగుతున్నది. ఆమె సాయిని దర్శించి, అమెరికా చేరి యిలా వ్రాసింది. "బాబా నాకు డిసెంబరు 1, 1970న కలలో కన్పించారు. నాటి నుండి రోజూ నాకు క్రీస్తుగురించి బోధిస్తున్నారు. ఎంత అద్భుతమో! ఇప్పటినుండి ఆయన నాకు 'బాబా క్రీస్తు!' --- ఇట్లు సోదరి "మార్వా".

సం॥ 1951 లో ఒకరాత్రి సురాజ్‌బాయికి స్వప్నమొచ్చింది. ఆమె భర్త శవాన్ని శ్మశానానికి తీసుకుపోతుంటే ఆమె శోకిస్తోంది. ఇంతలో కఫ్నీ, తలకు గుడ్డగల ఫకీరు కన్పించి, 'నీ భర్త బ్రతుకుతాడు. దుఃఖించకు" అన్నారు. తక్షణమే ఆమె భర్త బ్రతికాడు. ఆ రాత్రే వేరే వూళ్లో వున్న ఆమె భర్తకు జబ్బుచేసి చిత్రంగా తగ్గిపోయింది. అతనిని కాపాడిన ఫకీరెవరా! అని అమె ఆశ్చర్యపడింది. తమ జైనమతంలో అలాంటి వారెవరూ లేరు. ఒక మిత్రుడు సాయిపటం చూపినపుడు ఆ ఫకీరు ఆయనేనని గుర్తించి, సాటి మతస్థుల విమర్శలు లెక్కచేయక పూజించసాగింది. తర్వాత ఆమె శిరిడీ వెళ్ళినపుడు, తాను కలలో చూచినది శిరిడీయని గుర్తించింది.

శ్రీమతి ఆర్. ఫెర్నాండెజ్ క్రైస్తవ మహిళ. వీరబ్బాయి ఆంథోనికి స్నానం చేసినపుడల్లా జ్వరమొచ్చేది. డాక్టరు 'ఎక్స్-రే చూచి, అతని ఊపిరితిత్తులలో మచ్చవుందని చెప్పి, 15 రోజులు మందిచ్చినా తగ్గలేదు. అపుడామె ఆర్తితో మేరిమాతను ప్రార్థించగా ఆమెకు డా॥ చౌదరి అనే హోమియో వైద్యులు గుర్తొచ్చి, అబ్బాయిని ఆయనకు చూపించారు. ఆయన, "మొదట వైద్య నిపుణునిచేత మందిప్పించండి. తగ్గకపోతే సాయిబాబాను ప్రార్థించి నా వైద్యమారంభిస్తాను" అని అబ్బాయి వీపు ప్రేమతో నిమిరారు. తర్వాత అబ్బాయిని వైద్య నిపుణుని వద్దకు పంపి, ఆమె బాబాను స్మరిస్తున్నది. చికిత్స ప్రారంభించకనే ఆ రోజునుండే అతడు స్నానంచేసి తృప్తిగా భోజనం చేసినా ఏరోజూ జ్వరం రాలేదు! తన కుమారుని కాపాడినదెవరా! అని ఆమె ఆలోచిస్తుండగా, తలుపు తట్టిన చప్పుడైంది. చూస్తే నీలికళ్ళు, తెల్లని కఫ్నీగల ఒక ఫకీరు వాకిట్లో వున్నారు. ఆయన ఒక చొక్కా అడిగారు. ఇంట్లోని చొక్కాలు ఆయనకు పెద్దవవుతాయి. వాటిని సరిచేయించి యిస్తానని చెప్పి, దక్షిణ తెచ్చేసరికి ఆయనలేరు. తర్వాత వారి అబ్బాయిని చూచిన స్పెషలిష్టు యిక అతనికి మందు అక్కర్లేదని చెప్పాడు! ఈ లీల గురించి చెబితే డా॥ చౌదరి, "నమ్మినవారికి బాబా ఎన్నో దివ్యానుభవాలిస్తారు. ఒక ఏకాదశినాడు ఒక ఫకీరు వచ్చి నా వద్ద 25 పైసలు దక్షిణ తీసుకొని వెళ్ళగానే, వారు సాయిబాబాలా వున్నారని గుర్తొచ్చి, మళ్ళీ చూడాలని ఎంత వెదకినా కన్పించలేదు" అన్నారు. నాటినుండి శ్రీమతి ఫెర్నాండెజ్ గారి జీవితంలో ఎన్నో సమస్యలు సాయి పరిష్కరిస్తున్నారు. జనవరి 23, 1982న ఆమె శిరిడీ దర్శించారు.

సాయి భక్తుడు జేమ్స్‌వుడ్ (కెనడా)కు 1978లో మూత్రపిండాలు పనిచేయక 6 మాసాలు మృత్యుముఖంలో వున్నాడు. వాటి బదులు డాక్టర్లు యంత్రాలను అతని శరీరానికి తగిలించి ప్రాణం కాపాడజూచారు. కాని అతని శరీరం వాటిని అంగీకరించలేదు. ఇంకెవరైనా దానం చేసిన మూత్రపిండాలు కూడ అతనికి ఉపయోగపడవన్నారు

వైద్యులు. సోదరి లెస్లీబానీ అతని బాగోగులు విచారిస్తున్నది. ఆరుమాసాలు అతడు చావు బ్రతుకుల మధ్య వుండగా ఒకరోజు ఆమెతో ఒక శిరిడీ సాయి భక్తుడు వచ్చి, "భయంలేదు. శిరిడీ సాయి భగవంతుడు. ఆయనను ప్రార్థించి ఈ విభూతి సేవించండి. ఆయన మీ మూత్రపిండాలు బాగుచేయగలరు" అని చెప్పి, అతడు క్రైస్తవుడు గనుక బైబిలులోని 'పరలోక ప్రార్థన' (The Lord's Prayer) ను సాయిపరంగా వ్రాసిన చీటీ, ఊదీ యిచ్చాడు. అది సేవిస్తుంటే మూడవనాటికల్లా అతని "మూత్రపిండాలు" ఏ చికిత్సా లేకుండానే చక్కగానే పనిచేయసాగాయి. వైద్యులందరూ, 'ఇట్టి అద్భుతం ఏ ఆస్పత్రిలోనూ యింత వరకూ జరగలేదు" అన్నారు. నాటి రాత్రి కలలో అతనికి సాయి కన్పించి, "నిన్నిలా రక్షించడమిదే చివరిసారి' అన్నారు. మరుక్షణమే రాతిమీద కూర్చున్న సాయి ప్రక్కనే ఆ సాయి భక్తుడు కన్పించి, 'ఇకనుండి నీవీయననే ఆశ్రయించాలి' అన్నాడు. తన మ్రొక్కు చెల్లించుకోడానికి 1979లో అతడు శిరిడీ దర్శించాడు.

యావజ్జీవితమూ నాస్తికులుగా వున్నవారుగూడ, నిజమైన జిజ్ఞాసతో ఆయన వైపు దృష్టి సారిస్తే, సాయి సమాధానమిస్తున్నారు. ఇటువంటి నాస్తిక ప్రముఖులు, వెనుకటి తరాలలో గుడిపాటి వెంకటచలం, కె. సభా, త్రిపురనేని గోపీచంద్, గోరాగార్లు. వారిలో మొదటి ముగ్గురూ తమ దృష్టిని సరైన మహనీయులపై సారించి పరివర్తన చెందారు. గోపీచంద్ 1954లో కర్నూలులో వున్నారు. వారి శ్రీమతికి ప్రసవం కష్టమై ప్రమాదస్థితిలో ఆస్పత్రిలో వున్నారు. మూడవరోజు ఆయన సాయి మందిరం ప్రక్కగా వెళుతూ అప్రయత్నంగా, "బాబా శక్తిమంతులే అయితే నా భార్యకు వెంటనే ప్రసవమవ్వాలి!" అనుకొన్నారట. ఆయన ఆస్పత్రి చేరేలోగా ఆయన భార్యకు ఒక దివ్యదర్శనమైంది. కఫ్నీ, తలకు గుడ్డ ధరించిన వృద్ధ ఫకీరు ఆమె ప్రక్కన కూర్చొని, "బిడ్డా! భయంలేదు. ప్రసవమవుతుంది" అని చెప్పి, నొసట ఊదీ పెట్టి, కొంత నీటిలో త్రాగించారట. తక్షణమే ప్రసవమై ప్రమాదం తప్పింది. బాబు పుట్టాడు. అలా జరిగినది ఆయన ప్రార్థించిన క్షణంలోనేనని తెలిసి, గోపీచంద్ తన బిడ్డకు సాయిబాబా అని పేరు పెట్టారు!

అలానే నాస్తికుడు, ప్రముఖ రచయిత, కె. సభా యిలా వ్రాశారు: "నేను ఆపాదమస్తకమూ మంటలలో మగ్గుతున్నట్లు బాధలతో, జబ్బుతో మంచంలో వున్నప్పుడు, 'శ్రీసాయి లీలామృతము' చదివాను. మధ్యాహ్నం మగతలో శ్రీసాయి కన్పించి 'టీ' అడిగారు. సాయంకాలం 5 గంll కు నా జబ్బు తగ్గుతుందన్నారు. తర్వాత కలలో వర్షమొచ్చింది; ఒక పాము వచ్చింది; కొందరు రమణాశ్రమం వైపుకు ఒక శవపేటిక మోసుకెళుతున్నారు. నిద్రలేచాక బాబాలాగా తలగుడ్డ చుట్టుకొని, టీ తెప్పించి నేనే త్రాగాను. వర్షమొచ్చింది. 5 గంటలకు జబ్బు నయమైంది; 7 గంటలకొక పామొచ్చింది. ఇవన్నీ స్వప్నంలో లాగానే జరిగాయి; కాని శవపేటిక, సాయి వదలి వెళ్ళిన తుండుబట్ట మాత్రమే కన్పించలేదు - మీ కె. సభా". సాయి తమ వ్యాధి తగ్గించి మృత్యువు నుండి రక్షించారని వారి భావం.

జాస్తి శేషగిరిరావు 54వ సంll వరకూ నాస్తికుడు; మిత్రుడు భాస్కరరావు ఎన్నిసార్లు సాయిగురించి చెప్పినా పెడచెవిని పెట్టేవారు. ఒకరోజు వారి మరదలు మీరాబాయి చేసే బాబా భజనకు పిలిస్తే వెళ్ళారు. భజన వింటూ సాయిబాబా పటం చూస్తూంటే కళ్ళు మూతపడి, తెరవడం ఆయన వల్లగాలేదు. కన్నీరు కారసాగింది. తర్వాత ఒకరాత్రి కలలో తలపాగా చుట్టుకొన్న పండు ముసలి ఒకరు నులక మంచంమీద పడుకున్నారు. ఆయన కాళ్ళవైపుగా వెళ్తున్న శేషగిరిరావుగారిని ఆయన కాలుతో చాచి తన్నారు. క్రిందపడ్డ శేషగిరిరావు పట్టరాని కోపంతో ఆయనను మంచంమీద నుంచి లాగి, చెంపలు వాయించి, క్రిందపడద్రోసి కాళ్ళతో తంతున్నారు. ప్రక్కనేవున్న మిత్రులొకరు వారించడంతో, పశ్చాత్తాపంతో ఆయనను క్షమాపణ వేడారు. ఆయన నవ్వి, శేషగిరిరావుగారి భుజంమీద చేయివేసి, "నీకు రైలుకూత వినబడడంలేదా!" అన్నారు. శేషగిరిరావుగారు ముందుకు వంగి చూస్తే అక్కడ రెండు రైలింజన్లు

ఢీకొంటున్నాయి. వెంటనే లేచి కల గురించి చెబితే, భాస్కరరావుగారు, శేషగిరిరావులోని ఆస్తికత్వానికి-నాస్తికత్వానికీ యుద్ధం జరిగి, నాస్తికం నశించిందన్నారు. తర్వాత మిత్రులతో కలసి శిరిడీ వెళ్తూ, కారణం లేకనే కన్నీరు కారి పసిబిడ్డలా వెక్కి వెక్కి ఏడ్చారు శేషగిరిరావుగారు.

అక్కడ అందరూ సాకోరి చూచి వస్తుంటే, దారిలో ఒక విచిత్రమైన సువాసన ఫర్లాంగు దూరం వారిని వెంటాడింది. అది అగరవత్తులది, పువ్వులదీగాదు, అది సాయి వారి చెంతనున్నట్లు సూచనని ఒకరు, తమను పూజించమన్న హెచ్చరిక అని మరొకరూ వివరించారు. "శ్రీ సాయి నాలోని నాస్తికత్వాన్ని పూర్తిగా తొలగించి, నా అంత్య దశలో జ్ఞానమార్గం చూపినందుకు నేనెంతగానో సంతోషిస్తున్నాను. " అని చెప్పారాయన.

శ్రీ సాయిది ఖండాంతర లీల: 'అఖండ' లీల: ఆ రోజుల్లోనే రష్యా జపాన్ యుద్ధంలో పాల్గొనిన కెప్టెన్ జహంగీర్‌షా నౌకలను రక్షించారు సాయి. ప్యారేకిషన్ వాలీకి 1972లో శిరిడీకి వెళ్ళిరాగానే ఆ మరురోజే ఎన్నో ఉద్యోగాలొచ్చాయి. బాబా వద్ద చీట్లువేస్తే, "యమ్. వి. ధనలక్ష్మి" అనే నౌకకు కెప్టెన్‌గా చేరమని సందేశమొచ్చింది. అతడు అందులో చేరిన నాటినుండి తన నౌకను కాపాడుతుండమని నిత్యమూ సాయికి రెండు అగరువత్తులు వెల్గించి ప్రార్థించేవాడు. చిత్రం - ప్రతిసారీ ఒక అగరొత్తి విధిగా ఆరిపోయేది. మే 17, 1972లో ఒకసారి ఆ నౌక కలకత్తా నుండి అండమాన్‌కు 2 సార్లు బయలుదేరి, సముద్రం కల్లోలంగా వుండడంవలన వెనుకకు రావలసి వచ్చింది. మూడవసారి నడిసముద్రం చేరాక గాలివాన ప్రారంభమై నౌక ఒరగనారంభించింది. కారణం యింజనీర్లకు గూడా అర్థం కాలేదు. ఎంత యత్నించినా నౌకాశ్రయం నుండి సహాయం రాలేదు. నౌకలోకి నీరువచ్చి కొందరు నావికులు "లైఫ్ బెల్ట్"లు కూడా తీసుకోలేకపోయారు. అవి నీటిలో మునగకుండా కాపాడుతాయి. చివరకు నౌక మునిగిపోవడం తథ్యమని తెలిసి అందరూ సముద్రంలోకి దూకి సుమారు అర్ధరాత్రి గాఢాంధకారంలో, కారు మబ్బుల క్రింద 15 అడుగుల అలల మధ్య తిండి, నీరు లేకుండా కొట్టుమిట్టులాడారు. ఇలా 30 గం॥ లయ్యాక అతడు యిక శక్తి లోపించి చనిపోవడం తథ్యమని తలచి బాబాను ఆర్తితో ప్రార్థించగానే ఒక పెద్ద దుంగ చేతికి చిక్కింది. చివరకు 'జలకేంద్ర' అనే మరొక నౌక అటుగాపోతూ వారందరినీ రక్షించింది. కిషెన్‌వాలీని ఆ నౌకలోకి లాగుతున్నప్పుడు అతడు 20 అడుగుల వరకూ పైకివచ్చి 3 సార్లు నీటిలో జారి పడిపోయి స్పృహ కోల్పోయాడు. మెలకువ వచ్చేసరికి 103 డిగ్రీల జ్వరం, ఒంటినిండా కట్లూ వున్నాయి. త్వరలో కోలుకున్నాడు. నడి సముద్రంలో గూడ సాయికి తన భక్తుని కేక వినిపిస్తుంది.

బి. నరసింహంగారు మస్కట్‌లో విమానదళంలో పనిచేస్తున్నాడు. సం॥ 1984లో ఆయన కష్టాలలో వున్నప్పుడు ఒక మిత్రుడు శ్రీ సాయి చరిత్ర యిచ్చాడు. ఆ పారాయణ అయిన రాత్రి బాబా కలలో కన్పించి, "నన్ను నమ్ముకో, కష్టాలు తీరుతాయి. తర్వాత వృత్తిరీత్యా ట్రైనింగుకు లండన్ వెడతావు' అని చెప్పి అదృశ్యమయ్యారు. సం॥ 1985లో అది నిజమైంది. వారి శ్రీమతి 1986లో విమానంలో బొంబాయిచేరి టాక్సీలో వెడుతున్నారు. నాడు పెద్ద గాలివాన, అర్ధరాత్రి టైరు బ్రద్దలై టాక్సీ ఆగిపోయింది. గాలివాన వలన మరే కారూ దొరకలేదు. సాయిని ప్రార్థించగానే ఒక కారులో తెల్లని కఫ్నీ ధరించిన ఒక వృద్ధుడువచ్చి, "అల్లాహ్ అచ్చా కరేగా" అని, ఆమెను ఇంటివద్ద దించి, డబ్బులు యిచ్చేలోగా అతడు మళ్ళీ అవే మాటలని వెళ్ళిపోయాడు. ఆమె ఇల్లు చేరే ఆతురతతో ఆయనను పట్టించుకోలేదు. తర్వాత శిరిడీ చేరి ద్వారకామాయిలో కూర్చున్నప్పుడు ఆమెకు గుర్తొచ్చింది. ఆ వృద్ధుడు అచ్చం సాయిబాబాలాగానే వున్నాడు.

జి. సూర్యప్రకాశ్ పశ్చిమ జర్మనీలో తల్లిదండ్రులతో, చెల్లెలితో, కలసివుంటూ చదువుకుంటున్నాడు. అతడు 1985 లో మన దేశానికి రాగానే, కేవలం తన వారి బలవంతం మీద శిరిడీ వెళ్ళాడు. అక్కడ సంస్థానంలో కాలు

పెడుతూనే పెద్ద సాయిబాబా పటము, దాని క్రింద, "నాపై నీ దృష్టి నిలుపు, నీపై నా దృష్టి వుంచుతాను" అన్న వాక్యమూ చూచాడు. ఎంతగా యత్నించినా దాని నుండి దృష్టి నిగ్రహించుకోలేకపోయాడు. మందిరంలో గూడ ప్రగాఢమైన శాంతి అనుభవించాడు. పశ్చిమ జర్మనీ వెళ్ళినప్పటినుండి అతని మనసంతా సాయిబాబా మీదే పరుగిడుతున్నది. ఒకసారి స్వప్నంలో బాబాపటం కన్పించింది. తర్వాత అతనికి గణిత శాస్త్రంలో మౌఖిక పరీక్ష జరగనున్నది. అంతకు ముందు రెండుసార్లు ఆ పరీక్షలో విఫలుడయ్యాడు. సామాన్యంగా మూడవ అవకాశమివ్వరు. అలాంటిదతనికిచ్చారు. ఈసారి పాసవకపోతే అతడు కోరిన పై చదువు సాధ్యం గాదు. అతడు మౌఖిక పరీక్షలో తనవంతుకోసం ఎదురుచూస్తుంటే, అతని బోధకులతో మాట్లాడడానికి వచ్చిన ఎవరో వ్యక్తి ఇతనిని ప్రత్యేకించి పలకరించి శుభాకాంక్షలు చెప్పి వెళ్ళాడు. పరీక్షలైపోయి అతడు ఫలితంకోసం వేచివుండగా, ఆ వ్యక్తే మళ్ళీ యితనిని పలుకరించి వెళ్ళాడు. నాడు గురువారం. అతడు 'శ్రీసాయి లీలామృతము' (ఆంగ్లం) ఆ ముందటిరోజే పారాయణ పూర్తి చేసాడు. పారాయణ మొదలు పెట్టినప్పటినుండి అతనికి ఏకాగ్రత కుదరనారంభించింది. నాడు పరీక్షలో అన్నీ అతడికి తెలిసిన ప్రశ్నలే అడిగారు. అతడాశించిన దాని కంటే ఎంతో అధికమైన విజయం పొందాడు. తర్వాత మరొక పారాయణ చేయగానే మరొక పరీక్షగూడ పాసయ్యాడు. సినిమాలు, డిస్కోలు, విందుల పిచ్చి వాటికై అవే తొలిగాయి.

డా॥ యం. విజయకుమార్ యిలా వ్రాసాడు : "మా బంధువు డా॥ కె. వి. సాయి లండన్‌లో 14 సం॥లుగా వైద్యుడుగా వుంటున్నాడు. అతడు 1983లో ఒకరోజు స్పృహతప్పి పడిపోతే పెద్దాసుపత్రికి తీసుకెళ్ళారని ఫోను వచ్చింది. మేము ఆర్తితో సాయిని ప్రార్థించాము. మరుసటి రోజు తెల్లవారుఝామున నాకొక కలవచ్చింది. ఆపరేషన్ థియేటరులో సాయి మా వాడికి ఆపరేషన్ చేస్తూ తమ పిడికిలి తెరచారు. అందులోంచి ఒక నల్లని త్రాచు మావాడి పుర్రెలో జొరబడి, ఒక నల్లటి ముద్దను బయట వేసింది. బాబా, 'ఇక భయంలేదు, అవసరమైనది చేసాను' అన్నారు. డాక్టరు రోగి తలలో నుండి పెద్ద వ్రణం తొలగించారని నాల్గవరోజు మాకు వార్త వచ్చింది".

హోమీ (12 సం॥) ఎప్పుడూ బడలికగానూ, వక్ష స్థలంలో నొప్పిగానూ వుంటూంటే పరీక్షచేసి, అతడికి గుండెలో రంధ్రమున్నదని, అమెరికాలో ఆపరేషన్ చేయించాలనీ డాక్టర్లు చెప్పారు. మే 16, 1976న అమెరికాలోని హోస్టన్ నగరంలో సెంట్‌లూక్ ఆస్పత్రిలో చేర్చారు. అతనికి రెండు రోజుల్లో ఆపరేషన్ చేస్తారనగా హోమీ, అతని స్నేహితుడిచ్చిన బాబాపటం పెట్టుకుని ఊదీ నోట్లో వేసుకుని కొంచెం గుండెలకు రాసుకుంటున్నాడు. మే 20, గురువారంనాడు డా॥ 'డాంటన్‌కూలీ' అతనిని మళ్ళీ పరీక్షచేసి, "ఇదెక్కడి అద్భుతం! ఇతని గుండెలోని చిల్లు మూసుకుపోయింది. ఆపరేషన్ అవసరం లేదు" అన్నాడు. అలానే ఇ. ఎస్. సానీ (బొంబాయి) కి గుండె జబ్బు చేస్తే అక్టోబరు 21, 1981 న లండన్ నగరంలో ఆస్పత్రిలో చేర్చారు. మొదట జయప్రదంగా జరిగిందనుకొన్న ఆపరేషన్ విఫలమై 20 వ రోజున అతడికి స్పృహతప్పి, ఆరురోజులు, 'కోమా'లో వున్నాడు. అతడి పరిస్థితి విషమించిందని, అతణ్ణిక క్షోభపెట్టక ప్రశాంతంగా చనిపోనివ్వడమే మేలనీ డాక్టరు చెప్పాడు. రోగివద్ద ఎవరూ వుండకూడదని చెప్పారు. ఆమెంతో నిబ్బరంగా, "వారి సంగతి బాబా చూసుకుంటారు" అని బాబా ఊదీ తెచ్చి భర్తమీద చల్లి వెళ్ళిపోయింది. ఇంటి దగ్గర ఆమె ప్రార్థిస్తుంటే, "త్యాగ్ శరీర్ చలా జాయేంగే, ఔర్ ఆయేంగే" అన్న మాటలు విన్పించాయి. ఆమెకేమీ అర్థంగాలేదుగానీ, ఆమె హృదయం మాత్రం తేలికైంది. మరురోజు ఉదయం 11 గం॥లకు ఆమె భర్త కుర్చీలో కూర్చొని వున్నాడు. స్పృహలేని స్థితిలో అతని శరీరమంతటికీ పక్షవాతమొచ్చిందట. అతనికి మరో గది కేటాయించారు. అంతకుముందే ఆ గదిలోని రోగి మరణించాడని తెలిసి, ఆమె భయపడి సిక్కులకు పవిత్రమైన "గురుగ్రంథము" , బాబా పటమూ ఆ గదిలో పెట్టి అగరవత్తులు వెలిగించింది. నర్స్

బాబాపటం చూచి, "ఈయన నిన్న వచ్చి నీ భర్త పరిస్థితి విని, అతడు తప్పక బ్రతుకుతాడని చెప్పి వెళ్ళారు" అన్నది. ఆ పటంలోని సాయి ఏనాడో సిద్ధి పొందిన మహాత్ముడని శ్రీమతి సానీ చెప్పగా ఆమెకు మతి భ్రమించిందనుకొన్నది నర్సు. అలానే అతని వ్యాధి తగ్గి జనవరి 21, 1982న మనదేశానికి తిరిగివచ్చారు.

సి. సింహాచలంగారు యిలా వ్రాసారు : "మిత్రులు ఆంజనేయులుగారి 9 సం॥ల పాపకు రోజూ జ్వరం రావడంవలన నాడి బలహీనంగా వుండేది. వైద్యులు అమ్మాయికి శ్వాసనాళంలో రంధ్రమున్నదని, శస్త్ర చికిత్స తప్పదనీ తేల్చారు. నేనతనికి బాబాను ఆశ్రయించమని చెప్పాను. అతడు రూ॥ 2/ - లు బాబాకు దక్షిణపెట్టి, మ్రొక్కుకుని శిరిడీ ఊదీ పాపకివ్వసాగాడు. అతడు తర్వాత సెలవుపెట్టి, పాపను శస్త్ర చికిత్సకు మద్రాసు తీసుకెళ్తూ, మళ్ళీ తానెప్పుడు డ్యూటీలో చేరతానో చెప్పలేనన్నాడు. కాని నాల్గవ రోజుకల్లా అతడు తిరిగొచ్చాడు. పాప శ్వాసనాళంలో ఏ లోపమూ లేదని వైద్యులు తేల్చారట!

అలానే నర్సరావుపేటలో ఒక మిత్రుని భార్యకు కడుపులో పుండని ఆపరేషన్‌కు చిలకలూరిపేట నర్సింగ్‌హూమ్‌లో చేర్చారు. శ్రీసాయిని శరణువేడమని చెప్పి, ఒక సాయి ఫోటో, ఊదీ యిచ్చాను. అతని భార్యకు ఊదీ పెట్టి, తన అత్తగారిని తోడుంచి, నర్సరావుపేట తిరిగొచ్చాడు. ఆరోజే ఆపరేషన్ జరగవలసియున్నది. కాని సాయంత్రం 6 గం॥లకు అతని భార్య అత్తగారు తిరిగొచ్చారు! డాక్టరు మళ్ళీ పరీక్షచేసి, కడుపులోని పుండు మానిపోయిందని, ఆపరేషన్ అవసరం లేదనీ చెప్పారట!

శ్రీమతి యస్. లక్ష్మీకాంతమ్మగారు యిలా వ్రాశారు : "మేమొక వంక కుటుంబ చిక్కులతో క్రుంగిపోతుంటే, మావారికి గొంతు నొప్పి వచ్చింది. ఒంగోలు డాక్టర్లు అది కాన్సరని తేల్చి, మద్రాసు తీసుకెళ్ళమన్నారు. చేతిలో చిల్లిగవ్వలేదు. చికిత్సకు పదివేలవుతుందన్నారు. దిక్కుతోచక సోదరులు శర్మగారింటికి వెళ్ళాను. ఆయన బాబా ఫోటో చూపి, 'ఆయననే శరణు వేడుకో, భయపడకు!' అన్నారు. నేనలానే చేశాను. ఎలాగో రూ. 1400/- లు తీసుకొని మద్రాసు చేరాను. గదిలో బాబా ఫోటో పెట్టి సర్వమూ వారినే చూచుకోమని నమస్కరించాను. మరురోజు మొదట మావారినే పరీక్షచేసి ఒక్కరూపాయి మాత్రమే ఫీజు తీసుకున్నారు. 12 గం॥ల కల్లా ఆస్పత్రిలో చేర్చుకున్నారు. ఆయనకు రక్తమెక్కించాలంటే మా బావగారే రక్తమిచ్చారు. ఒకనాటి ఉదయం నాకెంతో శాంతిగా, ఉత్సాహంగా వున్నది. అదాటున ఏ వ్యక్తిని చూచినా, అతనిలో సాయియే కన్పిస్తున్నారు. ఆస్పత్రికి చేరగానే అనుకున్న దానికంటే 10 రోజులు ముందుగానే చికిత్స పూర్తయి, మా వారిని డిశ్చార్జి చేసారు. పదివేలనుకున్న దానికి పదివందల ఖర్చుతోనే ఇల్లు చేరాను."

★★★

★ మంగళవారం పారాయణ సమాప్తము ★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

★ బుధవారం పారాయణ ప్రారంభం ★

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 26

మందిర లీల

శిరిడీలో సాయిబాబా యొక్క భౌతికరూపం మరుగయ్యాక దేశమంతటా ఆయన ప్రతిరూపాలుగా మందిరాలు ఏర్పరచుకొంటున్నారు. దేశంలో ఎన్ని మందిరాలేర్పడుతున్నా వాటన్నింటి వెనుక ఆయన ప్రేరణ, ప్రోత్సాహము కనబడుతున్నాయి. జీవుడు శరీరాన్ని విడచేముందే వేరొక ఉపాధి ఏర్పరచుకొంటాడని అంటారు. అలానే ఈ మందిర లీలకు బాబా తమ మహాసమాధికి ముందే అంకురార్పణ చేశారు. మనకీనాడు ఆయన మందిరం నిర్మించుకోవాలన్న ప్రేరణ కలిగినప్పుడు మనమవలంబించవలసిన ఉత్తమవిధానాన్ని యీలీలలు సూచిస్తున్నాయి.

శ్రీ సాయిమందిరమెలా కట్టించాలి?

ఉక్వాల్ నుండి కేశవరావ్ అను భక్తుడు తరచు శిరిడీ వచ్చేవాడు. 1917లో బాబా ఒకసారి, అతనివద్దనున్న తమ చిత్రపటం తాకి అతనికిచ్చి, "దీనికక్కడ మందిరం కట్టించు, నీకదే శిరిడీ!" అన్నారు. మందిరం నిర్మించాక అతడు మరల శిరిడీ వచ్చినప్పుడు, "నన్నక్కడ వదలి నీవెందుకొచ్చావు?" అని గద్దించారు బాబా! "మీరక్కడా వున్నారని మాకు తెలియాలి కదా!" అన్నాడు కేశవ్. సాయి నవ్వి, సరే, సరే! అల్లాహ్ మాలిక్!" అన్నారు. తర్వాత ప్రతిరోజూ రాత్రి సాయి ఆ మందిరం ప్రాంగణంలో సంచరిస్తున్నట్లు అచటి వారికి అనుభవం కాజొచ్చింది. తర్వాత నారాయణ్ పురోహిత్ 1940లో మందిర పునరుద్ధరణ కోసం సాయిచరిత్ర పారాయణ చేస్తుంటే నాల్గవ రోజున బాబా స్వప్నంలో కన్పించి, "నా ధుని ఏది? ధుని లేకుంటే యిది శిరిడీ ఎలా అవుతుంది?" అని కేకలేస్తూ రాళ్ళు రువ్వుతున్నారు. త్వరలో నిధులు చేకూరాయి. మందిర పునరుద్ధరణ పూర్తిచేసి ధుని స్థాపించారు.

దత్త భక్తుడైన భావూసాహెబ్ తన 13వ యేట (1920) లో శిరిడీ దర్శించినప్పటినుండి బాబాను ప్రార్థించేవాడు. పూణే నగరంలో బాబా మందిరం కట్టదలచి, స్థల నిర్ణయంకోసం 1952లో పూణేలోని అరణ్యేశ్వరాలయంలో "శ్రీ గురుచరిత్ర" పారాయణ, నామ జపమూ చేస్తున్నాడు. పదవరోజున కలలో బాబాకన్పించి, "నీ వింటికెళ్ళే దారిలో నీ కాళ్ళు భూమిలో ఎక్కడ దిగబడతాయో అదే యోగ్యమైన స్థలం!" అని చెప్పారు. అతడు బయలుదేరి వెళుతుంటే ఒకచోట అతని కాళ్ళు భూమిలోకి దిగబడ్డాయి. అక్కడొక చెట్టుక్రింద ధ్యానంలో కూర్చోగానే అతని మనో నేత్రానికి మందిరము యొక్క నమూనా దర్శనమైంది. అక్కడ ఒక కుటీరం వేసి అందులో సాయి పటముంచగానే ఆ ప్రదేశమంతా సువాసనలతో నిండింది. క్రమంగా అచటి తేళ్ళు, పాములు ఆ ప్రదేశం విడిచిపోయాయి. నాల్గవరోజున అతనికి కలలో "నీకీ ప్రదేశంలో ఏమి దొరికితే దానినక్కడే స్థాపించు!" అని వినిపించింది. పునాదులు త్రవ్వుతున్నప్పుడు ఒక చెక్క పెట్టె, అందులో అస్థిపంజరము, దాని మొలలో కౌపీనంగా కాషాయ వస్త్రమూ వున్నాయి. ఆ మానవుని అస్థికలను నదిలో విడవదలచి గోనెలో కట్టి ఒక ప్రక్కన వుంచారు. కొద్దిసేపట్లో ఒక పాము వచ్చి దానిపై కూర్చుని, ఎవరినీ దగ్గరకు రానీయలేదు. సాయి చెప్పినది దాని గురించేనని తెలుసుకొని, దానినక్కడే భూస్థాపితం చేస్తామని చెప్పుకోగానే పాము వెళ్ళిపోయింది. త్వరలో శిరిడీలోని సమాధి మందిరంలాంటి ఆలయమక్కడ ఏర్పడింది. సాయి భక్త దాసగణు మహారాజ్ 1956లో విగ్రహ ప్రతిష్ట చేశారు.

అసలు సాయి మందిరం నిర్మించవలసినదిలానే.

విద్యానగర్‌లో నేనున్న యింట్లో నిరంతర సత్కాలక్షేపం జరగడానికి శ్రీ రంగన్న బాబుగారు, శ్రీ సమర్థ నారాయణ మహరాజ్, శ్రీ అవధూత వెంకయ్య స్వామివంటి మహనీయులు అచటికి రావడానికి గల మహత్తర కారణమేమా అనుకొనేవాణ్ణి. ఒకసారి ప్రక్క ఊరినుండి కరీమ్ బాబా (శ్రీ మస్తాన్‌రెడ్డి) అనే సాధువొచ్చి, కాకతాళీయంగా ఈ విషయం చెప్పారు: సుమారొక దశాబ్దం ముందు అవధూతయైన ఒక ముస్లిం మహాత్ముడు గూడూరు నుండి నడచి వెడుతూ, దారిలో యిప్పుడా యిల్లున్నచోట విధిగా కొంతసేపు కూర్చునేవారట. ఎక్కడ ఆత్మజ్ఞాని కొద్దిసేపైనా కూర్చుంటాడో ఆ ప్రదేశం పరమ పవిత్రమవుతుందని శాస్త్రం. అందుకే కాబోలు, శ్రీ రంగన్నబాబుగారితో వారి యిష్టదైవమైన కోదండరాముడు అక్కడ గొప్ప మందిరము, ఆశ్రమమూ ఏర్పడతాయని, ఎందరో మహాత్ములు వస్తారనీ చెప్పారు. శ్రీ నారాయణ్ మహరాజ్‌గూడ అలానే చెప్పి, "నీవంగీకరిస్తే ఆ మహత్కార్యం తేలికగా జరుగుతుంది" అన్నారు. నేను, "మాకు మందిరం మా గదిలోనే వున్నది. ఇక్కడ మందిరం ఏర్పడాలన్న శ్రద్ధ యిచటి వారికేర్పడితే అది సాయి సందేశమని తలచి అలానే చేస్తాను" అన్నాను. "ఆమాటమీద నిలబడు" అన్నారు స్వామి. అలానే కొద్ది నెలల తర్వాత, అక్కడొక మందిరం నిర్మించమని, దానికి స్థలం యిస్తామనీ కొందరు స్థానికులు ముందుకొచ్చారు. అప్పుడొక సోదరుడు శ్రీశైలం వెళుతూంటే, యోగ్యమైన స్థలం నిర్ణయించమని శ్రీస్వామి పూర్ణానందులకు జాబు పంపాము. కాని వెంటనే నిర్ణయంచవలసిన అవసరమేర్పడి, విద్యానగర్ భక్తబృందం ద్వారా సందేశమిమ్మని శ్రీ సాయిని ప్రార్థించాను. నాడు అందరూ ఏకగ్రీవంగా ఒకస్థలం నిర్ణయించారు. అది వెనుక శ్రీ రంగన్న బాబుగారు చూపినదే. మరురోజే అదే నిర్ణయాన్ని శ్రీ పూర్ణానందులుకూడ మాకందించారు. వెంటనే మరికొంత స్థలంగూడ కొనవలసి వచ్చింది. మావద్ద పైకం లేదనుకుంటూంటే స్థానిక వర్తకుడు చి॥ చంద్రశేఖర్ వచ్చి, "మా వాళ్ళందరూ ఎంత వారించినా వినకుండా రు. 1500/- లు ఒకతనికిచ్చాను. బాబా దయవలన అతడు తిరిగిస్తే అది బాబాకివ్వాలనుకున్నాను" అన్నాడు. మరుసటి ఉదయమే ఆ వ్యక్తి అతనికి పైకం తిరిగిచ్చి, "నిన్నటి నుండి నా మనసు ఎందుకో కలచివేస్తున్నది. నీపైకం తీసుకో!" అని చెప్పాడు. అతడెవరికైనా పైకం తిరిగివ్వడం అదే మొదటిసారట! ఆ పైకంతో స్థలం కొన్నాం.

తర్వాత మందిర నిర్మాణానికి బాబా ఆశీస్సులకోసం, చి॥ దామోదర్, చి॥ విజయ భాస్కర్‌లతో కలసి నేను శిరిడీ వెళ్ళాను. బాబా పాదుకలకు నమస్కరించుకొంటున్న భాస్కర్‌కు అకస్మాత్తుగా వాటిమీద రెండు పది రూపాయల నోట్లు కనిపించాయి. అవి అక్కడివారెవ్వరివీ కావట. వాటిని ప్రసాదంగా దాచుకొన్నాను. తర్వాత గుంటూరులో శ్రీ బాబుగారిని దర్శించి మందిరానికి ఆశీస్సులు కోరితే ఆయన, తమ కష్టార్జితంలో 5 రూ॥ల ఒకపైస నాకిచ్చి, "ఇది మందిరానికి రాములవారిమ్మన్నారు. ప్రతిపైసాలోనూ నీళ్ళకావడి మోసిన నా శ్రమ, నేను చేసిన భగవన్నామమూ వున్నాయి" అన్నారు. చి॥ శేషాద్రి మద్రాసులో శ్రీమతి రేవతమ్మగారిని దర్శించి మందిరానికి ఆశీస్సులు కోరాడు. అమ్మ కొద్ది ని॥లు ప్రార్థించి రు. 116/- లు అతనికిచ్చి, "ఇది రేవతమ్మ ప్రసాదంగాదు, మీనాక్షీదేవి ప్రసాదం. అంతా బాగా జరుగుతుంది" అన్నారు. చి॥ విజయకుమార్ ఒకవారం శ్రీ పూండి స్వామి సన్నిధిలో ధ్యానం చేసుకొని, మందిరానికి వారి ఆశీర్వచనం కోరి ఒక కొబ్బరికాయ సమర్పించాడు. వారు ఆశీర్వదించి, ఆ కాయ మేము బావి త్రవ్వించేచోట కొట్టమన్నారు. అలానే చేశాము. గ్రామంలోని బావులన్నీ ఎండిపోయినపుడంతా ఆ బావే అందరికీ నీరిచ్చింది. శ్రీ అవధూత వెంకయ్య స్వామి, పరాడ్ సింగాలోని అనసూయామాత ఆశీస్సులూ ఆ మందిరానికి లభించాయి. శ్రీపూర్ణానంద స్వామివారి ఆశీస్సులు కోరితే వారు మార్చి 30, 1978న యిలా వ్రాయించారు "శివరాత్రి ముందు హాటకేశ్వరంలో స్వామీజీ, శ్రీ సాయి మహిమ గురించి చెబుతున్నప్పుడే మీ జాబు చేరింది. అందరం పులకించాము. స్వామి, 'శ్రీ సాయిని ప్రతి శ్వాసలోనూ, తలపులోనూ నింపుకొన్న భక్తుని హృదయంలో

తలెత్తిన శ్రీ సాయి మందిర నిర్మాణ సంకల్పం విశ్వశక్తినే ప్రేరేపించగలదు. అంతటి దివ్యమైన కార్యానికి ఎంతటి వారి ఆశీస్సులైనా కోరనవసరంలేదు. అది విధిగా సఫలమవవలసిందే!' అన్నారు''.

నిధులు చేకూరగానే మందిరమెలా నిర్మించాలా అని ఆలోచిస్తూంటే, ఒకనాటి తెల్లవారుఝామున కె. సుబ్బరామయ్యకు ఒక సాయి మందిరం దర్శనమైంది. తెల్లవారాక అతడా చిత్రం గీచి చూపాడు. అది శిరిడీ సమాధిమందిరమే! వేంటనే శిరిడీ వెళ్ళి దాని ప్లాను, కొలతలు తెచ్చాము. 25-4-78న శంఖుస్థాపన ముహూర్తం నిర్ణయించబడింది. ఆ రోజున శ్రీ రంగన్న బాబుగారిని, తర్వాత పూర్ణానందస్వామి వస్తే వారినీ శంఖుస్థాపన చేయమని కోరితే వారు, ''అది నీవే చేయాలి'' అన్నారు. సమయానికి ఒక భక్తుడు గోదావరి నీరు, మరొకరు కృష్ణ నీరు, యింకొకరు తుంగభద్ర నీరు, నాల్గవవారు కావేరీ నీరు తెచ్చారు. మేము తెప్పించిన గంగా జలంతో కలిపి దత్తస్వామికి పవిత్రమైన పంచ గంగలతో శంఖువుకు అభిషేకం జరిగింది. ఇవన్నీ వాటికై అవే సమకూడడం విశేషం. బాబా పాదస్పర్శతో పవిత్రమైన శిరిడీలోని మట్టి, 60 సం॥లు వారి పాదస్పర్శను పొందిన ద్వారకామాయి నేలపై రాళ్ళు, శంఖువులో వేశాము. చి॥ చంద్రశేఖర్ శిరిడీ నుండి వస్తుంటే మహల్సాపతి కుమారుడు, సాయి స్వహస్తాలతో తన తండ్రికిచ్చిన ఊదీ పొట్లం శంఖువులో వుంచమని అతడితో పంపారు. దానిని గూడ వేసి, ఉదయం 9 గంటలకు శంఖు స్థాపన చేసాము.

మత సామరస్యమనే సాయి సంప్రదాయం ప్రకారం, వేరు వేరు మతాల వారిని ప్రార్థన చేయమని కోరాము. మొదట తమ సాటి మతస్థులు విమర్శిస్తారని ముస్లిము, క్రైస్తవుడు సంకోచించారు. కాని ఆ రోజు తెల్లవారు ఝామున కలలో ఒక దివ్యపురుషుడైన ముస్లిం ఆదేశించడంవలన ఒక ముస్లిం వచ్చి ఖురాన్‌లోని ప్రార్థన చేసాడు. సమయానికి చి॥ థామస్‌రెడ్డి వచ్చి క్రైస్తవ ప్రార్థన చేశాడు. 9-30 గం॥లకు శంఖువుపై కట్టుబడి పూర్తిచేయమని చెప్పి, మేము సంతర్పణ ప్రారంభించాము. సుమారు మూడువేలమందికి షడ్రసోపేతమైన సంతర్పణ జరిగింది. లారీలవారికి జరిగిన నిదర్శనాలవలన వారు సహకరించడంతో కొండరాతి కట్టుబడి, యిటుకల ఖరీదుకే పూర్తయింది. మందిర నిర్మాణమెంతో నిదర్శనంగా జరిగింది. కట్టుబడి నిలచినపుడు మాత్రమే వర్షం కురిసేది. పనివారిలో త్రాగుబోతులు ఆ పని అయ్యేంతవరకు మద్యం తాకనేలేదు.

జూన్ 25, 1979న పనివారు సాయంత్రం 5-30 గం॥లకు శ్లాబ్ పని సగమేచేసి పని నిలిపేశారు. దిక్కుతోచక సాయిని ప్రార్థిస్తుండగా ఏనాటి భక్తులో 20 మంది ఆకస్మికంగా వచ్చి రాత్రి 10-30కు పని పూర్తి చేశారు. వీరు పనిలో దిగేటప్పటికి కారుమేఘాలు కమ్మి తుప్పర ప్రారంభమైందిగాని, తెల్లవారుఝామున 2-30 గం॥లకు మాత్రమే కుండపోతగా వర్షం కురిసింది. నాటి రాత్రి 7 గం॥ల నుండి అర్ధరాత్రి వరకు ఒక మైలు చుట్టూరా కుంభవృష్టి పడినా పని పూర్తయ్యేవరకూ విద్యానగర్‌లో పడలేదు. అక్టోబర్ 29, 1980న నాయింటనుంచిన పెద్ద సాయిపటం మందిరంలో స్థాపించాలనుకొంటూంటే, సరిగా ఆ సమయానికి భక్తులద్వారా శ్రీ తాజుద్దీన్‌బాబా, శ్రీ అనసూయామాత, శ్రీ గజానన్ మహరాజ్ (షేగావ్), శ్రీ అక్కల్కోటస్వామి, శ్రీ యుక్తబాబా, శ్రీ పుండలీక మహరాజ్, శ్రీ నృసింహ సరస్వతి (గాణ్గాపూర్), శ్రీ మాణిక్య ప్రభువు, శ్రీ చివటం అమ్మల తీర్థ ప్రసాదాలు వచ్చాయి. మార్చి 12, 1981న మందిర ప్రారంభోత్సవానికి శ్రీ సాయి భక్తులు శ్రీ కేశవయ్యాజీ, శ్రీ కామేశ్వరమ్మ, శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యగార్లు విచ్చేశారు. శ్రీ చివటం అమ్మ టెంకాయ పంపారు. నాడు ఏ నిమిషంలో విద్యానగర్‌లో ఏమి జరిగిందో అదంతా చివటంలో అమ్మ భక్తులకు చెప్పారు. కార్యక్రమమెంతో వైభవంగా జరిగింది. సుమారు 20 వేల మందికి సంతర్పణ జరిగింది. ఇందరు మహనీయుల ఆశీస్సులతో, ప్రేరణతో నిర్మాణమైన మందిరం మాకు సాయి కరుణాలయం. నేటికీ నియమంగా శిరిడీలోవలె రోజూ నాలుగు ఆరతులూ జరుగుతాయి. గురువారం విధిగా సత్సంగము, భజన జరుగుతాయి. ధుని నిర్వహించబడుతున్నది.

★★★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము



అధ్యాయము - 27

సత్సంగ మహిమ

ఉన్నదానితో అసంతృప్తి, లేని దేనికోసమో తపన - ఇదే మానవ జీవిత సారం. కోరినవెన్ని లభించినా, క్రొత్త పరిస్థితులవలన క్రొత్త కోరికలు చిగిర్చి, అవి నెరవేరనప్పుడు వెనుకటి సంతోషంగూడ మాయమౌతుంది. ఇదే నిజమైన దుఃఖం, ఇది రాజునుండి పేదదాకా అందరినీ నిరంతరం క్రుంగదీస్తూంటుంది. ఈ అశాంతి నుండి తప్పుకునే యత్నంలోనే మానవుడు సంసారము, ధనము, అధికారము, ఇంద్రియ సుఖాలూ సాధించుకోజూస్తాడు. కాని ఆ తపనకు అంతుండదు. దానివలన చేయరానివెన్నో చేసి కర్మఫలంగా ఎంతో దుఃఖాన్ని సిద్ధం చేసుకుంటుంటాడు. అవి అనుభవానికి వచ్చిననాడు వాటినుండి తప్పించుకోడానికే సామాన్యులు దైవాన్ని ఆశ్రయిస్తుంటారు. ఆయన తనను కాపాడలేదని దైవాన్ని నిందించి శంకిస్తుంటాడు.

ఇలా దేనికోసమూ తపించవలసిన అవసరంలేని స్థితి ఆత్మజ్ఞానం వల్లగాని రాదు. ఈ సంగతి దృఢంగా తెలియడమే వివేకం. దాని పర్యవసానమే వైరాగ్యం. ఇట్టి తపనకు, అశాంతికీ కారణం తనలోనే వుండి వుండాలని తెలుసుకున్నాక, దాన్ని తొలగించుకోవాలన్న నిశ్చయమే ముముక్షుత్వం. అందుకు మార్గం తెలుసుకోజూడడమే జిజ్ఞాస. అందుకోసం జ్ఞానులనాశ్రయించడం సద్గురువు సమాశ్రయము. వారి నుండి నేర్చిన సత్యాన్ని తనలో దర్శించే యత్నమే సాధన, ఆత్మ విచారణ. తాను ఏ ఆత్మజ్ఞానంకోసం తపిస్తున్నాడో, అదే సద్గురుని రూపంలో తారసిల్లే సరికి ఆయన యందు మనస్సు లగ్నమైపోతుంది. శరీరం ఆయన సేవకే అంకితమైపోతుంది. అదే గురుభక్తి. దానివలన జ్ఞానం కలుగుతుంది. దేనినీ కోరనవసరంలేని శాంతి, తృప్తీ సిద్ధిస్తాయి. అట్టి స్థితి పొందినవారిని 'ఆప్తకాములు' (కోరదగినదంతా పొందినవారు) అని, 'కృతకృత్యులు' (చేయవలసినదంతా చేసివేసినవారు, ఇక చేయవలసినదంటూ ఏమీ లేనివారు) అని అంటారు. అట్టి జ్ఞానులకు, భగవంతునికీ భేదమేలేదని శ్రీ కృష్ణుడు చెప్పాడు. "నేను ఈ ముల్లోకాలలోనూ ప్రయత్నం చేత చేయవలసినది, పొందవలసినదీ ఏదీ లేదు" అని గూడ చెప్పాడు. కాని పైన చెప్పినట్లు, ఎక్కువమంది ఈ లక్ష్యంతో గాక, ఆశ వల్లనో లేక భయం వల్లనో భగవంతుణ్ణీ, మహాత్ములనూ ఆశ్రయిస్తారు. శ్రీసాయివంటి మహనీయుల కీర్తి చూచాక దానిని కోరి ఆయనను సేవిస్తారు; సాధన చేస్తారు. బ్రహ్మర్షి అనిపించుకోవాలనే విశ్వామిత్రుడు తపస్సు చేసింది - అట్టి దుఃఖాన్ని నివృత్తి చేసుకోవడం కోసంగాదు. అందువలన పతనమే కలుగుతుంది. కేవలం తాను బ్రహ్మర్షియని అంగీకరించనందుకు వశిష్ఠుని నూర్గురు కొడుకులనూ చంపాడు. ఇది కూడా రాక్షసుల తపస్సును పోలినదే. ఎన్ని నెరవేరినా, ఏమీ కోరనక్కరలేని స్థితి కలుగదు. కనుక వాటిని పొందడంవలన ప్రయోజనముండదని గుర్తించిన వారెవరో కొద్దిమంది మాత్రమే యిలాంటి పొంగు క్రుంగులు లేక సృష్టియొక్క పరమ రహస్యాన్ని మాత్రమే అన్వేషిస్తారు. వారే ముముక్షువులు.

మనమిలాంటి గోతులలో పడకుండా సాయి చూపిన మార్గంలో పయనించడమెలా? ఆత్మజ్ఞానం కలిగేలోపల మనకు కొన్ని అవసరాలు, కష్టాలూ తీర్చుకోజూడటం తప్పదు. స్థిరమైన ఆత్మ విచారము, లేక శరణాగతో కుదిరితేగాని, పొంగుక్రుంగులు లేకుండా నిష్కామంగా కర్మలు ఆచరించలేడు. ఇక నిత్యజీవితంలో సాధన సాగించేదెలా?

శ్రీసాయివంటి సద్గురువుపై భక్తిశ్రద్ధలు కలగడం ఎంతో అదృష్టం. కాని అటుపైన పొడుగునా మనకు ఆయన తోడుగా వుండి సరియైన మార్గంలో నడిపించాలంటే ఏం చేయాలి? "నాపై నీ దృష్టి నిలుపు. నీపై నా దృష్టి నిలుపుతాను" అన్నారు సాయి. ఆయన గురించి అనన్యంగా చింతన చేసిన వారి యోగక్షేమమే ఆయన వహిస్తారు. ఇదే శ్రీకృష్ణుడు, రమణ మహర్షి చెప్పిన శరణాగతి. ఇది అంత సులభంగా, ఒక్కసారిగా కుదరదు. అనుకున్నవి నెరవేరినప్పుడు మన విశ్వాసం పొంగుతూ, లేనప్పుడు క్రుంగుతూ వుంటుంది. సద్గురువు సాంగత్యము, సేవవల్ల మాత్రమే స్థిరమైన శరణాగతి క్రమంగా కుదురుతుంది. ఈలోగా అన్యచింతలు, శంకలు కల్గి, మనస్సు ఆయన నిజస్థితి మరచి చంచలమవుతూ వుంటుంది. అతి పరిచయం వలన శ్రద్ధ మందగిస్తూ వుంటుంది. ఇలాంటి ఒడుదుడుకులు లేనప్పుడే మనకు ఆయన సన్నిధి లభించినట్లు. అప్పుడే మనకు ఆయన నుండి సంపూర్ణమైన రక్షణ లభిస్తుంది.

ఇలాంటి ఒడుదుడుకులకు గల కారణాలలో - సాటివారి పట్ల మనకుండే భావము, వారి స్వభావాలలో గూడ వుంటాయి, అంటే సాటివారిలోని, మనలోని బలహీనతలే ప్రధాన కారణాలు. సాంగత్యానికి మనపై మనమూహించలేనంతటి ప్రభావముంటుంది. సాటివారి దృష్టి గూడ సంస్కరించబడుతుంటే మన యత్నం సులభమౌతూ వుంటుంది. అందుకే మనిషికి తన సాధనతోపాటు సత్సాంగత్యము గూడ అవసరమే. ఈ సత్సంగమన్నది యీ కాలంలో సహజంగా దొరికేది గాదు. దానిని తోటలాగా పెంచుకోవలసిందే. మళ్ళీ మళ్ళీ కలుపు తీసుకుంటూ, నీరుపోస్తూ కాపాడుకోవలసిందే. ఇదే సత్సంగమంటే. ఇందుకోసం అందరమూ కలసి భగవంతుడైన సద్గురుని లీలలు, బోధలు, శ్రవణము, చింతనా చేస్తూ వుండాలి. నైమిశారణ్యంలోని మునులు గూడ యిలానే చేసేవారని పురాణాలు చెబుతున్నాయి. అన్ని సాధనలకూ భగవత్కథా శ్రవణమే మూలం గనుక వాల్మీకి 'రామాయణము', వ్యాసుడు 'భాగవతము' వ్రాసి ఆ సేతు హిమాచల పర్యంతమూ తమ శిష్య ప్రశిష్యుల ద్వారా గ్రామ గ్రామాల్లోనూ ప్రజలకు శ్రవణం చేయిస్తుండేవారు. అందువల్లనే యీ నాటికీ మనదేశంలో అక్షర జ్ఞానం లేనివారికి గూడ దైవము, జీవిత పరమార్థము, దానిని సాధించుకొనే మార్గమూ వున్నాయనైనా తెలిసింది. ఇలాంటివి వినడం ద్వారా మన హృదయాలను, సాటివారిని పరిశుద్ధం చేసుకొంటుంటే నిర్దుష్టమైన భక్తిశ్రద్ధలు తెగుళ్ళు లేకుండా పెరుగుతాయి.

కనుక వారానికి ఒకసారయినా సత్కథ విని, ప్రసాదం తీసుకుపొమ్మని యిరుగు పొరుగు వారిని ప్రేమతో ఆహ్వానించాలి. అప్పుడు సాయి పటానికి ధూప దీపాలు అర్పించి, భావయుక్తంగా ధ్యాన శ్లోకం చదువుకొని, అష్టోత్తర శతనామావళి సహాయంతో ఆ సద్గురుని దివ్య గుణాలను స్మరించాలి. తర్వాత కనీసం 30 లేక 45 ని॥లైనా అందరికీ సాయి లీలలు వినిపించాలి. మనం చెప్పేది మనంగూడ వింటూ, మన భావాన్ని గూడ సరిదిద్దుకుంటూండాలి. అట్టి లీలలు చేసిన సాయిని పటంలో చూస్తూ, కనీసం 30 ని॥లు భజన చేసి, అప్పుడనుభవమయ్యే శాంతిని అనుభవిస్తూ, మౌనంగా 10 ని॥లైనా కూర్చోవాలి. మనస్సు చంచలమవుతే ముందు విన్న లీలలను స్మరిస్తూ, వాటిని చేసిన సాయి రూపాన్ని చూస్తూ, ఆయన సన్నిధిని భావించాలి. అప్పుడు నైవేద్యము, ఆరతి యిచ్చి అందరికీ ప్రసాదం పెట్టి పంపాలి. ఎంత పేదవాడైనా తమ యింట యిటువంటి సత్సంగం పెట్టుకోవడానికి జంకనవసరం లేనంత నిరాడంబరంగా జరుపుకోవాలి. భజన పాటలు ఎన్నడూ అలవాటు లేనివారుగూడ పాడుకోగలవిగా వుండాలి. అందరితోనూ కలసి పాడాలికాని, ప్రత్యేకంగా పాడకూడదు. పాడితే అందరి ఏకాగ్రతకూ భంగం కల్గి పాపమొస్తుంది. ఎవరెక్కువ బాగా పాడుతారన్న పోటీభావం బాబాపై శ్రద్ధాభక్తులను, సత్సంగ సభ్యులమధ్య ఆత్మీయతను పాడుచేయకుండా చూచుకోవాలి. ఎప్పుడూ నిర్ణీతమైన కొన్ని పాటలనే భజనలో పాడుతూవుంటే

అందులోని భావంపై మనస్సు నిలుస్తుంది. ఎక్కువ పాటలు పాడితే పాటలోని భావాన్ని భావనచేయడానికి అవకాశముండక మనస్సు ఏకాగ్రమవ్వదు. బాబాకు భావనే ప్రధానం. ఒక ముసలివాడు వణుకుతున్న గొంతుతో భజన చేసినా అతని భావంజూచి బాబాకు ఆనంద భాష్పాలు కారాయి. మరొకప్పుడు ఒక భక్తుడెంతో శ్రావ్యంగా భజన చేసినా సాయి మెచ్చక, 'మీకు గానం యిష్టము, నాకు జ్ఞానమిష్టము'' అన్నారు.

ఇలా వారంలో ఒకరోజున సత్సంగం చేసుకుంటే అందరికీ మంచి అనుభవాలు కల్గి యింకా ఉత్సాహంగా పాల్గొంటారు. ఎవరైనా కోరితే వారి యింట సత్సంగం జరిపేందుకు వారంలో యింకోరోజు కేటాయించు కోవాలి. మన యిష్టాలతో సంబంధం లేకుండా సత్సంగంలో విధిగా పాల్గొనడం సాధనకెంతో ముఖ్యం. వారమంతటిలో రెండు గంటలైనా భగవంతునికి ప్రీతికరమైన లోకకళ్యాణానికి, మన హృదయాన్ని సంస్కరించుకోడానికీ సంసిద్ధులం కాకుంటే ఆధ్యాత్మిక విద్యను ఆశ్రయించడమన్నది, బూటకమవుతుంది. ఇటువంటి సామూహిక సాధన ఎంతో శ్రేయస్కరము గనుకనే నామదేవుడు, తుకారాము వంటి మహనీయులు అనుసరించారు. క్రైస్తవ మతంలోను, ఇస్లాంలోనూ గూడ దీనికెంతో ప్రాధాన్యత వున్నది. దేవాలయాలు యిట్టి సామూహిక సాధన కోసమే ఏర్పడ్డాయి. పాలలోని వెన్నలాగ సాయి సర్వగతుడు. భక్తులు తమ చైతన్యాన్ని పారాయణ, నామ జపము, ధ్యానము వంటి వ్యక్తిగతమైన సాధనలకు తోడు, సత్సంగంవంటి సమిష్టి సాధనలతోగూడ మధించి పరమ శ్రేయస్సును పొందాలి. ఇలా సత్సంగాలలో పాల్గొన్న కొందరి అనుభవాలను స్మరిద్దాము :

చి॥ బి. రామకృష్ణారెడ్డి యిలా వ్రాశాడు : ''చిన్నప్పటి నుండి నేను శ్రీ రాముణ్ణి పూజించేవాణ్ణి. కాలేజీలో చేరాక, నా భక్తి తగ్గిపోయిందిగాని పూజ్యశ్రీ మాష్టరుగారి పరిచయంతో మరల తీవ్రమైంది. మాష్టరుగారి వద్ద రోజూ సత్సంగంలో బాబా గురించి వింటుంటే ఆయననే పూజించాలనిపించేది. మాష్టరుగారిని అడిగితే, ''కొన్ని రోజులకు అది నీకే తెలుస్తుంది'' అన్నారు. తర్వాత వారి ఆశీస్సులతో చీరాల స్వామి, రంగన్న బాబుగారు మొ॥న మహాత్ములను దర్శించాను. తర్వాత ఒకరోజు బాబా కలలో కనిపించి, ''నీవు నా రూపాన్ని ధ్యానించు, మేలవుతుంది. రామునికీ, నాకూ భేదం లేదు'' అన్నారు. అలానే చేయసాగాను. ఏప్రిల్ 10, 1975న పూజ్య శ్రీమాష్టరుగారు ఊరికి వెళ్తూ నన్ను వారింట్లో పూజ చేస్తుండమన్నారు : 13వ తేదీ అర్థరాత్రి ధ్యానం చేసుకుని పడుకున్నాను. ఇంకా నిద్రపట్టలేదు. బాబా స్పష్టంగా నిలుచుని కన్పించి, 'మీ నాన్న 5 టెంకాయలు శివుడికి మ్రొక్కుకుని చాలా సం॥లయింది. వాటిలో 3 కాయలు గురువారం యిక్కడ కొట్టు' అన్నారు. ఆయన ఉత్తరముఖంగా కూర్చుని, 'నీ గురువెవరు' అన్నారు. నేను మాష్టారేనని చెప్పాక నాకొక రహస్యం చెప్పి, మూడురోజులకు ఒకసారి, 'శ్రీసాయి లీలామృతము' పారాయణ చేయమన్నారు. నాకు ఆనందభాష్పాలు రాలుతున్నాయి. ఆయన ప్రక్కనే కుక్కలున్నాయి. భయమేసి లైటు వేశాను. ఆయన నా కళ్ళముందే అదృశ్యులయ్యారు! తెల్లవారి మా నాన్నకు ఉత్తరం వ్రాసాను. తాము శివునికి 5 టెంకాయలు మ్రొక్కుకొని ఇంకా చెల్లించలేదని ఆయన జాబు వ్రాశారు!''

జనవరి 1975లో చివరి గురువారం నా సహోపాధ్యాయులొకరితో కలసి రఘు అనే యువకుడు వచ్చి నాతో మాట్లాడి వెళ్ళాడు. తరువాత ఫిబ్రవరి 10న మద్రాసు నుండి రఘు నాకిలా వ్రాశాడు : ''తిరుగు ప్రయాణంలో నేను గూడూరు బస్టాండులో హోటల్‌కు వెళుతూండగా కాషాయ వస్త్రాలు, విభూతి, కుంకుమ ధరించిన, సుమారు 50 సం॥లు వయసున్న, ఒకామె నన్ను పేరుపెట్టి పిలిచి టీ, రొట్టెల కోసం 30 పైసలు అడిగి తీసుకుని, 'విద్యానగరు నుంచి వస్తున్నావా?' అన్నారు. నేను మిమ్మల్ని కలిశానని చెప్పాను. ఆమె, 'మీ కలయిక కాకతాళీయం గాదు, ముందే నిర్ణయమైంది! గమ్యానికి సాగిపో, మధ్యలో ఆగవద్దు' అని తక్షణమే వెళ్ళిపోయారు. నాటి రాత్రి నాకు స్వప్నమొచ్చింది : నేను గాలిలో తేలుతూ ఒక మహనీయుని వద్దకు వెళ్ళాను. నేను నమస్కరించగానే ఆయన

ప్రేమగా, 'ప్రవర చెప్పి నమస్క రించు' అన్నారు. నేను అలా చేయగానే మెలకువ వచ్చింది. అప్పుడే తెల్లవారింది. ఆయన సాయిబాబాలా వున్నారు; నా జీవితమంతా ఆయన సేవ చేయాలన్పించి ఉద్యోగానికి రాజీనామా యిచ్చాను. మొదట శిరిడీలో సాయిబాబాను, అక్కల్‌కోట స్వామిని సేవిస్తాను. కొంతకాలం తరువాత మీ దర్శనానికి రాగలననుకుంటాను - మీ రఘు. '' ఒక బద్ధజీవి తీవ్ర ముముక్షువయ్యాడు.

ఏప్రిల్ 1973లో ఒకనాడు ఉదయం 7-30 గం॥లకు నేను, నా ప్రక్క యింట్లో వున్న ఉపాధ్యాయుడు చి॥ రాధాకృష్ణ కలసి కాలేజీకి వెళ్ళాము. సుమారు 8 గంటలకు తెల్లని గుడ్డలు ధరించిన ఒక వృద్ధుడు నా గదివద్దకొచ్చి, శ్రీమతి రాధాకృష్ణతో నాకోసమడిగి, "నేను అర్జంటుగా వెళ్ళిపోవాలి. నేనొచ్చి వెళ్ళానని, నా ఆశీస్సులనీ వాడికి చెప్పు. నాకు పేరు, ఊరూ లేవు. వాడు నా కొడుకువంటి వాడు, నేను వాడికి తెలుసు. నా ఆశీస్సులని చెబితే వాడికి తెలుస్తుంది'' అన్నారట. ఆయన మహాత్ముడని తోచి, ఆమె, ఆమె కొడుకు 2సం॥ల వాడూ ఆయనకు నమస్కరించారు. తర్వాత అస్వస్థతగా వున్న తన మరదలుచేత నమస్కారం చేయించాలని చూచేసరికి ఆయన కనిపించలేదు. కొద్ది సం॥ల తర్వాత ఆమె మరదలు మరణించింది. అందుకే బాబా దర్శనమామెకు కాలేదేమో!

ప్రక్క గ్రామానికి చెందిన చి॥ కోటేశ్వరికి 'టాన్సిల్స్' బాగా పెరగడంచేత అమ్మాయి ఎదగలేదు. సాయి చరిత్ర పారాయణ ప్రారంభించిన కొద్ది రోజులకు ఒక గురువారం రాత్రి ఆమెకు స్వప్నం వచ్చింది: ఒక ఆసుపత్రిలో సాయిబాబా - డాక్టరు, పోలేరమ్మ - నర్సు, క్షేత్రపాల స్వామి - కంపౌండర్‌గానూ కన్పించి ఆమెను కుర్చీలో కూర్చోపెట్టారు. పోలేరమ్మ, 'భయం లేదు, నోరు తెరు' అన్నది. ఆమె తెరిస్తే బాబా ఆపరేషన్ చేశారు. తరువాత మెలకువ వచ్చింది. నాటితో వ్యాధి తగ్గిపోయింది!

యం. కె. ఆనంద వెంకటేశ్వర్లు యిలా వ్రాశాడు : "నా తమ్ముడు శేషఫణికి మూడవ నెలలో పోలియో వచ్చి, పదేండ్లవాడైనా నిలబడలేకపోయేవాడు. నేను విద్యానగరు వెళ్ళినపుడు, మాస్టరుగారు "శ్రీ సాయిలీలా మృతము'' లో 'సకల సాధుస్వరూపి' అన్న అధ్యాయం చదువుతూండగా అకస్మాత్తుగా శ్రీ సమర్థనారాయణ మహరాజ్ వచ్చారు. వారు, మాస్టరుగారూ యిచ్చిన విభూది ఇంటికి పంపాను. అది చేరిన నాలుగైదు రోజులకల్లా తమ్ముడు కర్ర పట్టుకొని అడుగులు వేయసాగాడు. అప్పుడే తిరుపతిలో వున్న నాకు ఒకనాటి తెల్లవారుఝామున కలలో సాయిబాబా కన్పించి, నన్నుచూపి, 'ఈ కుంటివాణ్ణి రక్షించినది నేనే!' అని ప్రక్కవారితో అన్నారు. మా తమ్ముడి సంగతే అలా చెప్పారనుకున్నాను. అదే నిజమైంది. ఆ విభూది పూయటం మొదలు పెట్టిన కొద్దిరోజులకే వాడు ఏ సహాయమూ లేకుండానే నడవసాగాడు.''

దేశిరెడ్డి కృష్ణారెడ్డి (మెట్టు)కి ఒకసారి జబ్బుచేసి, ఏమి చేసినా తగ్గలేదు. ఆయన భార్య ఆయనకు బాబాగురించి చెప్పి, తగ్గితే శిరిడీ వస్తానని మ్రొక్కుకొమ్మన్నది. ఆయన మ్రొక్కుకోగానే జబ్బు తగ్గింది. తర్వాత ఒకనాటి రాత్రి కలలో ఆయనకు బాబా కన్పించి, ఆ ఊరి వ్యక్తినొకరిని చూపి, 'అతడు మీ ఇంటికి దొంగతనానికి రాబోతున్నాడు' అన్నారు. వెంటనే తగు జాగ్రత్తలు తీసుకున్నాడాయన. ఉదయమే ఆ వ్యక్తి ఎదురైనపుడు కృష్ణారెడ్డి, "ఏమయ్యా, అర్ధరాత్రి మా వీధికొచ్చావేంటి!'' అని అడిగితే అతడు కంగారుపడి తప్పిపోయిన దూడకోసం వచ్చానన్నాడు.

ఒంగోలులో చాల సం॥లు సత్సంగాలలో పాల్గొన్నవారికి మంచి అనుభవాలు కల్గాయి. శ్రీమతి సీతారామ్మూర్తి గారు కృష్ణ భక్తురాలు. ఆమె 'శ్రీ సాయి లీలామృతము'' చదివి, "సాయి శ్రీకృష్ణుడుగా దర్శనమివ్వలేదు!' అనుకున్నారు. నాటి సాయంత్రం వారి పూజలోని బాబాపటం నీలిరంగుగా మారిపోయింది. పూజలో లోపం వలన అలా జరిగిందేమోనని ఆమె భయపడుతూంటే నాటిరాత్రి సాయి కలలో కన్పించి, "నేను వస్తే భయపడతావేమి? నా

తలపై మూడు పువ్వులుంచి పూజచేయి, రేపు వెళతాను'' అన్నారు. ఆమె అలానే చేశారు. నాటి సాయంత్రానికల్లా బాబా పటం మామూలుగా వచ్చేసింది! సాయికి, వారి పటానికి, కృష్ణునికీ తేడా లేదు.

కృష్ణమూర్తిగారు ఒంగోలులో ఉద్యోగం చేస్తూండగా కుటుంబం గుంటూరులో వున్నారు. సీతారామ్మూర్తి గారింట్లో భజనలో కృష్ణమూర్తిగారికి బాబాపటంలో దివ్యమైన కాంతి కనిపించింది. ఆనందంతో వారు విద్యానగర్ సాయి మందిరానికి రూ. 116/- లు పంపాలనుకొన్నారు. తర్వాత జీపులో గుంటూరు వెళుతూంటే దారిలో ముగ్గురు సాధువులు, 'సాయినాథ్ మహరాజ్‌కీ జై' అంటూ జీపును ఆపారు. వారిలో ఒక సాధువు, ''నాకిస్తానన్న రూ. 116/- లు ఇవ్వు!'' అన్నారు. ''నేనిస్తానన్నది విద్యానగర్ మందిరానికి గదా!'' అన్నారు కృష్ణమూర్తిగారు. ''అదీ నాకే చెందుతుంది. అక్కడికే పంపు! మేము పండరి నుండి నడచి వస్తున్నాము, దక్షిణ యివ్వు!'' అన్నారు. రూ. 20/- లు ఇస్తే తీసుకొని, ''పాంటు జేబులోని రూ. 20/- లు గూడ ఇవ్వు'' అన్నారు. మనసులో ఖర్చులకెలాగ అనుకుంటూనే రూ. 20/- లు ఇచ్చారు మూర్తిగారు. ''ఖర్చుకు లేదని బాధపడతావెందుకు? నీకు మేలు జరుగుతుంది ఫో!'' అంటూ ఆ రూ. 20/- లు తిరిగి యిచ్చేశారు! వీరు గుంటూరు చేరగానే ఆ రోజే ఉద్యోగంలో ఆయనకు మంచి మార్పు జరిగినట్లు కాగితాలు చేతికిచ్చారు!

విద్యానగర్ సత్సంగ సభ్యులు విజయకుమార్, శరత్‌బాబు, కృష్ణమూర్తి 1976లో అనసూయమాత అనే సిద్ధురాలి దర్శనానికి పరాడ్ సింగా చేరి, ఆ సంస్థానాధ్యక్షుడు శ్రీ ధోలే ఇంటికి వెళ్ళారు. అక్కడ బాబా పటమున్నది. అక్కడ ధోలే వీళ్ళతో, ''మీ గురువు మీ వెంటే వున్నారు. కొద్ది నిమిషాలముందే వచ్చి వెళ్ళారు'' అన్నాడు. తర్వాత ఆ వివరం అతడిలా వ్రాశాడు : ఈ ముగ్గురూ అక్కడ బస్సు దిగిన క్షణంలోనే ధోలేగారింటి వరండాలో ఒక దివ్యమైన కాంతిగోళం అందరికీ కొద్ది నిమిషాలు కన్పించింది. వాళ్ళు ఆ రోజు ఏదో విశేషం జరగనున్నదను కుంటూండగా, ఈ ముగ్గురూ వచ్చి ఆ కాంతిగోళం దర్శనమిచ్చినచోటే నిలచారు.... తర్వాత ఈ ముగ్గురూ ధోలేతో కలిసి అమ్మను దర్శించారు! ఆమె, ''రామ్ రామ్'' అని, ''మీరేదేశం నుంచి వస్తున్నారు?.... దక్షిణ దేశంనుండి వస్తున్నారు. భగవంతుడే మీకీ అవకాశం ప్రసాదించాడు. వీళ్ళు, తమ గురువును ''మాస్టర్'' అని పిలుస్తారు. ''మాస్టర్'' అంటే ''దైవం'' అని గొణిగి, ఆమె తమ వేలితో తమ నాలుకను తాకి, ఆ వేలితో తమ భృకుటి తాకారు. అప్పుడీ ముగ్గురూ తమ సాధన గురించి అడిగారు. ఆమె, ''మీరు భజనలు చేస్తారు. ఒకసారి చంద్రుడు (మనస్సు) నిశ్చలంగాను, ఒకసారి చంచలంగానూ వుంటున్నాడు'' అన్నారు. గమ్యం ఎలా చేరాలని ఈ ముగ్గురూ అడిగితే, ''చేయిపట్టుకొని నడవండి (గురువు ఆజ్ఞను పాటించండి)'' అన్నారు. ఈ ముగ్గురూ, ''అమ్మా! మీరు అసలెవరు?'' అని అడిగితే, సత్యయుగానికి చెందిన అనసూయా దేవియే తామని ఆమె చెప్పారు.

తర్వాత జరిగిన వివరాలు ఈ సత్సంగ సభ్యులు నాకిలా వ్రాశారు : ''మీరూ, సాయిబాబా వున్న పటాన్ని ఆమె ముందుంచాము. ఆమె ప్రత్యేకంగా 2,3 సార్లు దానిని తమ నాలుకతో తాకి, దానిని ఒడిలో వుంచుకొని పమిటతో కప్పివుంచారు. ఆ పటాన్ని చూస్తూ, ''ఋషి ఋషి...... ఇద్దరు ఋషులు.... ఒకరు గుఱ్ఱం మీద'' అన్నారు.

సత్సంగము, భజన శ్రద్ధగా చేస్తుంటే మనం కోరకున్నా మన ఆత్మీయులను గూడ శ్రీ సాయియే అనుగ్రహిస్తారు. సం॥ 1975లో మా తండ్రిగారైన కీ. శే. ఎక్కిరాల అనంతాచార్య తమ అనుభవమిలా చెప్పారు : ''ఒకనాటి మధ్యాహ్నం విజయవాడలో మంచం మీద కూర్చుని వున్నాను. కఫ్నీ, తలగుడ్డ ధరించిన సాయిబాబా తలుపు నెట్టుకొని నా గదిలో ప్రవేశించారు. నేను అది నిజమా, కలా అని చూస్తుంటే ఆయన నా ప్రక్కన మంచంమీద కూర్చున్నారు. ''నేను మిమ్మల్ని పూజించనుగదా, మీరు నావద్ద కొచ్చారేమి?'' అన్నాను. ''నాకటువంటి ప్రాముఖ్యత

లేమీలేవు. నాకు రావాలనిపించే వచ్చాను. రావద్దంటావా?'' అన్నారు. తర్వాత ఆయన లేచి నన్ను కౌగిలించుకొని, "నేను నీలోకి వస్తున్నాను. అక్కడే వుంటాను'' అంటూ నాలోకి వెళ్ళిపోయారు. అలా 7 రోజులు వరుసగా జరిగింది; అది తలుచుకొన్నప్పుడల్లా నా కన్నులవెంట ఆనందభాష్పాలు వస్తాయి''.

అలానే కలిచేడులో ప్రతివారం శ్రద్ధగా సత్సంగం చేస్తుండేవారు. వాటిలో పాల్గొంటున్న పి. సుబ్బరామయ్య అనే టీచరు శ్రీ అవధూత వెంకయ్యస్వామి అనే సిద్ధపురుషుని తన యింట సత్సంగానికి రమ్మని కోరాడు. "ఇప్పుడు కాదులే, తర్వాత చూద్దాం'' అన్నారు స్వామి. సుబ్బరామయ్య 1977లో గురుపూర్ణిమ నాటికి 'శ్రీ సాయి లీలామృతము' 13 పారాయణలు చేసాడు. ఆ ముందురోజు స్వామి అకస్మాత్తుగా వారింటికి వచ్చి, ధుని వెలిగించి, కుటుంబాన్ని, సత్సంగాన్నీ ఆశీర్వదించారు. ఎప్పుడూ ఎవరింటికీ వెళ్ళని, ఎవరింట్లోనూ ఆతిథ్యం స్వీకరించని స్వామి యితడింట భిక్ష చేయడం సకల సాధుస్వరూపియైన సాయి కృపకు నిదర్శనం.

అలానే కాంతమ్మగారికి 1981లో గుండెనొప్పి వచ్చింది. గొంతు పూడిపోయి మాట రావడంలేదు. ఒకరోజు స్వప్నంలో బాబా ఆమె మంచం ప్రక్కన నిలబడి ఆమె మొరవిని, "నా పాదాలు తాకి నమస్కరించుకో, తగ్గుతుంది!' ' అన్నారు. ఆమె స్వప్నంలో అలాగే చేసింది. తర్వాత ఆమె గొంతు సంగతి చెప్పగా రెండు వక్కలు, మూడు ఆకులూ యిచ్చి, "ఇవి నమిలి మ్రింగు, గొంతు వస్తుంది'' అన్నారు బాబా. ఆమె అలానే చేసింది. తెల్లవారి ఆమెకు మెలకువ రాగానే ఆమెకు గుండెనొప్పి, గొంతునొప్పి తగ్గిపోయాయి. అలానే "సీతారాంమైన్స్'' లో పనిచేస్తున్న కె. కోటయ్యనాయుడు గారికి 75వ ఏట ప్రమాదంగా జబ్బుచేసింది. ఏ వైద్యమూ ఉపకరించలేదు. బాబాకు రూ. 1/- ముడుపుకట్టి మ్రొక్కుకొన్నారు. ఆ రాత్రి కాబూలీవాలా వేషంలో శ్రీసాయి దర్శనమిచ్చి, 'రేపటినుండీ నీకు క్రొత్త జీవితం ఆరంభమవుతుంది'' అని ఇంగ్లీషులో చెప్పారు. ఆయన మరుజన్మ గురించి చెప్పారనుకుని ఆ వృద్ధుడు భయపడ్డాడు గాని మర్నాటినుండి ఆయన ఆరోగ్యం బాగుపడింది!

ఉలవపాడులో కొంతకాలం సత్సంగం జరిగింది. అపుడుగూడ ఎందరికో దివ్యమైన అనుభవాలు కలిగాయి. వారిలో చింతా లక్ష్మీనారాయణ శ్రద్ధగా పాల్గొంటుండేవాడు. ఒకరోజు వారి కుమారుడు బాబ్జీ, 5 సం॥ల వాడు వారింటిపై మూడవ అంతస్థు నుంచి క్రింద అంతస్థులోని 'సన్‌షేడ్' మీద పడ్డాడు. అయినా అతడికేమీ దెబ్బతగల్లేదు. అది చూచి ఆశ్చర్యపోయిన తల్లిదండ్రులతో, "నేను పడుతూంటే బాబా నన్ను పట్టుకొన్నారు!'' అని చెప్పాడు బాబ్జీ.

వల్లభాపురం (ఈమని తా. గుంటూరు జిల్లా) లో చి॥ వి. సి. వెంకటేశ్వర్లు సత్సంగాలు చేస్తున్నారు. అచటి సభ్యుల అనుభవాలు యిలా వున్నాయి : శ్రీమతి జంగా కాంతమ్మకు బాబా గురించి ఏమీ తెలియదు. ఒకరోజు కృష్ణారెడ్డి అనే సత్సంగ సభ్యుడు ఒక బాబాపటం ఆమెకిచ్చి, వారి ఎదురింటి కుమారస్వామికివ్వమని చెప్పాడు. ఆ పటం వచ్చిననాటి నుండే ఆమె కష్టాలన్నీ తీరిపోయాయి! అంతకుముందు ఆమె భర్తకు రోజూ కలలో ఒక పిల్లవాడు కనిపించి, బెత్తంతో కొడతానని బెదిరించేవాడు. ఆమె భర్త కేకలు పెడ్తూ నిద్రలేచి, తన చేతికర్రతో ఆ పిల్లవాడు కన్పించినచోట కొడుతూండేవాడు. ఆ పటం వచ్చిన రోజునుండి అట్టి కలలే రాక అతడు సుఖంగా నిద్రపోతున్నాడు. మరురోజు అతనికి కలలో ఒక స్త్రీమూర్తి కనిపించి, "నేను వెళ్ళిపోతున్నాను. ఇకరాను', అని చెప్పి వెళ్ళిపోయింది. అప్పటినుండి మరో బాబా పటం యింట్లో పెట్టుకుని, ఆ పటం కుమారస్వామికిచ్చి ఈ దంపతులు భజన చేసుకుంటున్నారు.

. తర్వాత జంగా కాంతమ్మ తన అనుభవమిలా వ్రాస్తున్నది : "నేను దూరదేశంలోవున్న ఒక వ్యక్తికి రు. 30,000/- లు వడ్డీకిచ్చాను. పాపం అతనికి నష్టమొచ్చి, పత్తాలేకుండా పోయాడు. మాష్టరుగారిని దర్శించి ఈ

విషయం చెప్పుకుంటే, చరిత్ర పారాయణం చేసి, అతనికి మేలు జరగాలని బాబాను ప్రార్థించమన్నారు. నేనలానే చేసాను! అతడు సెప్టెంబరు 3, 1986న అంతదూరంనుండి వచ్చి ఏదో తెలియని ఆవేదనగా వున్నదని, నాకు బాకీ కొంతైనా జమ చేయాలనీ కష్టపడి రు. 500/- లు సేకరించగలిగానని చెప్పి, ఆ పైకమిచ్చాడు. త్వరలో నా బాకీ పువ్వుల్లో పెట్టి తీర్చేస్తానని మాట యిచ్చి వెళ్ళాడు. ఒకరోజు నా భర్తకు కలలో బాబా కన్పించి, అతని మోకాలుమీద కొట్టారు. ఎంతో కాలంగా అతనిని బాధిస్తున్న మోకాటినొప్పి అంతటితో మాయమైంది. సత్సంగంలో మాకెంతో ఆనందం కలుగుతున్నది''

కుమారస్వామి యిలా వ్రాశాడు : ''నా రెండవ కూతురు వివాహం చేసాముగాని, ఆమె అత్తింటి పరిస్థితులు తెలుసుకుని ఆమెను కాపరానికి పంపలేదు. మాస్టరుగారినడిగితే, "శ్రీ సాయి లీలామృతము'' పారాయణ చేసి, సమస్య బాబాకు చెప్పుకుని అమ్మాయిని అత్తగారింటికి పంపమన్నారు. నేను పారాయణ, పూజ ప్రారంభించిన వారంలో మా అల్లుడు, అతని తల్లీ వచ్చి అమ్మాయిని తీసుకెళ్ళారు. ఇప్పుడమ్మాయిని వారు ప్రేమగా చూచుకుంటున్నారు. అంతకుముందు భవిష్యత్తు అంధకారంగా కన్పించి, రాత్రిళ్ళు నిద్రపట్టక ఆత్మహత్య చేసుకోవాలనుకునేవాణ్ణి. ఇప్పుడు సత్సంగాలకు హాజరవుతూ మనశ్శాంతి పొందుతున్నాను.''

★★★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 28



సజ్జన సన్నుత - మునిజన వందిత సాయిరామ్

ఆత్మజ్ఞానానికి పూర్ణుడైన సద్గురువు యొక్క అనుగ్రహము అవసరము. శ్రీ సాయి చెప్పిన తమ గురుసేవా వృత్తాంతము దీనికి తార్కాణము. కేవలం తమ ఇష్టదేవతనే ఉపాసించిన రామకృష్ణ పరమహంసను తోతాపురియనే జ్ఞానిని ఆశ్రయించమని జగన్మాతయే ఆదేశించింది. శ్రీమన్నారాయణుడు తనను ధ్యానించే రేగేతో సాయిబాబాను ఆశ్రయించమని చెప్పాడు. సప్తశృంగీదేవి తననాశ్రయించిన పూజారితో గూడా అలానే చెప్పింది. అందుకే శ్రీకృష్ణుడు గూడా ముముక్షువులు తత్త్వదర్శియైన మహనీయుని శరణుపొంది సేవించాలని భగవద్గీత 4:34లో చెప్పాడు. ఈ పరమరహస్యాన్నే రమణమహర్షి వంటి మహనీయులు గూడ చెప్పారు.

శ్రీ సాయిబాబా, ప్రపంచంలోని వివిధ మతాలకు చెందిన మహాత్ముల కూటమికి సామ్రాట్టని శ్రీ మెహర్‌బాబా కీర్తించారు. అంతేగాదు, పూర్ణదత్తాత్రేయ స్వరూపియైన శ్రీ అక్కల్కోట మహరాజ్, శ్రీధునీవాలా దాదాగార్లనుండి సామాన్య సాధువుల వరకూ అందరూ తమ రూపాలేనని భక్తులకు అనుభవమిచ్చారు. ఈ కారణంగా వారు సశరీరులై వుండగానే సాయిని ఎందరో మహనీయులు ఎంతగానో కీర్తించారు, గౌరవించారని గుర్తించడమెంతో అవసరం.

ఒకరోజు సాయి అక్కడున్న భక్తులతో అకస్మాత్తుగా, "ఆ దిగంబరి వస్తున్నాడు!" అన్నారు. అదెవరి గురించో భక్తులకు అర్థంగాలేదు. కొద్దిసేపటికి బూటీతో కలసి షేగాం నివాసియైన శ్రీ గజానన్ మహరాజ్ వచ్చారు. ఆయన మశీదు ప్రవేశించక, ముంగిటనే కొద్దిసేపు కూర్చున్నారు. ఒకరు చూచినపుడు ఒకరు చూడకుండా శ్రీసాయి, వారు ఒకరినొకరు మౌనంగా కొంతసేపు చూచుకున్నారు. తర్వాత శ్రీ గజానన్ శిరిడీ వీధులలో కొంతసేపు తిరిగి, తర్వాత వెళ్ళిపోయారు. ఎన్నడూ ఏ మహనీయుల దర్శనానికీ వెళ్ళని శ్రీ గజానన్ శిరిడీ రావడమే, వారు శ్రీసాయికి అర్పించిన జోహార్లు. అలానే శ్రీ ధునీవాలా దాదాగారికి ప్రథమ శిష్యులు, ఆ గురుపీఠానికి వారసులూ అయిన ఛోటేదాదా అను సిద్ధపురుషుడు గూడ సాయి దర్శనానికి కాకా సాహెబ్ దీక్షిత్‌తో కలసి వచ్చారు. అప్పుడు సాయి కన్నులు మూసుకొని మౌనంగా కూర్చున్నారు. వారియెదుట కుడివైపుగా ఛోటేదాదాగారు కొద్దిసేపు ఆయనకేసి మౌనంగా చూస్తూ కూర్చొని, తర్వాత వెళ్ళిపోయారు. మరొకప్పుడు నాసిక్‌నుండి గాడ్గీ మహరాజ్, నాసిక్‌లో వారు నిర్మిస్తున్న 'విశ్వమందిర్' అనే భవన నిర్మాణానికి కావలసిన నిధులు చేకూరని కారణంగా సాయి ఆశీస్సుల కోసం వచ్చారు. వారిని చూస్తూనే సాయి ఎంతో చెడ్డగా తిట్టారు. గాడ్గీ మహరాజ్ అది విని పకపక నవ్వారు. అప్పుడు సాయికూడ నవ్వారు. కొద్దికాలంలోనే తగిన నిధులు వారికి చేకూరాయి. శ్రీ అక్కల్‌కోట స్వామి 1876లో తమ భక్తులను సాయి దర్శనానికి పంపిన వివరం వెనుకటి అధ్యాయంలో చూచాము.

శ్రీసాయికి సమకాలికుడైన సిద్ధపురుషులలో ఒకరు దేవ్‌గాం‌వ్ నివాసియైన మాధవ్‌నాథ్ మహరాజ్. వీరుగూడ చిలిమ్ త్రాగేవారు. ఈయన ఒకసారి శిరిడీవచ్చి సాయిని దర్శించారు. వారిని చూస్తూనే, "చిలిమ్ త్రాగడం అలాగాదు. అజ్ఞానమనే పొగాకుకు గురుభక్తియనే నిప్పునుపెట్టి చిలిమ్ పీలిస్తే, మనలోని అహంకారం ఆకాశంవలె

అనంతమైన పరమాత్మలోకి ఎగసి లీనమౌతుంది!" అని శ్రీ మాధవనాథ్ చేతిలో పొగాకు నలిచి పెట్టారు సాయి. ఆయన ఎంతో సంతోషంగా సెలవు తీసికొని వెడుతూ భక్తులతో, "సాయి సామాన్య సత్పురుషులుగారు, మహనీయులలోకెల్ల కోహినూర్ వజ్రం వంటివారు!" అన్నారు. తర్వాత సాయి భక్తుడు రేగే 1923లో మాధవనాథ్ మహరాజ్‌ను దర్శించినపుడు ఆయన, "నీవు సాయి దర్బారులోని వాడవు" అని చెప్పి, మొదట అతడు సాయిని దర్శించినప్పటి సన్నివేశం వివరంగా వర్ణించి, "ఆ సమయంలో నేను అక్కడే వున్నాను" అన్నారు.

పాపక్షయానికి, సద్గురు దర్శనానికి, సద్గురుకృప పొందటానికీ 'శ్రీ గురుచరిత్ర' సాటిలేని సాధనమని కుశాభావుకు సాయి సూచించారు. దాని పారాయణవలన సిద్ధపురుషుడయిన శ్రీ వాసుదేవానంద సరస్వతీస్వామి సాయి సమకాలికులలో ఒకరు. వీరు శ్రీపాద వల్లభస్వామి జన్మస్థానమైన పిఠాపురం దర్శించి, రాజమండ్రిలో కొద్దికాలమున్నారు. అప్పుడు నాందేడ్ నుండి పుండలీకరావు కొందరు భక్తులతో కలసి, వారిని దర్శించాడు. మాటలలో సాయి ప్రసక్తి రాగానే, ఆ స్వామి తలవంచి నమస్కరించి పుండలీకరావుకు ఒక కొబ్బరికాయనిచ్చి, "దీనిని నా నమస్కారాలతోబాటు మా అన్నగారైన శ్రీ సాయిబాబాకు సమర్పించు; నన్ను మరువక ప్రేమతో కనిపెట్టి వుండమని నా తరపున ప్రార్థించు" అన్నారు. నాందేడ్ తిరిగివచ్చిన నెలరోజులకు, పుండలీకరావు తన మిత్రులతో కలసి శిరిడీకి బయలుదేరి మన్మాడ్‌లో ఒక కాలువగట్టు చేరాడు. అక్కడ ఆకలి తీర్చుకోడానికి కారపు అటుకులు తిన్నారు. అవి మరీ కారంగా వుండడం వలన ఒక కొబ్బరికాయ కొట్టి అందులో కలుపుకుని తిన్నారు. కాని తర్వాత వారికి గుర్తొచ్చింది - వారు తినేసినది శ్రీ వాసుదేవానంద స్వామి సాయికి పంపిన కొబ్బరికాయ అని! వారు శిరిడీ చేరగానే సాయి, "నా సోదరుడు పంపిన కొబ్బరికాయ ఏది?" అని అడిగారు. పుండలీకరావు తన అపరాధం క్షమించమని కోరాడు. ఆ కాయకు బదులుగా మరొక కాయ సమర్పిస్తానన్నాడు. తన సోదరుడు పంపిన కాయకు యింకొకటి సాటికాజాలదని చెప్పి, సాయి ఆ భక్తులను క్షమించి ఆశీర్వదించారు. ఆయన శ్రీ వాసుదేవానందస్వామికి కూడా పూజ్యులే. వారు తమను దర్శించిన సగుణ మేరూనాయక్‌తో, "నీవు ఒక గొప్ప దర్బారుకు చెందినవాడవు. ఇక నీకు చెప్పవలసినదేమున్నది?" అని సాయిని ప్రశంసించారు. పరిపూర్ణుడైన యోగికోసం అన్వేషిస్తున్న ఉపాసనీ శాస్త్రితో, రాహురీ నివాసియైన శ్రీ కులకర్ణి అను యోగి, "మహోన్నతమైన యోగస్థితిలో వున్న నిన్ను ఉద్ధరించగల సమర్థుడు శ్రీ శిరిడీ సాయినాథుడే!" అని ప్రశంసించాడు. శిరిడీ గ్రామస్థులతో గంగగిర్ బాబా, శ్రీ ఆనందనాథ్ మహరాజ్‌లు సాయిని గురించి ఎంత ప్రశంసగా చెప్పారో చూచాము. ఠాకూర్ అనే ఉద్యోగితో కన్నడ మహాత్ముడు శ్రీ అప్పాకూడా సాయిని గురించి అలానే చెప్పారు గదా! శిరిడిలో 1 సం॥ నివసించిన శ్రీ మెహర్‌బాబాగారు గుస్తావు అనే భక్తునితో, "సాయిబాబా ఎంత గొప్పవారో తెలుసుకోవటం మీకసాధ్యం. ఆధ్యాత్మిక పూర్ణతే ఆయనగా వెలసింది. ఆయన సంగతి మీకు తెలిస్తే, ఆయన ఈ సృష్టికంతటికీ గురువని తెలుస్తుంది" అన్నారు.

నాగపూర్ నివాసియైన హజ్రత్ తాజుద్దీన్ బాబాగారి దర్శనానికి బూటీ వెళ్ళినపుడు అతనితో ఆయన, "ఇక్కడకెందుకొచ్చావు? నీ గురువు శిరిడీలో వున్నారు. నీ విషయంలో జోక్యం చేసుకోవడానికి నేనెవణ్ణి? సాధ్యమైనంత త్వరగా అక్కడికి చేరు" అన్నారు. తమ దర్శనానికి శిరిడీరాని సాధుపుంగవులకు గూడ వారి వారి స్వస్థలాలలో శ్రీసాయి తమ దర్శనమనుగ్రహించేవారు. ఉదా: 1914లో నాందేడ్ సమీపంలో నివసిస్తున్న దాజీమహరాజ్ గారిని తోసర్ దర్శించాడు. అప్పుడాయన, "నిన్ననే మారుతి రూపంలో సాయిబాబా యిక్కడకొచ్చారు. అప్పుడు ఉరుమువంటి శబ్దమయింది" అన్నారు.

మహాసమాధి తర్వాత గూడ శ్రీ సాయి మహనీయులందరికీ సామ్రాట్టుగానే కొనసాగుతున్నారు. వారి చరిత్ర, వారాదేశించిన 'శ్రీ గురు చరిత్ర'లు పారాయణచేసి వారి కృపకు పాత్రులైనవారికి యితర మహనీయుల

కృప అవ్యాజంగా లభిస్తుంది.

దాసగణు 1918లో నాందేడ్ వద్ద తపస్సు చేస్తున్న ఒక బ్రహ్మచారి దర్శనానికి మూడుసార్లు వెళ్ళాడు. ఆయన దర్శనమీయలేదు. దాసగణు ఖిన్నుడై, వేరొకరిద్వారా భిక్ష పంపితే ఆయన తీసుకున్నారు. అతడు సంతోషించి ఆయనను మరలా దర్శించాడు. ఆయన, "నీవు మహనీయుల చరిత్ర వ్రాస్తున్నావు గదా!" అని, అంతకు 6 రోజులముందు దాసగణు వ్రాసిన కీర్తనల గురించి చెప్పి, వాటిలోని కొన్ని వాక్యాలు యథాతథంగా చెప్పి " నీకు సాయి తమ పాదాలనుండి గంగా జలమిచ్చారు గదా, ఏం చేశావు?" అన్నారు. "దానిని శిరస్సున చల్లుకొన్నాను" అన్నాడు దాసగణు. "నీవు సద్బ్రాహ్మణుడవని, సాయి ముస్లిమని, అది త్రాగితే నీవు అపవిత్రుడ వవుతావనీ తలచావుగదూ? ఎంత అహంకారం!" అన్నారు బ్రహ్మచారి.

అలానే దాసగణు ఉస్మానాబాద్‌వద్ద నివసించిన ఇస్లామ్‌పూర్కర్ అనే వృద్ధ బ్రాహ్మణుడైన సాధుపుంగవుని దర్శించి, "శ్రోత్రియుడనైన నేను సాయిని దర్శించవచ్చా?" అన్నాడు. "దర్శించవచ్చు. నేనుగూడ వారిని దర్శించి 3 రోజులు వారి సన్నిధిలో వున్నాను. ఆయనెంతటివారో ప్రజలు తెలుసుకోవడం లేదు. ముందు ముందు వారి గొప్పతనము ప్రజలు తెలుసుకొంటారు" అన్నారు.

దామోదర్ రాస్నే యిలా వ్రాశాడు : "నానాటికీ నాకు సాయి యెడల భక్తి పెరుగుతున్నది. నేను ఇతర మహనీయులను దర్శించినప్పుడు వారిని సాయిబాబా రూపాలుగా తలచి, "సమర్థ సద్గురు సాయినాథునికి నమస్కారము" అనుకొని నమస్కరిస్తాను. నేను 1927లో ఖేడ్‌గాఁవ్‌బేట్ వెళ్ళి శ్రీనారాయణ మహరాజ్‌గారికి నమస్కరించాను. ఆయన, 'నీ గురువు పరమ గురువు. వారు నాకంటే ఎంతో గొప్పవారు, నీవు నా వద్దకు రావడమెందుకు? పూర్వపుణ్యం వలన సాటిలేని గురువునెన్నుకొన్నావు. నీవచ్చుటికే వెళ్ళు; 'గమ్యం చేరుతావు' అన్నారు! నేను 1927లో జున్నూరు సమీపంలోని సీతారామ్ ఉత్తరేశ్వర్ అనే క్షేత్రం దర్శించి, అక్కడ దేవునికి పువ్వులు సమర్పించి, "సాయిబాబాకు నమస్కారము" అనుకొన్నాను. మరుక్షణమే ఆ విగ్రహము నుండి ఒక దివ్యమైన జ్యోతి వెలువడి, దాని మధ్యలో సాయిబాబా దర్శనము అయింది. అక్కడ నివసిస్తున్న జానకీదాస్ అనే మహనీయుని దర్శించి వారి రూపంలో వున్న సాయికి నమస్కరించుకొన్నాను. వెంటనే వారు, "నీవెంతో గొప్ప మహనీయుని ఆశ్రయించావు. నావంటి సామాన్య సాధువును దర్శించడమెందుకు? మావంటివారమంతా సాయిబాబా పాదాలనే ఆశ్రయిస్తాము" అన్నారు.

జనార్ధన్ గల్వంకర్ శ్రీ సాయిబాబాను దర్శించినప్పటికీ ఆయనకు సన్నిహితుడు కాలేదు. కాని బాబా మహాసమాధి చెందాక, అతనికి ఆధ్యాత్మిక జీవితంపట్ల, సాయిపట్ల భక్తిశ్రద్ధలు బలపడ్డాయి. అతడు 1921లో సకుటుంబంగా ప్రయాగ వెళ్ళి, అచటి భరద్వాజాశ్రమంలో కూర్చొని, తనకెవరైనా మహనీయుల దర్శనము, ఆశీస్సులూ లభించాలని బాబాను ప్రార్థించాడు. తరువాత ఆశ్రమం విడచి కొంతదూరం పోయాక, ఆ క్షేత్ర దర్శనం చేయిస్తున్న వ్యక్తి ఒక మహనీయుని అతనికి చూపించాడు. ఆ మహనీయుడు 7 సం॥లకొకసారి ప్రయాగ వస్తుంటాడని, ఎవరికీ దర్శనమివ్వడని, ఎవరినుండీ దక్షిణ స్వీకరించడనీ అతడు చెప్పాడు. గల్వంకర్ మనసులో సాయిని స్మరించి, ఆ మహనీయుని సమీపించాడు. ఎప్పుడూ ఎవరినీ చెంతకు రానీయక కసిరి, బెదరించి వెళ్ళగొట్టే ఆ మహనీయుడెంతో ప్రేమగా చేయెత్తి ఆశీర్వదించి, 'రా! నాయనా, రా!" అని ఆహ్వానించారు. కుటుంబమంతా అతనికి నమస్కరించుకొన్నారు. గల్వంకర్ తన జేబులోనున్న 3 అణాలు దక్షిణగా సమర్పిస్తే ఆయన ఆదరంతో స్వీకరించారు!

అలాగే రేగే అను సాయిభక్తుడు హజ్రత్ తాజుద్దీన్ బాబా దర్శనానికి నాగపూర్ వెళ్ళాడు. ఆ రోజులలో ఆయన రాజుగారి అంతఃపురంలో నివసిస్తూండడం వలన వారి దర్శనం లభించడమెంతో కష్టతరమయ్యేది. దానికితోడు వేలాది జనం రాజభవనానికి ముంగిటనున్న తోటలో వారి దర్శనానికి వేచియున్నారు. నాటి సాయంత్రం 4 గం॥లకు రేగే రైలెక్కవలసి యుండటం వలన మధ్యాహ్నం 3 గం॥ల వరకు మాత్రమే వారి దర్శనం కోసం వేచియుండదలచాడు. ఆ గడువు కొద్ది నిమిషాలు వుండగా ఒక భక్తుడొచ్చి రేగేను శ్రీ తాజుద్దీన్‌బాబా ప్రత్యేకంగా రమ్మన్నారని చెప్పి దర్శనానికి తీసుకు వెళ్ళాడు. రేగే తృప్తిగా వారిని 10 నిమిషాలు దర్శించి, వారి ఆశీస్సులను పొందాడు. కొద్ది కాలం తరువాత శ్రీ శ్రీలలానాథ్ మహరాజ్ ఆ ప్రాంతానికి వచ్చారని తెలిసి, రేగే వారిని గూడా దర్శించి, వారిని తన యింటికి ఆహ్వానించాడు. ఆయన వెంటనే రేగే యిల్లుచేరి సాయి పటానికి నమస్కరించారు. రేగే సమర్పించిన టీ కొంచెం త్రాగి కొంచెం ప్రసాదంగా అతనికిచ్చారు. వేరొకప్పుడు సాయి ఖేడా నివాసియైన శ్రీ కేశవానందజీని, పూణే నివాసియైన హజ్రత్ బాబాజాన్ అనే సిద్ధురాలినీ గూడ దర్శించాడు రేగే. ఆ యిద్దరు మహాత్ములూ అతనిని చూస్తూనే, "నీవు సాయిబాబా దర్బారుకు చెందినవాడవు" అని ఎంతో ఆదరించారు.

గణేష్‌పురీలో శ్రీ నిత్యానందస్వామి శిష్యులు, సిద్ధ పీఠ స్థాపకులూ అయిన శ్రీ ముక్తానంద పరమహంస యిలా వ్రాసారు : "నా సద్గురువైన నిత్యానందులు, సాయిబాబా వేరుగారని నా భావం. నేను మనదేశంలో వున్నప్పుడు ప్రతి సంవత్సరమూ తప్పక శిరిడీ దర్శనమొక్కసారైనా చేస్తాను. ప్రపంచ పర్యటన చేసినపుడు వేలకు వేలు సాయి పటాలు పంచాను."

పూణేలో ఒక కుటుంబం అటు సాయిబాబాకు, యిటు 'కాకా' మహరాజ్‌కూ భక్తులే. ఒకసారి రఘునాథ్ (కాకా) మహరాజ్‌గారిని తమ యింటికి విచ్చేసి కొద్ది రోజులక్కడుండమని కోరారు. కాని ఆయన అంగీకరించలేదు. అపుడు వాళ్ళు సాయిని దర్శిస్తే ఆయన, "చింత పడకండి. కాకా మహరాజ్ మీ యింటికి వస్తారు. ఒక్కరోజుగాదు, మూడు రోజులు మీ యింట్లో వుంటారు!" అని ఆశీర్వదించారు. తర్వాత చిత్రంగా శ్రీ కాకా మహరాజ్ అలానే చేశారు. శ్రీ సాయి ఆజ్ఞ మహనీయులకు గూడ శిరోధార్యమే!

శ్రీ మాధవ్‌నాథ్ మహరాజ్ ఇండోర్‌లో ఎందరినో భక్తిమార్గంలో నడిపించిన మహనీయులు. వీరికి బాబా పట్ల ఎంతో భక్తిశ్రద్ధలుండేవి. బాబాసాహెబ్ రేగే ఒకసారి వీరిని దర్శించి తిరిగి పూణే బయల్దేరుతుంటే ఆయనిలా అన్నారు : "నీవు మొదట శిరిడీ దర్శించి, తర్వాత యింటికి వెళ్ళు, ఈ జాబు బాబాకు యివ్వు". ఆ జాబులో దేవీ సాక్షాత్కారము మొ॥న ఎన్నో విషయాల గురించి ఆయన వ్రాశారు. రేగే శిరిడీ చేరేసరికి అర్ధరాత్రి అవటంవలన సమాధి మందిరం మూసివేశారు. ఏమి చెయ్యాలో తోచక అతడా జాబు ఒక కిటికీలో పెట్టి అక్కడే నిలబడ్డాడు. చిత్రంగా అతడు చూస్తుండగానే అతని కళ్ళ ఎదుటి దృశ్యమంతా మారిపోయింది! అతని ఎదుట బాబా సమాధి వున్నది. దానిపైనున్న దోమతెర తొలగించబడియున్నది. కుడిప్రక్కగా తాను, ఎడమవైపు ఒక పెద్ద పులి వున్నాయి. మరుక్షణమే ఎడమవైపు పులి బదులు దేవీమూర్తి వున్నది. అది చూడగానే మాధవనాథులు జాబులో వ్రాసిన విషయం గుర్తొచ్చింది. దోమతెర లోపల సాయిబాబా చిలిం త్రాగుతూ కూర్చొని వున్నారు. ఆయన ఎదుట మాధవనాథులు కూర్చొని విచిత్రమైన పారవశ్యంతో అటూ యిటూ ఊగిపోతున్నారు. ఈ దృశ్యమెంతోసేపు కొనసాగింది. అది స్వప్నమేమోనని రేగే శంకించాడు గాని, చూచుకుంటే మెలకువే! ఆ జాబుతో మాధవనాథులు సూక్ష్మరూపంలో సాయిని దర్శించారు! సాయి వారి జాబుకు సమాధానంగా దేవీ దర్శనమూ, తమ సాన్నిధ్యానందమూ గూడ వారికి ప్రసాదించారు.

సాయిభక్త యం. రంగాచారి (హైదరాబాదు) యిలా వ్రాస్తున్నారు : "శ్రీ శంభునాథ్‌జీ అను సిద్ధ పురుషుడు

నాతో, 'ముందు ముందు నీవొక సాటిలేని సిద్ధ పురుషుని శరణుపొంది, అంతిమ ఘడియవరకూ ఆయనకంకిత మవుతావు' అన్నారు. అలానే ఒకటి రెండు సం॥లలో నేను బాబాను ఆశ్రయించాను. తర్వాత 1940లో శ్రీ స్వామిరామదాస్ (కన్హన్‌ఘడ్) గారు, 'నిధులన్నింటికీ నిధియనదగిన మహాత్ముని ఆశ్రయించావు. ఎన్నడూ ఆయనను విడువకు' అన్నారు. అలానే 1958 విజయదశమికి పంపిన సందేశంలో శ్రీ స్వామి శివానంద (ఋషీకేశ్), 'శిరిడీ సాయిబాబా అంటే ఆనందసాగరమే, అంత కంటె గొప్పది మరేమున్నది?' అన్నారు. శ్రీ గణపతి సచ్చిదానందగారు యిటీవల నాతో, 'శిరిడీ సాయిబాబా అంటే దత్తాత్రేయుని అవతారమే!' అని, క్షణమాలోచించి, 'కాదు కాదు! వారు దత్తాత్రేయుడే!!' అన్నారు. కొద్ది సం॥ల క్రిందట మద్రాసులో ఒక మాతాజీని దర్శించాను. అప్పుడామె ధ్యానంలో వున్నారు. పావుగంట తర్వాత ఆమె 'శిరిడీ సాయిబాబా!' అని నాకేసి చూచి, 'త్రేతాయుగంలో వశిష్ఠ మహర్షిగాను, ద్వాపరంలో దత్తాత్రేయుడుగానూ అవతరించినదే, కలియుగంలో శిరిడీ సాయిబాబాగా వచ్చింది! ఇప్పుడు శివ, రామ మందిరాలున్నట్లే, ఒకటి రెండు శతాబ్దాలలో ప్రతి గ్రామంలోనూ సాయి మందిరాలు వెలుస్తాయి. అవి మన గ్రామీణ జీవితమంతటికీ కేంద్రాలవుతాయి' అన్నారు.

ఒకసారి, సమాధి చెందిన సిద్ధపురుషులు జ్ఞానమివ్వలేరని విన్నాను. నేను పూణే వెళ్ళినపుడు శ్రీ వాసుదేవానంద స్వామికి ప్రత్యక్ష శిష్యులైన శ్రీ గుళవణి మహరాజ్ అనే యోగి, "సాయిబాబా కా బేటా! శ్రీ సాయి విషయమలాగాదు. ఆయన దత్తావతారమే గాని కేవలం సిద్ధపురుషుడుగారు! సమాధి చెందాక గూడ వారెందరికో శరీరంతో దర్శనమిచ్చి ఉద్ధరిస్తున్నారు. నీవు నడుస్తున్న బాట ఎంతో మంచిది. ఆ మర్గాన్నే పో!" అన్నారు. కాళహస్తిలో నివసించిన అవధూత గోపాలస్వామి, "సాయి భగవాన్ హై!" అన్నారు.

సాయి యింతటి మహనీయులు గాబట్టే భగవదాదేశంగా ఆ పేరు ఆయనకు సార్థకంగా నిలిచింది. 'సాయి' అంటే 'మహాత్ములలో శ్రేష్ఠుడు' అని బెంగాల్ రాష్ట్రంలో వాడుక. ఆ పేరుకు 'సర్వానికీ అతీతుడు' అని అర్థమని శ్రీ రామకృష్ణ పరమహంస చెప్పారు. (వచనామృతము, ii, 55). ఒకనాడు పరమహంస, తమకు చిలిం పీలుస్తున్న మహాత్ముని చిత్రపట మొకటి, ధుని నిర్వహించే మహనీయుని పటమొకటీ కావాలని కోరి, "వాటిని చూడటంవలన తీవ్రమైన భక్తి కలుగుతుంది" అన్నారు. ఎప్పుడూ చిలిం పీల్చేవారు షేగాం నివాసి శ్రీ గజానన్ మహరాజ్; నిరంతరమూ ధుని నిర్వహించినది, చిలిం త్రాగినదీ శ్రీ సాయిబాబా.

★★★

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము



అధ్యాయము - 29

గ్రంథ పారాయణ మహాత్మ్యము

శ్రీ సాయి యిలా అన్నారు : "నా చరిత్ర గానమే నీకు శ్రేయస్కరం. అది యీ భూమిపై నా అవతారకార్యం యొక్క పరిపూర్ణతే! భావయుక్తంగా నా చర్యలు, సూక్తులు, గుణాలు మరియు విభూతులను గానం చేసేవారిని నేను సంపూర్ణంగా రక్షిస్తాను. భక్తిశ్రద్ధలతో నన్నంటి పెట్టుకునే నా భక్తులకు నా చరిత్ర పారాయణ వలన సంతోషం కలగడం సహజమే. నా మాట నమ్ము. విశ్వాసంతో నన్ను కీర్తించి, నా లీలలు గానం చేసేవారికి పూర్ణమైన ఆనందము, శాంతి ప్రసాదిస్తాను. విశ్వాసంతో నన్ను కీర్తించి, సంపూర్ణంగా నన్ను శరణుబొంది, ఎల్లప్పుడూ నన్నే గుర్తుంచుకొని ధ్యానించేవారికి మోక్షమివ్వడమే నా వ్రతం. నా లీలలు, నా చరిత్ర తలచుకొంటూ, నన్నే ధ్యానిస్తూ, నాపై భక్తి కలిగి నా నామం జపించేవారికి ఇంద్రియ విషయాలపై విశ్వాసమెలా వుండగలదు? నా చరిత్ర విన్నంత మాత్రాన్నే ఎవ్వరినైనా మృత్యు ముఖం నుండి రక్షిస్తాను. అతనికి వ్యాధి నివారణవుతుంది. భక్తిశ్రద్ధలతో నా చరిత్ర శ్రవణం చేసి, దానినే మననం చేస్తే నీకు శాంతి లభిస్తుంది. దేహాత్మభావము, మరియు ద్వైతదృష్టి నశిస్తాయి. ఏకాగ్రము, పూర్ణము అయిన భక్తివలన చిత్తమంతా దివ్యశక్తి మండలమవుతుంది". **- సాయి సచ్చరిత్ర (3:1-25)**

చరిత్ర పారాయణకు శ్రీ సాయి ఎంతటి ప్రాధాన్యతనిచ్చారో పై వాక్యాలవల్ల మనకు తెలుస్తుంది. అంతేగాక ఈ గ్రంథపారాయణ చేసిన వారిని శ్రీ సాయి ఎంతగా అనుగ్రహించారో గూడ ఈ క్రింది భక్తుల అనుభవాలు నిరూపిస్తున్నాయి.

"అది 1985 జనవరి 20 వ తేదీ శ్రీ సాయినాథుని జీవిత చరిత్రను 3 సప్తాహాలు పారాయణ చేయాలనుకొని, మొదటి సప్తాహం పూర్తిచేసి, బాబాకు నైవేద్యం పెట్టి, హారతిచ్చి, రూ. 2-25లు సమర్పించుకున్నాను. ద్వితీయ సప్తాహము ప్రారంభిస్తూ, 'శ్రీసాయిబాబా! నీవు నా పూజ, పారాయణలతో నిజంగా సంతృప్తుడవైతే నాకీరోజు నీనుండి నిదర్శనం రావాలి' అని ప్రార్థించాను. ఆరోజు రాత్రి 7-30 గం॥ల ప్రాంతములో మా అబ్బాయి పరుగెత్తుతూ నావద్దకొచ్చి, 'శ్రీ సాయి మనింటికి వచ్చారు. 7 గం॥ల ప్రాంతములో సాయివలె తలకట్టు, వేషంతో వచ్చి మీ పేరుపెట్టి పిలిచి అమ్మను, "ఉన్నారా!" అని అడిగారు. నేను మీరింకా రాలేదని చెప్పాను. ఆయన నాకేసి చూచి, "రా! శ్రీనుబాబూ, ఎందుకు భయం?" అన్నారు. "నా పేరు మీకెలా తెలుసు?" అంటే, "నాకు నీపేరు, మీ నాన్న పేరు గూడ తెలుసు" అన్నారు. అమ్మతో, "నేను యాత్రకు వెళుతున్నాను. మీవారు పూజచేసి బాబా పటంవద్ద పెట్టిన దక్షిణ రు. 2. 25/-లు తీసుకురా!" అన్నారు. తెచ్చిస్తే తీసుకుని, "నన్నెందుకు ఎప్పుడూ నిందిస్తుంటావ్? మీవారు హిగానే నేను వచ్చి వెళ్ళానని చెప్పు!" అన్నారు. "మీ పేరేమిటి?" అంటే "నేను వచ్చివెళ్ళానని చెప్పు, మీ నాన్న కనుక్కుంటాడు" అని ఆశీర్వదించి వెళ్ళిపోయారు' అని చెప్పాడు. నేను కోరినట్లు బాబా దర్శనము, నిదర్శనము గూడ యిచ్చారు. "

- డి. ప్రభాకరరావు.

"మీ వద్దనుండి 'శ్రీసాయి లీలామృతము' తెప్పించుకొని పారాయణ పూర్తి చేసేసరికి ఉద్యోగంలో సమస్యలు సులభంగా విడిపోయాయి. రద్దు కాబోయిన ఉత్తర్వులు - నాకు అనుకూలమైనవి - నిలచాయి. అన్నిటా నాకు

విజయమే లభిస్తున్నది. ఇంట్లో అందరమూ సాయి భక్తులమై సాయిచరిత్ర నిత్య పారాయణ చేస్తున్నాము.

- వి. శివరామయ్య, నెల్లూరు.

"శ్రీ భరద్వాజగారు వ్రాసిన 'శ్రీ సాయిలీలామృతము' పూర్తిగా చదివే లోపల మనస్సు ఎంతో ప్రశాంతమైంది. తెలుగులో యింతవరకు అటువంటి పుస్తకం వెలువడలేదు" **- ఎమ్. చౌడప్ప, సోమలాపురం.**

"నాకు ఫిబ్రవరి 5, 1981 గురువారం రాత్రి కల వచ్చింది. నేను శిరిడీ వెళ్ళాను. తెల్లని కఫ్నీ ధరించి పద్మాసనంలో బాబా ఒక పంచలో కూర్చొని వున్నారు. వారి వెనుక ధుని వున్నది. నేను దక్షిణ యివ్వడానికి జేబులో చేయి పెట్టుకుంటే 25 పైిిల నాణెమొచ్చింది. 10 పైిిల నాణెం కోసం మరలా జేబులో చేయి పెట్టుకుంటే మరలా 25 పైసల నాణెమే వచ్చింది. దానిని ధుని దగ్గర వుంచగానే బాబా, 'షికారుకు వెళ్దాం రా' అని, చుట్టూరా కొంత ప్రహరీ, కొంత కంచెగల ఒక తోటలోకి తీసుకెళ్ళారు. అక్కడ కొంచెం సంభాషణ జరిగాక నేను, 'నేను "శ్రీ సాయి లీలామృతం" పారాయణ చేయవచ్చా?' అన్నాను. ఆయన చేయమన్నట్లు తలవూపారు. మరుక్షణమే వారి గుడ్డలు కాషాయరంగులోకి మారాయి, నాకు మెలకువ వచ్చింది. అప్పుడు గుర్తొచ్చింది - శ్రీ సాయి లీలామృతంలో 25 పేజీలు మాత్రమే చదివి, అనివార్య కారణాలవల్ల ఆపివేశాను. తర్వాత ఆ సంగతే మరచిపోయాను. ఈ గ్రంథ పారాయణ చేస్తే శిరిడీలో బాబాకు దక్షిణ సమర్పించనట్లవుతుందని తెలుసుకున్నాను."

- కె. శ్రీనివాసరావు, అల్లూరు.

"కామేశ్వరమ్మ (ఒంగోలు) తమకు తెలిసిన వారినుండి 'శ్రీ సాయిలీలామృతం' తీసుకొని శ్రద్ధగా పారాయణ చేసింది. కొంతకాలంగా ఆమెకు మూర్ఛవ్యాధి, వెన్నులో నొప్పివచ్చి ఏ చికిత్సకూ తగ్గలేదు. అది తగ్గించమని బాబాను ప్రార్థించి పారాయణ చేస్తుండగా, ఒకనాటి రాత్రి శ్రీ సాయి డాక్టరువలె స్వప్న దర్శనమిచ్చి ఇంజెక్షన్ చేశారు. ఆ నొప్పికి మెలకువ వచ్చి చూస్తే ఇంజెక్షన్ చేసిన గుర్తు స్పష్టంగా కనుపించింది. అంతటితో ఆ వ్యాధి తగ్గిపోయింది. ఆమె మరింత భక్తితో పారాయణ చేస్తుంటే, ధ్యానానికి కూర్చోగానే శిరిడీలో సాయికెదురుగా కూర్చున్నట్లు భావోద్రేకం కలిగి బాహ్యస్మృతి లేకుండా 5,6 గంిిల సేపు కూర్చుండి పోయేది.

ఆమెకు ఇంకెన్నో దివ్యానుభవాలు కలుగుతుండేవి. ఉదా:- 3-9-1968 రాత్రి ఆమెకు కలలో ఎవరో పాముల వాళ్ళిద్దరు వాకిట్లో నిలబడి బెదిరిస్తున్నారు. ఇంతలో తెల్లని దుస్తులు ధరించిన ఎదురింటి ముస్లిం అబ్బాయి వచ్చి వాళ్ళను ఉరుదూలో తిట్టి తరిమేశాడు. మర్నాడు గురువారం సాయంత్రం ఆ అబ్బాయి వాళ్ళింటికి వస్తే ఆ కల సంగతి చెప్పారు. సాయియే అలా దర్శనమిచ్చి ఆపద నివారించి వుంటారని అతడన్నాడు. నాటిరాత్రి ఆమెకు కలలో ఒక దున్నపోతు, భీకరులైన నల్గురు నల్లటి మనుష్యులు కన్పించి ఆమె మెడకు తాడుకట్టి లాగుతున్నారు. ఆమె భయంతో కేకవేసి నిద్ర లేచింది. మరలా నిద్రపట్టాక మరలా ఆ నల్గురూ ఆమె మంచం చుట్టూ తిరుగుతున్నట్లు కల వచ్చింది. అంతలో తెల్లని వస్త్రాలు ధరించిన వేరొకరు వాళ్ళను తిట్టి వెళ్ళగొట్టారు. ఆమెకు మెలకువ వచ్చి మంచం దిగబోతే ఎడమ కాలు క్రింద మెత్తగా ఏదో తగిలింది. కాలు ప్రక్కకు తీసేలోగా ఒక త్రాచు పాము పడగవిప్పి, బుసగొట్టి ఆమె కాలుపై కాటువేసి చరచరా వెళ్ళిపోయింది. కొద్దిసేపట్లో ఆమె శరీరం చల్లబడి, చెమటపట్టి, గుండెలు బరువెక్కాయి. కొందరు పరుగునపోయి పాముల నరసయ్యకు ఫోను చేశారు, కొందరు ఆమెను డాక్టరు వద్దకు తీసుకువెళ్ళాలన్నారు. ఆమె, "నన్ను సాయి పటందగ్గర చాపమీద పడుకోబెట్టి భజన చేయండి. నాకు సాయియే దిక్కు. నేను డాక్టరు వద్దకు రాను. నాకెలా వుంటే అలా జరుగుతుంది" అన్నది. క్రమంగా ఆమెకు బాహ్యస్మృతి తగ్గుతూ నోట నురుగు రాసాగింది. ఇంతలో ఆ ప్రదేశమంతా

పరిమళాలు వ్యాపిం చాయి! కాసేపటికి ఆమెకు స్పృహ వచ్చింది. త్వరలో ఆమె కోలుకున్నది.

- జె. వి. సుబ్బయ్య, ఒంగోలు.

మా పెద్దబ్బాయికి భీమవరంలోని సెంట్రల్ బ్యాంకులో మేనేజరుగా ప్రమోషన్ వచ్చింది గాని, అక్కడ చేరేలోగానే కాకినాడలో హెర్నియా ఆపరేషన్ చేయించుకొని అకస్మాత్తుగా చనిపోయాడు. నా తలకొరివి పెట్టాల్సిన 45 సం॥ల కొడుకును పాడెమీద చూచినప్పటి నుండి కుమిలిపోతున్నాను. మా అన్న పింగళి పరశురామయ్య నన్ను చీరాల తీసుకొని వెళ్ళి 'శ్రీ సాయి లీలామృతం' పారాయణతో మనోవేదన తగ్గించుకోమన్నాడు. నేను పారాయణ చేస్తుంటే నా బాధ మీకు వ్రాసుకుంటే కొంతభారం తగ్గుతుందనిపించింది. బాబాయే ఒకరోజు కలలో కన్పించి, "ఏడుస్తూ కూర్చునేకంటే వ్రాయాలనుకున్నది వ్రాయరాదా!" అన్నారు. అటు తర్వాత ఆయన రెండుసార్లు నా చనిపోయిన కుమారుణ్ణి తెచ్చి చూపించి మరల వెంట తీసుకెళుతున్నారు. ఇది నాకెంతో ఆశ్చర్యంగా వున్నది. "

- జె. సీతాలక్ష్మి, మాచెర్ల.

"మొదట నాకు బాబామీద నమ్మకం లేదు. మా అమ్మమాత్రం 'శ్రీ సాయిలీలామృతం' చదువుతుండేది. మా అమ్మకు ఎక్కువగా రక్తస్రావం అవుతుంటే, అది తగ్గితే బాబాను నమ్ముతాను అనుకొని యీ గ్రంథం పారాయణ చేసాను. పారాయణ పూర్తయ్యేలోగా ఆమెకు తగ్గిపోయింది. నాకు విశ్వాసం కుదిరి, అప్పటినుంచి 'శ్రీ సాయిలీలామృతం' పారాయణ నా నిత్యకృత్యమైంది. ఒకరోజు సాయి కలలో మా తాతలాగా కన్పించి, 'నిన్నంతా ఆకలితో మాడిపోయాను తెలుసా, నైవేద్యం పెట్టలేదే!' అన్నారు. మెలకువ వచ్చాక గుర్తుకొచ్చింది- ఆరోజు సాయికి నైవేద్యం పెట్టడం మరచాను. మూడవరోజు ఆరతి పాడకుండానే నిద్రపోయాను. నాటి రాత్రి సాయి కలలో కన్పించి, 'అన్నీ మరచిపోతావేం? ఆరతిపాడ్డం మానేసావే?' అని మందలించారు. తర్వాత మార్చినెలలో మాస్టరుగారిని దర్శించినప్పుడు ఆహారంలో యిష్టమైన పదార్థం బాబాకు విడిచి, దాన్ని తినడం మాని పారాయణ చేస్తే కోరినదవుతుందని చెప్పారు. మా అమ్మకు 'షుగర్' బాధ తగ్గాలని నేనలా చేస్తే సాయి కలలో కన్పించి, ఉప్పు తినడం మానమన్నారు. మరల జూలైలో కన్పించి, ఆ నియమం మానివేసి 'శ్రీ సాయి లీలామృతం' 7 సార్లు పారాయణ చేయమన్నారు. సెప్టెంబరు 8న హైదరాబాద్ వెళుతున్నాను. రిజర్వేషన్ జాబితాలో నా వయస్సు 19కి బదులు 69 సం॥లని పడటం వలన టికెట్ కలెక్టరు 100 రూ॥లు కట్టమన్నాడు. నావద్ద 50 రూ॥లు మాత్రమే వున్నాయి. నేను కంగారు పడుతుంటే ఎవరో ఒకామె 55 రూ॥లు నా తరపున కట్టి నా చేతికి 10 రూ॥లు యిచ్చి 'ఇది అవసరానికి వుంచుకోమ్మా' అన్నది. ఆమె అడ్రస్ అడిగితే చెప్పకుండా, 'నీ పెళ్ళికి వస్తానులే?" అని రైలు దిగిపోయింది. నా అడ్రస్ అడిగితే చెప్పకుండానే ఆమె నా పెళ్ళికి రాగల్గాలంటే ఈమె బాబాయే అయివుండాలని తర్వాత తోచింది. సెప్టెంబరు 10న శిరిడీలో ఉదయం 4 గంటలకు మెలకువ వచ్చేసరికి విపరీతమైన జలుబు, దగ్గుచేసి లేవలేకపోయాను. గురువారంనాడు శిరిడీ క్షేత్రంలో "శ్రీసాయి లీలామృతం", "శ్రీ గురుచరిత్ర" పారాయణ చేయలేక పోతున్నందుకు ఏడుస్తూ పడుకున్నాను. నిద్రపట్టి మరల 6 గం॥కు లేచేసరికి నాకే బాధాలేదు. సంతోషంగా పారాయణ చేసుకున్నాను.

- జె ఆర్. కృష్ణవేణి, పాడేరు.

నాకు చిన్నప్పటినుండి దేవీ పూజలు చేయడమే అలవాటుగాని బాబా సంగతి తెలియదు. ఇటీవల (1987) మేము శిరిడీ వెళ్ళాము. నేను సాయిని 'బాల'గా సాక్షాత్కారం కావాలని కోరాను! నాటి సాయంకాలం భజనకు ముందు బాబా అలా దర్శనమిచ్చారు. అయినా నాకు, 'బాల - సాయి' ఒక్కరేనా? అని సందేహమొచ్చింది.

ఇంతలో ఎవరో ముసలాయన వచ్చి 'ద్వారకామాయి అంటే ఏమనుకున్నావ్? మాయి అంటే అమ్మ అని అర్థం. సాయి, గాయత్రి, బాల అందరూ ఒక్కటే! ఇది గూడ శక్తిపీఠమే!'' అన్నారు. తర్వాత మాకు లెండీలో అయోధ్యగారు కన్పించి ఒక వస్త్రమిచ్చి, 'ఇది మీకని మాయి యిచ్చింది' అని చెప్పి వెళ్ళిపోయారు. తర్వాత మాష్టర్‌గారిని కలసినప్పుడు ఆయన, 'ధ్యానం చేసేటప్పుడు ఆ వస్త్రం కప్పుకుంటే ఏకాగ్రత కుదురుతుంద'ని చెప్పారు. నాకు, 70 సం॥ల మా అమ్మకూ గూడ యిలాంటి ఫలితం కన్పిస్తున్నది. తర్వాత కొంతకాలానికి నేను కోరుకున్నట్లు నాకు బదిలీ అయిందిగాని, నాకు 'రిలీవర్' ఎవరూ దొరకలేదు. బాధగా సాయిని ప్రార్థిస్తే నాటి రాత్రి కలలో ఎవరోగాని, 'మూడుసార్లు 'గురుచరిత్ర'పారాయణ చేయి!' అని చెప్పారు. సరిగ్గా ఆ పారాయణ పూర్తయ్యేసరికి రిలీవర్ రావడం, నేను రిలీవ్ అవడమూ జరిగింది''. **- జె. విశ్వేశ్వరరావు, పాడేరు.**

''మా ఊళ్ళో ఒకాయనకు సంతానం కలుగక పోయేసరికి రెండవ వివాహం చేసుకోవాలనుకుంటుంటే ఆయన భార్య కలతచెంది, తన జీవితం అంతం చేసుకోవాలనుకుంటున్నది. అప్పుడు నేను పారాయణ చేసుకొనే 'శ్రీసాయి లీలామృతము' ప్రతి ఆమెకిచ్చాను. ఆమె శ్రద్ధగా పారాయణ చేస్తుంటే ఆమెకు ఇద్దరు మగపిల్లలు కలిగారు. వాళ్ళకు పెద్ద సాయిబాబు, చిన్న సాయిబాబు అని పేర్లు పెట్టుకొని సాయిని కొలుస్తున్నారు. అలాగే కృష్ణారెడ్డి దంపతులకు ఉద్యోగం లేక బాధపడుతుంటే యీ గ్రంథమే యిచ్చాను. అది పారాయణ చేసాక వారికి టీచర్ ఉద్యోగం వచ్చింది. '' **- మొవ్వా రంగయ్య (గన్నవరం).**

''నేను భగవద్గీత, శ్రీ రాఘవేంద్రస్వామి స్తోత్రాలు పారాయణ చేస్తుండేవాడిని గాని, మా అమ్మాయి చెప్పిన బాబా చరిత్ర చదవాలనిపించేదికాదు. ఆరు సం॥ల క్రిందట ఎలాగో 'శ్రీ సాయి లీలామృతం'ఒక్కసారి పూర్తి చేసాను. నాటిరాత్రి కలలో ఎవరో నాతో గదాధరుని అంటే శ్రీ రామకృష్ణ పరమహంస చరిత్ర చదవమని చెప్పారు. మరురోజు మా అమ్మాయి వాళ్ళింటికి వెళ్తే వాళ్ళప్పుడే శ్రీ పరమహంస చరిత్ర చదివామని, చాలా బాగుందని, నన్ను చదవమనీ చెప్పారు! అది బాబా లీలని గుర్తించాను. అప్పటినుండి మాకు ఎన్నెన్నో సాయిలీలలు అనుభవమవుతున్నాయి. '' **- ఆరణి హనుమంతరావు (విజయవాడ)**

'నేను 1979 లో ''శ్రీ సాయిబాబా జీవితచరిత్ర'' చదివినప్పటి నుండి నా బ్రతుకుకు అర్థమంటూ ఏర్పడి నామాట, బుద్ధి, ప్రవర్తనలు ఎంతగానో సంస్కరించబడ్డాయి. ఆ గ్రంథ పారాయణ వలన ఒక అనిర్వచనీయమైన అనుభూతి కల్గుతున్నది. అదే నాచేత శిరిడీ దర్శనం గూడా చేయించింది. '

- ఎమ్. విజయకుమార్ (ఏలూరు)

''మీరు పంపిన ''శ్రీ సాయి లీలామృతం'', ''శ్రీ గురుచరిత్ర'' పారాయణ చేయగానే ఎంతోకాలంగా నన్ను బాధిస్తున్న సమస్యలన్నీ తొలగిపోయాయి. మా చిన్నాన్న అబ్బాయిగారికి యింతకుముందే ఎన్నో ఆపరేషన్‌లు జరిగాయి. ఇటీవల ఒకరోజు వాడికి 40 వాంతులు, 40 సార్లు బేదులై, స్పృహలేని స్థితిలో వేలూరు ఆస్పత్రిలో చేర్పించారు. డాక్టర్లు ఆశలేదని చెప్పారు. నేను బాబాను ప్రార్థించమని అతని అక్కతో చెప్పాను. ఆ రాత్రి, ఆ పిల్లవాడికి విభూతి పెట్టమని నేను మా పిన్నమ్మతో చెబుతున్నట్లు కలవచ్చింది. ఆ వెంటనే అతడు పూర్తిగా కోలుకున్నాడు''. **- ఎమ్. మనోరమ (బండ్లపల్లి)**

నాకు 1983లో కడుపునొప్పి, పొత్తి కడుపులో ఏదో తిరుగుతున్నట్లుగా వుండి ఎంతో బాధపడేదాన్ని, డాక్టర్లు ఆపరేషన్ ఒక్కటే మార్గమని, కాని ఆపరేషన్ చేసినా నేను బ్రతకడం అనుమానాస్పదమేనని, ఆపరేషన్‌కు మద్రాసు వెళ్ళాలనీ చెప్పారు. ఒకరోజు మా పెద్దబ్బాయి బాబా గుడికి వెళ్ళినప్పుడు అచ్చుటివారు చదువుతున్న బాబా లీలలు

వినివచ్చి బాబానే ప్రార్థించుకోమన్నాడు. ఎందరికి మ్రొక్కినా లాభంలేనిది బాబావల్ల మాత్రం ఏమవుతుందిలే అనుకున్నాను. నాటిరాత్రి (డిశంబర్ 25, 1984) నాకు కలలో బాబా డాక్టరు వేషంలో కన్పించారు. ఆయన ప్రక్కనే పెద్ద బొట్టు పెట్టుకున్న ఒక లేడీ డాక్టరు పసుపుపచ్చని చీరకట్టుకొని వున్నారు. ఆమె నన్ను బల్లమీద పడుకోబెట్టి నా పొట్ట పరీక్షచేసి, 'నీకేమి యిష్టము' అని అడిగింది. నాకు పప్పు దినుసులు యిష్టమని చెప్పాను. 'అందువల్లనే నీకీ బాధ!' అన్నదామె. ఇంతలోనే ఆ డాక్టర్ టెన్నిస్ బంతికంటే పెద్ద ప్రమాణంలో వున్న గడ్డను తీసి చూపి, "ఇది తొలగించాను. నీకింక బాధవుండదు. రేపు కొద్దిగా నొప్పి వుంటుంది. ఎల్లుండి అన్నం తిను' అని చెప్పారు. నాకు మెలకువ వచ్చి చూస్తే టైము 5 గం॥లయింది. నా పొట్టమీద పొడుగాటి చార కన్పించింది. మరల మరుసటి రాత్రి ఆ డాక్టర్ కన్పించి, 'రేపు చారన్నం తిను' అన్నారు. ఆరోజు నుండి నాకా నొప్పిలేదు, వాంతీలేదు. "

- ముత్తరాజు వెంకట సౌభాగ్యలక్ష్మి (ఒంగోలు)

'శ్రీ సాయి లీలామృతము' , 'శ్రీ గురుచరిత్ర' పారాయణ చేస్తున్నప్పటినుండి జటిలమైన సమస్యలెన్నో పరిష్కారమై, మనస్సుకు ఎంతో హాయిగా వున్నది. ఈ మధ్య మా సంస్థలో ఒక ఉన్నతాధికారి చేసిన అనుచితమైన నిర్ణయం వలన నాకు రూ. 1200/- లు నష్టమొచ్చే ప్రమాదమేర్పడింది! ఆ నిర్ణయం అనుచితమని ఎంత వివరించినా ఆయన, తన నిర్ణయం మార్చుకొనే ప్రశ్నే లేదన్నారు. ఈ విషయమై నేను పారాయణ చేస్తుండగా ఆయన పదవీ విరమణ చేయబోతున్నారని తెలిసింది. నేను, ఈ "శ్రీ గురుచరిత్ర"లో మహిమవుంటే ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోవాలని దత్తస్వామికి చెప్పుకొని "శ్రీ గురుచరిత్ర" (ఇంగ్లీషు) ఒక ప్రతి ఆయనకు కానుకగా పోస్టులో పంపాను. ఆయన వెంటనే అది చదివారు కాబోలు, అదెంతో మహిమగల గ్రంథమని, ఎంతో మంచి పుస్తకం పంపానని, తన నిర్ణయం ఉపసంహరించుకుంటున్నాననీ ఆయన జాబు వ్రాసారు. ఈ గ్రంథం చేరినంతనే ఒక వ్యక్తిలో అంత మార్పు వచ్చిందంటే 108 సార్లు పారాయణ చేసినవారిలో ఎంతటి మార్పు వచ్చియుండాలి? అందుకే భరద్వాజ మాస్టర్‌గారు ప్రతివారితోను "శ్రీ గురుచరిత్ర" గూడ నిత్య పారాయణ చేయమని చెబుతుంటారు".

- బి. కేశవరావు, విశాఖపట్నం.

"చిన్నప్పుడు మా పుట్టింట్లో బాబాను పూజించుకొనేవాళ్ళం. పెళ్ళి అయ్యాక అందుకు అవకాశమే లేకుండా పోయింది. మానసికంగా గూడ నేను ఎంతో బాధపడ్డాను. ఒకరోజు పుస్తకం బైండ్ చేసి పెట్టమని ఎవరో 'శ్రీ సాయి లీలామృతము' తెచ్చి యిచ్చారు. అప్పుడు కొద్ది పేజీలు చదివే అవకాశమొచ్చింది. తర్వాత తెలిసిన వారిద్వారా ఆ పుస్తకం తెప్పించుకొని మూడుసార్లు పారాయణ చేసి విభూతి వేసిన తీర్థం అందరమూ తీసుకున్నాము. అంతటితో మా యింట్లోవాళ్ళు మారిపోయి బాబాను పూజించుకోవడానికి ఎంతో ప్రోత్సాహమిస్తున్నారు. ఆ పారాయణ ముగిసిన రోజున నేను మా వీధిలో వెళుతుంటే ఒక కుక్క నా కాలు పట్టుకుంది. అది ఎందరినో కరచింది గూడ. నేను 'బాబా!' అని అరిచాను. ఆ కుక్క నా కాలు వదిలి కొద్ది దూరంపోయి కూర్చొని నిర్లిప్తంగా నన్ను చూస్తూ వుంది. బాబాను తలవగానే పట్టుకున్న కుక్కగూడ విడవడమే ఆశ్చర్యం!"

- ఒక భక్తురాలు (నెల్లూరు)

"మీరు శ్రమించి మాలాంటి దీనులకు వెలుగు, దారి చూపిస్తున్నారు. ఈ సంసార కూపంలో మ్రగ్గిపోతున్న నాకు "శ్రీ సాయి లీలామృతము" అమోఘమైన దివ్యకాంతిని, వెలుగుబాటను చూపింది. "

- ఎమ్. కమలాకుమారి

"సాయి కృప వలన నా శ్రీమతి "శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర" 9 సార్లు, "శ్రీ గురుచరిత్ర" 9 సార్లు పారాయణ చేసి అక్కల్కోట స్వామి చరిత్ర చదువుతుండగా స్వప్నంలో దివ్యపురుషుడైన ఒక మహాత్ముడు దర్శనమిచ్చి రెండు మామిడిపండ్లు ప్రసాదించారు. ఆ మర్నాడే మా ఆశలు నిజంచేస్తూ మాకు బాబు జన్మించాడు. "

- శ్రీనివాసులు, సూళ్ళూరుపేట.

జనవరి 1981లో మకర సంక్రాంతికి అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్ళదలచి మాల ధరించాను. ఈ దీక్ష పూనడానికి ముందు " శ్రీ సాయిలీలామృతము", "శ్రీ గురుచరిత్ర" పారాయణ చేసాను. తర్వాత వ్యానులో బయల్దేరి ఒక తెల్లవారుఝామున కాలినడకన కొండకు బయల్దేరే చోటికి చేరాను. కొంతదూరం వెళ్ళాక కొండలు చూస్తుంటే ముందుకు సాగగలనా అని భయం మొదలైంది. అప్పటి నా వయస్సు 49 సం॥లు. మొత్తం 45 మైళ్ళు నడవవలసియున్నది. సాయంత్రం 6 గం॥లకు మేము వెళ్ళేదారి ఇరుకుగా అయింది. చాలా జాగ్రత్తగా వెళ్ళాలి. చీకటి పడింది. నాకు పూర్తిగా నీరసం వచ్చి, నా సాయిబాబా నాకు గుర్తుకు వచ్చారు. కాలు ఎత్తితే రెండవ కాలు మోపడం బాధగా వుంది. కొద్ది క్షణాలలో చేతిలో కర్రపట్టుకొని, కాళ్ళకు రబ్బరు చెప్పులు వున్న ఒక వృద్ధుడు నన్ను కలుసుకొని, నా ఎడమ చెయ్యి వారి చంకలో పెట్టుకొని, "భయంలేదు, నావెంట నడు!" అన్నారు. వారి చంకలో నా చేయి పెట్టుకోగానే నా నీరసమంతా తొలగిపోయింది. అరగంటలో లైట్ల వెలుతురున్న ఒక విశాలమైన ప్రదేశం చేరుకున్నాము. అప్రయత్నంగా నా చేయి వారి చంకలోనుండి జారిపోయింది. వారు కూడా వున్నారని తలచి కొన్ని అడుగులు వేసి వారిని కలుసుకొని వందనం తెలపాలని చూచానుగాని వారెక్కడా కన్పించలేదు. శ్రీ సాయినాథుడే ఆ రూపంలో వచ్చి నన్ను ఆ కష్టమైన బాట దాటించి అదృశ్యమయ్యారు. చివరకు స్వామి సన్నిధానంలో మెట్ల దగ్గరకు చేరగానే ఆ జనం వత్తిడికి నాకు శ్వాస ఆడక అవి నా ఆఖరి క్షణాలా అనిపించింది. ఆ తొక్కిడికి కొందరు క్రింద పడిపోయారు. కొందరి ఇరుముడులు పడిపోయాయి. అయినా నేనెలాగో మెట్లదగ్గరకు చేరి టెంకాయ కొట్టగలిగాను. తర్వాత కన్నుమూసి తెరిచేలోపల నేను పద్దెనిమిది మెట్ల పైనున్నాను. అక్కడికెలా రాగలిగానా అని నాకే ఆశ్చర్యమేసింది. స్వామిని దర్శించుకొని సుఖంగా ఇల్లు చేరాను."

- దయాళ్ శరణ్, కర్నూలు.

శ్రీ సాయి లీలామృతం మొదటి ముద్రణలో 'ప్రూఫ్'ల వలెనున్న కొద్దిపేజీలు మాత్రమే పిన్నుకుట్టినవి ఒక భక్తునిద్వారా దొరికాయి. వాటిని శ్రద్ధతో పఠించాక నాకు కొన్ని మంచి సంఘటనలు జరిగాయి. తర్వాత పూర్తి పుస్తకం దొరికింది. ఈ మధ్యనే (1981) మిత్రులొకరిచ్చారు. పద్ధతి ప్రకారం పారాయణ చేయకపోయినా అక్కడక్కడా ఘట్టాలు చదువుతున్నప్పుడంతా శరీరం వణకడం, ఆనందభాష్పాలు రాలడం జరుగుతున్నది. "

- కె. తిరువెంగళం, అత్తూరు.

"నేను చిన్నప్పటినుండి శ్రీ సాయిని సేవిస్తున్నా ఆయనపై నాకు సంపూర్ణ విశ్వాసం కలగలేదు. అంతేగాక, సాయిని హిందూదేవత అవతారంగా భావించడం నాకంతగా నచ్చేదిగాదు. 1986 మార్చిలో 'శ్రీ సాయి లీలామృతము' పారాయణ మొదలుపెట్టాను. కాని నా మనసులో కొన్ని అనుమానాలుండేవి. మన ఋషులు వ్రాసినవి - రామాయణం మొ॥నవన్నీ సంస్కృతంలో వ్రాసినవి, మంత్ర పూరితమైనవి. గురూపదేశానంతరం అలాంటివి పారాయణ చేస్తే ఫలితముంటుందిగాని, ఒక ముస్లిం ఫకీరు గురించిన చరిత్ర, మాష్టారులాంటి సామాన్య మానవుడు తెలుగులో వ్రాసిన రచనలు - చదివితే ఫలితముంటుందా? అనేదే నా అనుమానం.

పారాయణ మొదలుపెట్టిన నాలుగురోజులకు నాకు కలలో శివలింగంలో నుండి ఈశ్వరుడు, ఆయనలో నుండి నరసింహస్వామి దర్శనమిచ్చి, 'నీకు తెలుగులో వ్రాసిన మాష్టరుగారి రచనలు ఫలితమిస్తాయా?' అని అనుమానం పెట్టుకోవద్దు. తప్పక ఫలితముంటుంది. "శ్రీ సాయి లీలామృతము", "శ్రీ గురుచరిత్ర"లే గాక ఇంకా ఇతర రచనలుగూడ చదవాలి' అంటూ ఏవో కొన్ని పుస్తకాలు నా చేతిలో వుంచారు! ఆ తర్వాత మా పాపకుగూడ సాయి విగ్రహంలో నుండి బాబా వచ్చి శ్రీ నరసింహస్వామిగా మారిపోయినట్లు కల వచ్చింది.

శ్రీ సాయి లీలామృతం, శ్రీ గురుచరిత్ర పారాయణ గురించి సాయిబాబా స్వయంగా గాక, నేను ఏ హిందూ దేవతలనారాధిస్తుంటానో ఆ దేవుళ్ళే స్వయంగా వచ్చి చెప్పడం, ఆ దేవతలు - సాయిబాబా ఒక్కరేనని నిరూపించడం జరిగిన తర్వాత నా సందేహాలన్నీ తీరిపోయాయి. శ్రీ సాయి లీలామృత పారాయణ వల్ల నాకేగాక, ఇతరులకోసం నేను చేసిన పారాయణలు గూడ వెంటనే ఫలితం చూపించడం నా స్వానుభవం".

- త్రికూటం నటరాజబాబా, కర్నూలు.

★★★

★ బుధవారం పారాయణ సమాప్తము ★